4005

నవమ వార్షికోత్సవ సంపుటము

సంపాదకుడు: తెలికిచర్ల వెంకటరత్నం

నవ్యసాహిత్య పరిషత్తు : గుంటూరు

మూడు రూపాయలు

నవ్య సాహిత్య పరిషత్తు.

గౌరవాధ్యక్షులు :

సర్ కట్టమంచి రామలింగా రెడ్డి

ఆచార్య రాయప్రోలు సుబ్బా రావు

స్థాయి సంఘము :

అధ్యక్షుడు

దే[illegible] కృష్ణశాస్త్రి

ఉపాధ్యక్షులు

విస్సా అప్పారావు

కాటూరి వెంకటేశ్వరరావు

కార్యదర్శి

తెలికిచర్ల వెంకటరత్నం

సహాయ కార్యదర్శులు

మల్లవరపు విశ్వేశ్వరరావు

దేశిరాజు కృష్ణ శర్మ

సభ్యులు

సోమయాజుల వెంకటరామమూర్తి

మల్లాది విశ్వనాథశర్మ

వన్నెల వెంకటరంగనాథరావు

భావరాజు వెంకటకృష్ణారావు

దేవరకొండ బాలగంగాధర తిలక్

కలగర నాగభూషణంచౌదరి

ఊటుకూరి సత్యనారాయణరావు

సామవేదం జానకిరామశర్మ

చిరుమామిళ్ల శివరామకృష్ణ ప్రసాద్

చిట్టా ప్రగడ సీతారామాంజనేయులు

వట్టికొండ రంగయ్య

తుమ్మల సీతారామమూర్తి చౌదరి

మాచిరాజు దేవీప్రసాదరావు

దువ్వూరి రామిరెడ్డి

బుర్రా వెంకట సుబ్రహ్మణ్యం

శ్రీమతి కొమ్మూరి పద్మావతీదేవి

చిలుకూరి నారాయణరావు

కొ. వెం. ల. న. శర్మ

పిసుపాటి వెంకటరమణయ్య

కురుగంటి సీతారామయ్య

కార్యనిర్వాహకవర్గము

అధ్యక్షుడు

ఉపాధ్యక్షులు (ఇద్దరు)

కార్యదర్శి

సహాయకార్యదర్శులు (ఇద్దరు)

పిలకా గణపతిశాస్త్రి

అనిశెట్టి సుబ్బారావు

నవమ వార్షికోత్సవ సంపుటము

ప్రతిభ ౭వ సంపుటము

జులై ౧౯౪౨ - ఏప్రిల్ ౧౯౪౩

సంపాదకుడు: తెలికిచర్ల వెంకటరత్నం



నవ్య సాహిత్య పరిషత్తు
గుంటూరు

మనవి

ఈ సంపుటము మార్చి నెలలోనే ప్రకటించవలెనని ఎంత ప్రయత్నించినా సాధ్యమయినది కాదు. కాకితము దొరకడము అతికష్టమయింది. కొన్ని వ్యాసములు స్థలాభావముచే ప్రకటింపలేక పోయినాము. అవి ఇంకను రాకపోయినందుకు చాలా చింతిస్తున్నాము. ఇంత పెద్ద సంపుటము ఇంతగా ధనవ్యయము చేసి ప్రకటించవలెనని సంకల్పించుకోలేదు. అయినా ఏలూరులో జరిగిన ఉత్సవానికి అనుగుణముగా ఉదాత్తముగా ఉన్న ఈ సంపుటము పాఠకులకు సమర్పిస్తున్నందుకు సంతసిస్తున్నాము.

ఈ సంపుటము ముద్రించడానికి ఆహ్వాన సంఘమువారు నూటయాభై రూపాయలు సాయము చేస్తామన్నారు. వారి భూరివిరాళమే లేకపోతే ఈ ప్రయత్నమే లేకపోయేది. వారికి పరిషత్తువారి కృతజ్ఞతాభివందనాలు.

ఉత్సవసమయానికి శ్రీ శ్రీ శ్రీ జయపురాధీశ్వరులు సాహిత్య సామ్రాట్, కళాప్రపూర్ణ డాక్టరు విక్రమదేవవర్మ మహారాజావారు ఉత్సవము కర్చులకు నూరు రూపాయలు పంపినారు. ఆపైకము ఈ సంపుటము ముద్రించుటకు వినియోగించినాము. మహారాజావారు చేసిన ఈ గొప్పసాయమునకు [illegible] కృతజ్ఞతాభివందనాలు శ్రీ వారికి సమర్పిస్తున్నాము.

ఈ సంపుటము ప్రతిభ విశేషసంపుటముగా స్వీకరించవలెనని సభ్యులనూ చందాదారులనూ కోరుతున్నాము.

చర్ల వెంకటరత్నం

విషయానుక్రమణిక

ప్రస్తావన

నవ్యసాహిత్యపరిషత్తు నవమవార్షికోత్సవము [illegible] డిసెంబరు [illegible] వ తేదీ మొదలు [illegible] తేదీ వరకు ఏలూరులో మహావైభవంగా జరిగింది. ఆంధ్రదేశము నలుమూలల నుంచీ మారుమూలగాను, నక్కినక్కి ఉన్న పట్టణాలనుంచీ, పల్లెలనుంచీ, కవులూ, పండితులూ, గాయకులూ, చిత్రకారులూ, పత్రికాధిపతులూ, విమర్శకులూ, రసజ్ఞులూ చాలామంది ఆ సమావేశానికి వచ్చారు. [illegible] వృక్షాలతో, [illegible]లతో, పందిరిండ్లతో, అ[illegible]ట్లతో, ముక్కాలతో, మేళాలతో, కోకిలపాటలతో, తుమ్మెద ఝంకారాలతో తెలుగుతోట వసంతభాస్వరమై ఎలాగున్నదో ఆ సమావేశము చూస్తే కండ్లకు కట్టినట్లు కనబడేది. ఇదివరకు ఎప్పటికాలములోనూ ఎన్నడూ ఇంత గొప్పసమావేశము జరిగి లేదని అందరూ అన్నారు.

సమావేశము జరిగిన డానికి కాలువ ప్రక్కన విశాల ప్రదేశంలో పెద్ద పర్ణశాల వేశారు. ఆ పందిట్లో కొన్ని వేలమంది ఇరకటము లేకుండా, కూర్చోవచ్చు. ఆ పందిట్లోనే ఒకవైపున ప్రదర్శనాలకు [illegible] సకలముగా పనికివచ్చేటట్లు సభావేదిక ఏర్పరిచారు. వేదికమీదగాని, మంటపములోగాని ధూమ్రపానం చేయలేదు. ఏభేదమూ లేకుండా వచ్చినవారు అందరూ [illegible] నే కూర్చొనేవారు. మెత్తలువేసి, తివాసీలూ, కంబళ్లూ గుప్పట్లూ పరిచి, ఆసనాలన్నీ [illegible] ముఖ్యమైన [illegible] చక్కగా తీర్చారు. అధ్యక్షుడికీ [illegible] [illegible] [illegible]. [illegible] చూస్తే ఆ వేదిక ఒక [illegible] కనిపించింది.

సభామంటపానికి ఆనుకొనే [illegible]. [illegible] ప్రదర్శనమూ, [illegible] ప్రదర్శనమూ ఏర్పాటు. ఆ ప్రదర్శనానికి [illegible] గ్రంథాలు [illegible]. [illegible] ప్రదర్శనశాల ప్రేక్షకులతో నిండిపోయేది. [illegible] గ్రంథాలను [illegible] ప్రేక్షకులు [illegible] చేసుకొనేవారు. ఆ [illegible] ప్రదర్శనాలు [illegible], కొన్నాళ్ళకూ కూడా ఎంతో ప్రచారమూ ప్రయోజనమూ కలుగుతుందని [illegible].

ఆంధ్రదేశములో విజ్ఞానకేంద్రమనే పేరు రాజమహేంద్రవరానికి ఉండేది. ఏలూరు ఆంధ్రదేశానికి నడిబొడ్డు అని విస్సా అప్పారావు పంతులుగారు అన్నారు. [illegible] [illegible], వైజ్ఞానికంగా కూడా ఏలూరు యావదాంధ్రానికి కేంద్రమని ఆ సమావేశాన్ని, ఆ ప్రేక్షకులనూ, ఆ ఉత్సాహాన్ని, పక్కపక్క సంభాషణలనూ, [illegible] సహకారాన్ని బట్టి నిజముగా తోచింది. సమావేశాలకు నిత్యమూ వేలకొలది జనము వచ్చేవారు. ఉపన్యసించినా, పద్యాలు చదివినా, పాటలు పాడినా నిశ్శబ్దంగా వినేవారు. ఎంత పొద్దెక్కినా, పొద్దు పోయినా వినుగుకోనేవారు కారు. కదిలేవారు కారు. స్త్రీలు కూడా వందలాదిగా సభలకు వచ్చేవారు. కాని గోలా గల్లంతూ ఏమాత్రమూ ఉండేదికాదు. సభ్యతా, ఓరిమీ, ఉత్సాహమూ, ఉత్తేజనమూ నిండారిన ఆసభ్యులను చూస్తే "[illegible]వాసు ఏలూరూ!" అని అనిపించింది. సందూరి సుబ్బారావు, గొడ్డు బాపిరాజు జానకిరామశాస్త్రి మొదలైన పలువురు

కవుల నివాసస్థలమనేతప్ప ఏలూరికి ఇదివరకు ఏమంత గొప్ప విశేషము లేదు. సారస్వత విషయములో ఇంత మహోత్సాహము ఏలూరికి కలిగి అయిదారేండ్లే అయిఉంటుంది. ఆంధ్ర దేశములో ఎన్నో పట్టణాలను, ఎన్నో సమావేశాలను చూశాము. ఇంత హృదయాకర్షకమైన వాతావరణము ఎక్కడా కనబడలేదంటే అది అతిశయోక్తి కాదు. ఏలూరికి ఇంత విశిష్టత ఎలా కలిగింది? రాజమహేంద్రవరాన్నికూడా కాదనేటట్లు ఉందే! ఈ విశిష్టతకు చాలావరకు సాహిత్యమండలి స్థాపించడమూ క్లబ్బు ఏర్పరచడమూ కారణాలు కావచ్చు. అంతకన్నా కొందరువ్యక్తుల పలుకుబడి కారణము కావచ్చు. సమావేశానికి వచ్చినవారందరికీ ఆ వ్యక్తులు ఎవరో బోధపడే ఉంటుంది. వారిలో ముఖ్యులు నాగభూషణం చౌదరిగారు, సోమంచి లింగయ్యగారు, భోగరాజు బుచ్చిరామయ్యగారు. నాలుగు రోజులూ, సాగిన ఆ సారస్వతోత్సవానికి ఈ మూర్తిత్రయమే కర్తలూ, కారయితలూ, ప్రేరకులూ, అనుమోదకులూ కూడా. వచ్చిన అతిథులకు సోమంచివారి ఆవరణలో భోజనాలూ, వసతులూ ఏర్పరిచారు. కొందరు దివ్యజ్ఞాన భవనములో బసచేశారు. సభానంతరము ఆ బసల్లోజరిగే కావ్యగోష్ఠి, వాదోపవాదాలూ, అభినందనాలూ, అభిశంసనాలూ, విమర్శలూ చిత్రవిచిత్రాలుగా, హృదయంగమాలుగా ఉండేవి. అవన్నీ వ్రాసిపెడితే చక్కని సారస్వతము సమకూరేది.

ఒకవంక కరువూ, ఒకవంక యుద్ధభయమూ దేశాన్ని పట్టి పల్లారుస్తున్న రోజుల్లో ఎల్లాచేశారోగాని ఆహ్వానసంఘమువారు అన్నిఏర్పాట్లూ అద్భుతంగా అసమానంగా ఏర్పరిచారు. అతిథులు దాదాపు వందమందికి పైగా ఉండేవారు. ఇంతమందికీ స్నానాలకు వేణ్ణీళ్లు, చెప్పినవేళకు ప్రొద్దుటా మధ్యాహ్నమూ తీయతీయగా కారంకారంగా ఫలహారాలు పానీయాలు, రెండుపూటలా వేళకు మృష్టాన్నభోజనాలూ తాంబూలాలు—ఒకటేమిటి అన్నిసదుపాయాలూ అక్కడలాగు గొప్పయింటి వియ్యాలవారికికూడా అమరవంటే ఆశ్చర్యంకాదు నిజంగా.

ఉపన్యాసాలూ, కావ్య పఠనాలూ, కవి సన్మానాలూ, కృతిసమర్పణోత్సవాలూ మాత్రమే కాదు; ఆ నాలుగు రోజులూ ప్రతి సాయంకాలమూ, గానసభలూ, నాటక ప్రదర్శనాలూ, భరతనాట్యాలూ, అపూర్వంగా జరిగినవి. రాఘవాచారీ, పద్మావతీదేవి, కస్తూరి, పూర్ణిమ మున్నగు ప్రసిద్ధనటులు నాటకాలు ప్రదర్శించారు. బాల మురళీ కృష్ణుడు సంగీతము పాడాడు. ఉషారాణి, తార భరతనాట్యము ప్రదర్శించారు. స్థానిక నటులు తమ కౌశలము ప్రదర్శించి మెప్పుపొందారు. ఆ నాలుగు రోజులూ ఆ రంగముమీద లలితకళా మహోత్సవము సాగిందంటే అసత్యము కాదు. అన్ని ప్రదర్శనాలకూ వేలకొలది ప్రేక్షకులు వచ్చేవారు. చూచి ఆనందించేవారు. "సారస్వతోత్సవమంటే ఇదిరా బాబూ" అని అభినందించేవారు. ఇవన్నీ చూచి "హేలానగరీ రసజ్ఞుల కళారతి నామతి బాయదెన్నడున్—" అని కవి అన్నాడు. నిజానికి కళోపాసకులందరూ ఏప్రాంతాలవారైనా సరే ఏలూరు పౌరుల కళాభిమానాన్ని, మహోత్సాహాన్ని, ఆతిథ్యాన్ని, ఎన్నటికీ మరిచిపోరని చెప్పడానికి సందేహమేమిటి? నవమ వార్షికోత్సవ సంపుటముగా ప్రకటిస్తున్న ఈ గ్రంథము ఆంధ్ర సారస్వతములో ఏలూరు పేరు అక్షరాలా చిరస్థాయిగా ఉండేటట్లు చేసితీరుతుంది. అదుగో దురుగంటి సీతారామయ్యగారు వేదోక్తాశీర్వచనము ఆరంభము చేస్తున్నారు. ఆహ్వాన సంఘాధ్యక్షులు స్వాగతోపన్యాసము చేయడానికి సంసిద్ధులై ఉన్నారు. ఇక ఉత్సవకార్యక్రమం చిత్తగించండి.

స్వాగతోపన్యాసము

విస్సా అప్పారావు

మహాజనులారా!

ప్రయాణసౌఖ్యము లంతగా లేనికాలమందు ప్రయాసలకోర్చి, దూరభారమని ఎంచక, నవ్యసాహిత్య పరిషత్తు నవమవార్షికోత్సవమును జయప్రదముగ సాగించుటకై ఇక్కడకు దయచేసి, ఆంధ్రభాషాభిమానమును జూపిన మీకందరికీ ఏలూరి పురవాసుల తరఫున ఆహ్వానసంఘమువారి పక్షమున హృదయపూర్వకముగు స్వాగత మొసగుచున్నాను.

ఈ ఏలూరు నగరప్రాంతము ఆంధ్రదేశమునకు నడుబొడ్డు, అతిప్రాచీనమునైన వేగినాడునకు జెందినది. వేగినాడునకు వేంగీపుర మతి ప్రాచీనమైన రాజధా[redacted] . శ. 340 ప్రాంతమందు సముద్రగుప్తుడు దక్షిణాపథ విజయయాత్ర చేసిన దేశముల పేర్లు, అలహాబాదులో అశోకుని జయస్తంభముమీద చెక్కబడియున్నవి. అందు వేంగీపురము పేర్కొనబడినది. బౌద్ధులు, సాలంకాయనులు, విష్ణుకుండినులు, తూర్పుచాళుక్యులు, రెడ్డిరాజులు, ఈప్రశస్త భూఖండము నేలి నాగరకతాసంపన్నము గావించినారు. తరువాత మహమ్మదీయులు, బ్రిటిషువారు దీనిఅందమును పెంపొందించినారు. ఏలూరునకు 8 మైళ్ళ్యుత్తరమున పెదవేగి అను పల్లెగలదు. అదే వేంగీపురముయొక్క నడిఖండము. దాని ఉత్తరముగా చినవేగికలదు. వీటికి దక్షిణముగా 5 మైళ్ళలో దెందులూరు గ్రామమున్నది. దానికి సివార్లుగా గంగనగూడెము, సానిగూడెము కలవు. ఈ ప్రదేశమంతటను వ్యాపించి వేంగీపురమను మహాపట్టణము మహావైభవముతో విరాజిల్లుచుండెడిది. ఈ యేలూరుగ్రామముకూడ అంత ప్రాచీనమైనదే. క్రీ. శ. 330 కాలమునాటి మొదటి సాలంకాయన రాజగు విజయదేవవర్మ యొక్క, ప్రాకృతములో వ్రాయబడిన, ***ఏలూరు దానశాసనము** వలన ఈవిషయము తెలుచున్నది. ఈ సాలంకాయనుల కాలములోనే ఈ వేంగీపురము గొప్పదశ అనుభవించినది. ఆకాలమందే సుప్రసిద్ధ బౌద్ధసన్యాసియగు దిఙ్నాగాచార్యుడు వేంగీపురమందుండెను. క్రీస్తుశకము ప్రారంభమునాటికి బాగుగా వ్యాపించియున్న బౌద్ధమతము, ఈ సాలంకాయనుల కాలములోనే, వ్యాప్తితగ్గి, వేదసమ్మతమగు మతము తిరిగి వ్యాప్తిచెంద నారంభమైనది. వేంగిరాజులు సూర్యదేవు నారాధించినవారు. చిత్రరథస్వామి పదానుధ్యాయులు; చిత్రరథస్వామి చిహ్నాగల దేవాలయము నేటికిని పెదవేగిలో గలదు. ఈ ఏలూరు కనతిదూరములోనే దండి మహాకవిచేత వర్ణింపబడిన ప్రాచీనమైన కొల్లేరుసీమ కలదు. మహమ్మదీయుల నాగరకతా చిహ్నముగా రత్నకంబళ్ల పరిశ్రమ నేటికిని ఏలూరికి వన్నె దెచ్చుచున్నది. ఈ యూరిమధ్య ప్రాచీనమైన కోటఒకటి కలదు. ఇట్లు చరిత్రాత్మకమగు వేగినాట ఆంధ్రభాషాసేవకై ఈ నవ్యసాహిత్య పరిషత్సమావేశము జరుగుట ఎంతో ముదావహము.

*** శ్రీ భావరాజు వెంకట కృష్ణరావుగారు వ్రాసిన "Early Dynasties of Andhra Desa." క్రీ. శ. 200_600 లలో రాజ్యముచేసిన ఆంధ్రరాజవంశముల చరిత్రలో చూడుడు.**

సాహిత్యమనగా అన్నియును కలసియుండునది. అన్ని విద్యలు, అన్ని కళలు సాహిత్యములోనివే. వీటన్నిటి యందును ప్రాథమ్యము సంపాదించినప్పుడు గాని ఉత్కృష్టమగు సాహిత్యము పుట్టదు. అన్ని కళలూ, విద్యలూ కలసి దానిపై మించినవంటిది సాహిత్యము. ఇక ఈ పరిషత్తువారికి నవ్యసాహిత్యములోని నవ్యతనుగూర్చి కొంత మనవి చేసెదను. పురాణయుగము ప్రబంధయుగముగా మారి, చాలాకాలమునకు, అనగా వీరేశలింగము పంతులుగారి కాలమునాటికి, నిత్యజీవనము నుపకరించునట్టి గ్రంథరచన ప్రారంభమైనది. ఇది [illegible]. పాశ్చాత్య నాగరకతతోను, సారస్వతముతోను గలిగిన పరిచయమే దీనికి కారణము. తరువాత [illegible] కాలమునకు, నేటికి రమారమి 30 సంవత్సరముల క్రిందట, కావ్యరచనా పద్ధతిలో ఒక నూతనత్వము ప్రారంభమైనది. వర్డ్స్వర్తు, షెల్లీ, కీట్సు మొదలైన ఆంగ్లకవుల రచనలలో గోచరించు కావ్యశైలి ఆంధ్రయువకుల నాకర్షించి భావకవిత్వమును కలిగించినది. ప్రకృతిసౌందర్య పరిశీలనము, [illegible] చిత్తవృత్తులు [illegible] కవితలోని క్రొత్తవిషయములు. ప్రకృతినే కావ్యవస్తువుగా చేసి [illegible] తో [illegible] చేయుటయు ఈ మార్గములోని విశిష్టత. [illegible] నవ్యసాహిత్యము [illegible].

[illegible] మెరిసినది. [illegible] "లలిత" స్వరూపమును దాల్చినది. 'ముత్యాలసరములు' [illegible] మొదలగు అమూల్యములును, [illegible] దాల్చినది. 'తెలుగుతోటలో' విహరించినది. ఈమె దివ్య [illegible] నవ్యకవుల [illegible] మైనది. ఈ కవిత్వమునందు [illegible] నూతనత్వమే సాధనము [illegible]. [illegible] మితముగా కలియు మన పూర్వసంప్రదాయములతో ఏకీభావమును [illegible], ఈ నవ్య సాహిత్యోదయ మైనది.

[illegible] క్రమక్రమముగ పూర్వసంప్రదాయములను [illegible] ప్రారంభమైనది. ఇది అంతా పాశ్చాత్య కవిత్వ [illegible]. దీనితోపాటు [illegible] కవిశేఖరుల అనుకరణము కొంత. ఆ మహాకవియొక్క [illegible] నవ్యకవులు [illegible]. [illegible] అగు [illegible] గలిగి, మహాకవిచే సాధనలో [illegible] నూతన కవిత్వపద్ధతి అతిగాఢమైనది. దాని ననుకరించుటలో ప్రమాదములుండుట సహజము.

ఈ నవ్య సాహిత్య [illegible] ప్రమాదకరమగు విషయ మొకటి కలదు. ఇదవై సంవత్సరములలోగా యూరోపుదేశములో తలయెత్తిన **sur-realisam, dadaısam** మొదలైన, దారి తెన్నులేని [illegible] అస్పష్టమును, అశిక్షితమును అనిసవ్యమును? అగు 'అహంభావ కవిత్వము' [illegible] ప్రకృతినే చూచి [illegible] ఇంద్రియానుభవమును దాటి అతీంద్రియమగు రసానుభవమునకై ప్రయత్నించవలెనట. అతీంద్రియ రసానుభూతియే మన పూర్వకవి సంప్రదాయమైన, శాశ్వతమైన మహాభాగ్యము. దానిని విడిచినను ఈ మహాభాగ్యమును విడువరాదు. [illegible] 'పురుషుని' [illegible] 'ప్రకృతి' [illegible]. ఆధ్యాత్మికమునకు [illegible] సంప్రదాయము [illegible]. ఈ సంప్రదాయమే మన సర్వ సౌభాగ్యమునకును పట్టుకొమ్మ. ఈ

యభిప్రాయమునే మనసున నిడికొని ఈ పరిషత్తుయొక్క భావి కార్యక్రమమును గురించి కొన్ని మాటలు మనవి చేయుచున్నాను.

సత్యము, ధర్మము, దయ, సహనము వీటినతిక్రమించి ఏ నాగరకతా నిలువనేరదు. వీటి నాశ్రయించి యున్నంతవరకు ఏ నాగరకతయు నశించదు సరిగదా, జీవితమును విశాలపరచి, సిరి, సంపత్తు, ఆనందము, శాంతి మొదలైన వాటితో తులతూగుచుండును. నాలుగైదు వేల సంవత్సరములనుండి భారతదేశముయొక్క నాగరకత ఇట్టి పరిణామమునే పొందుచూ వచ్చుచుండుట మనము గర్వపడవలసిన విషయము. ఎన్ని విప్లవకారణములు వచ్చినను సమర్థించుకొని, నానా జాతులవారి నాగరకతలలోని నిగ్గును గ్రహించుచు కొనుచు పూర్వముకంటె బలవత్తరమైన పునాదులను నాటుకొనుచున్నది. దీనికి పైనుదాహరించిన గుణములకంటె ఋషులకాలమునుండి పరంపరగా వచ్చుచున్న ఆత్మశక్తి, ఆధ్యాత్మికబలము ముఖ్యకారణములు. ఈ సత్యము పుణ్యభూమి యగు భారతదేశముయొక్క ప్రత్యేకభాగ్యము. ఇతరదేశములంతో కాదనరాదు. కాని ఒక్క విషయము చెప్పక తప్పదు. పాశ్చాత్యులు, ప్రకృతిశాస్త్ర పరిశోధనా దక్షులు; ప్రత్యక్ష ప్రయోగానుభవ మూలకముగా ఇంద్రియములచేత గ్రహింపగలిగినంతవరకు ప్రకృతియొక్క రహస్యములను సిద్ధాంతముల నేర్పరుచుచున్నారు. ఆ సిద్ధాంతముల కెట్టి సందేహము లేదు. అవి సుస్థిరములని, మొన్న మొన్నటి వరకును నమ్మియున్నారు. కాని పదార్థ విజ్ఞానశాస్త్రమున అతి నవీనముగా జరుగుచున్న వివిధ పరిశోధనలవలన ఆ నమ్మకము తారుమారగుచున్నది. సత్యాన్వేషణమునకు కావలసిన జ్ఞానము కేవల మాగిశాలికమే కాదనియు, అతీంద్రియ సంబంధమనియును తేలుచున్నది. అందుచేత భారతవర్షమే అన్ని దేశములకు మార్గదర్శి కాగలదనియు, ఈ పుణ్యభూమియం దాధ్యాత్మిక శక్తి నూతనముగా ఆవిర్భవించి ప్రపంచమంతను నేటి విచ్ఛిన్నదశనుండి కళ్యాణప్రదమగు దశకు మార్చగలదనియును, నా దృఢవిశ్వాసము. మన జీవితములోనే యీదివ్య పరిణామమును చూడగలమని నా యాశ.

అంతటి మహోత్కృష్టమైన భారతజాతి లక్షణము లాదర్శములుగా నుంచుకోవలసిన యేర్పడుచున్నది. ఈ పరిషత్తువారి యాశయములుకూడ యిట్టి మార్గమునే యవలంబించవలసినదని నా విజ్ఞప్తి. వీటినే, శాశ్వత మార్గమున జనసామాన్యమునకు కవు లందజేయవలసినది. కవులు సామాన్యులు కారు. ప్రతిభాశాలులు, పూర్వపుణ్య సంస్కారముతో పుట్టిన ఉత్తమ జన్ములు, విద్యావివేక సంపన్నులు, కర్మసాక్షికి కూడ కానరానివాటిని భావనా దృష్టిలో చూడగలవారు, వ్యక్తిత్వమును మరచి తన్మయత్వమును పొందగలవారు, నిరంకుశులు, సత్యాన్వేషులు సత్యప్రదర్శకులున్నూ. ఇట్టివారు గాక మరి యెవరు అట్టి కార్యమును సాధింప సమర్థులు? ఈ మహాకార్యమును నిర్వర్తించుటకై ఈ నవ్యసాహిత్య పరిషత్తువారు సర్వ ప్రయత్నములను జేయుదురుగాక !

ఐతే, యీ కార్యసాధనము సామాన్యమా? ఆంధ్రు లందరును దీనికి తోడ్పడవద్దా? ఆ తోడ్పాటునకు కావలసినంత ప్రావీణ్యబుద్ధి, ఆదరణ ఈ పరిషత్తుయం దాంధ్రలోకమున కున్నదా? అంతగా లేదనియే చెప్పవలెనేమో. సారస్వతమందు గాఢాభిమాన ముండవలసిన విద్యాధికులుకూడా ఈ పరిషత్తుయం దుదాసీనులైయున్నా రనుటలో అతిశయోక్తి లేదు. ఈ నవ్యకవిత్వ మేదో విరుద్ధమైన జాతికి

చెందినదని, అర్థములేనిదని, భావ మగోచరమని, పూర్వ మర్యాదలను, కట్టుబాట్లను చిందర వందర చేయుచున్నదని, మూక ఉమ్మడిగా యభిప్రాయము వ్యాపించియున్నది. ఇది కడు శోచనీయము, పరిశోధనీయమును. ఎట్టి సారస్వతమందున్ను కొన్ని వింతమార్గము లుండవచ్చును. వింత యొక గుణము, వేడియొక రుచి యనునది లోకానుభవసిద్ధమేకదా. అట్టివి ఒక్కొక యగడు, ఒక్కొక గాలిపాటునకు పుట్టునట్టివి. సారస్వతములోని సారమును తెలిసికొనుపట్ల లెక్కింప తగినవికావు. అందుచేత విద్యాధికులు, కళాభిమానులు ఈ నూతన సారస్వతమును సావధానముగా, నిర్వికారముగా విమర్శింతురుగాక. ప్రామాణికులన్న వారి రచనలను పూర్తిగా సానుభూతితో పరిశీలింతురుగాక. అప్పుడుగాని వారి యభిప్రాయములకు రావలసినంతమార్పు రాదు, ఉండవలసినంత ప్రామాణ్యమూ ఉండదు. ఈ మధ్యనే శ్రీకురుగంటి సీతారామయ్యగారు 'నవ్యాంధ్ర సాహిత్య వీధు'లను నవ్యసాహిత్య చరిత్రమును వ్రాసి యాంధ్రభాషకు శాశ్వతమగు ఉపకారమొనర్చినారు. విమర్శనాపద్ధతి యెట్లుండవలసినదీ ఆ గ్రంథమూలమున మనము గ్రహింపగలము. ఆరీతిని సకారణముగా వెలువడిన విమర్శనలిట్టి పరిషత్సభాముఖమున సహృదయులు వెల్లడిచేయుటయు కవులు తగు సమాధానమిచ్చుటయు యుక్తము. నవ్య సారస్వతాభివృద్ధికి అభ్యుదయహేతువు. గుణగ్రహణ పారీణులగు ఈ కవిశ్రేష్ఠు లవసరమైన మార్పులను చేయగలరు. వారు సృష్టించు సాహిత్యకళ లోకసంగ్రహముకొరకేగదా? మహాజనుల యాదరణ కళాపోషణమున కత్యావశ్యకముగదా. బహుజనాభిప్రాయము పాటించి తీరవలసినదేకదా, కాబట్టి అట్టి సంప్రతింపుల కనువగు అవకాశముల నిచ్చుటకు, సన్నివేశముల కల్పించుటకొరకే గదా వార్షికోత్సవముల జరుపుట. మూన్నాళ్ల ముచ్చటలకొరకు గాదే. మరియును, కావ్యములను కవులవలన ప్రత్యక్షముగా వినిననాడుగాని అందలివిశేషము, అనగా కావ్యవస్తువుయొక్క నిజస్వరూపము గోచరించదు. కనుక యీ సమావేశములు కళాపోషణకూ, విజ్ఞాన పరివ్యాప్తికీ ముఖ్యసాధనములు.

ఇవి తొమ్మిది సంవత్సరములనుండి నిర్విఘ్నముగా జరుగుచున్నవి. వాటియెడల జనాదరణము క్రమముగా హెచ్చుచున్నది, భావికాలమున కార్యసాధన చేయవలసిన యుపకులను ఈ సమావేశములు తీవ్రముగా ఆకర్షించుచున్నవి. ఉత్సాహము సర్వతోముఖమగుచున్నది. కాని దేశాభ్యుదయమునకై పాటుపడు సంస్థల కన్నింటికిని తగినఫలమును పొందుటకు ప్రస్తుతమున చాలా అవరోధములున్నవి. "శ్రేయాంసి బహు విఘ్నాని" యనిగదా యార్యోక్తి. అయినను అతి శీఘ్రకాలములోనే దైవయోగమున అట్టియడ్డంకులు తొలగు సూచనలు కనిపించుచున్నవి. దేవగురువగు బృహస్పతి తాత్కాలికముగ వక్రగతి పట్టియున్నను అతి శీఘ్రముగానే ఋజుగతినిపొంది ఉచ్చోన్ముఖుడగుచున్నాడు. అది గొప్పసమయము. ప్రపంచమునకు శుభపరిణామకాలము. మూడు నాలుగు సంవత్సరములనుండి మానవకోటి దారుణసంగ్రామము వాతబడి ఎన్నరాని, పడరానిపాట్లకు వశమై కృశించి, నశించి, క్షోభించుచున్నది. ప్రళయకాలాగ్ని కుండములోకూలి, పగిలి, బ్రద్దలై మండిపోవుచున్నది. ప్రజాస్వాతంత్ర్య ధర్మసూత్ర నిర్వహణమునకై బద్ధకంకణులగు మిత్రమండలివారికిని, విప్లవకారులగు అక్షరాజ్య నియంతలకును, జరుగుచున్న ఘోరరణమందు ఈఘట్టమత్యుచ్చ గలది. విప్లవకారియగు రాక్షసాంశకు పతనహేతువు. శాంతిస్థాపకులగు మిత్రమండలికి విజయహేతువు. దేవగురువు పరమోచ్చబొందుకాలము ప్రపంచమునకు గొప్ప శుభోదయకాలమని చెప్పుటలో ఆశ్చర్య

మేమున్నది. ప్రపంచముతోపాటు భారతదేశముకూడా అభ్యుదయమును పొందగలదు. ఇప్పుడు అణగి, మడగియున్న యాంధ్రోద్యమము అప్పుడు నూతనశోభతో మొలకలెత్తి వికసింపగలదు. అందువలన ఈ నవ్యసాహిత్య పరిషత్తువారికి మహోత్సాహకరమగు దేశసేవచేయు అవసరము మెండుగ నుండగలదు. యుద్ధానంతరమున జరగబోవు దేశపునర్నిర్మాణ కార్యక్రమమునకు సహాయకారియగు విషయములు సారస్వతమార్గమున ఎట్లేర్పరచి, సిద్ధపరచి యుంచవలయునో, యేయేరీతుల జనుల నుద్బోధనచేయవలెనో పర్యాలోచనచేసి కార్యదీక్షబూని ఈ పరిషత్తువారు ఈ క్షణమునుండే బద్ధకంకణులగుదురు గాక! వారిదీక్ష నిశ్చయముగా కొనసాగగలదు. శ్రీకృష్ణ సారథ్యమున ఈ పరిషత్సభవారు విజయకలితులగుదురనుట సమంజసమేగదా.

ఇంక నొక్కమాట. ఆంధ్రసారస్వతమున కొన్ని నూతనమార్గముల నవలంబించి దాని నభివృద్ధిపరచవలసి యున్నది. అందులకై నాకుతోచిన సూచనల కొన్నిటిని మహాసభవారి యెదుట విన్నవించుచున్నాను.

1. ప్రకృతిశాస్త్రము మొదలగు శాస్త్రవిషయములు ఆంధ్రభాషలో విరివిగా వ్రాయవలెను. ఇందు మూడు పద్ధతుల నవలంబింపవలెను.

౧. ప్రమాణమగు శాస్త్రగ్రంథములను వ్రాయుట—ముఖ్యముగా **Intermediate B. Sc.** తరగతుల వారు పఠించుటకు వీలుగానుండునవి మొదట ప్రారంభించవలెను. ఈపుస్తకము లిప్పు డేమియవసరమనుట సరియైనమాటకాదు. అవసరము తప్పక కలిగితీరగలదు. అప్పటి కివి యుపయోగపడగలవు. కొంత త్వర పడవలెను.

౨. లండనులో **Scientific Book club** అని యొక సంస్థకలదు. దానికి సభ్యులుగా చేరినవారికి నెల కొక్క విజ్ఞానమయమగు గ్రంథము చవకగా పంపబడుచుండును. కొంతవరకు విద్యనభ్యసించిన ప్రతివారికి ఈ గ్రంథములు చాలా ఉపయోగకరములుగా ఉండును. ఒక్కొక్క పుస్తకమున ఒక్కొక్క శాస్త్ర విషయము విశాలమగు దృష్టితో పరిశీలింపబడి సుబోధకముగా వ్రాయబడియున్నది. ఇట్టి గ్రంథమాల మన కందరకూ ఎంతో యుపయోగము.

3. పై రెండువిషయములును విద్యార్థులకు, విద్య కొంత యభ్యసించిన వివేకులకు మాత్రమే ఉపయోగ పడును. అవి పైమెట్టులోనివి. అంతకంటె క్రిందమెట్టులో కొన్ని శాస్త్రసంబంధమగు మూలవిషయ ములు సర్వజనసామాన్యమగునట్లు వెదజల్లుట చాలా అవసరము. ఎంతమాత్రమును ఆలస్యముచేయ వీలు లేదు. ఇప్పుడు, మునిమాణిక్యంవారి, చలంవారి, శ్రీపాదవారి పుస్తకము లెట్లు అమ్ముడైపోవుచున్నవో అట్లే ఈ సామాన్య శాస్త్రవిషయములు, సుబోధకముగా చిన్న పుస్తకములుగా వ్రాసినచో అమ్ముడు కాగలవని, దానివలన గొప్ప సంఘసేవ జరుగునని నమ్ముచున్నాను. ముఖ్యముగా ఆరోగ్యము, పారిశుధ్య మునకు సంబంధించిన విషయములగురించి మొట్టమొదట వ్రాయవలెను. అనుభవముగల, సహృదయులగు డాక్టర్లచేత వాటిని వ్రాయించవలెను. మిరియాలు, ధనియాలు, జీలకఱ్ఱ, శొంఠి, అల్లము, వాము, పసుపు, దుంపరాష్ట్రము, కరక్కాయి, తేనె, తమలపాకు, తులశాకు, గుంటగలగరాకు, మొదలగు సర్వసామాన్య వస్తువుల నుపయోగించి, చిన్నచిన్న రుగ్మతలకు ఇంట వైద్యముచేయుట పూర్వము సంప్రదాయముగా

వచ్చుచుండేది. నాను బాగా అనుభవించుకలదు. ప్రతి చిన్నజబ్బునకు డాక్టరుదగ్గరకు పరుగెత్తుటవలన కాలము, ధనము వ్యయమగుచున్నది. ఇది సాధారణులకు దుస్సాధ్యముగా ఉంటున్నది. కనుక బాగుగా పరిశీలించి **ఇంటివైద్యము** అను ఒక చిన్నపుస్తకమును వ్రాయుట చాలా అవసరము. [illegible], [illegible] తలనుగురించి, పిల్లలకు, పోషణలగురించి తెలుపవలసిన విషయము చాల ముఖ్యములు. మన [illegible], [illegible], [illegible], [illegible]లు, నాకిస్లు, [illegible], [illegible], [illegible] [illegible] [illegible] (శ్రీ) [illegible], [illegible], [illegible] [illegible] [illegible] [illegible], [illegible] ఈ [illegible] [illegible]. ఈ విషయములలో [illegible] [illegible] సూచించుచు, [illegible] [illegible], [illegible] పరిశీలించి, [illegible] [illegible].

ఈ [illegible] [illegible] [illegible] వ్రాయుచున్నాను, [illegible] [illegible], [illegible], [illegible] [illegible] [illegible] వ్రాయవలెను. [illegible] [illegible] [illegible] [illegible] [illegible]. [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible]. [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible].

2. [illegible] సాహిత్యము [illegible] విషయములనుగురించి సూచించుచున్నాను.

శ్రీ [illegible], సత్యసాహిత్యవృద్ధికై [illegible], ప్రోత్సహించి [illegible], [illegible], [illegible] [illegible] [illegible] [illegible] [illegible], కృషి [illegible] [illegible]. ఆయన [illegible] [illegible] [illegible] [illegible] [illegible]. [illegible] [illegible] [illegible] [illegible] [illegible]—ఆ విషయము—**భారతమునకు శుద్ధప్రతి వ్రాయించుట.** [illegible] [illegible] [illegible], [illegible] [illegible] [illegible] [illegible], [illegible] [illegible] [illegible]. [illegible] సత్యసాహి[illegible] (శ్రీ) [illegible] శాస్త్రిగారు [illegible] నా విన్నపము. ఈ కార్యమువలన ఆంధ్రభాషకు [illegible]. శాశ్వతమైనది. ఆంధ్రవ్యాకరణమునకు మూలాధారము.

3. సంగీత సాహిత్య చిత్రకళలకు కలిసిన విషయమొకటి మనవి చేసెదను. (శ్రీ)గారు [illegible], వాగ్గేయకారవరుడును, మహానుభావుడును, అగు శ్రీ త్యాగరాజుగారి కీర్తనలు దొరకినన్ని, ప్రయుక్తముగా మద్రాసు సంగీత పరిషత్తువారు (The music Academy, Madras) ప్రకటించుటకై గొప్ప ప్రయత్నము చేయుచున్నారు. ఆకార్యము భగవదనుగ్రహమువలన రానున్న త్యాగయ్యగారి శతవర్షోత్సవ సమయము నాటికి తప్పక సాగునని నమ్ముచున్నాను. ఇట్టి విషయ మింకొకటి గలదు. రసపూరితము లగు "పదము"ల రచించి, వాగ్గేయకారులలో ఉత్తమస్థానము నలంకరించి, అచ్చమగు జాను తెలుగులోవ్రాసి, భాషకు వన్నె తెచ్చిన మహాభక్తుడగు క్షేత్రయ్యగారు కూడ తెలుగువాడగుట మన భాగ్యము. ఆను ప్రసిద్ధ పదములనన్నిటిని సేకరించి, రాగ, తాళ, స్వరయుక్తముగా, క్షేత్రయ్యగారి జీవిత

చరిత్రముతోకూడ ప్రకటించుట యాంధ్రుల ముఖ్య కర్తవ్యము. సంగీతమునకేగాక, సాహిత్యమునకు కూడ అత్యంతలాభకారి. ఈకార్యము శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మగారి వంటివారు తలచుకొన తగిన దిగా తోచుచున్నది. క్షేత్రయ్య పదములుపాడువారు చాల తక్కువగా ఉన్నారు. కొద్దిపదములే మన దేశములో పాఠ్యములుగా ఉన్నవి. సంప్రదాయసిద్ధముగా నేర్చిన పెద్దలు—వీణాధనము మొదలగు వారు—గతించుచున్నారు. ఈపదములలో గొప్పగొప్ప భావములు కలవు. అక్షరరత్నగమందు రసమొలుకు చున్నట్లుండును. ఈ పదములందలి భావములను కళాకోవిదులు, రసజ్ఞులు ఉచితరీతిని చిత్రించుట కళకు నూతనశోభను కలిగించగలదని తోచుచున్నది. అట్టి చిత్రములతో పెగ్రంథమును ముద్రించినచో గొప్ప కళా (సంగీత, సాహిత్య-చిత్రకళా)-పోషకమగు విషయము కాగలదని నమ్ముచున్నాను. ఈ విషయమును శ్రీ అడివి బాపిరాజుగారాలోచించి కార్యరూపమునకు తేగలరని విశ్వసించుచున్నాను.

4. ఆదర్శములగు నాటకముల రచన.—'సరిపడని సంగతులు,' 'తప్పెవరిది ?' 'విడాకులా ?' మొదలైన నాటకములున్నవి. అందలి సమస్యలు కొదితేడాలో ఒకలాటివే. అట్టివి మాత్రమేగాక ఇతరములగు నేటిసమస్యల నెత్తి నాటకములను వ్రాయవలెను. చదువుటకే కాకుండ ప్రదర్శించుటకున్ను వీలుగా ఉండ వలెను. మూడుగంటల కాలములో ప్రదర్శింప దగునట్లుండవలెను. అవసరమైనచో ప్రసిద్ధనటకుల సహా యముతో వీటినివ్రాయుట మంచిది. సూచనకు కొన్ని సమస్య లుదాహరించుచున్నాను.

(౧) సామాన్య సంసారులకు ఆర్థికసమస్యవలన కలుగుచున్న వివిధచిక్కులు, వ్యక్తులలోను – కుటుంబము లోనూ – సంఘమునందూ.

(౨) గ్రామమునుండి పట్టణమునకు వచ్చివేయుట – కారణములు – పరిణామము.

(౩) ఒకటిగా ఉన్నకుటుంబములో ఒకరిద్దరు మగవాళ్లు చదువుకొని ఉద్యోగములు చిన్నవీ, పెద్దవీ సంపాదించి వేరుపడుట – దానివలనకలుగు చిన్న ఆర్థికవ్యత్యాసములు, సమిష్టిఆస్తిలో కలుగు చిక్కులు, మనస్పర్థలు మొదలైనవి.

(౪) ఉద్యోగస్థు లను ఒక క్రొత్త శాఖాభేదము పుట్టుచుండుట-అధికారము, జీతము, ఐశ్వర్యము కారణ ముగా సంఘములోకలుగు భేదములు, వికారములు, బాధలు.

ఇట్టి సామగ్రితో నాటకమును చిత్రించి సమస్యలకు సమాధానములను సూచించి, ప్రజలకు విలువైన సందే శముల నిచ్చుట చాలా అవసరము.

5. భారతకథ మొదలైన పురాణగాథలలోని సందేహములుగల విషయముల కొన్నిటిని తీసి, వాటికి సమాధానముగాను, విమర్శనముగాను—ఖండకావ్యములుగాని—నాటకములుగాని వ్రాయుట. దీనివలన ప్రాతవస్తువునే నూతనదృష్టితో చూచుట తటస్థించగలదు.

ఉదాహరణకై ఒకటి రెండు విషయములు.

(౧) సకలధర్మములును, సర్వనీతిసారమును తెలసి, మహోన్నతగుణములు, శీలము, వైరాగ్యముగల భీష్మా చార్యుడు, వస్త్రాపహరణము మొదలగు ఘట్టములందు ఉదాసీనుడై యుండుటయు, దుష్టచతుష్టయముయొక్క

దుండగీడుతనమునకు ప్రతీకారము వాగ్రూపముననేకాని, కార్యరూపమున కనపరచకుండుటయు, తుదకు యుద్ధమందు దుర్యోధన పక్షముననుండి, పాండవపక్షపాతమును చూపుచుండుటయు, మహావీరుడగు కర్ణుని నిరుత్సాహుని చేయుట మొదలగు స్వపక్ష నాశనకరములగు పనులజేయుటయు ఎట్టిది? ఏల? దీని తత్తమేమి?

(౨) శ్రీకృష్ణుని గురించియు నిట్లే. అభిమన్యుడు, ఘటోత్కచుడు, వీరిద్దరి చావునకు లోలోపల సంతోషించుట—తాను తిరిగి అవతార మెత్తనక్కరలేదని యట! అభిమన్యునికొఱ కవతారమేల? దుష్టశిక్షణార్థము గదా యవతారము—మొదలైన సందేహములు.

6. జాతీయములగు పాటల మద్ధరించుట :—

బొబ్బిలిపాట, రాజా దేసింగుపాట, బాలనాగమ్మకథ మొదలైన వాటిని తప్పులులేకుండా సవరించి, మంచి కాగితములమీద అచ్చువేయుట, విషయమును పరిశీలనజేసి, చరిత్రయందుగల యాధారములను, కథకు చరిత్రకుగల ముఖ్యభేదములను చూపుట, కథలోని విషయములనుబట్టి యాకాలమునాటి ప్రజాజీవితములోని విశేషాంశములను జూపుట మొదలగు విషయములతో పీఠికను వ్రాసి ప్రకటించుట. ఆపాటలలో కనబడు దేశీయపదములు, తెలుగు నుడికారములను ఎత్తివ్రాయుట. ఇట్టి పనివలన జానపద సారస్వతమునకు, భాషకు, పూర్వచరిత్రలు కలిగించు ఉత్సాహమునకు సహకారమగును.

ఈ సూచనలలోని సారమేమైన యున్నచో పరిషత్తువారు ఆలోచించి యుక్తమగు కార్యమును సాధింతురు గాక! వారి కార్యములన్నియును నిర్విఘ్నముగా సాగుగాక!

ఉత్సవోపక్రమణము

శ్రీ నూతక్కి రామశేషయ్య చౌదరిగారు ఆరోగ్యము సరిగాలేక ఉపక్రమణోపన్యాసము చేయడానికి రాలేదు.

ఏలూరు పురపాలక సంఘాధ్యక్షులు శ్రీ దామరాజు వెంకటరావుగారిని ఆహ్వాన సంఘమువారూ పరిషత్తువారూ కోరగా వారు సభాప్రారంభము చేస్తూ ఈ పరిషదుత్సవము తమ పురములో జరపడము ఏలూరి పౌరులను కవులూ, విద్వాంసులూ సాహిత్యాభిమానులూ గౌరవించడముగా ఎంచుకొంటున్నామనీ, ఏలూరులో సాహిత్యాభిలాష ప్రజలకు బాగా ఉన్నదనీ, ఆ అభిలాష పరిషత్తువారి కార్యక్రమానికి తోడ్పడి ఈ సాహిత్యోత్సవము సర్వవిధములా సమర్థముగా శోభాయమానముగా జరగవలెనని కోరుతున్నామనీ అన్నారు.

శ్రీ సోమంచి లింగయ్యగారూ, శ్రీ కలగర నాగభూషణం చౌదరిగారున్ను శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారిని అధ్యక్షపీఠ మధిరోహించి కార్యక్రమము నడుపవలసినదని కోరినారు.

అధ్యక్షోపన్యాసము

దేవులపల్లి కృష్ణశాస్త్రి

ఆహ్వాన సంఘాధ్యక్షా, స్నేహితులారా,

ఏలూరికీ నాకూ ఏదో ఆప్తబాంధవ్యం ఉంది. లేకపోతే సాహిత్య సభలకు ఏలూరివారు ఇంత తరుచుగా నన్నెందు కాహ్వానిస్తారు?

నేడు కళారాధన ఏలూరిలోకన్న ఇంకేచోటూ ఎక్కువ ఉత్సాహంగా జరగడంలేదు. ఎందరు కవిమిత్రులు, చిత్రకారులు, సరసులు, కళారాధకులు ఈ పట్టణంలో ఉన్నారు?

నండూరి సుబ్బారావు నవకవుల్లో రత్నం; నండూరి సుబ్బారావు ఉన్నచోట నవ్య సాహిత్య పరిషత్తు సమావేశం అవుతుంది. అతనికీ నాకూ ఒకనాటికన్న ఒకనాడు దృఢతరమై పోతూవున్న ముప్ఫయియేళ్ల ప్రియబంధం.

ఇక నేను నవ్య సాహిత్యం అంటే చాలా అభిమానం ఉన్నవాళ్లల్లో ఒకణ్ణి. అందుకని కాబోలు నన్నిక్కడికి ఇలా ఆహ్వానించారు.

ఎలాగైతేనేం ఏలూరికీ నాకూ ఏదో ఆప్త బాంధవ్యంమాత్రం ఉంది.

నవ్య సాహిత్యం ఎప్పటినుంచి ప్రారంభం అయిందో, ఎవరి దగ్గరనుంచి ప్రారంభం అయిందో, నవ్య కవుల్లోనూ గ్రంథకర్తల్లోనూ ఎవరెవరిలో ఏయే ప్రత్యేక శక్తులున్నాయో, ఏయే ఉద్యమాలూ అనుభవాలూ ఎవరి నెవరిని ఎలాగ పలుకరించి పలికించాయో, వీటన్నిటినీగూర్చి ఎందరో పెద్దలు ఎన్నో సభలలో ఎన్నో రకాలుగా అధ్యక్ష పీఠంనుంచి చెప్పేరు. ఆ విషయం ఇంక మళ్లీ నేను చెప్పనక్కరలేదు. వారందరికన్నా బాగా చెప్పనూలేను.

"సాహిత్యం అంటే ఏమిటి? కవిత్వం అంటే ఏమిటి? వాటి ప్రయోజనం ఏమిటి? కావ్యవస్తువూ కావ్యభాషా అంటూ ఉన్నాయా? ఉదాత్తపరుప గలిగిందే (Sublimate) కావ్యవస్తువు అవుతుందా? అందరికీ తెలిసేటట్టే వ్రాయాలా? ఇంతవరకూ మన సాహిత్య ధోరణి అభ్యుదయ మార్గమే పట్టిందా, లేదా?"—ఇలాంటి విషయాలని గూర్చికూడ నేనేమీ చెప్పను. ఇక్కడికి వచ్చిన పెద్దలూ, నాబోంట్లూ, నవ్యులూ, అతినవ్యులూ, ఒకపూట సభలో ఒక తీర్మానంలాగే తయారుచేసి, వాద ప్రతివాదాలు చేస్తే కొంతవరకు నిజమూ తేలవచ్చు. అందరినీ ఇంతకంటె దగ్గరగా తీసుకువచ్చే ఒక అభిప్రాయ బంధమూ ఏర్పడవచ్చు; ఈ పరిషత్తు సమావేశం కొంతపనిచేసినట్లూ ఉంటుంది.

ఇంక నాలుగుమాటలే చెప్తాను. అవీ మీకు తెలిసినవే. అయినా—

"The dead make rules and we obey" C. T. C.

"సంకెళ్ళలాంటి శాసనాలు మృతులైనవాళ్లే చేస్తారు. వాటికి మనం లోబడిపోతాం. నేనుకూడా అలాంటి శాసనాలుచేసి చచ్చిపోతానేమో. అలా కాకుండా ఉంటే ఎంతబాగుండును?" అని ఒక ఆంగ్లకవి వాక్యం చదివాను. దీనివల్ల కొన్ని శాసనాలూ, నియమాలూ అసలే వద్దనిలేదు. సాగనివ్వకుండా ఘనీభవింపచేసి చంపేస్తాయి కామా సంకెళ్లు: అవి వద్దని.

సంకెల-చీకటీ, ముసలితనమూ, మరణమూను. తేజస్సు పురాణమైనదీ, తరుణ మయినదీని. చీకట్లు ఒక గడియే ఉంటాయి. అవి పుట్టటమే ముసలిగా పుడతాయి. కవి వెలుగువైపూ, కనుక యౌవనంవైపూ ఎప్పుడూ ఉండాలి. నిజానికి యౌవనానికే వయస్సులేదు. "**I am of an age with each, what matters if my hair turns grey?**" నేను యువకుణ్ణి కాకపోతే, ప్రత్యనుభవానికీ నాగుండె ఎలాగ కొట్టుకుంటూవుంటుంది? నా మనస్సెలా రెక్కలు తొడుగుకొని భావిస్తుంది?

స్థిరపదమూ, స్తిమిత పదమూ అని లోకం అంటూంటుందే—అది అంటే నాకు చాలాభయమూ, వెగటూను.

కాని, మనలో ఒక కెన్యూట్ (Canute) తనం ఉంది. అనగా అనగా కాన్యూట్ అనే ఒకరాజు ఉండేవాడు. అతను ఒకసారి సముద్రపు ఒడ్డునే నీటికి తగిలేటట్టుగా తన సింహాసనం వేయించుకొని, మంత్రి సామంతాదులతో కొలువుతీర్చి, పొంగిపోతూ ఎగిరెగిరి గుర్రపు దళాల్లాగ వస్తూవున్న కెరటాలకేసి చూచి, మహారాజునూ, చక్రవర్తి ఒక గీటుదాటి రావద్దని ఆ కెరటాలని శాసిస్తూ గర్జించాడు. మంత్రి సామంతాదులు అవునన్నట్లు తలలూపి వంచుకొన్నారు. కెరటాలు వినలేదు. సింహాసనమూ, రాజూ, పరివారమూ, కొట్టుకుపోయారు. మనం అందరమూ కొంత కాలందాకా పందెపు గుర్రం లాంటి కెరటాలాగ ఉంటాం. తరువాత మంత్రి సామంతాదుల్లాగ మన్నో, మసనమో, అయిపోతాం. అలాగ అయిపోతే అభ్యుదయం ఎలాగ? ఎప్పటి కప్పుడు యువకుడుగా ఉండవలసిన కవే అలా అయిపోతే ఎలాగా? ఎప్పటి కప్పుడు నవ్యసుందరలోకం నిర్మిస్తూ ఉండవలసిన కవే అలాగైపోతే ఎలాగ? ఆహా! అసలు ముసలితనం ఏమాత్రమూ రానీయని అనంత తారుణ్యం కల్పించిన అద్భుత కావ్యాలు అనేక యుగాల అవధులు దాటివచ్చి, ఇంకా మనల్ని ఎలాగ పలుకరిస్తున్నాయి, నడిపిస్తున్నాయి!

ఇంక మన సంగతి.

నవ యుగోదయం అప్పుడే పొడిచినప్పుడు. ఆరోజుల్లో కొత్తగా తలుపులు తెరుచుకొన్నప్పుడు, తెర్లిపొర్లి వచ్చే మానవ సమాజమూ లోకమూ, ప్రకృతీ, మనకి ఎదురయాయి. మనము వాటిలో కలిసిపోయాం. తీవ్రమైన అనుభవాలు కొన్నివచ్చాయి. మన దృష్టులు మెరిశాయి. మన మనస్సులు ఎగిరేయి. మన గొంతు ముళ్లువిడ్డాయి. మనం ఏవేవో కావ్యాలు ఆలపించాం. కథలు చెప్పేం. నాటికలు వినిపించాం. వాటిలో జీవం ఉంది. వాస్తవికానుభూతి పునాదిగా సుందరనిర్మాణాలు కల్పించాం. అలాంటి అనుభవాలు ఎప్పుడూ ఉండేవే; అలాంటి కావ్యాలూ ఎప్పుడూ ఉండేవే.

కాని ఒకచిక్కు వచ్చింది. ఆ అనుభవాన్నే తరువాత తరువాత గట్టిగా కౌగిలించుకొని కూర్చుంటే అది మనచేతుల్లో నలిగి, ఊపిరాడక, సొమ్మసిలి, చచ్చిపోతుంది. దానిచుట్టూ, మనచుట్టూ, నాలుగు గోడలూ, పైకప్పు కట్టుకొని, మనం దాన్నిగూర్చే తిరగేసి, మరగేసి చెబుదామంటే ఇబ్బంది వస్తుంది. అటువంటి అనుభవాలు ఉన్నంతకాలం ఆ కావ్యాలు అవసరమే. జీవించిఉన్న మానవ సంఘంలో అటువంటివి ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి కూడా. కాని వాటిలో కొత్త మెరుపులూ, కొత్త నడకలూ, కొత్త పలుకుబడులూ రావడానికి కానీ, ఇంకా కొత్త కొత్త అనుభవాలు, వివిధవిధాలవి రావడానికి కానీ, నాడు జీవంతో తారుణ్యంతో నిండిపోయిన ఏ మానవ సమాజమూ, లోకమూ, మనల్ని పలుకరించాయో, వాటికి మళ్లీ మనం ఎదురవాలి; వాటిలో మళ్లీ మనం పడాలి. అలా చెయ్యడంవల్ల మనం బతికిఉండడం, యువకులుగా ఉండడం, సాహిత్య జగత్తును సమాజం అంత విశాలంగా చెయ్యడం తటస్థిస్తుంది. ఏమో, మన తరవాత అంత విశాలమైన జగత్తు సృష్టించి, కల్యాణం తీసుకువచ్చే మహాకవికి దారి పరుస్తున్నామేమో.

కేవలం అనుభవాలకే కాదు మానవ సంఘంలో పడడం, ఇంకో విశేషం. ఎక్కడెక్కడో, ఎప్పుడెప్పుడో, మరీ గొప్పకవికి అంతరాంతరాల్లోనే, ఒక రిజర్వాయిర్ (Reservoir) ఉంటుంది; ఒక డైనమో (dynamo) ఉంటుంది. మనలాంటి వాళ్ళకి ఒక గరిటెడో, గంగాళమంతో శక్తి ఉంటుంది. అది అయిపోయేలోగా మళ్ళీ లోపల నింపుకుంటూ ఉండాలి; ఛార్జి (charge) చేసుకోవాలి. మనకి మన చుట్టూ ఉన్న జీవలోకమే రిజర్వాయిరూ, డైనమోనూ. దానితో సన్నిహిత సంపర్కం ఉంటేనేగాని, కొత్త సృష్టి చేయడానికి కావలసిన చైతన్యం సంపాదించుకోలేము. జీవమే జీవం ఇస్తుంది. గోడ గోరీ కడుతుంది.

మతానికీ జీవితానికీ ఎంత సంబంధం ఉందో, కళకీ జీవితానికీ అంత సంబంధమే ఉంది. అంత ప్రస్తుతం కానట్టు కనపడినా, ఇక్కడ నాదో అనుభవాన్నిగూర్చి చెప్తాను: ఆంధ్ర బ్రహ్మసమాజంతో. ముప్ఫయి, నలభై ఏళ్ళ క్రితం ఆ ఉద్యమం కొత్తగా మన తెనుగు నాటిలో చొరబడినపుడు ఉత్సాహవంతులైన కొందరు యువకులు దానిలో పడ్డారు. ఆ కొత్త మతావేశంతో సంఘంలోకి కలయజూస్తే వారికి గొప్ప చెడుగు లేవో కనబడ్డాయి. అప్పుడు విధవా వివాహ మన్నారు; జాతిభేద నిర్మూల మన్నారు; మరేవో అన్నారు. సంఘం బాధపెట్టింది. ఆ కారణం వల్లానున్నూ, ఒక విధమైన మతాహంకారంచేత చుట్టూ ఉన్న మానవులకన్న తాము గొప్పవాళ్లం అనుకోవడంచేతానున్నూ, నెమ్మదిగా చుట్టూ బడాయిగా గోడలు కట్టుకొని కూచున్నారు. ఇంతలో, మానవ సంఘం గొప్ప జీవనది కాదూ, ప్రవహించుకొని పోతూఉంది, నవ్యమత సంస్కర్తలు నలభైఏళ్ల క్రితం దగ్గిర ఉండి పోయారు; గడ్డాలూ, మీసాలూ నెరిసి హేమంతంలాగ గడకట్టుకొని పోయారు. కాల పరిస్థితుల్ని బట్టి వారన్న సంస్కరణాలకన్న పదిరెట్లు ఎక్కువ సంస్కరణాలు కావిస్తూ, సంఘం మాత్రం అంతా ముందు ముందుకు సాగుతూనే ఉంది.

అలాగే సాహిత్య రంగంలో కృషి చేసేవాళ్ల విషయంలో కూడ.

ఇక గోడ స్వర్గానికి కూడా కారణ మవుతుంది. కాని, సుఖ దుఃఖాలతో, పతనాభ్యుదయాలతో చలించిపోయే ఈ మానవ లోకంలో పడితే ఒక గొప్ప కరుణ మనలో పుడుతుంది. జాలి కాదు, కరుణ. జాలి నీరసం, కరుణ శక్తి ఈ కరుణ ఈ అసమగ్రమైన లోకంమీద, ఇంతకంటె చక్కని లోకం నిర్మించే టట్టు చేసుంది. కవి అదే చేస్తాడు కదూ.

“నాలో నందన మందారంవంటి ఒక సుందరమూర్తి ఉంది. ఈ లోకంలో భయంకరమైనవీ, భగ్నమయినవీ, వికృతమైనవీ, వెగటు కల్పించేవీ, జీర్ణమైనవీ, జరఠమైనవీ, దారిపక్క అసహాయ అయిపడి ఉన్న అనాథ శిశురోదనమూ, రాయీ కర్రా యినుమూ ఒరుసుకు పోయే మోటుబండి చప్పుడూ, శ్రమాలసుడై నడవనూలేక పడిపోనూలేక పోయే కర్షకుని దీన చరణధ్వనీ, నాలోఉన్న ఆ మూర్తికి అన్యాయం చేస్తూ ఉన్నాయి. ఈ లోకాన్నంతటినీ ఒక స్వర్ణపేటికలాగ తిరిగికట్టి, ఒక శిఖరంమీద పెట్టి, దూరాన ఒక తృణవేదికపై కూర్చుండి అప్పుడు నాలో ఉన్న ఆ మూర్తిని చూడాలని ఉంది.”—అని మహాకవి అన్నా

కనుక వాస్తవిక జగత్తుతో మన కెప్పుడూ సంబంధం ఉండాలి; ఎంత సంబంధం ఉంటే అంత మంచిది. కవిత్వానికి కూడా పక్షికిలాగే ఆకాశమూ అవసరమే; గూడూ అవసరమే. మన దేశంలో కొంతమంది ఈ గూడు లేకుండానే కేవలం రెక్కలమీదనే ఆధారపడి అవధిలేని ఆకాశంలో ఎగరడానికి ప్రారంభించారు. తుపానులు వచ్చిపడ్డాయి. ఇంక మిగిలింది గాలిలో తేలిపోయి, తేలిపోయి పడిపోవడం. కాని, ఆకాశం లేకుండా గూటిలోనే కూర్చుంటే, కుళ్లిపోయి, కుళ్లిపోయి కొయ్య అయిపోవడమూ ఉంది.

కాని వాస్తవిక జగత్తే ఉండగా ఉత్త వాస్తవికత ఎందుకూ? ‘ఈ లోకం యిలాఉంది. అసలు లోకం అలా ఉంటే బాగుంటుంది.’ అని ఒక చక్కని కడపల ఏర్పరచి అక్కడికి లోకాన్ని నడిపించడానికి కవి యత్నిస్తాడు. నిజానికి ఒక కావ్యంలో వాస్తవికత (realism) లో ఉండే ఆప్తతా, చైతన్యమూ, కాల్పనికత (romanticism) లో ఉండే ఆవేశమూ, భావనా, సాంస్కృతికత (classicism) లో ఉండే సమగ్ర సౌందర్యమూ, సందేశమూ ఉండాలి.

ఇంతకూ నే చెప్పేదేమంటే, సాహిత్య రంగంలో కృషిచేసేవాళ్లకి కూడా చుట్టూఉన్న మానవ జీవితంతో ఎంత సంబంధం ఉంటే అంత మంచిదనిన్నీ, అలా ఉంటే కావ్యానికి వస్తువుగా అనుభవమున్నూ కల్పనకు పురికొల్పే కరుణయున్నూ సృష్టింపజేసే చైతన్యమున్నూ లభిస్తాయనిన్నీ.

ఇంక మన పరిషత్తు సంగతి. కొందరు కవులూ గ్రంథకర్తలూ ఒక సోదర బృందంగా చేరి, అప్పుడప్పుడు కలుసుకొని కాలక్షేపం చేస్తూఉంటే అన్ని ఇబ్బందులు లేవు, మా సాహితీ సమితి లాగ. అలాగ కొందరు కొందరు అక్కడక్కడ కలుస్తూఉంటారు కూడాను. అప్పుడు ఒకరి కావ్యాలు ఒకరు వింటూ, ఒకరి నొకరు ఎగసనద్రోస్తూ, కొత్త కల్పనకు కొంతవరకు ప్రేరేపించినట్టు అవుతుంది. కాని దేశమంత విశాలమైన ఒక సంస్థో ఒక పరిషత్తో పెట్టినప్పుడు కొంతస్థూలంగా కనబడే కృషి చేయవలసి ఉంటుంది. ఇంతవరకూ మన పరిషత్తు అంత ఎక్కువగా పనిచేసినట్లు కనపడదు. ఒక పత్రిక సంవత్సరానికి నాలుగుసారులు ప్రకటించడం, ఎవరిదయినా సభ్యుని గ్రంథం ఒకటి ఎప్పుడో ప్రచు

లించడం, ఈ భారమయినా కష్టనిష్ఠురాలన్నింటినీ సహించి పాటుపడే ఒక్క మిత్రుని మీదే తోయ్యడం, "వెంకటరత్నం, నువ్వు దంచు, నేను డొక్క ఎగరవేస్తా" నన్నట్లు మిగిలినవాళ్లమంతా ఏడాదికొకసారి చేరి నాలుగు పద్యాలు పాతవో కొత్తవో చదివిపోవడం, తటస్థిస్తున్నాయి.

ఇంతకంటె మన మేమీ చెయ్యలేమూ?


ఒకటి. నేటిదాకా వ్రాయబడ్డ ఖండకావ్యాల్లో చిన్న కథల్లో నాటికల్లో విశిష్టత ఉన్నవాటిని ఏర్చి కూర్చి మూడు సంపుటాలుగా (anthologies) పరిషత్తు ప్రకటించవచ్చు. ఈపనికై ఒక సంఘాన్ని ఏర్పాటు చెయ్యవచ్చు.

రెండు. ఆంధ్ర సాహిత్య చరిత్ర, నన్నయనుంచి నేటిదాకా, వ్రాయించవచ్చు. దీనికై ఇద్దరు ముగ్గురు ప్రతిభావంతుల్ని నియమించవచ్చు.

మూడు. నేటిదాకా సాహిత్య కళని గురించి మనవీ, పాశ్చాత్యలోకనుంచి వచ్చినవీ అభిప్రాయాలు అన్నీ తరచి విమర్శించే గ్రంథం ఒకటి సాహిత్య కళని గురించి వ్రాయించవచ్చును. ఈ పనికోసం కూడా ఇద్దరు ముగ్గురు విద్వాంసుల్ని ఏరండి.

నాలుగు. మన వాఙ్మయాన్ని కొంతవరకయినా ప్రజల దగ్గరికి తీసుకొని వెళ్లడమనేది లేదూ? ప్రజలకు వికాసమూ స్వతంత్ర భావాలూ కలిగితే ఆ ప్రజా గర్భంలోనుంచి మనకన్న ప్రతిభావంతులైన కావ్యకర్తలు రారూ? అదివరకు రాయప్రోలువారి రచనలు మనవంటివారు ఏ నలుగురో పఠించేవారు. మేము కాకినాడ కళాశాలలో (Variety entertainment) వెరైటీ.ఎంటర్టైన్మెంటులాగ ఏర్పాటుచేసి, యువతులకూ యువకులకూ వేషాలు వేయించి, ఆ గేయాలే మనోహరంగా పాడించే వాళ్లం. 'స్త్రీలు పొంగిన జీవగడ్డయి' అన్నపాట, 'పూవుపాట' 'ఏ దేశమేగినా' అన్నపాట అక్కడ బిచ్చగాళ్లూ బండీవాళ్లూ ఇంకా ఎందరెందరో పాడుతున్నారు. ఇలాగే నవ రచయితలవి ఎందరివో కావ్యాలూ కథలూ నాటికలూ అక్కడ జన సందోహంలో పడ్డాయి. చూడండి, ఇలాంటి రచనలు కొన్ని ఏరడం, మంచిమంచి కథలు ఏరడం, రెండు మూడు నాటికలు ఏరడం, మన పరిషత్తు తరఫున ఒక బృందాన్ని ఏదయినా ఒక జిల్లాలో ఏర్పరచడం, దానిని నాలుగుచోట్ల తిప్పడం, ఇదంత కష్టమయిన పనా?

ఇటువంటివీ, ఇంతకంటె మంచివీ, సూచనలు మిత్రులెవరయినా ఈసారి చెయ్యండి. మనలో పండితులున్నారు, ప్రతిభావంతు లున్నారు, కలవా రున్నారు, కావలసినంత ఉత్సాహమున్నవాళ్లూ ఉన్నారు; నాలాంటివాళ్లూ ఉన్నారు. ఇంక ద్వేషంతో, రోషంతో, మోసంతో, నాశంతో, అశాంతితో, అంధకారంతో యావత్తు ప్రపంచమూ మనదేశమూ భయంకరంగా ఉన్నాయి. "గాత్రం భయంచేత కంపిస్తూంది; ముఖం ఎండిపోతూంది; శరీరం వణుకుతూంది; గగుర్పొడుస్తుంది" అని నరు డంటున్నాడు. ఎంతో ఆశా బలమూ దృష్టీ ఉంటేనేకాని అంతా అయోమయంగానూ అసత్యంగానూ ఉన్నట్టుంది. ద్రష్టా విశ్వాసీ అయిన కవే ఊరుకుంటే ఎలాగ? నవ్య సాహిత్య పరిషత్తే ఊరుకుంటే ఎలాగ?



ఇది యువ గీతం :

ఆకాశము నొసట పొడుచు అరుణారుణ తార !
ఏకాకి వీథి నొడుచు తరుణ కాంతి ధార !
జయ పతాక ! యువ పతాక !
వియదాలగ వెడలు నౌక !

యుగ యుగాల పీడ కలలు ! సొగయబోని సంకెలలు !
తెగనివి కావోయి, మ్రోల ధగధగా స్వతంత్ర విభా
తాకాశము నొసట పొడుచు అరుణారుణ తార....

అంతులేని ద్వేషము, విష రోషము, స్వార్థము, మోసము
పంతగించి నిలువవు, ఆవంత యేని, శాంత విభా
తాకాశము నొసట పొడుచు అరుణారుణ తార....

ముందు గలదు మన జాతికి ముక్తి, అమర జీవ రక్తి,
క్రిందు వెనుక గనక నడువు డందరు, అభ్యుదయ విభా
తాకాశము నొసట పొడుచు అరుణారుణ తార....

నవ్య గ్రంథ చిత్రపట ప్రదర్శనోపక్రమణము

కూర్మా వేణుగోపాలస్వామి

నవ్య సాహిత్య పరిషత్తువారు వార్షికోత్సవములు చేసేటప్పుడు నవ్యగ్రంథ ప్రదర్శనము ఏర్పాటు చేయడము సముచితముగా ఉన్నది. అయితే ఇక్కడ ప్రదర్శనములో ఉంచిన గ్రంథాలకూ ఈ పరిషత్తుకూ ఏమి సంబంధమా అని కొందరు ప్రశ్నించవచ్చును. ఈ గ్రంథాలన్నీ వీరు ప్రకటించినవిగాని, పరిషత్సభ్యుల రచనలేకాని కాదు. ఆంధ్ర విశ్వకళా పరిషత్తువారి ప్రచురణాలూ, అభిసారికా గ్రంథమాలా ప్రచురణాలూ, సాహితీ సమితి, సాధన సమితి, అభినవాంధ్ర గ్రంథమాలా ప్రచురణాలూ కూడా ప్రదర్శిస్తున్నారు. దొరికినంతవరకు నవ్యాంధ్ర గ్రంథాలన్నీ సేకరించి ప్రేక్షకులకు నవ్యసాహిత్య విస్తృతి తెలియజేయాలని వీరి సత్సంకల్పము.

ఇక్కడ ఆంధ్ర చిత్రకారుల రచనలన్నీ తెప్పించి చిత్ర ప్రదర్శనము కూడా ఏర్పాటుచేయవలెనని తలపెట్టినారుకాని అది కొనసాగకపోయినా స్థానిక చిత్రకారులవీ ఇంక కొందరివీ చిత్రములు ప్రదర్శనములో ఉంచారు. నాకు చిత్రములంటే చాలా సంతోషము. చిత్రములను గురించి ఉపన్యసించవలెనని ఉపన్యాసము వ్రాసిపెట్టుకున్నాను గాని అది ఇక్కడ చదివితే పరువునష్టము దావాలకు గురి అవుతానని మా మిత్రులు శ్రీమన్నారాయణ చౌదరిగారి సదమువల్ల చిత్రపటముల ప్రస్తావన ఇప్పు డెత్తుకొనను.

నవ్య సాహిత్య పరిషత్తువారు శాస్త్ర గ్రంథాలు ప్రకటించవలెనని కొందరి సలహా. శాస్త్రీయ గ్రంథాలు సాహిత్యము కావు. సాహిత్యమనేది ఉద్రేకముతో వస్తుంది. హృదయానికి సంబంధించినది కాని పరిశోధనలవల్ల వచ్చేది కాదు. పాఠ్య గ్రంథాలుగా పనికివచ్చే శాస్త్రవాచకములు ప్రకటించడము గ్రంథ ప్రకాశకులకు వదలిపెట్టి రసపుష్టిగల సాహిత్య గ్రంథాలు, కొత్త కొత్త రకాలవి, ప్రకటించడానికే ఈ పరిషత్తువారు పూనుకోవలెను.

సంకెళ్ళు వద్దంటారు ఈ పరిషత్తువారు. పాత సంకెళ్ళు వారు వదల్చుకొని కొత్త కొత్త సంకెళ్లలో ఇరుక్కొంటున్నారు. ఈ పరిషత్తువారి సంకెళ్ళు మన కెందు కంటున్నారు నవ్యులలో నవ్యులు. క్షణక్షణమూ మారుతూఉన్న లోకములో సంకెళ్ళులేని స్వేచ్ఛ ఉంటేనేకాని కవులు స్వతంత్ర రచనలు చేసి కొత్త మార్గాలు తొక్కలేరు.

మన దేశములో గ్రంథాలను పూజిస్తారు. కాని ఆ గ్రంథాలు వ్రాసిన ప్రతిభావంతులను పూజించరు. వెనకటి కాలములో కవులకు రాజాస్థానములలో ఆదరము ఉండేది. ఆ పరిస్థితులుపోయి ప్రజాదరణమే కవికి శరణ్యమైనది. అసలిదే యుక్తము. రాజులుగాని కొందరు సంపన్నులగు వ్యక్తులుగాని పోషించడమువల్ల కవికి గౌరవము కలగదు. అది వారికి అప్రతిష్ఠే అంటాను. ప్రజాదరణము కవికి గౌరవావహము. కవులను ఆదరించండి. వారికి దారిద్ర్యం లేకుండా చేయండి. దారిద్ర్యం తీరిననాడే కవి ఉత్తమ కావ్యాలు రచించగలడు. దేశానికి మంచి సందేశమిచ్చి సన్మార్గము చూపగలడు. కవులను ఆదరించవలెననే భావము మీ కుంటే వారి గ్రంథాలు కొనండి; అవి చదవండి; ఆనందించండి.

కవుల గ్రంథాలకు మన దేశములో చెలామణిలేదు. గ్రంథాలు ముద్రించి, కొన్ని ప్రతులు ఉచితంగా పంచిపెట్టి, మిగతావి చెదల కర్పించుకొనే రోజులు పోవాలి. బడులలో, విశ్వవిద్యాలయాలలో పాఠ్య గ్రంథాలుగా పెట్టిన పుస్తకాలే అమ్ముడుపోతున్నవిగాని ఇతర పుస్తకాలు చెల్లడములేదు. కవులు గ్రంథనిర్ణాయక సభ్యులవెంట తిరిగి వారిని ఆశ్రయించడము అనవసరమయేలాగున మీరంతా పుస్తకాలు కొంటూఉండండి. ప్రజాబాహుళ్యం ఆదరిస్తే కవి స్వతంత్రుడౌతాడు.

ఇప్పుడు యుద్ధపరిస్థితులవల్ల తెల్లకాకితము కరువయింది. ఈ పరిషత్తువారి గ్రంథాలు మీరు కొనుక్కోండి: వాటిలో కావలసినంత తెల్లకాకితముంది. ఆ పుస్తకాలలో కొత్త కావ్యాలయినా ఇంకేమయినా వ్రాసుకోవచ్చును.

నా మాటలవల్ల నామీద కోపంవచ్చినా, పరిషత్తువారిమీద కోపంకలిగినా ఇప్పుడే నాతో వచ్చి నవ్య సాహిత్య గ్రంథాలు చూచి అవి కొనండి—ఇదుగో నవ్య గ్రంథ ప్రదర్శనము తెరుస్తున్నాను.

శ్రీ గురజాడ అప్పారావుగారి చిత్రపటము

శ్రీ వజ్ఝ బాబూరావుగారు గురజాడ అప్పారావుగారి చిత్రపటము నూనెరంగులతో చిత్రించి నవ్య సాహిత్య పరిషత్తుకు బహూకరించారు. బాబూరావుగారు లలితకళల విషయములో చేస్తూవున్న పరిశ్రమగురించీ, నూనెరంగులతో పలువిధము లైన చిత్రములు రచిస్తూ రచనలో ఒక కొత్తపద్ధతి ప్రవేశపెట్టుతున్న విషయముగురించీ శ్రీ అడివి బాపిరాజుగారు ప్రశంసించి, శ్రీ భమిడిపాటి కామేశ్వరరావుగారిని చిత్రపటావిష్కరణము చేయవలసిన దని కోరినారు. శ్రీ కామేశ్వరరావుగారి ఉపన్యాసము ఈ సంపుటములో ముద్రించాము.

సాహితీ సమితి చతుర్థ సమావేశము

౨౮ - ౧౨ - ౪౨

నవ్యసాహిత్యపరిషద్వార్షికోత్సవముతో పాటు సాహితీ సమితి సమావేశానికి కూడా ఏర్పాట్లుచేశారు ఆహ్వానసంఘమువారు. ఈసమావేశానికి వచ్చిన సభ్యులు. శివశంకరశాస్త్రి, నోరి నరసింహశాస్త్రి, రాయప్రోలు సుబ్బారావు, నండూరి సుబ్బారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, త్రిపురారిభట్ల వీరరాఘవస్వామి, అడివి బాపిరాజు, వేదుల సత్యనారాయణశాస్త్రి, మునిమాణిక్యం నరసింహారావు, శ్రీనివాస శిరోమణి, తెలికిచెర్ల వెంకటరత్నం, మొక్కపాటి నరసింహశాస్త్రి. సభ్యు లందరూ వేదికమీద ఆసీనులయ్యారు.

శ్రీ కురుగంటి సీతారామయ్యగారు వేదపాఠముతో సభాప్రారంభము చేశారు. దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు శ్రీ నోరి నరసింహశాస్త్రిగారిని అధ్యక్షత వహించవలసిన దని కోరుతూ, ఈనడుమ సమితి సమావేశాలు జరగనందువల్ల నష్టము లేదనీ, సమితి సభ్యులు జీవించి ఉన్నంతవరకూ, వారు రచనచేస్తూ ఉన్నంతకాలమూ సమితి సజీవముగానే ఉంటుందనీ, సౌరకుటుంబములో సూర్యుడూ గ్రహములూ వలెనే శివశంకరశాస్త్రి చుట్టూ సంచరించే సోదరబృందమనీ, నోరి ప్రతిభాశాలి, సహృదయుడు, కవి, కథకుడు, విమర్శకుడు సమర్థుడయిన వకీలుగారు అన్నారు. వేదులవారు ఈ ఉపపాదనము బలపరిచారు. నోరివారికి పుష్పదామము వేసి, అధ్యక్షపీఠము ఎక్కించారు.

అధ్యక్షోపన్యాసములో నోరి నరసింహశాస్త్రి గారు సమితి సభ్యులలోనూ వారి కృషిలోనూ ఉండే ప్రత్యేకత విశదీకరించారు. అపద్యానకవిత్వము మాత్రమే ప్రచారములో ఉన్నదినాలలో సమితి సభ్యులు నూతన పదాలు తొక్కి ఖండకావ్యము, కథానిక, ఏకాంకనాటిక, హాస్యరచన, స్కెచ్ మొదలయినవి వ్యాప్తికి తెచ్చారు. వ్యావహారిక భాషను గురించి వాదోపవాదాలు ప్రబలుతూ ఉన్న దినాలలో వ్యావహారిక భాషకు-ఒక రూప మిచ్చి రామమూర్తి పంతులుగారు మెచ్చుకొనే లాగున ఆ రచనలో ఉండే రుచి దేశానికి చూపి అది వ్రాయడము ఒక ఫాషను చేశారు.

అధ్యక్షోపన్యాసము అయిన వెంటనే కృతిసమర్పణ సభ.

కృతిసమర్పణోత్సవము

శ్రీ ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారు అధ్యక్షత వహించి ఈ ఉత్సవము జరిపినారు. వారీవిధముగా అప్పుడు ప్రసంగించారు :

సాహిత్య వ్యవసాయములో కృతికర్త, కృతిభర్త మంచి కర్షకులు. వారి కృషిఫలితమే ఈ రీతి సమావేశాలకూ వీటిలో పలువురు చూపే ఉత్సాహానికీ కారణము. ఈ సమితుల పేరిట ఒకరినొకరు స్తవంచేసుకొనే సంఘాలు బయలుదేరిన వని కొందరు భావిస్తున్నారు. ఇప్పుడు మనలో ఉత్సాహశక్తిమాత్రమే నిలిచి ఉన్నది. తక్కిన రెండు శక్తులూ పోయినట్లే భావించవలెను. ఈ శక్తే బాలుర మొదలు వృద్ధులదాక తాండవింప జేస్తున్నది. మీవల్ల మాకు కలిగిన ఉత్సాహం కొంత మర్యాదాతిక్రమం చేస్తే చేయవచ్చును. అందరూ శబ్దోపాసనము చేయాలి. నేను మొదటినుంచీ ఉత్సాహముతో శబ్దారాధన చేస్తూవచ్చాను. మొదట మేము వేసిన మొక్క ఇంతగా పెరిగి ఫలవంత మౌతున్నదంటె మాకు ఉత్సాహము కలగదూ! హ్లాదరామణీయకాలు ఉన్న స్వభావము పూజ్యము.

నాలోని నాదము వెలువడి కవిత్వం రాగా దానిని రీతి అన్నా సరే మరొకటి అన్నా సరే పండితు లేమయినా అనవచ్చును. లక్షణం ముందు పుట్టదు; లక్ష్యమును అది అనుసరిస్తుంది. ఈ నాటి లక్ష్యాలకు తగిన లక్షణము ఏర్పడవలెనుగాని వెనుకటి లక్షణముతో వీటి విలువ కట్టరాదు. యెంకిపాటలలోని నాయిక అభిసారిక అవుతుందని కొందరు పండితులు నిర్ణయించారు. ఇది చాలా చిత్రము. మాలో కొందరి కవితరీతి అంటాడు విశ్వనాథ సత్యనారాయణ. నేను కాదంటాను. నేను పువ్వు అని ఒక కావ్యం వ్రాశాను. అందులో పువ్వు అంటె సాహిత్యం. ఆ భావము విజ్ఞులు తెలుసుకోగలరు. కవిఅభిప్రాయ మేమో తెలుసుకొనడానికి యత్నించి దాన్ని, అనుసరించి కావ్యము పఠించండి.

1916 లో నేను వంగదేశం వెళ్లాను. నాకు వంగ, హిందీ, గుజరాతీసాహిత్యాలతో పరిచయము ఉన్నది. అయినా నా రచనలలో ఆ సాహిత్యచ్ఛాయలు లేవు. కావ్యమును సర్వాంగసుందరముగా చిత్రించగల వారు ఆంధ్రులే. నేను వంగసాహిత్యము ననుసరించానని కొంద రంటారు. కీట్సు షెల్లీ అనుకరణ కనబడుతుం దంటారు కొందరు. కాదు. నా పద్యాలు మొదట కురుగంటి సీతారామయ్యగారు చూచారు. 1916 కు పూర్వమే నేను కావ్యాలు వ్రాసి పిమ్మట వంగదేశానికి వెళ్లాను. ఆంధ్రులే ఇతర ప్రాంతాల వారికి సాహిత్యభిక్ష పెట్టారు. హాలుడు మొదలు పండితరాయల వరకూ ఆంధ్రులనేకులు సాహిత్యసుధ నిచ్చారు. నవ్యులు మళ్లీ ఉత్సాహంతో సాహిత్యోద్యానంలో కొత్తకొత్త గతుల కృషి చేస్తున్నారంటే మీరు సహించాలి.

శ్రీ శివశంకరశాస్త్రిగారు రచించిన "కవిప్రియ" అనే నాటికలో కొన్ని భాగాలు శ్రీ వింజమూరి శివరామారావుగారు చదివారు. ఆ కావ్యము నోరి నరసింహశాస్త్రిగారికి శివశంకరశాస్త్రిగారు సమర్పించారు.

శ్రీ పిలకా గణపతిశాస్త్రిగారు "భ్రాన్తామరుకము" నుంచి కొన్ని పద్యాలు చదివి వినిపించి ఆ గ్రంథము శ్రీ నోరి నరసింహశాస్త్రిగారికి అంకితమిచ్చారు. శ్రీ శివశంకరశాస్త్రిగారు "నోణకభార్య" అనే

సంకీర్ణగీతినాటికను శ్రీ మొక్కపాటి నరసింహశాస్త్రిగారికీ, "రాచజామాత" అనే గేయరూపకాన్ని త్రిపురారిభట్ల వీరరాఘవస్వామిగారికీ, "ఉజ్జీవము" అనే గీతికావ్యమును శ్రీమతి పద్మావతీదేవిగారికీ సమర్పించారు.

పరిషత్సభ్యుల సాధారణ సభ

[౨౬-౧౨-౪౨ : మధ్యాహ్నం ౨ గంటలకు, రాత్రి ౯ గంటలకు]

పరిషత్తు ఆర్థికస్థితి గురించి చర్చించి ఈ దిగువ తీర్మానాలు చేశారు.

౧. సభ్యులు బాకీ ఉన్న చందా మొత్తముపూర్తిగాగాని లేక ౧౯౪౧ కి నిలువ ఉన్నబాకీలో రు ౨ లకు తక్కువ కాని మొత్తముగాని చెల్లించవలెనని తీర్మానించడమైనది. చందా చెల్లించని వారు సభ్యులుగా పరిగణింపబడరు.

౨. పరిషదుద్దేశ నిర్వాహణానికి మూలధనము సేకరించుటకున్ను, పాత బాకీలు వసూలుచేయుటకున్ను, కొత్తగా సభ్యులనూ, చందాదారులనూ చేర్చుటకున్ను, విరాళములు సంపాదించుటకున్ను అధ్యక్షులు తాము ఎన్నుకొన్న సభ్యులతో కూడిన ఉపసంఘముతో దేశమంతా పర్యటనము చేయగలందులకు పరిషత్తువారు కోరుతున్నారు.

౩. స్థాయిసంఘమునకూ కార్యనిర్వాకవర్గమునకు ఈ దిగువవారిని ఎన్నుకొనడమైనది. (స్థలాంతరమున సభ్యుల పేర్లు ముద్రితమైనవి)

౪. ప్రతిభ సంపాదక వర్గాన్ని, గ్రంథనిర్ణాయక సంఘాన్ని ఎన్నుకొనే అధికారము అధ్యక్షుల కివ్వడమైనది.

వార్షికోత్సవము గురించి అభిప్రాయము

కురుగంటి సీతారామయ్య

మహాశయులారా! నమస్కారము :

కొన్ని నిమిషాల్లో ఈ నాల్గు దినములు జరిగిన సభనుగూర్చి నా యభిప్రాయాల్ని వెల్లడిచేయమని అధ్యక్షులవా రాజ్ఞాపించారు.

మొదటివిషయం — ఏలూరు ప్రజలయొక్క ఓపిక. మీరు ఇంతమంది సభ నలంకరించి అత్యంతశ్రద్ధతో వెఱ్ఱిమొఱ్ఱి వ్రాతల్ని వినడం చాలా సంతోషం. నేను వెళ్లిన సభల్లో ఇటువంటి ఆస్థ ఎక్కడా చూడలేదు. దీనివలన నవ్యసాహిత్యం యెడల మీకున్న అభిమానంకూడా వ్యక్తం ఔతూఉన్నది. ఎంతత్వరలోనైనా సాహిత్యసభను జయప్రదంగా కొనసాగిస్తుందనే కీర్తి ఏలూరుకు దక్కింది.

రెండో విషయం—ప్రతినిధులయెడల పౌరులు, అందులో ముఖ్యంగా ఆహ్వానసంఘంవారు, చూపించిన ఆదరం. మాలో వయోవృద్ధులైన చాలామందికి కొంచెం అజీర్ణంకూడా కల్గింది. అత్తవారింటి అల్లుళ్ళల్లే అనుభవించాం!

మూడో విషయం — కొందరనుకున్నట్టు పెద్దవాళ్లకు సభాకార్యాల్లో లభించినంత అవకాశం యువకులకు లభించకపోవడం.

నాల్గో విషయం — నవ్య సాహిత్య పరిషత్తు అనే మాట సార్థకం కావడం. కవిత్వానికి ముఖ్యసామగ్రి మూడు విషయాలు: భావము, వస్తువు, రచన. ఈ మూడింటిలోకూడా, పూర్వపు కావ్యాలకంటె ఈ నాలు దినాలనుంచీ మనం విన్నవి నవ్యా లనడంలో ఎట్టి అభ్యంతరమూ లేదు. ఇటీవల వస్తురచనల్లో అనేక యువకులు అత్యంత స్వాతంత్ర్యం తీసుకొంటున్నారు. ఇది నవ్యతలో నవ్యత. కాబట్టి ఈ నవ్య సాహిత్య పరిషత్తు సార్థకమైంది.

ఈ సమావేశానికి మకుటమైన విషయం శ్రీ వేదుల సన్మానం. అది చూస్తుంటే నాకు ఇది దేవేంద్ర సభా అన్నట్లు తోచింది. శివశంకరశాస్త్రి మొదలైనవాళ్ళు చెప్పినట్టు శ్రీ వేదులకవి తన సహజ రీతిలో ఒక మహాకావ్యం రచించి చిరస్థాయి ఐన కీర్తిని పొందుతాడని ఆశిస్తున్నాను.

తుదివిషయం — దేవులపల్లివారి సభాధిపత్య నిర్వాహణం. ఇది అసమానం. ఈ సమావేశానికి వచ్చినంత మంది కవులు, కవిమిత్రులు ఇదివరకు రాలేదని అంతా అంటున్నారు. నేను వచ్చిన ప్రథమసమావేశమిది. దీనిలో వీరందరి పరిచయం కల్గినందుకు నేను గర్వపడుతున్నాను. మా గురువర్యులలో ఒకరైన శ్రీ విస్సా అప్పారావు పంతులుగారే ఈ సమావేశానికి పునాదిరాయిపంటివారు. ఆయన ఆదరమే సభ జయప్రదంగా జరగడానికి మూలకారణం.

నమోనమః

ఉపసంహారవచనము

దేవులపల్లి కృష్ణశాస్త్రి

నాలుగురోజుల పరిషదుత్సవ కోలాహలములోనూ నేను గమనించినంతవరకు నాకు ముఖ్యముగా పొడగట్టిన విషయము, మనమందరమూ నిదానముగా పర్యాలోచన చేయవలసిన విషయము, ఇప్పటి యువకవర్గములోనూ విద్యార్థి గణములోనూ కనబడుతూఉన్న అసంతృప్తి, కవితాగోష్ఠిలో ప్రతిచోటా వీరి అసంతృప్తి, ప్రతిఘటనా కనబడుతున్నవి. వారిని తృప్తిపరచడ మెట్లాగా అని ఆలోచించాలి.

అసలీ ఉత్సవదినాలలో ఒకపూట ఏదో విధముగా అవకాశము కల్పించి సాహిత్యకారులు వివిధ వర్గాలవారూ తమ అభిప్రాయాలు స్పష్టముగా సకారణముగా వెలిబుచ్చేటందుకొక తీర్మానాన్ని పురస్కరించు

కాని డిబేటు చేయడానికి ఏర్పాటు చేయాలని అనుకొన్నాను. కాని కార్యభారమువల్ల అది సాగలేదు. అట్టి డిబేటు ఎంతో అవసరము. ఇప్పుడీ విద్యార్థి, పట్టాభి రామారావు, అడిగిన ప్రశ్న చాలా సమంజసమైనది. లోకము సంక్షుభితమవుతున్నది. అశాంతి ప్రబలిపోయింది. ఈ సమయంలో కవికిఉన్న బాధ్యత ఏమిటి? ఈ పరిస్థితులలో అతడు నిర్వహించవలసిన దేదీలేదా? లోకముతో నాకేటికి అని కోకిలారావము చేయడము ఎంతవరకు సముచితము? ఇది విచారించాలి. ఈ విషయాన్ని ఏలూరులోనే పెద్దలని పిలిచి చర్చచేయించండి. దానివలన ఈ సమస్య తేలవచ్చు. అభిప్రాయాలలో ఉండే దోషాలు తొలగవచ్చు. ఒకరినొకరు సరిగా అర్థముచేసుకోవచ్చు.

ఈ పారిషదులు కావ్యాలు చదివారు. అదే ఉపయోగమని నేను భావించాను. మా కవిత్వ ప్రచారములో ప్రాచ్యకవిత్వ వ్యతిరేకత ఉన్నదని అనేకులు అన్నారు. ఇప్పుడనేక ప్రశ్నలున్నవి. అనేక విధములైన సాహిత్యాలలోనూ అసలు ఒకే సాహిత్యం ఉంటుంది. ఏ పరిషత్తునూ తిట్టకుండా, ఏ సమితిని తూలనాడకుండా అన్నివిధాల సాహిత్యాన్ని ఆదుకోండి. హుమాయూన్ కబీరువంటి సాహిత్యవేత్తలు సాహిత్య తత్త్వముగురించీ సాహిత్యకృషిలో కనబడే వైవిధ్యముగురించీ విప్పిచెప్పడం అవసరం. పాశ్చాత్య సాహిత్యం కానీ, మన సాహిత్యంకాని నాకు సంతోషమే ఇస్తుంది. ప్రాచీన నవీన సాహిత్యాలూ సంతోషము కల్పిస్తవి. అనేక కాలాలలో వెలువడ్డ అనేక సాహిత్యాలు ఆస్వాదించగలము. రష్యాలో ఎన్ని విధానాలున్నవో గమనించండి. కొత్త పోకడలనగానే ప్రాతికూల్యము వహించక, ఈసడించక అనుకూలంగా విని వాటిలో ఉన్న మంచి ఏకొంచెమున్నా అన్వేషించండి. కవులనేకులు కవిత్వం వ్రాస్తారు. నేనందరికాలే కవిత్వాన్ని ప్రేమిస్తాను. అసలు కవియైనవాడికి సహృదయుడికి కవిత్వం ఏరూపాన్ని ఎక్కడ కనబడ్డా ఆస్వాదించి ఆనందించే స్వభావము ఉంటుంది.

సభాప్రారంభం కాకపూర్వం ఈ మందిరంలో అడుగు పెట్టేటప్పటికి ఒక కరుణామూర్తి కనిపించింది. ఆమె ఈ నాలుగురోజులూ సభలు వినుతూఉన్నా తెరవెనుక ఒకమూల ఒదిగి ఉంటున్నది. ఆమె మా బసవరాజు అర్ధాంగి. ఒకనాడు [illegible] ఎంత కొత్తగా ఉంది! అతని గొంతులో బాగా నేర్పరితనం ఉండేది. అతడు కవితామూర్తి. "ఆమెచేత పాడించరాదా అని ఎవరో అంటున్నారా?" ఆమె వేదికమీద నలుగురితోనూ కలిసికూర్చుని అప్పారావుగారి గీతమనీ గేయాలుపాడి వినిపించవలసినవారే. కాని ఆమెనుచూచి నిర్విణ్ణుడనై అయిపోయి అడగలేకపోయాను. బసవరాజును క్షణం శాంతంగా భావించండి (క్షణం నిశ్శబ్దం.) కొన్నాళ్లక్రిందట ఇంకొకకవి గతించాడు. కవులు ఆవేశనుడిపడి జీవితము తగ్గించుకొంటున్నారు. ఈ ఆవేశనలతో వేగిపోయే సర్వజీవులము మహాకవులమార్గము చేస్తున్నాము. కొంపెల్ల జనార్దనరావు గతించాడు. ఉదయిని ఆగిపోయింది. ఇట్లా ఎందరెందరో పోతున్నారు.

అభిప్రాయాలలో భేదాలున్నా వ్యక్తులను మనము అభిమానించాలి. గుడిపాటి వెంకటచలం రాలేదు. నవ్య సాహిత్యానికి అతని రచనలు మంచిరూపాన్నిఇస్తవి. ఎవరెవరు ఏయే తీరుల ఏ సమస్యలనుగూర్చి వ్రాసినా మనము గ్రహించాలి. ఇట్లానే ఇంకొందరు రాలేదు. ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రి, జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి: అందరూ కలిస్తే ఆంధ్రదేశం అంతాకలిసి ఒక కావ్యమే అవుతుంది.

కొన్ని నాటికలూ, పద్యగుచ్ఛాలూ, విమర్శలూ చేర్చి పుస్తకాలుగా ప్రకటించాలి. సాహిత్యగతులను చర్చిస్తూ ఒక గ్రంథం వ్రాయాలి.

నేను అటు బరంపురం మొదలు ఇటు మద్రాసు, అనంతపురం హైదరాబాదు వరకూ సంచారం చేస్తూ నవ కవులందరి పద్యాలూ చదివి నవ్య సాహిత్య ప్రచారం చేస్తూ ఉండేవాణ్ణి. నా జుట్టు చూచీ, వేషం చూచీ జనం వచ్చి నన్ను వింటూ ఉండేవారు. కాకినాడలో విద్యార్థుల చేత వేషధారణము చేయించి నవ్య కావ్యాలు ప్రచారం చేయించేవాణ్ణి, సముచిత వేష విన్యాసముతో హంగులతో కవిత్వము ప్రచారము చేయాలి.

అట్టి ప్రచారం దేశమంతటా జరగాలి. అందుకొక ప్రచారకసంఘం తయారు కావాలి. విశ్వనాథ రామాయణంలో ఒక ఘట్టం చదివి వినిపించాడు. అది అందరికీ తెలిసిందా? ప్రతిపదమూ తెలియకపోయినా పరవాలేదు. అందులో ఉన్న మూలభావము తెలుసుకొని రసాస్వాదన చేయడానికి ముందు ఈ రీతి ప్రచారం కావాలి. ఇది నాకు నచ్చినపని. మళ్లీ వార్షిక సమావేశానికి ఈ ఉద్యమములో కొంతయినా సాఫల్యం ఉండాలి.

ఇదివరకు జరిగిన ఏ సభలకూ ఇంతమంది జనం రాలేదు. ఇక్కడివారు ఓరిమికలవారు, 'సహృదయులు' మీకు నమస్కారాలు. నిర్వాహకులీ ఉత్సవము చాలా బాగా జరిపారు. వారికి నా ధన్యవాదాలు, విస్సా అప్పారావు పంతులుగారు పెద్దలయినా కూడా ఈ యువబృందాన్ని అభిమానించారు. నాగభూషణంగారూ సోమంచి లింగయ్యగారూ ఇతర మిత్రులందరూ కూడా సాదరంగా సర్వవిధముల తోడ్పడి ప్రోత్సహించారు. ఇంతమంది స్త్రీలు సమావేశాలకీ ప్రదర్శనాలకూ వచ్చి ఉత్సవములో పాల్గొనడము ఎంతో సముచితముగానూ అందముగానూ ఉంది. సోదరీమణులకు నా వందనములు.

నాటిరాత్రి జరిగిన నాటకాంతముతో ఉత్సవము పరిసమాప్తి అయింది. అధ్యక్షుల ధన్యవాదాలతో ఉత్సవకార్యక్రమము పూర్తి అయింది.

[రచన ఒక విలేఖరిది.]

వార్షికోత్సవానికి వచ్చిన పరిషత్సభ్యులు

శ్రీ విస్సా అప్పారావు
,, దేవులపల్లి కృష్ణశాస్త్రి
 శాదిపత్రి రాఘవాచార్యులు
శ్రీమతి పద్మావతీదేవి
శ్రీ ముర్త్యాల కుమారరాజా
,, జయంతిపురం కుమారరాజా
,, చిదుమామిళ్ల శివరామకృష్ణ ప్రసాద్
,, కూర్మా వేణుగోపాలస్వామి
,, దావరి శ్రీమన్నారాయణచౌదరి
,, రాయప్రోలు సుబ్బారావు

శ్రీ మల్లాది విశ్వనాథకవిశర్మ
,, తల్లావజ్ఝుల శివశంకరశాస్త్రి
,, మొక్కపాటి నరసింహశాస్త్రి
,, కురుగంటి సీతారామయ్య
,, త్రిపురారిభట్ల వీరరాఘవస్వామి
 బెల్లంకొండ రాఘవరావు
,, గోగులపాటి వెంకయ్య
,, సోమయాజుల వెంకట రామమూర్తి
,, తమిడిపాటి కామేశ్వరరావు
,, వంగూరి సుబ్బారావు
, నోరి నరసింహశాస్త్రి

శ్రీ భావరాజు వెంకట కృష్ణారావు
,, మాధవపెద్ది బుచ్చి సుందరరామ శాస్త్రి
, అడివి బాపిరాజు
, కాటూరి వెంకటేశ్వరరావు
, విశ్వనాథ సత్యనారాయణ
, వ్యాపతి నారాయణమూర్తి
, వేదుల సత్యనారాయణశాస్త్రి
, మునిమాణిక్యం నరసింహారావు
, వాసిరెడ్డి వీరభద్రప్రసాద్
, ముష్టి లక్ష్మీనారాయణ

శ్రీ శ్రీనివాస శిరోమణి
,, పర్వతనేని వీరయ్యచౌదరి
,, మోటూరి వెంకటరావు
,, టేటుకూరి సత్యనారాయణరావు
,, కలగర నాగభూషణం చౌదరి
,, తోమంచి లింగయ్య
బొడ్డు బాపిరాజు
,, జమ్మలమడక మాధవరామశర్మ
,, వువ్వాడ శేషగిరిరావు
,, కందుకూరి రామభద్రరావు
,, శ్రీపాద గోపాలకృష్ణమూర్తి
,, కా. వెం. ల. న. శర్మ
,, జంధ్యాల పాపయ్యశాస్త్రి
,, వింజమూరి శివరామారావు
,, మల్లవరపు విశ్వేశ్వరరావు
,, పిలకా గణపతిశాస్త్రి
,, పా. వ.
,, వట్టికొండ రంగయ్య
, రాచకొండ నరసింహమూర్తి
, కంభంపాటి రామశాస్త్రి
, జనమంచి కామేశ్వరరావు

శ్రీ పాటిబండ మాధవశర్మ
,, తోట్ల కొండయ్య
,, శిష్లా ఉమామహేశ్వరరావు
,, రాయప్రోలు సుబ్రహ్మణ్యం
,, వావిలాల సోమయాజులు
,, చిట్టాప్రగడ సీతారామాంజనేయులు
,, రాచకొండ నరసింహమూర్తి
,, దేశిరాజు కృష్ణశర్మ
,, అనిశెట్టి సుబ్బారావు
,, ఏల్చూరి సుబ్రహ్మణ్యం
,, బెల్లంకొండ రామదాసు
,, బాలగంగాధర తిలక్
,, పోలూరి ఆంజనేయ ప్రసాద్
,, కుందుర్తి ఆంజనేయులు
,, సముద్రాల రామానుజాచారి
,, దండంరాజు శేషవరావు
,, కలవచర్ల నరసింహారావు
,, పైడిపాటి సుబ్బరాయశాస్త్రి
,, మొక్కపాటి కృష్ణమూర్తి
,, మహంకాళి భీమశంకరం
,, బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి

శ్రీ బి. వి. సింగరాచార్య
,, బి. వి. శ్రీనివాసాచార్య
,, కొవకళ్ల వెంకటరత్నం
,, పిలకా నరసింహమూర్తి
,, మాచిరాజు దేవీప్రసాద్
,, డాక్టరు రాంబాబు
,, విశ్వనాథ రామమూర్తి
,, ఎన్. ఏ. ఎస్. వెంకటాచార్యులు
,, సామవేదం జానకిరామశర్మ
,, పిల్లలమర్రి వేంకట హనుమంత
రావు
,, నందూరి కృష్ణమాచార్యులు
,, జంధ్యాల నారాయణమూర్తి
,, మల్లాది నరసింహశాస్త్రి
,, ఎస్. రాఘవశాస్త్రి
,, ఇంద్రకంటి వెంకట రమణమూర్తి
,, సవ్యాల వెంకట రంగనాధరావు
,, కస్తం కృష్ణప్రసాద్
,, జి. కోటయ్య
,, శంకర రామారావు
,, తెలికిచర్ల వెంకటరత్నం

ఆదాయవ్యయములు

[౧-౭-౧౯౪౨ నుంచి]

ఆదాయము - విరాళములు

శ్రీ శ్రీ శ్రీ జయపురం మహారాజావారు	-	౧౦౦-౦-౦
శ్రీ జయంతిపురం పమార్ జమీందారు వారు	-	౨౦-౦-౦
శ్రీ అవసరాల రంగారావుగారు	-	౧౦-౦-౦
శ్రీ తెలికిచర్ల వెంకటరత్నంగారు	-	౧౦-౦-౦
సభ్యులూ, చందాదారులూ చెల్లించిన చందాలు	-	౨౩౫-౦-౦
విడి పత్రికల అమ్మకమువల్ల	-	౨౦-౦-౦
		౩౯౫-౦-౦

వ్యయము

ఆంధ్ర గ్రంథాలయముద్రాశాలవారికి	-	౨౦౦-౦-౦
కాకితము	-	౧౭౧-౪-౦
తపాలా ఖర్చులు	-	౧౬-౧౨-౦
బైండింగు ఖర్చులు	-	౧౨-౦-౦
		౪౦౨-౦-౦

సంక్రాంతికీలలు

మంచుతెరల తెలిముసుంగులం గ్రొ
మ్మించు లల్లి సంక్రాంతికీలలో,
మంట వెలుంగుల మెల్లమెల్ల వె
న్నంటి యాడు నీడల లాస్యములో,

బ్రదు కానందప్రభయే, గానీ,
రదనదరస్మితహృదయహారిణీ!
యౌవనకుందమరందా! ప్రమదా!
నీ విక మరి రానేరవే గదా!

బాలబాలికల గళ కలకలమ్ము
లాలించిన పులుగుల పలుకులలో,
దాట బండిగంటల ఘోషములం
బండి మెరయు మువ్వల గలగలలో,

బ్రదుకు మ్రోయు వల్లకియే, గానీ,
యెదలోతుల బలికించిన తరుణీ!
నీ వెన్నటి కిక రానేరవు గద!
జీవనమే నిర్జీవము గాదా!

రంగురంగు చదరంగబలమ్ము హో
రంగులజగ మొక వెలుగు కలనుకో!
యెద మెలికల నిడి, విదళించిన నె
మ్మదివల పొక దాగిలి మూతనుకో!

యుగ యుగముల నామనియే, రావీ,
జగతి దివ్యఖేలనమే, గానీ,
నీవిక మరి రానేరావు గదా!
జీవనమో! మరివృథా! వృథా!!

అరుణచంద్రకాంతములు

ఇవియెవో తెలితెలి వెలుంగుల
నివురుగ్రమ్మిన సాంధ్యవేళా
దవజ్వాలాశేషితాంగా
రవిరళావళులో!

ఏయదృశ్య శరీరసుందర
తాయువతినీరవచరణమం
జీరవికసిత పద్మరాగాం
కూరజాలములో!

భూభరణ నమ్రాదిశేష మ
హాభుజంగమ లోలరసనా
జ్వాలవిరిసినే మౌళిమణిగణ
కీలలే యేమో!

ఈవిచిత్ర సుమప్రభ న్నా
లో వివిధమణి నిధులు మెరసెం
దూరవిద్యుత్తరళవర్ణ మ
యూర బర్హములై!

ఈ సుమారుణ వర్ణపుం ద్రా
క్షాసవమ్ముగ గ్రోలితి న్నె
నరుణసాగర మువల వెలుగుం
దరినరయు కాంక్షన్!

ఆవిధమ్మున నిల్చివన్నా
లోవినిశ్వాసమ్ములాగెః వి
లోచనద్వయి మెరసె నా సుమ
రోచిరుజ్జ్వలమై!

కలలో కేక

సంజనీరెండలో,
జాహ్నవా అలలలో,
నీడ లోడలలీల
నిండి జారెడువేళ !

ఓ మధూత్సవపథిక !
ఉదయారుణాంశుకా !
నీహారమణి నౌక
నోహో యనెడు కేక !

మఱచిపోయిన యెవరు
మెరపు గే లెత్తిరో !
భరమైన వేగు ని
ద్దుర కలువరింతయో !
నీలోకరంగు క
న్నీటులకు తళతళల్ !
లోలోదలంపుల పు
లుంగులకు రెపరెపల్ !

ఓమధూత్సవపథిక !
ఉదయారుణాంశుకా !
నీహారమణి నౌక
నోహోయనెడు కేక !

మరపు బంగారు లం
గరుశృంఖలలు కలగు !
తెరతెరల కలలలో
తేటిగంటలు మ్రోగు !
ఏనాటిరేయిదో !
యెడదపయనముగాథ !
వీణయై, కేలెదో
లోనగలచిన బాధ.

ఓ మధూత్సవపథిక !
ఉదయారుణాంశుకా !
నీహారమణినౌక
నోహో ! యనెడు కేక !
సంజనీరెండలో
జాహ్నవా అలలలో !
నీడ లోడలలీల,
నిండి జారెడువేళ !

పిలకా గణపతిశాస్త్రి

అన్న - చెల్లెలు

జనమంచి

౧

ఎన్నాళ్ళని నే
నటమటించి
నిను కన్నారంగా
గాంచగల్గితిని !

వినరండయ్యా
ఈ మా ప్రేమలు !
కనరండయ్యా
ప్రేమాకాశము !

ఎన్ని వియచ్చర
లెన్ని మణిప్రభ
లెంత విలాసము
విహాయసమ్మున !

వృక్షశిఖరములు
కిసలయాంగుళుల
వెన్నెలవీణియ
నెదనెద మీటెను

ప్రేమభాగ్యషా
స్మృతిన్మాలికలు
క్రావడివలె
పారాణిరచించెగా

౨

పాలీచెల్లీ
రావేచెల్లీ !
కదలియాడు నీ
అళినీలాలక
మెరసిమెరసి
ఎదవేగిరించెనే !
రావేచెల్లీ !
పాలీచెల్లీ !

నీరవవేణువు
ఊదే నిశలో
దెసవేపులకొల
వికసిత మవగా
ఎదలే పొంగుచు
నింగి కెగయగా
ఎంత రహస్సుధ
ఎంత వ్యధచ్యుతి
మనదోచెల్లీ !

రావేచెల్లీ!
పారీచెల్లీ!

3

ఎన్నియుగాలో
మిన్నకున్న యీ
కన్నవారిదౌ
వెన్నవంటిదౌ
అన్నచెల్లియల
ఆపేక్షలపై
ప్రల్లదములనే
ఆడిపోయునా
నింద లాడునా
పాడులోకము!

పాడులోకమే
కాలసర్పమై
పడగ విప్పుతూ
బుసలుకొట్టినా
వ్యధల జార్చకే
సుధలు జిమ్మదా,
ఈ ప్రేమను?

ద్రచ్చికొన్నయీ
ప్రేమపెన్నిధిగా
మ్రుచ్చలించగా
చేతు లాడునే!
విరిసిపోవు మా
హాసవాసనల్
ధూళిరేపినా
నభము నిండవే!

అన్నచెల్లియల
ఆపేక్షలపై
విన్నదనమునే
కూర్చనేర్చునా
వాదులాడునా
పాడులోకము?

4

అన్నయ్య పిల్చితే
అన్నయ్య పల్కితే
అర్ణవమె పొంగెత్తి
తరగకరముల చాచు,
అంబరమె ఆర్ద్రమై
సరసవృష్టుల జార్చు,
దుమ్ముదు మ్మౌ వసుధ
కమ్మతావుల నూర్చు

అన్నయ్య పిల్చితే
అన్నయ్య పల్కితే
అందరము ఒక్కపై
సంబరము వెల్లువై
సంతసము క్షీరమై
తెలివెల్లువలమిసిమి
పరచుకొను నిశియెల్ల.

అన్నయ్య పిల్చితే
అన్నయ్య పల్కితే

దూరాన రారాజు
గుడిసె వెల్లలువేయు,
చుక్కచుక్కా కలిసి
ఒక్క పేరుగ మారి,
చిట్టి చెల్లాయి కొక
మేలి సరమును కూర్చు.

ఎక్కడన్నయ్యవోయ్
దివినుండి దిగినావ!
దిగదిగి యీ జీర్ణ
కుటి నేల జొచ్చావు?

శబరి

తరుబాలలు ముద్దుంబువు విరుచాయల నద్దుచుండ నెంతేని మనో
హరమంబ! పారుటాకుల విరచిత మిది పసిడిరేకు విడుదులకంబళా

మరకతతృణవేదిక లేర్పరచితి కూర్చితి ప్రవాళపర్యంకమ్ముల్
చిరపరిచిత ప్రదేశమై సరిక్రొత్తం జూతు సారెసారె కిదేమో

గ్రువ్వంగా బదునట్లుగా కను కుదుర్కొన్నట్టు లే పువ్వు కా
పువ్వే తా నయి పుట్టివచ్చినటు లే పూదండ కాదండయే
అవ్వా! చిత్తము విస్మితంబగును నీ యావేగముం జూడగా
నెవ్వా రెంతటి పూజ్యపాదు లిటుగా నేతేరగా సుండిరో

అది యేమి ట్లరుదెంచుచున్నవి మనుష్యాకారంతం బూని యి
య్యుదయారుణ్యహిరణ్మయప్రభయు విద్యుల్లేఖయున్ నీలతో
యద మాహా! యిపు డెంతలో జెదరెజూ పవ్వా! యెటుల్ నిత్యస
త్యదయారాసులు లక్ష్మణానుగత సీతారామలోకేశులా

పరతెంచు త్రోవ చక్కంబరుపంగా లక్ష్మణుండు పలుకాడుచు నిన్
దరియుచునున్నా రదె నీ చిరకాలతపఃఫలములు సీతారాముల్

ఓ శబరి! వచ్చి రిరుగో ఫలాశను లభ్యాగతస్వయంవిష్ణువులై
దాశరథులు నీయెడల దయాశరధులు స్వగత మేల స్వాగతవేళన్

ఎదురు చని తోడుకొనితే వెదుటికి వారంతవారె యేతెంచిన నే
మిది కన్ను లప్పగించెదు ముదియవ్వా! యర్ఘ్యపాద్యములె కొనితేవా?

మాధవపెద్ది బుచ్చిసుందరరామశాస్త్రి

ఆంధ్రప్రభువులు

౧

శ్రీరమ్యోన్నత ధర్మరాజ్యవిలసత్ సింహాసనాసీనులున్
పారావారపరీత భూవలయ సంపద్యుక్తులున్, క్షత్త్రియుల్;
ఆరాజన్యుల శక్తి వైరినృప ఘోరారణ్య దావాగ్నియో!
ఆరాజేంద్రుల కీర్తి సజ్జన మనోహ్లాద ప్రదజ్యోత్స్నయో!

తెలుగున్ రేడులు, పద్మనాయక మహాదీవ్యత్ కులద్యోమణుల్,
కలనన్ నిల్చిన చాలు శాత్రవసతీ కంఠస్థమాంగల్య మా
లలు ఛిన్నమ్ములుగాగ నేలపయి రాలన్ బోలు; తత్ఖడ్గ ధా
రలు రక్తారుణకాంతిమంతములుగా రాజిల్లు సంధ్యార్చులన్

అక్షీణప్రతిభావిభాసితులు, స్వీయక్ష్మా ప్రజానీక సం
రక్షాదక్షులు, వైరివీరబలగర్వచ్ఛేదనుల్, భూధరా
ధ్యక్షాపత్యపదార్చనాపరులు, విద్యాగంధ సంవాసితుల్,
సుక్షత్రోజ్జ్వలితాంగు లాంధ్రవిపులక్షోణీమణీ నాయకుల్.

తెలుపౌ నంగరఖాలు, ఎర్రనికనుల్, తీరైనపాగాలు, బు
గ్గలమీసాలును, చేతబల్లెములు, సింగాలౌచు పైదూకుచో
బలవద్వైరులు చేతికత్తు లొసగన్, ప్రాయంపు సీమంతినుల్
వలపున్ గుండెల నిచ్చుచుందు రఖిలాంధ్రక్ష్మాతలేశాళికిన్.

౨

ఒకరాజునకు కంట నొరసెనా యెరు, పదే
పరరమావనికి దావదాహనమ్ము;
ఒకవెల్మదొర గొంతు హుంకరించిన, వైరి
రాజ్యాన ప్రళయ గర్జారవమ్ము;
ఒకరెడ్డి చేకత్తి యొరవీడెనా, రిపు
స్త్రీల మాంగల్య విచ్ఛేదనమ్ము;
ఒక కమ్మయీటె పోటుకు దూకెనా, శాత్ర
వాళికి కాళజిహ్వాంచలమ్ము;
ఒక్కకాపుచేతి తుపాకి యురిమెనేని,
అదె విరోధిసేనలపాలి కళనిపాత;
మొక్క విప్రమంత్రమొ తంత్రమో ఫలించె
నేని, అరుల కంతము సమీపించు టదియె.

అదిమాట యెన్నటిదొ! నే
డది నాయెదలోని కోర్కెయై, నిద్దురలో
బొదవిన కలయై కలచుచు,
కదలాడు తలంచినంత కన్నుల నీరై.

శివరామం

కవిత్వము : వైచిత్రి

పా. ప.

కవిత్వం మీద అనేకమంది అనేకమయిన అభిప్రాయాలు ఇచ్చారు. కాని ఇంతవరకూ ఇది ఉత్తమ కవిత్వం, ఇది రెండోరకం అని అనుమానంలేకుండా నిర్ధారణ చెయ్యడానికి తగిన సూత్రాలు ఎవ్వరూ ఇవ్వలేదు. నిర్ధారణ మాత్రం జరిగి తీరుతోంది—మెల్లమెల్లగా బుద్ధికి అందని విధంగానే నిర్ధారణ జరుగుతోంది. టాగూరు గొప్పకవి అని చాలామంది ఒప్పుకున్నా, ఎందుకు గొప్పవాడు? అనే ప్రశ్నకి ఎవరి సమాధానం వారిదే. దేవుడు ఉన్నాడు—లేడు అనే నమ్మకానికి ఎటువంటి కారణాలు మనిషి ఇవ్వగలడో అంతకి మించిన రుజువు కవిత్వాన్నిగురించి ఎవ్వరూ ఇవ్వలేరు.

రంగుగల ఒక వస్తువుద్వారా తప్ప రంగును ఇంకోవిధంగా స్పష్టంగా ఎవరూ వర్ణించలేరు. విలువ అనేది ఎత్తిచూపడానికి ఎవరికీ సాధ్యంకాదు—విలువ గల ఒక వస్తువును ప్రదర్శిస్తే తప్ప, అన్నాడు డాక్టరు రిచర్డ్సు. అందుచేత చివరికి విలువ అనేది ఎవరిమట్టుకు వారు వారి వారి తరహాని బట్టి నిర్ణయించుకో వలసిందే. కాని ఈ విలువను గురించిన సూత్రాలవంటివి ఎప్పటికప్పుడు కవులు, విమర్శకులు, చెపుతూనే ఉన్నారు. కవిత్వంలోని మహాగుణం 'అద్వైతం' అన్నాడు టాగూరు. 'రసం' అన్నారు కొందరు పెద్దలు. 'ధ్వని' అన్నారు మరికొందరు. 'ప్రశాంతమయిన మనస్థితిలో జ్ఞప్తికి తెచ్చుకున్న ఉద్వేగం' అన్నాడు వర్డ్సువర్తు. 'సంగీతం లాంటి ఊహ' అన్నాడు ఇంకో పెద్ద. ఇవన్నీ చెప్పిన తరువాత ఇవన్నీ మళ్లీ కవిత్వమంత గంభీరంగానూ, అగమ్యంగానూ ఉన్నాయి కాని ఆ యా కాలాల్లో ఈసూత్రాలు కొత్త అర్థంతో నిండుగా అగుపడి ఉంటాయి. లేకపోతే ఆ యా రచయితలు ఉత్త పేలవమయిన నీతి వాక్యాలు అంత సన్నిహితమయిన ఉత్సాహంతో చెప్పి ఉండలేరు. ఇవన్నీ ఆ యా కాలాల్లో అభిరుచి ఏర్పడ్డానికి ఎంతో ఉపకరించి ఉంటాయి. ఇవన్నీ నిజానికి కొంత చేరువలోనే ఉండితీరతాయి. వీటిని నిరూపించడానికి ఆ యా రచయితలు చేసిన సమాలోచన మాత్రం చాలా ముఖ్యమయినది. ఈసూత్రాలు తాత్కాలిక ప్రయోజనం ఒకటి నెరవేర్చిన తరువాత 'దేవుడు', 'సత్యం', 'శివం', 'సుందరం', 'బ్రహ్మపదార్థం' లాగ పాతపడిపోతున్నాయి. స్పష్టంగా ఏ అర్థాన్నీ ఉద్దేశించకుండా ఉత్త ఊతపదాల్లాగ 'రసం', 'ధ్వని' మొదలయిన పదాలు విమర్శకులు కొంతమంది వాడుతున్నారు.

కాలం యొక్క అభిరుచితో పరిచయం ఉన్న ప్రతి వ్యక్తీ, ఆనాటి కవిత్వాన్ని కొలుచుకోడం మొదలు పెడతాడు. ఒక పద్యం అతనికి నచ్చిందంటే అందులో 'రసమో' 'అద్వైతమో' ఏదో ఉందని రుజువు చెయ్యబోతాడు. నచ్చక పోతే అగుణాలేవో లేవని నిరూపించడానికి పూనుకుంటాడు. కాని ఈ

నిరూపణ 'రెండూ రెండూ నాలుగు' అన్నంత స్పష్టంగా ఎప్పుడూ ఉండదు. అట్టే కారణం వెతుక్కోనక్కరలేదు. ఈ పరీక్ష అసలు పద్యం నచ్చడమో వెగటు పుట్టించడమో జరిగిన తరవాత మరీ మొదలు పెడుతుంది. తాను ఉండా లనుకున్న 'రస'మో 'అద్వైత'మో ఉండడంవల్లనో లేకపోవడంవల్లనో, తనకి నచ్చిందనీ నచ్చలేదనీ అనుకుంటాడు. ఎంతో వైశాల్యం కలిగిన సూత్రాలను ప్రతిపాదించిన పెద్దలే వాటితో కవిత్వాన్ని పరీక్షచేసేటప్పుడు పెద్దపొరబాట్లు చేశారు. ఇంక ఆ సూత్రాలను చేతపుచ్చుకున్న రెండోతరహావాళ్ళు ఎంతెంత పొరబాట్లు చెయ్యగలరో ఊహించుకోవచ్చును.

షేక్స్పియర్ కేవలం కొన్ని బాహ్యసత్యాలు మాత్రము గుర్తించాడనీ, అతనికి మనిషియొక్క సూక్ష్మ చిత్తవృత్తులు తప్ప అన్నింటికీ కేంద్రమయిన తాత్త్విక సూత్రం తెలియదనీ టాగూరు మహాకవి ఒక చోట అన్నాడు. షేక్స్పియర్ మాత్రం తన కవిత్వంలో అద్వైత వేదాంతాన్ని స్పష్టీకరించలేదు. కాని ఒక ఉదాహరణ. మోహాన్ని ఒక వస్తువుగా తీసుకున్న ఒక సానెట్. (నం. 129.)

The expense of spirit in a waste of shame
Is lust in action; and till action lust
Is perjured, murdrous, bloody, full of blame
Savage, extreme, rude emel, not to trust;
Enjoy'd no sooner but despised straight;
Past reason hunted, and no sooner had,
Past reason hated, as a swallow'd bait,
On purpose laid to make the taker mad;
Mad in pursuit and in possession so;
Had, having, and in quest to have extreme;
A bliss in proof, and proved, a very woe;
Before, a joy proposed; behind, a dream.
All this the world well knows; yet none knows well
To shun the heaven that leads men to this Hell.

సానెట్ మొదటిభాగంలో అంతా మోహం యొక్క అర్థంకాని భయానకమయిన చిత్రం—మోహం అంటే చైతన్యాన్ని లజ్జాకరంగా వ్యయం చెయ్యడం, అది ఘోరమయినది, దోషభూయిష్ఠమయినది. ఘాతుకమయినది, క్రూరమయినది, దొరికిందాకా సౌఖ్యమనే వల, దొరికిన తరవాత ఒక కల. ప్రయత్నంలోనూ పొందడంలోనూ, అనంతరం కూడా అంతులేని వేగం—ఇంతవరకూ ఏ చిన్నకవి అయినా వ్రాయగలడు. షేక్స్పియర్ ఆఖరిని గాని లేడు. "ఇదంతా లోకానికి బాగానే తెలుసునుగాని,

బాగా తెలియదు—మనిషిని నరకానికి ఈడ్చుకుపోయే ఈ స్వర్గాన్నుంచి తప్పించుకోడం." ఈ తుది రెండు పాదాలలో ఎన్ని సూచనలు ఇమిడి యున్నాయో చూద్దాం. లోకానికి బాగానే తెలుసును కాని బాగా తెలియదు— అసలే తెలియదని ధ్వని. ఎంత గట్టిగా దూషించినా మోహం మోహమే, నరకానికి ఈడ్చుకుపోయే స్వర్గం. ఇందులో మనం స్థూలప్రాయంగా అర్థం చేసుకునే ప్రేమకీ మోహానికీ మధ్యనున్న బాంధవ్యం సున్నితంగా సూచించాడు కవి. టాగూరు కూడా మోహాన్ని గురించి కొన్ని గీతాలు వ్రాశాడు, అతడు మోహాన్ని వడబోసి అందులోనుంచి ప్రేమ అనే అద్వైత తత్త్వం ఎత్తి చూపించాడు. షేక్స్పియర్ మాత్రం భౌతిక శరీరాన్ని ఆప్యాయంగా అదుముకుంటాడు. కాని అతనికి ప్రేమ అనే స్వర్గం తెలయదని ఎవరు అనగలరు? స్వర్గం అనే ముక్క నరకం పక్కని అంత ధైర్యంగా ఎల్లా ప్రయోగించ గలిగాడు? మోహం యొక్క లోతులు ముట్టిన సాహసంతో సానెట్ మొదటి భాగంలో ఉద్రేకం అంత కంతకి పొంగుతుంది— అందులో ఒక దూషణ, ఒక చనువుతో కూడిన మందలింపు, కాని చివరికి ఆ ఉద్రేకాన్ని మించిన ఒక తెలివి ఒక స్థాయీ భావం. ఇందులో ప్రేమ వేదాంతపరంగా నిర్ధారణ కాకపోవచ్చు. సూచనగా ఉండి తీరింది. అవ్యక్తమయినది అవ్యక్తంగా మాత్రమే ఉండి పోయింది. కాని అంత కంటే ఒక అడుగు ఇది ముందుకి పోతుంది. తెలుసు ననుకున్నది ఇంకా తెలిసింది. ప్రేమ వచ్చి దేహాన్ని మాయం చెయ్యలేదు. మోహం దేహానికి దగ్గరగా నిలబడి తనపరిమితి అనంతంగా పెంచుకుంది. ప్రేమయొక్క సూచన పూర్తిచేస్తో.

కాని టాగూరు మహాకవి అసంతృప్తి ఒక విషయం స్పష్టంగా సూచిస్తుంది. స్వభావంచేత మనం కొన్నిటివేపు ఎక్కువగా ఆకర్షించ బడతాం. మన అభిమానాలనిబట్టి సౌందర్యం, సత్యం, అద్వైతం, రసం, వీటికి హద్దులు ఏర్పడిపోతాయి. టాగూరు మహాకవి కవితావస్తువులకి కొన్ని హద్దులు ఏర్పరచుకున్నాడు. బాహ్య సౌందర్యానికి ఎక్కువ సన్నిహితంగా ఉండేటంతవరకే ఆయన సౌందర్యం ఒప్పుకుంటాడు. కవిత్వం ఆ వస్తువుల వాతావరణాన్ని దాటి పోకూడదని ఒక నియమం పెడతాడు. ఆయన 'personality' లో వ్యక్తీకరించిన గౌరవం కొన్ని వస్తువులే పొందగలుగుతాయని ఆయన విశ్వాసం. ఆయనకు ఇష్టంలేని వస్తువులు కూడా ఆ గౌరవాన్ని పొందడం ఆయనకు నచ్చదు. ఇక్కడ ఒక ఉదాహరణ ఇస్తాను.

DONKEY*

When fishes flew, and forests walked,
And figs grew upon the thorn,

* G. K. Chesterton.

Some moments when the moon was blood
Then surely I was born.

With monstrous head and sickening cry
And ears like errant wings,
The Devil's walking parody
On all fourfooted things,

The tattered outlaw of the earth,
Of ancient crooked will;
Starve, scourge, deride me; I am dumb,
I keep my secret still.

Fools ! For I also had my hour ;
One far fierce hour and sweet ;
There was a shout about my ears
And palms before my feet.

పద్యం ఎత్తుగడలో ఒక ఎగతాళి, భావనాతీవ్రత కలిశాయి. చివరికి I am dumb, I keep my secret still అనేటప్పటికి గాడిద కొన్నింతలు పెరిగింది. still అనే పదానికి రెండు ధ్వను లున్నాయి. (1) కొట్టండి తిట్టండి, నా రహస్యాన్ని 'ఇంకా,' దాచుకొని తీరతాను. (2) మీకు మాత్రం నా రహస్యం దొరక్కుండా 'అణిచిపెట్టి' ఉంచుకుంటాను. ఒక దానికంటే ఒకటి గాడిదలోని అస్పష్టమయిన గాంభీర్యాన్ని—దాని పుట్టుకనీ, అది భూమి మీద ఉండడానికి గల హక్కునీ, అనుమానం లేనంతిగా దృఢపరుస్తున్నాయి. Fools! For I also had my hour; తో మొదలుపెట్టిన నాలుగో పాదం, బాహ్యసౌందర్యంమీద ఎగతాళిని, One far fierce hour and sweet అనడంలో జీవితాన్ని అనుభవించగల శక్తి ఒక సుందరమయిన వస్తువులదే కాదని నిలబడి చెప్పే సాహసాన్ని ఇముడ్చుకుంది. వికృతంగా ఉన్నాయని అసహ్యించుకోబడే అనేకవస్తువులలో పైకి రాకుండా ఉండే గాంభీర్యం, ఆ వస్తువుల అంతరంగం, అందులోని వింత సౌందర్యం, బలంగా, తప్పనిసరిగా వస్తున్నాయి. ఈ గాడిద కేవలం గాడిద కాదు. లోకంలో అసహ్యించుకోబడే వస్తువులకు ఒక చిహ్నము. వాటి తరఫున ఆత్మ విశ్వాసంతో మాట్లాడింది గాడిద. ఈ పద్యం చదివాక గాడిద కవితా వస్తువు కాదని ఎవరు అనగలరు ?

టాగూరు సామాన్యం (Universal) స్పష్టంగా చూడగలడు. ప్రత్యేకం అంటే (individual) ఆయనకు కొంత వ్యతిరేకభావం. అందుకే ఆయన పాత్రలు కొన్ని ఊహాలుగా, సూత్రాలుగా ఉండిపోతారు. మాలిని, చిత్రాంగద, వీరి ఊహాలు. క్లియోపాత్రా ఒకవ్యక్తి. ఆమె నేలమీద నడుస్తుంది. సామాన్యం

స్పష్టంగా కనపడని చోట ఆయనకు అసంతృప్తి. కాని ఆయన పరిశీలిస్తే క్లియోపాత్రాలో చిత్రాంగద ఉంది, స్పష్టంగా ఉంది. చిత్రాంగద ఒక ఊహ గనక అర్జునుణ్ణి వశపరచుకోడానికి మన్మథ వసంతుల దగ్గర చమత్కారాలు ఎరువు తెచ్చుకోగలిగింది. కాని క్లియోపాత్రా తన మూలస్వభావంలోంచే ఎరువు తెచ్చుకోవలసి వచ్చింది—భూమిమీద మనిషి గనక క్లియోపాత్రా నడవడి వట్టి మోసం కాదు—ఒక ముఖ్యమయిన స్త్రీ చిత్తవృత్తి; చిత్రాంగద కూడా అంతే.

టాగూరు స్వభావంలో ఇంకో మెలి కూడా ఉంది. ఆయన స్వభావం ఉద్వేగపూరిత మయినది. ఐంద్రియత మీద (Sensuousness) భౌతిక శరీరపు సన్నిహిత సౌందర్యంమ్మీద, అది పురికొల్పే కోరికల మీద ఆయనకు ఎంతో వ్యామోహం ఉంది. కాని ఇవన్నీ దాటి నిలవవలసిన అవసరం ఆయన గుర్తించుకున్నాడు. Sharps and Flats లోని కొన్ని గీతాల ఐంద్రియత లారెన్సుకి కూడా సిగ్గు తెప్పిస్తుంది. ఒక అపాయంలో పడిపోకుండా ఆయనను రక్షించింది ఆయన తపన. ఆయన బలవంతంగా సామాన్యం మీద దృష్టిని కేంద్రీకరించుకున్నాడు. అప్పుడుగాని ప్రత్యేకం ఆయనకి లొంగుబాటు కాలేదు.

అనేకరకాల స్వభావాలతో భేదించిఉన్న జన సామాన్యంలో అస్పష్టమయిన ఒక సూత్రాన్ని ఒకే మాదిరిగా అర్థం చేసుకోడం జరగదు. ఇంక కవిత్వాన్ని పరీక్ష చేసేటప్పుడు, ఆ సూత్రాలను ఉపయోగించడంలో అసలు పోలికే ఉండదు.

తెలుగు దేశంలో కొత్త కవిత్వాన్ని పరీక్షిస్తే సున్నితంగా చెప్పడమే భావకవిత్వం యొక్క విశిష్ట గుణంలా కనపడుతుంది. ఇంతవరకూ నేను విన్న ఉపన్యాసాల్లోనూ, చదివిన వ్యాసాలలోనూ, ఆదర్శ కవిత్వానికి ఇవ్వబడ్డ ఉదాహరణలు కూడా ఈ హద్దుల్లోకే పడతాయి. భావ కవిత్వం అనే మాట నిర్వచించడంలో కొంచెం ఇంచుమించుగా ఆంగ్లభాషలోని lyrical Poetry తో దాన్ని సరిపెట్టడం జరిగింది. ఇది ఒకవిధంగా సరి యయిన నిర్వచనమే అని నే ననుకుంటున్నాను. మన దేశంలో కొత్తగా బయలుదేరిన అభిరుచులను బట్టి కొన్ని హద్దులు చటుకుని ఏర్పడి పోయాయి— lyrical అంటే భావనాయుతమైన, అంటే సున్నితమయిన. గడిచిన రెండు మూడు దశలలో బయలుదేరిన కవిత్వం ఈ హద్దుల్లోనే పడుతుంది. కాని పెద్దలు lyrical అని లెక్క కట్టిన రెండు పాదాలు ఉదాహరిస్తాను.*

For where is she, so fair, whose unear'd womb
Disdains the tillage of thy husbandry?

ఇందులో కావలిస్తే భావన ఉంది. కాని సున్నితం! ఇందులో భావచిత్రణ మన రహస్య స్వభావంలోకి తొంగి చూస్తుంది. ఎంత బట్టబయలుగా అయినా ఎంత సాహసంగా చెప్పాడు! ఈ పాదాలలో

* Shakespear's Sonnet no. 3 లో పాదాలు.

ఒకసాహసమే కాదు. సృష్టి పొందట్లోకి తరిమాడుమనని, unear'd, tillage అనేమాటలలో. ఇది ఐంద్రియమూ, గంభీరమూ కూడా ఒక్కసారిగా అవుతోంది. "ఎవరా అహల్య!— ఎంత అందమయినదయితే మాత్రం— నీమగతనపు దుక్కికి ఇష్టపడనిది?" కాని 'అహల్య'తో తక్కిన మాటలలోని అశ్లీలం తొలిగిపోయింది. అశ్లీలం ఒక క్షమార్పణగానూ రాలేదు, ఉత్త సాహసంకోసమూ రాలేదు. రాక తప్పక వచ్చింది. ధైర్యంగా వచ్చింది.

అయినా తెలుగు కవిత్వంలో ఈ సున్నితం తనపని నెరవేర్చి తీరింది. అంతవరకూ తెలుగుకవిత్వం ఎఱగని మార్దవం ఒక జీవంగా కవులలో పెరిగింది. తెలుగుకవిత్వం అంతా పూలతోటలు, పూలవలపులు, పూలబాలికలు, తేనెసోనలు, పుప్పొడితిన్నెలు, 'వెన్నెల యెదచలించు పిలుపులు' వీటితో నిండిపోయింది. ఆ రోజుల్లో వీటి 'నవ్యత' ధగధగ మెరిసింది.

కాని 'నవ్యత' అనేమాట దూషితమయి పోయింది. దాని అర్థానికి హద్దులు మాయ మయిపోయాయి.. 'నవ్యము' అంటే కొత్తది, వింతగా కనపడేది, ఈ వేళ వ్రాసినది, కొత్తపద్ధతిలో వ్రాసినది - ఇల్లా అనేక ధ్వనులు ఉన్నాయి.

ఒక పద్యం చదివేటప్పుడు ఎక్కడో ఒకచోట మనం చటుకుని ఆగుతాం. పద్యంలో ఏదో మనని ఆకర్షిస్తుంది. ఒక కిటికీ తెరుచుకున్నట్టు అందులోనించి చూస్తే చాలా దూరంవరకూ ఆవరించుకున్న ఒక దృశ్యం కంటికి ఆనుతున్న భ్రమ కలుగుతుంది. పద్య మన్నప్పుడు నాలుగు పాదాలమొత్తం కాదు నా ఉద్దేశం. ఒక ఖండకావ్యం. కాని 'కావ్యం' 'ఖండకావ్యం' అనే మాటలకంటె నాకు పద్యం అనే మాట ఎక్కువ సుకరంగా, సులువుగా అగుపిస్తుంది. ఉదాహరణకి ఇందాకటి 'మోహం' మీద సానెట్ తీసుకుంటాను.

All this the world well knows, yet none knows well— సానెట్ చదువుతో ఉంటే 'well knows, knows well' దగ్గర అతి విచిత్రంగా తట్టుతుంది. అంతరార్థాలు మనకి ఒక్క మాటుగా గ్రహింపుకి అందకపోయినా, ఇదొక కిటికీ, ఇందులోనించి తొంగి చూస్తే పద్యం అంతా కొత్త రంగుతో కనబడుతుంది, ఇంతవరకూ చెప్పనిదేదో చటుకుని చెప్పివేశాడు కవి అనిపిస్తుంది. తరవాత ఇంక మనం ఊహించుకుంటాం. "ఈ ప్రపంచం. దీనికి కొంత తెలుసును. కాని పూర్తిగా తెలియదు— అసలు ఏం తెలియాలో అదే తెలియదేమో. అయినా తెలుసును. తెలుసును. ఇంత సంఘనీతి ఇంత నాగరకత ప్రపంచ మేగా సృష్టించుకుంటా? మోహంలో పడిపోయిన మనిషి అతివల్ల చెడిపోతాడు. అయినా చెడిపోనూ చెడిపోడు. చెడిపోయినా ఎంతో గ్రహిస్తాడు. అల్లా 'చెడిపోయిన' మనిషిని చూస్తే మనకి సరదా వెయ్యదూ!"...... ఇల్లా ఊహలు అంతు లేకుండా అల్లుకుపోతాయి. కాని ఇదంతా well knows, knows well లోకి కుదించబడి ఉంది. మోహం ఒక్కసారిగా ప్రపంచమంత

పెద్దదిగా అంత క్లిష్టమయినదిగా గంభీరంగా కనబడుతుంది. అంతా well knows, knows well లో ఉంది. ఈ గుణాన్నే నేను వైచిత్రి అంటాను. 'ఎందుకు?' అని ప్రశ్నిస్తే ఒకటే సమాధానం— నా కింకో మాట దొరకలేదు. మాటకి ఉండే అర్థానికి ఎన్నో ఛాయలు ఉంటాయి. ఒక్కొక్క యుగంలో ఛాయ రూఢమయి పోతుంది. 'రసం,' 'అద్వైతం,' 'నవ్యత,' 'ధ్వని' ఈ మాటలు నాకు గడిచిపోయిన యుగాల మాటలుగా అగుపిస్తాయి. వీటి అర్థాలు అనేక ఛాయలమీద అనేకమంది పండితులు వాడి తీశారు. అంచేత వాటిని ఉపయోగిస్తే నేను చెప్పదలుచుకున్నది చెప్పలేకపోతాను. ఇవన్నీ గొప్ప మాటలని అనండి. కాని నాకు మట్టుకు వీటి గొప్పతనం టాజ్ మహల్ గొప్పతనం వంటిది— అతి గంభీరమయిన గొప్పతనం, అరోచకమయిన గొప్పతనం, నా మట్టుకు నాకు నిరర్థకమయినది.

ఒక పద్యంలో 'రసం' 'సత్యం' 'సౌందర్యం' ఉన్నాయని, లేవని నేను నిర్ధారణగా రుజువు చెయ్యలేను. వర్ణించగలను అంతే. అయితే నావర్ణన ఇంకో పద్యమయిపోతుంది. అందుకని నేను ఇంకో వైపు నించి పరీక్ష చేస్తాను. ఈపద్యంలో 'సత్యం' ఉందా? లేదా? అనే ప్రశ్న నాకు అగమ్యగోచరం. అంతకంటే సులభమయినదీ—అయినా అంత సులభమయినదీ కాదు—నిరాడంబర మయినదీ, ఎవరి మట్టుకు వారు సమాధానం చెప్పుకో గలిగిందీ ఒకటే ప్రశ్న ఉంది. ఈ పద్యం నాకు నచ్చిందా? లేదా? ఇందాకటి ప్రశ్న వేసేవాళ్లు కూడా అజ్ఞంగా ఈ ప్రశ్నే వేసుకుంటారని నా నమ్మకం. తరవాత ప్రశ్నలు: ఎక్కడ నచ్చింది? ఎందుకు? ఈ ప్రశ్నలకి సమాధానం దొరికితే అక్కడే ఉంటుంది వైచిత్రి.

ఈ సందర్భంలో డా॥ రిచర్డ్సు చేసిన మనస్తత్వ పరీక్ష కొంత ఉపయోగపడుతుంది. అసలు మన చైతన్యంలో కదలిక ఇంద్రియాలద్వారా కలుగుతుంది. ఒక వస్తువును గూర్చిన అనుభవం, దృష్టి, శ్రవణం, స్పర్శ మొదలయిన కొన్ని ఉపకరణాలద్వారా బుద్ధికి చేరుతుంది. ఈ చేరేటప్పుడు గాని, చేరినతరువాత గాని ఆ స్పర్శవల్ల మన స్వభావంలో కొన్ని చిత్తవృత్తులు * (Impulses) కదులుతాయి. ఈ చిత్తవృత్తులలోనించి కొన్ని తహతహలు ♦ (Appetencies) పుడతాయి. ఈ తహతహలు మళ్ళీ ఇంద్రియాలద్వారా వ్యక్తం కావలసి వచ్చినప్పుడు అసలు చిత్తవృత్తులకు ఆధారమయిన 'మూలవస్తువును పోలిన శబ్దాలు' తయారవుతాయి. ఈ అగాధంలోకి ఒక స్పర్శమునిగి మళ్లీ పైకి తేలిరావడంవల్ల దాని నుంచి పుట్టేశబ్దానికి అసలు వస్తువును మనస్సుకి గోచరం చెయ్యగల శక్తి వస్తుంది. అసలు భాషలూ ఇల్లాగే పుట్టాయి, కవిత్వమూ దాని పరిభాషా కూడా ఇల్లాగే పుట్టాయి.

ఈచిత్తవృత్తులలో కొన్ని ముఖ్యమయినవీ, కొన్ని రెండో రకంవీ అని డా॥ రిచర్డ్సు విభేదంచేసి,

---

* ఇంగ్లీషులోని పారిభాషిక పదాలకి నాకు తోచిన తెలుగుమాటలు వేరుకున్నాను.

♦ ఇంతకంటే సరియయిన మాటలు ఎవరన్నా ఇవ్వగలిగితే చాలా సంతోషం.

విలువ అనేదాన్ని నిర్వచిస్తాడు. ఈ చిత్తవృత్తులు రేగినప్పుడు కొన్నిటికి—మూలవస్తువును బట్టీ, మనిషి తత్వాన్ని బట్టీ, విశేషమయిన తీక్ష్ణత, కొన్నిటికి విఘాతం కలుగుతుంది. కొంతసేపటికి ఇవన్నీ స్థిరపడి ఒక స్థాయీభావం ఏర్పడుతుంది. ఆ స్థాయీభావం వల్ల ముఖ్య చిత్తవృత్తులకు విఘాతం కలిగితే అది అనారోగ్య కరమయిన అనుభవం అనీ, వాటికి తీక్ష్ణత కలిగితే విలువయిన అనుభవం అనీ అతడు అంటాడు. కాని ఈ చిత్తవృత్తులలో ముఖ్యమయినవీ కానివీ అనే పరీక్ష ఎల్లాగ? ఈసూత్రం ద్వారా విలువ అనే దాన్ని సాధారణ నీతికుండే హద్దుల్లోనించి తొలిగించగలిగాడు తప్ప, అతడు అనుకున్నంత స్పష్టంగా నిర్వచనం జరగలేదు. ఇంతవరకు వచ్చేసరికి మళ్లీ రసము, ధ్వని, అద్వైత మతం— వీటంత అగమ్యంగానూ ఈ పరీక్ష అయిపోతుంది. చివరికి ఈ పరీక్ష కూడా అభిరుచిమీదే ఆధారపడుతుంది.

కాని ఇంతకంటే ముఖ్యమయిన సూచన ఒకటి అతడు ఇచ్చాడు. పద్యంద్వారా, ఆ పద్యానికి ప్రేరేపణ కలిగించిన మనస్థితిని విమర్శకుడు గ్రహించినప్పుడు తప్పు సరి అయిన సమాలోచన జరగదు. అతడు ఉపయోగించిన మాట Relevant Mental state. చిత్తవృత్తుల కదలిక స్థాయీ భావంగా మారిన తర్వాత దానికి సమాంతరంగా మనస్సు కూడా, తక్కిన ఇంద్రియాలతోపాటు, ఒక స్థితిని పొందుతుంది. పద్యంద్వారా కొద్ది ప్రయత్నంతో ఆ మనస్థితిని గ్రహించ వచ్చునని అతని ఉద్దేశం. మామూలుగా కవి అనుభవాన్ని సానుభూతితో గ్రహించాలి అనేదానికి అర్థం ఇదే. ఒక ఉదాహరణ ద్వారా నా అర్థం స్పష్టం అవుతుంది. *

వనులలో వనధి నిధ్వనులలో నాలోని
అణువణువులో నీ సుధాలాపనమె నేడు.

ఈపద్యంలో విలువ సంగతి అల్లా అట్టే పెట్టి ఇది ఎన్నిరకాల విమర్శలకి చోటిస్తుందో ఊహించుకుంటే అసలు చిక్కు వ్యక్తమవుతుంది. సున్నితంగా పదాలు ఉపయోగించాడు కవి, కనక ఈ పద్యం చాలా సున్నితంగా ఉంది అని కొందరు అంటారు. కొందరు 'అణువణువులో' అనే మాటమీద ఒత్తి, ఇది ఉద్రేక పూరిత మయిన ప్రేమ అనవచ్చును. సున్నిత మయిన కవిత్వం మీద విసుగు చెందినవాళ్ళు ఇది చాలా చచ్చుగా ఉంది; వీనులు, ధ్వనులు, సుధాలాపనమూ విని విని వెగటు పుడుతోంది అనవచ్చు. మనిషి నైజాన్ని బట్టి 'ఇంత గొప్ప కవిత్వం లేదు' మొదలుకుని, 'ఇంతకంటే పేలవమయిన కవిత్వం ఇంక ఉండదు' అన్నంతవరకూ అనేకాభిప్రాయాలకు చోటుంది. కాని ఇందులో ఏదీకూడా పద్యానికి అనువయిన మనస్థితిని సూచించదు.

ఈపద్యం కవి వ్రాసేటప్పుడు, తక్కిన ఇంద్రియాలకంటే చెవి ఎక్కువ శ్రద్ధగా ఉంది. వనులకూ, వనధి నిధ్వనులకూ, అణు వణువుకీ రూపసామ్యం ఏమీలేదు. మనస్సుకూడా వెనకబడే ఉంది. ఒక్క చెవి

* మల్లవరపు విశ్వేశ్వరరావు గారి 'కల్యాణకింకిణి' లోనుంచి

మాత్రం శ్రద్ధగా శబ్దాన్నించి శబ్దానికి పాకి వెడుతోంది. నడకతో కూడా విరివిగా సాగే నకారం దీనికి తార్కాణం.

వనులలో వనధి నిధ్వనులలో నాలోని
అణు వణువులో—

ఇంతవరకూ కవి ఇంకా దేన్నో వెతుక్కుంటూనే ఉన్నాడు. మాటనించి మాటకి దృష్టి మారేటప్పుడు కూడా వీటి అన్నిటిలోనూ ఉన్నదేదో ఇంకా నిర్ణయం కాలేదు. ఆ నిర్ణయం చివరికి చెవి— లేక చెవి వెనుక చెవి అనండి— పూర్తి చేస్తోంది. 'నీ సుధాలాపనమె' అనేటప్పటికి వెనకబడిన మనస్సు మళ్లీ ముందుకి దూకింది. కానీ 'న' కారం ఈ సుధాలాపనాన్ని తప్పనిసరిగా చేసేసింది కూడాను. అయితే కవి వెతుక్కునేది సుధాలాపనమే కాదు. ఆ వెతుక్కోడం వనులలో, వనధి నిస్వనులలో వగైరాల లోనూ కాదు. చెవియొక్క పరిభాషలో అసలు దొరకవలసిన దానికి సామీప్యం సుధాలాపనం, వెతుక్కునే చోట్లకి సామీప్యాలు తక్కిన వనులు - వగైరా. ఇంక దొరకవలసింది వేరే ఏమీ లేదు కూడాను. కవి సంతృప్తి పడ్డాడు. సుధాలాపనంతో వృత్తం పూర్తి అయింది. చెప్పవలసింది ఇంకేమీ లేదు. ఈ వెతుక్కోడం దాని సాఫల్యం, ఇదే అనువయిన మనస్థితి; (Relevant mental state) అంటాను నేను. ఇది నిర్ణయించుకున్న తరవాత కవి చిలిపిగా చెప్పనియ్యండి, తెలివిగా చెప్పనియ్యండి, నాకు అతనియందున్న సానుభూతి అతన్ని రక్షిస్తుంది. అప్పుడు పరిభాషలో లోపాలు గాని గుణాలు గాని ఇంకో రంగుతో కనిపిస్తాయి. ఆడంబరంగా ఉన్నా, అతిగా ఉన్నా, చివరికి పేలవంగా ఉన్నా, ఉగ్రతనాన్ని నేను ఎల్లా మన్నిస్తానో, గౌరవిస్తానో అల్లాగే కవిని మన్నిస్తాను, గౌరవిస్తాను. కాని ఆ దృష్టిలో పద్యాలన్నీ గొప్పవై పోతాయని అనుకో నక్కరలేదు. వ్యక్తులలో మనం ఉగ్రతనాన్నీ, ప్రౌఢతనీ, గాంభీర్యాన్నీ విభేదించి చూస్తాం. దేన్నీ గాని ఖండించం. వీటిలో పరస్పరం విలువలో ఉండే అంతరాన్ని కూడా నిర్ణయించుకుంటూనే ఉంటాం. అల్లాగే కవిత్వంలోనూ పద్యానికి అనువయిన మనస్థితి గ్రహించబడిన తరవాత, పద్యం యొక్క విలువ దానంతట అదే హృదయంలో పూర్తి అవుతుంది.

మనిషికి సహజంగా మార్పు కిట్టదు. కవికీ చదువరికీ మధ్య పండితుడిది చాలా ఒడుదుడుకయిన స్థానం. పాత పద్ధతులకు భిన్నంగా ఏదన్నా రచన బయలుదేరితే పండితుల మనస్సుల్లో వెంటనే అపనమ్మకం, అనుమానం పుడతాయి. పండితుడు సాధారణంగా కొత్త పద్ధతిని దూషిస్తాడు. ముఖ్యమయిన కారణం కొత్త రచనలలో వైచిత్రి శాస్త్రంయొక్క హద్దుల్లోకి పడదు. పాత 'అలంకారశాస్త్రం' పనిచెయ్యదు. వెంటనే కంగారు పడతాడు. ఈ కొత్త రచయిత తనని మోసపుచ్చడానికో, గమ్మత్తు చెయ్యడానికో పూనుకున్నట్టు చిరాకుపడతాడు. ఇది 'భావకవుల' మీద పాతరకపు పండితులు చూపిన ద్వేషానికే కాదు, ఇప్పుడు 'అహంభావ కవులు' (అతివాస్తవికకవులు) అనుకునే వారి యెడల భావకవులు చూపు

తున్న రోషానికి కూడా వర్తిస్తుంది. కొత్త కవిత్వం వేళాకోళపు కవిత్వమని రుజావు చెయ్యగలిగితే దూషణే అనవసరం. ప్రతి యుగంలోనూ కొన్ని కుర్రతనపు రచనలు వచ్చినట్టుగానే, ఈనాడు కూడా కొంత కుర్రతనం ఇల్లా దారితీసింది అనే ధోరణిలో, ఆ 'కుర్రవాళ్ల' ప్రయత్నాల యెడల పెద్దతనపు హుందా చూపించడం అసలు ఆరోగ్యకరమయిన పద్ధతి. కాని ఈర్ష్యతో కూడిన దూషణ మన చిరాకునే సూచించి అసలు పద్యంలోని మంచి చెడ్డలు అల్లాగే వదలి వేస్తుంది.

ఒక చిత్రమయిన పద్యం. *

కాకికేమి తెలుసు సైకోఅనాలసిస్
ఆటవెలది ద్విపద కర్తగారు
5, 3, 2, ఆముక్తమాల్యద
విశ్వదాభిరామ వినుర వేమ

మొదటి పాదంలో కాకికి, సైకోఅనాలిసిస్‌తో అతి ఆడంబరమైన ప్రాసమైత్రి, రెండు మూడు పాదాలలో అతి సున్నితంగా పడిన ఆకార యతిమైత్రి, వీటికి విరుగుడుగా ఆఖరుని మనకి చాలా అలవాటయిన కొర్ర మొర్ర పాదం. ఆఖరిపాదంలో యతి అసహజంగా కుదిరింది. మొత్తంమీద పద్యానికి అర్థంలేదు. దీన్ని చదివి కుర్రకారు చాలా హుషారు పొందుతారు ఎవరిమీదో కసితీర్చుకున్న సంతృప్తి వారికి దొరుకుతుంది కాని దీన్ని చూసి ముఖం చెండుకునే పెద్దలు పాతకవుల్లోనూ, కొత్తకవుల్లోను కూడా ఉంటారు 'మేక మెక మేక తోక తోక తోక మేక' పద్యాన్ని సరదాగా ఆనందించే పండితులు కూడా ఈపద్యాన్ని చూసి కోప్పడతారు. కారణం ఇదొక నవకవి వ్రాసింది. సైకో అనాలిసిస్ అన్నమాట, 5, 3, 2 అక్షరాలతో రాయకుండా అంకెలు వెయ్యడం, ఆముక్తమాల్యదపేరు ఎత్తడం, ఇవి పండితుల్ని గాభరా చెయ్యడానికి పన్నిన ఎత్తు అని అనుమానం ఒకటి పుడుతుంది 'మేక మెక మేక' పద్యానికి అర్థం ఉందని అనేవారున్నారు. వారికి ఇందులోనూ అర్థం దొరక్కపోదు—అంత అర్థమే కావలిస్తే. కాని ఇందులో అర్థం అంత ముఖ్యమయినది కాదు. ఈపద్యాన్ని రక్షించేది ఏమంటే దీనికి ఒక అనువయిన మానసిక స్థితి స్పష్టంగా ఉంది. సైకో అనాలిసిస్ కాకికి తెలియదు; ఆటవెలది ద్విపద కర్తగారు—అంటే రెండూ ఒకే జాతికి చెందుతాయి, ఆముక్తమాల్యద 5, 3, 2. ఈ 5, 3, 2 ఒకటి సూచిస్తుంది—గణితం. లెక్కలు చేసినట్టుగా గణాల్లో అక్షరాలు నింపి వ్రాయబడింది అనే స్ఫుటమయిన అర్థం తీయక్కరలేదుగాని, ఆముక్తమాల్యద అంటే 5, 3, 2 అన్నదాంట్లో వెక్కిరింపు స్పష్టంగా కనబడుతుంది. ఈ 5, 3, 2 తోనే ఆటవెలది, ద్విపద, చివరికి ఛందస్సు అంతా అంకెల్లాగ గడ్డకట్టిపోయింది. పద్యం అర్థం ఏమీ లేకపోయినా చాలా గంభీరంగా నడిచింది. ఇంకోలాగ చెపుతాను : పద్యం ఎంత గంభీరంగా నడిచినా అర్థంలేదు. గంభీరంగా నడిచినా అర్థంలేని కవిత్వం

* కవి శ్రీ శ్రీ.

మీద ఎగతాళి కవియొక్క మనస్థితి. ఉత్త వేళాకోళపు పద్యం రాయాలని ప్రయత్నించినా ఇంత అందంగా రాయగలవాళ్లు ఎంతో మంది ఉండరు. కవి మాత్రం స్పష్టంగా ఏఅర్థమూ ఉద్దేశించ లేదు. ఒక ఆకస్మికతతో కూడిన వైచిత్రి ఈ పద్యానికి అందం. ఉద్దేశం ఏదన్నా ఉంటే కవిలో కూడా అజ్ఞంగానే ఉంది.

పద్యం అన దగిన ప్రతి పద్యానికీ, ఒక ముఖ్యమయిన గుణం ఉంటుంది, కవికంటే భిన్నమయిన ఒక ప్రాణం ఒక వ్యక్తిత్వం. లారా రైడింగ్, రాబర్ట్ గ్రేవ్స్ రాసిన 'A survey of Modernist Poetry' లో ఈ భావాన్ని చాలా బాగా చెప్పారు. మనిషి శిశువుని పుట్టించినట్టుగానే కవి పద్యాన్ని సృష్టిస్తాడు. శిశువుకి ఓ ప్రత్యేక జీవం ఉండడంవల్ల తలిదండ్రులకు అది కొంతవరకే చెందుతుంది. దాని విశిష్టతవల్ల తలిదండ్రులకంటే భిన్నమయిన గౌరవాన్ని, వ్యక్తిత్వాన్ని శిశువు పొందుతుంది. అల్లాగే పద్యం కూడాను. అది కవి యొక్క అవ్యక్తజ్ఞత (subconscious) లో జన్మించిన ఒక శిశువు వంటిది. జీవం ఉండడంవల్ల అది లోకంలో పెరుగుతూనే ఉంటుంది. కవి వ్యక్తిత్వంతో దానికి పోలిక ఏమన్నా ఉంటే తలిదండ్రులకూ, శిశువుకీ ఉండే పోలిక వంటిదే ఉంటుంది. ఆ వ్యక్తిత్వం యొక్క విశిష్టతని బట్టే పద్యానికి విలువ ఏర్పడుతుంది.

పై కాకి పద్యానికి ఈ వ్యక్తిత్వం కొంత ఉంది. అట్టే కాలం బతకదని అనండి, కాని శిశువు మాత్రం అవును. చిరకాలం బతికే పద్యం రాయాలని కవి పూనుకోలేదు. అతని పూనికకు తగిన ప్రతిఫలమే ఈ పద్యం. ఈవేళ ఈ శిశువు చచ్చిపోయినా కవికి బాధలేదు. ఇంతా చేసి నే చెప్పే దేమంటే సరదా అయిన పద్యాన్ని సరదాగానే చదివి ఆనందించే ఆరోగ్యం విమర్శకుడికి అవసర మని. ఒకే కొలతతో పద్యాలు కొలవడం మొదలు పెడితే, కొన్నిటికి కాళ్ళు, కొన్నిటికి తలలూ ఎగిరిపోయి వికలాంగాలు మిగులుతాయి. అసలు పద్యానికి కాళ్ళూ, తలా ఉన్నాయో లేవో, ఉంటే ఎక్కడ ఉన్నాయో గుర్తించవలసిన బాధ్యత విమర్శకుడిది.

కవిత్వాన్ని గురించిన సూత్రీకరణాలలో రూఢిగా చెప్పిన దేమీ లేకపోయినా ఆ సూత్రాలను ప్రతిపాదించడానికి జరిగిన సమాలోచనలు చాలా ముఖ్యమయినవి. అన్ని సూత్రాలూ ఒక ముఖ్య విషయంలో ఏకీభవిస్తాయి. కవిత్వానికి లౌకికమయిన ముఖ్యోద్దేశం ఏదీ ఉండదు— ఒక్క కవిత్వమే తప్ప సృష్టిలో ప్రతివస్తువూ ఒక వాతావరణం మధ్య ఉంటుంది. లౌకిక* జీవితంలో ఆ వాతావరణాన్ని బట్టి వాటి యెడల అనురాగమూ అసహ్యమూ కలుగుతూ ఉంటాయి. కవిత్వంలో ఆవస్తువుకీ, వాతావరణానికీ మధ్యనున్న అవక్రుతులు తొలగిపోతాయి. బాహ్యేంద్రియాలకు గోచరమయ్యే సత్యం లౌకిక జీవితంలో నడవడికి మూలంగా ఉపయోగపడుతుంది. ఒకపాము కనబడితే మనకి తెలియకుండానే భయమూ,

* Pragmatic అనే ఆంగ్ల పదానికి పర్యాయపదంగా ఈమాట ఉపయోగించాను.

దూరంగా నిలబడాలనే కోరికా చటుకుని పుడతాయి. కాని కవిత్వంలో పామూ, దాని వాతావరణమూ భయం కలిగించవు. లౌకిక జీవితంలో మన భయమూ, అపాయశంకా, కేవల వ్యక్తిపరమయిన ఉద్రేకాలు. వీటిమధ్య మనలో పాముకి న్యాయం జరిగే భావం పుట్టదు. కాని పాము గనక ఒక పాములవాడి దగ్గర ఉన్నట్టయితే, దాని ఆట కొంత నిష్పాక్షికంగా చూడగలుగుతాం. అప్పటి ఉద్రేకం అప్పుడే ఒక స్థాయి లౌకిక వాతావరణాన్నించి తొలగిపోయింది. మనని కరవగలిగిన పాము కంటే ఈ పాములో కొన్ని సత్యాల ఛాయలు ఎక్కువగా మనం గ్రహించ గలుగుతున్నాం. కవితా వాతావరణంలో పాముకీ, దాని వాతావరణానికీ, మనకీ మధ్యనున్న అపశ్రుతులు తొలగిపోయి ఒక స్థాయీభావం ఏర్పడుతుంది. కవి భావనలో వస్తువులకూ, వాతావరణానికీ వైవిధ్యంలేని దృష్టి కేంద్రం ఒకటి దొరుకుతుంది. Plato, Aristotle వీరి కాలంలో కళని నిర్వచించడం కోసం, Mimesis, katharsis అనే రెండు మాటలు ఉపయోగించారు. Mimesis అంటే అనుకరణం, ఈమాటనించే Mimicry అనే ఆంగ్లపదం పుట్టినది. Katharsis అంటే పరిశుభ్రం చెయ్యడం, అసలు ఈమాట వైద్యశాస్త్ర పరిభాషలోది. ఈ రెండుమాటలూ కళను నిర్వచించడంలో ఏ అర్థంలో మొదట ఉపయోగించారో చెప్పడం కష్టం ప్రొ॥ హుమయూన్ కబీర్ ఈమాటలను నిర్వచించడంలో విలువయిన అంతరార్థాలను సూచించాడు. కళ ప్రకృతికి అనుకరణం అన్నసూత్రం కొంతవరకే నిజం. ప్రకృతిలోని లౌకికవాతావరణం అంతా కవిత్వంలోకి రాదు. ఆ వాతావరణంలోని వస్తువులను సంయోగించే తత్వానికి, ప్రతిబింబం మాత్రమే కవిత్వంలోకి వస్తుంది. అంచేత ప్రకృతి కంతకీ కాకుండా అందులోని సంయోగ సూత్రానికి మాత్రము కవిత్వం అనుకరణం. అంటే సృష్టిలో మన బుద్ధికి తెలియకుండా జరిగే అనంతమయిన సంయోగానికి అనుకరణ మయిన సంయోగం కవిత్వం. ఈ అర్థంలోనే కవిత్వం 'సృష్టి' కూడాను. "కళలో mimesis, ప్రతి వస్తువునూ, ఆ వాతావరణంలోని ప్రతి ఇతరవస్తువుతోటి సంయోగించే దృష్టి నైశిత్యమే." (హుమయూన్ కబీర్) ఇంతవరకూ వెంచేసరికి ఈ భావం టాగూరుగారి అద్వైత సూత్రానికి చేరువయి పోతోంది. katharsis అంటే ఈ mimesis వల్ల తప్పని సరిగా జరిగే శుద్ధి, అనవసరతత్వాలను కడిగివేసి స్వచ్ఛమయినపదార్థాన్ని వేరుచెయ్యడం ఈరెండూ ఒకదానిలోఒకటి కలిసి ఉంటాయి. ఈ సూత్రం ఏదో ఒక విధంగా అన్ని మతాలవాళ్ళూ చెప్పినదే. కాని నాకు ప్రస్తుతమయిన విషయం కవిత్వంయొక్క బాహ్యస్వరూపం. ఈ సంయోగంవల్ల, వస్తుప్రపంచంలో కొత్తకొత్తగా, విలువలూ, సత్యాలూ, చటుకుని దొరుకుతూ ఉంటాయి. ఆ కనుక్కోడంలో ఉండే ఆకస్మికతనుబట్టి ఆనందానుభవంలో ఒక తీక్ష్ణత వస్తుంది. ఆ ఆకస్మికతను కూడా కవి పద్యంలోకి దించి తీరతాడు. అప్పుడు పద్యరూపంలో పుట్టే వింతే వైచిత్రి. పదానికి రెండుపక్కలున్నాయి. ఒకటి ఆంగిక స్పర్శ (sensory feeling) రెండవది అర్థ విస్తీర్ణత. ఛందస్సు ఎక్కువగా ఆంగిక స్పర్శకు చెందినది, అలంకారం అర్థవిస్తీర్ణతకు చెందినది. కాని ఛందస్సుకి అర్థ స్పర్శ, అలంకారానికి ఆంగిక స్పర్శ

అసలే లేకుండా ఉండవు. కవిత్వానికి ఉంటాయని చెప్పే అనేక గుణాలు, ఈ పైరెండు గుణాల యొక్క రకరకాల కలయికలవల్ల ఏర్పడతాయి. ఈ రకరకాల కలయికలవల్ల వచ్చే ఒకానొక కొత్తదనమే వైచిత్రి. పద్యాన్ని మనకి పరిచయం చేసేదీ, చనువు చేసేదీ కూడా ఈ వైచిత్రి. పద్యంలోని 'రసం' గాని 'అద్వైతం' గాని మనకి తెలియకుండానే కేవలం పద్యాన్ని పద్యంకోసమే జ్ఞాపకంఉంచుకోడం సాధారణంగా జరుగుతుంది. పెద్ద బుద్ధినైశిత్యం గలవారికి కూడా అర్థంకాని ఆకర్షణ ఒక్కొక్కప్పుడు పద్యాలు ఇముడ్చుకుంటాయి. ఇలియట్ అన్నాడు : "నేను తలవంచి దాసోహం చేసిన కవిత్వంలో కొంతభాగం నాకు మొదట్లో ఏమీ అర్థంకాలేదని నాకు తెలుసును; కొంతభాగం ఇప్పటికయినా నా కర్థమయిందని నేను చెప్పలేను; ఉదాహరణకి షేక్స్పియర్." ఏ పద్యానికా పద్యమే ఒకవ్యక్తి, ఒక వ్యక్తిలోని ఆంతరంగిక సత్యం, సౌందర్యం, అతని మూల రహస్యం మనకి దొరక్కపోయినా అతన్ని వ్యక్తిగానే గౌరవిస్తాం. మనం చెయ్యగలిగింది ఒక్కటే. అతని బాహ్య స్వరూపంలోని విశిష్టత—మనని ఆకర్షించిన ఒకానొక విశిష్టత—గుర్తించగలుగుతాం. స్వరూపం అంటే అతని బాహ్య చైతన్యాన్ని ఇముడ్చుకున్న మొత్తం—అతని అలవాట్లు, మాటలధోరణి, వైలక్షణ్యాలు అన్నీ కలిసిన మొత్తం. పద్యానికి కూడా ఇటువంటి విశిష్టత ఉండితీరుతుంది. ఆ విశిష్టతవల్లనే దాని వ్యక్తిత్వం మనం గ్రహించే సావకాశం కూడా ఏర్పడుతుంది.

వైచిత్రి పద్యం యొక్క వ్యక్తిత్వానికి బాహ్యంగా ఉండే చిహ్నం. ఎంత నిరాడంబరంగా ఉన్నా, చమత్కారం ఏమీ లేకపోయినా ప్రాణంఉన్న మనిషిలో ఏదో ఒక ఆకర్షణ ఎల్లా ఉంటుందో పద్యానికి కూడా వైచిత్రి అల్లాగే ఉంటుంది. ఈ పోలిక ఇంకా కొంతదూరం తీసుకుపోవచ్చును. బాహ్యంగా వైచిత్రి ఎక్కువగా ఉంటే ఎక్కువ సులువుగా ఆకర్షిస్తుంది పద్యం—చమత్కారమయిన వ్యక్తిలాగే. నిరాడంబరంగా ఉన్నపద్యం సజీవ మయినదయినా తొందరగా ప్రజాదృష్టిని ఆకర్షించలేదు. చివరకి శాశ్వతమయిన నిర్ణయం కాలం ఒక్కటే చెయ్యగలుగుతుంది. పద్యంతో చనువు ఏర్పడినకొద్దీ బాహ్య రూపం హరించిపోయి లోపలి జీవంతో సఖ్యం ఏర్పడుతుంది. కాని పద్యం అసలు బతకాలంటే వైచిత్రి అందులో ఉండి తీరాలి. ఇది గుర్తించే ప్రయత్నమే విమర్శ

నాకు చాలా చిన్నతనంనించీ జ్ఞాపకం ఉన్న పద్యం*

తతనితంబాభోగ ధవళాంశుకములోని యంగదట్టపు కావిరంగువలన
శశికాంతమణిపీఠి జాజువారగ కాయ లుత్తుంగ కుచపాళి నత్తమిల్ల

* అల్లసాని పెద్దన, మనుచరిత్రలోనిది.

తరుణాంగుళీధూత తంత్రీస్వనంబుతో జిలిబిలి పాట ముద్దులు నటింప
ఆలాపగతి జొక్కి యరమోడ్పు గనుదోయి రతిపారవశ్య విభ్రమము దెలుప

మొదటి పాదాలు నా జ్ఞప్తిలో తరవాత పూర్తి అయాయి. కాని నాకు మొదటినించీ నోట్లో-ఆడే పాదం 'ఆలాపగతి జొక్కి......' అన్నది. ఈ పాదాన్ని ఇప్పుడిప్పుడు విమర్శించుకోగా నాకు తోచిన విశేషం: నేను పాడుకునే టప్పుడు ప్రతి ఇంద్ర గణంలోనూ ఆఖరి లఘువుకి ముందున్న గురువు— ఈ పాదంలో ఇంద్రగణా లన్నీ ఆయిదు మాత్రల పరిమితి గలవి— ఎంతో దీర్ఘంగా పాడుకోవా అనిపిస్తుంది. అందులో 'రతి పా...ర' లో 'పా' అంతులేనంత పొడుగ్గా అగుపిస్తుంది. అంటే పాడుకునే టప్పుడు ఈ పాదం కేవలం సీసపద్య పాదమే కానంతగా పెరిగిపోగల స్వేచ్ఛను ఇముడ్చుకుంది. ఇక్కడ గణాల నిర్బంధాన్ని మించిన స్వేచ్ఛ ఛందస్సులో కవి తీసుకో గలిగాడు. అయినా పాదానికి రాగయుక్తమయిన కొలత ఉంది. రాగ తాళాల కలయిక అయిన సంగీతాన్ని, ఆ సంగీతానికి కారణమయిన 'ఇంపుదలుకొత్త వీణ వాయింపు చిన్న' వరూధినినీ బొమ్మ గీసినట్టు చూపించగల వైచిత్రి బాహ్యంగా ఇంద్ర గణాల కూర్పులో ఉంది. వరూధినినీ, సంగీతాన్నీ నేను గుర్తించుకోలేకపోయినా, రాగంయొక్క స్వేచ్ఛనూ, తాళంయొక్క గతినీ ఇముడ్చుకున్న ఈపాదాన్ని అర్థంచేసుకోకుండానే ఎన్నోసార్లు చదువుకున్నాను.

పై స్వేచ్ఛ నడకకి అనువయిన ఛందస్సు నిర్మించుకోడంవల్ల కూడా వస్తుంది.

తూగాడు తరంగాల
ఊగాడు రాగమాల
ఏగాలి మర్మరాల రేగెనో ?
ఏ దూర తీరాల మ్రోగెనో ? *

నడకతో తప్పనిసరిగా సాగాలంటే ఈపద్య భాగాన్ని ఇల్లా పెంచుకోవాలి.

తూ—ఉ గాడు తరంగాల
ఊ—ఉ గాడు రాగమాల
ఏ—ఎ గాలి మర్మరాల రేగెనో ?
ఏ—ఎ దూర తీ—ఇ రాల మ్రోగెనో ?

* మల్లవరపు విశ్వేశ్వర్రావుగారి 'ప్రశ్న' అనే పద్యంలోనించి.

ఊ - ఉ గాదు, ఊ - ఉ గాదు, ఒక ఊపు ఊగి తరంగాలనూ అంతకంటె కొంచెం అస్పష్టంగా రాగమాలనూ సజీవమయిన కదలికలో చూపిస్తున్నాయి. నాలుగో పాదంలో 'ఏ-ఎ' దూరాన్ని ఇంకా పెంచి 'ప్రశ్న'కి సమాధానం రావలసిన అవసరం లేని మనస్థితిలోకి మన్ని తీసుకుపోతోంది. అప్పుడు ప్రశ్నే సమాధానం. ప్రాస స్థానంలో సరళమయిన గ-కారం మాటుపడిపోయి అస్పష్టమయిన స్వాప్నిక వాతావరణానికి దగ్గరగా పద్యాన్ని తీసుకుపోతోంది.

పైరెండు ఉదాహరణలలోనూ వైచిత్రి కేవలం బాహ్యంగానూ లేదు. కాని మొదటి దృష్టికి దొరకనంత లోతుగానూ లేదు. కాలం యొక్క అభిరుచి వైచిత్రిని చాలవరకు దృఢపరుస్తుంది. గడిచిన యుగాలలో మనిషికీ— కళయందు అభిరుచి ఉన్న మనిషికీ— కవికీ, కొంత విశ్రాంతి, హడావిడి లేకుండా జీవించగలిగిన అవకాశం దొరికేవి. ఆ రోజుల్లో కళకి ఒక ఔచిత్యం, జీవితపు పరిభాషకు కొంత దూరంగా ఉండే ఊహాలు, అలంకారాలు ఏర్పడ్డాయి. గొప్ప కవులంతా కళని జీవితాన్నించే గ్రహించినా, వస్తువులకు కొంత నగిషీపని చేసి 'ఔచిత్యా'నికి సరిపెట్టేవారు. కళలో వైచిత్రి అప్పుడు కొన్ని హద్దుల్లో ఉండేది. వైచిత్రికి కూడా పరిభాష ఏర్పడింది. మామూలు దేశ్య పదాలు కవిత్వంలో ఉపయోగించాలనే కోరిక ఈ యుగారంభంలో, అభిరుచిలో ఒక భాగంగా తెలుగు దేశంలో పుట్టింది. ఆ వాడుకపదాల చుట్టూ ఉన్న వాతావరణం చాలవరకు తొలిగిస్తేనే గాని అది 'కవితా పరిభాష' కాలేకపోయేది. ఈ వాతావరణం తొలగించే ప్రయత్నంలో ఒక నీరసమయిన రాగ ప్రదర్శన (sentimentalism) పైకి తేలిపోతూవచ్చింది. శిరీషం అంటే ఏమిటో తెలియని కవులు చాలా మంది ఈ పదాన్ని మెత్తదనానికి ఉపమానంగా వాడుతున్నారు. కాని శిరీషం 'కవితాపరిభాష' లోది. ఆ మాటచుట్టూ ఒకవాతావరణం ఉంది. అది నిజంగా కవి అనుభవానికి చెందకపోయినా, ఆమాట మనం ఒప్పుకోవచ్చును. దానికి వ్యతిరేకంగా మనం ఒకటే చెప్పవచ్చును—పద్యంలో వైచిత్రికి ఆమాట తోడు పడడంలేదని. కాని లౌకిక వాతావరణంలోని ఒకమాట ఆ వాతావరణానికి చెందని ఒకసందర్భంలో ప్రయోగించినందువల్ల ఒక అపోహ కలుగుతుంది.

అసలు కవిత్వంలోనే వస్తువులు వాటిచుట్టూఉన్న లౌకిక వాతావరణాన్ని కొంతవరకూ తొలగించుకుంటాయి. అప్పుడు గాని వాటికి తీక్ష్ణత, నైర్మల్యమూ పట్టవు— ఇందాకటి 'గాడిద' పద్యంలో గాడిదలాగ. కాని ఆ లౌకిక వాతావరణానికి ప్రతిబింబం కవితా వాతావరణంలో ఉండి తీరుతుంది. అక్కడ కూడా మళ్ళీ గాడిద గాడిదే, హంసగాని ఆవుగాని కాదు. చాకలివాడు, బట్టలమోత గాడిదకు లౌకిక వాతావరణం. కవితా వాతావరణంలో వీటి ప్రతిబింబాలు when fishes flew and forests walked, Some moments when the moon was blood, Devil's walking Parody on all fourfooted things, tattered outlaw of the earth మొదలైనవి. ఇవి అనుమానం లేనంతగా గాడిదను గాడిదగానే చూపిస్తాయి. ఇంక రెండు వస్తువులను ఒకదాని కొకటి పోలికగా ఉపయోగించి

నప్పుడు వాటి వాతావరణాల ప్రతిబింబాలు దృష్టి ఆనేటంతవరకూ ఒకదాన్ని ఒకటి పూర్తిచేస్తూ ఉండాలి. ఒక పదాన్ని పదార్థ వాతావరణం నించి కొంత వరకే తొలగించ గలుగుతాం. దానికి ఇంకో పదాన్ని పోలికగా వాడినప్పుడు ఈ రెండు పదాల వాతావరణాలలోనూ సన్నిహితమయిన కలయిక ఏదో అది ఒత్తి చెప్పాలి. కాని ఆ కలయిక మొదటి పదాన్ని, పదార్థాన్ని ఎంతో విశాలంగా పెంచి నప్పుడు తప్ప ఆ పోలిక నిరుపయోగ మయిపోతుంది. లౌకిక వాతావరణాలు రెంటికీ బలమయిన, ఉద్వేగంవల్ల పోషింపగలిగిన పోలిక ఉంటేనే ఇది సాధ్య మవుతుంది.

దేశ్యపదాలు పద్యాలలో వాడే కుతూహలానికి ఒక ఉదాహరణ. వేగిక్షేత్రము* అనే పద్యంలోనించి ఒక పాదం—

వేగిరాజ్యపు పల్లెవీధుల చెడుగుళ్ళ రిపుల గవ్వించు నేరుపులు తెలిసి—

ఈ పాదాన్ని పరీక్షచేసేముందు దీని వెనక సీసం పూర్తిగా ఉదాహరిస్తాను.

ఈ నా పదార్పితక్షోణి నేరాజు ధర్మాసనంబుండి స్మృత్యర్థ మనెనొ,
ఈ నా దృగావృతంబైన భూములలోన నే శౌర్యధనులు శిక్షింపబడిరొ,
ఈ నా శరీరమం దివతళించిన గాలి ఎంత పౌరాతన్య మేచుకొనెనొ
ఈ నా తనూపూర్ణమైన యాకాశమ్ము నే క్రతుధ్వనులు శబ్దించినవియొ
అస్మదజ్ఞాతపూర్వ దివ్యత్వ మొప్పు - నీ పునీతావనీఖండ మిచట నిలిచి
యస్వతంత్రత దొరలు నా యాంధ్రశక్తి - నన్ను గంపింపజేయుచున్నది భృశమ్ము.

ఈ పద్యంలోని గౌరవం, దివ్యమయిన చైతన్యం తరవాత పద్యంలో చప్పబడి పోయాయి. ఉద్వేగం యొక్క ఊపువల్ల సీసపద్యపాదాలు నడక తెలియనంత గంభీరంగా నడిచాయి. గణాలు ఎక్కడ విరుగుతున్నారో, యతి స్థానాలు ఎక్కడో తెలియ నవసరంలేని జిగి ఒకటి పద్యంలోకి వచ్చింది. స్మృత్యర్థ మనడం, శౌర్యధనులు శిక్షింపబడడం, పౌరాతన్య మేచుకోడం, తనూ పూర్ణమయిన ఆకాశం, ఇవన్నీ అస్మదజ్ఞాత పూర్వ దివ్యత్వంలో గొప్పగా కలిసిపోయాయి. కాని ఇక్కడ 'అస్వతంత్రతదొరలు నా యాంధ్రశక్తి'ని గురించి ఎత్తవలసిన అవసరంలేదు. ఆఖరి గీతపాదాలు పద్యాన్ని కొంత కిందికి ఈడ్చాయి. అజ్ఞాత పూర్వ దివ్యత్వంలో అంతా ఉంది—ఇంకా ఉంది. అసలు మనకి పూర్వ దివ్యత్వం అజ్ఞాతమే కూడాను. ఇప్పటి స్థితిలో ఆ దివ్యత్వాన్ని తలుచుకొని విచారించడం సాధారణమయిన రాగ ప్రదర్శన (Sentiment).

ఇంక ఇందాకటి పద్యపాదం తీసుకుంటాను.

వేగిరాజ్యపు పల్లెవీధుల చెడుగుళ్ళ రిపుల గవ్వించు నేరుపులు తెలిసి

* కవి విశ్వనాథ సత్యనారాయణ గారు.

ఇక్కడ చెడుగుడు కవిత్వీకరించడం చుట్టూ ఉండే వాతావరణానికీ, యుద్ధాలలో శత్రువులను తరిమి వేసే వాతావరణానికీ కొంత అంతరం ఉంది. చెడుగుడు ఒక ఆట మాత్రమే. యుద్ధం కూడా ఒక ఆట అనే వారితో నేను ఒప్పుకోను. చెడుగుడులో నెగ్గడం తప్ప చివరికి ఆశించే ఫలితం ఏమీ లేదు. యుద్ధంలో నెగ్గిన తరవాత వచ్చే ఫలితాలూ, సమస్యలూ చాలా ఉన్నాయి. ఆనాటి వీరులకు యుద్ధం చెడుగుడు వంటిది అనేది ఒప్పుకోవచ్చును. కాని కవి దృష్టినించి యుద్ధం ఆటమాత్రమే కాదు. యుద్ధంలో ఉద్భవించే ఉత్తేజాలు, వాటి పరస్పర సంఘర్షణ, వాటికి చెడుగుడు చాలా నీరసమయిన పోలిక. అసలు ఆ యుగంలోనూ, ఆనాటి జాతిలోనే ఆ 'నేరుపులు' ఇమిడి ఉంటాయి. చెడుగుడులోనించి ఆనాటి యువకులు నేర్చుకునే దానికంటే ఆ యువకుల దగ్గర చెడుగుడే ఆ మెళుకువలు నేర్చుకొని ఉంటుంది. కాని ఒక దశలో ఇవన్నీ అద్భుతమయిన పద్యాలుగా మనం స్వీకరించాం. అప్పటి దేశంలోని మనః ప్రవృత్తిని కొంత పరీక్షచేస్తే ఇందుకు సమాధానం మనకి దొరక్కపోదు. మనం పుట్టిన తరవాత గాని అంతకుముందు మన తాత తండ్రులు బతికిన రోజుల్లో గాని, మనం చెడుగుడుని మించిన వీరావేశంతో కూడిన సంఘర్షణ చూసి ఉండం. అంతకంటె తీవ్రమయిన పల్లెటూరి దెబ్బలాటలూ, రక్తపాతాలూ మనం ఒకవేళ చూసివున్నా వాటిలో ఏదో నైచ్యత మనకి కళ్ళకి కట్టినట్టు కనబడుతుంది. కేవలమూ అపేక్షలేని వీరావేశం ఒక్క చెడుగుడులోనే మనకి తెలుసును. కొన్ని శతాబ్దాలు మనోదాస్యంలో చిక్కుపడిపోయిన జాతికి అంతకంటె సన్నిహితమయిన ఉపమానాలు దొరకవు. ఆ సీసంలో చివరిదాకా ఉపయోగించబడిన దేశ్యపదాలు అన్నిటిని గురించీ ఇదే చెప్పాలి. అన్నిటికంటే వింత అయినది "తెల్గు తల్లులు మున్ను శౌర్యరస మెండిచి యుగ్గుబాలతో రంగరించి బొడ్డుకోయని కూనకే పోయుదురట." ఎంతరాగ ప్రదర్శన!

ఇంకో ఉదాహరణ *

పామునకు బాలు చీమకు పంచదార
మేపు కొనుచున్న కర్మభూమిం జనించి—

పాము, చీమ; పాలు పంచదార వాడుకలో ఉన్న ఊరిపదాలు. వాటి చుట్టూ పెద్ద వాతావరణం ఏమీలేదు. పాములు పాలూ, చీమలు పంచదారా మనం 'మేపితే' తినడంలేదు—'మేపుకొను' ఇక్కడ అసందర్భంగా ఉంది. పాముకి పాలు పోసుకున్నప్పుడు పాము క్రూరజంతువుకాదు. అది భగవంతుడు. ఉత్తప్పుడు పాము కనబడితే చంపివేస్తాం. చీమకు పంచదార మనకి సాధ్యమయినంతవరకూ దొరకనియ్యం. ఇంక కర్మభూమి; క్రూరజంతువుల [illegible] ఆదరంతో చూసే దేశం అనే అర్థం కవి ఉద్దేశించాడు. 'కర్మభూమి' అనేమాట [illegible] అర్థంలో ఉపయోగించడం ఒకనటన.

* జాషువగారి 'గబ్బిలము' లోవించి.

తెలుగు దేశాన్ని, దాని 'అజ్ఞాత పూర్వ దివ్యత్వాన్నీ' అక్షరాల దివ్యత్వం చేసేటందుకు మన కవులు చాలా చిత్రచిత్రమయిన సాధనాలు ఉపయోగించారు. తెలుగుతనం ఒక ఉద్యమంకింద నడిచింది. కేవలం మట్టినికూడా బంగారం కింద, బంగారాన్ని దానిలో ఉన్న తళుకుకింద, మాంసంతో, చర్మంతో మన ఎదురుగా తిరిగే ప్రేయసిని అసలే భూస్పర్శ ఎరగని దేవకన్యగా భావనలో మార్చుకోడం, భావకవిత్వపు రోజుల్లో సాంప్రదాయంగా అయిపోయింది. ప్రేమకవిత్వానికి ఆధారంగా భూమిమీద మసలగలిగిన ప్రేయసీ, ప్రేమా అవసరమే లేదనీ, కేవల 'మానససుందరి' మన భావనలో మసలుతో మనచేత కవిత్వం వ్రాయిస్తుందనీ, చాలా సాహసమయిన సూత్రీకరణం కూడా జరిగింది. దీనికి విరుగుడుగా ఈ నిరాడంబరమయిన, తెలివయిన ఒప్పుకోడం ఎంత అందంగా, ఎంత నిజంగా ఉంది! *

I grant I never saw a goddess go,
My mistress, when she walks, treads on the ground;
And yet, by heaven, I think my love as rare
As any she belied with false compare.

ఊహాప్రాయమయిన ఆదర్శాలు మనని ఆ దిశలో గట్టిగా పట్టుకున్నాయి జాతీయతను గురించీ, ప్రేమను గురించీ కూడా. మనకి ఎదురుగా కనబడే 'తెనుగుతనాన్ని' అసహ్యంతో విడిచిపెట్టి, ఊహాప్రాయమయిన 'తెనుగుతనాన్ని'—'అజ్ఞాత పూర్వ దివ్యత్వాన్ని' పట్టుకున్నాం. మనకి జీవితంలో సన్నిహితంగా ఉన్న ప్రేమకి మాటలు తెలియక, యెంకి, ఊర్వశి వంకబెట్టి హృదయాలు వెళ్ళబోసుకున్నాం. అయితే ఆ రోజుల్లో అంతే. ఆనాటి కవిత్వంలో ఒక ఉత్సుకత, ఒక లోపం, ఒక దాని పక్కని ఒకటి ఉన్నాయి. కాని ఆ కవిత్వాన్ని కాదనగల పోకడ ఏదీ ఇప్పటి కింకా బలంగా రాలేదు. కారణం ఒక పొరబాటు ఈ నాటికి కూడా మనం గ్రహించలేదు. ఆదర్శం, కొన్ని హద్దుల్లో, రూపరేఖలమధ్య బంధించబడిన వస్తువుల్లో గ్రహించగలగడం—అదే కవితాసాధనకు పరమావధి. మన కవిత్వంలోని తెనుగుతనం, కల్తీలేని అమరత్వం. ఏజాతి తననిగురించి రాసుకున్నా ఆ గుణాలన్నీ-పేర్లుమార్చి-రాసుకోవచ్చు. 'తనగీతి యరవజాతిని పాటకులనుగా దిద్ది వర్ధిల్లిన తెనుగువాణి' అన్నప్పుడు మనం ఎంత గర్వంగా చెప్పుకోగలిగామో, అరవలు కూడా వారి ఔన్నత్యాన్ని ఇంకో విధంగా ఇంత కంటే గర్వంగా చెప్పుకోగలరు. కవి గుర్తించగలిగిన 'సత్యం' సగం సగంగా ఎప్పుడూ ఉండదు. ఒక ప్రత్యేక జాతీయతయందు మనకుగల చనువు, అభిమానం—దీనిలో సర్వమానవ జాతికీ సామాన్యమయిన చనువూ, అభిమానం గుర్తించగలిగితే తప్ప కవిదృష్టి తీక్ష్ణమయినది కాదని చెప్పవలసివస్తుంది. ఇందాకటి 'ఈ నాపదార్పితక్షోణి నేరాజు ధర్మాసనంబుండి స్వత్యగ్ధమనో' అనే పీసంచదివి ఆంధ్రుడే కాడు ఏజాతి వాడయినా ఆ ఉత్తేజం పొందగలుగుతాడు. కేవలమూ ఒక జాతికే సంబంధించకుండా అందరికీ సామాన్యంగా

* షేక్స్పియర్ సానెట్ నం. 130 లో నించి.

ఉండే మూల చిత్తవృత్తులను కదపగల శక్తి అలవరచుకున్నప్పుడే జాతీయ కవిత్వం సారస్వతంలో స్థానం సంపాదించుకోగలుగుతుంది. రవీంద్రుని 'వంగలక్ష్మి' అనే పద్యం చదివినవారికి నా అర్థం స్పష్టంగా తెలుస్తుంది. కాని వెనకటి కవిత్వానికి మసిపూయడం నా ఉద్దేశం కాదు. మన అభిరుచిలో తప్పని సరిగా వచ్చిన మార్పు సూచించడానికే నా ప్రయత్నం. ఈదృష్టినించి భావకవిత్వంలో వైచిత్రిని కొంత పరీక్షచేస్తే ఇప్పటి అహంభావ కవుల తిరుగుబాటుకి అర్థం దొరుకుతుంది.

ఎవరు ? *

ఎవరోహో, ఈనిశీథి
నెగసి, నీడవోలె నిలిచి
పిలుతు రెవరో, మూగకనులు
మోయలేని చూపులతో
ఎవరోహో !
ఎవరోహో !
ఇపుడా నను పలుకరింతురు !
మ్రోయలేని నీరవగతి
మున జలించు కోరికతో
ఇపుడా నను పలుకరింతురు !
ఎవ రని ఈ రేయి నిదుర
హృదయ మదర, పేయి జేయి
చాయలాడ పెనుచీకటి
సైగలతో నా కన్నుల
రక్తమురల లాగికొందురు !
ఎవరో నా హృదయనాళ
మేలా తునియలుగా నా
నిర్జీవపు జీవితమ్ము
నిట వదలుదురా !
ఎవరోహో !
ఎవరోహో !
ఇపుడా నను పలుకరింతురు ?

ఈపద్యంలో మనస్థితి: ఏదో నిరాశవల్ల—జీవించగలిగిన అవకాశాలన్నీ చేయిదాటిన నిస్పృహతో—తన నిస్పృహను లోకం మీద ప్రతిబింబింప చేయడం; 'ఎవరోహో!' అన్న సంబోధనలో చనువు సూచించే ఒక భయానకత; నీడవోలె నిలిచి పిలవడంలో అనుక్షణమూ తనను వెన్నంటి వచ్చే ఒక తీరని కోరిక యొక్క ఛాయ; మూగకనులు మోయలేని చూపులు అన్నప్పుడు తన కందని ఒక ఆకలిని, ఒక తృష్ణను, ఆనీడకు ఆరోపించడం, ఇవన్నీ కవివేపునించే అర్థంచేసుకోవాలి, ఇవన్నీ కవివేగాని ఆ వస్తువుకి చెందవు. అసలు వస్తువు స్పష్టంగాలేదు. కవికూడా ఆవస్తువును ఎరగనట్లు నటిస్తున్నాడు. అయినా ఒక భయంతో ఒక నిస్పృహతో ఎరుగును. తనకూ ఆ వస్తువును చూడాలని ఉంది. 'పెనుచీకటి సైగలతో నాకన్నుల రక్తమురల లాగికొందురు' అన్నది ఆ వస్తువు యొక్క ఆకర్షణని అనలే సూచించక కవికి దాన్ని పొందాలని ఉండే తీవ్ర తహతహనే సూచిస్తుంది. 'ఇపుడా

* కవి, దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు.

నను పలుకరింతురు ?' ఈ మనస్థితికి అద్భుతమయిన నిర్వచనం. అదే ఆఖరిమాట. ఈపద్యంలో ఇంకొకటి కూడా తెలుస్తోంది. కవికి ఆ 'నీడ' యందుకంటె తన మనస్థితి యందున్న వ్యామోహం ఎక్కువ. చాలా ఎక్కువ. అందుకే సాఫల్యం యొక్క సూచన అయినా కవి ముట్టుకోలేదు. అంతేకాదు. సాఫల్యానికి గల అవకాశాల నన్నింటినీ 'ఇపుడా నను పలుకరింతురు ?' తో అవతలకి నెట్టివేశాడు. ఈ పద్యంలోకి 'నా నిర్జీవపు జీవితము నిట వదలుదురా!' అన్నదిమాత్రం అనవసరం. ఈ ఆరోపణ మనస్థితికి చెందినది కాదు. 'ఎవరు?' కి ఈలోకంతో సృశ్యలేదు. 'ఇపుడా నను పలుకరింతురు ?' ఒకటే చెప్పగలిగింది చెప్పింది కూడాను.

ఈపద్యంలో మనస్థితి ఒకటేకాకుండా ఆ కాలానికి సహజమయిన ఇంకో గుణం కూడా ఉంది. ప్రేమా, వైఫల్యమూ ఇవి అప్పటికి చాలా కొత్త విషయాలు. ప్రేమయొక్క సాఫల్యమూ వైఫల్యమూ కూడా తీవ్రమయిన ఉద్రేకంతో సూటిగా చెప్పగలిగారు ఆనాటి కవులు.

ఎదమెత్తనౌటకై *
సౌదగుందరా, అంత
మదిగల ఆహమ్మెల్ల
వదలిపోవునురా ! ....

ప్రేమకంటే ఎక్కు
వే ముందిరా...

ఈ పద్యంలో చమత్కారం ఏమీలేదు. కాని తత్వాల వరసలో ప్రేమనుగురించి ఇంత నిరాడంబరంగా, ఆసక్తితో చెప్పగలిగిన కవిని ఊహించుకుని మనం వింతపడతాం. ఇందులో వైచిత్రి పద్యంలోకంటె పద్యం వెనక ఉన్న కవియందు ఉంది. 'ఎద మెత్తనౌటకై సౌదగుందరా'లో ప్రాస నవ్వుపుట్టించేటంత అమాయకంగా ఉన్నద్ది, కాని అసహజంగా లేదు. పద్యంలో కవియొక్క వ్యక్తిత్వమే బలమైంది. పద్యానికి మాత్రం కవికంటే భిన్నమయిన వ్యక్తిత్వం చాలా తక్కువగా ఉంది. అదే ఈ పద్యానికి బలహీనత అని చెప్పాలి.

"ఆమె నవనీతహృదయ, నాయంతరంగ
శాంతిదేవత, ఆశా పథాంతరాళ

* కవి, బసవరాజు అప్పారావుగారు.

పారిజాతమ్ము, ప్రేమజీవన విభాత
కైశికీగీతి........." *

"ఆమె కన్నులలో ననంతాంబరంపు
నీలినీడలు కలవు........."♦

"మత్పురానేకపుణ్య జన్మములపంట
జాహ్నవీ స్వచ్ఛవును, సుధాస్వాదుమూర్తి
వయిన నీదివ్య సాన్నిధ్య మందుకొంటి"....†

ప్రేమకు ఆదర్శాలను నిర్మించుకునే వేగంకూడా ఆకాలానికి చాలా అలవాటయిపోయింది. పైపద్యాలలో ప్రేయసి ఆకాశందిగి భూమిమీదికి రాదు. ఆమెకు భూస్పర్శ అసలేలేదు. ఆమె ఎంతసేపూ 'అప్రాప్తమనోహరి' గానే ఉండిపోతూ వచ్చింది. స్త్రీయొక్క ప్రత్యేక సౌందర్యమూ, ప్రత్యేకమయిన ప్రేమయొక్క చనువూ, ఇవి కవిత్వంలోకి రాలేదు. కాని ప్రేమ, ప్రేయసి సామాన్యతి సంపాదించుకున్నాయి. ఊహాలు కొత్తకొత్తగా సజీవమయిన వైచిత్రితో పుట్టిపెరిగాయి.

'శర్వరీ విరహాసురభి నిశ్వాసములు;' 'నింగిలో చుక్కలో తొంగిచూచు నువ్వుు;' 'రేకుసాగిన మోహన ఋతువు;' 'వలపు నిండారవిరిసిన పారిజాత కుసుమములు;' 'తొలిచిన్ని చూలాలు తొలసిగ్గుప్రేమ;' ఊహాలు ఒక చైతన్యంతో, అయినా ఒకానొక రాగచ్ఛాయతో, వింతవింతగా వచ్చాయి.

ఇంకో చిత్రమయిన ఛాయ భావకవిత్వంలోకి వచ్చింది. అదికూడా తప్పనిసరిగానే వచ్చింది. జానపద జీవితం మీద వ్యామోహం, వారి భాషమీద వ్యామోహం తెలుగుతనంలాగే అతిగా వ్యాపించింది. ఇంక ఆరోజుల్లో ముష్టివాళ్ళూ, కూలివాళ్ళూ, రైతులూ వీళ్ళే మనకి ఆరాధ్యదేవతలు. కథాసాహిత్యంలో ఎంతసేపూ వీళ్ళ కష్టాలూ పైతరగతులవారి క్రౌర్యం తప్ప ఇంకొకటి కనబడేదికాదు. దేశంలోకి ఎగుమతి అయిన సామ్యవాద సిద్ధాంతాలు ఆనాటి యువకుల మనస్సులలో కొన్ని అనురాగాలూ, కొన్ని ఏవగింపులూ కలిగించాయి. అంతేకాకుండా ఇంకో ముఖ్యమయిన మార్పు రాబోతోంది ఆరోజుల్లో. జీవితంలో అన్ని విషయాలలోనూ స్వాతంత్ర్యం ఒక హక్కుగా వాదించి సంగ్రహించుకుంటున్నారు. భాషావిషయంలో మొదటిసారి తిరుగుబాటు జరిగింది. వాడుక భాష గ్రంథస్థం అయిపోతోంది. భాషావిషయంలో స్వతంత్రించడం ఒక హక్కుకాదు, నాగరక లక్షణం కూడా అయిపోయింది. కొందరు కవులు జానపదభాషలోనే కవిత్వం వ్రాయడం మొదలుపెట్టారు.

---

* కవి, వేదుల సత్యనారాయణశాస్త్రిగారు.

♦ కవి, దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు.

† కవి, నాయని సుబ్బారావుగారు.

లేపకే నాఎంకి లేపకే నిదర ।
ఈపాటిసుకము నే నింతవర కెరగనే ।
కతలోని మనిసల్లె
కాసింతలో మారి,
కనికట్టు పనులతో
కత నడుపుతున్నాది............*

ఈపద్యంలో వాడిన జానపద భాషవల్ల కొంత బాహ్య వైచిత్రి వచ్చింది. ఇందులో యెంకి, ఊర్వశి కంటె కిందమెట్టులో లేదు. కాని జానపదభాష సాహసంకోసం కవి వాడలేదు. అదొక నటనమాత్రం. యెంకితోపాటు, ఆమెచుట్టూ వాతావరణం, ఆభాషా, ఆఊహాలూ, అన్నీ కవి భావనలోని 'జానపద స్వర్గం' లోవి. 'కతలోని మనిసల్లె కాసింతలో మారి' వంటి అందమయినచిత్రణలో జానపదభాషకంటె నిరాడంబరమయిన ఉక్తి వైచిత్రి ఉంది. పెద్దమాటల బరువు ఉక్తిలోకి రాలేదు. జానపదభాష వాడిన చోటల్లా కవులు ఈ నిరాడంబరత సునాయాసంగా చూపగలిగారు.

యెలుతురంతా మేసి
యేరు నెమరేసింది †

అన్నప్పుడు జానపద వాతావరణంతో రాగయుక్తమయిన అనుబంధం పెట్టుకున్న కవికి 'నెమరేసింది' అన్నమాట దొరికింది. జానపదభాష అసలు అలంకార ప్రాయంగా వాడినా, కవులు తెలియకుండా నిరాడంబరత అలవాటు చేసుకున్నారు. గ్రాంథిక సాంప్రదాయాలను అనుసరించి రాసిన కవిత్వంలో,— భావకవిత్వంలోకూడా—అలవాటు బలంచేత ఆడంబరం తప్పనిసరిగా వచ్చింది. జానపదభాష వాడ డంకూడా ఆడంబరం కోసమే. ఆడంబరం ప్రయత్నపూర్వకంగా వదులుచుకునే దృష్టి భావకవులకు కూడా లేదు. తెలుగు భాషకి చాలా అలవాటయి పోయింది ఆడంబరం. ఆల్డస్ హార్స్లీ అన్నట్టు, 'అయిదు వేళ్ళకూ వజ్రపుటుంగరాలు తగిలించుకోవాలనే కోరిక' అభిరుచికి వెగటయినది. అతడు ఈ అలవాటుని 'Protesting too much' అన్నాడు.

ఉక్తిలో నిరాడంబరత అలవాటు చేసుకున్న కవులు మళ్ళీ జానపద భాష వాడ్డంలో 'అయిదు వేళ్ళ మీద వజ్రపు టుంగరాలు' తగిలించు కున్నారు. అది నిరాడంబరమయిన జానపద భాష కాదు. సహజ మయినజానపద భాషకాదు. జానపదనాగరికతలో ఊహాప్రాయమయిన అనుభవం, ఆనందం చాలా తక్కువ. దైహికమూ, ఆంగికమూ, ఐంద్రియమూ అయిన సన్నిహిత సౌఖ్యం ఒకటే జానపదులకు బాగా తెలు

* కవి. నండూరి సుబ్బారావుగారు.

† కవి. నండూరి సుబ్బారావుగారు.

నును. వెలుగులో ప్రేమ అనుభవించలేని ప్రియుడు అక్షరాలా లేచి దీపం ఆర్పేస్తాడు గాని,

'ఆరిపేయవే దీపమూ
యెలుగులో నీ మీద— నిలపలేనే మనసు—
... ...
... ...
సూపులే ఆపేసి
రూపువూసే మరిసి
ఒకరెరుగ కింకొకరు
ఒరిగి నిదరోదాము *

అన్నంత రాగప్రదర్శనకి తావు ఇవ్వడు. పైపద్యంలో ఊహల సౌందర్యం నాగరక జాతికి చెందినది. భాషలో నటన, ఉక్తిలో నిరాడంబరత— ఈరెంటిలో మొదటిది మనని ఆ రోజుల్లో బాగా ఆకర్షించింది. ఆ రోజుల్లో భాషను గురించిన వాదోపవాదాలలో ఈనటన గొప్పగా కనిపించింది. కాని ఈ నటన క్రమక్రమంగా తేలిపోయింది. ఇటువంటి నటన అంటే ఇప్పుడిప్పుడు వెగటుకూడా పుడుతోంది. కాని పైపద్యంలో మనస్థితి స్ఫటిక స్వచ్ఛమైన నైర్మల్యంతో నిండి ఉంది. ఆనాటి కవిత్వంలో ఇంత నైర్మల్యం, సాఫల్యం పొందిన ప్రేమలోని ఆనందం, ఒక మెల్లని ఉద్రేకం చాలా తక్కువమంది కవులు స్పృశించ గలిగారు. మన కీనాటికి ఈ 'జానపద' పద్యాలలో మిగిలినది ఈ సౌకుమార్యం, ఈ నాగరకత. భాషావైచిత్రి పేలవమయిపోయినా ఊహావైచిత్రి సజీవమై నిలిచివుంది.

ఈ సౌకుమార్యం అన్ని సాహిత్యాలలోనూ ఒక దశలో లోతుగా పట్టుకుంది. దీనిమీద తిరుగుబాటుగా కేవలం సాహసంకోసం, అయినా ఒక నిజాయితీతో, తరవాత బయలుదేరిన కవిత్వం చూస్తే అసలు వెగటు ఎక్కడ పుట్టిందో గ్రహించవచ్చును.

A SONG OF PRAISE †

Her walk is like the replica
Of some barbaric dance,
Wherein the soul of Africa
Is winged with arrogance
* * * * *
My love is dark as yours is fair
Yet lovelier I hold her

---

* కవి. నండూరి సుబ్బారావుగారు.

† Countee Cullen.

Than listless maids with pallid hair
And blood that's thin and colder.
You proud-and to-be-pitied one,
Gaze on her and despair;
Then seal your lips until the sun
Discovers one as fair.

ఈ తిరుగుబాటులో తికమకలు ఏమీలేవు. ఇది కురూపులకు క్షమార్పణ కాదు. ఏహ్యమయిన వస్తువుల యెడల సానుభూతీ కాదు. కొన్ని దశల సౌకుమార్యం అంతికంతకీ నిరసించి, listless maids with pallid hair and blood that's thin and colder కింద మారేసరికి అసలయిన భోగికి వైవిధ్యంవల్ల రెండోపక్క చటుకుని కనబడుతుంది. The soul of Africa ఒక్క కురూపానికే కాదు, ప్రేమ యొక్క బాహ్య చిత్రవృత్తులకు, మనం చాలా కాలం అంగీకరించి అశ్లీలభయం చేత ముట్టుకోకుండా వదిలివేసిన దైహిక ప్రేమకుకూడా వర్తిస్తుంది. ఊహలో ప్రేమ ఎంత అందమయినదయినా, దాన్ని భూమి మీదికి దింపి, మగ, ఆడ, లోకం విడదీసి ఊహించుకునేసరికి ఆఫ్రికా అంత వికారంగానూ అయిపోతుంది. కాని అందులో 'soul' ఒకటి మనం చూడ్డం తటస్థించిన తరవాత ధైర్యంగా నిజాయితీతో చెప్పగలుగుతాం. ఈ చూడ గలిగిన వాతావరణం ఏర్పడ్డ తరవాత ఉత్త సౌకుమార్యంలో వైచిత్రి జారిపోతుంది. ఇక్కడ నేను ఒకవిషయం స్పష్టంగా చెప్పవలసిఉంది. A song of praise రాసినకవి పాతకవిత్వాన్నంతనీ ఎగతాళిచేస్తున్నాడని అపోహ ఒకటి కలగవచ్చును. ఈపద్యం అసలు సమకాలికులను ఉద్దేశించే చెప్పబడింది. 'ఆఫ్రికా' యొక్క 'ఆత్మ'తో పరిచయం ఏర్పడ్డతరవాత సౌకుమార్యాన్ని సుకుమారంగా వర్ణించేపద్ధతి జారిపోతుంది. కవికి వికృతం, దానిమధ్య లోతయిన గాంభీర్యం, సౌకుమార్యంలో కూడా కనబడతాయి. ఒక్కసారి ఈజ్ఞానం మనస్సుని పట్టుకున్న తరవాత నిరాడంబరంగా అందాన్ని అందంగానే ఉద్రేకంతో చూడలేడు కవి. అందాన్ని మించినదేదో తను వదలివేసిన అనుమానం అతన్ని వెంటాడుతూ ఉంటుంది. అందాన్ని అందంగానే వర్ణించిన కవులుకూడా ఈ అందాన్ని మించిన 'ఆఫ్రికా'ని ముట్టుకునే ఉంటారు. కాని ఆ ఉద్వేగంలో నిజాయితీ ఇప్పటి కవి పట్టుకోలేడు. ఆఫ్రికాను కళ్ళారా చూస్తూ, అది ఈడెన్ కింద వర్ణించడానికి అతనికి మనస్సు ఒప్పదు. ఆఫ్రికాను, ఆఫ్రికాగానే వర్ణిస్తూ అందులోఉన్న ఈడెన్ సూచనగానే ఇవ్వగలుగుతాడు. ఇప్పటికవికి నిజాయితీఅయిన ఉద్వేగం ఈ పద్ధతిలోతప్ప దొరకదు. అంచేత మనకి సజీవంగానేనిది వెనకటి కవిత్వపు పద్ధతిలో - వైచిత్రి గాని వెనకటి కవిత్వంలో వైచిత్రి కాదు. మన మనః ప్రవృత్తి మారింది. ఈమారిన మనః ప్రవృత్తితో వెనకటి ఆదర్శాలు, ప్రేమలు, విలువలు తిరిగి సృష్టించేసుకునే ప్రయత్నంలో పరిభాష మారింది. పరికరాలు కూడా మారాయి.

కాని ఆకాలంలో కూడా ఈమార్పుకి సూచనలు లేకపోలేదు. 'నా ప్రేయసి నల్లగా జంతువులా గుంటుంది' అన్నంత తిరుగుబాటు లేకపోయినా బాహ్యసౌందర్యం ముట్టుకోకుండా అంద మొకటే కాని క్లిష్టతతో కూడిన తాత్త్విక చిత్రాన్ని చిత్రించే పద్ధతి, ప్రేమైక కవిత్వపు రోజుల్లో కూడా, బుద్ధి విశిష్టత మీద ఆధారపడ్డ కవులు గ్రహించారు.

A WOMAN'S LAST WORD †

See the creature stalking
While we speak!
Hush and hide the talking
Cheek on cheek!
What so false as truth is
False to thee?
Where the serpant's tooth is
Shun the tree—
Where the apple reddens
Never pry—
Lest we lose our Edens
Eve and I.

నడకలో నిరాడంబరత నటించడం వల్ల, భావం ఎంత బరువయిన దయినా పద్యం బరువుగా లేదు. నిరాడంబరత ఒక నటన మాత్రమే. స్త్రీయందు గౌరవంతో కూడిన కళాకౌశలం, A woman's last word అనడంలో ఎంతో కాలం బతికిన బతుకుయొక్క సూచన, Eve and I లో ప్రాతిపదికమయిన స్త్రీచిత్తవృత్తులయందు ఒక అనురాగం, ఒక కళాకౌశలం, Serpant's tooth, apple లో, స్త్రీప్రేమలోని కుతూహలం, ఆమె జిత్తులు, ఆమె తీవ్రత, ఇవన్నీ అన్నిటి కంటే స్పష్టంగా 'What so false as truth is false to thee?' లో క్రోడీకరించాడు కవి.

ఈ ఉత్తసౌందర్యం మీద తిరుగుబాటు నవ్య కవిత్వంలో ఒకొక్క చోట బలంగా వచ్చినా, ఒకొక్క చోట చాలా పేలవ మయిపోయింది. పైపద్యంతో పోలిస్తే ఈ 'నవ్యకవిత్వం' ఎంత చప్పగా ఉంది!

† Robert Browning.

A COUNTRY WOMAN OF MINE *

Handsome? I hardly know. Her profile is fine
Delightful, intellectual, aquiline.
Learned? well, rather. See them for yourself–
Mill, spencer, Darwin, on her favourite shelf.

Well educated, certainly well read;
Well born of course; and (not ofcourse) well bred.

Takes the New world freedom, and with Old world ease ;
She's but to please herself the world to please.

సంభాషణలో అలవాటయిన మామూలుతనం ఉన్నది ఉన్నట్టుగా ఛందస్సులో పెట్టివెయ్యడంవల్ల ఒక చనువూ, చులకనా పద్యానికి వస్తాయి. కాని చివరికి ఈ 'Countrv woman' ఎవరు? ఆమెను గుర్తుపట్టడానికి కొంత బాహ్యవర్ణన మాత్రమే పద్యంలో ఉంది. ఈ రోజులకు ఆమెను గుర్తుపట్టడంలో కష్టంలేదు. నాగరక స్త్రీ ఇల్లాగే జనానికి మామూలుగా తెలుసును. ఈ నవ్యత కేవలం ఈనాటికి సంబంధించినది. బాహ్యచిహ్నాలయందు దృష్టి నిలపడం కవిత్వంలో కొత్త పద్ధతి కావచ్చును గాని, వాటి అడుగున ఉన్న, 'మొదటి ఈవ్ యొక్క పెంకి ఆడతనం' గుర్తించగలిగినప్పుడే స్త్రీని గురించి పద్యం రాయాలి. Mill, Spencer, Darwin లను నాగరికతతో ముడివేసే అలవాటు సంఘ మర్యాదలో జారిపోయినకొద్దీ ఈపద్యం ఎందుకు రాసినదీ అర్థంకాదు. చివర రెండుపాదాలలోనూ లోతయిన సూచన ఏదీ లేదు.

ఈ తిరుగుబాటు ఒక్క ప్రేమ, ప్రేయసి, విషయంలోనే కాదు. ఇంకో పాయలో కూడా వచ్చింది. ఈకాలానికి తిరుగుబాటు ఒక స్వభావం. ఇదివరకు మనస్థితులను వర్ణించే పద్యాలలో ఆ మనస్థితికి కారణంగా విరహమో, అనురాగమో, దుఃఖమో; ఏదో స్పష్టమయిన అనుభవం ఒకటి తీవ్రమయిన వేగంతో చెప్పుకోడం అలవాటయింది. నాగరికతలో అప్పుడే వేగంమీద తిరుగుబాటు వచ్చేస్తోంది. 'The Importance of Living' అన్న పుస్తకంలో డా॥ లిన్‌యుటాంగ్ అనే చైనా వేదాంతి, సోమరితనాన్ని ఆదర్శంగా వర్ణించినాడు. అతనికి అమెరికా దేశంలో సుడులు తిరిగిపోయే వేగం, దానివల్ల ఏర్పడే సుడిగుండాలు, వీటికి ఫలితమయిన నాగరకత, వీటిమీద. చైనాదేశంలో లేనిది

* Elaine Goodale Eastman.

తాగుతో గంటలకొలదీ సోమరితనంగా కూర్చునే నాగరకతలోని సహజమయిన విలువ స్పష్టంగా కనబడింది. అతనికేకాదు ఆ సుడిగుండాలమధ్య చిక్కుకున్న జాతుల్లోనే దేశంమీద తిరుగుబాటు అక్కడక్కడ తల ఎత్తింది.

AN IMMORTALITY †

Sing we for love and idleness,
Naught else is worth the having.
Though I have been in many a land
There is naught else in living.

And I would rather have my sweet
Though rose leaves die of grieving,
Than do high deeds in Hungary
To pass all men's believing.

ఈపద్యంలో ఒక్క తిరుగుబాటు తప్ప మరేమీలేదు. కాని ఒక సౌలభ్యం మాత్రం పద్యాన్ని పోషిస్తుంది. విసుగును విసుగ్గానే చెప్పకుండా హాసపూర్వకంగా సోమరితనాన్ని An Immortality గా (ఇందులో An గమనించవలసింది) చెప్పగలిగిన చిత్తస్థైర్యం ఆనందించవలసింది. 'High deeds in Hungary to pass all men's believing' చేసిన మనిషే, ఇంక 'There is naught else in living' అని కులాసాగా చెప్పగలిగినప్పుడు అతని మీద మనలో పుట్టే గౌరవం ఒక్కటే ఈపద్యాన్ని రక్షిస్తుంది. కాని ఇదొక ముఖ్యమయిన పోకడను సూచిస్తుంది. ఇంతకంటే లోతయినదీ ఈ తిరుగుబాటుని స్పృశించకుండా తనలో తనే పరిపూర్తి పొందే ఒక ఉదాహరణ.

IN A CHAIR ‡

The room is full of peace of night,
The small flames murmur and flicker and sway
Within me is neither shadow, nor light,
Nor night, nor twilight, nor dawn, nor day, ...

For brain strives not to the goal of thought,
And the limbs lie wearied, and all desire
Sleeps for a while, and I am naught
But a pair of eyes that gaze at fire.

† Ezra Pound.
‡ John Collins Squire.

ఇందులో మనస్థితికి కారణమయిన అనుభవం ఏమీ లేదు. 'I am naught but a pair of eyes that gaze at fire,' మనకి అనంతమయిన చిత్రాన్ని చూపిస్తుంది. ఈపద్యాన్ని గురించి అయినా ఇంక మనం ఏమీ ఆలోచించం, 'For the brain strives not to the goal of thought.' ఎదురుగా ఉన్న వస్తువుల వేపు రెప్ప వెయ్యకుండా నిరాలోచనగా చూసే చూపులు ఒకటే మిగిలి తక్కిన చైతన్యమంతా ఎక్కడికో పోతుంది. కాని చైతన్యం మాత్రం ఏదో భూమిక మీద ఉంది. దాన్ని మనం బుద్ధితో పట్టుకోలేం. ఆ అనుభవం మాత్రం మనకి సర్వసామాన్య మయినదే. దానికి ఒకటే బాహ్యచిహ్నం; నిప్పువేపు రెప్ప వాల్చక చూసే రెండుకళ్ళు! అంతకంటే మనిషిలో మిగిలిన ఇంద్రియ చైతన్యం ఏమీలేదు. 'కోరిక కూడా నిద్రపోతోంది.'

ఇంకో పద్యం,

ఒకరాత్రి *

గగనమంతా నిండి
పొగలాగు క్రమ్మి
బహుళపంచమి జ్యోత్స్న
భయపెట్టుతోంది.......

ఆకాశపుఎడారి
అంతటా అకట!
ఈరేయి రేగింది
ఇసుక తుపాను!...

గాలిలో కనరాని
గడుసు దయ్యాలు
భూ దివమ్ముల మధ్య
ఈదుతున్నాయి!...

నోరెత్తి హోరెత్తి
నాగుబాము కదలి
కరి కళేబరములా
కదలదు కొండ....

ఆకాశపు ఎడారి
లో కాళ్ళు తెగిన
ఒంటరి ఒంటెలా
గుండి జాబిల్లి...

విశ్వమంతా నిండి
వెలిబూది పోలె
బహుళ పంచమి జ్యోత్స్న
భయపెట్టుతోంది....

ఈ పద్యంలో ఉద్వేగం అణచిపెట్టి ఉంచే ప్రయత్నం ఒకటి కనబడుతుంది. 'గాలిలో కనరాని గడుసు దయ్యాలు' మనచుట్టూ కూడా తిరిగిపోతున్న భ్రమ ఒకటి కలుగుతుంది. 'భూ దివమ్ముల మధ్య' లో 'భూ' తరువాత సరళమయిన 'ది' ప్రాసవల్ల ఆ దయ్యాల వాతావరణం మాయగావచ్చింది. భావనావేగాన్ని సూచించే కదలిక ఈ చిత్రాలలో లేదు. ఒక కర్రబొమ్మ తరవాత ఇంకొకటి పేర్చినట్టు నడిచింది

* కవి శ్రీ శ్రీ.

పద్యం. అందులో 'ఆకాశపు బెడారిలో కాళ్లు తెగిన ఒంటరి ఒంటె' చటుక్కుని అల్లా నిలిచి పోయింది.

దారులన్నియు మాపె దశదిశలు ముంచెత్తె
నీరంధ్ర భయదాంధకార జీమూతాళి*

అన్న పద్యంలో లాగ వేగంతో కూడిన భయం కాదు ఇది. ప్రకృతి మీద భయానకత ఆరోపించడం కంటె, ఉన్న ప్రకృతిలోనించే భయానకతి ఏరుకునే ప్రయత్నం ఇది. చైతన్యం కొంత నిద్ర పోతో ఉంటే కలలోలాగ మెదిలిన మెల్లని భయం ఈ పద్యంలోది. భయం 'ఒకరాత్రి' మీద ఆరోపణ కాదు. రాత్రి వేపు చూస్తో ఉంటే ప్రతి వస్తువులో నించీ మెదడుకి తెలియకుండా పుట్టిన భయం మాత్రమే పద్యంలో ఉంది. ఇక్కడ భయమే అనుభవం—ఇంకో సంఘటన యొక్క అనుభవానికి ఫలితంకాదు. భయం, కవి వ్యక్తిత్వంలోని ఒక భాగం కాకుండా, ఆ వాతావరణంతో కలిసిన ఒక వ్యక్తిత్వాన్ని, కవితో నిమిత్తం లేని వ్యక్తిత్వాన్ని పొందు తోంది.

'The emotion of art is impersonal' అన్నాడు Eliot. ఉద్వేగ పూరిత మయిన కవిత్వంలోకూడా కేవలం వ్యక్తి వాతావరణాన్ని దాటి ఉద్వేగం పెరిగిపోవాలి. కాని ప్రతీ చిన్నకవీ, తన విరహం, దుఃఖం, వ్యక్తిపరంగానే వెళ్లబోసుకుంటో, ఇది సర్వ మానవ జాతికీ సామాన్య మయినదే అని సమర్థించుకుంటారు. అటువంటిచోట ఉద్వేగం వ్యక్తికి అతీతంగా ఉందా? లేదా? అనే పరీక్ష మన అభిరుచి మీదే ఆధారపడుతుంది. కాని వ్యక్తిలోనే ఒక పెద్దఉద్వేగంలో కలిసిపోయే శక్తిఉంది. ఉద్వేగాన్ని ఉద్వేగంతోనే కాకుండా, 'రెప్పవెయ్యక నిరాలోచనగా చూసే రెండుకళ్ళద్వారా' మెల్లగా చూసే శక్తికూడా ఉంది. కాని మనిషి తన ఉద్వేగాన్నంతనీ కొలుచుకోగలిగిన సమత అలవరచుకున్నప్పుడు తప్ప ఇది సాధ్యంకాదు. అప్పుడు తప్పనిసరిగా ఉద్వేగం వ్యక్తి కతీత మయిపోతుంది. కవివ్యక్తి చాలా తక్కువగా కళలో ప్రతిఫలిస్తుంది.

పాత కవిత్వపు పద్ధతిలోని రాగప్రదర్శనతో కొన్ని నవీన రాజకీయ సూత్రాలను రుజువుచేసే ప్రయత్నం తక్కువరకపు కవులు చాలామంది చేశారు.

MY SONGS TO SELL. ♦

My songs to sell Good Sir!
I pray you buy.
Here's one will win a lady's tears
Here's one will make her gay,

* కవి, దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు.

♦ Adelaide crapsey.

*   *   *
*   *   *
*   *   *

Oh no, she will not buy.
If I'd as much money as I could tell,
I never would cry my songs to sell
I never would cry my songs to sell.

మొదటి పాదాలలో పాటల అమ్మకంచుట్టూ వెనకటి యుగానికి చెందిన రాగయుతమయిన వాతావరణం అంటుకుని ఉంది. కాని చివర పాదాలలో ఈకాలానికి చెందిన ఆర్థిక సూత్రాలు గ్రహించిన తెలివి ప్రదర్శించడంతో పద్యం పులగమయి పోయింది. ధనమూ, ధనాభావమూ, వీటికి సంబంధించిన సమస్యలూ, వీటితో పాటలు అమ్ముకునే వృత్తికి సంబంధం లేదు. అసలు పాటలు అమ్ముకోడం ఒక వృత్తి కాదు. 'పాటలు అమ్ముతాను' అనడం ఒక నటన. అందులో "డబ్బుంటే ఈపాటలు అమ్ముకునే గతి నాకెందుకు?" అనే నిస్పృహకి తావులేదు. 'పాటలవర్తకుడు' డబ్బుకోసమే పాటలు అమ్ముకునే పద్ధతిలో అతనికి డబ్బుంటే పాటలు రాయడు. డబ్బుకోసమే వ్యాపారమయితే, డబ్బుంటే వ్యాపారమే లేదు. 'పాటల అమ్మకం' సరదాగా అనుకునే ఊహ. 'గొల్ల చల్లోయమ్మ – గొల్ల చల్ల' అని పిల్లలు స్తంభాల దగ్గర ఆడుకునే మాదిరిది. 'గొల్ల చల్లకి' ప్రతిఫలం అణా డబ్బులు కాదు. ఆ అణాడబ్బులు వాళ్లమ్మ ఇచ్చినా చిన్నపిల్లలు గొల్ల చల్ల అమ్మడం మానరు.
ఈ వ్యామోహం చక్కని పోకడని కూడా ఒకొక్క చోట పాడుచేసింది.

కాంక్ష*

*   *   *   *
*   *   *   *
*   *   *   *

పేదల రక్తమాంసముల పెంపువహించి దయారసామృతా
స్వాద దరిద్రులైన ధనవంతుల పెద్దరికమ్ముకై మతో
న్మాదము పెంచు దేవునికి మారుగ నిల్చిన రాతిబొమ్మలం
దూదరవోవు పాడు బ్రదుకొక్క నిమేషము పైప నాయెదన్.

---

* కవి. వేదుల సత్యనారాయణశాస్త్రిగారు.

నాకు తలంపులేదు లలనా జనతా కబరీభరైక భూ
షాకలనకా, సతీ మృదు భుజాంతర తల్ప కుచోపగూహ వి
బ్భోకమునకా, వధూజనకపోల గళచ్ఛ్రవణావతంస హే
వాకమునకా, విలాసినుల పాపట చందురు కావిపూతలకా.

* * * *

తేనెలకోసమై కొదమతేటుల దాటులొనర్చు నృత్యగీ
తాను నయమ్ముగాని * *
* * * *
* * పరితృప్తి యొసంగవు నాకొకింతయుకా.

* * * *
నీచపు దాస్యవృత్తి మననేరని శూరత మాతృదేశ సే
వా చరణమ్మునం దసువు లర్పణ జేసినవారి పార్థివ
శ్రీచెలువారు చోట తదసృగ్రుచులకా వికసించి వాసనల్
వీచుచు రాలిపోవగవలెకా లదుదాత్త సమాధిమృత్తికకా. .

ఒక పువ్వు తన 'కాంక్ష' చెప్పుకుంటోంది. పద్యంలోని అభిమానాలన్నీ మానవలోకంలోవి—పేదల రక్తమాంసములు మొదలుకుని, పాపటచందురు కావిపూతల వరకూ. ఇవేవీ పువ్వుకి అక్కరలేదు. ఇవే కాదు. కవులు తమ సాంప్రదాయంలో ముడిపెట్టిన కొదమతేటుల దాటులు తేనెలకోసం చేసే అనునయమూ అక్కరలేదు. పువ్వు పెద్ద తిరుగుబాటుతో ఒక్క ఇనపసంకెళ్ళనే కాదు, బంగారపు సంకెళ్ళనుకూడా వదలించుకుంటోంది. అన్ని సాంప్రదాయాలమధ్య బందికానాలోనించి విడుదల కోరుకుంటోంది. ఇందులో మానవజాతికి చెందిన హేయమయిన సంపదలూ, ఆప్యాయమయిన అనురాగాలూ కూడా ఉన్నాయి. మానవలోకం, వాటి ప్రేమలు, ఏవగింపులు, ఆశయాలు, చివరకి మానవసాంప్రదాయం తనమీద ఆరోపించిన స్వంత ప్రేమ కూడా దాటిపోవాలని పువ్వు కోరుకుంటోంది. తేటికి ప్రేయసిగా కూడా ఉండాలని కోరుకోడంలేదు. అంటే ఈ తిరుగుబాటుకి ధనపక్షం ఒక్కటే కనబడుతోంది—పువ్వు పువ్వులాగే, తనలోతనే సంతృప్తిపడే స్వేచ్ఛ కోరుకుంటోంది. కాని ఆఖరిపద్యంలో అపట్టు జారిపోయింది. 'మాతృదేశ సేవాచరణమ్మునం దసువు లర్పణచేసిన వారి'యందు పువ్వుకి ఉండే అధికాభిమానం ఏమిటి? 'వధూజనకపోల గళచ్ఛ్రవణావతంస హేవాకం' కంటే, వీరి ఉదాత్త సమాధి మృత్తికయందు రాలిపోవాలనే కోరికకు సమర్థన ఏమిటి? ఈ రెండవ పదవి పువ్వు దృష్టిలోంచి ఒక సాంప్రదాయంకంటె ఎల్లా ఎక్కువవుతుంది? అన్ని సాంప్రదాయాలూ వదుల్చుకునే పువ్వు ఈ సాంప్ర

దాయానికి కట్టుబడడం స్వేచ్ఛ ఎల్లా అవుతుంది? ఈ ప్రత్యేకాభిమానం కవిదిగాని పువ్వుదికాదు. పువ్వు కోరుకోదగిన స్వేచ్ఛ ఒకటే, "నావాసన నన్నే అనుభవించనియ్యండి. నే నెక్కడ ఉన్నానో అక్కడే రాలిపోనియ్యండి, నాకు దేవుడిమెడలో వాడిపోవాలనీ లేదు, అందమయిన ఆడవాళ్ళ కొప్పుల్లో ఎండిపోవాలనీ లేదు, మీ దేశసేవకుల సమాధులమీద రాలిపోవాలనీ లేదు. మీ అనురాగాలూ, మీ గొప్పలూ మీరే ఉంచుకోండి, నాబతుకు మాత్రం నాకు వదలివెయ్యండి." మొదటి వృత్తాలలో ఈ కోరిక చెప్పకపోయినా గొప్పగా పెరుగుతోనే వచ్చింది. ఆఖరిని మాత్రం పువ్వు పువ్వుకాకుండా, మనిషిగా — అందులో కాంగ్రెసూ, జైళ్లూ, దేశసేవాచరణం మధ్య పుట్టి పెరిగిన మనిషిగా మారిపోయింది. పువ్వు యొక్క వ్యక్తిత్వం చచ్చిపోయింది.

ఈ అనురాగాలకి తలక్రిందుగా వచ్చిన ఇంకో ఛాయ. ఉక్తిలో చమత్కృతి ఉన్నట్టయితే కవిత్వానికి మొదట్లో పలుకుబడి ఎక్కువగా ఉండి తీరుతుంది.

చలికి తెలుగు రాదనడం
పులికి పిలకలేదనడం
*   *   *   *

*   *   *   *
కటకటా! లొటిపిటాచస్తే
కృ.శా. విషాదగీతం రాయాలా?*

వంటి పద్యాలలో కవి ఉద్దేశం సఫలమయి తీరుతుంది. చలికి తెలుగు, పులికి పిలక, ఒకదానితో రెండోదానికి ఏమీ సంబంధం లేని జంటలు. వాటి ఉచ్చారణలో చటుకుని స్ఫురించే పోలిక వాటికి హాస్యయుతమయిన అందాన్ని ఇస్తుంది. అటువంటిచోట చదువరి అనుమానించకుండా చనువు తీసుకుంటాడు. కాని ఇదంతా కలిపి 'వెర్రి కాదు సర్రియలిజమ్' అనేసరికి కవి తేలికయిపోతున్నాడు. ఇందులో పద్యానికీ, సర్రియలిజమ్‌కీ కూడా న్యాయం జరగదు. ఒక పద్ధతియందు నమ్మకం పెట్టుకున్న పక్షపాతం కవి చూపినప్పుడు పద్యాల గౌరవం కొరతపడిపోతుంది. తను ఏది సర్రియలిజమ్ అని కవి అనుకుంటాడో అది రాసి ఊరుకోడమే కవి చెయ్యతగ్గ పని. 'ఇది వెర్రి కాదు సర్రియలిజమ్' అని చదువరి తనంతటతాను గ్రహించినప్పుడు తప్ప సర్రియలిజమ్‌కి సరియయిన న్యాయం జరగదు.

ఈపక్షపాతానికి కారణం వేరే వెతుక్కోనక్కరలేదు. ఉక్తికీ, ఊహకూ పరికరాలూ, పరిభాషా,

* కవి. ౬౨. ౬౨.

కొత్తకొత్తగా దొరికిన వ్యామోహం చేత ఆ ప్రవాహంలోనే కొట్టుకుపోయే స్వభావం ఈ తిరుగుబాటుకి ఫలితం. "రక్తచందనం......పులి చంపిన లేడి నెత్తురూ......ఎగరేసిన ఎర్రని జండా......కల కత్తా కాళిక నాలిక......" వగైరా, వగైరా "కావాలోయ్ నవ కవనానికి" మొదలయిన సూత్రాలు పై మార్పుకి సద్యఃఫలితాలు. పైన చెప్పిన వస్తువు లన్నింటికీ ఎర్రదనం సామాన్యగుణం. ఎర్రరంగు యొక్క స్ఫురణ కొత్తగా మన నాగరకతలో వచ్చింది. విజ్ఞానానికీ, రాజకీయ మయిన అభివృద్ధికీ, చివరకి నవీనత కంతకీ కూడా ఎర్రరంగు చిహ్నం. పై సూత్రానికి భావం ఒక్కటే—నవకవనం కొత్తగా ఉండాలి, అంటే ఎర్రరంగు ఈరోజుల్లో ఎంత కొత్తగా అగుపడుతోందో అంత కొత్తగానూ కవనం అగుపడాలి. కొత్తదనపు చిత్తవృత్తికి ఇదొక్కటే కాదు. ఇంకా చాలా సూచనలు ఉన్నాయి. జంతువుల్లాగ, పక్షుల్లాగ 'గమ్మత్తుగా కుయ్యడం' 'న_న_న_నత్తిమాటలుకూడా, మ_మ_మ_మన రాతల్లో రాయడం—ఇదీ కొత్తదనానికి దారి. ఇవన్నీ ఈనాటికి కొత్తగానే ఉంటాయి. కాని ఇదెల్లప్పుడూ కొత్తగానే నిలబడదు. ఒకప్పుడు కొమ్మలోకోయిల 'రాగతనంతో' కవిత్వంలో కూసింది. కాని ఇప్పుడిప్పుడు సిగ్గుపడి మానేస్తోంది. ఈనాటికి సహజమయిన వేగాన్ని కొలుచుకుంటే, 'సైకో అనాలిసిస్' అంతా 'కాకి'కికూడా కంఠస్థం అయిపోయే రోజులు అట్టే దూరంగాలేవు. అప్పుడే గమ్మత్తు కూతలూ, నత్తిమాటలూ, పేలవమయిపోతాయి. ఈ కొత్తదనం వెనక కొత్తదనం ఒకటి—ఈ కొత్తదనం పాతబడిపోయినా మిగిలే కొత్తదనం ఒకటి కవిత్వంలో ఉండితీరాలి. 'మనం భూతకాలాన్ని వెనకాలవేసుకుని, అప్పుడే వర్తమానాన్ని దాటి, భవిష్యత్తులో నివసిస్తున్నాం. కళలో ఉద్వేగం ఒక కాలానికే చెందినది కాదు," అన్నాడు Eliot.

కాని ఈ న-న-న-నత్తిమాటల కొత్తదనం నిజాయితీతో వచ్చిన కవిత్వం లేకపోలేదు.

పోలీసు భటుడు*

చీలుదారుల్లోన నిల్చొనున్నాడు
పోలీసుభటుడు.

* * * *

భరతనాట్యం బాడుచున్న
ప్రశాంత ప్రకాశముఖంబుతోడి
నటర్షి చూడామణిలాగ
కన్పిస్తున్నాడు.

* * * *

బల్బుహారన్ల తాళాంతోటి
యిలక్ట్రిక్ హారన్ల రాగానికిన్నీ
మోటారు సయికిళ్ళ మృదంగానికినీ
అనుగుణ్యంగా నర్తిస్తుంటాడు
తటాల్మని ఇటూ అటు తిరుగుచు
హస్తాల నందమ్ముగ ద్రిప్పుచు.

---

* కవి, పఠాభిగారు

ఏమాయ పూర్వదృశ్యం!
మేమాస మధ్యాహ్న కాలమందేని
బానల్తోడ పోసినట్లుం గురిసేటి
భాద్రపదమాస వానయందేని
తన నిర్ణీత ప్రదేశంబునుండి

ఓ యంగుళమ్ముగూడా జరుగడు!
* * * *
అవు నీతనికి పవరున్నది కదు—
* * * *

ఈ పద్యంలో క్రొత్తదనం న-న-న-న త్రిమూటల క్రొత్తదనం వంటిదే అయినా మొత్తంమీద పద్యంయొక్క జిగి గమనింపదగ్గది.

ఈ 'పవరు'కి బదులుగా శక్తి అనిగాని, ఇంకేమాటగా ఉపయోగిస్తే ఆపాదంలో ఏదో ఒక సౌలభ్యం పోతోంది. పోలీసు భటుడుకి 'శక్తి' అనేది ఇంకో తరహాలోనిమాట. అతనికి 'పవరే' నిరాడంబరమయినమాట. ఇదివరకెవరూ 'పవరు' కవిత్వంలో వాడలేదుగాని, 'పోలీసు భటుడి'మీద పద్యం రాయలేదు కూడాను. పరకీయ నాగరకతవల్ల మనకు దేశంలో పెరిగిపోయిన వస్తుజాలం కవితా సాంప్రదాయంలోకి రాలేదు. పరభాషలో పదాలే వాడుకలో చనువుకావడంవల్ల వాటికి తెనుగు తద్భవాలు అసలు ప్రచారంలోకి రాలేదు. Elecricity కి విద్యుచ్ఛక్తి చాలా దూరమయిన ఆడంబరమయిన తద్భవాగా ధ్వనిస్తుంది. రెంటిలోకీ ఇంగ్లీషుపదమే నిరాడంబరమయిన పదంగా మన అభిరుచికి తట్టుతుంది. ఈ అసందర్భంవల్ల భాషకి పెరిగేగుణం నశించిపోయింది. సాంప్రదాయాలలో కట్టుపడిపోయిన భాషమీద తిరుగుబాటే ఈ ఇంగ్లీషుపదాలు ఉపయోగించే పద్ధతికి మూలం. 'మేమాస మధ్యాహ్నకాలం' వంటి సమాసాలు ఒక్క గ్రాంథిక భాషనే కాదు. వ్యావహారికభాషను కూడా వెక్కిరించే తెలివి ఇముడ్చుకున్నాయి. తెలుగుభాషకూడా పెరిగి, సన్నిహితమయిన వస్తువులకు, నిరాడంబరమయిన పదాలు అలవాటు చేసుకునేటంతవరకూ ఈ తిరుగుబాటులో వైచిత్రి క్రొత్తగా తట్టుతూనే ఉంటుంది. ఇది పెద్దనటనే. కాని చాలా తెలివయిననటన. గ్రాంథిక సాంప్రదాయాలు వదుల్చుకోడమేకాకుండా, భాషశక్తిని నిర్మించుకునే సౌలభ్యం అలవాటుచేసుకోవాలి. మనంచూసే వస్తువులన్నింటికీ కూడా సన్నిహితమయిన తెలుగుపదాలు ప్రచారంలోకి రావాలి. అందుకే ఈ వెక్కిరింపులో గమనించవలసిన నిజాయితీ ఒకటి ఉంది. వెక్కిరింపుకోసం తెలివి ఉపయోగించడంకాదు. పోలీసుభటుణ్ణి గురించి పద్యం రాయాలనుకున్న కవికి భాష దరిద్రమయిపోతోంది. అంచేత తప్పనిసరిగా ఒక వేళాకోళపు పద్ధతి కవి అవలంబించక తప్పదు. అయినా కవి ఉక్తిలో ఎంతో సౌలభ్యం చూపగలుగుతున్నాడు. భాషలో ముందు రాబోయేమార్పులే, కావలసిన వైశాల్యానికి సూచన, ఈ 'పవరు'యొక్క నిరాడంబరతలో ఉంది. భాషలో నటన తప్పకపోయినా, పోలీసుభటుణ్ణి చూసే దృష్టిలో నిజమయిన అనురాగం, చిత్రాలలో విశిష్టత, పద్యాన్ని సజీవంగా వెలిగిస్తున్నాయి.

ఇంకో ఉదాహరణం.

బోగందాన!*

మద్రాసు నగరము ! నీమీద బ్లూబ్లాక్
సిరాలాగ పడింది రాత్రి:—
*   *   *   *

ఓ బోగందానా ! నీవు
సంఘానికి వేస్టుపేపరు బాస్కెటువా ?
మష్టమషాణము పడవేయబడునట్టి
దిబ్బవా ?
తమ రూపాయడబ్బులకోసం నిను
తమ్ము ప్రేమించాలని, ప్రథమప్రేమలో బడ్డ
అమ్మాయిలా అమాయికంగా
ప్రవర్తించాలని కోర్తారే అందరు
తమ్ము తామే మోసపుచ్చుక

*   *   *   *
నీలోనే నాకు జీవితం నిజంగా
సరిగ్గా ప్రతిఫలిస్తున్నది.
*   *   *   *
పరపురుషుని జూచి తలవ్రాల్చే
పతివ్రత సతీత్వ మబద్ధం
యోగులబద్ధం, అందరూ అబద్ధం.
సర్వమబద్ధం
కానీ నీవు మటుకు ఓ బోగందానా !
ముసుగులేని నిష్ఠురమగు నిజానివి
నీడపడనటువంటి నిర్మలమగు నిజానివి.

రాత్రి 'బ్లూబ్లాక్ సిరా లాగ పడింది' అన్నప్పుడు ఇంగ్లీషుమాట కొత్తగా హాస్యంగా తట్టుతుంది. కాని పడింది అన్న క్రియలో రాత్రికీ, సిరాకీ, సరిపోయిన ధ్వని ఇమిడి ఉండడంవల్ల 'బ్లూబ్లాక్' లోని వైచిత్రి జారిపోయినా అంతకంటే ముఖ్యమయిన భావచిత్రం ఎప్పటి కప్పుడు కొత్తగా తట్టుతోనే ఉంటుంది. 'వేస్టుపేపరు బాస్కెటుకి' అంతకంటె సన్నిహితమయిన తెనుగుమాట లేదు. 'చిత్తుకాగి తాల బుట్ట' కూడా కొంత దూరమే. ఇంగ్లీషు పదం ఎక్కువ సాహసంతో వాడినందువల్ల కవి తను ఉద్దేశించిన వైలక్షణ్యం చూపగలుగు తున్నాడు. పద్యం చివరికి వచ్చేసరికి కవి ఉద్వేగం నటన విడిచి పెట్టి ఒక వేగంతో ప్రత్యక్షమయింది. 'పరపురుషుని జూచి తల వ్రాల్చే పతివ్రత సతీత్వ మబద్ధం.' జన సామాన్యంలో ఒక అబద్ధపు నమ్మకం ఉంది. బోగందాని చమత్కారంతో మగవాళ్లని ఆకర్షిస్తుందనీ, ఆమె నటన అబద్ధమనీ, పతివ్రత సతీత్వంనిజమనీ. కాని బోగందాని నటన నటనేఅని అందరికీ తెలుసును. ఆమెకూ తెలుసును. ఆమెలో రహస్యం ఏమీలేదు. పరపురుషునిచూసి తలవ్రాల్చే పతివ్రత హృదయంలో కూడా ఏమయినా రహస్యంగా అబద్ధం ఉందేమోగాని, బోగందాని ప్రేమ ప్రదర్శన డబ్బుకోసమే నన్న సంగతి నిజానికంటే నిజమయినది. ఆమె నటనలోని అబద్ధం ఎంతో నిజమయినది—పతివ్రత సతీత్వం కంటే కూడా. 'సంఘానికి వేస్టుపేపరు బాస్కెటు'గా ఆమె తన జీవితాన్ని అంగీకరించుకుంది.

* కవి. పఠాభిగారు.

ఆమె 'ముసుగులేని నిష్ఠురమగు నిజం,' 'నీడ పడనటువంటి నిర్మలమగు నిజం' చివర రెండుపాదాలూ, ఉక్తిలో గాంభీర్యాన్నీ, సౌలభ్యాన్నీ, ఉద్వేగాన్నీ ఇముడ్చుకున్నాయి. 'నిష్ఠురమగు నిజం,' 'నీడపడ నటువంటి నిజం.' రెండు చిత్రాలూ సృష్టిలోని మాలిన్యాన్నీ, దానిలోపలిఉండే నైర్మల్యాన్నీ ఒకేసారి ఎత్తిచూపుతున్నాయి భోగించాన స్వాభావికమయిన సృష్టిలో ఒకభాగంగా ఆదరాన్ని సంపాదించుకుంటోంది. ఇది నీతి పద్యం కాదు. కాని నీతిని ఇముడ్చుకున్న ఒక దృష్టిపథాన్ని సూచిస్తోంది. ఇన్నీ చెప్పిన తగవాత మళ్ళీ మొదట నేను చెప్పినదే తిరిగి చెప్పాలి. చివరికి ఎవరి అభిరుచిమీద వారు ఆధారపడవలసిందేగాని వైచిత్రిని పూర్తిగా పద్యంలోనించి విడదీసి ఎవరూ చూపలేరు. కాని ఒక పద్ధతిని చూసి ఏవగించుకోడంగాని, అభిమానించడంగాని, పద్యాన్ని అనుభవించడంలో ఏమీ సహాయపడదు. మనమీద, (అంటే అభిమానాలతోనూ, ఏవగింపులతోనూ నిండిఉన్న మన వర్తమాన వ్యక్తి మీద గాక) మనలో 'రెప్ప వెయ్యకుండా నిరాలోచనగా చూసే రెండు కళ్లమీద, మన మూలస్వభావం మీద, పద్యం తన ముద్ర వెయ్యగలగాలి. అందుకు తగిన వైశాల్యానికి మనం తావు ఇచ్చినప్పుడు, మన అంతరంగాన్ని నిష్పాక్షికంగా తయారు చేసుకున్నప్పుడు, పద్యాన్ని ఏమూల నించి చూడాలో మనకి తెలిసిపోతుంది. అప్పుడు తప్పు కాని విలువ మనకి అందుబాటులోకి రాదు. పద్యంలో వైచిత్రి మనమీద పనిచెయ్యడానికి మనం చోటు ఇవ్వాలి. మన తెలివిలో నిండిపోయిన సాంప్రదాయాల తెరలు తొలిగించుకుని ఆ వైచిత్రి లోలోపలికి పోయేటందుకు సావకాశం ఇవ్వాలి. అప్పుడు పద్యాన్ని మనం మెచ్చుకున్నా దూషించినా ఒకటే.

ఇంతా చేసి నేను చెప్పిన కొత్త విషయం ఏమీ లేదేమో. అయితే ఇన్ని పుటలూ ఎంత వృధా!

If there be nothing new, but that which is
Hath been before, how are our brains beguiled
Which labouring for invention, bear amiss
The second burthen of a former child! *

అయినా 'సృష్టికోసం నెప్పులు పడడం' లోనే ఒక సంతృప్తి ఉంది. ఇంత కష్టపడీ కూడా 'మొదటి శిశువు'నే మళ్లీ ప్రసవించినా, ఆ మొదటి శిశువే మళ్లీ కొత్తగా కనపడి తీరుతుందనే నమ్మకంతోనే ఈ కష్టపడడంకూడాను. నన్ను చూచి ఇంకా కొంతమంది నామాదిరిగానే 'సృష్టికోసం నెప్పులు పడిపడి' ఆ పాతపిల్లనయినాసరే పదేపదే కన్నట్టయితే సారస్వతానికి దారిద్ర్యం తీరుతుందని ఆశ.

As the sun is daily new and old
So is my love still telling what is told. †

* Shakespeare's Sonnet No. 59.

† Shakespeare's Sonnet No. 76.

నీ రా జ న ము

చదువుచుందును పత్రికావళి
సంతసమ్మున సంతతమునే
కవివతంసమ, నీమహోజ్జ్వల
కావ్యమాలికలన్

పాడుచుందును చిత్తమలరగ
మోడులే చివురించునట్టులు
మంజుతావక భావబంధుర
మధురగీతమ్ముల్

క్రోలుచుందు సహర్షముగ నే
కోరికలు రేకెత్తుచుండగ
చతురభవదీయార్ద్రకవితా
స్యందిమాధురులన్

మెచ్చుచుందు ననారతమునే
మించువేడుక సత్కవీశ్వర,
భవ్యభవదాదర్శభాజన
భావపుంజములన్

తన్మయత్వము చెందుచుందును
తావకీన వినూత్న దివ్య క
విత్వవంశీ కాకలీస్వర
వీచికావళిలో

పట్టికొండ రంగయ్య

గాఢయత్నము

ఒక్క చినుకున కాసించి యుర్వియెల్ల
ప్రతినినదమిచ్చు సుకుమారరుతులు సల్పి
ఎంతకాలము గాఢనిరీక్షచేసె
జలదతతి చూచి వానకోయిల యొకండు!

నవ్యలావణ్యములు చిల్కు ననలు గాంచి
మధుర మధుపాన కాంక్షమై మరచిపోయి
క్రూరకంటకపాళిలు గ్రుచ్చుకొనగ
జతన మొనరించు భ్రమర మేగతి కృశించె.

ప్రబల గ్రీష్మాతపంబు సైపంగలేదె
వానదెబ్బలు సోక నోర్వంగలేదె
లేత మొక్కల పొలము పండించుకొరకు
కర్షకుం డెంత రెంతలు గాసి బొందె.

భూరి సర్పంబు బుసగొట్టు పొదలయందు
ముద్దు లొలికెడు గేదంగి మొగ్గ చూచి
అందుకొను వాంఛతో నొక యధ్వగుండు
హస్తములు సాచె నెంతటి హానికోర్చి!

బెళ్ళూరి శ్రీనివాసమూర్తి

నా కళలు

ఈగాలు లీపూలు
ఈరేయి యెద విచ్చి
నా యెడద దూసినది
                    నీ పాట
నా యెడద నిండినది
                    నీ యాట

అర్థ మెరుగని పాట
ఆకృ తెరుగని యాట
ఆ పాట మరిగినది
                    నా మనసు
ఆ యాట దోగినది
                    నా వయసు
పాటలో పాటనై.
ఆటలో ఆటనై
పాట ఆటల దోచు
పడతి నిను రూపింప
నా తలపు ఫలితాలు
                    నా కలలు!
నా తపః ఫలితాలు

మొక్కపాటి కృష్ణమూర్తి

కొళిథిగాఁవ్ ధాన్యం మిల్లు

దిగుమర్తి రామారావు

192- సంవత్సరంలో చిల్కా సరస్సు సమీపంలో ఉన్న కొళిథిగాఁవ్, కంపెనీ పని మీద నేను వెళ్ళవలసివచ్చింది. కొళిథిగాఁవ్ స్టేషనుకు మూడు మైళ్ళ దూరంలో ఉంది. సూర్యాస్తమయం కాకుండానే కొళిథిగాఁవ్ చేరుకున్నాను. తిన్నగా, ధాన్యం మిల్లు యజమాని బహదూర్ శార్మల్లు యింటికే వెళ్లాను. కొళిథిగాఁవ్ అట్టే పెద్ద గ్రామం కాదు; అన్నీ గడ్డి యిళ్లే; ఒక్క శార్మల్లుదే పెంకుటిల్లు లాగా ఉంది; ఆయిల్లేనా పెద్ద ఆవరణా అదీ ఉన్నా అంత ఆహ్వానకరంగా కనిపించలేదు. శార్మల్లు వరండాపైనే పడక కుర్చీలో కూర్చొని ఉన్నాడు. మనిషిని చూచి నేను నిర్ఘాంతపడిపోయినాను. దీర్ఘముగా ముదిరిన చర్మవ్యాధితో బాధపడుతున్నట్టున్నాడు. దగ్గర కూర్చొని మాట్లాడడానికే ఎంతో రోత పుట్టింది.

నేను వెళ్లింది ధాన్యం మిల్లు చూడడానికే కనుక తణిఖీ చేసి, లెక్కలు వగైరా తయారు చేయడం ఆ రెండవ రోజు చేయవచ్చు ననీ, తన మనిషిని పంపుతా ననీ, ఆ రోజు కక్కడే ఉండ మనీ, శార్మల్లు నన్ను కోరినాడు; కాని అక్కడ ఉండడానికి నా కెంతమాత్రము ఇష్టము కలుగలేదు. నాతో కూడా ఒక నౌకరు వచ్చా డనీ, ఇద్దరమూ రాత్రికి స్టేషనులోనే పడుకొని మర్నాడు ప్రొద్దున్నే బయలుదేరి ధాన్యం మిల్లుకి వస్తా మనీ, వారి మనిషిని అప్పటికి అక్కడ హాజరుగా ఉండేటట్టు ఏర్పాటు చేయమనీ, వీలైతే ఆ రెండవరోజే పని ముగించుకొని రాత్రి రైల్లో కొళిథిగాఁవ్ విడిచిపెడదా మనుకుంటున్నా ననీ, శార్మల్లుతో చెప్పి, ఆ రాత్రికి స్టేషనుకే పోయి అక్కడే గడిపివేశాను.

ఆ రెండవ రోజు ప్రొద్దుటే వంటసామాగ్రి, వగైరా స్టేషను దగ్గిరే పట్టించుకొని ధాన్యం మిల్లుకి బయలుదేరాను. ధాన్యం మిల్లు కొళిథిగాఁవ్‌కి సుమారు నాలుగు

ఫర్లాంగుల దూరంలో ఉన్నది. మిల్లుకు ఆవల రెండు ఫర్లాంగుల దూరంలో చిల్కా సరస్సువేపు బురద, నిండుగా పెరిగిన గడ్డితో కూడిన తంపర మొదలవుతుంది. మరి అటువేపు గ్రామాలేవీ లేవు. జాలరివాళ్ల పల్లెలు ఒకటి రెండు కొళిథిగాఁవ్ సమీపంలో, ధాన్యం మిల్లుకు దిగువనే ఉన్నాయి కాని ఆవల చిల్కా సరస్సు వేపు మరేమీ లేవు.

ధాన్యం మిల్లు స్థాపించి ఎనిమిదేళ్ళయిందిట. మొదటిలో మంచి లాభాలు చేసుకొన్నా ఏకారణం చేతనో ఆరు నెలలయి పని లేకుండా ఉండిపోయిందిట. ఆ మిల్లు మళ్ళీ పనిచేస్తే లాభముంటుందో లేదో తెలుసుకోడానికీ, యంత్రసామాగ్రి వగైరా విలువ కట్టడానికీ నన్ను మా కంపెనీవాళ్ళు పంపించారు. నేను వెళ్లేటప్పటికి శాశ్మల్ తాలూకు మనిషి అక్కడ హాజరుగానే ఉన్నాడు. రోజంతా నా పని చూసుకున్నాను; కాని తెమిలిందికాదు. ఆరాత్రికి మరి స్టేషనుకు పోయేదేమిటని అక్కడే ఉండిపోవడానికి నిశ్చయం చేశాను. 'ఇక్కడేమిటి బాబూ; స్టేషనుకే పోయి పొద్దున్నే వచ్చేద్దాము' అని నౌకరు కుఱ్ఱవాడు అన్నాడు కాని మంచిగాలి వీస్తూండడంవల్లా, చిల్కావద్దకి షికారుగా పోవచ్చామని అనిపించి, రాత్రికి అక్కడే ఉంటానని చెప్పి, నౌకరును కొళిథిగాఁవ్ నుంచి బియ్యము, కూరలు మొదలైన సామగ్రి వంటకు తెమ్మనిపంపి, నేను చిల్కావేపుగా షికారు పోయినాను.

చిల్కాతీరమున ఎటువంటి సంచారమున్నూ లేక నిశ్శబ్దముగా ఉన్నది. ఆరోజుకు పని చాలించుకొని జాలరివాళ్ళంతకుముందే యిళ్ళు చేరుకున్నారు. సూర్యాస్తమయమైన తరువాత అస్థలమెంత ప్రశాంతముగా ఉన్నది! చాలాసేపు అక్కడే పచారు చేసి, నక్షత్రముల వెలుగులో చక్కగా కనిపిస్తున్న దారివెంబడే తిరిగి మిల్లుకు వచ్చేశాను. మిల్లువద్ద ఇంకెవ్వరూ లేరు; ఒక్క కాపలావాడు మాత్రము ఆ ఆవరణలోనే భార్యతోను, కూతురుతోను ఉంటున్నాడు. వరండామీద నాతో తెచ్చిన

పెట్రొమాక్సు దీపము వెలిగించి, రెండురోజుల క్రిందటి ఆదివారపు పత్రికను తీరికగా తీసి చదువసాగాను. కాపలావాడు—దండాసీ కులమునకు చెందినవాడు—కొంచెం ముసలివాడు—నమస్కారం చేసి, దూరంగా కూర్చొని కుశలప్రశ్నలు వేస్తున్నాడు. వాని కుటుంబ సంగతులూ, చిల్కాలో ఏమాసాల్లో చేపలు బాగా దొరుకుతవో, నీటిబాతుల కొఱకు దొరలు ఎప్పుడెప్పుడు వస్తూవుంటారో మొదలైన సంగతు లన్నీ చెప్పసాగినాడు. నాతో వచ్చిన నౌకరు కుఱ్ఱవాడు కాపలావాని కూతురుతో ఖబుర్లుచెబుతూ నింపాదిగా వంట ప్రయత్నము చేస్తున్నాడు.

సుమారు తొమ్మిది గంటలయింది భోజనం అయేటప్పటికి. చాలా మనోహరంగా వేస్తూఉన్నది చిల్కా సముద్రపు గాలి. అక్కడ ఉన్న పాత బల్లమీద నాకు పక్క అమర్చి నౌకరు, 'బాబూ, దండాసీవాని యింటిదగ్గిర ఉంటాను' అనిచెప్పి కాపలావాని యింటివేపు వెళ్ళినాడు. ఎలెక్ట్రిక్ టార్చి, కర్ర దగ్గరపెట్టుకొని దీపం ఆర్పేసి పడుకున్నాను.

పదకొండు గంటలో పన్నెండు గంటలో అవుతుంది. ఏదో శబ్దం—వినడానికి శ్రావ్యముగానే ఉన్న దాధ్వని—మెల్లగా నా చెవుల్లో క్రమేణా ప్రాకసాగింది. అది బాగా దగ్గరగా వచ్చినవరకూ నాకు పూర్తిగా తెలిసి రాలేదు. తల ఎత్తి ఆ శబ్దము వినవస్తున్న వేపు చూచాను. కాగడాలతో, ఒక పల్లకీ మోసుకుంటూ ఈ దారినే బోయీలు వస్తున్నారు. ఇంత రాత్రి వేళ ఈ దారిని ఎక్కడికి చెప్మా వెళుతున్నారు అనుకున్నాను. చిల్కా సరస్సు తప్ప మరే గ్రామానికీ ఇటువేపు మార్గం లేదే; లేక ఏదేనా అడ్డుదారి చిల్కా తీరంనుండే ఉన్నదా? ఆలోచిస్తూ ఉండగానే పల్లకీ మిల్లు దాటిపోయింది. మిల్లు సమీపించినప్పుడు పల్లకీలో ఎవరున్నారని గాని పల్లకీతో ఎవరు వెళుతున్నారని గాని నిదానముగా చూచిన జ్ఞాపకము నాకు లేదు. మిల్లు దాటిపోతూ ఉన్నప్పుడు బొంగురు కంఠముతో 'ఆగు, ఆగు' అని స్త్రీ కంఠస్వరముకాని నాకు వినిపించినదా ఆ పల్లకీలోనుండి?

పరధ్యానములో ఉండడముచేత సరిగా చెప్పలేను. నా ఆశ్చర్యము పూర్తిగా తీరకముందే పల్లకీ బోయీల కేకలు అకస్మాత్తుగా ఆగిపోయినవి. పల్లకీ దించినారేమో అని అటువేపు చూచాను. పల్లకీ కాని, కాగడాలు కాని మరి కనిపించ లేదు. ఇదేమిటి! ఇప్పుడేకదా ఈ మిల్లు పక్కనుండి వెళ్ళినవి! ఇంత సమీపంలో ఇంత అకస్మాత్తుగా ఎట్లు మాయమువగలవు? నాకు భయమూ ఆశ్చర్యమూ కూడా ఒక్కసారే కలిగినవి. దగ్గర ఉన్న టార్చి, కర్ర తీసుకొని వరండామీద నుంచే కాపలావాని కోసము 'నాయకో, నాయకో'* అని కేకవేశాను. ఎవరూ పలుకలేదు. అప్పుడుమట్టుకు నాకువిపరీతమైన భయమువేసింది. ఏమయినా, టార్చి, కర్ర తీసుకొని కాపలావాని యింటిదగ్గరకు వెళ్ళాను. పైని నానాకరుకాని, కాపలా వాడు కాని, వాని కుటుంబము కాని లేరు. కొంపతీసి అంతా ఎక్కడికేనా వెళ్ళిపోలేదు కదా? ఇంతలోనే తలుపులున జ్ఞాపకమువచ్చి తలుపుపైని దీపము ప్రసరించి చూచాను. పైని తాళమువేసిలేదు. తలుపుతోసి చూచాను. లోపల ఘడియవేసి ఉన్నది. అప్పుడు నాకు కొంచెం ధైర్యం వచ్చింది. తలుపుతట్టి మళ్లీ బిగ్గరగా పిలిచాను. ఈ మాటు కాపలావాడు నిద్రమేలొకని కంగారు పడుతూ తలుపు తీశాడు.

"ఏమిరా, యింతనిద్ర! మిగిలినవాళ్లేరీ?" అని కోపముగా అడిగాను. వాడు కంగారుతో "బాబూ నాటకం చూడడానికి కొళ్ళిధిగాంవ్ వెళ్ళారు. నాకు నిద్ర బాగా పట్టింది. ఏం బాబూ యిలా వచ్చారు?" అన్నాడు. పల్లకీ సంగతి వాడికి చెప్పి "రా, త్వరగా వెళ్లి చూచివద్దాము" అన్నాను.

"ఏమిటి చూస్తాము. నిద్రపోండి బాబూ; రేపూ వచ్చి అక్కడే పడుకుంటాను." అన్నాడు.

"లేదు; ఒక్కసారి వెళ్లివద్దాముపద. ఇప్పుడే కదా పల్లకీబోయీలు ఇలావచ్చారు.

---

* దండాసీ వాళ్ళను 'నాయకో' అని ఒరిస్సా ప్రాంతాల్లో సంబోధిస్తారు.

ఒక్కసారిగా కాగడాలూ, పల్లకీ బోయీలూ మాయమయిపోయినట్టు నిశ్శబ్దమయి పోయిందే. చాలా చిత్రముగా ఉన్నదే."

వాడు అన్నాడు కదా: "కోప పడకండి బాబూ. నేను కూడా చాలాసార్లు చూచాను. తరుచుగా ఈ మిల్లు మళుపు దగ్గర కనిపించి మాయ మవుతుంది" అన్నాడు.

నే నాశ్చర్యముతో "అయితే అది దయ్యమో, భూతమో అనా నీ అభిప్రాయం?" అని అడిగాను.

"అవును బాబూ. తమతో చెప్పడానికి సందేహించాను."

నేను నమ్మలేక పోయినాను. ఇప్పుడే కదా మిల్లు దాటి పల్లకీ వెళ్లింది. కొన్ని గజాల దూరంలోనే ఉండి ఉండాలి. "ఏమయినా అంతవరకూ వెళ్లి వద్దాము రా" అని బద్ధకిస్తూ ఉన్న కాపలావానిని తొందరపెట్టి పల్లకీ వెళ్లిన వేపే టార్చి వేసు కుంటూ వెళ్లాను. కాపలావాడు చెప్పినట్లుగానే పల్లకీగాని బోయీలుగాని వాళ్ల సంచలనంగాని ఏమీ కనిపించ లేదు. మరీ ఆశ్చర్యంతో దండాసీ వానిని కూడా రమ్మని తంపర వరకూ వెళ్లాను. రోడ్డు అక్కడితో సరి. ఎవరూ, ఎటువేపు చూసినా లేరు. ఎట్టి అలికిడీ లేదు. కలా? నిజమా? నే నెప్పుడూ అంత దిగ్భ్రాంత పడలేదు. ఇప్పుడే కదా పల్లకీబోయీలను స్పష్టముగా చూచాను; వాళ్ల పల్లకీ మోత కేకలు విన్నాను. భయవిస్మయాలతో ఏదో ఆలోచనలో నిమగ్నుడనై ఉన్న నన్ను సంబోధించి కాపలా వా డిట్లు చెప్పసాగినాడు: "అనుమానం వద్దు బాబూ. నేను అనేక సార్లు చూచాను. ఎప్పుడూ అర్ధరాత్రి సమయమందే ఈ దారిని కనబడుతుంది. అనేకమంది తెలియని వాళ్లు ఇలాగే మోసపోయినారు; తెలిసిన వా ళ్లెవరూ చీకటిపడితే ఈ దారిని రారు. నేనేమీ మాట్లాడక పోవడము చూచి వాడు నెమ్మదిగా, "సందేహించకండి బాబూ; ఇది గాలి విశేషమే. భూతమే కాని మరొకటి కాదు." అని ఇంకా నేను మాట్లాడక పోవడముచేత— "భయము

లేదు బాబూ. నేనూ మీ దగ్గరే వరండా మీద పడుకుంటాను." అన్నాడు; కాని కేవలము భయమువల్ల కాదు నేను మాట్లాడకుండా ఊరుకున్నది; ఇటువంటి వింత సంగతి నే నెన్నడూ ఎరుగను; ఇటువంటి విశేష ముంటుందని నే నెప్పుడూ అనుకోలేదు. ఒక రిద్దరిలాంటి వింత కథలు చెప్పగా విన్నాను కాని విశ్వసించ లేదు. ఏదో తీవ్రమైన భావనలో పడి నిశ్శబ్దముగా ధాన్యపుమిల్లువేపు నడువ సాగాను. వెనకాలే కాపలావాడు కూడా మాట్లాడకుండా నడుస్తున్నాడు. మిల్లు చేరుకున్నాక అడిగాను, "ఎప్పుడూ ఈ పల్లకీ, బోయీలే కనిపిస్తారా, మరేమేనా కనిపిస్తుందా? నీ భార్య పిల్ల కూడా చూచారా ? వాళ్లకి భయము వెయ్యదా ?" అని.

"ఈ సంగతి ఇక్కడ అందరికీ తెలుసును బాబూ నా భార్యేమిటి, పిల్లేమిటి, రాత్రి పొద్దు పోయాక ఈ దారిని ఎవరూ ధైర్యం చేసి వెళ్లరు బాబూ."

"అయితే ఈరాత్రికి మరి వాళ్లు కొళిథిగాంవ్ నుంచి రా రేమిటి ?"

"లేదు బాబూ; తెల్లవారు ఝాముననే వస్తారు. దుప్పటి, కర్ర తీసుకొని యిప్పుడే వస్తున్నాను బాబూ." అని వాడు వెళ్లిపోయినాడు.

కొంచెము సేపటిక్రిందటనే జరిగిన వింతసంగతి విషయమై ఇంకా ఆశ్చర్యపడుతూ మేలుకునే పక్కమీద పడుకుని ఉండగా కాపలావాడువచ్చి గోడకి చారగిలబడి కూర్చొని ఇట్లా చెప్పినాడు. "బాబూ, శాస్త్రుల్లు కామందుగారి మిల్లుకొనడానికే వచ్చి ఉన్నారటకదా."

"అవును. బాగుంటే మాకంపెనీవాళ్లే తీసుకుంటారు" అన్నాను.

"మొదటలో మంచి లాభం వచ్చింది బాబూ శాస్త్రుల్లు గారికి. ఆరు సంవత్సరాలలో యాభైవేలు లాభము కలిగిందట. ఇప్పుడుకదా రెండు సంవత్సరాలనుంచీ నష్టములో నడుస్తూంది. ఆరు నెలలయింది, మిల్లు నడవడమే లేదు. మరేమికూడ బెడతానని అమ్మేస్తున్నారుకాని మా గొప్పమర బాబూ".

"అవును, చాలా డబ్బుఖర్చు చేసి కట్టించినట్టుంది."

"అనేకము ఖర్చు చేశారు బాబూ. ఈ మిల్లు కట్టడము ప్రారంభమైనప్పటి నుంచీ నే నిక్కడే ఉన్నాను. మంచి కామందు బాబూ శాస్త్రుల్లు; కాని మరస్థాపించి నప్పుడే పెద్ద పాపమొకటి చేసిఉన్నారు."

"ఏమిటది ?"

"ఈ మిల్లుస్థాపన చెయ్యడానికి ముందుశక్తిని తృప్తిపరచాలని చేశారు బాబూ."

"ఏమిటి చేశారు ?"

"శాస్త్రుల్లు ఇద్దరు అన్నదమ్ములు. పెద్దాయనే బహదూర్ బాబు. ఆయనకు ఒక్కడే కుమారుడు కలిగాడు. తమ్ముడికి ఒక్కతే కుమార్తె. ఈ చుట్టుపట్ల ధనవంతులు శాస్త్రుల్ కుటుంబమే.

రేపు మిల్లు స్థాపన అవుతుందనగా క్రిందటి దినమే దేవిని తృప్తిపరచాలని శక్తి విద్యనేర్చిన జాంకానాళ్లోనుండి వచ్చిన మాంత్రికుడు చెప్పినాడుట. పెద్దపిల్లయి, ఇంకా కాపురానికి వెళ్ళని కన్యకని శక్తికి బలి ఇస్తే మరి నష్టము లేకుండా మిల్లు మంచి లాభముమీద నడుస్తుంది; లేకుంటే దేవి నాశనము చేసివేస్తుందట. అలాటి పిల్లెవరూ దొరకలేదు బాబూ. బహదూర్ శాస్త్రుల్లు తమ్ముడుకుమార్తె మటుకూ యుక్తవయస్సు వచ్చి కాపురానికి సిద్ధముగా ఉన్నది. ఆ పిల్లను నేనెరుగుదును బాబూ; చాలా అందమైన పిల్ల. గొప్పయింటివారు కదా. సత్రికాలం బాబూ. మన కుటుంబానికి ఒక్కతే ఆడపిల్ల; గొప్పగా పంపించాలి; నేనే ముహూర్తం కట్టించి పంపిస్తానని తమ్ముడితో చెప్పి, ధాన్యం మిల్లు స్థాపనకు క్రిందటి రోజునే ముహూర్తం పెట్టించి, పల్లకీలో అత్తవారి గ్రామానికి పంపించే ఏర్పాటు చేశారు.

అమ్మాయి ఒక పల్లకీలోనూ, తల్లి ఒక పల్లకీలోనూ ఇంకా వెనకాల ఇతరులూ,

పాత్రలూ, సామగ్రీ గొప్పగా బయలుదేరారు. బాబూ, పల్లకీ బోయీలకు లంచమిచ్చి ఈ పిల్ల పల్లకీ ఒక్కటీ కొంచెం ముందు నడిపించి, చీకటి పడ్డప్పుడు దారి తప్పించి, అర్ధరాత్రికి సరిగ్గా ఈ మిల్లువద్దకు వచ్చేటట్టు పన్నాగము చేశారు. ఆ పిల్ల తల్లికోసము చాలా బెంగ పెట్టుకున్నదట. ఈ ధాన్యం మిల్లు దగ్గర పైకి చూచి ఆపమని కోరిందట. కాని కొంచెము ఎగువకు తీసుకువెళ్లి బోయీలు మరి కనిపించకుండా పారిపోయినారట. జొంకానాళోనుంచి వచ్చిన మాంత్రికుడు, భయంచేత నోటమాట రాని ఆ అమ్మాయిని మిల్లులోనికి తీసుకుపోయి శక్తికి బలి ఇచ్చి ఆమెను నగలతో కూడా అక్కడే పూడ్చివేశాడట బాబూ. ఇది నిజమైన సంగతి.

"ఏమిటీ! తమ్ముడి కుమార్తెనే హత్య చేశాడూ ?"

"అవును బాబూ! శక్తికి భయపడి తమ్ముడి కుమార్తెనే బలి యిచ్చేశారుట. ఈ మాట పైకి తెలియకుండా చాలా సొమ్ము ఖర్చు చేసి బాదోబస్తు చేశారు. అధికారుల నోరు కట్టినా ఊరివాళ్ల నోరెవరు కట్టగలరు బాబూ. ఇది జరిగిన కొద్ది కాలంలోనే శాస్త్రుల్లు తమ్ముడూ, ఆయన భార్యా ఇద్దరూ బెంగపెట్టుకొని చనిపోయారు. మరి ఒక్క సంవత్సరానికే శాస్త్రుల్లు ఒక్క కుమారుడూ చెరువులో మునిగి చనిపోవడమూ, శాస్త్రుల్లు భార్య వాంతులు వెళ్లి మరణించడమూ జరిగింది. పాపకార్యము చేశాను, వంశము నాశనమై పోతున్నదే, అని బెంగ పెట్టుకున్నారు బహదూర్ బాబు. చాలా దానధర్మములు చేశారు. కుమారుని పేర ఈగ్రామంలో పెద్ద చెరువు తవ్వించారు. ఎండాకాలములో ఈ చుట్టుపట్ల కదే మంచినీళ్ల చెరువు బాబూ. తమ్ముడి కుమార్తె పేర పూరీ జగన్నాధములో సత్రము కట్టించారు.

మొదటలో మంచి లాభం వచ్చిన మిల్లుని, కుటుంబములో కలిగిన కష్టాలచేత శాస్త్రుల్లు అశ్రద్ధ చేయసాగినారు. లాభములు పడిపోవడమే కాకుండా శాస్త్రుల్లుకి పెద్దరోగముకూడా పట్టుకుంది. ఎంత విచారించినా, ఎన్ని దానములు చేసినా పాప

కార్యానికి ఫలం అనుభవించక తప్పదు కదా అని గ్రహించారు శాస్త్రుల్లు. ఇక అట్టే కాలం బ్రతకను, వంశము కూడా నశించి పోతున్నది, దైవకార్యము చేసి పోదా మని రాధాకృష్ణ మందిరము కట్టించడానికి పూనుకుని చాలా సొమ్ము ఖర్చు చేసి ఆగ్రా నుంచి శిల్పుల్ని తెప్పించి సంవత్సరంన్నర నుంచి పని చేయిస్తున్నారు. గొప్ప దేవాలయం బాబూ; గొప్ప వైష్ణవమఠం. ఈ మిల్లు క్రయం చేసి, ఆ ధనం కూడా దేవాలయానికీ, మఠానికీ ఇచ్చివేస్తారట. అన్ని వ్యాపారములూ వదులు కున్నారు బాబూ. ఇప్పుడు నిత్యమూ రాధాకృష్ణుల భజనతోనే కాలము గడు పుతూ ఉంటారు.”

“అయితే ఇందాకా కనిపించిన పల్లకీ శాస్త్రులుగారి తమ్ముడు కుమార్తె కూర్చొని వెళ్లినదే అంటావా ?”

“అవును బాబూ; ఆ పిల్లని నే నెరుగుదును. ఆమె భూతమే ఈ దారిని కనిపిస్తూ ఉంటుంది. మీరు నమ్మకుండా ఉన్నా రనే ఈ కథంతా చెప్పినాను; లేకపోతే ఈ సంగతి ఎప్పుడూ చెప్పవలసిన వాణ్ణి కాను బాబూ.”

ఈ కథ విన్న తరువాత ఆ రాత్రి మరి నాకు నిద్రపట్టలేదు.

ఆత్మార్పణము

వావిలాల సోమయాజులు

అవును నిజమ్మె— కుంతి కనె నన్నది నమ్మితి, సూతపుత్రునిన్
చివరకు రాజ్యమిచ్చి యిటు చేసెను రాజుగ రాజరాజు, నే
నెవరికి బందువైతి నపు డేడ్తెర చిత్తము కుందువేళ, నీ
బనరము వచ్చె స్వామికి నుపాయనమై ఋణమెల్ల తీర్పగా

తల్లికి నాకు తీరినది ధర్మము వీడుచు గంగ చేతిలో
నుల్లము రాయిచేసుకొని యుంచినయప్పుడె, నాటి నుండి నా
తల్లియు తండ్రియున్ ప్రభువు దాతయు నాతడె యయ్యె, కావునన్
ఎల్లి రణంబులో తనువు నిచ్చెద, నాయది కాదు, మాధవా !

నే నొక తేపగాగ నవనీపతి దాటదలంచె శాత్రవాం
భోనిధి, నమ్మినాడు నను పొత్తుల వానిగ, పార్థివుండు నా
పై నిఖిలమ్ము పెట్టి యొక పాడి వహించెను, నీవె వచ్చి నన్
పూనుము వైరి గెల్చి భువి పొల్పుగ నేలుమటందు వీగతిన్

‘ నిజహౌ, రాజ్యము నీది, తమ్ములును నిన్నె పెద్దగా చేసి నీ
విజిగీషాప్తికి తోడునీడ లయి యుర్వీరాజ్య మిప్పింపగా
ప్రజకెల్లన్ పితవౌట ధర్మ ’ మనె; దప్పార్థుండు ‘బావా ! చతు
ర్భుజ ! మా కక్కున కూటి కాసపడె కర్ణుం’ డన్న నే మయ్యెదన్

క్రోధము జీర్ణమై హృదయ గోళములం దొక మూల దాగి మ
మ్మా ధరణీధవా ! కదలి యూరక బాధలు వెట్టు నొక్కు దు
ర్వ్యాధిగ— నన్ను ఫల్గుణిని— వారణచేయగ వెజ్జు లేదు, మా
యాధియు వ్యాధియు న్దొలగు నాహవ మెవ్వరికైన కేశవా !

పార్థున కీడు కర్ణు డని పార్థివ పార్థివు డన్నవాడు, నే
వ్యర్థము చేయ నా తలపు వంచనచేసి, మహోపకారి, రా
జ్యార్థము నేనె యిట్లయిన నాతని కెవ్వరు తోడు నిల్తు, ర
న్యార్థముగాగ నేల నిటు యాచన చేసెదవో జనార్దనా!

కాలులు లేక జిక్కితిమె! కాలవశంబున చిక్కినాము మే
మాలములోన చిత్రరథు, కర్జును డయ్యెడ వచ్చి గెల్చి మా
యేలికతోడ మమ్ము గొని యేగెను ధర్మజు నొద్ద, కాత డిం
కేల వచింప, మెత్తనివి యెన్నియొ మాటల నాడె సూడగన్

తప మొనరించె ఫల్గుణుడు దానము చేసెను పార్వతీ ప్రియుం
డపరిమితానురాగమున నద్భుత దివ్య మహాస్త్రమంచు మా
కృపుడుమ ద్రోణుడుఁ బెదర క్రేపులు క్రీడికి చిక్కెగాని వా
రపు డొక కొంత పూనుకొన నాతని కేగతి మూడి యుండునో

మిన్నుల తన్ని పోరగల మేటి బలాఢ్యుడ నన్న పొంగు భీ
మన్నకు మిన్న, మమ్ము గని మల్లుల నెంతటి వారినైన నే
సున్నములోని కెమ్ము పొడసూపని యట్లుగ నుండచేతు నం
చెన్నియొ చెప్పె, నిప్పు డవి యేటికి వ్యర్థముచేయ జూచెదో

నే నొకవేళ పాండవుల నీడకు చేరిన లోకనింద నా
పై నిక రాక మానదు, త్రపఁ త్యజియించెద నోర్చియైన, కా
నీ వను కన్నబిడ్డ వలె నేగతి పెంచెను సూతు, డెంత లో
లోన తపించునో, ప్రభుని రూక్షణ వీక్షలు పర్వ నంతటన్

అతడే మూలము దీని కంచు ప్రభు వత్యంతాగ్రహోన్మత్తుడై
చితి కెక్కింపక మానునే యతని నా సీమంతినీ రత్నమున్,
వెత లన్నింటికి నాడు గంగకడ నన్వీక్షించు టౌ గాదె, యా
తత ప్రేమార్ద్రి మనస్కుల న్జెరచి యీతం డొందునే స్వర్గమున్

నవ మాసంబులు మోసి కన్నయటు 'నాన్నా ! చిట్టి నా తండ్రి ! నీ
వవుదోయీ సకలార్థముల్ జనని కం' గానంద సందోహ సం
భవ రాగంబున జూచి దృష్టి భయ మెత్పాటిల్ల 'గొంతెత్తి కా
వవె నా బిడ్డను దేవదేవ !' యను బావా ! తల్లి యీనాటికిన్

ఎటు త్యజియింతు నాయమను ? ఏ గతి నిల్చును నాదు ప్రాణముల్,
పటుతర లోభ మోహముల దానిస నా యెద తల్లివంక, నీ
వటువలె చేయ నేర్చి తని యచ్యుత ! నే నెటు చేయ నేర్తు, నీ
వెటు మది నిల్పినావు పరమేశ ! యశోదను వీడి, యేగగన్

సూతుల కంటిపాప నయి సూతకుమారిక నిచ్చి చేసి యా
సూతులు కొల్వగా నిటుల సూతకులంబున నేను కర్తనై
సూతుడు కానటన్న యధి చొప్పదునే పయిపెచ్చు సర్వమున్
కోతలె యౌట గాక నటు కుంతి చరిత్రకు మైల సోకదే

నను 'ధర్మజ్ఞుడ వోయి నీ' వనెదు, నే నామాట సత్యంబు గా
గను వర్తింపగ పోలదే, యిచట నాకై ప్రాణ మర్పించు వా
రును · మారాకుగ నెంచి ప్రాకి మది యూరున్ పేరు కాంక్షించు వా
రును నున్నా, రెటు లింత లంతలను పోలున్ చేయ నన్యాయముల్

కాటికి కాళ్లు చాచుకొని గంపెడు కోర్కెల చేతిమీదుగా
దాటగ నున్న సూతుని విధం బెటు భగ్నము చేసి వత్తు, 'నా
మాటల కడ్డు చెప్పె' నని మాత్రము లో ననుమాన మున్నచో
చోటు లభింప నీయకుము; సూత కుమారుని నీ వెరుంగవే

చెలి పొలయల్క తీర్చుతరి సేవకురా లరుదెంచి 'దేవ! మీ
చెలువుడు వచ్చె కర్ణు' డని చెప్పిన మాత్రనె లేచి వచ్చినన్
పులకిత గాత్రుడై యెదద పొంగులు వారగ గ్రుచ్చి యెత్తు, నే
క్కలగెద నయ్య మా ప్రభుని కాంతులు పారెడు చోట నిల్వగన్.

కాకులమూక లోకము ప్రకారము వింతయె; దాని కర్థమౌ
నే కనినంతనే మొదటనే కురురాజు, పవిత్రమూర్తి— కృ
ష్ణా! కలుషాత్ము లెంద రెటు లాడిన నేమి, హిమాద్రి యాత, డ
స్తోక దయాపయోధి రిపుతోయజమత్తగజంబు పోరులన్

జనపతి చూచినట్లె యనుజన్ములు చూచెద రాత్మబంధువు
న్ననుగొని నట్లు, నే మరుల గల్గుదునే పది జన్మ లెత్తి యా
యనిమిష సౌహృదంబు, హృదయంబున లేదిక తావు వేరె నా
యనుజులకైన, కాన సదయా దయ వీడకు మిట్టి పల్కులన్

ధ్రుతరాష్ట్రుండును కర్ణు డన్న నమితోత్సాహంబు చూపించు, నే
వితమైనన్ చెవివేయ కా ప్రభువు కావింపండు, భీష్మాది బం
ధుతతిన్ విన్నటు కానవచ్చు వెలికిన్, ధుర్యోధనాదిత్య సం
స్థితి కెవ్వారలు పట్టుకొమ్మ లెరుగున్ స్వీయాంతరంగంబునన్

సుఖమో, దుఃఖము, స్వర్గమో, నరకమో, సూత్రించె నీ కర్ణు డీ
యఖిలం బాతని దంచు మాధవ! సహస్రాంశుండె రానీ యికన్
మఖవుండే యరుదెంచె నాక మిదె కొమ్మా, ధర్మరాజాగ్రజా!
సఖివై, పాండవ బంధువై, యనిన నే చాలింపగా నేర్తునే

అతని సుఖమ్మె నా సుఖము, నాతని దుఃఖమె నాదు దుఃఖమై
మతు లొకటై చరించితిమి మంచికి చెడ్డకు, నింతకాల మే
గతి చనెనో యదే గతిగ కాలము వెళ్లెడు గాక కృష్ణ! యా
కతమున రౌరవాది నరకంబులు వచ్చిన సంతసం బగున్

'ద్రోవది లోన పా' అని యదోవితమైన మొగంబు వెట్టి యీ
పావన మానసుస్ కలగ బారగ చేసెద వేల? సూతుడా
పూవిలుకాని బారిపడి పోవగ కీచకుడా యితండు, బా
వా! వనజాక్ష! ఏటి కిటు లగ్నిపరీక్షకు పూనుకొంటివో

నా పురాకృతమైన పుణ్యంబె యట్లు
మూర్తి తాల్చిన దనదగు పూతచరిత
సఖియ, యర్ధాంగి జీవితేశ్వరియు నైన
సూతసుత మిన్న యొరులను చూడ గలనె!

నన్ను కనిపెట్టి నా యెద నున్న లతలు
చివురు లెత్తగ దోహద సేవ చేయ
విసుగు చెందదు; నడుపు నెవ్వేళ నైన
బతుకు పడవను విసువాక బాటలందు

అలసత నేగు జహ్నుతనయా విరహోద్గత మందగీతు లు
త్కలముగ వచ్చి మా మతులు త్రచ్చ ప్రియామృదు బాహువల్లరీ
లలిత దృఢానుబంధన విలాసముతోడ శరన్నిశీధినీ
విలసనలన్ హసింతు మతి వేలముగా ప్రణయానుకూలతన్

పాండవపక్షపాతివి, శుభ ప్రతిపాదన చేయు కోర్కెయే
మెండుగ నున్న రీతి కని మెచ్చగ లోకము రాయబారివై
దండి జయమ్ము పొందితివి, తథ్యము— ధర్మబలమ్ము చిక్కె నె
వ్వండు సమాన మౌను నిలువన్ సరి పజ్జను నీతికోవిదా !

అగునని సంధి వచ్చితివె ! ఆ నెప మంతయు ధార్తరాష్ట్రుపై
దిగవిడి చేగ నిట్టు లరుదెంచి మమున్ కనుకట్టి గారడీ
తగ నొనరించినావు, ప్రభు ధైర్యపు టాయువుపట్టు చిక్కె, మా
పగతుర కెంత కొండ కనుపట్టిన దెంత యదృష్టమో కదా !

ఆవులించిన పేవుల నట్టె లెక్క
పెట్ట గలిగిన నీపయి పెట్టినారు
సకలమును దిద్ది సాగింప సమర మింక-
నతియు మొదలిడె నీ మహానాటకమున

కదలక మెదలక పోనీ
కదపక నీ వాక్కమారు కను దామరలన్
కదిపితి వెల్లర గుండెల
పదపదమున కృష్ణ ! నీదు ప్రాభవ మెసగన్

మేమో ధర్మ విరుద్ధమౌ నటుల స్వామీ! నిన్ను బంధించినా,
మేమో ప్రజ్ఞగ యెంచి, భ్రాంతివడి, కానీ నీకె మేలయ్యె మా
వ్యామోహమ్ము, భవత్ప్రదర్శనము దేవా! గుండెలో రాయిమై
ఏమో చేయక యూరకుండు నటులే— యీడేరె నీ యూహలే

ఒకట నమరులు నమరారు లొకట నిలచి
పమబలంబుగ మథియింప జలధి గర్భ
మొదవ హర్షము కలిగె రసోదయంబు—
అటులె యగు గాక నేటి మహాహవమున

కారణ జన్మ మెత్తి యల కచ్ఛపమైన పురాణ పూరుషుం
డీ రణసాగరోన్మథన మేర్పడ భారము మోయ పుట్టి, పెం
పారగ పంబు ధర్మ మధురామృతమున్ ఒక వేళ చక్రియై
పోరున తారుమారయిన పూనగ వచ్చు నధర్మమార్గమున్

అతని కోర కేను నా కోర కతడు పుట్టి
విధి నియామక మిది గాగ విశద మగును;
కర్త్రి లేకున్న కర్ణుడు కానబడునె?
కర్ణుడే రాక కాదుపో కర్త్రి బ్రతుకు

జ్యానాదార భటీ ప్రతిశ్రుతుల సద్యస్స్ఫూర్తి వర్తిల్ల మే
మూనానూన శరప్రహారముల కుద్యోగింప ధానుష్క సం
తానం బంతయు మూర్ఛవోవు నిక నా దైత్యారి వీరవ్రతుల్
ప్రాణాపాయ భయంబునన్ చెదరి కంపాకంపులై నిల్వరే

గాండీవమ్మును కాలపృష్ఠమును శ్రీకంఠోగ్ర కోదండముల్;
నిండారన్ తెగ లాగివైచిన మహానిర్ఘాతపాతంబులై
కొండల్ కొండలె కూల్చినట్లుగను కాకోలార్భులన్ క్రమ్ముచున్
చెండాడన్ విశిఖౌఘముల్ పరపు ద్విట్సేనా సమూహాళికై

సరియై క్ష్మాపతి వర్గముల్ బెదర నాశాదుర్గముల్ గిర్గిరన్
తిరుగన్ పార్థుడు నేను మొగ్గరములన్ తీండ్రించి ఖండింప నో
హరి! నీ కెంతయొ మోద మబ్బును గదయ్యా నేడు నీ వేటి క
తరుణంబున్ చెడగొట్టి చూచెదవు భక్తాయత్త చిత్తంబునన్

ఈ రాధేయుడు కుంతి బిడ్డ డని నీ వేనాడు సూచింప కే
పారావార పరీత భూవలయమున్ వర్జించు ధర్మాత్మజుం
డా రాజన్యుడె నేల నేలవలె చంద్రాలోకముల్ కాయగా
మా రాజేశ్వర రాజసోజ్వలుడు ధర్మంబీయగా నేర్చునే

మాధవ నీకె సంగర రమా పరిరంభణ మబ్బు, మాదు భూ
మాధవు కే నటన్న మతిమీరిన యూహల పోను, కాని నే
నా ధరణీ పతిన్ విడువ, నాత్మకళాంతిని తెచ్చుకోను మా
మాధవ! యేల నిట్టి పరియాచకముల్ నను బోటి వానితోన్

మాయావాదము లేల నోయి ప్రభువా! మా కర్ణుడే యన్న నీ
యీ యాదృచ్ఛికమైన బుద్ధి కెదలో నిల్లిచ్చి కాపాడ వో
యీ! యాచించెద దీనినే— ఇహపరా లేమైన నాకేల నా
ప్రాయం బిచ్చితి రాజరాజునకు నీ పాలోయి నా ఆత్మయే

తర్జుబా - ఏ - ఉస్తాద్

మునిమాణిక్యం నరసింహారావు

స్కూలుమాస్టరీ చాలా హాయి అయిన పని అనీ మాస్టరు కాలుమీద కాలేసుకొనీ నిశ్చింతగా జీవించవచ్చుననీ అంతా అనుకొంటారు.

అంతటితో ఊరుకోక తమవృత్తిలో ఒడుదొడుకులూ, కష్టాలూ అపరిమితంగా ఉన్నవి అనికూడా ప్రతివాడూ అనుకొంటాడు.

ప్లీడరు అంటాడు: "మావృత్తి అంతదరిద్రపుది ఇంకోటి లేదండి. ఎవరో ఒకడొస్తాడు. ఆయనకూ ఆయన పెదతండ్రిగారి కుమారులకూ ఉండుకున్న తగాదాను గురించి విషయాలన్నీ చికముకలుగా చెప్తాడు. అదంతా ఒక పెనవేసిన ముళ్ళతాడు. ఆ ముళ్ళు అన్నీ విప్పుకొని ప్రధాన సూత్రాన్నిలాగాలె. వాళ్ళ ఆస్థి వివరాలూ పంపిణీలలో వచ్చిన భాగాలూ. వాళ్ళ దొడ్డిగోడ వెడల్పు దగ్గరనుంచీ జ్ఞాపకం ఉంచుకొని "లా"ను నా పార్టీ పక్షం లాగేటప్పటికి తలప్రాణం తోకకొస్తుంది. ఒక్కొక్క విషయం క్షుణ్ణంగా తెలుసుకొంటానికి వచ్చినన్ని పుస్తకాలు చదవాలె. బోలెడు పుస్తకాలు తిరగెయ్యాలె. ఇంతా కష్టపడితే కేసు గెలవనూవచ్చు, గెలవక పోవనూ వచ్చు; నాలుగు రాళ్లు రాలనూ వచ్చు రాలక పోవనూ వచ్చు.

ఛీ! ఛీ! వెధవ బ్రతుకండీ. ఎక్కడైనా స్కూలు మాస్టరీ అయినా సంపాదించక పోతిని. హాయిగా కాలు మీద కాలేసుకుని కూర్చుని ఏవో రెండు ముక్కలు చెప్పి సాయంత్రానికల్లా నిశ్చింతగా ఇంటికి రావచ్చు.

క్రిందటి సంవత్సరం భూమి గుండ్రంగా ఉండి ఈ సంవత్సరం చప్పున మారి బల్లపరుపు కాదుగదా! ట్రయాంగిల్ యొక్క మూడు యాంగిల్సూ కలిసి

ఈ వ్యాసములోని చాలభాగములు, ఇదివరలో నే నిచ్చిన రేడియో ఉపన్యాసముల లోనివి.

ఎప్పుడూ రెండు రైట్ యాంగిల్ సే! నిమ్మకాయ ఎగరేస్తే చటుక్కున క్రిందనే పడుతుంది గాని, (మా "లా" లాగ గ్రావిటేషన్‌లా మారి) పైకి ఎగిరిపోదు! అప్పుడు నాలుగు కాళ్లు అన్న విషయాన్ని ఏ హై కోర్టు తీర్పూ మార్చలేదు. కాబట్టి అధ్యాపకుడు తన వృత్తికి సంబంధించిన విషయాన్ని ఒక సారి గనక క్షుణ్ణంగా తెలుసుకొన్నాడా ఇక బాధ లేదు. ఎన్నాళ్లు చెప్పినా ఆ విషయమే చెప్పొచ్చు. ప్లీడరీలో అలా కాదు. ఏ రోజు కారోజు క్రొత్త విషయాలు నేర్చుకోవాలె. ఇదండీ బాధ. ఈ వృత్తి కంటే ఏదైనా మంచిదే."

ఇక డాక్టరు సంగతి. ఒకడికి టైఫాయిడ్ జ్వరం వస్తుంది. మందు నడుపుతునే ఉంటాడు, జ్వరం ఎక్కువౌతుంటుంది. సంధి పుడుతుంది. ఇచ్చే ఇన్‌జెక్షన్ ఇస్తూనే ఉంటాడు, పోసే మందులు పోస్తూనే ఉంటాడు, జ్వరం తగ్గదు. డాక్టరుకు ఆదుర్దా ఎక్కువ అవుతుంది. పాపం, చావు బ్రతుకులతో కూడిన విషయమాయె అది! రోగి బంధువులు ఆయనను రాత్రిళ్లు నిద్ర పోనీయరు. గంట గంటకూ వచ్చి లేపుతునే ఉంటారు, రోగికి బాధ ఎక్కువగా ఉందంటూ. ఇల్లాగ ఒక రోజు కాదు రెండు రోజులు కాదు. బ్రతుకంతా ఇదే వరస ఆయె!

డాక్టరు విసుక్కుని, "ఛీ వెధవ బ్రతుకు! దిన గండం నూరేళ్లు ఆయుష్షులాగుంది. లాయర్ కోర్టు కెడతాడు ఏవో తోచిన రెండు లా పాయింట్లు చెబుతాడు. కేసు గెలుస్తే గెలుస్తుంది, పోతేపోతుంది. గెలవక పోయినా అంత ప్రమాదం ఏమీ లేదు. పోతే ఆస్తి పోతుంది గాని ఎవరి ప్రాణాలూ పోవు" అని అనుకుంటాడు.

"పోనీ స్కూలు మాస్టరీ అయినా బ్రతికిపోయేవాణ్ణి. పది గంటలకల్లా బడికి వెళ్లి కడుపులో చల్ల కదలకుండా కుర్చీలో కూర్చుని తోచిన ముక్కలు రెండు కుర్ర వాళ్లకు చెప్పి సాయంత్రానికి నిశ్చింతగా ఇంటికి రావచ్చు. మళ్ళీ రమ్మని వేపేవారుండరు." అని అను

కుంటాడు.

అదీగాక అధ్యాపకుడు చెప్పే విష యాల్లో చిన్న ప్రమాదాలు వచ్చినా కొంప మునిగి పోయేది ఏమీా లేదు. మందులు కలపటంలో కనుక శాస్త్ర పొరపాటు వచ్చిందో రోగి తకీమని చస్తాడు. కాని పాఠం చెపటంలో ఒక వేళ ఏదైనా పొరపాటువచ్చినా ప్రమా దమూా లేదూా, తరువాత దానిని దిద్దు కోనూా వచ్చు. ఉపాధ్యాయుడు తెలిసో తెలియకో భూమి బల్లపరుపుగా సిబ్బి రేకులాగ ఉందనే చెప్పాడు అనుకోండి. అల్లాగ చెప్పినా ఏ అఘాయిత్యం జర గదే! భూమి సిబ్బిరేకులాగ ఉందన్నా, అప్పడాల కర్రలాగ ఉందన్నా తక్షణం పిల్లల దైనిక జీవితంలో వచ్చే ఉప ద్రవమైన మార్పు ఏమీా లేదు!

మందులు ఇచ్చే విషయంలో డోసు కొంచెం ఎక్కువ. పడ్డా, పొరపాటు పడ్డా, తక్షణం రోగం ఎక్కువ కావ టమో, ఖర్మం చాలకపోతే వాడు చావటమో సంభవిస్తుంది. చదువు చెపటం అల్లాగ కాదు.

ఒకరైలు గంటకు ముప్ఫైమైళ్ళ వేగ మ్ముతో పోతున్నది. దాని వెనకాల నాలుగు గంటల ఆలస్యంగా మరో బండి బయలుదేరి గంటకు నలభై మైళ్ల వేగంతో పోతున్నది. ఈ రెండు బళ్లూ ఎన్ని మైళ్లుపోయినతరువాతకలుస్తాయి? అన్న లెఖ్ఖ చెపటంలో ఏదైనా పొర పాటు వచ్చినా ఆ రెండు రైళ్లూ కొట్టు కోనూా కొట్టుకోవు, ఎవ్వరికీ ఆపదా రాదు.

ఇల్లాగ, పాపం డాక్టరు అనుకొని తన వృత్తిని గురించి అసహ్యా పడుతూా ఇతర వృత్తులు హాయి అయినవి అను కొంటాడు. ఏ వృత్తిలో ఉండే బాధలు ఆ వృత్తిలో ఉన్నాయి. ఎవడి కష్టం వాడికే తెలియాలి ఇతరులకేం తెలు స్తుంది!!

అదేం ఖర్మమో ప్రతివాడూా సూాలు మాాస్టరీ వృత్తి మీాదికి దండెత్తుతాడు. అన్ని వృత్తులలోకి మాాస్టరీ పనిహాయి. వాళ్ళకు కావలసినన్ని సెలవలు. శని వారం సెలవ. ఆదివారం సెలవ. పండగ పండగకూా సెలవ, చలేస్తే సెలవ, ఎండకాస్తే సెలవ; వానకురిస్తే సెలవ,

వరదవస్తే సెలవ, ఉన్న ఊళ్ళో ఉత్సవమైతే సెలవ, పక్కఊళ్లో బాజా వాయిస్తే సెలవ. మాస్టర్లకు కేమండీ మహారాజూ అంటారు.

అధ్యాపక వృత్తి అంటే అదో చక్కని గులాబీ పూపాన్పు అనుకొంటారు. అల్లాగ అనుకొన్నా గులాబి పూపాన్పులో కూడా ముళ్లు ఉంటాయి. ఉపాధ్యాయుడికి ఉండే కష్టసుఖాలు ఏమిటో ఇక చూద్దాము.

౨
మాస్టరు—ఒక క్లాసు

ఈ వృత్తి నిజానికి, ఇతరులు అనుకొన్నంత హాయి అయింది కాదు. ఉపాధ్యాయుడికి ఉండే బాధలు ఉండనే ఉన్నాయి. పై అధికారుల వద్దనుంచి మొట్టికాయలూ, కుర్రవాళ్ల దగ్గర నుంచి వెటకారాలూ, వెక్కిరింపులూ, పరాభవాలూ, అధ్యాపకునికి చచ్చేటంత విసుగు నిస్తాయి.

మొదటి సంగతి మాస్టరైన వాడు క్లాసులో అల్లరి లేకుండా చేసుకొని పాఠం చెప్పుకోటం ఎంత కష్టమైన పనో ఇతరులకు ఎవ్వరికీ తెలియదు. క్లాసులో నలభైమంది కుర్రాళ్లు ఉంటారు. ఆ నలభైమందీ నలభై రకాలు. ఒక్కొక్కడి మనః ప్రవృత్తి ఒక్కొక్క మోస్తరు. వీళ్ళందరికీ ఒక్కటే పాఠం చెప్పాలె. నలభై అడవి మృగాలను సద్దటం అంత కష్టంగాదు. ఎందు చేతనూ అంటే, అవన్నీ ఒక్క మోస్తరు మనః ప్రవృత్తి కలవిగా ఉంటవి కాబట్టి. ఆవు లన్నిటికీ గడ్డే ఇష్టము. ఒక దానికి గడ్డీ ఒక దానికి వంకాయలూ ఇష్టం అంటూ లేదు. అయితే నలభైమంది గల ఒక క్లాసులో ఒకొక్కడికి ఒకొక్క విషయంలో అభిరుచి. భిన్న ప్రకృతులతో భిన్నరుచులతో కూడిన ఆ సమాజాన్ని సద్దుకు రావటంలో ఉండే కష్టం ఆపని నిర్వహిస్తున్న వాళ్ళకే తెలుస్తుంది.

ఈ భిన్న భిన్న ప్రకృతులు గలక్లాసులో ఒకడికి బొమ్మలంటే ప్రేమ. చరిత్ర పాఠం ఎంత కష్టపడి చెబుతున్నా వాడికి రవ్వంత అయినా రుచించదు. ఏదో మంచి విషయం ఆవేదనతో చెపుతూ ఉంటే, వాడు ఆ చెపుతూఉన్న మాస్టరు

బొమ్మ వికృతంగా గీస్తూ ఉంటాడు. ఉత్తమ ఉపాధ్యాయుడైనవాడు ఆ కుర్ర వాడికి యూక్లిడ్ ఇరవై రెండో ప్రాపోజిషన్ అర్థం అయ్యేటట్లు చేయాలని ప్రయత్నం చేయక వాడి అభిరుచిని కనిపెట్టి, దానికి దోహదం చేస్తే వాడు ఏ గొప్ప చటర్జీయో, బాపిరాజో అవుతాడు లేక వాడ్ని తిట్టి, యూక్లిడ్ వాడి మనస్సుకు కొంచెం కొంచెంగా ఎక్కిస్తే విషమించి వాడు మానసికంగా చచ్చి ఊరుకొంటాడు.

మరొకడికి కవిత్వం అంటే ఇష్టం. వాడూ ఇలాగే పాఠం వినడు. విజయనగరం కాలేజీలో నేను చదువుతున్నప్పుడు నిజంగా జరిగిన ఒక చిన్న విషయము తార్కాణ ప్రాయంగా చెబుతాను. లెక్చరర్ షేక్స్పియర్ నాటకంమీద వ్యాఖ్యానం చెబుతున్నారు, వేరీవరం ఎడిషన్ లోనుంచి. నేనూ నా ప్రక్కనే కూర్చున్న స్నేహితుడు ఒకాయనా ఆ వ్యాఖ్యానం ఒక్కముక్క అయినా వినలేదు. మేమిద్దరం కలిసి ఆయన మీద ఒకపద్యం వ్రాశాము. అంతా జ్ఞాపకం లేదు. "ఊరకనే మాటిమాటికి తిట్టు, కాని చెప్పునది ఎల్ల ఊకపోట్లు, ఘట్టి ధిట్టయ్య సుబ్బరాయభట్టు" అని ఏదో వ్రాసి ఆయన వెళ్ళిపోయిన తరువాత అందరికీ వినిపించాము.

ఆలాగే వృత్తశాస్త్రంలో అభిరుచి ఉన్న కుర్రవాడికి హెన్రి-ది-ఎయిత్ కు ఎంత మంది భార్యలైతేనేం, తల్లికోటయుద్ధం ఎల్లా తగలడితేనేం? అదీగాక డిసిప్లిన్ కాపాడటం కష్టం.

ఇల్లాగ భిన్నరుచులు గల బాలురను పెట్టుకొని వివిధరీతుల వారికి తోడ్పడి విద్యగరపటంలో ఉత్తమ ఉపాధ్యాయుడికి ఎంతో కష్టం ఉంది.

3

విద్యార్థుల మనఃప్రవృత్తులు, అభిరుచులు, అభిమాన విషయాలు కనిపెట్టి, వారి భవిష్యత్ జీవిత పథాలను గుర్తించి ఎవరూ పోవాలసిన దారిలో వారిని నడిపించటంలో ఉంది ఉపాధ్యాయుడి కష్టమంతా.

విద్యార్థుల మనస్సుకు ఏ విషయాలు ఎక్కుతాయి. ఏ విషయాలు అందవూ

అన్న సంగతి కూడా మేస్టరుకు తెలిసి ఉండాలె.

ఆర్యుల పాఠం చెబుతూ ఆర్యులు మన దేశానికి ఎప్పుడు వచ్చారు? అని అడిగాను ఒక నాలుగోక్లాసు కుర్రాణ్ణి: చాలా కాలంక్రింద వచ్చారు అని వాడు పుస్తకంలో మాట చిలకలాగ పలికాడు. అంతటితో నేను తృప్తిపడి ఊరుకోవలసింది. ఎనిమిదేండ్ల కుర్రవాడికి, టైమ్ సెన్సు ఉండదన్న సంగతి నేను జ్ఞాపకం తెచ్చుకో వలసింది. ఇదంతా గమనించక నేను, తెలివి తక్కువగానే అనుకోండి, చాలా ఏండ్లు అంటే షుమారు ఎన్ని ఏండ్లో ఊహించి చెప్పగలవా అన్నాను. "ఆ" అన్నాడు వాడు. ఒక్క నిమిషం మౌనంగా ఉన్నాడు. ఊహాకు తోచిందికామాలు సంతోషంగా గర్వంగా అన్నాడు. "ఇరవై, ముప్పై సంవత్సరాల క్రితం వచ్చి ఉంటారండి." అని వాడి ప్రాణానికి ముప్పై సంవత్సరాలు చాలా కాలమని తోచింది. అంతకంటే వాడు ఊహించలేకపోయినాడు. మనం పరిపక్వాన్ని గుర్తించకుండా బోధన ప్రారంభిస్తే ఇల్లాగే జరుగుతుంది.

మాస్టరు చెప్పే విషయం కుర్రవాడి మనస్సుకు అందనిది అయితే, వాడు తనకు తోచిన రీతిని అర్థం చేసుకొంటాడు. నే నొకసారి 'Lord Ullin's Daughter' అనే ఇంగ్లీషు ఖండ కావ్యం చెబుతున్నాను. అందులోని రెండు పంక్తులు, I will row you over the ferry, not for the silver bright but for the winsome lady అనేవి. వ్యాఖ్యానం చేసి చెప్పిన తరువాత మళ్లీ ఆ కుర్రవాడ్ని ఆ పద్య పాదాలకు అర్థం చెప్పమంటే వాడు అన్నాడూ నిన్ను రేవు దాటిస్తాను. కాని నీ డబ్బు నాకక్కరలేదు. కానీ ఆ చక్కని పిల్లను మటుకు నా కిచ్చేసెయ్యి అని. అదిటా అర్థం!!

౪

ప్రశ్నలు – జవాబులు

మనం అడిగే ప్రశ్న కుర్రవాడికి అర్థం కాకపోయినా మనం అనుకొన్నట్లుగాక

ఇంకోవిధంగా అర్థం అయినా విపరీతమైన జవాబులు వస్తయ్యి.

ఒక కుర్రవాడికి జబ్బుచేసి చాలా రోజులు బడికి రాలేదు. ఆ తరువాత ఆ అబ్బాయి వచ్చినపుడు టీచరు అతన్ని కుశల ప్రశ్నలువేసి, ఇప్పుడు కులాసాగా ఉన్నావా అని అడిగి పాఠాలు చాలా పోయినాయని నొచ్చుకొని "అయితే నీవు ఎప్పటినుంచి రాలేదూ" అని అడిగాడు. ఆ కుర్రవాడు పాఠాలు పోయినాయే అన్న సంగతే అనుకుంటూ, కృష్ణదేవరాయలు గజపతులను జయించినప్పటినుండి నేను రాలేదండి అని చప్పున అనేశాడు.

ప్రశ్నకు జవాబు తెలియనప్పుడు పిల్లవాడు తెల్లపోయి చూస్తాడు. అల్లాంటప్పుడు వాణ్ని భయపెడితే వాడు గాబరాపడి విపరీతమైన జవాబు ఇస్తాడు.

ఒకసారి ఒక ఇన్‌స్పెక్టరు ఓ స్కూలు తనిఖీకి వెళ్ళాడట.

స్కూలు పరిస్థితి ఏమీ బాగుండలేదు. ఒక్కడికీ ఒక ముక్కరాదు. మాస్టర్లేమీ కష్టపడి చెప్పలేదని ఆయనకు తోచింది. పైగా ఆ మాస్టర్లకైనా ఏమైనా వచ్చునా అని ఆయనకు సందేహం కలిగింది. కుర్రవాళ్ళకు బొత్తిగా భాషాజ్ఞానంలేదు. ఈ పరిస్థితులుచూచి ఆయన చాలా విసుక్కొని, కోపంతో క్లాసువంక చూస్తూ, అయితే పోనీ నైషధం వ్రాసిందెవరు? అని అడిగాడు. అందరూ తెల్లముఖాలు వేశారేగాని ఒక్కడూ చెప్పలేక పోయినాడు. ఆయన మరీ కోపంతో ఓ కుర్రవాడి వంక తీక్షణంగా చూస్తూ ఎవర్రా వ్రాసింది? చెప్పవేం? అన్నాడు కళ్ళెర్రజేసి. ఆ కుర్రవాడు భయపడిపోయి బిక్కముఖంతో నిలబడి నేకాదండీ సార్ అన్నాడు.

ఇన్‌స్పెక్టరు ఆవేశంగా గబగబా హెడ్ మాస్టరు గదిలోకి పోయి, కుర్రవాళ్ళ భాషాజ్ఞానం ఎంత అధోగతిలో ఉందో ఆయనకు తెలియజెపుతూ, ఎంత కోపంలో ఉన్నా నవ్వువచ్చే విషయం కాబట్టి కొద్దిగానవ్వాడు. ఆయనముందు హెడ్‌మాస్టరు కూడా నవ్వాడు. దాని తరువాత ఇన్‌స్పెక్టరుగారికి కోపం శాంతింప చేయాలన్న ఉద్దేశంతో, అయ్యా,

కుర్రవెధవ గదండీ, ఏదో భయపడ్డాడు మీరు కొడతారని. వాడే రాసి ఉంటాడు లెండి. అందులో సందేహం ఏమీ లేదు. ఇప్పటి కాలం కుర్రవాళ్ళంతా అంతే గదండి. అల్లరి వెధవలు అన్నాడు. ఇక ఆ ఇన్‌స్పెక్టరు ఎవర్ని ఏమంటాడు వెళ్లిపోయినాడు.

*

మాస్టరు

కుర్రవాళ్ళ మనః పరిపక్వాన్నే కాకుండా వాళ్ళ మనస్సుకు చెందిన ఇతర ప్రవృత్తులను కూడా అధ్యాపకుడు గమనించాలె. బాల బాలికల మనస్సులు మహా సున్నితాలు. వాళ్లతో ఎంతో సంతోషంతో ఉత్సాహంతో మెలగాలె. మనకున్న కష్టాలు మరచిపోయి, మన హృదయాన్ని రాచి రంపాన కోస్తున్న దుఃఖాలను నెట్టేసి,ఆకాసేపూ వాళ్లతో కలిసిమెలిసి విద్యాబోధన చెయ్యాలె. విద్యాగురువు ముక్కోపి కాకూడదు. అల్లాంటి కోపాన్ని విద్యార్థులు సహించరు: నేను విజయనగరం కాలేజీలో చదువుతున్న రోజులలో ఒకమాస్టరు ఉండే వారు. ఆయనకు చాలా కోపం. బి. ఏ. క్లాసుకు పాఠం చెబుతూ ఉండే వాడు. కుర్రవాళ్లు ఏదో అల్లరిచేశారు. ఆయన మండిపడి, మీకు ఇక పాఠం చెప్పనని వెళ్లిపోయినాడు. ఆయనకు అంతకోపం రావాల్సిన విషయం ఏమీ లేదేనని మేమంతా అనుకొన్నాము. సరే, ఆరోజు అల్లాగ గడిచిపోయింది. మర్నాడు మళ్ళీ ఆయనపాఠమే ఉంది. ఆయన మామూలుగానే వచ్చి పాఠం చెపుతున్నాడు. మళ్లీ అదేమోస్తరు అల్లరి సాగింది. ఆయన మళ్లీ మండిపడి మీకు నిన్ననే చెప్పాను; ఇల్లాంటి ప్రశ్నలు పనికిరావని. బుద్ధి లేదు. అన్నారు. బుద్ధిలేదు అనేటప్పటికి చాలా మందికి కోపం వచ్చింది. ఒక అతను లేచి "ఈ సంగతి మీరే నిన్నే గ్రహించి, మీకు పాఠం చెప్పను అని వెళ్ళిపోతిరి. మళ్లీ ఇవ్వాళ రావటం ఏమంత బాగుంది! మేము బుద్ధిలేని వాళ్ళమన్నమాట తెలిసింది కాబట్టి, మీ కేమైనా బుద్ధిఉంటే ఈ క్లాసుకు ఇకరాకండి అన్నాడు. ఆయన అప్పుడు దారికొచ్చి, క్షమాపణవేడి పాఠం

చెప్పుకొన్నాడు. ఇంతకూ చెప్పేవిషయం ఏమిటంటే కోపమనేది ఉండకూడదు. అంటే అసలు ఉండకూడదని కాదు. అకారణంగా ఉండరాదు అని నేను అంటాను.

అధ్యాపకుడు మంచి దర్జా కలిగిఉండి, హుందా తనముతో శీవితో న్యాయ బుద్ధితో మెలగకపోతే పడే అవస్థ ఇంతా అంతా కాదు. పిల్లల దృష్టిలో, అతనిలో ఏ విపరీతం కనిపించకూడదు. లేక అతనిలో ఉండేదుర్గుణాలలో ఏదైనా కానీ, వికృతాలలో ఏదైనా కానీ, ఆ పసివాళ్ళకు కనపడ్డదా, ఇక ఆ మాస్టరుకు తాటాకులు కడతారు.

౬

నేర్పూ—ఓర్పూ

కాలేజీలో కానీండి, హైస్కూలులో కానీండి అధ్యాపకుడుగా ఉన్నవాడికి ఎక్కువగా ఓర్పు ఉండాలె. తరుణ వయస్కులైన విద్యార్థుల ఉత్సాహం ఉరకలు పెడుతూ ఉంటుంది. వారి జీవితంలో చైతన్యంఎక్కువ. ఒకచోట అరగంటసేపు నిలకడగా కూర్చోలేరు. పట్టుమని పదినిమిషాలు ఏ విషయాన్నీ

విననూలేరు. రాళ్ళపైనుండి జలజలమంటూ, కిలకిలమంటూ, పల్లానికి ప్రవహిస్తూ, గెంతుతూ ఎత్తైన కొండల మీదినుంచి క్రిందికిగభీలునదూకుతూ, నవ్వుతూ పోయే సెలయేరులాగా ఉంటుంది వాళ్ల జీవితం.

అల్లాంటివాళ్ళను కదలకుండా మాట్లాడకుండా కూర్చోబెట్టి విద్యగరపటం సామాన్య విషయం కాదు. ఎంతో నేర్పు ఉండాలె. ఎంతో ఓర్పు ఉండాలె.

వెయ్యికళ్ళతో కనిపెడుతూ ఉన్నా, కుర్రవాళ్ళు, పక్కవాడితో మాట్లాడనే మాట్లాడుతాడు. వాణ్ణి వారించబోయి, మాస్టరు చిక్కుల్లో పడుతూ ఉంటాడు. ఒకసారి నాక్లాసులో ఇద్దరు కుర్రాళ్ళు ఓమూల కూర్చుని మాట్లాడుతున్నారు. అంటే ఒకడుఏదో చెపుతూ ఉంటే ఇంకొకడు వింటూ ఉన్నాడు. ఇదంతా నేను పాఠం చెబుతూ ఉండంగానే!! నేను చూచి, ఆ ఇద్దరిలో ఒకణ్ణి నుంచోమని, "నీవు పాఠం వినటంలేదు మాట్లాడుతున్నావు" అని కోప్పడ్డాను. ఆ అబ్బాయి నేను మాట్లా

డటం లేదండీ అని వినయంగానే అన్నాడు. "అయితే ఏంజేస్తున్నావు పాఠం వినకుండా?" అన్నాను. వాడేదో చెపుతుంటే వింటున్నా నన్నాడు. "ఇంకేం, ఏలాగయితేనేం పాఠం వినక పోవటానికి! మాట్లాడటం ఎంత తప్పో, మాట్లాడుతూ ఉంటే వినటం అంతే తప్పు" అని కోప్పడ్డాను. ఆ కుర్రవాడి ధైర్యం చూడండి: "వినటం తప్పు లేదండి. వినదగు నెవ్వరు సెప్పిన అన్నారు" అంటూ ప్రారంభించాడు. క్లాసంతా నవ్వారు. ఇల్లాంటి చిక్కులు వస్తూ ఉంటవి.

అయితే ఇల్లాంటి చిక్కులు పెద్ద కష్టాలని నేను అనటం లేదు. అల్లాంటప్పుడు ఏదో నవ్వేసి తప్పించుకొని పాఠం చెప్పుకొని పోవచ్చు. కాని నిజమైన విద్యాబోధన అనేదే చాలా కష్టమైన పని. చెప్ప వలసిన విషయాలు తియ్యని మాటలతో ఆకర్షకంగా చెప్పాలె. పాఠం వింటున్నప్పుడు విద్యార్థికి ఒక నాటక ప్రదర్శనం చూస్తున్నప్పుడు కలిగే ఆనందమే కలగాలె. ఇల్లాంటి ఆనందం కలుగజేయాలంటే, అధ్యాపకుడు కథలు చెప్పాలె మధ్య మధ్య నవ్వించాలె. అయితే విద్యార్థుల మనస్సులు ఇల్లాంటివాని మీదనే లక్ష్యం కాకుండా అసలు విషయం వాళ్లు గ్రహించే లాగున చెయ్యాలె. ఇదంతా అంత సులువైన పనిగాదు.

ఇల్లాగ ఎంతో శ్రమపడి చెప్పవలసిన విషయాన్ని చక్కగా ఆలోచించి కథలతో కలిపి ఆకర్షకంగా చెబుతూ ఉన్నా, ఒకప్పుడు కుర్రాళ్లు అమాయికంగా అయితేనేం, అల్లరికి అయితేనేం అనే మాటలు సహించి ఊరుకోవాలె. ఇల్లాంటి సహనశక్తి చాలా అవసరం. సహనశక్తియొక్క ఆవశ్యకతను గూర్చి ఒక్క ముక్క చెప్పి ఈ ప్రసంగం ఆపేస్తాను. నేను ఒకసారి పాఠం చెబుతున్నాను. నెపోలియన్‌ను గురించిన పాఠం అది. నెపోలియన్ యొక్క తూర్పు దిగ్విజయాలను గురించీ, ఆ మహానీయుని అప్రతిమాన శౌర్యసంపత్తిని గురించీ, ఆయన అఖండ విజయాలను గురించీ చెపుతూ ఉంటే నా తనువు పులకలెత్తింది. నా ధోరణి ఆవేశంతో, ఉద్రేకంతో, వెళ్లిపోతున్నది మహాప్రవాహం లాగ.

ఉద్రేకంతో మాట్లాడుతూ ఉన్నప్పుడు, ఎప్పుడైనా, ఒక్కచోట నత్తివస్తుంది నాకు.

ఆరోజున, ఒక్కమాట, ఒక్కటంటే ఒక్కటే, నత్తిగా పలికాను. పలికి నాలో నేను సిగ్గుపడ్డాను. అయితే అది ఎవరూ గమనించినట్టు లేదు.

పాఠం చెపటం అయిపోయిన తరువాత పుస్తకం తెరిచి ఆ విషయాన్ని చదవమన్నాను ఓ కుర్రవాడ్ని. వాడు మామూలు గానే ప్రారంభించాడు. రెండు వాక్యాలు చక్కగా చదివాడు. మూడో వాక్యంలో నె నె నె నె న్నె పో పో పో పోలియన్ — యు, యు, యు, యూరోప్‌లో, అ అఆ అన్ని దేశాలను జ జ జ జ జ్జయించాడు, అని నత్తితో చదివాడు.

ఒక్కమాట పొరపాటున నత్తిగా అన్న కారణాన వీడు నన్ను ఇంతగా వెక్కిరిస్తున్నాడే అని వళ్ళు మండిపోయింది. ఆ క్షణంగా వాడ్ని అమాంతం నమిలి మింగేద్దామన్నంత కోపం వచ్చింది. అనుభవంలేని మాస్టరు అయితే ఆ రోజు ఆ కుర్రవాణ్ణి కొట్టనన్నా కొట్టేవాడు; లేకపోతే తాను రాజీనామా అయినా ఇచ్చేవాడు.

ఒక్క క్షణం అయిన తరువాత నేను కోపం దిగమ్రింగుకొని మెల్లగా వాడితో ఏమిరా నన్నెక్కిరిస్తున్నావా? అన్నాను. వాడు ముఖం వేలేసి వినయంగా మిమి మిమ్మల్ను వె వె వె వెక్కిర్ర్ర్ర్చిం దాకా ననననన్నాకేం ఖఖఖర్మం అండీ నననన్నెకు నననత్తి లేలేలేలేక పో పోతేగదా అన్నాడు. మొదట మరింత కోపం వచ్చింది. కాని దానితరువాత విచారిస్తే, వాడికి పుట్టుకనే నత్తి ఉందనీ, నన్ను వెక్కిరించటం కాదనీ తెలిసింది. వాడ్ని ఆరోజున నేను కొట్టినట్లయితే ఎంత అభాసు అయ్యేదో!

మాస్టరు అయిన వాడికి ఎంత ఓపిక, కావాలో . చూడండి. అమాయకుడై ప్రపంచం ఎరగని కుర్రవాడ్ని తీసుకొని, వాడికి విద్యగరపి, వివిధశాస్త్రాలలో అనుభవ సహితమైన జ్ఞానం ఇచ్చి వాడి మనస్సును వికసింపజేసి, వాడి శరీరానికి దార్ఢ్యం, వాడి ఆత్మకు సంస్కారం కలుగజేయాలె. ఈ భారం అంతా ఉపాధ్యాయుడిది.

౨

క్రొత్తగా మాస్టరీపని దొరకటంతోనే ఆతనికి ముందుగా తన భార్యకు చదువు చెప్పుకోవాలెననీ, ఆవిడచేత ఇంగ్లీషు మాట్లాడించాలనీ బుద్ధి పుడుతుంది. ఊళ్లోవాళ్ల భార్యలందరికీ చెబుతూ ఉండంగా నా స్వంత భార్యకే చెప్పుకోలేనా అనే ధైర్యంతో ఒక ఇంగ్లీషు పుస్తకం కొనుక్కొస్తాడు. అక్షరాలు వచ్చిందాకా బాగానే సాగుతుంది చదువు. అంతే. మాటల్లోనో వాక్యాలు చేర్చుకొనే స్థితిలోనో ఆ చదువుకు విధవ ఆటంకాలు ఎన్నోవచ్చి, చప్పున ఆగిపోవటం సంభవిస్తూ ఉంటుంది. ఆవిడ ఆ ఇంగ్లీషు పుస్తకాన్ని చాలు రాచ్చిప్ప మీద మూతపెడుతుంది. దాన్తో ఆతని గుండె బేజారైపోయి, ఇక ఆచదువు కట్టిపెడతాడు. చదువు చెప్పాలని రాత్రిళ్ళు, ఆ అమ్మాయిని కూర్చోబెట్టుకొని పట్టుదలతో చదువు సాగించినా ఎన్నాళ్లో సాగదు. క్రొత్తగా కాపరానికి వచ్చిన ఆ పిల్లకు చెపటానికి పగలు ఆయనకు తీరదు! నిద్ర వేళ చదువు సాగదు!! కళ్లుమూస్తూ, తెరుస్తూ చిటికెలేస్తూ ఉండంగానే మధ్య ఏదో ముఖ్యమైన విషయం జ్ఞాపకానికి వస్తుంది ఆ పిల్లకు. "ఈ చదువుకేం కానీండి, రేపు కార్తీకమాసానికి యుద్ధం ఆపేసి నవరసులు చౌకచేస్తారుటగా అంటుంది. ఏమిటి ఆమాటకు అర్థం? అంటే నవరసులు ప్రియంచేసి ఆడవాళ్లను ఏడ్పించేందుకే అసలు ఈయుద్ధం చేస్తున్నట్టూ, కానేపువడ్పించి, చాల్లేపిల్లను ఏడ్పించటం నుంచి స్త్రీలపై జాలిదలచి యుద్ధం ఆపివేయటానికి ఎవరో నిశ్చయించినట్టూ!! ఇక చదువు సాగదు. ఆ తరువాత నవరసులు చౌక అయిందాకా చదువు ఆపేద్దామన్న నిశ్చయాని కొస్తారు ఆ నూతన వధూవరులు.. అల్లాగాక పట్టుబట్టి చదువు సాగించినా, దాని తరువాత ఒక నెలకైనా ఆ అమ్మాయికి కొంచెం వికారం ఏర్పడటం, అంతటితో చదువు పూర్తిగా ఆగిపోవటం తప్పదు.

మాష్టరు. ఇంట్లో బిడ్డలకు చదువు చెప్పాలని కూర్చున్నా ఇట్లాగే పరిణమిస్తుంది నేను ఒకసారి మా అమ్మాయికి లెక్కలు చెబుతున్నాను. ఒకను

ఒ పనిని మూడు రోజులలో చేస్తాడు. ఆ పనే మరొకడు అయిదు రోజులలో చేస్తాడు. ఇద్దరూ కలిసి ఆ పనిని ఎన్ని రోజులలో చేస్తారూ? అని లెక్క. ఆ లెక్క మా అమ్మాయి చెయ్యలేక పోయింది. నేను ఇప్పుడి తెలిసేటట్టు చెబుతున్నాను. పాటింటి గుమ్మంలో నుంచుని మా ఆవిడ వింటూ ఉన్నది ఈ గొడవ అంతానూ. పోతే కూతురు చదువుకోటం చూచి ఆనందిస్తున్నదీ అనుకొన్నాను. మా అమ్మాయి ఆ లెక్క చెయ్యలేక పొయ్యేటప్పటికి దాన్ని చిన్న దెబ్బ కొట్టాను.

ఆవిడగారు గబగబా వచ్చి పిల్లను రెక్కపుచ్చుకొని తన వెనక్కు లాక్కుని "ఏమిటండీ వెధవ లెక్కలు దానికి చెప్పటం ఎందుకూ! బిడ్డను కొడుతున్నారు కూడానూ? కాకపోతేను ఏం లెక్కలివి? ఒకడు ఒక పనిని మూడు రోజుల్లో చక్కగా పూర్తిచేయగలిగి ఉంటే, అయిదు రోజులదాకా [illegible] వెధవను కూడా ఆ [illegible] ఇరికించటం ఏమంత అవసరమైన పనండీ? ఆ ఒక్కడిచేతే చేయించుకోకూడదూ? ఆ ఇద్దర్నీ కలపటం ఎందుకండీ? వాళ్లిద్దరూ కలిస్తే వత్సంధాలు పోతారు గాని చస్తే ఆ పని పూర్తి అవుతుందంటారా? పిచ్చా ఏమన్నా మీకూ? ఇల్లాంటి లెక్కలు చెయ్యలేకపోతే మానె, పిల్లదాన్ని కొట్టకండీ, అంటూ దాన్ని లాక్కుని వెళ్ళింది.

ఒక రోజున ఒక కుర్రవాడికి ఒక లెక్క ఇచ్చి చెయ్యమన్నాను. లెక్క ఏమిటంటే - ఒకడు గంటకు పదిమైళ్ళ చొప్పున పద్ధెనిమిది గంటలు పరుగెత్తితే ఎంత దూరం పోగలడూ అని. ఆ కుర్రవాడు ఆలెక్కచేయటం ప్రారంభించి ఒకక్షణం అయిన తరువాత వెర్రిచూపులుచూస్తూ ఆగిపోయినాడు. ఏంరా అబ్బాయి అల్లాచూస్తావెందుకు- లెక్కచేశావా? ఎన్నిమైళ్ళూ అన్నాను. ఏమిటండీ అని అడిగాడు ఆ కుర్రాడు. ఏమిటండీ ఏమిటూ, నీ మొఖం! గంటకు పదిమైళ్ళ చొప్పున పద్ధెనిమిది గంటల్లో ఎన్నిమైళ్లు పోతాడో కనుక్కో" అని కొప్పడ్డాను. "కనుక్కుంటానండి -

చాలా దూరం పోతాడుగానీ, అసలు వాడు అల్లాగ పరుగెత్తితే, రెండు మూడు గంటలయ్యే సరికి గుండె పగిలి టపీమని చావడా అని ఆలోచిస్తున్నానండీ అన్నాడు. "చావడా, లెక్కల్లో మనుష్యులు చావరు. లెక్క ప్రకారం పదివేసిన్నాది గంటలూ పరుగెత్తిగాని మరీ చావడు.. — ఇక లెక్క వెయ్యి" అని కోప్పడ్డాను.

ఇంకోచోట ఇల్లాగే లెక్కలు చెపుతూ ఉంటే, ఆ ఇంటి ఆవిడకు నామీద కోపంవచ్చింది ఆ లెక్క ఇది: ఒక తొట్టి ఉంది. ఆ తొట్టికి ఒక రంధ్రం ఉంది. అందులోనుంచి గంటకు అయిదు గేలనుల నీరు కారిపోతుంది. గంటకు తొమ్మిది గేలనుల చొప్పున నీరును ఇచ్చే పంపు మూలంగా ఆ తొట్టి ఎంత కాలంలో నిండుతుంది? ' దీ లెక్క. ఆ పిల్లకు అర్థం కాకపోతే తెలిసేటట్లు చెప్పాను కూడాను. వాళ్ళమ్మ నేను చెపుతూన్నదంతా వింటూన్నది కామాలు - చటుక్కున వచ్చేసి "మాస్టారూ లెక్కలైతే మటుకు కాస్త తెలివైనవి చెప్పకూడదుటండీ. ఇవేం లెక్కలండీ" అన్నది

ఏమిటండీ - ఏమిా? అన్నాను నేను "ఏమిటేమిటి నా ముఖం, నా మొ- రానూ! ఇందాకటినుండీ వింటూనే ఉన్నాను మీరు చెపుతున్నది. చిల్లితొట్టిలో నీరు పోస్తుంటే, ఒక వైపు కారిపోయేది కారిపోతుంటే, ఎన్నిగంటలలో నిండుతుందీ అని కాలా మీరు అడుగుతా? శుద్ధ తెలివి తక్కువగా ఉందండి. కోప మొస్తుంటేమోగాని నేనంటే, ఆ చిల్లి తొట్టికి కాస్త మాటేసుకొని, ఆపళంగా నీళ్ళోసుకుంటే వచ్చిన ఇబ్బంది ఏమిటి చెప్పండీ, ఈ లెక్క అంతా అనవసరం గదా అన్నది.

ఆవిడగారు లోపలికి వెళ్ళిపోయిన తర్వాత ఆవిడగారి పెద్ద అమ్మాయి కామాలు, అంటూన్నది — "అమ్మా ఏమిటే నువ్వు అల్లాగ అంటావు. అచ్చు పుస్తకంలో లెక్కనే ఆయన చెబుతున్నది. అవి పెద్దపెద్ద దొరలువ్రాసిన పుస్తకాలు కూడాను.

అయితేమటుకు అదేమిటే తల్లీ. నాక లైతేమటుకు - ట పిల్లడంటే, కాస్త

మాటేసుగుని వాడుకోరే? ఏమిటే తల్లీ—అయినా ఈ దొరలగోల నాకేం తెలుస్తుంది తల్లీ—నేనేం చదువుకున్న దాన్నా ఏమన్నానా, అంటూ వెళ్లిపోయింది వాళ్లమ్మ.

మరోసారి నేను మా చిన్నవాడికి లెఖ్ఖలు చెబుతున్నాను. ఒరే బాబూ మనం ఉన్న ఇల్లు పదహారువేల రూపాయల ఖరీదు గలదిరా. దీన్ని ఒక లక్ష రూపాయల కమ్మేస్తే ఎంత లాభం వస్తుందిరా అని నోటిలెక్క అడిగాను. వాడు తెల్లపోయి చూడటం మొదలు పెట్టాడు. ఏం, చెప్పవేంరా? అన్నాను. వాడు వికల ముఖంతో "అసలు ఈ యిల్లు మనది కాదుగా నాన్నా" అన్నాడు. మనది కానప్పుడు ఆ ఇల్లు అమ్మటం ఎల్లాగా అని వాడికి పెద్ద సందేహం కలిగింది. వాడి సందేహాన్ని గ్రహించి అవునులే. ఈ ఇల్లు మనదే అనుకో. అనుకొని, అమ్మితే ఎంత లాభం వస్తుంది చెప్పూ అన్నాను. వాడు బోలెడు లాభం వస్తుందిలే నాన్నా అని విసుక్కున్నాడు. ఇల్లు మనది కానప్పుడు ఎందుకీ ఆలోచన అంతా, అని వాడి ఊహ అయి ఉంటుంది.

ఉపాధ్యాయుడు ఇంటిదగ్గర పిల్లలకు చదువు చెప్పబోతే ఇల్లాంటి తమాషాలు జరుగుతూ ఉంటవి. అంతే కాని ఇవో ఆటంకాలు కానేకావు: ఉపాధ్యాయుడు తప్పకుండా తన పిల్లలకు చదువు చెప్పుకుంటాడు. ఆ కుటుంబం జ్ఞానసంపత్తి గలదై, డబ్బు లేకపోయినా ఆనందంతో తొణికిసలాడుతూ ఉంటుంది.

ఇంతకూ చెప్పొచ్చే దేమంటే ఉపాధ్యాయుడి వృత్తిలో సుఖమూ ఉంది, దానిని మించిన కష్టమూ ఉంది—అన్ని వృత్తుల మాదిరే ఇది. అయినా మా మీద ఇతరుల కందరికీ అనవసరంగా అసహనం ఏర్పడిపోయింది!!

అన్వేషణము

౧

విరియ బూచిన నల్లుకలువల
విరుల పరిమళ మరయు తెమ్మెర!
తమ్మి కొమ్మల తొగరు వాతెర
గ్రమ్ము తేనెల జుర్రు తుమ్మెద!
జిలుగు దువ్వలువలు ధరించియు
వలపు పలుకుల జిలుకు చిలుకా!
కలకలధ్వని గండశిలలును
కరుగ బాడెడి గండుకోయిల!
వేణుగాన విశారదుండగు
వెన్ను డగపడెనే— మీకూ?
వెన్ను డగపడెనే?

౨

నీలి మబ్బుల నేలు మోమున
నెసగ దిద్దిన గీరు నామము
అరుత బటు ముత్తియపు సరములు
నురమునను కౌస్తుభము మెరయగ
గరువతనమును నెరపు పలుకుల
మురిపెముల మూటలను గట్టుచు
పిల్లగ్రోవిని జంక నిరికియు
గొల్లవాడల వెన్నమ్రుచ్చిలు
ఆల కదుపుల గాచు మాధవు
నరసితిరె మీరూ?— మాధవు
నరసితిరె మీరూ!

౩

ప్రొద్దు పొడుపున బూచుతమ్ముల
బోలు కన్నుల గ్రాలు పురుషుడు
తరిపివెన్నెల పాలనురుగుల
తరగలీను స్మితాననాబ్జుడు
లేత మామిడి గున్న చిగురుల
వాతెరను గల కోమలాంగుడు
గొల్ల కన్నెల జవ్వనంబును
కొల్లలాడు మనోహరాంగుడు
పసిడి దువ్వలువలు ధరించిన
ప్రభుని గాంచితిరా— మీరూ?
ప్రభుని గాంచితిరా?

౪

కమ్మ కస్తురి వలపు లెగయగ
జిమ్ము చిత్ర విచిత్ర చరితుడు
మంచు సోనల మించు చల్లని
మనసు గల ధర్మస్వరూపుడు
మధుర మధురములైన పలుకుల

మరపురాని మహానుభావుడు
నల్లద్రాపుడు మూక నెల్లను
దుల్లనేసిన బల్లిదుండగు
సాధు సంసేవితుని లక్ష్మీ
నాథు జూచితిరా— మీరూ?
నాథు జూచితిరా?

౫

కారు మొయిళుల తెరల మాటున
కలికి మించుల తళుకు దోచెను
నెమ్మి పించెము విప్పి నాట్యము
నేర్పుమై నాడంగ దొడగెను
కప్పురపు టనటులను డాగిన
గాడుపుల పొలకువలు దెలిసెను
చలువ వెన్నెల జిలుకు చిప్పుడె
కలువరాయడు బయలు వెడలెను
వెన్నతెక్కలికాని గోపుని
సన్న తెలియ దహా!— గోపుని
సన్న తెలియ దహా!

౬

తలిరుబాయపు తమ్మిచెలి కెం
దలిరు వాతెర తేనెవాకలు
కలువలను గిలిగింత లిడు క్రొ
న్నెల వలిప వెన్నెలల నిగ్గులు
క్రొన్ననల నెమ్మొగము ముద్దిడి
కులుకు తేటుల వలపు పాటలు
చిగురు మామిడి గున్న మంచెల
జెలగు కోకిల నిస్వనంబులు
సీదు మధు మురళీ నినాదము
నెరువు గొనెనేమో?— కృష్ణా!
ఎరువు గొనెనేమో!

౭

అదిగో! వేణునినాద మహాహా!
అఖిల తాపము లపనయించెను
ప్రేమవారిధిలోన మునిగితి
మోము జూపు మికనా కృష్ణా!
మోము జూపు మికనా

౮

మాధవీ లతికా నికుంజము
మాటు డాగిన మాయలాడవు
నీ సమాలోకన పిపాసా
నిహత హృదయనురా కృష్ణా!
నిహత హృదయనురా!

ముదివర్తి కొండమాచార్యులు

రవీంద్ర నిర్యాణము

౧

రవీ
రవికవీ
దివంగతుడి వైనావా ?—
ఇలాతలిని వైధవ్యాంబుధి ముంచివైచి
దివంగతుడి వైనావా
నా గురుదేవా ?

*

జరఠరవీ !
రవీంద్రకవీ !
అవారితవిధిబలిమికి శిర సొగ్గి
జరామరణముల రథ మెక్కి
అగోచ రామరపథముల
పయనమైతివా ?

భ్రష్టభూమిచరుల కష్టాలకు నీ
స్పష్టమార్గసూచన ఎవ రిస్తారయ్యా
ఇక నా గురుదేవా ?

*

మహిత హిమాచల తుహినశృంగమవై
గిరి నిర్ఝరిగా కవితను ప్రవహించిన కవీ !
మనస్సరోవర కహ్లారామృత మధువుల
మహీతలిని వర్షించిన మహాకవీ !
ఒక శతాబ్ది జీవితకాలములో భూస్థలి
శకస్థాపన మ్మొనర్చిన ప్రదీప్తరవీ !

దివంగతుడి వైనావా
నా గురుదేవా ?

*

ప్రకృతిలోని రహస్పుధల
పిండి పిండి గ్రోలిన
చండరవీ !
అహోరాత్రముల సౌందర్యపీయూషబిందువుల
మహాపిపాసతో ఎదనించికొన్న
ఉద్దండకవీ !

ఋతువు ఋతువులో ప్రతిబింబితమౌ
అతీత సృజనామోదము
హృదిలో ప్రోదిచేసికొని
మురిసిన రసైకజీవీ !
రసవత్ కవితాప్రసూన పరిమళభావా
గురుదేవా !
దివంగతుడ వైనావా ?

*

భావిలోక భావలోక మావరించనీ
నీ పరిమళమంధర వాయుశ్వాసము,
దేవలోక మందాకిని తరంగతతి
నిధ్వనించనీ నీవు గడించిన
భూతల నిభృత ప్రణయోల్లాసము;

ఆవరించి ఆవరించి దిక్తటముల
నీ విజ్ఞానచ్ఛప

శుభ్రవీధికాంత్యుజ్వలితావర్తములై,
దేవ మనుజ దీప్తభావనాలోకపు
జీవసంధులై,
ఆలోకసుందర భావస్ఫోరకమ్ములై,

భావిలోక భావలోక లోకాలోకాంచల
తటములనే వరించనీ
నీ కమనీయ ప్రతిభా భాసమాన
రమణీయచ్ఛవి,
రవీ!
రవీంద్రకవీ!

దివంగతుడి వైనావా
నా గురుదేవా!

౨

మానవ గరిష్ఠ స్వోజ్వల శుభంకరమూర్తీ,
మూర్తిమత్ విశుద్ధ ధవళతరకీర్తీ,
శాశ్వతాఖండ కవితామండల
సామ్రాజ్యైకచక్రవర్తీ,
సత్యసుందరానంద చంద్రికాకందళ
స్మృదుల మధుర షోడశకళాసాంద్రా,
రవీంద్రకవిచంద్రా!
ఇక రావా
దివంగతుడి వైనావా
నా గురుదేవా!

*

సుదీర్ఘ పటుతర శోభస్కర
సుపవిత్ర దివ్యగాత్రా,
అతులితార్ద్రవేదనా ప్రమోదసమేళ
స్మాధుర్య విడంబిత ప్రశాంతవిశాలనేత్రా,

విచలదలసాంగుళీ కిసలయ సవిలస
దాజానులంబ బాహుయుగళాయమాన
వినమిత ఘనశాఖాద్వితయ విభ్రాజితా.
శ్రమతరురాజా,
మహోన్నృథుల సహకారమహీజా,

పరాజిత జరామరణ చిరయౌవనతేజా,
కవితాలోక వికాసమాన రసవత్సహృదయ
హృద్వశీకరణ నిశిత ప్రజ్ఞా,

త్రింశత్కోటి భారతీయనరనారీ
ముకుళిత కరపంకేరుహ పరిపూజ్యా,

నతమస్తకుడగు నీ యువకవి
సబాష్ప గద్గద గళవిగళ
ద్విలాపగేయస్తుత్యా,

ప్రఫుల్లజీవిత ప్రసూనఫలవత్
సుందర ప్రపూర్ణసత్యా,

ఇహ పర చిరసాధన ధనసమీకరణ
కృతకృత్యా,
అమర్త్యలోకానీక ప్రాకట
దిగ్విజయ ప్రయాణవిభవా,
ఇక నీ ధరణికి దిగిరావా?
నా గురుదేవా,
దివంగతుడి వైనావా?

3

ఏమి కలలు గాంచితివయ్యా,
కవివర్యా!—
అల్లనాడు పద్మాప్రవాహినీతట గోష్ఠవాటి
నల్లనైన ఏ గొల్లపిల్ల సోగల కన్నుల
వెల్లువ యగు నేసోయగంపు సంపదపెంపును
కొల్లగొనగ కవితాజాలికలో తేలికగా
శ్యామలబాలా నీలహరిణనేత్రాంచల
కోమలతరవిద్యుతి నభివర్ణించితి వయ్యా,
కవివర్యా!—

*

పళ్ళగంప నెత్తి నెత్తికొని దారిని
వెళ్ళిపోవు ఏ పల్లెటూరి పడుచు
మిటారపు ఓరచూపు నీ ఎద
నిల్లు కట్టుకొని నిలిచినదో
కావుననే నీ కవితను,—
"గంప నెత్తికొని పోయెడి బాలా, కొంచెము
దింపనిచ్చి సేదతీరుచుకు పో వేలా?"
అని అన్నావే మరి—

*

అల నల్లన పూర్ణ యౌవనప్రాయము
నిండిన వేళల
ఉల్లాసపు స్వప్నావరణములో
కను మోడిచి,
ప్రాక్తన భారత కావ్యజగత్తున వెల్లివిరియు
భావోజ్జీవోద్రిక్త శిల్పకల్పనా ప్రవాహమున
వహింపబడి,
మంజులికా మాళవికాకంజముఖుల
కామనలో, ప్రేమ స్మృతిలో
ఉజ్జయినీవరపుర పరిసరముల
మంజు లాతిమంజుల భాషణముల
విస్పష్టవిచిత్ర చిత్రణము నెరపితి వయ్యా,
కవివర్యా!

*

కన్యకాని, వధువుకాని, మాతయుకానోపని
అన్యలోకమాన్య సుందరత్వ సారూప్యత
నెన్నజాలు నీ ప్రశస్తకవితాభిజ్ఞతలో
సద్యోయౌవన ప్రమత్త
మత్తనర్తకి ఊర్వశినే నీ కావ్యములో
ఎంతటి పటిష్ఠతర ధైర్యముతో
సుప్రతిష్ఠితామర సౌందర్యముతో
నిర్వహింపజాలితివో గదయ్యా,
కవివర్యా!

*

పక్వజీవితమ్మున నీ కవిత్వ
శక్యతలో లేని భావన మ్మేదయ్యా?—
శ్రీవ్యక్తి నీ కరోల్లిఖిత మంగళకర
కావ్యనికరమున
ముక్తమధుర విస్రోతమ్మై,
శక్తిమంతమై,
భక్తి వినయ నమ్రమునై,

రక్తిమ రాగతరంగితమ్మునై,
ఉక్తి విచిత్ర ప్రస్ఫుట చిత్రణమై,

'మానససుందరి'గా, 'ఊర్వశి'గా,
'వాసవదత్త'గ, 'తాజ్‌మహల్' మహా
సమాధిగాథగ, తుద భవ
దగాధ హృత్పరిశోధముగా
ప్రాదుర్భవించి,

ఖేద మోద సమ్మిళనోన్మిషితమ్మై,
బహుళామోద భరితమ్మై,
బహుముఖ సుస్వాదు
రూపకల్పనా లతా ప్రసూనమ్మై,
నీ కవితాకుంజము
తేజరిల్లజేసిన దయ్యా,
కవివర్యా !—
ఏమి కలలు గాంచితి వయ్యా !

౪

ప్రేయసి నీ లోకము కేంద్రము—
అంతియ—అంచులు మూయలేదు,
మహాకవీ !
ప్రణయము నీ అంతర్జీవన్ముకుళము—
రేకు రేకునా పరిమళ ప్రఫుల్లమై

ప్రవహిల్లి, విస్తరిల్లి, వెల్లివిరిసె
నెల్లెడల నోహో మహాకవీ !—

వ్యక్తిగత స్వీయానుభూతి నీ హృదిలో
కేవల శక్తిరూపమై,
ప్రకృతిశోభ నంతర్గతమై, సాక్షాత్కృతమై,
అభివ్యక్తమై, బహిర్ముక్తమై,
సర్వలోక దిక్తటముల శ్రావణాంబుదమ్మై
దరిసి, తటిత్‌శిఖల మెరిసి మెరిసి,
కరుణరస ప్రపాతమై, నవనవ
వర్షాస్రోతమ్మై కురిసి కురిసి
నేటికి వెలిసినదా ?—

కాదు, కాదు—సత్యము కాదది—
నీ అగాధ ప్రణయప్రాణము
జగన్నిఖిల సమ్మోహనముగ,
జగ దంతర్వాహినిగా,
అంతర్వాణిగ
కాలాంతమునకు
పరచికొన్న దంతియ—నిజ మిది !—

ఓహో పరమకవీ !
గురుదేవరవీ !
దివంగతుడి వైనావా,
నా గురుదేవా ?

మల్లవరపు విశ్వేశ్వర్రావు

గానం లేని కవిత్వం

మల్లవరపు విశ్వేశ్వర్రావు

'గానం లేని కవిత్వం' నా విషయంట! అవును కవిత్వం లేని గానం లేదూ?— గాయకులు గాయకులే; కవులు కవులే. కంఠంలో గాలి గాన మయింది. మనసు లోని అక్షరం కవిత్వ మైంది. ఇది అందరికీ తెలిసిందే నా, ఇందులో వింతేమైనా వుందా?

చూద్దాం,— కనిపించి నంతవరకూ గమనిద్దాం.

'సంగీతా'న్ని తలక్రిందుపరిస్తే 'తంగీసం' అవుతుంది. 'సంగీతం' గానమైతే 'తంగీసం' కవిత్వ మౌతుందా? అర్థ మేర్పడితే అయి తీరుతుంది, అభ్యంతర మేమిటి? తల క్రిందుగా తపస్సు చేస్తే గాని కవిత్వం కరగతం కాదన్నమాట మాత్రం యదార్థం.

'నాదబ్రహ్మ'......అంటే, సంగీతానికి అధిదేవత. ఈ దేవుడు క్రిందు మీ దైతే 'బ్రహ్మనాదం' బయలుదేరుతుంది. అది కవిత్వ మంటే ఏ మౌతుంది?—

"నాలుగు మోములన్ నిగమనాదము లుప్పతిలంగ"—అంటూ...సాహిత్యబ్రహ్మని వివరించారు. ఇక్కడ నాదం ఒక మేదో విశేషణపూర్వకమై 'నిగమనాదం'. అయింది. నాలుగు మోముల వెనకా నాలుగు మేదస్సులు వున్నవాడే బ్రహ్మ. నాదం పోయి పోయి మేదస్సును మేలుకొల్పితే 'నాదబ్రహ్మ' ఏర్పడింది. అయితే మేలుకున్న బ్రహ్మమేదస్సులో నాదం సార్థక మైనప్పుడు బ్రహ్మనాదం సిద్ధించిందందాం. ఉచ్ఛ్వాసం లాంటిది గానం. నిశ్వాసం లాంటిది కవిత్వం.

మేదస్సు గడియారంలా, అరమరలతో వుంటుంది. "గడియారంలాగే టక్కు-టిక్కు-మంటూ, చిటికలు వేస్తూ, మెటిక విరుస్తూ" నిమిషమై, ఘంటై,. కాలాన్ని స్ఫురింప జేస్తుంది. స్ఫురింపజేస్తుంది అంతే, మరి! ఇంకోలా చెపితే కాలానికి దెబ్బ, ఉసి, దెబ్బ, వేళ్లు మడవటం, అంటే తాళం ఏర్పరుస్తుంది.

ఆల్ ఇండియా రేడియోవారి అనుమతితో ప్రకటితము.

నాదం మేదస్సుని మేలుకొల్పితే, మేదస్సు తాళప్రమాణంతో గానాన్ని గళగ్రాహి చేసుకుంటుంది.

తాళము లయ ప్రధానం. మేదస్సులో జనించిన లయ లఘువుగా, గురువుగా అక్షరమైంది. అక్షరాలు అర్థంతో కలిసి పదం. పదాలు భావంతో కలిసి వాక్యం. వాక్యాలు రసంతో కలిసి కావ్యం!— వాక్యం మళ్లీ తలక్రిందై తపస్సు చేస్తే కావ్యమైంది.— 'వాక్యం రసాత్మకం కావ్యం' అన్నారు పెద్దలు కూడా. అడుగడుగునా అదో తపస్సు— చిత్రంగా.

ఈ చిత్రంలో విచిత్రం పుట్టింది—'రస' మని. 'రసా'న్ని కాస్త కిందు మీదు చేస్తే 'స్వరం'—సంగీతం. 'స్వరా'న్ని కాస్త తిప్పితే 'రసం'—కవిత్వం.

స్వరానికి ఆకాశం ఆధారం. రసానికి భూమి ఆధారం అందాం,— ఉచ్ఛ్వాసం వెలుపలిది, నిశ్వాసం లోపలిది అన్నట్టు.

ఘృతాధారం పాత్రా, పాత్రాధారం ఘృతమా అన్న సమస్యకు బదులు, ఇప్పుడు రెండు ఆధారాలు దొరికాయి. తీర్థానికి తీర్థం, ప్రసాదానికి ప్రసాదంలా వుండని ఎవరేనా అంటే అనొచ్చుగాని!

అవాఙ్మానసగోచరమైనదాన్ని వాఙ్మానసగోచరం చెయ్యడానికి భూమిని ఆధారం చేసుకు రసం ఉత్పన్నమైందన్నాం. వాక్కు, మనస్సు జీవకోటికి చెందినవి. జీవకోటి ప్రకృతివల్ల పరిమితం. ప్రకృతి భూమిలో వేళ్ళు పాతుకుంది. రసస్వరూపంకూడా భూమిలో వేళ్లుపాతుకుని, మనస్సులో వాక్కులో పరిణతమై జీవకోటి జీవితంలో స్వారస్యాన్ని వ్యక్తం చేస్తుంది.

ప్రకృతిస్వభావాన్ని పుట్టిస్తుంది. స్వభావం అనుభవాన్ని పుట్టిస్తుంది. అనుభవం భావాన్ని పుట్టిస్తుంది. భావం రసాన్ని పుట్టిస్తుంది.—ప్రకృతి వ్యక్తిగతమైన లయ లాంటిది. స్వభావం శబ్దవంతమైన అక్షరంలాంటిది. అనుభవం అర్థవంతమైన పదం

లాంటిది. భావం కర్త కర్మక్రియావంతమైన వాక్యంలాంటిది. అక్షరపద వాక్యములలో స్వభావము, అనుభవము, భావము విలీనమై రసం ఉత్పన్నమైనప్పుడు లయ ప్రధానమైన సాహిత్యసృష్టి జరుగుతుంది. అది కవిత్వం. కవిత్వం అంతరంగంలో రసప్రధానమై, బహిరంగంలో లయ ప్రధానమై వుంటుందని తేలింది.

లయ గానాన్ని విభజించేది గాని గుణించేదికాదు. కాని లయ కవిత్వాన్ని సమకూర్చేది. కవిత్వంలో అంతరంగ సమన్వయంచేసి ఛందస్సుని సృష్టించింది లయ. గానంలో రాగాలాపన అపారంగా ఆవిరిలా ఎగసిపోతోంటే, రూపంలేని ఆ నాదాన్ని లయ అడుగుబద్దతో కొలుస్తానంటుంది. కొలిచేటప్పటికి ఆ నాద ప్రవాహం ఖండఖండాలై సాహిత్యలోకంలోకి దిగజారి 'గీతగోవిందమో', 'త్యాగయ్య కృతులో' ఏదో అయి వూరుకుంటుంది. కాని సాహిత్యలోకంలో ఈ లయ విభజన కార్యంకాకుండా, తన స్వభావసిద్ధమైన ఐక్యతావిధిని నెరవేర్చి, ఛందస్సుని ఏర్పరుస్తుంది. లఘు గురువులను కూర్చి 'గణం' చేస్తుంది. గణాలనుకూర్చి 'పాదం' చేస్తుంది. పాదాలనుకూర్చి 'పద్యం' చేస్తుంది. గానానికి విలయకారకమైన ఈ కొలబద్ద సాహిత్యంలో శైలికి, అందులో కవనానికి, ప్రాణదాయకమై సృష్టిస్థితులను ఒడగూరుస్తుంది.

గానానికి ఆధారం శ్రుతి; ప్రమాణం లయ. కవిత్వానికి ఆధారం లయ; ప్రమాణం శ్రుతి. ('శ్రుతి' అంటే కేవలం శ్రవణేంద్రియం అని అర్థం చెప్పుకున్నా ఫరవాలేదు. అప్పుడు లయ అంటే శ్రుతికీ మనస్సుకీ, స్వరానికీ మేదస్సుకీ కలిపే సేతువువంటిదిలా ఊహించుకోవచ్చు.)

ఇక,—లయను అనుగమించి కవిత్వం కడతాము. లయను అధిగమించి గానం ఆలపిస్తాము. గానం లయ నిబద్ధమైనప్పుడల్లా, సాహిత్యానికి ప్రాధేయపడుతుంది. కవిత్వం శ్రుతి ప్రమత్తమైనప్పుడల్లా అవ్యక్తమై, అపరూపమై, నీరసమై, భాషకాక కేవల నాదమై నశిసుంది.

కవిత్వానికి లయ రూపమిస్తుందన్నమాట. కవిత్వస్వరూపం తెలుసుకోవాలంటే లయ ఊతగర్రగా అన్వేషించాలి. రూపలోకంలోనే కవిత్వం సంచరిస్తుంది. రూప లోకంలో వైవిధ్యం, వైషమ్యం, సంఘర్షణ—ద్వంద్వం—ఉండితీరుతుంది. ద్వంద్వ భావాలని సమన్వయించి రసానందాన్ని నిరూపించేందుకు కవిత్వసృష్టిలో లయ ఊతగర్రగా వస్తుంది. గానం ద్వంద్వాతీతమైన లోకంనుంచి అవ్యయశాంతిని భూతలంమీద వర్షిస్తుంది. భూమిలో, స్వభావంలో, మానవహృదయంలో అంతర్వా హిని కవిత్వం. మనస్సుచుట్టూ వలయాకృతంగా సుడిగుండాలుచుట్టి, రసస్వరూప మైన కళాసృష్టిగా బహిర్గతమౌతుంది. మేదస్సు గ్రహించిన వస్తువు హృదయంలో రసపుష్టమై, అర్థయుతమైన పదము అనుభవయుతమైన భావమై, ద్వంద్వానుభూతు లకు ఏకాగ్రత ఒసగే రససామరస్యం ఒడగూర్చుకుని, లయ ప్రధానమైనరూపం పొందినవెంటనే కావ్యం సిద్ధిస్తుంది. ఈ లయ కవిత్వంలో అన్ని అంతస్తులలోనూ కూడా అనేక ప్రభావాలతో ప్రస్ఫుటమౌతుంది. శబ్దాలంకారాలలో బహిరం గంగా కనిపిస్తుంది. భావచిత్రణలో రహస్యంగా సామరస్యం చూపుతుంది. అందు వల్ల 'అక్షరరమ్యత'. కవిత్వపు శరీరపుష్టికి సాక్ష్యం. ఛందస్సు శరీరసౌష్టవాన్ని రేఖాబద్ధం చేస్తుంది. ఈ అంతస్తు 'శైలి' అందాం. శైలి కొన్ని రేఖలకు ఇమిడి నప్పుడు ఛందస్సు అయింది. వచనానికి పద్యానికి ఈ రీతిగా ఒక పరిణామ సిద్ధాంతం చెప్పవచ్చు. వచనం ఛందస్సుకి లోబడకుండా, లయకి విరుద్ధంకాకుండా, భావచిత్రణలో 'అంతర్లయ', అనగా సామరస్యం, అనగా రసోద్దీపనం ప్రధాన గుణంగా వర్తించినప్పుడుకూడా కవిత్వం సిద్ధిస్తుంది. దీనిని ఆంగ్లంలో verse libre లేక free verse అన్నారు. ఈరీతి రచన ప్రస్తుతం మన భాషలోకి కూడా వస్తూ వున్నందున, దీన్ని ఛందోబద్ధమైన రచననుంచి వేరుపరిచే నిమిత్తం "లయకవిత్వం" అని అంటే బాగుంటుంది.

ఇక, పైని చెప్పిన భావాలన్నింటికీ, అంటే, కవిత్వంలో లయస్థానాన్ని, లయప్రయోజనాలనీ తెలుసుకునేందుకు కొన్ని ఉదాహరణలు :

ఉప్పుకప్పురంబు నొక్కపోలికనుండు
చూడ జూడ రుచుల జాడవేరు;

ఈ రెండుపాదాలలోను అక్షరాలు, పదాలు అర్థయుతంగా వున్నాయి. అయితే వేమన్న చెప్పదలచుకొన్న భావం పూర్తికాలేదు.

పురుషులందు పుణ్యపురుషులు వేరయా, అన్నప్పుడే భావం నిండింది.

కాని యీ పాదాన్ని ప్రత్యేకంగా తీసుకు వెదికితే అర్థం స్పష్టంకాదు. పురుషులెట్టివారు, పుణ్యపురుషులెట్టివారు, వారికంటె వీరు ఏరీతిగా వేరు ? అనే ప్రశ్నలకు జవాబురాదు. పై రెండు పాదాలలోని సంపూర్ణమైన అర్థానికీ మూడవపాదంలోని అసంపూర్ణమైన అర్థానికీ సంపుటీకరణం కూర్చిన వెంటనే కవిభావం తేలుతుంది. ఇక్కడ ఉపమానోపమేయాల సమరసభావంవల్ల పద్యభావం స్పష్టమైంది. ఈ సామరస్యం ఒక అంతర్లయని సూచిస్తుంది. అందుకే కవిత్వంలో 'లయ' అంతస్తులలో మసిలి సమ్మేళనంచేసి కళానిర్మాణం కలుతుంది.—ఇక చివరి పాదంలో "విశ్వదాభిరామ వినరవేమా" అనే అర్థవ్యర్థమైన మకుటంతో అమాయికమైన హాస్యరసం కొంచెం మనకి స్ఫురించి, కేవలం 'నీరసం' కానని ఈ పద్యం నిలబడగలిగింది.— అయితే, వేమన్నగారు యోగి; కవినని ఆయన విర్రవీగడు.

తర్వాత పెద్దన్నగారు :

అటసని కాంచె భూమిసురు డంబరచుంబి శిరస్సరజ్ఝరీ
పటల ముహుర్ముహుర్లుఠ దభంగతరంగ మృదంగ నిస్వన....

అంటూ కొండంత నొప్పులు పడ్డాడు. చివరకి 'శీతశైల' మనే మూషికరాజాన్ని కన్నాడు. అక్షరలయ, పదలయ— అంటే శబ్దలయ, అర్థలయ కనిపిస్తుంది. భావం

అక్షరలయలో లీనమైపోయింది. అన్నీ బొమ్మలూ ఒక్క బొమ్మకి ఉపాంగాలు. ఇందులో జలతరంగ నటనమేగాని, భావతరంగ పరంపర లేదు. ఒకే శబ్దంలో, ఒకే రూపంలో, ఒకే భావంలో అనేకత్వం చూపే లయ యిది. అనేక శబ్దాలలో, అనేక రూపాలలో, అనేక భావాలలో ఏకత్వం కూర్చే లయ కాదు. — మొదటిది గానంలో లయ; రెండవది కవిత్వంలో లయ.

ఈ రెండవదానికికూడా తిరిగి పెద్దన్నగారినే ఉదాహరిద్దాం:

వాలారుం గొనగోళ్ల నీ వలసతన్ వాయింపుచో నాటకు
మేళంబైన విపంచి నిన్న మొదలుగా నీ వంటమిం జేసి యా
యాలాపంబె యవేళ బల్కెడి ప్రభాతాయాత వాతాహతా
లోలత్తంత్రుల మేళవింప గదవే లోలాక్షి దేశాక్షికిన్

పద్యం భావప్రధానంగా విరిగింది. ఛందస్సు అడగ్గి భావాన్ని ఆగదలచిన చోట ఆగనిచ్చింది. శబ్దలయ, అర్థలయ భావలయకి చెలిమికత్తెలుగా ఉపచారం చేశాయి. రసనిరూపణ జరిగింది.

ఇక నవ్యకవిత్వం:

సిందూరం, రక్తచందనం
బంధూకం, సంధ్యారాగం
పులి చంపిన వేడి నెత్తురు,
ఎగరేసిన ఎర్రని జండా,
రుద్రాలిక నయనజ్వాలిక,
కలకత్తా కాళిక నాలిక
కావాలోయ్ నవకవనానిక.

(శ్రీ. శ్రీ.)

ఇందులో శబ్దలయ, అర్థలయ దేనికది ఐక్యమై, రెండూ కలిసి సమైక్యమైనాయి.

అర్థలయ,— అంటే, ఇందులోని అన్ని పదార్థాలూ ఒకే రంగును సూచించే వరకు— సమన్వయమౌతుంది. ఈ కూడిక అంతా కలిసి సాధించవలసిన భావస్ఫూర్తి మృగ్యం. ఇందులో చెప్పిన ఏ పదార్థమూ యదార్థంగా అక్కర్లేదు నవకవనానికి. ఇవి కావలసిన మరి దేన్నో స్ఫురింపచేయాలి. అంటే, భావం ఈ పద్యంవల్ల నిరూపితం కాలేదు. అవ్యక్తంగా వుంది. నవకవనానికి అవ్యక్తత కావాలను కవి అభిప్రాయమైతే, మరి, ఈ కవికి ఈ పద్యంలో 'నవ్యత' సిద్ధించిందేమో కాని, కవిత్వం సిద్ధించలేదు. భావాలు ఐక్యమై మనస్సుకి స్పష్టజ్ఞానం ఒసగకపోతే, కేవల శబ్దప్రస్తారం మిగుల్తుంది. శబ్దాలకి రంగులు వేస్తే వేసివుండొచ్చు. ఇదేదో శబ్దగానం, వర్ణచిత్రం, 'భావ' కవిత్వం కాదు.

ఎవరోహో, ఈ నిశీధి
నెగసి, నీడ వోలె నిలిచి
పిలుతు రెవరొ, మూగ కనులు
మోయలేని చూపులతో
ఎవరోహో, ఎవరోహో
ఇపుడా నను పలుకరింతురు ?

(కృష్ణశాస్త్రి)

ముందరి ఉదాహరణలో శ్రీ. శ్రీ. లో బయటపడ్డ లయ లన్నీ కృష్ణశాస్త్రిలో అంతర్గతమై, అంతర్వాహినిగా లీనమైనాయి. ఈ తరహా రచన చెవిని నిద్రపుచ్చుతుంది. మనస్సుని మూర్ఛ ముంచుతుంది. అర్ధనిమీలిత నేత్రంలో చూచే చూపు, ఏవీ కనపడని దృశ్యాన్ని చూపుతుంది. శబ్దాలు లయించాయి. భావాలు లయించినట్లు అనిపిస్తుంది. నడిమిని అర్థాలు మాత్రం లయించ లేదు. 'నీడవోలె నిలవడం,' 'మూగకనులు', 'మోయలేని చూపులు', . ఎవరో, ఏమో, ఎందుకో తెలియని పిలుపు !—అర్థపుష్టిమీద ఆధారపడని భావసృష్టి కేవలం గాలిమేడ వంటిదై రూపరహితస్థితికి చేరువౌతుంది. ఇందులో రసం ఆవిర్లై స్వరప్రాయమై

పోయింది. ఇది భావ 'గానం' అయితే కావచ్చు, భావ 'కవిత్వం' కాదు.

మరికొన్ని ఉదాహరణలు :

దేశ మనియెడి దొడ్డవృక్షం
ప్రేమ లను పూ లెత్తవలె నోయ్,
నరుల చెమటను తడిసి మూలం
ధనం పంటలు పండవలె నోయ్,
ఆకు చాటున అణగి మణగీ
కవిత కోకిల పల్కవలె నోయ్

(గురుజాడ)

వల పెరుంగక బ్రతికి
కులికి మురిసే కంచె,
వలచి విఫల మ్మైంది
విలపింప మేలురా

(బసవరాజు)

పూలతో వియ్యాలు
పూలతో కయ్యాలు,
మానల్లె నన్నుంచి
తానె పూ వానేమొ.

(నండూరి)

శ్రీ. శ్రీ. గురుజాడ లోని సత్యసామరస్యాన్నీ, కృష్ణశాస్త్రి నండూరి లోని సౌందర్య సమన్వయాన్నీ చూరగొంటే శ్రీ. శ్రీ. కవిత్వంలో భావపుష్టి, కృష్ణ శాస్త్రి కవిత్వంలో భావనా సౌష్టవం నిండుగా మూర్తిమంత మయ్యేవి. 'గానం' లాంటి భావం శ్రీ. శ్రీ. ది. 'భావం' లాంటి గానం కృష్ణశాస్త్రిది. వీరిద్దరూ కూడా ఆధునిక కవిత్వానికి ఆవిరి ఇసుక లాంటి అంచులు రెండు కల్పించారు. వీరిద్దరి కవిత్వంలోనూ కూడా నాదబ్రహ్మ మేదస్సుని ఆవహించింది. — కృష్ణ

శాస్త్రిలో మైకంలాగ; శ్రీ. శ్రీ. లో స్వప్నంలాగ.

మన నవకవనంలో 'మేలుకున్న మేదస్సు' నుంచి ప్రస్థానాదం రూపొందాలి! శ్రీ. శ్రీ. musical images కన్నా, కృష్ణశాస్త్రి musical feelings కన్నా మెలకువ కలిగిన మానసికోద్దీపనం విజృంభించి, కన్ను విప్పి, స్పష్టంగా పలకాలి.

ఒక పాశ్చాత్య విమర్శకుడు "Poetry is musical thought" అన్నాడు. — మానసిక ప్రవృత్తులు లయబద్ధమైనప్పుడు అన్ని అంతస్తులలోను లయ ప్రతిబింబించి, కవిత్వానికి పూర్ణవ్యక్తత ఇస్తుంది. అప్పుడు రసంలో రాగమే కాదు, అనురాగం నిండుతుంది.

గానాన్ని గాంధర్వ విద్య అన్నారు. దేవలోకం నుంచి అభ్ర గంగా ప్రవాహంతో పాటు అవతరించి వుంటుంది. — కవిత్వం మానవ భాష. భూగర్భంలో అంతర్వాహినిగా లీనమైన సరస్వతీ స్రోతస్విని ఆదికవి వాల్మీకి తోడబుట్టువు.

మొత్తానికి, గానాలాపనలో లయని మీరి కాలు జారి మునిగిపోకుండా, కాగితం మీద చదివినా మనస్సులో రసానంద స్పందనం కలిగించేది కవిత్వం అనొచ్చు.

ఇందుకు ఉదాహరణగా, బసవరాజు కవిత్వంలోని, అమాయికపు లేగదూడని బలిష్ఠ వృషభం చేసిన ఒక అధునాతన కవితా మనస్వి వ్రాసిన గద్య కవనాన్ని —పాడబడదు కనక— చదివి వినిపిస్తా. ఇందులో అంతస్తు అంతస్తులోనూ లయ సమ్మేళనం గమనిస్తే కనిపిస్తుంది:

గుండె మీ దొక రాయిలా కూర్చుంది తమస్సు.
అంద విరిగి పడింది అంధలోకంలో మనస్సు.
ఆకాశమైనా నా కగపడ్డం లేదు.—
నా కోసం వెలిగించు నీ కళ్లలో ఈ రాత్రి
మన మైత్రి!

చీకటి

'పా. ప.'

చీకటి ఒక మహోద్యమంలా పాకింది
పగలు పోని రేయిరాని సంధ్యాసందిగ్ధంమీద
అనంతకోటిప్రాణుల పరిసరస్పర్శతగిలి
కుంచితమయిపోయిన అంతరాంతరం
రూపపరిమితినశించిన అఖండస్థలావకాశంలో
స్వేచ్ఛగా అణువణువూ విడి వ్యాపించింది
అనేక నక్షత్రాలయి

కాలం కరిగి కరిగి
బిందువై లఘువైనది
కణమై తరిగి తరిగి
నాచూపుల తళుకైనది

వస్తు స్వరూపాలను బంధించు
రేఖాలు ఆ చీకటిలో అస్పష్టమయి
మాయమయి బహిరంతరాలను సంధించు
కేంద్రాన్ని దృష్టిలో నిల్పినాయి

తరువు తరువులోని జీవనాశం
కలిసిన పుడమిలోపలి ప్రవాహం
ఆ గుప్త బిందువే—
జీవి జీవి జ్ఞప్తికీ వెనక ఉన్నభావం
రూపొందిన ఏకైకారావం
అసుప్త ఛందమే—
వ్రాయని పద్యమయింది
నా జాగృతిలో

నేనపుడు విశ్వమంతా నేనయి
ఊహగా ఊపిరిగా వ్యాపించాను
సర్వరూపజ్ఞానాలూ నాలో ఇమిడాయి
స్ఫటిక స్వచ్ఛమయిన ఒక కణంలో
నేనపుడు గోళగోళాల పరిభ్రమణం
నిర్దేశించిన ఏకైక ధర్మాన్ని
జనన మరణాల కౌగిలింతని

ఆకణంలో సృష్టిలోని అనంతకోటి అవకాశాలూ
ప్రతివస్తు తత్వంలోని వేరువేరు సత్యాల సమత్వం
ప్రతిగుండెదరికిసూ అనుసంధించుఏకైకస్పందన
ఒకేఒక సత్యంగా ప్రతిఫలించాయి

నేనపుడు నేను గాను
నేనపుడు కరిగి మిగిలిన కణమే
ఇంత చీకటినీ ఆవరించింది
ఆ కణమంత చిన్నది—అంత పెద్దది

తార తారకూ వేరు వేరుగా
నిర్ధరించిన యాత్రపు సూత్రం
ఆకాశమంతా ఆవరించి
నాలో ఇముడ్చుకున్నాను

నాశనాశాన్నితాకే సజీవమయిన చీకటే
నిశ్చలమయిన జ్ఞానసమాధి నాకు
ఇంక పగలులేని రేయిలేని
కాలవిహీనతలో నిలిచి పరిశీలిస్తాను జగాన్ని నేను

రూపరేఖల బయటి మిలమిలలకు
నాచూపు ఏమరదు
ప్రతిప్రాచీ ఆకృతిలోపలి
స్ఫటికీకృత ధర్మ ప్రతిబింబం
స్వచ్ఛంగా చూడగలుగుతాను నేను

భౌతిక నేత్రాల ప్రయోజనం
హద్దుపరచే చీకటి,
రూపవిశిష్టత మోటుగా జ్ఞప్తిమీద
విసిరే వెలుగును కప్పేచీకటి
లోపలి స్ఫటిక స్వచ్ఛమయిన జీవకణాన్ని
ఏకాగ్రంగా వెలిగించే చీకటి

నాలో నాశమయి, స్వభావమయి
నేనయి పోనీ
అదే నా సాధనకు పర్యవసానం
అదే నా వేదనకు అమరగానం

చీకటీ! చీకటీ! నీవు శూన్యమవుకావు
భౌతికదృష్టికందని సూక్ష్మ సూక్ష్మ
కాంతికిరణాల సంచలనం నీవు
రేపల నైశిత్యమే నీ అదృశ్యతకు అర్థం

వస్తువుల అంతరంగ వస్తుత్వాన్ని
బహిరంగపరిచే సూక్ష్మ విద్యుత్తువలె
నీ వ్యాప్తినైసత్యం విశ్వగర్భంలోని
మూల ప్రయోజనం మీద వెలుగుతుంది

చీకటీ! చీకటీ! అనంత వైశాల్యాన్ని
నీలో ఇముడ్చుకుని నాకంటి పాపవయిపో
కోటికోట్ల జీవుల ఆత్మలు
కేంద్రీకృతకాంతి బిందువులయి

ఇన్నితారలయి
నీలో ప్రతిఫలించాయి

చీకటీ! చీకటీ! నీచూపులో
రూపాలపై హద్దులు
కరిగి కరిగి ఆవిరిఅయి
లోని నిజాలు అనాచ్ఛాదంగా
పేరు పడిపోతాయి

చీకటీ! చీకటీ! నీవ్యాప్తి సర్వసృష్టినీ
ఒక్క కౌగిలింతలో బంధిస్తుంది.

భువనాలు పుట్టని తొలినాడు కల
సారాంశం నీవేనా?
పరిమితశక్తుల నలపరచుకున్న
కాంతి తత్త్వాల సమ్యక్ స్వరూపం
నీవేనా?
కాలస్థలాలు కలిసి ఒకటైనా
నిశ్చలత నీవేనా?

పగటి వెలుగుల పరిమిత శక్తిలో
నీ సూక్ష్మత మాటుపడి పోతుంది

చీకటికి పగలులేదు, రేయిలేదు
నిన్నలేదు, రేపులేదు,
నిత్యమూ వస్తువుల లోపలికంటా
అఖండంగా వ్యాపించి ఉంటావు నీవు

చీకటీ! చీకటీ! నీనిత్య ప్రత్యక్షమే
మనిషికి జ్ఞానం, బలం, సమత,
అపుడు మనిషి యోగి—పరమాత్మ

కాళిదాస మహాకవి : 'అగ్నివర్ణ' చిత్రణము

పిలకా గణపతిశాస్త్రి

అది దివ్యమైన కాళిదాస మహాకవి కవితా స్వప్నము. మనం రఘువంశ మహాకావ్యంలో అంతిమ సర్గలోఉన్న సముజ్జ్వలమైన అగ్నివర్ణుని వర్ణనా సౌధంలోనికి ప్రవేశిస్తున్నాము. అక్కడ ఆ అగ్నివర్ణచిత్రణం చూచినప్పుడు, మనకు తెలియకుండానే మనం ఒక స్వప్నప్రపంచంలో ప్రవేశిస్తాము.

సామాన్యంగా కాళిదాసకవిత్వంలో అంతటా మనకు ఈ స్వాప్నిక సౌందర్యం గోచరిస్తుంది. మనం ఎంతగా కాళిదాస కవిత పరిశీలించినా చివరకది మనలో ఒక సుందరస్వప్నంలాగే నిలిచిపోతుంది; కాని మహాకవి కవితా స్వప్నం సజీవమైనది. అతని జగత్తులో ప్రతి పరమాణువున్నూ జీవ చైతన్యంతో మిలమిల లాడుతూ ఉంటుంది. ఒక విషయము: సామాన్యంగా ఈ స్వాప్నిక స్వభావం అతి దుర్బలమైన కవనంలో కూడా ఎక్కువగా కనబడుతుంది, అయితే అట్టి కవితలో జీవం అంతరించి పోతుంది; లేక చాలావరకు శుష్కించి ఉంటుంది. కాళిదాస కవితలో మాత్రం ఆ స్వాప్నిక సౌందర్యం చైతన్యోద్దీప్తంగా ఉంటుంది. ఈ రెండు గుణాలున్నూ కాళిదాస కవితలో ముఖ్యమైన ప్రత్యేక లక్షణాలు.

మహాకవి తన కావ్యం 'రఘువంశ'మని పేర్కొన్నాడు. అయినా రఘువంశీయుల చరిత్రలన్నీ కవి తన కావ్యంలో సంపూర్ణంగా వర్ణించలేదు. ముఖ్యంగా ౧౮వ సర్గలో కవి ఒకటి రెండు శ్లోకాలలోనే అనేక రఘువంశీయుల వర్ణనం చేసి విడిచి వేసిన విషయం మనం మరిచిపోకూడదు. రఘువంశంలో ముఖ్యంగా, దిలీపుడు, రఘువు, అజుడు, దశరథుడు, రాముడు, కుశుడు, అతిథి, సుదర్శనుడు, అగ్నివర్ణుడు అనే ఈ తొమ్మండుగురు మహారాజుల చరిత్రమే కవికి వర్ణ్యవిషయము. మహాకవి రఘువంశంలో పేర్కొన్న వంశక్రమంలోనూ, రామాయణంలో వర్ణితమైన వంశ

క్రమంలోనూ ఎక్కువ విభేదం కనబడుతుంది. ఈ విధంగా వంశక్రమంలో విభేదం ఏర్పడడానికి కారణం చారిత్రకుల విమర్శనకు వదిలివేదాము. మహాకవి రఘువంశం అగ్నివర్ణుని మరణంతోనూ, గర్భవతి ఐన అతని రాజ్ఞికి జరిగిన పట్టాభిషేకంతోనూ పరిసమాప్త మవుతుంది. ఈ విధంగా రఘువంశం సంపూర్తి కావడానికి, కవి మరణమే కారణం అయివుంటుం దని చారిత్రిక విమర్శకులు చెప్పవచ్చును: కాని సూక్ష్మదృష్టితో మనం కాళిదాస కవితను పరిశీలించి నప్పుడు, ఒక నిగూఢాశయంతో కవి ఈ విధంగా రఘువంశం సమాప్తి చేయ దలచినట్లు. మనకు విస్పష్ట మవుతుంది.

ఈ సందర్భంలో కవి రఘువంశ ప్రారంభంలో, ఒక ప్రతిజ్ఞ చేసిన విషయం మనం స్మరించవలసి ఉన్నది. రఘువంశంలో మొదటి సర్గలో ౫వ శ్లోకం మొదలుకొని నాల్గు శ్లోకాలలో, కవి కేవలం మహాదర్శ స్వరూపులైన రఘువంశీయుల చరితమే తాను వర్ణించ దలచినట్లు, అతని ప్రతిజ్ఞవల్ల, మనకు సుస్పష్టంగానే తెలుస్తుంది. మహాకవి వర్ణించ దలచిన రఘువంశీయులైన మహారాజులు, శైశవంలోనే సమస్త విద్యలనూ అభ్యసించిన వారు; యౌవనములో విషయములను అభిలషించిన వారు; వార్ధకంలో మునివృత్తి నవలంబించినవారు; అంతంలో 'యోగం' చేత శరీరపరిత్యాగం చేసినవారు; ఇంతేకాక వారు ఆజన్మాంతమూ పరిశుద్ధమైన చారిత్రం కలవారు; ఫలోదయం కలిగేవరకూ తమ ప్రయత్నం విడిచిపెట్టనివారు; సముద్రాంతం వరకూ భూపరిపాలనం చేసిన చక్రవర్తులు; స్వర్గలోకంవరకూ అప్రతిహతమైన రథమార్గం కలిగినవారు, ఈ చక్రవర్తు లందరూ సకాలానికే ఉదయమే మేలుకొని, తమ ప్రాతఃకాలం హోమవిధులను నిర్వర్తించుకొన్నవారు; అపరాధానురూపంగా శిక్షింపవలసిన వారిని శిక్షించినవారు; యాచకుల కాంక్షితములకు అనురూపంగా దానం చేసి వారిని తృప్తిపొందించిన వారు; త్యాగం కొరకు మాత్రమే ధనసంగ్రహం చేసినవారు; సత్యాభినివేశంచేత మితభాషిత్వం అవలంబించినవారు; కీర్తికాములై, దేశములను జయించినవారు; సంతానార్థం

మాత్రమే గృహస్థులైనవారు. ఇటువంటి రఘువంశీయులచరిత్ర మాత్రమే కవి వర్ణింప దలచుకొన్నాడు. ఇదీ మహాకవి ప్రతిజ్ఞ!

కవి, ఇటువంటి మహాదర్శ స్వరూపులైన రఘువంశీయుల చరిత్రంలో 'అగ్నివర్ణుని' చరిత్రం వర్ణ్య విషయంగా ఎన్నుకోవడమే మనకు పరిశీల్యాంశము. తనకు ఇష్టం లేనప్పుడు ౧౮ వ సర్గలో కవి ఒకటి రెండు శ్లోకాలలో అనేక మహారాజులను వర్ణించి విడిచివేసిన విషయం మనం ఎరుగుదుము. ఈ పరిస్థితుల్లో కేవలం భోగలాలసుడూ, ఆదర్శవిహీనుడూ అయిన అగ్నివర్ణుని అంత [illegible]లంగా అంతిమ సర్గలో కవి ప్రదర్శించడానికి నిగూఢాశయం ఏమై ఉంటుంది? మనం రఘువంశీయుల చరిత్రం కొంత పరిశీలించిచూదాము.

కాళిదాస మహాకవి వర్ణించిన రఘువంశీయులలో దిలీపుడు, రఘువు, అజుడు, దశరథుడు, రాముడు, కుశుడు అనే ఈ ఆరుగురు చక్రవర్తుల చారిత్రమూ మహాదర్శయుత మైనది. వీరందరిలోనూ ఆర్యధర్మాలన్నీ అత్యున్నత శిఖరంలో నిలిచాయి. అతిథిలోనూ, సుదర్శనునిలోనూ కొంత మహత్త్వంలో భేదమున్నా పూర్వుల ఆదర్శ మార్గం అనుసరించడంలో వారిలో భేదం కనబడదు. మొత్తం మీద దిలీపుడు మొదలుకొని సుదర్శనుని వరకూ ఉన్న ఎవరిలోనూ స్వధర్మ నిర్వహణంలో గాని రాజ్య పరిపాలనంలో గాని కొంచమైనా కొరత కలగలేదు; వారిలో వారికి మహత్త్వంలో కొంత తారతమ్యం ఉన్నా ఆదర్శధర్మనిర్వహణంలో వారందరిదీ ఒకే మార్గమని మనం నిశ్చయించవచ్చును.

అయితే వీరందరిలోనూ అంతిమ పరిపాలకుడైన అగ్నివర్ణునిలో ఈ మహాదర్శం తలక్రిందులైనది; అతనిలో మనకు ఏ మహాదర్శమూ కనబడదు. ఆదర్శమనేది ఏదైనా ఉంటే అది నిరంతర భోగలాలలస; దుర్వారమైన రిరంసాలోలుపత. రఘువంశంలో చివరి సర్గలో మొదటనే అతని పరిచయం మనకు కలుగుతుంది. ఆ సర్గలోనే నాలుగవ శ్లోకంవల్ల అగ్నివర్ణుడు కొంతకాలమే స్వయంగా రాజ్య

పరిపాలనం చేసినట్లు కనబడుతుంది. తరువాత అతడు రాజ్యం సచివాయత్తం చేసి 'స్త్రీవిధేయ నవయౌవను'డైనాడు. తరువాత రఘు శ్లోకాలలో ఇంచుమించుగా సర్గాంతం వరకూ, కవి, కిన్నలు మిరుమిట్లుగొల్పే విధానంలో అగ్నివర్ణుని భోగానుభూతి వర్ణిస్తున్నారు. కాళిదాసకవి నివాళించిన ఈ అగ్నివర్ణుని భోగ సౌందర్య నీరాజనంలో, గుప్తసామ్రాజ్య వైభవచ్ఛాయలు కూడా అనుసరించి నృత్యం చేస్తున్నాయని మనం సులభంగానే ఊహించవచ్చును. చరిత్ర విమర్శకులలో కవి కాలం విషయంలో వివదించి, గుప్తసామ్రాజ్య విషయమై సందేహించవచ్చును. కాని ఏదో ఒక మహోన్నత స్థితిలో ఉన్న ఒకానొక సంఘపు సౌందర్యం కాళిదాస కవితాదర్పణంలో ప్రతిబింబించిందని విమర్శకులు నిశ్చయించక తప్పదు. అయితే ఈ వాదం కొంతవరకు చారిత్రికులకు విడిచివేసి, మనం అగ్నివర్ణుని భోగ వైభవం అనుసరించిపోదాము.

అదుగో అగ్నివర్ణుని ప్రథమ సందర్శనము! మహామంత్రులమీద గౌరవంచేత వారి వాక్యం తిరస్కరించలేక మహారాజు పౌరులకు దర్శనం ఇస్తున్నాడు! ప్రజలకు ఎవరిదర్శనం కలిగింది? మహారాజు సౌధాగ్రంలో నిలబడి పౌరులందరికీ దర్శనమియ్యటం లేదు. గవాక్ష వివరం నుంచి వేలాడిన అతని చరణం దర్శించి ప్రజలు మహారాజ 'దర్శనం' పొందుతున్నారు. మహాకవి అన్నట్లు అది 'తద్గవాక్షవివరావలంబినా కేవలేన చరణేన కల్పితమ్!'* ఒకసారి అగ్నివర్ణుని జలవిహార సవిధానికి పోదాము. ఉద్యానదీర్ఘికలో — యౌవనోన్నతములైన విలాసినీ స్తనములు సంక్షోభం పొందిన తామర పూవులలో అతని జల విహరము! ఇంక అతని పైనందిన కార్యక్రమము. అతని అంతఃపురం పరిపూర్ణంగా అలంకరించేవి రెండు: మొదటిది హృదయంగమస్వరమైన వల్లకి; రెండవది మాజువా హృనోహారిణియైన వామలోచన. ఆ పిమ్మట మహారాజ నర్తన శాలలోనికిపోయి చూదాము. మహారాజు మృదంగ వాదనం చేస్తున్నాడు. అతని కంఠంలో పూలహారాలు కదిలిపోతున్నాయి.

* ఆదర్శనం గవాక్ష వివరం నుండి వేలాడుచున్న ఒక్క పాదముచేతమాత్రమే జరిగినది.

పార్శ్వంలో లాసికలు నృత్యం చేస్తున్నారు. అగ్నివర్ణునిమీద అనురాగభరంచేత వారు నృత్యంలో పొరబడుతున్నారు! సమీపంలో ఉన్న నాట్యాచార్యులను చూచి, తాము పొరబడినందుకు లాస్యాంగనలు లజ్జిస్తున్నారు. నృత్యావసానంలో భిన్న తిలకములైనవారి ముఖములను మహారాజాస్వాదిస్తున్నాడు! ఆపిమ్మట తన చిత్రశాలలో ఉన్న మహారాజును చూదాము. అగ్నివర్ణునికి కూడ అసులభలైన నృత్యాంగనలున్నారు కాబోలు! మహారాణులవల్ల భయపడి తనకు అలభ్యలైన వారి చిత్తరువులు, అగ్నివర్ణుడు, తన చిత్రశాలలో ఏకాంతంగా చిత్రించు కొంటున్నాడు. ఆ చిత్రణ సమయంలో అతనికి అనురాగోదయమై అంగుళి స్విన్నమైనది. జారిపోతూఉన్న కుంచికతో అతి ప్రయత్నంమీద అతని చిత్రరచన సాగించు కొంటున్నాడు!

అగ్నివర్ణునిది బహుకాంతఃపురము; అతని నిత్యమూ బహు వారాంగనాలోలుడు. అయినా అతని భోగలాలస విరమించలేదు. అర్ధరాత్రివేళ అతనికి ఉద్యానవనంలో ఒకదూతిక మార్గం చూపిస్తూఉంది. లతాగృహంలో పుష్పశయ్యమీద పరిజనాంగనల సౌందర్యమధువును అతడాస్వాదిస్తున్నాడు. ఆ అంతఃపురపరిచారికలు మహారాణులవల్ల భయంచేత అతనితో ఏవో గుసగుసలాడుతున్నారు. మహాకవి కేవలం అగ్నివర్ణుని భోగవర్ణనంలో ఇంతటితో సంతృప్తి వహించలేదు. తరువాత గానసభలలో దశనపీడితాధరలైన మురళీ వాదినులను, నఖక్షతాంకితోరువులైన వీణా వాదినులను అతని హృదయం ఆహ్వానించినట్లు వర్ణించబడింది. ఒక్కొక్కప్పుడు నాట్యసభలలో, మహారాజు, నర్తన శాస్త్ర పండితులతో వివదిస్తూ ఉన్నట్లు కూడా వర్ణించబడింది. ఆ పిమ్మట షడృతువులలోనూ మహారాజ భోగవర్ణనం జరిగింది. విచిత్రంగా ఇది వర్షావర్ణనంతో ప్రారంభమైనది.

వర్షర్తువులు మహారాజు నవమల్లికామాలికలు గళసీమలో అలంకరించుకొన్నాడు. అతడు కడిమిపూల పుప్పొడి మైపూత పూసుకొన్నాడు. కృతకక్రీడా పర్వతం

పైని నృత్యన్మయూరసమూహంలో అతని విహారము ప్రణయకుపితలైన ప్రియాంగనలను అనునయించవలసిన అవసరం అతని కీ సమయంలో కలగలేదు. మేఘగర్జనలవల్ల భయపడిన వారే, అతని ఆలింగనంలో ప్రవేశించవలెనని అతని ఆకాంక్ష. ఒకొక్కప్పుడు మహారాజు కార్తిక రాత్రులలో సౌధోపరిభాగం నుండి సరయూ సౌందర్యం పరిశీలిస్తూ శరత్సౌందర్యం అనుభవిస్తున్నాడు. తరువాత హేమంతర్తువర్ణనము. ఆ పిమ్మట ఉజ్జ్వలమైన ఒక శిశిరర్తువర్ణనము. శిశిరరాత్రులు, నిశ్చలదీపికా విలోచనములతో, వాయు సంచారం లేని గర్భగృహాలలో, అతని సంభోగానుభూతికినీ సాక్షీభావం పొందుతున్నాయి. పిమ్మట సంగ్రహంగా వసంతర్తువర్ణనము. ఆ పైన గ్రీష్మ వర్ణనము: మహారాజు ప్రియాపరిపూర్ణమైన అంకతలంలో డోలా విహారం అనుభవిస్తున్నాడు. క్రమంగా వారు భయపడి అతని కంఠం ఆలింగనం చేసుకుంటున్నారు. తరువాత అతడు మామిడి చిగుళ్లుంచిన ఎర్రని పాటల పుష్పాల మద్యం సేవించినట్లు వర్ణించబడింది. గ్రీష్మాగమంవల్ల కృశించిన మన్మథుడు ఆ మధుసేవ వల్ల తిరిగీ అతనిలో విజృంభిస్తున్నాడు. మనం ఇంతవరకూ మహాకవి వర్ణించిన భోగవర్ణనంలో కొన్ని కొన్ని మెరుపులే చూచి ఆనందించాము. సంపూర్ణంగా మహాకవి కవితా సౌందర్యం ఆంధ్రవచనంలోనికి అనువదించుకోగలమని అనుకోవడం కేవలం సాహసము. ఈ విధమైన భోగలాలసలో అతడు మునిగి తేలుతూ ఉన్నా శత్రువు లెవరూ అతనిని ఆక్రమించలేక పోయారట! కాని దక్ష శాపంవల్ల చంద్రుని శరీరంలో క్షయరుగ్మత ప్రవేశించినట్లు అతి భోగానుభూతివల్ల అతనిలో రాజయక్ష్మ ప్రవేశించింది. మహాకవి రచించిన మహోజ్జ్వలమైన అగ్నివర్ణుని భోగచిత్రణం ఇంతటితో ఆగిపోయింది.

క్రమంగా అతనిలో రాజయక్ష్మ వృద్ధిపొందింది. పాండువదనంతోనూ, అల్పభూషణాలతోనూ, సావలంబ గమనంతోనూ మృదు స్వనంతోనూ కలిసి, రాజయక్ష్మ అతనిలో దుర్భర విరహావేదనా సౌందర్యం పొందింది. క్రమంగా, వైద్యులు ఎంత నిషేధించినా, అతడు తన భోగలౌల్యం విడువలేదు. ఒక విచిత్ర విషయము:

రాజదర్శనం లేకపోవటంచేత, పౌరులు అగ్నివర్ణుని కేదో ఆపద తటస్థించి ఉంటుందని సందేహిస్తూ ఉన్నప్పుడు, మంత్రులు "మహారాజుల రాజవంశం అవిచ్ఛిన్నంగా చేసే ప్రయత్నంలో ఉన్నా"రని వారిని సమాధానపరచేవారట! చివరకు ఇంత బహుళాంతఃపురంతో, సంతానం లేకుండానే అగ్నివర్ణుడు అస్తమించాడు. కాని మంత్రులు ప్రజలందరకీ అగ్నివర్ణుని రోగశాంతికై హోమాలు చేయిస్తున్నామని ప్రకటించారు. రహస్యంగా మహారాజోద్యానవనంలోనే అతని శరీరానికి దహన సంస్కారం చేయించారు. ఆపిమ్మట గర్భవతి అయిన అగ్నివర్ణుని పట్టమహిషికి పట్టాభిషేకం జరిగింది. నరేంద్ర శోకంవల్ల జలజల ప్రవహిస్తూ ఉన్న వేడికన్నీటితో తడిసిన ఆమె గర్భానికి సువర్ణకలశోదకాలతో యథావిధిగా రాజ్యాభిషేకం జరిగింది. పిమ్మట ఆ రాజ్ఞి యథావిధిగా కొంతకాలం రాజ్యం పరిపాలనం చేసింది. ఈ చివరి వాక్యంతో రఘువంశంలో ఆఖరిసర్గ సమాప్తమైనది. దానితోనే రఘువంశమున్నూ సమాప్తి చెందినది. ఇదీ మహాకవి రఘువంశం సమాప్తిచేసిన విధము!

కాళిదాస కవిత శృంగారప్రధానమైనదని సాంప్రదాయికుల సామాన్య విమర్శనము. కాని కేవల శృంగారమే కాళిదాస కవితకు పరమావధి కాదు. వైషయిక (Sensuous) సౌందర్యం అంతటా అతని కవితలో సముజ్జ్వల ప్రభలతో మెరుస్తూ ఉంటుంది. సామాన్య దృష్టితో పఠించినవారికి అతని కవితలో భోగ్యభోగ వర్ణనం విశేషంగా గోచరిస్తుంది. అయినా అతని కవితాత్మ వీటి కన్నింటికీ అతీతమైనది. బహుశః మహాకవి గుప్తసామ్రాజ్యం మహోన్నతస్థితిలో ఉన్నప్పుడు జీవించిఉండవచ్చును. మహాకవి, భోగైక పరాయణతలో ఉన్న లిప్సనూ ఆనందమునూ మాత్రమేకాక, వాని దుష్పరిణామాలనుకూడా సునిశితమైన కవితాదృష్టితో పరిశీలించినవాడు. ఈ సామ్య దృష్టివల్లనే అతని అగ్నివర్ణ చిత్రణంలో కేవలం ధర్మోపదేశాత్మకమైన భోగప్రశంసగాని భోగదూషణంగాని ఎక్కడా గోచరించదు. లలిత లలితమైన వ్యంగ్య ప్రభావంవల్లనే కాళిదాస హృదయం మనకు కళావ

గుంఠనంలో గోచరిస్తుంది. అగ్నివర్ణ చిత్రణము మహాకవి సమానకాలీనులైన పౌరులకూ పరిపాలకులకూ ఉద్దేశించిన ఒక కాంతాసమ్మితమైన ఉపదేశము. ఇప్పటి పాశ్చాత్య నాగరకతలో, కొందరు మహావిజ్ఞులు నాగరకతా నాశకములైన కొన్ని దోషాలను ప్రదర్శించినట్లే, ఆ కాలంలో దూరదర్శి అయిన మహాకవి అతి భోగలాలసను తన సమాన కాలీనుల దోషంగా పరిగణించి, వ్యంగ్యంగా, అగ్నివర్ణచరిత్రలో, ఆదోషం ప్రదర్శించి ఉండవచ్చును. ఇంతేగాక నశించిన ప్రఖ్యాత రాజవంశాలలో ఈ అతి భోగాసక్తి ఒక ప్రధానకారణ మౌతుందన్న ఒక మహా చారిత్రిక సత్యంకూడా మనకు అగ్నివర్ణ చరితంవల్ల తెలుస్తుంది.

మనం కళాదృష్టితో అగ్నివర్ణ చిత్రణం పరిశీలించి నప్పుడు, ఆ దృక్పథంలోకూడా మహాకవిలో ఉన్న సునిశిత కళాశీలత్వం ప్రస్ఫుటమౌతుంది. ఆదర్శపురుషులైన దిలీపుడూ రఘువూ మొదలైన వారిలో ఉన్న మహత్త్వం, మనకు అగ్నివర్ణ చిత్రణా వల్లనే సంపూర్ణంగా వ్యక్తమవుతుంది. వారిలో ఉన్న ఆదర్శసౌందర్యం కూడా అగ్నివర్ణునిలో ఉన్న ఆదర్శ విహీన సౌందర్యం ఆదర్శించడం వల్లనే సంపూర్ణంగా వ్యక్తమవుతుంది. ఈ విధంగానే అగ్నివర్ణ చిత్రణంలో ఉన్న సౌందర్యం ఆదర్శపురుషుల చిత్రణసాన్నిధ్యంలోనే ప్రజ్వలిస్తుంది. ఈ విధమైన వైరుధ్యాల అంగాంగీ భావంవల్లనే సౌందర్య స్వరూపం పరిపూర్ణ మవుతుంది. సునిశితకళాశీలి అయిన మహాకవికి ఈ కారణం వల్లకూడా అగ్నివర్ణ చిత్రణం ఆవశ్యకమయింది. ఈ ఆశయాలన్నీ అగ్నివర్ణచిత్రణంలో మహాకవికి లేవన్నప్పుడు అగ్నివర్ణచిత్రణం కేవలం అసంబద్ధమూ అనుపయోగీ సౌందర్యవిహీనమూకూడా అయిపోతుంది.

ఈ సందర్భంలో ఒక విషయం మనం ముఖ్యంగా జ్ఞాపకముంచుకోవలసిఉంది. కాళిదాసకవి శుష్కవిరాగికాడు. ప్రపంచంమీద కేవల మిథ్యాదృష్టిగాని భ్రాంతిదృష్టిగాని అతనికిలేదు. వైషయిక సౌందర్యం అతనిదృష్టిలో మానవుని అధఃపతనానికి ఆకర్షించే మాయావాగురకాదు. మహాకవి వైషయిక సౌందర్యంలో జీవన పరమార్థం సందర్శించిన ద్రష్ట. సౌందర్యం అతని దృష్టిలో సచ్చిదానందాత్మకమైన

పరమాత్మస్వరూపంలోని ఆనందావిష్కృతి. ఈ కారణంవల్లనే సౌందర్యం కవికి, హేయంకాక, సాధనగానూ, ఒక మహాదర్శంగానూ పరిణమించింది. మహాకవికిగల ఈ అభిప్రాయమే అభిజ్ఞాన శాకుంతలంలోని ఈ శ్లోకంవల్ల మనకు స్ఫురిస్తుంది. ఇది మారీచాశ్రమంలో తపోధనులను వర్ణించే శ్లోకము:

"ప్రాణానా మనిలేన వృత్తి రుచితా సత్కల్పవృక్షే వనే
తోయే కాంచన పద్మరేణు కపిశే ధర్మాభిషేక క్రియా,
ధ్యానం రత్నశిలాతలేషు విబుధస్త్రీసన్నిధౌ సంయమః
యత్కాంక్షంతి తపోభిరన్యమునయ స్తస్మిం స్తపస్యంత్యమీ॥ *

ఇక్కడి ఋషులు, సామాన్య ఋషులు తపశ్శక్తివల్ల ఆర్జించే భోగ్య పరిసరాలలో ఉండి, ఒక మహాదర్శం అన్వేషిస్తున్నారు. అదే మహాకవి ఆదర్శ మని కూడా మనము నిశ్చయించవచ్చును. మారీచాశ్రమ తపోధనులు రత్నశిలాదికములైన సుందర పరిసరాలను హేయము లని పరిత్యజించ లేదు. ఆ సౌందర్య పరిసరంలోనే నివసించి, తదతీతమైన సౌందర్యం వారు అన్వేషించారు. మహాకవి దృక్పథం కూడా ఇటువంటిదే! సౌందర్యం అతనికి ఒక మహోన్నతాదర్శమే కాకుండా ఒక సాధనం కూడా అవుతుంది. వైషయిక సౌందర్యం సంపూర్ణంగా అనుభవించి, జీవితంలో సమన్వయించుకొని, ఆ సౌందర్య సాధనంతో ఒక అమేయ సౌందర్యం అన్వేషించి అవగాహన చేసుకొన్న వాడా మహాకవి. అతని దృష్టిలో వైషయిక సౌందర్యమూ తదతీత సౌందర్యమూ పరస్పర విధ్వంసకములు గాని పరస్పర ప్రతికూలములుగాని కావు. ఆ ఉభయ సౌందర్యములనూ పరస్పర సామరస్యంతో

* ఇది వీరేశలింగ కవి అనువాదము:

అమర తరు ప్రశస్త వనమం దసుధారణవృత్తి గాలిచే,
సుమహిత కాంచనాంబుజరజో విలసజ్జలమందు స్నానమున్,
దమిని మణి ప్రదేశముల ధ్యానము, నచ్చర లొద్ద సంయమం,
బమర దపఃఫలం బితరు లందు నెదం దప మొనర్తు రీరికిన్

—సప్తమాంకము

మేళవించి మహాకవి ఆరాధించిన విషయం ముఖ్యంగా మనం విస్మరించకూడదు. ఒక విషయం; కవి సంఘజీవి కాబట్టి, తాత్కాలికమైన సమస్యలనూ, ఆదర్శములనూ విడిచివేసి కేవలం గంధర్వ 'నగరం' నిర్మించుకోలేడు. అతని కవిత ఎంత ఆకాశహర్మ్యంలో విహరించినా ఆ హర్మ్యం సాంఘికములైన పునాదుల మీదనే స్థైర్యం పొందవలసి ఉంటుంది. ప్రసిద్ధులైన ఏ కవుల కవిత పరిశీలించినా మనకు అంతటా ఈ సత్యం గోచరిస్తుంది; అలాగని కవి కేవలం సంఘసంస్కర్త గాని, నైతికుడుగాని, తాత్త్వికుడుగాని కాలేడు. ఈ ముగ్గురిలోనూ ఎవరో ఒకరితో కవి ఐక్యం పొందినప్పుడు అతనికళ మనకు కేవలం అనవసరమే అయిపోతుంది. లేకపోతే ఒకొక్కప్పుడు కవి కేవలం వీరిలో ఎవరో ఒకరికి సహాయభూతుడై ఊరుకుంటాడు. అందుచేత కవి 'కవి'గానే సమానకాలికములైన సమస్యలను పరిష్కరించుకొంటాడు. కాళిదాస కవిత పరిశీలించినప్పుడు అతని కవితలో అంతటా, సామాన్యంగా, మనకు ఒక సమస్య గోచరిస్తుంది. ఈ విషయానందానుభూతికీ, బ్రహ్మ (Spiritual) నందానుభూతికీ కలిగిన సంఘర్షణము బహుశః గుప్తసామ్రాజ్యంలో భారతీయ సంఘం మహాభోగి పరాయణమై ఉన్నప్పుడు, కవికి ఇది ఒక ప్రధానసమస్య అయింది. కొన్ని కాళిదాస కృతులలో దీని సమన్వయ ప్రయత్నమూ, సమన్వయముకూడా జరిగింది. రఘువంశంలో అగ్నివర్ణ చిత్రణంలో ఇదే సమస్య. అభిజ్ఞాన శాకుంతలంలో కూడా ఇదే సమస్య ప్రేమపాపంలో ప్రత్యక్షమయింది. అభిజ్ఞాన శాకుంతలంలో, పృథివికీ, స్వర్గానికీ నడుమ ఉన్న మారీచాశ్రమంలో, కొంతవరకు ఈ రెండిటికీ సమన్వయం జరిగిందని మనం అనవచ్చును. మహాకవి కుమారసంభవంలోనే వైరుధ్య రహితమైన ఈ ఆదర్శం సంపూర్ణంగా మూర్తీభవించింది. రఘువంశంలో మాత్రం ఆదర్శ పురుషులయిన దిలీపాదుల సాన్నిధ్యంలో అగ్నివర్ణుని ప్రదర్శించడం వల్ల, మహాకవి, తన మహోజ్జ్వలమైన ఆదర్శం వ్యంగ్యంగా మాత్రమే ప్రదర్శించుకొన్నాడు. అంటే కవి తాను, కవీ, సాంఘికవ్యక్తీ కూడా కావడంచేత, ఆ రెండు

ధర్మాలనూ పరస్పర సమన్వయంతో ఏకీభవించి వ్యంగ్యంగా పైసమస్యకు సమన్వయం ప్రదర్శించిన విషయం మనం గమనించవలసి ఉన్నది. ఇక్కడ కవి, తాను, సమాజజీవి కాబట్టి తన ధర్మం నిర్వహించుకోవాలని ఒక విహిత నియమంతో, అగ్నివర్ణుని చిత్రించినట్లు మాత్రం మనం అనుకోకూడదు. తాను కవి కాబట్టి సంపూర్ణంగా తన కవిత్వ ధర్మనిర్వహణం వల్లనే, అతని కవితలో సహజంగానే, ఇతరాశయాలన్నీ ధ్వనించినవని మనం అనవలసి ఉన్నది.

కాళిదాస కవితలో అన్ని సులక్షణాల కంటె ఈ లక్షణం ముఖ్యంగా గమనించవలసి ఉంది. ఈ లక్షణం అతని కవిత్వానికి ఒక నవరత్న కిరీటంవంటిది. అతని కవితలో సమాన కాలీనులకు ఒక కాంతా సమ్మితమైన ఉపదేశం స్ఫురించినదని అనుకొన్నాము. విరుద్ధాదర్శములు కలిగిన రఘువంశీయులనూ, అగ్నివర్ణునీ, పరస్పర వైరుధ్యంలో సమానంగా ఆదర్శించడంవల్ల, అతని సుశిక్షిత కళాశీలిత్వం కూడా మనకు గోచరించిందని అనుకున్నాము. కవి సమాజవ్యక్తి కావడంవల్లనే అగ్నివర్ణ చిత్రణం అతని కవితకు ఒక సహజపరిణామం అని కూడా అనుకున్నాము కాని ఇంతవరకూ మనం మహాకవిని కేవలం 'కవి'గా పరిశీలించనే లేదు. అతని ధార్మికునిగా, కళాశీలినిగా, సాంఘిక వ్యక్తిగానే అవగాహన చేసుకొన్నాము. కాని 'కవి'గానే అతనిలో 'మహత్త్వం' ఉన్నదని మనం ముఖ్యంగా జ్ఞాపకముంచుకోవలసి ఉన్నది. అతని కవితా ప్రభావం వల్లనే ధార్మికత్వమూ, కళాశీలిత్వమూ, సాంఘికత్వమూ స్ఫురిస్తున్నవని కూడా మనం నిశ్చయించవలసి ఉన్నది. ఈ కవితా ప్రభావమే అతని కవితకు ఒక నవరత్న కిరీటంవంటిదని కూడా అనుకున్నాము. మనం మొదట అతని అగ్నివర్ణ చిత్రణం పరిశీలించినపుడు నిజంగా కవి కేవలం భోగలాలసుడు కాబట్టి అగ్నివర్ణుని ఆవిధంగా వర్ణించి ఉండవచ్చునని మనం అనుకుంటాము. ఈ అంతిమ సర్గలో అగ్నివర్ణుని నిందగాని, అతని భోగదూషణంగాని ఏ భాగంలోనూ స్ఫురించదు పైగా '*' స్వాదువులైన విషయముల

---

* స్వాదుభిస్తు విషయైర్హృతస్తతో దుఃఖమింద్రియగణో నివార్యతే ౧౯ సర్గలో ౯ శ్లో॥

చేత ఆహరింప బడిన ఇంద్రియగణము అతి కష్టంచేత గాని వాటినుండి మరలదు. అని కారుణిక దృష్టితో కవి అతనిని సమర్థిస్తున్నాడు. ఈ ఒక వాక్యంతప్ప ఆసర్గలో ఎక్కడా అగ్నివర్ణుని గురించిన కవి అభిప్రాయం మనకు కనబడదు. పైగా అగ్నివర్ణుని ప్రదర్శించినపుడు సంపూర్ణంగా కవి అతని ఆత్మలో లీనమై మనకు గోచరిస్తున్నాడు. మహాకవి అగ్నివర్ణుని కేవల నైతిక దృష్టితో విమర్శించక, నీతికీ, అవినీతికీ, అతీతమైన ప్రపంచలీలలో, ఆదర్శపురుషులయిన దిలీపాదులూ, అగ్నివర్ణుడూ సమానులే అనికూడా మనకు సునిశితంగా ధ్వనిస్తున్నాడు. అంతే అతని 'మహాకవితా' ప్రపంచంలో ఆదర్శప్రకృతులకూ అగ్నివర్ణునికీ సమానమైన స్థానమున్నదనీ ఆ ప్రపంచం తదతీతమనీ కూడా మనకు ప్రస్ఫుటమౌతుంది. దీనినిబట్టి కవికి సర్వప్రపంచంమీదా ధర్మాధర్మాలకు అతీతమైన ఒక కారుణికత్వం ఉన్నదని మనం నిశ్చయించవలసి ఉన్నది. ఈ కారుణికత్వంవల్లనే అగ్నివర్ణుడు, అగ్నివర్ణుడుగానే కాళిదాస కవితా సౌధంలో తదితరులతో కలిసి ఒక సమానస్థానం ఆక్రమించు కొంటున్నాడు. అలా ఆక్రమించి నప్పుడు, అగ్నివర్ణుడు తదితరులైన ఆదర్శవ్యక్తుల సౌందర్యం భగ్నంచేయక, వారి సౌందర్యాలలో ఒక సమ్మేళనం ఆపాదిస్తున్నాడని మనం జ్ఞాపకం ఉంచుకోవలసి ఉంది. ఈ విధంగా నైతికానైతికములయిన మూల్యములను నిర్ణయించక తదతీతమైన ప్రపంచమును అవగాహన చేసుకొని ప్రదర్శించడంలోనే మహాకవి "మహత్త్వం" చాలావరకు ఉన్నదని మనం గుర్తించవలసి ఉన్నది. అతని కవితారహస్యంకూడా ఈ విధమైన పరమ కారుణికత్వంలోనే గోచరిస్తుంది. ఇదే ప్రధానమయిన అతని కవిత్వ ధర్మము. ఈ దృష్టితో అగ్నివర్ణ చిత్రణా పరిశీలించినపుడు, మనకు కాళిదాస కవితాస్వరూపం సంపూర్ణంగా వ్యక్తమవుతుంది. అగ్నివర్ణ చిత్రణంలో రహస్యమూ బోధపడుతుంది ఈ కారణంవల్లనే, రఘువంశ రచనం, కవిమరణాది కారణాలవల్ల నిలిచిపో లేదనీ, అగ్నివర్ణ చిత్రణంలో కాళిదాస కవితారహస్యం నిబిడీకృతమై ఉన్నదనీ మనం నిశ్చయించగలుగుతున్నాము.

తాత విరహంలోంచి

"మాచిరాజు"

౧

తాత పలుకంటె నాల్గువేదాల నిగ్గు
తాత కలయంటె విశ్వసందర్శనమ్ము
తాత మెఱుగంటె మహతీనిశాంత తంత్రి
తాత నిలుమంటె అచ్చ మేతాము కొయ్య.

౨

ఆమెయూ నేను తన్నుకొన్నాము మున్ను
దిగ్దిగంతాల పోట్లు ప్రతిధ్వనించ
ఎట్టకేలకు ఆమె గెల్చిందిగాని
నేను ఒక్క తన్నైన తిన్నానుగాను.

౩

అసలు నాబుఱ్ఱ అద్వితీయమ్మె యెపుడు;
కఠిన కావ్యాలనైన క్రీగంటజూచి
ఒప్పగింతును చిన్ని తప్పొదవకుండ
కాని, నాన్న పేరది జ్ఞాపకమ్ము లేదు.

౪

గణిత శాస్త్రాన శక్తి నా కగణితమ్ము
నాల్గు వందల పరుష భిన్నాలనైన
చేతిపని లేక నోట వెచ్చించగలను
కాని, యెందుకో ఒకటో యెక్కమ్ము రాదు.

వికటకవిత్వం (PARODY)

మాచిరాజు దేవీప్రసాద్

అంతరంగికంగా నాటుకుపోయిన విషయాన్ని సూటిగా చెరిచివేయగలిగేది వెక్కిరింత. చేతుల్లో ఉండే మామూలు సాధనాలన్నీ తేలిపోతే యెముకల దాకా వెళ్లి నాటగలిగేది ఒక్క వెక్కిరింతే.

తను చేసిన ప్రతి వికృతపు పనీ తనకు పవిత్రంగానే కనబడుతుంది. అదే మరొకరు తన ముఖంమీద పెడితే వెగటుగా అగుపిస్తుంది. తన పనినే కొంచెం వికృతంగా తిప్పి కొట్టడం వెక్కిరింత పరమార్థం.

సాహిత్యరీత్యా చేసిన వెక్కిరింత పేరోడి.

కవి తాను అస్తమానం వాడే అనురాగ పదాల్లో ప్రపంచాన్ని నానబెడతాడు. పేరోడిస్టు వాటినే నప్పని ప్రదేశాల్లో ప్రయోగించి నీ మాటలు ఇంతే "బోరింగుగా యున్నదోయ్" అని చూపిస్తాడు.

ప్రత్యేకత గల ప్రతి కవికీ తన ఛందస్సు ఉంటుంది. తన సొంత సంస్కారంలోంచి పుట్టుకొచ్చిన పదసంపుటి ఉంటుంది. ప్రత్యేకించి తన భావాల్ని పద్యాల్లో పొదిగే తనకిష్టమైన తీరు ఉంటుంది. ఇవన్నీ ప్రత్యేకించి బలిష్ఠంగా పెనవేసుకుపోయి తను ప్రతివస్తువును అవలోకించే సంవిధానము ఉంటుంది. ఈ సరికొత్త విసుర్లకి అలవాటుపడ్డ ప్రపంచానికి కొద్ది రోజుల్లో విరక్తి పుడుతుంది. కాని వాట్ని విడదీసి పెట్టే సూచనలు కవిలో కనబడవు. అప్పుడు పేరోడిస్టు పుట్టుకొస్తాడు. వాటి వికటత్వాన్ని పెళ్ళగించి మరీ చూపిస్తాడు.

కవి చిత్రంగా వాడే ఏ భాషా ప్రయోగం కాని అలంకారాల ధోరణి కాని తీసుకొని వాటిని ప్రతిబింబించేట్టు చెప్పబడ్డది అనుకరణ అవుతుంది. కాని పేరోడీ అనుకరణ

మట్టుకు గాదు. ఆ సామాగ్రి అతనిమీద ప్రయోగించటానికే అప్పు తేబడ్డది. ఇలా అప్పు తీసుకోవడం, ఒక ఆసామిని బజాయించటానికి అతని దగ్గరే ఒక బడిత కర్రను అరువు తీసుకోవడం లాంటిది.

పెరోడీకి హాస్యం ముఖ్యాంశాల్లో ఒకటి. ఆ హాస్యం సుతిమెత్తనగా మందహాస వికాసాన్ని లేపాలిగాని అట్టహాస వికారాన్ని గాదు. మందహాసం లో నేగా సౌందర్యం, ఆనందం, ప్రణయం ఉన్నాయి. వికటాట్టహాసం భీభత్సప్రధానం, భయద పిశాచ స్వభావం.

ఒక్కొక్కప్పుడు శూలంలాగా పొడుచుకొనే భావాల్ని స్వానుభవం నుంచి చిత్రించుకొస్తాడు కవి. ప్రేయసికోసం తబ్బిబ్బైపోయి ప్రణయ ప్రవాహానికి కట్టవేసి నట్టుగా కవిత్వం చెప్పుకొంటాడు. ఒక్కొక్కప్పుడు ఆపలేని భావావేశంలో, దేశ భక్తితో ఉర్రూట లూగిపోయి గీతాలు పాడుకుని శాంతిస్తాడు. అలాంటివాటికి వ్రాసిన పెరోడీ చిటికిన గాజుముక్కలా తగలగూడదు.

పెరోడిస్టు చమత్కారి అయివుండాలి[1]. తన చేజేతల విధానంలో నవ్వు తెప్పించాలి గాని మరొకర్ని నొప్పించగా వచ్చిన వికారంతో కాదు. హృదయభారంతో రాయబడ్డ కవిత్వబేరం కొంచెం సరసంగా నడపాలి. అదీకాకుండా ఆ సరసంలో తా నెంతమట్టుకు చేదు తగలకుండా పోగలడో బాగా విమర్శించుకోగలిగి ఉండాలి. అన్నిటికన్నా ముఖ్యంగా కవియొక్క విలోకనాన్ని పెరోడి చేస్తున్నప్పుడు అతని పంథాను పూర్తిగా అవగాహన చేసుకోవాలి[2]. రీతిని పెరోడీ చేస్తున్నప్పుడు అసలు

1. "Parody is concerned with poetry and preferably great poetry. Parody must therefore be delicate ground off which the profane and vulgar should be carefully avoided.............. So parodist knows unerringly 'how far to go'."

SIR ARTHUR QUILLER COUCH

2. The Parodist sinks his own individuality as completely as possible. He lives in the writer whom he parodies, like a soldier crab in a shell carrying his

కవి ఏ యే శక్తుల నారాధించి కవిత్వం చిత్రించాడో, ఆ యా శక్తులలోకి తన వ్యక్తిత్వం పోగొట్టుకొని దూరేటట్లు ఉండాలి.

సులువైన పెరోడీ అని చెప్పుకో తగ్గది ఒక చిన్న పద వినిమయంచేత అయిన వికటరచన[3]. చాలామట్టుకు పరిహాసాస్పదంగా ఉంటుంది. కవి రాతని చాలా మట్టుకు అలాగే ఉంచి ఇక్కడొకముక్క తగిలించి అక్కడొకముక్క ఊడపీకేసి గేలిచేస్తారు.

అన్నా చెన్నల రాయా ?
కన్నొక్కటి లేదు గాని కంతుడ గావా !

అన్నది చాలా ఆదరంగా ఒక "ఏకాక్షి" నుద్దేశించి చెప్పిన పద్యభాగం. ఇదే పెరోడిస్టు చేతుల్లో నలిగి ఇలా తయారయింది.

అన్నా చెన్నల రాయా
కన్నొక్కటి కలదు కాని కౌరవ పతివే

original about in fantastic excursions over which the original has no control. It must enter into the spirit of its model and not merely echo its voice."

"EDMUND GOSSE"

3. The simplest form of parody is verbal, which gains its ludicrous effect by taking a well known poem and altering a word here and a line there so as to make a different sense without mutilating the original form.

The nearer the original diction is preserved, the fewer the alterations needed to produce totally opposite meaning or ridiculous contrast, the more complete the antithesis, the more striking is the Parody.

Example :

Here shall the spring her earliest SWEETS bestow
Here shall the first ROSES blow ORIGINAL
Here shall the spring her earliest COUGHS bestow
Here shall the first NOSES blow.

PARODY

ఇదీ అతనిమీద పద్యమే. చూడండి అపద్యమే ఒకటి రెండు పద వినిమయాలచేత ఎంత విపరీతార్థ మిస్తున్నదో. ఈ రెండోది పైదానికి Verbal Parody.

"సోడాబుడ్డి" నండూరివారి 'గుండె గొంతుకలోన' అనే విలక్షణమైన పాటకి పెరోడీ.

గుండె గొంతుకలోన కొట్లాడుతాదీ
కూకుండనీదురా కూసింత సేపు

అని ఆయనన్నాడు.

గుండు గొంతుకలోన కొట్లాడుతాదీ
గుట కేయనీదురా కూసిన్ని కూడ

అంటాడు పెరోడిస్టు.

"సోడాబుడ్డి" అనే పాటలో పెరోడిస్టు అక్కడున్న 'గుండె' అనే మాటను మార్చి క్రింద మరోపదాన్ని మార్చంగానే అర్థమంతా మారిపోయింది. తక్కిన పదసముదాయమంతా మామూలుగానే ఉంది. వైవారం ఎప్పటిలాగే ఉంది. చిత్రం మట్టుకు మారుతూ ఉంటుంది ఈ Verbal Parodies లో—

ఈ వర్బల్ పెరోడీలో ఒక పదం మార్చే కాకుండా ఒక పద్యపాదం మార్చి కూడా క్రొత్తఅర్థం తీసుకురావచ్చు. నేను వ్రాసిన "భోజనశాల" అంతా ఇలాంటి పెరోడియే. అది వేదులవార్కి రాధకు పెరోడీ ప్రయత్నం.

ఆయన

మంజుల సుమామృతములోని మధురిమమ్ము
మధుర చంద్రాతపములోని మార్దవమ్ము
మృదు సమీరమ్ములోని పరిమళమ్ము
కలవు గోపాల నీ వేణుగానమందు

అన్నాడు.

నా "భోజనశాల"లో

మంజుల సుమామృతములోని మధురిమమ్ము
మధుర చంద్రాతపములోని మార్దవమ్ము
మృదు సమీరమ్ము లోని పరిమళమ్ము
కలవు బుచ్చెమ్మ నీ పచ్చి పులుసు నందు*

అన్నాను.

ఇది కొంచెం కత్తులతో సాములాంటిది. తనకవి నిర్మించిన పట్టాలమీద పోతూనే ఉండాలి, అందని తన త్రోవలో లేని అర్థాన్ని అందుకొంటూనే ఉండాలి.

శైలికి పేరోడీ రాయొచ్చు. కవి పద్యం నడిపే పంథాను హారాయించుకొంటేనే వీలు. ఆతను యతిప్రాసల దగ్గర చూపించే ఒత్తిడికి మధ్యమధ్య మలుపుల దగ్గర విసిరే విసురుడికి, చవకబేరంగా పారవేసే పదాలకీ సరితూగే వికటమైన సామాగ్రి పేరోడిస్టు చేర్చుకోవాలి.

దీనికి తార్కాణంగా "అరయన్ శంతను పుత్రుపై విదురుపై" అన్నదానికి ఈ క్రింది పద్యం చెప్పుకోవచ్చు.

వడపై, నావడపై, పకోడి పయి హల్వా తుంటిపై బూంది యోం
పొడిపై నుప్పిడిపై రవిడ్డిలి పయిన్ బోండా పయిన్ సేమియా
సుడిపై దారు భవత్కృపారసము నిచ్చో గొంత రానిమ్ము నే
నుడుకుం గాఫిని యొక్క గుక్క కొనవే యో కుంభదంభోదరా ![4]

ఈ క్రిందిది శ్రీ. శ్రీ శైలి పేరోడీ.

ధనిక స్వామికి పని లేనప్పుడు
కలగా పులగపు ఫలహారాల్లో

* "వాణి" నుండి

4. ఇది "అబ్బూరిది" అంటాడు రుక్మిణీనాథ్

చేగోడీ ఖానాకు
చీనాతో బాగానే
లయిస్తుంది—
లగిస్తుంది.

విఖాత మందూ ప్రభాత మందూ
సభాంతమందూ గభీలు మంటూ

రుచిస్తుంది
పచిస్తుంది.

ధబీలు మంటూ
సహిస్తుంది
రహిస్తుంది

—చేగోడీ నుండి—

ఈ రకంలో జగ్గకవిగారి ఆశ్వాసాంత పద్యాలన్నీ వస్తవి. అన్నిటికన్నా ముఖ్యంగా ఆయనగారు సింగడిచేత అనిపించిన ఈ పద్యం ప్రబంధశైలికి అంతటికీ పోటు.

హా యను; జంచరీక నిచయాంచిత కుంచిత రోమ ధామ దే
హా యను; దాన మానిత మహోద్విపపుచ్ఛ సముచ్ఛ్రయైక బా
హా యను; గాక ఘూక చరణాయుధ కుక్కుర భూషితాత్మ గే
హా యను; జంద్రి! తాళ సహహా! యను భీత శిరోరుహా యనున్

కొంతమంది కవులకు ప్రత్యేక విసురుల్లు ఉంటయి. ఒకకవి ఏ విలపించటం వచ్చినా అయ్యోయో! అంటూ ఆరంభిస్తాడు. మరొకకవి "యెవ్వడా విరిస్తాళికు" డంటూ యెత్తుకొంటాడు. ఇలాంటి వాటికి పెరోడీ రాయడం సులభమే. కాని అతని శైలి ఒత్తిడి సరిగ్గా చూపించకపోతే మిగతాచోట్ల పెరోడీ అనిపించుకోదు.

కొన్ని పెరోడీలు మాతృకయొక్క లదాపులజ్జల్లో ఉండవు. మేధావి అయిన అనుకరణకర్త మూలాన్ని ఆధారం చేసుకొంటూ, విశృంఖలంగా తర్జుమాచేస్తూ తన శక్తిని ఎలా చూపిస్తాడో అలాగే చూపిస్తాడు పెరోడీస్టు కూడా.

రెండూ ఎక్కడెక్కడ పక్కతన్నులు తన్నుకొంటూ ఉంటయి; దొంగచూపులు చూసుకొంటూను. ఒకదాని కొకటి సంబంధం ఉన్నట్టుగా తెలియదు. ఈ రకంలో "పెరోడీశాస్త్రి" దమ్ము పద్యాలు చెప్పుకోవచ్చు. ఇవి భారతిలోపడ్డ కృష్ణశాస్త్రి గారి 'శ్రావణా'నికి పెరోడీ. ఆయన 'ఒసలు శ్రావణ' మన్నాడు. ఇతను 'అసలు నరకం' అన్నాడు. అంతే. తరువాత ఇద్దరూ మధ్యలో "అప్పుడు సుబ్బాంకో" అన్నా ఇతనూ మధ్యలో "వెనుక నిజరంగె" అన్నాడు దీన్ని దాటిన తరువాత ఒకదాన్ని ఒకటి అంటుకోకుండా పోయినై. ఆఖరుకి అతను

"నన్ను చెరసాలలో పెట్టినారు రెండి"

అన్నాడు

ఇతను

"నన్ను ఆస్పత్రిలో జేర్చినారు రెండి"

అన్నాడు.

పెరోడి అయిపోయింది.

దీన్ని వ్రాయటంమాట ఎలాఉన్నా అర్థంచేసుకోవటం నిజంగా కష్టంలో చిక్కపడ్డ విషయమే. చదివేవారికి మూలంతో బాగా చుట్టరికం ఉంటేకాని ఫలానా ఫలానా అని తెలియదు.

సహసానఖం పచ స్తప దత్తపరిరంభ
మాపూల పరిచుంబితాధరోష్ఠ
మతిశయ ప్రేమకల్పిత దంతసంబాధ
సుగణిత గ్లాని శయ్యానిపాత

మతివేల మణితయాచ్ఞార్థ గల్లచపేట
మతిదీన వాక్సూచి తాత్మవిరహ
మంకుర త్పులకజాలావిష్ట సర్వాంగ
మానంగ కృతహార రాసనాట్య
మాక్రమక్షీణ సుతివర్గ మానిములి
తాక్ష మాస్విన్నగండ మాయుక్తచేష్ట
మాస్తిమితభూషణారవ ఘూషఘాటి
ప్రథమ సురతరంగ గంపిష్ఠాంత గరంచె

అని మన మామూలు పితామహు డంటే

పారధాభక పోక్తి ధారార్ద్రిగండంబు
చండ ముండాఖండ తాండవంబు
బాహుమూలైక దుర్భర ఘర్మసలిలం.
చక్రక్రమపేట చాలనంబు
భూరి సురోద్గారి దారుణోచ్ఛ్వాసంబు
ఘనతను దుర్గంధ గంధిలంబు
వికృతాంఘ్రి తాడన వినతపలగ్నంబు
పీడాశ్రు పుంఖితాక్షిడితంబు
గార్దభస్వర నిస్సర ద్గ్రీమ్యవచన
మమిత లాక్షారసాభక్షితాంగకమ్ము
చంద్రరేఖాభిధాన వేశ్యానలాస్య
ప్రథమ లాప్యంబు సింగభూపతి గరంచె.

అన్నాడు వికటాంధ్ర కవితాపితామహుడు. ఈ క్రిందిది పైదానికి మక్కీ-కిమక్కీ వ్రాసిన పేరడీకాదు. మొదటి చూపులో రెండిటికి సామ్యము కానుపించదు. పద్య

మంతా వ్రాసి ఆఖర్న తిప్పికొట్టాడు జగ్గకవి—పెద్దన్న వచ్చి తగిలేట్టు. ఆఖరి పాదందాకా ఒకదాన్ని ఒకటి తాకలేదు. ఆఖరి పాదంలో గిఱ్ఱున తిరిగింది—పెద్దన్నగారి నిర్దిష్టమైన పద్యంమీదికి. వెంటనే పెరోడీలక్షు ఊరుకుంది.

విలోకనాన్ని పెరోడీ చేస్తున్నప్పుడు మటుకు కవి రాతలతో ఆటే చుట్టరికం అనవసరం. దీనిలో ఒకటి ముఖ్యంగా గమనించితే చాలు. కవియొక్క భావం. అతని భావానికి వికటమైన భావం మార్చుకోవాలి అంతే: అతను అన్న భావానినే మరొక సంఘటనకు ఉపయోగించి అర్థం వికటం చేయవచ్చు. కాని విలోకనం పెరోడీకీ శైలి పెరోడీకీ తెగేసి భేదం చెప్పటం కష్టంలో చిక్కబడ్డ విషయం.

ఎవ్వడా విరసాత్మకుం డెవడు! సాంధ్య
రాగమంజుల రేఖావిరాజమాన
మంగళాకాశ సీమంత రంగమందు
కారు చీకట్ల రాసులు గ్రక్కినాడు

ఆనేది మాతృక.

ఎప్పు డాచచ్చు నాగమ్మ యెపుడు నా ప్రి
యా వియోగాన నే లిఖియించు కొన్న
రమ్య ప్రణయినీ రూప చిత్రమ్ము పైని
నింపు 'సీల్కాయ' బుద్ధి తన్నేసినాడు

అనేది ఆ పైదానికి పెరోడీ.

వైచిత్రి ఆధారం చేసుకొని వ్రాయబడ్డ పెరోడీలు ఆకర్షకంగా ఉంటయి. వీటిని వ్రాయటానికి పైదానిలాగా శైలిలో ఎక్కువ పరిచయం అనవసరం. పాఠకులకు కూడా అసలు పద్యముసంగతి తెలియనక్కరలేదు. తనంతట తానే ఆనందం ఇవ్వగలశక్తి గలదిగా ఉంటుంది. ఆంధ్ర వాఙ్మయంలో వికటకవులు చాలా తక్కువ.

"వారిలో నాకు తెలిసినంత మటుకూ దీన్ని యెవరూ ప్రయత్నించ లేదేమో" అన వలసి వస్తుంది.

కొన్ని పేరోడీలలో వందన (Reverence) ప్రత్యేక గుణంగా ఉంటుంది. కొన్నింటిలో విమర్శ, సెటైరు ప్రత్యేక గుణాలుగా ఉంటయి.

ఈ 'వందన' మూలకంగానే పేరోడి రెండు భాగాలుగా చీలుతున్నది. పేరోడీ ఉంటే వేళాకోళమేకాని రెండువిధాల ఊహాలతో వ్రాయవచ్చు. వికటకవి ఒక కవిమీద, అతని విస్కృతపు శైలిమీద అసూయఉంటే పేరోడీ వ్రాసి గోలచేస్తాడు. అదే అతని శైలిమీద అత్యాదరణ ఉంటే, అతన్ని అనుకరించకుండా ఉండలేక పేరోడీ రాసి సంతోషిస్తాడు. రెండోసారి వందనతో వ్రాస్తాడన్నమాట.

ఒక కవికి పేరోడీ రాస్తూ ఆ కవినే అందులో విమర్శించవచ్చు. ఇది పేరోడీ సెటైరు కాకుండా మధ్యస్థంగా ఉంటుంది. దీనిలోకే వస్తుంది విశ్వనాథమీద రాసిన రుక్మిణీనాథ్ పేరోడి.

అతడు కవివేషదారి కాతరులు మచ్చ
కరుగుకొనబిట్టు మండించు కైత నెపుడు
మారుమూల పదమ్ముల నేరితెచ్చి
కోమలేతర కవనమ్ము కూర్చుకొంచు

అతని సమ్ముఖమందు రసాధిదేవ
తాత్మ కుంచుక కుంచుక దారుచుండు
ముక్కుతిప్పుక మూతిని ముడుచుకొంచు
పరమ ఛాందసు ముందర ప్రౌఢవోలె

కించి త్తిక్త కషాయషాద బరసక్షేపాతి రేకాతి వా
క్సంచార ప్రచయాపకాళముల లోకవ్యధ్ధ! గండాక్షముల్

చంచల్లీల నుదాత్త వాగ్గరిమతో సాధించి వేధించుమా
సంహారించి ప్రవహ్లికాకృతుల నో పాషాణపాక ప్రభూ!

పోడి ప్రయత్నం వ్యాయామంలాంటిది. వికటత్వం వ్రాయగలవాళ్లు అభ్యసింప తగినదే. అదీకాక మేధాశక్తిని క్రొత్తక్రొత్త దారులందు పోనిస్తాము గనుక సానదీరుతుంది. కవిపద్యం సానరాయిలా ఉపయోగపడుతుందన్నమాట.

ఎప్పుడూ ఏదో ఒక దోవనపోయే కవికంటే అస్వతంత్రుడైనా అందరి ఊహాప్రహారాలకి తట్టుకు నిలబడే 'వికటకవి' సమర్థుడు కదూ!

వ్యాస సంతతివాణ్ణి

వచ్చాను వచ్చాను
వ్యాస సంతతివాణ్ణి!

వెళ్లిపోయిన కోటి
కోట్ల జీవుల విడిచి,
కుళ్లిపోయే నేటి
కోట్ల జీవులకొరకు,
పొర్లివచ్చే కోటి
కోట్ల జీవులకొరకు
వచ్చాను వచ్చాను
వ్యాస సంతతివాణ్ణి!

కలగుండుపడియు ని
శ్చలమైన గుండెవలె,
నిద్రించు నీటిలో
విడుచు పొడిరాయివలె
అడవులూ పడవలూ
అహాపు పెల్లలు దాటి
వచ్చాను వచ్చాను
వ్యాస సంతతివాణ్ణి!

పగిలించి రణభేరి
పద్మవ్యూహము త్రెంచి,
శివమెత్తి విస్ఫులిం
గములు చిమ్ముతు లేచి
ఈ జగతిలో నూత్న
జగతి పెకలిస్తాను.

వచ్చాను వచ్చాను
వ్యాస సంతతివాణ్ణి!

తలలొగ్గి దాసిన
సలాముచెయ్యరు మీరు.
ధన మదాంధుల బలిసి
తారసిల్లరు మీరు.
వచ్చాను వచ్చాను
వ్యాస సంతతివాణ్ణి!

రాళ్లురప్పలు ప్రాణ
మొలికి పులకింపగా,
పరాకోటినందు
ప్రాణుల వికాసృష్టి!
ఎగసి ప్రవహిస్తుంది
ఇక వెలుగు వాపుటా!
వచ్చాను వచ్చాను
వ్యాస సంతతివాణ్ణి!

ప్రేమమూర్తుల నిత్య నృత్యమై!
సత్యమై!
భువనముల్ సకలముల్
పొంగి పోవంగా,
నిర్భరానంద మా
విర్భవించంగా,
వచ్చాను వచ్చాను
వ్యాస సంతతివాణ్ణి!

ఎడారి ఓడలు

ఎడారిఓడలు ఎదురైనవిలే!
ఎడారిఓడలు ఏతెంచెనులే!

శీర్ణగృహమూ, జీర్ణగ్రామము
చెదిరిన మానవ శిథిలమ్ములపై,
జాలిత హృదిలో ప్రాణానిలమై!
ఎడారిఓడలు ఎదురైనవిలే!

మార్తాండుని ప్రచండ తాపమున
ఎగసి ఎగసిపడు ఇసుకలపైన,
పులి పరుగెత్తిన ప్రాంతవాటలో!
ఎడారిఓడలు ఎదురైనవిలే!

కఠిన నరకముల కదనపు వేళల
విశ్వవిష్ఠూర్చిన విషపు టూర్పులో
శయనిస్తూ, పయనిస్తూ వస్తూ!
ఎడారిఓడలు ఎదురైనవిలే!

గాఢనిద్ర మేల్కానిన కాలమే
కుబుసమ్మూడ్చిన కుండలియై
పడగలువిప్పి పట్టిన నీడలో!
ఎడారిఓడలు ఎదురైనవిలే!

తీరని ప్రతీక్ష, తెరిచిన రెప్పలు
దివి భువికంటగ, తెలియని మైకపు
మసకలు క్రమ్మిన మరుగులు గడిచీ
ఎడారిఓడలు ఎదురైనవిలే!

పసికేకలలో వలపరింపలో
పల్లవించిన నాప్రాణి చల్లగా
గర్భం తాల్చిన కలయై! ఇలయై!
ఎడారిఓడలు ఎదురైనవిలే!

తేనెతీపి పానీయ్యము లవిగో!
నాకుటీరమున నవసిన లతలే
పసరుపోసుకొని పూతపట్టురే!
ఎడారిఓడలు ఎదురైనవిలే!

వత్సరాంతము

ఓ వత్సరాంత వ్యథాకృతీ!
ఉరిత్రాడువేసి బిగించి, మా
కొన ప్రాణమే గుంజుకోవజూచితివా!

దట్టమౌ చీకట్లజడలను
విరియబోసిన తపసి యో యన
రాత్రియే విశ్రాంతిగన, ఆ
గగన మండలమందు తారల
కాంతికోరల కొరకొరలతో
తేరిచూతు విదేమిఘోరము!
ఓ వత్సరాంత వ్యథాకృతీ!

పులుగుగళ విదళితారావము
చీకటుల క్రొందెరల సన్నని
ముసుగునే సవరించగా
ప్రత్యుషఃకన్య దిశాంగణమ్మున

పూలయందెల కాల్చు కదుపగ
గగన మండలమందు నెర్రని
సంజకాంతుల పచ్చినెత్తురు
ఘుక్కి_లింతువు!
ఓ వత్సరాంత వ్యధాకృతీ!

హాయిగా జీవించు మ మ్మస
హాయులుగ నొనరించు నీ
పాపిష్టికోరిక, కరకు కత్తుల
కూర్చి, నీలపు నింగి బోనును
దించి, జీవుల కడుపు కోతకు
పెట్టినావే! కన్నకడుపులు
కోసి మా భవిష్యత్తునే బలి
కోరినావే!
ఓ వత్సరాంత వ్యధాకృతీ!

పచ్చినెత్తురు చిమ్మి తః మా
భాగ్యరాసుల బొగ్గుచేసి,
కోటికోరలు సాచి మా నర
నరమునూ లాగేసి బ్రతుకుకు
భవిష్యత్తునె పారద్రోల్!
కలుషితానిల చలన మటు
బాధావహమ్ముగ సాగిపోదే
ఓ వత్సరాంత వ్యధాకృతీ!
ఉరిత్రాడు వేసి బిగించి, మా
కొసప్రాణమే గుంజుకో దలచితివా!

అనిశెట్టి సుబ్బారావు

విభ్రాంతామరుకము: మృగయ

పిలకా గణపతిశాస్త్రి

[ఇవి నేను రచించిన విభ్రాంతామరుకమునందలి ప్రథమాశ్వాసము లోని పద్యములు. ఇందు అమరుకుని వేట వర్ణింపబడినది.]

ఈవిధి నద్ధరాపతి సమీహితభోగము లందుచుండ, ను
ర్వీవిభుఁ గాంచి, గొంది రటవీచరు లెంతయు భక్తి "మానవేం
ద్రా! విపినమ్మునం బటు మదమ్మున గ్రొవ్వి మెకమ్ములెల్ల, దే
వా! పసర మ్మొకింతదె మృగయాచరణమ్మున" కంచు దెల్పినన్

ఆటవికాళి నా నృపు డనంతర మెంతయు నాదరించి, యా
ఖేటకయాత్ర జాటఁ బలికె న్నగరమ్మున; బోయులుం జటా
జూటములెల్ల జాఱిపడుచుం ఘుమిసంట నరేంద్రు మ్రొక్కి, య
వ్వీట శిఖాత్కార సుందర ఢింగసం జని యుల్లసమ్మునన్

జనపతి యంత గుఱ్ఱ పిలుస జవనాశ్వము నెక్కి భామినీ
జనము లల్లనల్లన విశాల గవాక్షములం గనుంగొనం
జనె మృగయారతిం గరకిశాచలనమ్ము నంత దాదఘు
ట్టన చల విస్ఫులింగ ఘన టంకృతి నశ్వము పర్వు లెత్తగన్

పచ్చని తోరణమ్ముల విభాసిలు పౌర గృహమ్ములం బతా
కోచ్చల రాజసౌధ మ్మమహాంచ్యృతి రమ్య కపోతపాళి జం
చచ్చల పక్ష సస్వనవిశేషమ్మున బౌరుల వేడ్కలం బురం
బచ్చెరువొప్పఁ జూపఱ కనం గృహాంగణ రంగవల్లులన్!

భేరులు మ్రోగె నప్పురి గభీరముగం జననాథ సౌధ శం
ఖారవ మిశ్రఘోష; మృగయా ప్రమదమ్మున బౌరు లెల్ల, సం
చారము లాపి, యొక్క పరుసం జయవెట్టగ బుణ్యకాంతలం
కూరిత కంకణ క్వణిత ఘోషల హారతు లెత్తి రెల్లెడన్

ఆతని నాఖేటక వే
షాతి మనోహరు మహోన్నతాశ్వ చరణ సం
జాత మృదు మృదంగ ధ్వని
పాతమ్ముల ననుసరించి పరువిడి రథిపుల్

రేనికి వెంట వెంట ముఖరీకృత చంచల పాద కింకిణీ
స్వానము మ్రోయ జంచువుల జట్టుపలం దగ జీల్చుచుం ధను
ర్బాణము లీల బుగ్గుల నభమ్మున గన్గొను సాహసమ్ములం
బూని నృపాల సేవకు లపూర్వముదమ్మున నేగి రంతటన్

కణకణలాడు వహ్ని కణకాంతుల గన్గవ లుల్లసిల్ల గాం
చన గళ శృంఖలారుచి హస న్నవభాను కరాంకురమ్ములం
గను మిరుమిట్లు గొల్పు నవకమ్ముల బర్విడు జాగిలమ్ములం
గొని చని రస్య లాశ్వగళ ఘుర్ఘుర ఘోష మెద ల్గదల్పగన్

వాగుర లూని కొందరు నృపాలునితో బరువెత్త గొంద రెం
దే గరువమ్మునం జిరుత నెక్కటికయ్యమున న్వధింతు మెం
తే గణనీయ మియ్యది యొకింతయు గైదువు లొల్ల మంచు, నే
హో గురు వాగ్వివాదముల నొంచుచురుం దమలో దమంతటన్

బాలలు దీర్చి వీథికల బౌరజనమ్ముల వాలబాలికా
వారము లోలకుంతలు నివారిత వీక్షల రేని జూడ మం
దారవమై గభీర పటహమ్ముల హుంకృతి శాంతినంద, గాం
తారము జొచ్చె భూవిభు డెదం బరిఘూర్ణిత మోద వార్నిధిన్

అమరుక దేవ భూపతి యనంతర్ధ మాటవికాళి, తూర్య సం
భ్రమ నినదమ్ములం భయచర న్మృగ పంక్తుల వెల్వరింప; ను
త్తమరయవత్తురంగము పదక్రమణమ్ముల మౌళికాంతు లం
దము లొలుకం జరించె బ్రమదమ్మున నమ్మృగయా విలోలతన్

గహన గుహాంతరస్థాన సుకమ్మగు నిద్దుర దూలి, తింత్రిణీ
దహన విశీర్ణ కీలల విధమ్మున గన్గవ వెల్గు బెబ్బులిం
బ్రహత ధను ర్గుణారవ లవమ్మున మేల్కొన జేసి చాతురీ
మహిమ సురేంద్ర చాప ముపమానముగం దరవారి దెచ్చె దాన్

కడు పడి బర్వువెత్తి విశిఖమ్ముల కంపక, తీవ్రభీతి నా
క్కొఁడ మెడ ద్రిప్పి కన్గొని యనేక విధమ్ముల బారి నెవ్వగం
దిగబడు జంతురాజి వసుధావిభు డొక్క శరమ్ము నేసి, వెం
బడి వధియించు నాటవికవర్గము ప న్గొనియాడి మెచ్చగన్

సలిలమునుండి వెల్వడి విశాల వనాంతర పల్వలమ్ములం
గలచుచు వీరఘూమి పడిగం బరువెత్తు వరాహయూధ ము
గ్గల మగు బాణ సంహతి నొకం డయి ప్రయ్యాలునేసినంత నె
చ్చెలు హాహాహో యనం గహనసీమ జరించు నృపాలు డాదటన్

సుందర బర్హమై వనవసుంధర నృత్య మొనర్చు కేకి జం
పం దన వింట దూపు నరపాలకు డెక్కిడు నంత, బర్హిణీ
కంధర దీనరావ మెసగం దరుశాఖిక దాని గాంచి జా
లిం ధరణీమహేంద్రు డవలీల శర మ్మడచెం గుణమ్మునన్

ఒక్కొక మారు శాసన జనోదిత మార్గమునందు రూపునం
దిక్కరి సన్నిభ మ్మగు మదించిన హస్తి చెలంగ, జంతులం
దక్క వధింప నొప్పదు వనస్థలి నేనుగు నంచు, న వ్విభుం
డక్కటికమ్ము నెమ్మి నొలయం గరిబట్టు విచిత్ర చాతురిన్

సాహసము ల్జ్వలింపగ దిశావలయమ్మున, వాయువేగ సం
చాలిత శీర్ణపర్ణ వివశ భ్రమణమ్ముల బర్వులెత్తు వా
చాల విహంగపాళి వరుసం బడ గూల్చు భువిం ధనుర్గుణా
స్ఫాలన చంచలాశుగరయమ్ముల దిక్కులు పిక్కటిల్లగన్

భో- రని మ్రోయు భేరుల నభోజలదమ్ములు బీటవార గాం
తార గుహాంతరమ్ముల ఘనస్వన కేసరి గర్జలంత, హుం
కార మయమ్ములై నలుమొగమ్ముల రేగ పనమ్ము సర్వ మ
వ్వీరనరేంద్రు గాంచి మొరవెట్టు విధమ్మున దోచె నెల్లెడన్

క్రమమున భానుకాంతి విశిఖమ్ముల రీతి భరింపరాని ఘ
ర్మమున వెలుంగ జొచ్చిన ధరార్ధమణుంతు మొగమ్ము గ్రమ్ము ము
త్తెముల సరమ్ములై వడి బధిశ్రమనాగి దొరంగ, నిష్వనాం
తమున దురంగధావన పదస్వనమంట జరించె నొంటిమై

తురగ పదధ్వని శ్రుతి సుదూరము సోక మృగేంద్ర మొందు కం
దర మధురం ధ్వనించె పసుధం ఒస మోము సమర్చి, దీర్ఘ కే
సర తతి గర్జనానిల వశమ్మున నూగి చలించి, కాననాం
తర మృగయూథముం ద్రుత పదమ్ముల నెల్లెడ బర్వువెత్తగన్

వేళ తమిన్ నృపుండు పృధివీపతివర్గము వీడి, నిత్య ఘా
ఖేట సహాయుడై, తన కొగిం బరిచర్య లొనర్చ, చిత్ర వే
షాటవికాళి, దవ్వుల దిమంతన మార్గము ఒప్ప, సత్వరా
ఘోటకమున్ హరీంద్రగళ ఘూర్ణిత మా గుహ జేర్చె ప్రేల్మిడిన్

అనుచరవర్గ మంత మనుజాధిపు గానక, వాజిపాద ని
ధ్వనముల వెంట సత్వర పదమ్ముల బర్వులు పెట్టు నంత, న
జ్జనవిభుడుం ధనుర్గుణ విసారిత హుంకృతియై, మృగేంద్ర గ
ర్జన నినదమ్ము మ్రోగిన చెపం గుహ నేసె నిశాత బాణముల్

అరుణ విలోచనమ్ముల గుహాగత సింహ మనంతరక్షణాం
తరమున దాటువైచి, బహుధా స్రవియించు కవోష్ణ శోణిత
మ్మురలి శరీర మెల్లెడ సుమోజ్జ్వల కింశుకమై జ్వలింప న
న్నరపతి శీర్షముం బదమునం బ్రహరించె విలోల జిహ్వమై!

దాని పదాహతిం దన యెదం బలితమ్మగు దిమ్ము గ్రమ్ము చం
దాన పిమోహముం గను విధమ్ము దలంచియు, నానృపుండు, బా
హానిశితాసి లంఘితమృగాధిప శీర్షము ద్రుంచివైచె నా
శోణగళాగ్రముల్ దొరగుచుం భువి గాల్వలు జాలువారగన్

మృగరా జుగ్రగళారవమ్ము గుహ గంభీరమ్ముగా మ్రోయ, ద
వ్వుగ నేలంబడె, గంఠ తుండములు సంపూర్ణమ్ముగా వీడి, య
జ్జగతీనాథుడు మూర్ఛనందిపడె నశ్వ స్కంధమందంత ని
మ్ముగ వార్యమ్మది యెంచి, మెల్ల జనె నా భూమీశు రక్షింపగన్

కుముదం లేక మా బావ

సోమయాజుల వెంకటరామమూర్తి

పాత్రలు

నరసాయమ్మ : సంపన్నురాలు, పూర్వసువాసిని, వయస్సు ౪౮, అభిమాన గ్రంథం : ఆంధ్ర భాగవతం.

కుముదం : నరసాయమ్మ కుమార్తె, విద్యావతి, చతుర, ఎం. ఏ. క్లాసు (రెండవది) చదువుతూంది, వయసు ౧౯.

రంగారావు : నరసాయమ్మ మేనల్లుడు, కవి, కుముదాన్ని ప్రేమిస్తాడు, కొసవెర్రి, వెకిలిచేష్టలు, ఎ. ఎస్. సి. పరీక్ష ఇచ్చాడు, వయసు ౨౨.

ప్రొఫెసర్ ఈశ్వర్ : ఎం. ఎ., పి. హెచ్. డి. తత్త్వవేత్త, రోగిష్టి, చిన్న వెఱుడు, రేపటి, ఆరోగ్యం సరిచేసుకొనేటందుకు నరసాయమ్మ గారింటికి చుట్టమై వచ్చి వుంటాడు; వయసు ౫౦.

నూకాలు : పనికత్తె.

నాయుడుగారి నల్లకుక్క

మొదటి రంగము

[నరసాయమ్మగారి ఇంటిలోని గది : సమయం మధ్యాహ్నం 2 గంటలు - కుముదము కుర్చీలో కూర్చొని ఫిజియాలజీ చదువుకుంటూంటుంది. ప్రవేశము - నరసాయమ్మ.]

నర—రెండైంది. ఇంకా పుస్తకం మూసి తెమిలి రావేమె కుముదం?

కుము—(పుస్తకం మూసి) ప్రొఫెసర్ ఈశ్వర్ నాలుగ్గంటల రైలులో వస్తానని నువ్వే చెప్పావు. మరెందుకమ్మా, తొందర?

నర—బాగుంది! ఇంతలో జడ వేసుకోవటం, స్నానం చెయ్యటం, మంచి చీర కట్టుకోవటం, ఇత్యాదులు ఉంటాయా లేదా? నువ్వు తెమిలి ఇవతల పడేసరికి రెండుగంటల కాలం పట్టదూ?

కుము—రెండుగంట లెందుకమ్మా? అరగంటలో తెమలగలను. (జడ విప్పుకొని) ఇదిగో, జడ వేసేయి, కాస్త వదులుగా - నిన్నటి జడ కుదుళ్ళలోంచీ నవృత్తించింది.

నర-వదులుగానే వేస్తాలే (జాటుదువ్వి జడ వేస్తూ) బావకూడా సెలవలని వ్రాశాడు- వాడూ నేడో రేపో రావాలి.

కుము—గంగారావు బావా? బావొస్తే, కావలసినంత సందడి-ఇంట్లోనూ, ఊళ్లోనూ కూడా!

నర—గంగడు చాలా చురుకు-వాడు అచ్చు మా అన్నయ్య పోలిక! బి. ఎస్ సి. పరీక్ష ఇచ్చాడు. ఈ సంవత్సరం తప్పక పాసవుతాడు. అటు తరువాత ఇంజనీరవుతాడు. మా వదినెతో సలహాచేసి ఈ సెలవుల్లోనే పెళ్ళిముహూర్తం నిశ్చయించేస్తాను.

కుము—పెళ్ళికూతురికెన్నేళ్ళు?

నర—పెళ్ళికూతురు వేరే ఎక్కణ్ణుంచో దిగుతుందనుకున్నావా యేమిటి? ([illegible] ముద్దెట్టుకొని) మా కుముదమే పెళ్ళికూతురు— ఎంచక్కా! చిలుకా గోరింకల్లాగు...!

కుము—(కోపంగా) అమ్మా, నే నిదివరకు నీకు లక్షసార్లు చెప్పాను. నేను ఎం. బి. ఫైనల్ పాసైతేనే కాని నా పెళ్ళిమాట తలపెట్ట వద్దని.

నర—బాగుంది, నువ్వు చెప్పడాని కేంలే! నిన్నడుగుతే పెళ్ళే వద్దంటావు నాకు తెలుసు!

కుము—పెళ్ళవగానే చదువుకు స్వస్తిచెప్పవలసి ఉంటుంది. అది నా కిష్టంలేదు.

నర—చదువు కెందుకు స్వస్తిచెప్పాలి? పెళ్ళికీ చదువుకీ ఏమి సంబంధ ముంది?

కుము—పెళ్ళవగానే, పెళ్ళాడిన మొగుడుకి స్వార్థపరత్వం వచ్చిపోతుంది. భార్యకు చదువూ గిదువూ వద్దంటాడు. ఎందరు భర్తల్ని చూస్తున్నాంకా మీరోజుల్లో? మానేస్తం 'కామేశ్వరి' గతేమైంది? బి. ఎ.

సీనియర్ చదువుతూంటే తల్లిదండ్రులు ఆమెకు ముడెట్టారు. పెళ్ళయిన ఉత్తరక్షణం ఆ భర్త మహాశయుడు ఆమె చదువు కట్టిపెట్టించేశాడు. పాపం, ఎంతో తెలివైంది. యూనివర్సిటీకి ఫస్టు రావలసింది కూడాను.

నర—మధ్యలో చదువెందుకు మానుకోవాలో నాకు తెలియటం లేదు.

కుము—ఎందుకా? పెళ్ళాడగానే భర్తకి భార్యమీద సర్వహక్కులూ ఏర్పడుతాయి! భార్యని తన సొత్తైన ఒక పదార్థంగా భావిస్తాడు! ఇతరులు ఆమెవైపు కన్నెత్తి చూడకూడదు! ఆమె కాలేజీలో చదవకూడదు. ఇరవైనాలుగ్గంటలూ భర్త సేవ చేసుకుంటూ భర్త పాదాలు కనిపెట్టుకొని రాత్రీ, పగలూ భర్త చెప్పుచేతుల్లో వుండి, సంసారం చేసుకుంటూ పిల్లా మేకా కనుక్కోవాలంతే! ఆ సందట్లో, ఆమె ఆరోగ్యం, ఆమె సౌఖ్యం, ఆమె ఆత్మ వికాసం, ఆమె జ్ఞానం అన్నీ అంతరించిపోతాయి! భార్యంటే భర్త కనుసన్నలను మెలగుతూ, ఆత్మ స్వాతంత్ర్యాన్ని పోగొట్టుకున్న ఒక ద్విపాదపశువుగా మారిపోతుంది, ఆవు, మేక, మొదలైన సాధుజంతువులమల్లే! పిల్లలు కనడం, పాలివ్వడం, యజమానివైపు పిరికిదృష్టులు చూస్తూండడం! పెళ్ళయాక స్త్రీకి మిగిలే వ్యక్తిత్వమింతమట్టుకే! ఇక చదువెక్కడమ్మా, చట్టుబండలు?

నర—అబ్బ, ఒక్క గుక్కలో ఎన్ని యాకరు పెట్టావే! నా మేనల్లుడు రంగారావుకి అంతటి స్వార్థపరత లేదులే! వాడికి నువ్వంటే ఎంతో అభిమానం, తెలుసా? నువ్వే చూద్దువు గాని, అధికారమంతా నీదే అవుతుంది.

కుము—రంగారావుబావ! అభిమానం! నక్క, దేవలోకం! 'భర్త' అని పేరు పెట్టేసరికి కుందేటికి కూడా కొమ్ములొస్తాయి! 'అభిమానం' దురభిమానంగా మారిపోతుంది, నీకు తెలీదు.........అయితే, అమ్మా! ఒక్క సంగతి అడుగుతాను; కోప్పడవు గదా?

నర—కోపమెందుకూ, అడుగుతల్లీ! నిస్సంకోచంగా!

కుము—నా పెళ్లివిషయంలో నాకూ కొంత స్వతంత్రత వుంటుందంటావా, లేదంటావా?

నర—లేకేమి? తప్పకుండా ఉంది!

కుము—అల్లాగైతే, ... నేను రంగారావు బావను పెళ్ళాడ్డాని కిష్టపడను. క్షమించు.

నర—ఏమీ? కులంతక్కువా, గుణంలోపమా, ధనసంపదలులోటా?

కుము—చెప్పమంటావా? బావకి వెర్రి. నీ మేనల్లుణ్ణిలాగన్నందుకు మన్నించు. కలకాలం బతికే బతుకు విషయంలో నిక్కచ్చిగా మాట్లాడుకోవాలి.

నర—వెర్రా? నా మేనల్లుడికి వెర్రా? ఏ వెధవలు చెప్పారే నీకు?

కుము—ఒకరు చెప్పేదేమిటి? ఆసంగతి నీకూ తెలుసు, నీ అంతరాత్మకే తెలుసును, నీజిహ్వకి

తెలియక పోయినా! మున్ముందు నీవాడినీ, నేను పరాయివాణ్ణనీ నువ్వు భావిస్తే చెప్ప లేనుకాని...ఏదీ నా మొగం చూచి చెప్పు, బావకి ప్రేమలేదని!—ఇటు చూడు!

నర—ఏదో కాస్తంత వాళ్ళత్తల్లిని కూడా పోలాడు గనుక కోపం కొంతుంటుం దేమో! అయితే ఏం పోయింది? నీదే సర్వాధికారం!

కుము—నాకిల్లాంటి అధికారవాంఛ లేదు. అన్నా, నీకు పదివేల నమస్కారాలు! ఇప్పట్లో పెళ్ళిమాట తలపెట్టవద్దని నా ప్రార్థన... .. ఫైనల్ పరీక్షయిపోతే......

నర—(కోపంగా) వీల్లేదు. ఈ విషయంలో సంపూర్ణమైన అధికారం నాది! నువ్వు అడ్డు చెప్పడానికి ఎంతమాత్రం వీల్లేదు. (కొంచెం మెత్తపడి) నేను నీ సుఖంకోరి ఇంతమటుకు చెబుతున్నా. నామాటవిను - పెద్దలను తిరస్కరించ కూడదు! తల్లిమాట నిర్లక్ష్యం చెయ్యకూడదు! ప్రొఫెసర్ ఈశ్వర్ గారు వస్తారు. వేగం స్నానంచేసి పట్టుచీర కట్టుకో! (నరసయ్య భాగవతములోని 'ఆజన్ శ్రీసతి కొప్పు......' అనే పద్యం చదువుకుంటూ నిష్క్రమించును.)

కుము—(నిరాశాభావంతో అన్న వెళ్ళినవైపు చూచి, దుఃఖం, ఆగ్రహం వగైరాలు ప్రాయముఖంలో ఉంచి) పెద్దలు!—అన్నకెంత స్వాభిమానం! ఎంత అహంకారం! తన అధికారాన్ని వాంఛించింది కాని నా క్షేమం ఆలోచించింది కాదు!' (దుఃఖముతో) ఒక్క పాడుపుమాటతో మనసు చివుక్కు మంటుంది! శాంతి సన్నగిలినపుడు సంగీతమే శరణ్యం!

(వీణ తీసి తంతులు సరిచేసి వాయిస్తూ పాడును.)

నాదబిందు కళోపాసన జేసిన
  క్షేమము వారును గా
మోదము గూర్చును, మోమును కలకల
  లాడగ జేయును గా   నాద

దుఃఖతిమిరమును త్రుళ్ళగొట్టు సం
  గీత తేజమును మించినదేదీ?
లెక్కలేని కష్టములను బాపియు,
  నిక్కపు శాంతిని గూర్చునుగా   నాద

నిఖిలజంతు సముదాయము భువి సం
  గీతానందము ననుభవించగా
మానవలోకము శాంతిదూరమై
  గిల్లడపడగా నేల?   నాద

(పాట ముగిసేసరికి నూకాలు నవ్వుపెదవితో ప్రవేశము.)

కుము—ఏమి, నూకాలూ?

నూకా—స్నానంచెయ్యరా, అమ్మా? అమ్మా రంగం బాబొస్సినారు బస్సుదిగి ఇప్పుడే!

కుము—(త్రుళ్ళిపడి) ఏ రంగం బాబే?

నూకా—అమ్మగారికి మేనల్లుడు, ఆయన! (విరగపడి నవ్వుతూ) ఏంబాబమ్మా? (బిగ్గరగా నవ్వుతూంటుంది.)

కుము—నవ్వుతావేమే?

నూకా—మీకేటి సెబుతానమ్మా! (ఉప్పెనగా నవ్వుతూ) ఆ బాబు బస్సు దిగటంతోనే మా పొరుగు నాయుడుగారి నల్లకుక్క! (ప్రక్కలు బద్దలయ్యేటట్టు నవ్వుతుంది.)

కుము—నల్లకుక్కా! ఏం జేసిందే?

నూకా—అంగాలాంటి ఆ బాబు పెరాయి, ఎత్తు టోపి, జోడూ, కళ్ళద్దాలూ, రంగురంగుల కోటు, అస్మాచాంచి, అనుకున్ల - కాబూలీ సాలొంబనుకుందో యేటో- పళ్ళు పైకెట్టి, అరుస్తూ, ఆ బాబుమీద కరిసింది! (నవ్వుతూ) అమ్మా, మీకేటి సెప్పేది! ఆ బాబు బస్సు దగ్గరనుంచి మనయింట్లోకి ఒకటే దౌడు తీశారు! (నవ్వు మిక్కుటముకాగా దగ్గును)

కుము—(తననవ్వు ఆపుకొని) చాలించు—బావ వింటే బాగుండదు. నోరు మూసుకో!— నా పెట్టె తీసి తువాలొకటి తీసుకురా.

నూకా—(పెట్టెతీస్తూ) అమ్మా, రైలులో వస్తున్నారట, ఆరు ఎవరమ్మా?

కుము—ఆయనా? 'ఈశ్వర్' అని గొప్ప పండితుడు. కాలేజీలో ప్రొఫెసర్! ఆరోగ్యం కోసం ఈ వూరొస్తున్నారు. ఒక్క నెల రోజులుంటారు, మనింట! (నిష్క్రమించును)

(నూకాలు పెట్టె తెరచి తువాలు తీయును)

—తెర—

రెండవ రంగము

[నరసాయమ్మగారి తోటలోని గద్దె బంగళా యెదుట - చెట్టునీడను - సాయంకాలము నాలుగున్నర గంటల వేళ - కుముదం 'ఈజీఛేర్'లో కూర్చొని పుస్తకం చదువుతూంటుంది. చప్పుడు చేయకుండా రంగారావు వెనుకనుంచే వస్తాడు. రంగారావు మరీ దర్జాగా వుందామని వేషం వేసుకోడంచేత నవ్వు పుట్టించాలి.]

రంగా—(తనలో) ఇల్లంతా గాలిస్తే, ఇదిగో ఇక్కడ దొరికింది చిలక!— చదువుతూంది —నా కుముదానికి చదువంటే యెంత శ్రద్ధ!— నేను రావడం కనిపెట్టే వుంటుంది. నాతో మాట్లాడవలసివస్తుందని పుస్తకం విప్పింది! నాకు తెలీదూ, దొంగవేషం? కేం పుట్టింది! నేనూ వెనకపాటున చెట్టెక్కి ఏమీ ఎరగనట్టు నా కవిత్వధోరణిలో వుండిపోతాను! (మెల్లిగా చెట్టెక్కి కొమ్మమీద గుర్రం ఎక్కినట్టు కూర్చొని, జేబులో నుంచి నోటుబుక్కు, పెన్సిలు తీసి చదువుతాడు.)

గేయము:

ఆ చెట్టుకాకి తా నీ చెట్టుకొమ్మపై
లి తెగపాడింది ప్రేమ గీతంబు—

(తిరిగి చదివి) ఎక్సలెంట్!— చాలా బాగుంది!— సాధారణమైన విషయాల్లోంచి సద్భావాలు కలిగించేవాడే దిట్టకవి! 'కాకి' అనేది ఒక సాధారణమైన పక్షి—ఇక ప్రేమ

గీతం పాడటం ఒక మహత్తరమైన విషయం. ఈ రెండింటి యొక్క కమ్మని మేళగింపే కవితా రహస్యం. నా పెన్సిలులోనుండి నోటు బుక్కులోకి దిగజారింది! 'సిరప్'కి సీసా యేలాగో కావ్యానికి భాష అలాగు! భాషా విషయంలో కూడా: నా గేయంలో 'తెగపాడింది' అనే ఒక్క ముక్కలోనూ ఎంతటి భావం ఇమిడి వుంది!—ఎట్టి హృదయదారకమైన మనోవేదన సూచింప బడ్డది!—శాబాష్, రంగారావూ! నువ్వు మహాకవివి సుమా!—నిస్సందేహంగా!—పత్రికలు నీ కైతను ఆమోదించకపోతేనేం గాక! (క్రిందికి చూచి) కుముదం నన్నింకా చూడనట్టే నటిస్తూంది! అన్యాపదేశంగా, ఆశువుగా, బిగ్గరగా, ఒక్క ప్రణయ గీతం పాడుతాను! (ఆలోచిస్తూ, రాగవరసలో)

కొలనులోనుండేటి కుముదమా, చూడు
చెక్కుపై నెగిరేటి భ్రమరంబు వైపూ

(తిరిగి క్రిందికి చూస్తాడు. కుముదం రెప్పలల్లార్చి మీదికి చూడకుండానే, పాట పూరించే ఉద్దేశంతో)

కుముదం—నిదురపో భ్రమరంబ, నిదురపోవోయీ
నిదుర లేకున్న నీ బెదురు తగ్గదుగా?
లాలీ—లాలీ!

రంగా—హాయీ! హాయీ!—హాయి, హాయి!

(ఉత్సాహంలో పైకొమ్మ పట్టుకొని ఉయ్యాల ఊగుతూ పాడుతాడు.)

ఉయ్యాల లూగవయ్యా, శ్రీరామ
ఉవిద సీతమ్మతోనూ!—ఉయ్యాల—

కుముదం—(క్రింద నుంచి రంగారావును చూచి)

కొమ్మనూ వంచేటి కోర్కె నీకేలా?
ఆ కొమ్మ విరుగుతే నీ నడుము విరుగూ!

(తిరిగి పుస్తకం విప్పుతుంది.)

రంగా—అబ్బో! నా వైపున కన్నెత్తి చూడకుండానే నాకు జవాబిస్తోంది!—ఏమి టక్కరి! (ఆలోచించి)...... 'కొమ్మనూ వంచేటి కోర్కె నాకేలా?' నీ ప్రశ్నకి జవాబు చెబుతానుండు, కుముదం—తొందరపడకు... ఇదిగో, కాచుకో!—

కొమ్మ కొమ్మంటేను కొయ్యగదే కాదా?
ఆ కొయ్యకే నేను కోటు తగిలింతూ!

కుముదం—(నవ్వి) కొయ్యకి కోటు తగిలించుతాడట!—బావ! మగధీరుడు! స్త్రీజాతిపై తన కున్న నిర్లక్ష్యమంతా ఒక్క వాక్యంలో వెల్లడి చేశాడు! ఏమి స్వాతిశయం! తానొక గొప్ప కవి అనే భ్రమలో కొట్టుకు పోతూంటాడు! కాకియం దెంత గానరస ముందో బావలో అంత కవితా రసం వుంది! అహం భావానికి ఎట్టి లోపమూ లేదు!

రంగా—(క్రిందికి చూచి) మరి జవాబు చెప్ప లేక పోయింది! ఆయిల్ ఔట్!—పస ఇగిరి పోయింది!... మొగాడు మొగాడే, ఆడ దాడదే!—కవితా ధోరణిలో, పాండితీ పటిమలో, విద్యా విషయంలో, ఊహల ఉద్రేకంలో, ప్రణయభాషణాల్లో కూడా, మొగాడిది పై మెట్టు. స్త్రీది దిగువ

పెట్టు!— నేను చెట్టుమీద, కుముదం చెట్టు క్రింద!— ఈ వ్యత్యాసం సృష్టిలోనే వుంది! ఇలాగెందు కుండాలి, అని స్త్రీలు ప్రశ్నిస్తే ఏమి లాభం! సృష్టికర్త కూడా ఈ ప్రశ్నకి జవాబు చెప్పలేక నీళ్లు నములుతాడు! (ఆలోచించి)... సరే, అయితే, గియితే, శ్రీ శ్రీ రంగారావుగార్ని కుముదం ప్రేమిస్తున్నట్టా, లేనట్టా? కఠినమైన ప్రశ్న— ఘోరమైన సమస్య! ఈ సమస్యకి పరిష్కారం ఈ క్షణంలో తేలిపోవాలి! అందుకు మార్గం?... ఒక వేళ, ప్రబంధ ఫక్కీని "అతి గాఢ ప్రణయ సౌందర్యమ్మనీ..." అంటూ నా ఎడమ చేత్తో ఈలాగు నా హృదయాన్ని అదిమిపట్టి— కుడిచేత్తో ఈలాగు నా 'క్రాఫు' సవరించుకొని, చేయి చాచి, "హృదయేశ్వరీ, కుముదం— నీవు నాకు ముదం గూర్చవూ?" అని బ్రతిమాలుతుంగా, బహిరంగంగా, అడిగేస్తేనో?... ఛా అలాగు బయలుపడి పోతే నేను క్రిందై పోయానన్న మాట!— అది నా పౌరుషానికి లోపం! అయితే నా హృదయంలోని ఆవేదనను ప్రేయసి కుముదాని కేలాగు తెలియబర్చడం? —హృదయేశ్వరి ఉద్దేశాన్ని నే నేలాగు తెలుసుకోడం? (తీవ్రంగా ఆలోచించి)— ఆ బాగుంది. ఇదే ఉపాయం!... చెట్టు మీద నుంచి పట్టువదలి క్రింద పడిపోయి నట్టు నటించి, 'ఢభీ' మని క్రింద పడిపోతాను— పడ్డాక లేవకుండా కళ్లు మూసేస్తాను— అప్పుడు కుముదం కంగారుపడి నన్ను ఓదారుస్తూ నా సేవ చేయటానికి నా పజ్జను చేరుతే, ఆమె నన్ను ప్రేమిస్తున్నట్టు —లేకపోతే లేనట్టు!— శెభాష్!— గొప్ప ఉపాయం ఇది!... రెడీ, వన్, టూ, త్రీ! ...(ప్రకాశముగా) అమ్మయ్యో!! (కుముదం సమీపంలో బోర్లాపడి బాధ నటించి కళ్లు మూసేస్తాడు).

కుము—(కంగారుపడి లేచి) రంగారావు బావా, అయ్యో! పడిపోయావా?— చెట్టెందుకెక్కావు బావా!

(రంగారావును సమీపించి చేయి అందించును.)

రంగా—(ఒత్తిగిలి, కన్నులు విప్పి, కుముదం చెయ్యిపట్టుకొని) హాయి! హాయి!

కుము—క్రిందపడిపోయి 'హాయి, హాయం'టా వేమిటి, బావా? దెబ్బ తగిలిందా?— లేవ లేవూ?

రంగా—దెబ్బ...హృదయానికి...మోపుగా... తగిలింది! నువ్వు ... చెయ్యి నిచ్చాక ... కొంచెం...నొప్పి తగ్గింది!

కుము—గాయం తగల్లేదు కద?

రంగా—పైకి కనిపించని గాయం తగిలింది, కుముదం!

కుము—నా చెయ్యి పట్టుకొని మెల్లిగా లేవ గలవా?

రంగా—లేవగలను కాని లేవను, కుముదం!

కుముదం— ఆదేమి టావికారము, బావా? లేవకపోవడ మేమిటి?

రంగా— ఇదొక మనోవికారం... కందంలో విశదీకరిస్తా నుండు:

నీ దగు కరపల్లవ మిటు
నాదగు శరీరమును తాకి, నా కుండిన యీ
వేదన బాపెను; కుముదం!
... ...

తేలింది నా సమస్యకి జవాబు తేలింది!

కుముదం— ఏడ్చినట్లే వుంది!

రంగా— ఏమిటి ఏడ్చినట్లే ఉందంటావు?

కుముదం— మొదట నీ కందం— ఆ పైని నీ సంగీతం!

రంగా— 'కందం చెప్పినవాడే కవి!'— తెలుసా?

కుముదం— 'పందిని పొడిచినవాడే బంటు!'— తెలుసా?

రంగా— పోరపండి ననుకొన్నావు కాబోలు, అపోహపండిని! నీకు తెలుసా, ఆ సంగతి!— కవిత్వానికి భావం ప్రధానం! భాష, సంగీతం రెండో పక్షం!— అంచాచేత నా కంద పద్యంలోని భావాన్నే నువ్వు తీసుకో! నా ఉద్దేశం నీ కిప్పుడు తెలిసి ఉంటుంది, ఏమంటావు?

కుముదం— నీ పిచ్చివాలక మంతా తెలుస్తూనే వుంది! (రెండవ చెయ్యి కూడా క్రిందికి చాచి) ఇక లేస్తావా?

రంగా— (కుముదం చేతులను తన చేతుల్లో పట్టి,) హాయి, హాయి!— నా మనోరథం యీడేరింది— లేడీ డాక్టర్ల చేతులు మహామృదువు! (లేస్తాడు)

కుముదం— మనోరథం మాట కేం? ముందు నీ శరీర ఘాన్ని యింటి కీడ్చే మార్గం ఆలోచించు! —ఇక లేడీ డాక్టర్ల చేతుల మృదుత్వమా!— సమయం వస్తే లేడీ డాక్టర్ల చేతులు మోటుగా చెంపకాయలు కూడా కొట్టగలవు— తెలిసిందా?— చేతులు వదిలి పెట్టు!

రంగా— (చేతులు మరీ గట్టిగా పట్టుకొని) ప్రాణేశ్వరీ, కుముదం—

కుముదం— 'ప్రాణేశ్వరీ!' (కోపావేశంగా) ఇక చాలించు!

(చేతులు విదిలించుకొని, తన పుస్తకంతో రంగారావు చెంపలు ఎడా పెడా వాయించి నిష్క్రమించును.)

రంగా— (చెంప తడుముకుంటూ, కుముదం వెంబడి) సిగ్గుపడకు, కుముదం— నీ బావ దగ్గరా నీకు సిగ్గు!— ఉస్స్! వెళ్లిపోయింది. పాపం!— ఎంత సిగ్గుపడింది!... నేను వొట్టినే జలితి పడిపోయాను! కుముదాన్ని ఊరికే బెదర గొట్టేశాను. కొంచెం గోప్యంగా ఉంచుతేనే దాని మజా కాని, స్త్రీల యెదుట మన మనోభావాలు అట్టే ప్రకటించకూడదు. అయితే నేం గాక! తేలిపోయింది! తేలిపోయింది!

(ప్రవేశము : నరసాయమ్మ, ప్రొఫెసర్ రాజేశ్వర్)

నర—రంగూ, కుముదం ఏదిరా? (ప్రొఫెసరుతో) ప్రొఫెసరుగారూ, వీడు నా మేనల్లుడు రంగారావు...బి. ఎస్ సి. పరీక్షిచ్చాడు—వారానికి ఫలితాలు తెలియాలి.

ప్రొ—చాలా సంతోషం!

రంగా—(నమస్కరించి తనలో) పూర్తైన విగ్రహమే!

ప్రొ—రంగారావూ, నా ఆశీస్సులు!

రం—కృతజ్ఞుణ్ణి! — పెద్దల ఆశీర్వాదం అమోఘం!

నర—రంగూ, నువ్వా వేళ, మంచికి విగూడా సుమండీ!

ప్రొ—అలాగా? నాకు చాలా ఆనందం. సంగీతం ఒకటి, కవిత్వ మొకటి మానవ జీవితంలోని మాధుర్యాన్ని పైకి లాగుతాయి!

నర—మా తోట చూశారా, ప్రొఫెసర్?

ప్రొ—అదే చూస్తున్నా—క్రోటన్స్‌లో మహా గొప్ప రకాలు వేయించారే. నే వెళ్ళేటప్పుడు కొన్ని 'కటింగ్స్' తీసుకొని వెళ్తాను, మీ ఆజ్ఞయితే!

నర—తప్పకుండా! తమ కభ్యంతరమా?

(ప్రొ. పూల మొక్కలు పరిశీలిస్తూ దూరంగా పోవును.)

రంగూ!

రంగా—ఏ మత్తా!

నర—కుముదం ఎంత సేపై వెళ్ళిపోయిందిరా?

రంగా—ఇప్పుడే. అంతవరకూ ఇక్కడే చదువుకుంటూ కూర్చుంది.

నర—(నవ్వి) మాటా మంతీ ఆడావురా?

రంగా—ఒక్క మాటా మంతీయేనా? ఆటా, పాటా కూడా!

నర—అయితే కార్యం 'పండు' అన్న మాటే!

రంగా—(గర్వంగా) ఆహా!— తేలిపోయిం దత్తా, తేలిపోయింది! (గంతు వేస్తాడు.)

నర—ఏమిటది తేలిపోయిందిరా, నీ మొగం?

రంగా—కుముదం నన్ను ప్రేమిస్తోంది! (నవ్వి క్రాఫింగు సవరించుకుంటాడు.)

నర—నిజంగానే? నీతో చెప్పిందట్రా?

రం—చెప్పకుండానే చెప్పింది!

నర—ఆ దేమిటూ, ఆ ధోరణి!

రంగా—నిన్ను! కుముదం నన్ను— నిజంగా— నిస్సందేహంగా— నిస్సంశయంగా— నిష్కల్మషంగా ప్రేమిస్తోంది!

(ప్రవేశము : నాయుడుగారి నల్లకుక్క)

అమ్మో! అత్తయ్యా! నల్లకుక్క!— నన్ను పసి పట్టి మళ్ళీ వచ్చావే, రాక్షసి ముండా? —అత్తయ్యా! చచ్చాను! నల్లకుక్క!— నల్లకుక్క! (హడలిపోయి నరసాయమ్మ వెనక్కి చేరి, ఆమె చేతులు రెండూ గట్టిగా పట్టుకొని వణికిపోతూ, కుక్కవైపు బెదురు

చూపులు చూస్తుంటాడు. కుక్క రంగారావు వైపే వస్తుంది.) అయ్యో! అత్తయ్యా! నా కేందార అత్తయ్యో!

నర–ఎందుకురా, అంత భయం!

రంగా–నల్లకుక్క, అత్తయ్యా!

నర–ఔనురా, నల్లకుక్కయితే!

రంగా–నన్ను కరిచి చంపేస్తుందత్తయ్యా! అందుకే పళ్ళీ వచ్చింటత్తయ్యా!

నర–మళ్ళీ యేమిట్రా? ఇంతవరకు నిన్ను వెంబడించిందిరా?

రం–ఊం! బస్సుదిగగానే!–ఓర్నాయనో!

నర–కుక్క కోసం ఇంత భయం ఏమిట్రా, పిరికీ? (తనచేతిలోని కర్ర నెత్తును.. కుక్క పారిపోవును.)

రంగా–బతికించావత్తయ్యా!

నర–ఇంకైనా చేతులు వదులురా రంగా!

రం–(చేతులువదలి) అత్తయ్యా! ఈకర్ర నాకివ్వవూ?

నర–ఎందుకూ!

రం–అవసరం పడినప్పుడు కుక్కను బెదరించడానికి!

నర–ఈకర్ర యెందుకు? ఏకర్రైనా పనికివస్తుందిరా!

రం–అబ్బ! నాకీకర్రే కావాలి! ఈ కర్రలో ఏదో ప్రభావం వుంది! (కర్ర బలవంతంగా లాక్కొని యింటివైపు నిష్క్రమించును.)

నర–పిరికివెర్రి వెలంకాయలుతినా! వొట్టి పిరికి! పెళ్ళయిపోతే అన్ని భయాల్లూ వొదిలిపోతాయి! ఇలాంటి పిరికిపాళతో వేగడేం చెప్మా, బాబూ!......రంగూ, కుముదం ముచ్చటగా పెళ్లిపీటలమీద కూర్చోవడం ఎప్పుడు ఆనందంగా చూస్తానో! ఆ కృష్ణపరమాత్ముని దయ!

"నల్లనివాడూ, పద్మనయనమ్ములవాడు...... తెల్పరె!"

(పై భాగవతపద్యం చదివి ముగిస్తూండగా
—తెర—)

మూడవ రంగము

[మరునాటి ఉదయం ఏడుగంటల సమయం. నరసాయమ్మ గారింటి డ్రాయింగ్ రూమ్:. టీపాయిలు, ఫ్లవర్‌పాట్సు, సోఫాలు, రౌండ్‌టేబిల్. చక్కని కుర్చీలు, రేడియో, టేబిలు మీద సచిత్ర పత్రికలు, మొదలైన వస్తు ఉండును. మూలను ఒక ఎత్తైన వేదికపైని మురళి పెదవుల నానుకొనియున్న కృష్ణవిగ్రహము.]

(ప్రవేశము సూకాలు:- సూకాలు పాడుకుంటూ కాఫీ ఫలహారాలకి ఏర్పాట్లు చేస్తూంటుంది.)

సూకా–(పాట)

వెండికొండామీద శివుడుకూర్చుండే—
శివుని శిరమూపైని చందురూ డుండే—
శివుడు గంగమ్మతో చీకాకుపడితే—
చందురుడు సగమయ్యె!–గంగ ఉప్పొంగే.

(ప్రవేశము. కుముదం, పళ్ళసజ్జతో)

నూకా—అమ్మా! పళ్ళు మీరెందుకు తెచ్చినారూ? నాను మోసుకొచ్చేందునే తల్లీ!

కుము—ష్-ష్! నూకాలూ నీతో ఒక్క సంగతి చెప్పాలి రహస్యంగా. అందుకే ముందుగా వచ్చేశాను!

నూకా—(నిదానించిచూచి) మీ మొగం వాడిపోయున్నది!

కుము—రాత్రి నిద్రలేదే నూకాలూ! రంగారావుబావ నన్ను పీక్కొని తింటున్నాడే! నీదగ్గర దాచవలసిన విషయం కాదుగాని, నే నింకెవరితోనూ చెప్పలేను. అమ్మకూడా నా కెదుట లేనిందే, నూకాలూ! రాత్రి నా కొక్క కునుకు పట్టలేదు. మా బావ వెకిలి నవ్వులూ, సకిలింపులూ, ఓండ్రింపులూ, విన లేక చస్తున్నానే! నాచదువు రవ్వంత సాగనివ్వకుండా వున్నాడే!

నూకా—అమ్మగారికి నొక్కి చెప్పితేనో?

కుము—లాభంలేదు. అమ్మ ప్రోత్సహిస్తోంది, తాళ్ళీ! రాత్రి ఏంజేశాడో తెలుసా? పదకొండు గంటలప్పుడు నేను చదువుకొంటూంటే, బావ, తోటగోడెక్కి నాగది కిటికీలోంచి లోనికి గెంతాడు. అప్పుడు నేను మంచం క్రిందనున్న సోడాబుడ్డితీసి, జడిపించి, 'బావా, పోతావా, లేక కేక వేసేదా?' అని దబాయిస్తే, వచ్చినత్రోవంటే పారిపోయాడు!—చెప్పుకుంటే సిగ్గు సిగ్గు!..

నూకా—ఇవేళ రాత్రి పాడుగునాయుడుగారి నల్లకుక్కని మంచానికి కట్టేస్తా నుండండి—ఆకుక్కని చూస్తే మీబావ పుంజాలు తెంపుకు పరిగెడుతారు! (నవ్వును).

కుము—(నవ్వి). అదిసరే కాని, బావయ్యన్ని పూర్తిగా వొదుల్చుకొనే ఉపాయం ఏదైనా చెయ్యాలి!

నూకా—మీబుద్ధి కసాధ్య ముండదటమ్మగోరూ?

కుము—అదే ఆలోచిస్తున్నా. ఆ పన్నుగడలో నీ సహాయ్యంకూడా కావలసి వస్తుందేమో!

నూకా—మీ సౌఖ్యంకోసం ఏది చెయ్యమంటే అది చేస్తా!

కుము—బావ వస్తున్నాడు – నీపని చూసుకో! (కుర్చీలో కూర్చొని మాసపత్రికలోని బొమ్మలు చూస్తూంటుంది.)

(ప్రవేశము: రంగారావు)

రంగా—హల్లో, కుముదం! హాయిగా వుండావూ?

కుము—......(మౌనంగా)

రంగా—(సమీపించి, మెల్లగా) కుముదం, రాత్రి సందర్భానికి గాను నన్ను క్షమించాలి. నేనొక జంతువువలె ప్రవర్తించాను – నిన్ను క్షమాపణ వేడుకుందుకే అత్యవసరంగా ముందుగా వచ్చాను (చెయ్యిపట్టుకొని) క్షమించు! ఇది చెయ్యికాదు; కాలనుకో! మీ నూకా లిప్పుడిక్కడ లేకపోతే నిజంగా నీకాళ్ళమీద పడడానికి వీడు సిద్ధం, నమ్ము!

కుము—క్షమించడానికేముంది, బావా!

(ఉల్లాసముగా నటిస్తూ) నా పనులు తోచక వేదని నే నాలాగు చేశానుకాని, నాకుమాత్రం అయిష్టమా?

రంగా—'అయిష్టమా?' అనే ప్రశ్నకి 'ఇష్టమేను! అని అర్థం!—ఓ. కే!—(కుముదం ప్రక్కనున్న కుర్చీలో కూర్చుంటూను) ప్రొఫెసరుగారూ, పత్తికూర్చ ఇంకా లేమిలి రాదేం? నాకాకలి దంచేస్తూంది!

కుముదం—మన ప్రొఫెసరుగారి దంతా ఆదోక పేరిస్తూరి! అసలు మంచాలూ, అతని తోటిస్నానాలూ, అతని మరిస్నానాలూ, అతని గ్రంథాలూ,—కనిపెట్టావో లేదో?

రం—హాc, హాc, అదే నేనూ అనుకొంటున్నాను మనగా, కుముదం!

కుముదం—అదిగో-అన్నా, ప్రొఫెసరు వస్తున్నారు. నీకు తరువాత సావకాశంగా చెబుతాను అతని సంగతంతాను! కాఫీ, ఫలహారం అయినాక!

రం—చెప్పానుగా-ముందు కాఫీ ఫలహారం అయిపోనీ!

(ప్రవేశము. నరసాయమ్మ. ప్రొఫెసరు. కుర్చీలమీద కూర్చుంటారు. ప్రొఫెసరు కుముదాన్ని రంగారావుని చూచి "గుడ్‌మార్నింగ్" అంటాడు. కుముదంమాత్రం జవాబుచెప్పకుండ 'గుడ్‌మార్నింగ్' అని. రంగారావు వెర్రి మొగంపెట్టి ప్రొఫెసరు 'వేస్టుకోటు' వైపు పరధ్యానంగా చూస్తుంటాడు. ప్రొఫెసరు తనచేతిలోని గ్రంథం తీసి తనలో చదువుకుంటూంటాడు. నరసాయమ్మ తనచేతిలోని భాగవతం విప్పి గొణుక్కుంటూంటుంది.)

రంగా—(కుముదం చెవులో) ప్రొఫెసరు 'వేస్టు కోటు' బొత్తాం ఒకటి వూడిపోయి ఇప్పుడే క్రిందపడిపోయింది, చూడు!

కుముదం—(రంగా. చెవులో) ఊరుకో. ఆయన వింటే బాగుండదు!

రంగా—(కుముదం చెవులో) ప్రొఫెసరుకి చెముడు వినిపించదులే! (పైకి గట్టిగా) తాము చదువు తున్న ఆ గ్రంథం ఏమిటండి?

ప్రొ—ఓ—ఇదా? 'మొరాలిటీ ఆఫ్ సూయిసైడ్'—'ఆత్మహత్య యొక్క నైతిక విచారణ'—చాలా మంచి పుస్తకం—ఈపుస్తక కర్త ఒక ప్రఖ్యాత అమెరికన్ తత్త్వవేత్త. (పుస్తకం మూసి) క్షమించండి నరసాయమ్మగారూ, భాగవతం పైకి చదవండి.

నర—ముందు కాఫీ లైపోనీండి—తరువాత చదువుతాను (కాఫీ ఫలహారాలు ఆరగిస్తూ మాట్లాడుతారు)

ప్రొ—నరసాయమ్మగారూ. మీరు నావిషయంలో ఎంతో శ్రమపడుతున్నారు. నా ఆరోగ్యం కోసం డాక్టరు నన్ను గ్రామం వెళ్లమని చెప్పటమే, మీరు నా కాతిథ్య మివ్వటం, మీ యింట్లోని ఆబాలగోపాలం నాకు పరిచర్య చెయ్యటానికి ఆతురత కనబర్చటం, ఇదంతా మీ యొక్క నిర్మలమైన అంతఃకరణాన్ని సూచిస్తుంది. నే నేవిధంగా నా కృతజ్ఞతను తెలుపుకోవాలో నాకు తెలియదు. నేను మీకు మనఃపూర్తిగా నా అభివందనాలు సమర్పిస్తున్నాను.

ర— నేనేం శ్రేశామువెండి, ప్రొఫెసరుగారూ! మీవంటివారు రావటంవల్ల మా గృహం పావనమైంది. నిజంగా మీరాకవల్ల నాకెంతో ఆనందంగా వుంది. మీవంటి జగద్విఖ్యాత పురుషులు మా నట్టింట అడుగు పెట్టడమే ఒక మహాభాగ్యంగా అని నే నూహిస్తాను. మీరు అదర్శపురుషులు. మీబోంట్ల దర్శన మాత్రం చేతనే యువకుల హృదయాల్లో సద్భావాలు ఉదయిస్తాయి!

రం— (మోనత్తి ననుకరిస్తూ) నిస్సందేహంగానన్నా! నువ్వు నుడివినవి వేదాక్షరాలు! — అప్పుడే నా నరాల్లో ఒక క్రొత్త నెత్తురు, ఒక నూతన ఆవేశం, ఒక నవీనశక్తి, ఒక నవ్య - నవ్య - నవ్య-దారుఢ్యం — ప్రవహించడాన్కి ప్రారంభించాయనే నా నమ్మకం! (కుముదమువైపు గర్వంగా చూస్తాడు.)

ప్రొ— మీరు నన్ను అకారణంగా శ్లాఘిస్తున్నారు. అది మీకు నాయందున్న గౌరవాన్ని చాటుతూందంతే!

కుముదం— (ఇంతసేపూ ఆలోచిస్తూంది, నిట్టూర్పు పుచ్చి, ప్రొఫెసరు యెదుట నున్న పుస్తకం తీసి) "మొరాలిటీ ఆఫ్ సూయిసైడ్"—! చిత్రమైన టైటిల్! ఆత్మహత్యను సమర్థిస్తాడా, గ్రంధకర్త?

ప్రొ— ఔను......మనలో చాలామందియొక్క అభిప్రాయం ఏమిటంటే: ఆత్మహత్య పిరికి కృత్యమని, — ప్రపంచ దుఃఖాలను సహించడానికి శక్తి చాలక — ఒకానొకవ్యక్తి భీరువై, తన జీవిత గడియారాన్ని బలవంతంగా ఆపేసి, తన దుఃఖమయ జీవితాన్ని పరిసమాప్తి నొందించుకుంటూ డని! ...... కాని, ఈ గ్రంథకర్త - ఆత్మహత్య పిరికిపని కాదనీ, దాని నాచరించుటకు ఎంతో మనస్థైర్యం కావాలనీ, ప్రత్యేక జీవికీ, తన జీవితాన్ని స్వాంతంగా నశింపచేయడానికి గాని, లేక మృత్యులో అంత మొందించడానికి గాని, సంపూర్ణమైన హక్కున్నదనీ, (నొక్కి మరీ చాటిగా) శరీరానికి గాని, మనస్సుకు గాని, రోగంవల్లనో మనోకాంక్షవల్లనో, దుర్భరమైన బాధ కలిగినప్పుడు జీవిత సూత్రాన్ని అక్కడికి తెగ గొట్టేసుకోటం నీతిబాహ్యమైన కార్యం కాదనీ, ఇతని వాదన!

కుముదం— చాలా చిత్రమైన వాదన! (నిట్టూర్పు)

రంగా— పుస్తకంలో బొమ్మలున్నాయా? (కుముదం చేతులోంచి పుస్తకం లాగి చూస్తుంటాడు. అందరూ నవ్వుకుంటారు.)

కుముదం— (నవ్వి) మాబావ బొమ్మలుంటేనే కాని ఏపుస్తకం చదవడు. అందుకే బొమ్మలులేని తన టెక్స్టుబుక్కులలో కూడా సినీతారల బొమ్మలంటించుకుంటూంటాడు!

రంగా— (నాలుక కరుచుకొని, సమర్థించుకునే ఉద్దేశంతో) బొమ్మలు! నామట్టుకు ఈ జీవితం, ఈ సంసారం, సంసారంలోని ప్రతివ్యక్తీ ఒక మాయాచిత్రంలాగే గోచరిస్తుంది!

ప్రొ— (లేచి) నేను అర్జంటుగా పోస్టుకాక

ఉత్తరం పంపెంచాలి. క్షమిస్తే వెళ్తాను!
(నిష్క్రమించును)

రం— అత్తా, జీవము నది- సంసారము పడవ! ఒడ్డుకి చేరావు! నావ తేలిందా, సంతోషం! మునిగిందా దుఃఖం! ఇదొక చిత్రం కాక పోతే మరేమిటి? కవి, ఈ విషయాన్నే పదాల్లో చిత్రిస్తాడు—చిత్రకారుడు, రంగు లలో చిత్రిస్తాడు- శిల్పి......

నర—(కుముదంతో) బావ, కవిగనుక అన్ని విష యాలూ కవితాదృష్టితోనే చూస్తుంటాడు!
(నిష్క్రమించును.)

కు—బావకి, చెప్పకపోతేగాని కవితాదృష్టి అల వడదు!

రం—హాస్యానికి నువ్వేమన్నా ఆనందమే!

కు—మన మిద్దరమే వున్నాం! (రంగారావు దగ్గ రగా వస్తాడు) దూరంగా నూకాలుంది, చూశావా! (రంగారావు తిరిగి దూరంగా కూర్చుంటాడు) కనిపెట్టావా!

రం—ఏమిటి?

కు—ప్రొఫెసరు వాలకం!

రం—ఔను కనిపెట్టాను. చాలా చిత్రమైన వ్యక్తి కాదూ!

కు—చిత్రం చిత్రం మహా చిత్రం అని ఒక కథ వుంది కాశీమజిలీల్లో! అలాగున్నాయి ప్రొఫెసర్ చర్యలు! - తరువాత బావా, అతనిదృష్టి కని పెట్టావా?

రం—ఔను- చత్వారం-ముసలాడూ కాదూమరి!

కు— అదికాదు, బావా! అతని మూపులో ఏదో ఒక విషాదం నీకు కనిపించలేదూ?

రం— ఓ, కనిపించకేమి?

కు— ఏదో ఒక క్లేశము, ఒక మనస్సంకటము నివారించరాని ఒకానొక ఆవేదన! నువ్వు గుర్తించలేదూ?

రం— గుర్తించకేమి?

కు— అతను చదివే గ్రంథం! ... ఆత్మహత్య యొక్క నైతికవిచారం! ఇతని వైఖరి చూస్తే ఇతడు నేడో రేపో ఆత్మహత్య చేసుకొనే ట్టు నాకు కనిపిస్తూంది!

రం— ఆఁ! ఆత్మహత్య? ఏమన్నావు, కుముదం?

కు— ఔను- ఆత్మహత్య! నువ్వింకా గ్రహించక పోవడం ఆశ్చర్యంగా వుంది.

రం— ఔను సుమా కుముదం! ఆలోచించగా...

కు— వెర్రిబావా! ఆత్మహత్య చేసుకొనే [illegible] విరుద్ధం కాదని ఎందుకు వాదిస్తాడు?

రం— నిజం, నిజం! కుముదం, నీది సూక్ష్మబుద్ధి సుమా! నా స్థూలదృష్టికి మాత్రం తట్టలేదు. ముసలాడు ఎంతటి దురుద్దేశంతో వున్నాడు! హారి! వీడికొంపతేగా!- నిజమే!

కు— దుంపతెగకుండానే మనం చూడాలి! బావా నువ్వెప్పుడూ ఊహాప్రపంచంలో భావాకా

శాన్ని, కవితావిమానం ఎక్కి విహరిస్తూంటావు గనుక నీకు భూమిపైని సమాచారాలు అవగాహన కావు! కాఫీ పుచ్చుకుంటూ అతను చెప్పిన ఉపన్యాసం అప్పుడే మరిచావూ? అందులో ఒకవాక్యం నాహృదయాన్ని కరకరమని కోసేస్తూంది.

రం— ఏవాక్యం, కుముదం?

కు— ఇదీ: శరీరానికి గాని, మనస్సుకు గాని, రోగంవల్లనో మరేకారణం వల్లనో దుర్భరమైన ఆవేదన కలిగినప్పుడు జీవితసూత్రాన్ని ఎవరైనా బలవంతంగా తెగగొట్టుకోవడం నీతిబాహ్యం కాదట! మన ప్రొఫెసరు రోగిష్టి! అతని దృష్టిలో విషాదముంది! ఇక నేంగావాలి? (నొక్కి) మన ప్రొఫెసర్ ఆత్మహత్య చేసుకునేటందుకు ఆలోచిస్తున్నాడు, నిస్సంశయంగా!

రం— ఔను, తెలిసింది! హా తెలిసెన్! అబ్బ! ముసలాడివి ఎంతేసి ఊహలు! ... అయితే, కుముదం మనమిప్పు డేంజెయ్యాలి?

కు— చెయ్యవలసిన దొక్కటే! అతడు ఆత్మహత్య చేసుకోకుండా అతణ్ణి రక్షించుతూ తిరగాలి! అది నీకే సాధ్యం. అతిజాగ్రత్తగా అతగాణ్ణి కనిపెట్టుకుంటూ ఉండాలి! తెలిసిందా?

రం— ఓ అప్రమత్తుడనై చూస్తూంటాను. ఈ ముసలాడు ఇక్కడ గుటుక్కుమనేస్తే అత్తయ్యకీ, నీకూ, నాకూ, ఎంత అపఖ్యాతి!

కు— అదీ! ...ప్రొఫెసర్ మందు పుచ్చుకున్నప్పుడూ, స్నానం చేసేటప్పుడూ, తోటలో ఒంటరిగా విహరించేటప్పుడూ.......

రం— క్షౌరం చేసుకున్నప్పుడూ — ఎల్లప్పుడూ చిత్రగుప్తుడులాగు కాచి వుంటాను!

కు— సాయంత్రం, చీకటిపడ్డాక, అతని మందుల పెట్టె, నువ్వు సంగ్రహించేయాలి! ప్రొఫెసర్ ఆపెట్టెలో విషం దాచాడని నానమ్మకం!— విన్నావా?

రం— (గుడ్లు మిటకరించి) విషమే! — ఎంత దారుణం! — ముసలాడి ఔషధాలపెట్టె ఉడాయించేస్తాను, నమ్ము! కుముదం, నాప్రాణాలైనా తెగించి ప్రొఫెసర్ ఆత్మహత్య చేసుకోకుండా కాపాడతాను! (తొందరగా నిష్క్రమించును.)

కు— (తనలో) ఒకవైపుగారి చక్కబడింది! ప్రొఫెసర్ ఆత్మహత్య చేసుకుంటాడని బావ దృఢంగా నమ్మాడు!- ఇక రెండవ ప్రక్క కూడా మార్గం సరిచెయ్యాలి. అదిగో, ప్రొఫెసరుగారే వస్తున్నారు. దైవం నాసన్నాహానికి బాగా అనుకూలిస్తున్నట్టు పొడగడుతూంది! ఇదొక విజయసూచన!

(ప్రవేశము. ప్రొ. ఈశ్వర్)

ప్రొ— క్షమించండి — నాపుస్తకం మరిచిపోయాను! (టేబిలుమీదనున్న పుస్తకం తీసుకొని వెళ్ళిపోతూండగా)

కు— ప్రొఫెసరుగారూ, ఇఫ్ యూ డోంట్

మైండ్... నేను ఒక్క నిమిషం మీతో మాట్లాడవలసి ఉన్నది.

ప్రొ— తప్పకుండా! (కూర్చుంటాడు).

కు— (ఏకపు నిట్టూర్పు పెట్టి) పాపం! మా బావ రంగారావు గురించి... (మాట్లా ఎగబీల్చి ఊరుకుంటుంది).

ప్రొ— ఏమిటి?

కు— చాలా చిత్రమైన మనిషి!

ప్రొ— నేనూ కనిపెట్టాను...చంచలబుద్ధి రంగారావుది!

కు— మీరూ కనిపెట్టారా? (ఆతురతగా) ఆ సంగతే మీకు తెలియదేమో, మీసలహా తీసుకుందామని ..! మా బావకి, దేముడిచ్చిన స్థితికేం లోపంలేదు. కాని, వాడు, ఉండుండి, ఒక చిత్రమైన మనోవికారానికి లోనై పోతూంటాడు! ఆవికారం కలిగినప్పుడు, బావ (మిత్రులింట్లో) చిల్లర దొంగతనానికి ఒడిగడుతూంటాడు!- ఫౌంటెన్ పెన్స్, రిస్టువాచీలు, చేతిగుడ్డలు, బొత్తాయిలు, రేజర్ బ్లేడ్స్ డబ్బులూ, దొంగిలిస్తూంటాడు!

ప్రొ— అలాగా?- పాపం! క్లెప్టోమానియా అన్నమాట! విచారకరమైన సంగతే! ఈజబ్బు గొప్పగొప్ప వాళ్ళకు కూడా వుంటూందమ్మాయీ!

కు— మీరు సరిగా ఊహించారు ఇది జబ్బే కాని మరేం కాదు!... మీరుకూడా, మీ వస్తువులయెడల చాలా జాగ్రత్తగా వుండాలని నా సూచన! ... అదొకటిన్నీ ...... (సందేహిస్తుంది)

ప్రొ—మరింకా యేమిటి?

కు—చాలా ప్రమాదమైన సంగతి మరొకటుంది! అది మీ కెలాగు చెప్పడమా అని సందేహిస్తున్నా!

ప్రొ—సంకోచింపకు, చెప్పు తల్లీ!

కు—మా బావ, కొన్నికొన్ని సందర్భాల్లో— ఒకఘాతుక మృగంవలె, ఒక హంతకునివలె (ముఖం చేతులలో కప్పుకొని రోదనం నటిస్తూ) ప్రవర్తిస్తూంటాడు!— ఓహ్! (చేతిగుడ్డతో కళ్ళు తుడుచుకుంటుంది)

ప్రొ—శాంతించు, కుముదం! నెమ్మదిగా చెప్పు- ఇటు చూడు—ఏడువకు!

కు—నా ఖేదానికి తగిన కారణం లేకపోలేదు. మీ యెదుట కన్నీరు ప్రవహింపజేసినందుకు క్షమించండి. మాబావకి అమావాస్యకీ, పౌర్ణమికీ ఉద్రేకం కలుగుతూంటుంది. మైమరచిపోతాడు—మంచీ చెడ్డా ఆలోచించడు—ఆలోచించే స్థితిలో ఉండడు! అకారణంగా కోపం తెచ్చుకుంటాడు. చేతులో ఏదుంటే అది విసిరి ఎదటివాళ్ళని కొట్టేస్తూంటాడు. నిన్నటినుంచీ చేతులో ఒక కర్ర పట్టుకుంటున్నాడు. 'ఎందుకు బావా కర్ర?' అని ప్రశ్నిస్తే 'కుక్కని హతమార్చడానికి' అని గుడ్లెర్రజేస్తాడు. ప్రస్తుతం వాడికోపం పిల్లుల

మీదికీ, కుక్క, పిల్లికీ పనికివస్తూంది. కాని ఏక్షణం అది మనుష్యులమీద తిరుగుతుందో అని నాభయం. తన ప్రాణానికి తెగించి ఇతరుల ప్రాణాలు తీసేస్తాడా అని పిస్తూంటుంది!

హ్రా—(ఆశ్చర్యపడి) కొంపతీసి హోమిసైడల్ మానియ [హత్యకు పురిగొల్పే పిచ్చి] కాదు గద!—ఇవేళ అమావాస్య కూడాను!

కుం—సూచనలను బట్టి అలాంటి పిచ్చే అనుకోవాలి!

హ్రా—ఇల్లాంటి వ్యక్తికి తగినస్థానం మెంటల్ హాస్పిటల్ (పిచ్చాసుపత్రి) కాని సంపన్నుల సద్గృహం కాదు! మీ అమ్మగారు అతణ్ణింకా ఎందుకు ఇంట్లోంచి వెళ్ళగొట్టరు?

కుం— అమ్మది తల్లి అభిమానము లెండి. పైన బ్లడి పక్కలో రాత్రిగా కత్తి మూసుకుంటుంది అంటే నేను, పాపం అమ్మతో ఈ ప్రసంగం యెత్తినా లాభంలేదు! నామీదే విసుస్సమని లేచిపడుతుంది! ఇప్పటికింకా అన్నతో చెప్పవలసినంత అగత్యం రాలేదండి! ఈనాడే అమావాస్య గనుక ఎటుంచి ఎటొస్తుందో అని మీకు ముందుగా హెచ్చరిక ఇస్తున్నా!- మనమే ఒక ఉపాయం ఆలోచించవచ్చును!

హ్రా— కృతజ్ఞుడను.

కుం— ఇదాకా, కాళీచరణుడు బావయొక్క తీక్ష్ణమైన వక్రచూపు మీమీదకూడా ప్రసరించింది! నేను చూచాను!

హ్రా— నామీదా? నిజంగానూ!

కుం— అయితే అది అసూయాదృష్టి గావచ్చును.

హ్రా— అసూయా? నామీద అతనికెందుకసూయ?

కుం— మా అమ్మ మీయెడల కాస్త గౌరవంగా వుంటుందనీ, అందువల్ల అతనికి గౌరవం తగ్గిపోయిందేమో నని!

హ్రా— అయితే, నేనలావా యేమిటి?

కుం— మీ జేబులో ఎప్పుడూ ఒక పిస్తోలుంచుకోండి.

హ్రా— నాకు పిస్తోలూ లేదు పిస్తోలుకు లైసెన్సూ లేదు- ఏమిటి సాధనం?

కుం— అస్త్రం మాటకేం- చిన్నపాటి చాకులేదూ!

హ్రా— లేకేం! - నా పెట్టెలో ఉంది!

కుం— ఆ చాకెప్పుడూ మీజేబులో ఉంచుకోండి, గోప్యంగా. సమయం పడితే, స్వయం రక్షణార్థం అస్త్రం ప్రయోగించవచ్చును!

హ్రా—అలాగే చేస్తాను-నీ ఋణం......

కుం—మీరాలాగనటం న్యాయం కాదు. మీకీ రహస్యం చెప్పటం నా కర్తవ్యం కాదూ? మా యింట్లో మీ సొత్తుకుగాని, మీ శరీరానికి గాని అపాయంవస్తే అపకీర్తి మాదికాదూ?...

హ్రా—నీ యుక్తి, నీ సమయస్ఫూర్తి మెచ్చుకో

తిరగి

దగ్గరి!

కుము—మీరు రాత్రి నిద్ర పోయేటప్పుడు కూడా గది తలుపులు జాగ్రత్తగా గడేసి మరీ పడుక్కోండి!— కిటికీలు కూడా! — బావ సాధారణంగా కిటికీలోంచే గెంతుతూంటాడు!— కత్తి ఏమరకండి!

స్వా—(నిట్టూర్పు) అలాగే—చేస్తాను— (నిష్క్ర—)

కుం—(నవ్వుకొని) మంత్రం బాగా పారింది— ఇక తంత్రం ఏలాగు సాగుతుందో చూడాలి!— ఈ నాటకకృత్యం నాకు లాభించేటట్టు పరిణమిస్తే......! ఏమో, సర్వేశ్వరునికృప!...

(తెర.)

నాల్గవ రంగము

దృశ్యము (i)

[రాత్రి 7 గంటలవేళ నరసాయమ్మగారి పెరటి పంచపాళి వద్ద. మల్లెపందిరి క్రింద—లేతనీలి ఎలక్ట్రిక్ దీపం వెలుతురులో కుముదం మంచం మీద ఒత్తిగిలి పడుక్కొని వుంటుంది. రంగారావు చప్పుడు చెయ్యకుండా వెనుకపాటుగా వచ్చి మంచంక్రింద దూరుతాడు. రంగారావు మంచంక్రింద వున్న సంగతి కుముదానికి తెలిసినా తెలియనట్టే నటిస్తుంది.]

కుముదం—(పాడును)

రంగుబావా, సారంగుబావా
జాజిపూల పడవ మాపు చక్కని బావా   రం
వెన్నెలగా తేలిపోయే కమ్మని పడవా,
గుమ్మని వాసనలు నింపు కూరిమి పడవా   రం
నీకైన పడవను పన్నీటి యేటిలో
సూటిగాను పోనీవోయి, చుక్కలగేడా   రం
వాలిపోక, సొనిగిపోక, వాటముగానూ
తేల్చి తేల్చి మనసుపడుపు తెప్పోలందూ   రం

(పాటను మెచ్చుకోవడంలో రంగారావు తల మంచం అడుగు భాగానికి తగులుతుంది. కుముదం భయపడినట్టు నటించి కర్ర అందుకొని)

పాముందా కుక్కా, మళ్లీవచ్చి మంచంకింద దూరింది! (కర్ర అందుకొని మంచం క్రిందికి పోనిస్తుంది.)

రంగా—(మంచం క్రిందనుంచే) హాఁ! హాఁ!— నేనూ!

కుం—ఎవరు? బావా! నువ్వా?

రం—(పైకివచ్చి) ఏదీ: "రంగుబావా, సారంగు బావా" పాడూ!

కుం—(సిగ్గునటించి) మంచం క్రిందనక్కి వింటూనే వున్నావు మళ్లీ యెందుకు పాడటం?— — అయితే, బావా! మంచం కిందెందుకు దూరావూ?

రం—నిన్ను భయపెట్టి గమ్మత్తు చేద్దామని!...... కుముదం, ఎంత చక్కగా పాడావు పాట! నువ్వు బాగాపాడగలవు—అయితే, కుముదం!— పాటలోని నీ "రంగుబావ" ఎవరు?— నాకు చెప్పవూ?

కుం—ఎవరో నువ్వే చెప్పు, చూద్దాం!

రం—(సిగ్గుపడి) నాకు తెలీదు.

కుం—నువ్వే, బావా, నువ్వే!

రం—(ఆనందంగా) నేనే?— కుముదం— నేనే!

కుం—ఆఁ! నువ్వే, ఉత్తరాలా, నువ్వే బావా!
(విలాసంగానూ, నొప్పెట్టేటట్లూ కూడా ఫడేల్మని రంగారావు చెంప చరుస్తుంది.)

రం—(బుగ్గ తడుముకొంటూ) ఓర్నాయనో! ఎంతదెబ్బ కొట్టావు! నొప్పెట్టింది!

కుం—నొప్పెటమా? నన్ను భయపెట్టే ఉద్దేశంతో మంచం క్రింద సెంటాకు దూరాలీ!... బావా, నాపాట విన్నావు, నువ్వొక్క పాట పాడవూ?— నువ్వు వ్రాసిందే పాడాలి, తెలిసిందా? ఆబెత్తు కుర్చీలో కూర్చో!

రం—నీప్రక్కలో కూర్చొని పాడుతా!

కుం—ఛస్— నోక్కల్లి ఉరుకుతూంటూను—

(రంగారావు బెత్తుకుర్చీలో కూర్చొని, రాగం అలాపించి సినిమాట్యూన్ వలె, ఏడ్పుతోకూడా, పాటఎత్తుకుంటాడు:)

ప్రేమలేని జీవిత మీభువిలో
వ్యర్థము, వ్యర్థము, వ్యర్థముగా, ఔను
ప్రేమలేని జన్మం బీధరలో
వ్యర్థముగా, వొట్టిదండుగగా!
ప్రేమయె కాఫీ, ప్రేమయె సిగరెట్
ప్రేమయె మామిడి పండూ— ఊ— ఊ— ఊ.
ప్రేమయె 'ఐస్ క్రీమ్' ప్రేమయె పెసరట్
ప్రేమయె కారాకిల్లీ — ప్రేమలేని

ఎలాగుందంటావు గీతం?—దీన్నే లిరిక్ పోయిట్రీ (lyric poetry) అంటారు, ఇంగ్లిషులో!

కుం—దానికి జవాబుగా నేనొకటి చదువుతాను!

రం—యెస్! సావధాన చిత్తుడను—కానీ, రానీ, నడిచిపోనీ!

కుం—(పాట):

బస్సు వచ్చిందండీ బస్సు వచ్చిందీ
బస్సువచ్చి బళ్ళవాళ్ళ కడుపునింపిందీ — బ
పెట్రోలుబస్సు వచ్చి
'కోల్‌గాస్' బస్సు వచ్చి
'కోల్‌గాస్' బస్సు బ్రతుకు
ఎల్లప్పుడూ తుస్సు తుస్-స్-స్! బ

రం—శేష్, భేష్! బాగుంది. ఇది పోయిట్రీలో రియలిజమ్! నేటి హరిదాసులు గుండె బాదుకోవాలి, నీపాట వింటే! కుముదం, బాగా రాశావు గీతం!

కుం—నేను రాయలేదు. మా నౌకాలు కొందు చెప్పుకుంటూ పాడుకుంటూంటూ డీపాట!

రం—అలాగా?— నువ్వు రాసిందేమో అనుకున్నాను!—అయితే అంత బాగాలేదు— వొట్టి బజారుపాట!

కుం—మొదట బాగుందన్నావూ! ఇందులో 'రియలిజమ్' ఉందన్నావూ! మనిషినిబట్టి కావ్య విమర్శ చేస్తారు. ఏం విమర్శకులు మీరు!

రం—నేను మరో గీతం పాడుతా, విను.

కుం-ఏదీ...... ...!

రం-(ఆలాపించి) :

నాతీవ్ర ప్రణయంపు టాకలికి,
కుముదమే కమ్మనీ భోజనంబూ -
నా వేడి ప్రణయంపు దాహానికి
కుముదమే మధురంపు 'కూల్ డ్రింకూ'—ఊ—
నాతీవ్ర

కుం—బావా, నీకు భోజనం, డ్రింకూ, భోజన పదార్థాలూ తిప్పితే ప్రపంచంలో మరి ఆలంకారాలు దొరకవూ?......అయితే, 'వేడి ప్రణయం' ఏమిటి బావా, 'వేడిఇడ్లీ' అన్నట్టా?

రం—(ఆక్రోశముతో) 'వేడి ప్రణయం'! - ఆహా!- 'వేడి ప్రణయం' ఎంత భావగర్భితంగా వుంది!- కాహాలకు ప్రణయం వేడి! ప్రపంచం వేడి! వెన్నెల వేడి! మలయమారుతము వేడి! ధ్రువ శీతలము వేడి! మంచుగడ్డ వేడి! విశ్వమే వేడి!

కుం—ఇక దుర్భాషలైన నీ 'వేడి'ని చాలించు ఈ ఇంట్లో మనం ముఖ్యమైన కార్యాన్ని మరచి పోతున్నాం నీ భావోద్రేకం చల్లార్చుకో! ఇటు చూడు!

రంగా- (నిద్రమత్తులో గొణుక్కున్నట్టుగా) ఆఁ. ఆఁ

కుముదం— మన పన్నాగం యెంతవరకూ సాగింది?

రం— మన ప్రొఫెసర్ విషయంలోనేనా ?— ప్లాన్ చక్కగా సాగిపోతూంది నీకేమీ సందేహం అక్కర్లేదు- [రహస్యంగా] ఒకపావుగంట క్రిందటే ప్రొఫెసరు మందుల పెట్టె సొరుగులో గడ్డకుప్ప వాగని దాచేశాను. ఇంకే విషంతాగి చస్తాడు? రాత్రి అతనిగదిలో ప్రవేశించి పెట్టెలన్నీ గాలించి, చాకులు, మంగలి కత్తులు, అతడి రవ్వలుంగరం, మొదలైన ప్రమాదమైన వస్తువులన్నీ తీసి దాచేస్తాను!

కుముదం— బావా, చాలా సమర్థుడవు నువ్వు!

రం— కుముదం! నువ్వు చెప్పాక నేనేపని చెయ్యను?

(తెర.)

దృశ్యము (ii)

[ప్రొఫెసరు గది రాత్రి 9½ గంటలవేళ. ప్రవేశము: ప్రొఫెసర్ ఈశ్వర్, తువాలుతో మూతి, చేతులూ తుడుచుకుంటూ. అతని వెనుకనే చప్పుడు చెయ్యకుండా, మొగానికి ముసుగు వేసుకొని రంగారావు ప్రవేశించి గదిలోని బీరువా వెనుక దాగుంటాడు.]

ప్రొ—(అటుయిటు పచారుచేస్తూ, తనలో) క్లబ్బులో మాంసంతూకి, హాఫ్ సైడల్ మూసియా— (హాస్యాలు పోట్లాడింపచేసి)—తోడైంది, అగ్గిమీద గుగ్గిలమన్నట్టు!......రంగారావు రాత్రి ఒంటిగంటకు కాని తన నిశాచర కృత్యానికి సంచారం ప్రారంభించడని నాకు కుముదం చెప్పింది. తలుపులన్నీ జాగ్రత్తగా వేసేస్తాను. (తలుపులు మూయును)...... ఈ వేళ నాకప్పుడే నిద్ర వస్తూందేం చెప్మా?... 12 గంటలకు అలారమ్ పెట్టి పడుక్కుంటాను (అలాగు చేయును)......"శ్రీ ఆంజనేయం,

ప్రపన్నాంజనేయం (పైకి కళ్ళు గొణుక్కుంటూ మంచంమీద వాలి)......శాకినీ ఢాకినీ గాలి దయ్యంబులన్ నిను వాలంబునం జుట్టి, నేలం బడంగొట్టి...(పండుకుంటూంటే తెర—)

దృశ్యము (iii)

[కుముదము గదిలో. రాత్రి పదిగంటలవేళ - కుముదమూ సూరాకాలూ మాట్లాడుకుంటూంటారు]

సూరాకా—మీకెందుకు. మీరు హాయిగా పడుకోండి—పొరుగు సాయెబుగారి నల్లకుక్కను మీ మంచానికి కట్టేస్తాను.

కు—ఆఁ సరే. నువ్వు మాత్రం ప్రొఫెసరుగారి గది దగ్గరే కాచి వుండు. లోపల కాస్త సందడి అయ్యేటప్పటికి కొంప అంటుకున్నట్టు 'దొంగలు, దొంగలో' అని గోల చెయ్యి!

సూరాకా—అలాగే!

(తెర)

దృశ్యము (iv)

[ప్రొఫెసరుగారి గది - రాత్రి 11 గంటల వేళ - ప్రొఫెసరు గుర్రుపెట్టి నిద్రపోతుంటాడు. బీరువా వెనకనుంచి ముసుగుతో రంగారావు చప్పుడు కాకుండా పైకి వచ్చి ప్రొఫెసరు ట్రంకుపెట్టె తెరచి, తొందరగా వస్తువులన్నీ కలతబెట్టి, రెండు మంగలి కత్తులు, ఒక కార్కు స్క్రూ, రవ్వల ఉంగరం సంగ్రహించి జేబులో వేసుకుంటాడు. ఇంతలో ట్రంకు పెట్టె మూత 'ధఢీ' అని పడి పెద్ద చప్పుడౌతుంది. ప్రొఫెసరు త్రుళ్లిపడి లేస్తాడు. రంగారావు నిలబడి నిశ్చేష్టుడై వుంటాడు.]

ప్రొ—ఎవరు నువ్వు? (మొలనున్న కత్తి తీసి) జాగ్రత్త!...... ఈ కత్తి......!

రం—(గొంతు సవరించుకొని) క్షమించాలి. మీకీ ఘోరకృత్యం తగదు!—నిషిద్ధమంతు! (ఒక్క అడుగు ముందుకు వేస్తాడు)-పరాయి యింట! (ముందుకు ఒక్క అడుగు వేస్తాడు).

ప్రొ—(భయపడి, నిలబడి, కత్తి ఆడిస్తూ) ఖబడ్దార్! మరొక్క అడుగు ముందుకు పెట్టావో, ఈ కత్తితో... ..

రం—అంతటికి సాహసం మీకు తగదు. నేను ఆటంకపరుస్తాను! (ముఖంబిగించి ఉద్రేకంగా) నా శరీరంలో శక్తి ఉన్నంతవరకూ, నా నెత్తురులోని ఉడుకు చల్లబడనంతవరకు, నేను నిన్ను నిరోధిస్తాను — మీరు కత్తి నా కంఠంలో... [illegible], బలవంతంగా... ..!

ప్రొ—ఇక్కడు!-ఇదే నాకు మిగిలిన ఆయుధం!-(రంగారావు [illegible]లోంచి కానవస్తున్న [illegible]) నేడ్లు మాకి, నా నేడ్లు లాగేస్తావూ?— నా వేలుపెట్టి నా కన్ను పొడుద్దామనుకున్నావూ?— దుర్మార్గుడా!

రం—ఆ కత్తి నిటు పారేస్తారా, లేదా?

ప్రొ—ఈ ఒక్క ఆయుధమైనా నాకుండనివ్వవూ? నన్ను నిరాయుధుణ్ణిచేసి, నా రేజర్లతో నా పీక ఉత్తరించేయాలని నీ ఊహ!

రంగా—మీమాటలు నాకు బోధపడటంలేదు! (తెరలో 'దొంగలు-దొంగలు' అను కేకలు ప్రొఫెసరుగారి గదితలుపు బాదిన చప్పుడు.)

ప్రొ— అమ్మయ్యా. బ్రతికాను!—ఆంజనేయులవారి కృపచేత! (రంగారావువైపే ముఖంవుంచి, కత్తి ఆడిస్తూ తలుపుచేసుకొని తొందరగా తెంచేస్తాడు. రంగారావు నిశ్చేష్టుడై వుంటాడు— ప్రవేశము నరసాయమ్మ)

నర— (ముసుగులో ఉన్న రంగారావువైపు తిరిగి) ఎవడ్రా, నువ్వు?

ప్రొ— ముఖాన్ని ఉన్నట్టి ముసుగుతీసి పరీక్షించండి!

నర— నూకాలూ!

నూ— (ప్రవేశించి) అమ్మా!

నర—నూకాలూ, ఈదొంగాడిముసుగు తియ్యవే!

నూ— అబ్బ, నాకు భయమేస్తాంది.

నర— భయం లేదు, తియ్యవే! (అంటూ రంగారావుచుట్టూ చేరుతారు)

నూ— (ముసుగుతీసి) అమ్మో! రంగారావు బాబు!

న— (ఆశ్చర్యపడి) ఎంతపని! వీడి వెర్రి కాలా!

ప్రొ—ప్రాణాలు తీసేవెర్రి!— సొత్తుఅపహరించే వెర్రి! రంగారావూ, నాపెట్టెలో నుండి ఏవే వస్తువులు సంగ్రహించావో టేబిలు మీద పెట్టు!

రం.-నేను-తస్క-రించ-లేదు! (జేబులోనుంచి ఉంగరం మంగలికత్తులు, వగైరా వస్తువులు టేబిలుపై నుంచును)

ప్రొ—నా మందుల పెట్టేది?

నూ—ఔను బాబయ్యా మీ పెట్ట రంగంబాబు గడ్డిసుప్పలో దాచడం నాను సూశానండి!

న—మందులపెట్టా?— ఎంత అపఖ్యాతి!— ఉంగరం, కత్తులు, మందులపెట్టె! ఎంత దారుణం—ఏమ ప్రతిష్ఠ!

ప్రొ—నా గదిలో దొంగతనంగా ప్రవేశించి, నేను నిద్రపోతూంటే, నా కత్తుల్తో, నాపీక ఉత్తరించేద్దామనుకున్నాడు!

న—(గుండె కొట్టుకొని) నిజంగానే?—నిజంగానే?—ఎంత గుండెలుతీసిన పనికి తెగబడ్డావురా!—హమ్మ!—హమ్మ!

రం—నే-లే-దత్తా! ఈయన ..ఆత్మ...హత్య!

న—ఎన్ని చిక్కులు చేశావురా? — ఎంత తెగింపురా నీకు!

రం—అత్తా!

న—నోర్మూయ్! చెప్పొద్దన్నా! ...నూకాలూ!

నూ—అమ్మ!

న—వేగం జట్కా ఒకటి తెమ్మను, నీ మొగుణ్ణి! (నూకాలు నిష్క్రమణ)

నర—ఒరేయి, వెర్రి పీనుగా!

రం-హా!, అత్తా!

న—నీసామాను వేగం సర్దుకో! జట్కా రాగానే నీ సామానుచ్చుకొని రైలుకి పో! ఒక్క నిముషం ఉండరాదు, తెలిసిందా! మీ వూరికి

ఫో!......ఛీ, నీముఖం చూడకూడదురా పాపిష్టి పెద్దమ్మా!

రం—రాత్రి రైలు లేదత్తా !

న—లేకపోతే స్టేషనులోనే యేడువు - అంతే!- మరి మాయింటి పొలిమేర కనిపించరాదు!— ఫో!

రం—నామాట విను అత్తా!...కుముదాన్ని...

న—నువ్వు దాని పేరు ఉచ్చరించకురా, చచ్చ పెద్దమ్మా! కుముదానికి నువ్వు తగవు! - ఫో! కదలవేం?

(రంగారావు విచారంగా నిష్క్రమణ)

న—ప్రొఫెసరుగారూ, మీరు శాంతించండి - ఇక మీరు నిశ్చింతగా వుండండి!

(తెర.)

ఐదవ రంగము

[కుముదం గది_సమయం అర్ధరాత్రి _ చిన్నదీపం _ గది తలుపు తీసిఉంటుంది _ కుముదం మంచం పైని నిద్రపోతూంటుంది _నల్లకుక్క మంచానికి గొలుసుచే కట్టబడి ఉంటుంది_ప్రవేశము: తొందరగా. రంగారావు]

రంగా—కుముదం, కుముదం !

కుముదం—(లేచి కన్నులు నులుపుకొని ఆవులించును. నల్లకుక్క మొరుగును. రంగారావు కంగారుపడును)—ఏంబావా, అప్పుడే తెల్లవారిందీ ?

రం—ముందా పెద్దపుకుక్కని ఊరుకోబెట్టు, నీకు చేతనైతే! దాన్నెందుకు తెచ్చారు, గదిలోకి?

కుం—నాకాలు కట్టిఉంటుంది_అమావాస్యరాత్రి, ఊర్లో దొంగాటకంగా వుందని...నాకాలేది చెప్తా?...బావా, ఏమైంది మన ప్రయత్నం?

రం—భగ్నమైంది ! సావకాశంగా చెప్పాలి... కుక్కని గొలుసేసి కట్టారా, లేదా ?

కుం—కట్టేవుందిలే, భయంలేదు_ చెప్పేంజరిగిందో?

రం—కథ అడ్డంగా తిరిగింది !

కుం— ఆఁ!... ప్రొఫెసర్ ఆత్మహత్య చేసుకున్నాడా యేమిటి ?

రం— లేదు, కాని...

కుం— విషం తాగేశాడేమిటి కొంపతీసి ?

రం— లేదు...

కుం— కత్తితో పొడుచుకున్నాడా ?

రం— లేదు, అతిడు దుక్కలాగున్నాడు !

కుం— అయితే, మన ప్రయత్నం ఫలించకపోవడమేమిటి ?

రం— నా ఘోష! అత్తయ్య నన్ను మీ యింట్లోంచి గెంటేసింది. నాకు 'దేవిడీమనా' చెప్పింది. నామీద అగ్గైపోయింది. నేను రైలుకి ప్రయాణం అవుతున్నా! జట్కా గుమ్మంలో ఉంది. సామాను పడేశారు !

కుం— (గడియారం చూచి) ఇప్పుడు రైలులేదే. మీ వూరికి ?

రం— లేకపోయినా స్టేషనులోనే పడుకోవాలి గాని మీయింట్లో ఉండడానికి వీల్లేదు. అత్తయ్యాజ్ఞ !

కుం— ఏమి ?

రం— అంతేకాకపోతే నన్ను దొంగకింద- హంతకుని కింద కట్టారు !

కుం— ఉన్నది ఉన్నట్టూ చెప్పలేకపోయావూ ?

రం—అనుకోకుండా పెద్ద మూతి దభీమని పడిపోయింది! నూకాలు గోల చేసింది - అన్నీ వాటంతట్టగా జరిగాయి. నాకు నోరగిసింది కాదు.

కుం—నీళ్లు నములుతావూ? కొంప మునిగింది!

రం—మునిగిన కొంప తేల్చవూ, కుముదం?

కుం—అసాధ్యం - ఇప్పుడు నేను చెప్పినా వాళ్లు నమ్మరు నిదర్శనాలతో కూడా పట్టుపడి పోయావు!

రం—[illegible]! ....!!

కుం—ఎంత ప్రమాదం జరిగిపోయింది!

రం—కుముదం, నీకు నాపైనున్న అభిమానం! మన యిద్దరి సఖ్యమూ ప్రాకిన ప్రేమలత! (కుక్కను ఎత్తుకొని మంచాన్ని సమీపిస్తాడు)

కుం—నీ కంగారులో అంతా అవకతవకగా పరిణమించింది! (కుక్కను కట్టిన గొలుసు విప్పేస్తుంది—కుక్క రంగారావుమీద పడబోతుంది)

రం—అమ్మయ్యో! కుక్క కట్టు విప్పేసుకుంది (పారిపోతూ) కుక్కను పిలవ్వూ, కుముదం!- కుముదం! (నిష్క్రమి)

కుం—వెర్రి బావా! నిన్ను చూస్తే జాలి వేస్తోంది! బావా, మితిమీరి ప్రవర్తించావు— గోడ లెక్కావు—గదిలోకి గెంతావు !— నేనేం చేసేది !—అగ్నివద్ద హద్దుమీరి ప్రవర్తిస్తే ఏమౌతుంది ?

(నూకాలు ప్రవేశిస్తూ)

నూకా—దేహం సురక్షితం-గాయమౌతాడు! (నవ్వును)

కుం—నూకాలూ, బావ వెళ్ళిపోయాడా, పాపం!

నూ—వెళ్ళిపోవడమంటే, అలాగా, యిలాగానా ? కుక్కభయం వెంటేసి గుమ్మంలోంచి తోటలోకి ఒక్కటే గంతేశాడు బాబు! (నవ్వును)

కుం—నూకాలూ, రాత్రి చాలా ఉంది, పడుక్కుందాంగాని, ఒక్కసారి వీణ యియ్యవే— నాకు పాడాలని వుంది.

(నూకాలు వీణతెచ్చును. కుముదం మంచంమీద కూర్చొని తంతులు సరిచేసి వీణె వాయిస్తూ పాడును)

కేదారగౌళ

బుద్ధికసాధ్యము భువిపై గలదే ?
జంతు భూతముల స్వాధీనపరచు-బుద్ధి—
ఘాతుకమృగముల, క్రూరజంతువుల
కైవసమొనర్చు ఘనశక్తి గలిగి
దివ్యశక్తుల సద్దీపింపంగను
ప్రభవముకల్గిన భవ్యమైన, మన-బుద్ధి—

(తెర)

గ్రంథాభిమానము

ఒక్క చెదపురు గెక్కడనుండి వచ్చి
చేరినదొ కాని, దానితో చేరె పురుగు
లిన్ని యన్నని చెప్ప నూహింపరాదు,
మట్టితో సారంగములతో పుట్టకట్టి;

ఒక్కనాటి మధ్యాహ్నమం దూరుకోక
పుస్తకాలను దులపంగ బుద్ధి పుట్టి,
బీరువా తీసి చూతుగా, పెద్ద పుస్త
కాలు జీర్ణించు కొనుచుండె కవులవలెను;

పుట్టలోపలి చెదల నే నట్టెచూచి
చేతులను చేర్చి అంటిని—"చెదలు కారు,
గ్రంథములు లేక దుఃఖించి కాలవశత
చచ్చి ఈ జన్మలో కోర్కె సఫల పడగ

చెదలుగా పుట్టినారు, మే మదయుల మయి
మిమ్ము చంపుచు నుంటి, మీమీద మీకు
మా నమస్సులు గ్రంథాభిమాన మిపుడు
నిలిచి యున్నది మీ యొద్దనే నిజముగ.

దీక్షితులు

రామదాసు

అక్కన్నం బిలిపించి జాబొసగి—"ఏమండీ మహామంత్రి వే
రొక్కం డైన వరించునే పదవి? ఎంతో యోగ్యుడంచుంగదా
వక్కాణించితి రీతనిం గురించి-వహ్వా! రామకైంకర్యమా!
రొక్క మ్మంతయు మ్రింగి త్రేన్చు పొగ రేరుంగూడ సైరింతునో!

తానీషా యన ఏమి తానెరుగు—నిద్దాగుండెపో వీడు, ఫ
ర్మానా యిచ్చిన దాది పైసయును చెల్లన్‌లేదు గోల్కొండకున్,
తానేమో, మరి దైవమేమొ-యిటు చింతాకంత లక్ష్యమ్ము లే
దీ నిర్భాగ్యుని ఏమి చేయువలె, పోనీ మీరె యోచింపుడా!

నే నేవిధి శిక్షించిన తానీషా దుష్టుడనుచు తలతురె కానీ
ఈ నేర మెంతు రెవ్వరు తానో భద్రాద్రిరామదాసయి పోవన్".

అని తానీషా పలికిన విని అక్కన, మీరు పోలు విధమున చేయుం
డని తలవంపులుగా మస మెరియ పసంపనై సమారిలిపోయెన్.

జారీకాబడి హుకుము జరూరై రెప్పపాటులో గోపన్నన్
కారా శీకర దృశ్యము ఘారాయిడె—తూర్పు తెల్లవారిన తీర్పే!

అది సభాస్థలి-మాటాడినది నవాబు వినియు-గోపన్న ఏమొ చెప్పను జవాబు
"తలపు మొకమారు జీవితాంతమ్ము ఖైదె శాస్తి సర్కారుకిస్తు గుజస్తుసేయ".

అన విని రామదాసు "ప్రభువా! తమ పైకము లక్ష లారు చె
ల్లిన దది వాస్తవమ్మె-లగులే పరమార్థ మటంచు నేను కీ
ర్తిని తమకై గడింపగను దేవళ మొక్కటి కట్టినాడ-రా
ముని వెలయించినా; నచటి మూర్తిని చూచిన చాలు సర్వమున్.

నలువురి శిల్పులం బిలిచినాను, కళానిధులన్న వారె-బీ
దల దనియించినా, నదియు ధర్మము మీయది-విప్రదక్షిణల్

కలవలె మీకె నిల్వ - అరకాసయినన్ వితపోవలే, దిదో
కలియుగ విష్ణుధామ మని కాదొ గమింతురు తైర్థికావళుల్.

సూటిగ మాటలాడిన హుజూరున నింతయు విన్నవింప నన్
మాటయె కాని వేరొక ప్రమాదము లే దదిగాక నాకు ఈ
పాటియుతోచదో - మరి శుభ ప్రశ్న చెప్పెడిదేమి, మీ దయన్
కూటికి వాయలేదె - అనుకోదగు నెట్టులు నన్ను నన్యథా".

కరగిపోయెను తానిషా కటికి గుండె; కాని రేపటినుండి యేగాని రాదు
అందరికికూడ ఇదియె దాలర్ష మగును, అని మనసుమళ్లి ఖైదని వినిచె తీర్పు

కళి[illegible]ంచినారు పస్తుని వీపున[illegible] ఉదుగద్దుష్టకు ప్రాణము పోవిల్ల
పనిపెట్టినార్ చింతబరికెలకుసు ఒగల్ రాటూడిపోయి రక్తమ్ము చిమ్మ
దండించి చనుపరా బందవెత్తిరి ఎమ్ము పెటుకులాడియు పిండిపిండికాగ
నిలిపినార్ మండుటెండల నిప్పులసుకలో ఉసికలై పాపముల్ బూరటిల్ల
అనుభవించును ప్రారబ్ధమనియె కాని ఎప్పుడసి కూడ దుసకు పల్లెత్తి యనడు
రామరామా! అదేలనో రామదాసు పదియు రెండేండ్ల కొంపపోజు పారుపోక.

"క్షమ పరియించెరా—శమము జారెను నాయెకి పెంజపస్థ కీ
రమునకున్నైన దాడిమ విలాసముగా లినిపించుమార—ప్రా
ణము కడబట్టినన్ మరతునా! యిదె భోజన ముప్పు ముద్ద పా
రము గనినానురా ఇవియెరా లొలి వాముల వస్న పాపముల్

పది రెండేడులు నిండు జామయినన్, రవ్వంబెట్ట నాకేమి నీ
వెదపై చేయిడి నిద్రపో మ్మనలు విన్నెవ్వాడు యాచించు అ
య్యదిరా చిత్రము! జానకీ హృదయ మెట్లయ్యెరా శిలాఖండ మో
ర్వదురా కాయము బాధకున్ ఇలదురా భారమ్ము భూదేవికిన్"

కిణకిణా గణగణా గణగణా ఝుణఝుణా ధణధణామని కోటతలుపు లదిరి
టకటకా టరటకా చకచక చ్ఛకచకచ్ఛక చకల్ మెరి నడుల్ సాగిసాగి
కిలకిలా కిలకిలా మిలమిలా జిలజిలా తళతళై విరునవ్వు తాండవించి
[illegible] జిగజిగేల్ ధగధగల్ దివ్యరోచులు చూపుతేరి నిలువ
నంచనారామ కుసుమ నిష్యంద మాధురులను మరిపించు వనమాల తెలియరాక
ఘుమఘుమై తానిషాయెద కొల్లగొనగ నయిరి రామయ్య [illegible] లక్ష్మయ్య ఒకడు.

ఇదేమి పైకము పువ్వుల పదిలించినయటు—రశీదు వ్రాయింపగదే
అదియేమి యట్టు చూచెద రిది యెవరో! రామదాసు లెంకలు వారో.

అని భాషించుట తడవుగ దొనద్దొనమని టంకసాల తోచిన విధమై
కనగా రాసులుగానై ధనమంతయు లెక్కపెట్టసగె సులభంబై.

కాంచెన్ కాంచన రాశి—కట్టెదుటనే కాంచెన్ మహాదివ్య శో
భాంచద్రత్న శలాకలన్, మరియు డోలాయత్త చిత్తుండునై
కాంచన్ మాననియట్లు తానగుచు, నిర్ఘాంతుండు తానీష అ
ర్పించెన్ ముద్రను హత్తి పత్రమును—చెల్లెన్ సొమ్ము ఝూడా యనెన్.

కనుమూసి తెరచులోపల కనరారును వారు వట్టికల యనిపించెన్
తను తా నమ్మక పోయెను ధనరాశి నిజమ్మటంచు తనకై చూచెన్.

అట గోపన్నయు జీవితమ్ము కడుచేదై పోవ చేదున్ కురం
గట సిద్ధమ్ముగచేసి రామపద సంకల్పమ్మునల్పమ్ముగా
అట రాముండును పాత్ర త్రోయుటలు నంతంతన్ రశీదుంచుటల్
తృటిలో సూర్యుడు కొండ నెక్కుటల నేమికాని తా చూడడా.

ధ్యానించి కన్ను తెరచిన తానుంచిన విసపుపాత్ర తలక్రిందాయెన్
పైన రశీదుం గనబడె తానీషా తానె పచ్చె తత్తరపడుచున్.

అపరాధంబును సైపుమం చెరగె సాష్టాంగమ్ముగా నాతడుఁ
అపరాధంబిది కాదు నీయది, నవాబా! యంచులేనెత్తి ఆ
కృపకుఁ పాత్రుడవీవె చూచితివి పో—శ్రీరామ పాదాబ్జము—
క్షపితమ్మయ్యెను పాపసంఘములు అక్షయ్యమ్ము పుణ్యమ్మహో.

అను రామదాసు బంధనము సూడగపుచ్చి అభ్యంగనమ్మున కానతిచ్చి
సరిక్రొత్త పట్టు వస్త్రములను కట్టించి మృగమదమ్మును పుస్తి మేన నంట
నానావిధానేకసూన సంకలితముల్ హారముల్ గళమునం దమరజేసి
దంతావళమ్ము మెత్తనిపాన్పు నమరించి అందు నూరేగించునంత సేపు
ప్రజలు హర్షాన దివ్యహారతులనెత్త మోదవార్నిధి తానిషా మునిగితేలి
అర్పణము సేసి మణుల రామార్థమనుచు పంపెనాతని రాణతో భద్రగిరికి.

నేటికి—ఆకల్యాణమునాటికి—శ్రీ భద్రగిరికి, నాగేంద్రముపై
పోటరి నవాబుసంతతి పాటియె—ముత్యాల సేసబ్రాల్ తెచ్చుటయుఁ

పైడిపాటి సుబ్బరామశాస్త్రి

నా కెందుకులే

(Vibgyor నుండి)

సింగరాచార్య

దుర్యోధను దుబ్బుక్రాపు
తూరుపుగా పోయిపోయి
పెరిగి పెరిగి పెరిగి పెరిగి
పెరిగి పెరిగి
నలుదెసలూ నావంటే
ఎలాగ్గొస్తు గొస్తాయని
తొలిగి తొలిగి తొలిగి తొలిగి
తొలిగి తొలిగి
పోటూన్నది
తెలివిలేని ప్రజ—
తెలిసిన మంగళ్లంతా
కులాసాగ కూచుని పొగ
చుట్టలు తగలెయ్యండోయ్
తగలెయ్యండి !
అయినా నా కెందుకులే
నా కెందుకు
నవ్యకవికి !

టపాకాయి పేల్చటమో,
తపాలాల కాల్చటమో
పిరికి మోతుబరులారా !
పిల్లలు మీకంటె మెరుగు
పిల్లలు మీకంటె నయం !
అయినా నా కెందుకులే
నా కెందుకు
నవ్యకవికి !

అల్లదిగో అదె చూడం
అల్లదిగో అల్లదిగో
దిగొస్తూంది దిగంతాల
దిగొస్తూంది దివ్యకాంత
దివ్యరత్నకోటి ఛవి !
దిగిరా దిగిరా తల్లీ !
దిగిరావమ్మా !
సమర రాక్షసాకృతివో !—
శాంతి దేవతా మూర్తివో !—
తల్లీ ఒక టడుగుతాను
తప్పించక చెపుతావ్ ?—
నీ చేతుల్లో దేమిటి—
వీరులకోసం Beer + ఆ ?
భీరులకోసం విషమా ?

అయినా నా కెందుకులే
నా కెందుకు
నవ్యకవికి !

నేను

బి. వి. శ్రీనివాచాసార్య

(మొన్న పుట్టిన రోజున వ్రాసుకొన్నవి)

ఇరువది రెండు ప్రాంగణము లేను గమించితి, జీవితంపు ధా
సుర భవనమ్ము నందిపుడు చూతుగదా—గడియించుకొన్న ఆ
భరణము లెవ్వియేని గలవా—అని, కన్నులు చెమ్మగిల్లు, అం
తరమున కానుపింపదు హృదబ్జము రాగిలు కాంతి రేకయున్.

ఏ యతిలోక సుందరి అహీన కృపామధురావలోకన
శ్రీ యొక నావగా బ్రదుకుసింధువు నీద దలంతు, ఆ సుధా
గాయని, దివ్య రమ్య నవ కావ్య విలాసిని అంది అందన
ట్లే యెసగున్-కలంచి, మురిపించును జీవిత మెల్లరీతులన్.

పక్కి గముల్ బలెన్ గగన భాగమునన్ విహరింప నెంతు; నా
రెక్కలు లేని దుర్గతి స్మరించి, తపించి, కృశించిపోయెదన్;
చిక్కని ఈ తమిస్రములు చీల్చెడు రిక్క యొకండు లే దిటుల్
ధిక్కృతియున్ నిరాశయును తృష్ణయు నిత్యములై దహించునా?

నలువురు పోవు త్రోవను చనన్ మనసొప్పదు, కంటకోరగో
చ్ఛలిత భయానకాధ్వముల చాయల వెంబడి పోయి పోయి, క
న్నులకు క్షణక్షణాధిక మనోహర సీమల చూపి చూపి, శాం
తిలగ దలంతు; ఈ వికృత తృష్ణ శమించుట ఎన్నడో కదా?

ఈ నిముసాన పొంగెద, మరించుక సేపటికే విషాద పా
థోనిధి భంగమో గదిసి దుఃఖభరమ్మున కృంగిపోయెదన్;
తా నొక మాంత్రికుం డెవడొ నా యెద నూయెల లూచుచుండె; మా
యానిబిడాటవిన్ గడచి ఆవలి పారము చేరికొందునా?

సిపాయి

నీ చిందిన నెత్తురు బాట
రారాజుల నవ్వులతోట;
నీ త్రెళ్లిన గ్రుక్కెడు ప్రాణం
సామ్రాజ్యాంగపు తొలి సోపానం;
నీ అస్థులు విస్మృతిపాలై,
యుగసంధుల వంతెన లైనై

దేవుడనని త్రుళ్లి మసంగే
మానవు నెదలోతుల పొంగే
హింసారత శోణిత ధునికై,
రహదారులు తీరుచు పనికై,
నీ గుండెల క్రోవులు మలచాం;
నీ బ్రతుకున కాల్వలు దొలిచాం.

... .

రంభా రతికేళి పసందూ
రణవీరస్వర్గం ముందూ,
దేశభక్తి పరదా లుంచీ,
కీర్తిమెరుపు తెర చూపించీ,
నీ కళ్లకు గంతలు మూశాం;
నీ చెవులకు గడియలు వేశాం.

నీ వలెనే ఆకలి వ్యధలో
తనువమ్మిన తమ్ముని యెదలో
నీ దూసిన నెత్తురు బాకే
వినివచ్చినకథ విననీకే
రణభేరికలో ఉద్రేకం!
రణ గీతికలో ఉతేజం॥

శాంతి గురియు చల్లని వేళ,
రణకుండము రగిలిన వేళ,
శ్రీమంతుని బొమ జాడలలో,
సామంతుని అసి నీడలలో,
అర్రాకరి నివాళు రెత్తావ్;
అస్పృశ్యుణా లాహుతు లిచ్చావ్.

... ...

జయశాసనగత ప్రాశస్త్యం,
చరితాత్మక జాత్యౌన్నత్యం;
కీర్తిలతా సుమాళి మాకు;
పేరు లేని సమాధి నీకు,
నరజీవన స్రుత విషపాయి!
నీ కివె జేజేలు సిపాయి॥

కొనకళ్ల వెంకటరత్నం

అపస్వరం

కొనకళ్ల వెంకటరత్నం

బ్లాక్ అవుటు (Black-out) వెలుగులో క్లబ్బు నిర్జీవంగా నిలబడిపోయింది. ఏటి గట్టున తోటలన్నీ జిమ్ముమంటూ నిశ్శబ్దమై పోయాయి. క్లబ్బుమాత్రం కొత్తసున్నపుగోడలతోటీ, పాలగచ్చు వరండాల తోటీ, చీకటిరాత్రి ఎంత నమిలినా మ్రింగుడు పడక అస్పష్టంగా అవుపిస్తోంది. గేటుదగ్గిర మోటారుహారన్ వినపడ గానే కునికిపాట్లుపడుతున్న బోయ్ (Boy) ఉలిక్కిపడి లేచాడు. ఆ వేళ కౌముదీ థియేటరులో, సరండేవసతి భరత నాట్యానికి క్లబ్బు మెంబర్లంతా వెళుతున్నారని తెలిసికూడా, డాక్టరురాజు, రావాలని, క్లబ్బుకి ఆలస్యంగా వొచ్చి నట్టు అవుపిస్తుంది. క్లబ్బులో సందడి ఏమీ లేదు. అంతా నాట్యానికి చక్కా వెళ్ళేరు. సోనారాణి వొక్కర్తే మాత్రం, ముఖమల్ సోఫా దగ్గిరికి లాక్కొని బిలియర్డు టేబిలుమీద తలానించి, మాగన్నుగా నిదరపోతోంది. ఆమె సబ్ జడ్జి 'పాథీ'గారి సతీమణి.

డాక్టరు లోపల అడుగు పెట్టగానే పాంపేను వాసన గుప్పుమంది. కప్ బోర్డులో అయిస్ క్రీమ్ బిస్కట్లూ, ఛాకలెట్లూ, ఛిప్సూ, రకరకాల సిరప్పులూ, జిన్నూ, ఇతరమైన ఫలహారాలూ, పుష్కలంగా వున్నాయి. భరతనాట్యమయిన తరువాత క్లబ్బులో చిన్న పిక్నిక్ కూడా వుంది గాబోలు అనుకున్నాడు. సోనారాణి పక్కనే, చిన్న స్టూలు మీద, ట్రేలో టీకెటిలు చాలా వరకు ఖాళీ అయినా, దాని అట్టడుగున మిగిలిపోయిన స్పెన్సరు టీ గుటకలు మాత్రం గది నింకా వదలిపెట్టలేదు.

"బోయ్—" అని పిలిచాడు డాక్టరు.

క్షణంలో వచ్చి వ్రాలాడు.

సోనారాణి వంక చూపి ఒక్కర్తే ఎందుకుండిపోయిందన్నట్టు తలపంకించాడు.

బోయ్ సమాధాన మిచ్చాడు.

"అమ్మగారికి తలనొప్పిగావుంది..."

ఇక అర్థమయిందని వారించాడు డాక్టరు,

ఆమెకు నిద్రాభంగమవుతుందనో యేమో. తరువాత గ్లాసులో మిగిలిన షరబత్తు బోయ్‌కిచ్చి:

"చూడు — ఇది తాగేసి ఫెన్‌బోర్డూ గట్రా సర్దెయ్యి—తలుపులు తీసి పడుకో" అని హెచ్చరించి సర్జికోటు వేసేసుకుంటున్నాడు, వెళ్ళిపోడానికి సిద్ధపడుతున్నట్టు. షరబత్తు వాసన తగలగానే బోయ్‌కి నిదర తేలిపోయింది. కాని గ్లాసు డాక్టరు తనకందించే ముందు నాలుగు జిన్ను చుక్కలు కూడా మిళాయించినట్టు వాడికి తెలియదు పాపం. వాడికి తెలియకపోయినా దానిపని అది మానలేదు. పక్కగదిలో కారమ్సు బిళ్ళలు అయివరీ కేసులో సర్దబోయి, తెరచివున్న అద్దాల బీరువా తగిలి, తూలి జోరగిలపడ్డాడు. ఆ పడక పడక పరిచివున్న హెక్సాగనల్ టేబిలు మీద, చెదిరిపడిన చైనా లేస్ పింగాణీ ముక్కలమధ్య, తెరిచివున్న ఓరియంట్ మేగజన్‌లో, బష్టపో ఎడ్వర్ జైజమెంటు బొమ్మ ఉన్న పేజీమీద, ఆలాగే మత్తుగా వొరిగి చక్కా వూరుకొన్నాడు.

ఒంటరిగా వుండగా చూచుకుని, డాక్టరు సోనారాణికి దగ్గరగా కూచుని విలాసంగా ఆమెవంక చూస్తున్నాడు. ఉన్నతమైన ఆమెవక్షస్సు టేబిలు అంచున తాచుకుని, పక్కలకి బాగా పొంగారి, ఆమె నున్నని మెడక్రిందివరకూ చిక్కగా కమ్ముకుపోతూంది. ఆ ఒత్తిడికి బాగా వొరుసుకున్న రొమ్ములనడుమ, మెడకి దిగువని, సిల్కు జంపరు పలకల కత్తిరింపుల కూడలిలో, ఏర్పడిన సన్నని లోయలోనించీ యౌవనపు మిసమిసలు తొంగిచూస్తున్నాయి. బోయ్ గుర్రుకొడుతున్న చప్పుడు వినపడగానే సోనారాణికి కళ్ళు తెరుపులు పడ్డాయి. మాటిమాటికీ మూతలు పడుతున్న ఆకనుకొలుకుల్లో రెపరెపలాడేది నిద్రాశేషమో, లేకపోతే యౌవ్వనపు మైకమో, స్పష్టంగా చెప్పలేము. ఆ చూపుల్లో అసలు అతను వొచ్చినందుకు బుఃఖపాటమూ, ఆలస్యంగా వచ్చినందుకు అలకా పెనుగులాడుతున్నాయి. అతను సర్దిచెప్పబోయాడు. ఆమె వారించింది. ఇద్దరూ కలిసి నిశ్శబ్దంగా ఏటిగట్టుకి నడచి వెళ్ళు

తున్నారు.

"నేనేమో మధ్యాహ్నంనించీ తలనెప్పి అని వంకబెట్టి చూస్తూకూచోవాలి - నువ్వుమాత్రం వాళ్ళంతా వెళ్ళిన గంటకి—"

"ఎలామరి? పెందరాళేవస్తే తీరావాళ్ళంతా ఇంకా బయలుదేరకుండా వున్నట్టయినా, నన్నుకూడా బలవంతపెట్టి తీసుకుపోతారాయెను—అంచేత వొక ఘడియ ఆలిస్యమయినా, వాళ్ళపాటికి నా కోసం ఎదురు చూడడం మానుకుని థియేటరుకి వెళ్ళిపోయి వుంటారని ధైర్యం చిక్కిన తరువాత చక్కా వచ్చాను చూడు..." ఎంతసేపటినించో వల్లవేసి కంఠస్తంచేసినట్టు వప్పగిస్తున్నాడు.

సమాధానం పడింది.

పక్కనే నడుస్తున్న అతని నడుముచుట్టూ తన చేతులు పెనవేసి తల పైకెత్తి నవ్వుతో చూచింది అతనివంక. అతని మనస్సు కుదుటపడింది.

మళ్ళీ నిశ్శబ్దం.

దగ్గర పడుతున్న మధురక్షణాలు పాడే స్వాగతగీతికి ఆ రెండు హృదయాలూ శృతి కలుపుకుంటున్నాయి. ఎన్నాళ్ళ నించో విశ్వప్రయత్నాలు చెయ్యగా చెయ్యగా నేటికి విరబూసిన కోరికల గుబాళింపుల్లో ఉక్కిరి బిక్కిరవుతున్నారిద్దరూనూ. ఏటిలో దాగుపుల ప్రక్కని వొంటికాలిమీద నిదరోతున్న బాతులు తొలకరివానకి రెక్కలు చాచి, చెల్లాచెదరై కాళ్ళ కడ్డంగ పడుతున్నాయి. ఏటి కవతల కోరడి ప్రక్కని తమలపు తీగెలు కాళ్ళకివేసిన సంకెళ్ళు విదలించుకొని, వేళ్లాడే మర్రివూడల చాటుని, ఇసకలో, మసకలాడే నాగుపడగల నీలికళ్లా, ముసిముసి నవ్వుల్లో, అంతులేని గుసగుసల్లో, కరిగిపోయే ముద్దుల్లో, కన్నుమూశారు పక్కతోటలలోనించీ పరువొచ్చిన నిమ్మపళ్ళవాసన ఇద్దరి రక్తంలోనూ సమానంగా పనిచేస్తూంది.

'రాజూ!'

ఆమె నున్నని చెంపలూ, పెదిమలూ, తాకుతున్నాడు వేళ్లతో. మాటలు భరించలేని మైకంలో అతని చైతన్యం

మునకలు వేస్తూంది.

'రాజూ—ఒక్కమాట అడుగుతాను'

'ఒకటికాదు పదిఅడుగు'

'చూడు — నా మీద నీకెందుకింత ప్రేమ ? 'నీకో' అని అడగకు!'

ముందరికాళ్ళకి బందం !

'చెప్పనా?'

'చెప్పు'

'ఒకటి నీ లావణ్యం'

'రెండు? '

'నీ యౌవనం'

'మూడు? '

'నీరసికత్వం—ఇందులో అన్నీ వస్తాయి'

'సరేగాని— మీఆవిడ ఎలావుంటుంది నీకు?'

'కమలా? నీరూపురేఖల ముందు దిగ దుడుపు—నీ చెలాకీ ఎక్కడ, నీ—'

'అంటే కమల వట్టి చచ్చు పీనిగన్న మాట ? అంతేనా ?' కిసుక్కురుమనడు.

కోపంగా అడుగుతోన్నట్టుంది—ఎందు కనో ?

'అయితే రాజూ, కమల అంత అస హ్యంగా వుంది గాబట్టి— నా అందం చిందిపోతూ అవుపించిం దన్నమాట నీకు—అంతేగా—'

'ఛీ - అదికాదు—'

'కాదేమిటి ? చచ్చు అందాలముందు అంద మనిపించుకునే అందమన్నమాట నాది'

'ఛ—నీకూ దానికీ సహాపత్యమేమిటి?'

'కమల ఏమాత్రం అందంగావున్నా నావంకచూడక పోదువు. అవునా ?'

'ఆహాహారించి నట్టుంది'

ఇలా తిరిగిందేమిటి ?

సళ్ళుతున్న కౌగిలి లాలనగా బిగించి గట్టిగా అదుము కుంటున్నాడు—బుజ్జగిస్తో.

'నిజం చెప్పమంటావా రాణీ ?'

'అంటే ఇందాకటినించీ అబద్ధాలు చెబుతున్నావన్నమాట.'

గతుక్కు మన్నాడు.

'నిజానికి కమలకూడా చాల రూపసి'— ప్లేటు మార్చాడు.

'చాలా రూపసి ?'

'చాలా చురుకైంది—సరేనా'

'చెప్పు—ఇంకా—'

"అదుగో నీతో ఇదేచిక్కు ...—"
సముదా యిస్తున్నాడు.
'ఎంతయినా నిన్నుమించే అందం కాదుగా'
మాట్లాడదు.
ఏమిటీబాధ ? ఇంకా ఏమిటీ అభ్యంతరం ?
'మరి నేనెందుక్కావలసి వొచ్చాను ?'
దొరికాడనుకుంది.
'నీ అందం వేరు'
'అంటే ?'
'నీదగ్గర ప్రత్యేకమైన ఆకర్షణ ఏదో— అయినా ఈ ఆరాలెందుకు ?'
'సరిగ్గా నాకుమల్లేనే నువ్వుకూడా'
'ఎందులో ?'
'మా ఆయనా చక్కని వాళ్ళలో లెక్కపెట్ట వలసినవాడు—కాదనలేవు; అవునా ?'
'చుంచుమొహమూ వాడూను'
'అలా అనకు. ఆచురుకుతనమూ, ఆ తెలివి తేటలూ—'
'కమల రూపసి' అన్నందుకు కసితీర్చుకుంటోంది.
'నాకు నమ్మకంలేదులే—రాణీ'
'దేనిమీద ?— అదుగో మొహం చిట్లించకు ?'
'నువ్వు అనేమాటమీద నీకు విశ్వాసముందని'
'ఎంచేత ?'
'మొగుడిమీద అంత ఆకర్షణవుంటే నాదగ్గర కెందుకొచ్చావు ?'
'నీఆకర్షణ వేరు. టెన్నిసు ఆడేటపుడు పాయింటు పోయినా నువ్వు బ్యాట్ విసిరేటప్పటి గ్రేస్‌చూచి—సరేనా ?'
మెడచుట్టూ వెచ్చగా ముద్దులు పెట్టేసుకొంటో, చేసిన గాయాలకి చెప్పకండా మందు చల్లేస్తోంది.
'అయితే రాజూ, కమలకంటే నాలో అదనంగావున్న ఆకర్షణేమి టంటావు ?'
'రసికత్వం'
'అంటే నలుగురి కానందమిచ్చి నాలుగు రకాల అనుభవించగలగడ మన్న మాట—అంతేనా ?'
'అంతే.'
'తెలీకడుగుతాను — రసికత్వమంటే చలాకీ, తెలివి, చమత్కారమూ, గట్రా——అవునా ?'
'అన్నిని'

‘చురుకుతనమూ, చమత్కారమూ, హొయలూ, సుగుణాలేనంటావా?’

‘తప్పకండా’

‘అయితే రసికత్వమూ సుగుణమే కావాలి’

‘అయితే అవుతుంది—దేని కీసొద ?’

‘ఏమిటోనోయ్ రాజూ, నే నేదో పాప కూపంలో పడిపోతున్నాననీ, చెడిపోతున్నాననీ, ఇదిగా వుంటుందోయ్’

‘ఛ—నువ్వు చెట్ట మేమిటి? నువ్వు శృంగార రసాధిదేవతవు — నువ్వు వరాలు గుప్పిస్తే, నీ పాదాల దగ్గర దేహీ అంటూ......’

‘చాల్లే కవిత్వం’

ఇక సందేహాలన్నీ తీర్చేశా ననుకుంటున్నాడు.

‘అయితే రాజూ—’

మళ్ళీ మొదలు. వినిపించుకోడు.

‘ఈవేళ నువ్వూ నేనూ లేక టెన్నిసుకి Hands తక్కువై పోయాయిస్మీ’

అమ్మయ్య, సంభాషణ మార్చింది.

‘మీ ఆయనకు వూసు పోలేదు గావును’

‘కమలను ఆడమన్నాను’

‘కమలా! దానికాట రాదుగా!’

‘ఏదో——’

‘అయినా అది అలా ఆడదు. దానికి నచ్చవు మొగాళ్ళతో ఆటలంటే’

‘అవును. ఎప్పుడూ ఆ చివరవాడిగి కూచుని ఏ ‘ఇలస్ట్రేటెడ్ వీక్లీ మాగజైనో’ చూస్తూ కాలక్షేపం చేస్తుంది’

‘అసలు వీళ్ళేవళ్లతోనూ మాట్లాడనే మాట్లాడదు’

‘అవును. మంచి నిదానమైన పిల్ల’

‘చాలామంచిదిలే—అసలు వాళ్ళసిస్టర్సు అందరూ అంతేలే’

‘ఎవరు?’

‘రాచర్లవారి ‘ఫేమిలీ’ ఎరగవూ? అగ్నిహోత్రం లాంటి కుటుంబంలే’

‘కాని, ‘ఆడతావా’ అని అడగ్గానే వొప్పుకుంది స్మీ’

‘నువ్వు బలవంతపెట్టి వుంటావు’

‘ఛ—నాకెందుకూ? అయినా, రాజూ, నాకెందుకులే?’

నీకోపం మోస్తుందేమో.

‘ఛీ—అడుగు.’

‘కమలకిమాత్రం రసికత్వంలేదంటావా? తెలివి, చురుకూ, ఆకర్షణా అన్నీ వున్న తరువాత——’

'అది అట్లాంటిదికాదు, నాకు బాగా తెలుసు. నేనంటే —— ——'

మొగాళ్ళంతేగా! కిసుక్కున నవ్వింది.

అతనికి విసుగ్గావుంది.

'రాజూ, నీకెందుకంత వుక్రోషం? నాలోవున్న రసికత్వాన్ని ఆరాధించగలవాడివి, కమలలో—— ——'

'రాణీ, నీకు మతిపోతోంది'

మళ్ళీ నిశ్శబ్దం.

'అసలు ఎంతో బలవంతపెడ్తాదగాని దాన్ని క్లబ్బులో చేర్చలేక పోయాను తెలుసా'

'రాజూ, నీవ్వెంత అసందర్భంగా మాట్లాడుతున్నావో నీకు తెలీడం లేదు'

మళ్ళీ యిరుక్కున్నాడు.

'నేను రసికురాలననీ——'

'కాదన్నానా?'

'నిన్ను స్వర్గానికి పిలుచుకు పోవడానికి వొచ్చిన దేవతననీ——'

'పిలుచుకుని వెళ్ళి ఆనందానికి హద్దులు చూపించగలననీ——'

'ఇంచేత నీ కెంతో గొప్పగా అవుపిస్తున్నాననీ వొప్పుకున్నావ్'

'అవును'

'మరి—— స్తబ్ధుగావుండి, పీనాసిగా నీ వొకడిమీదనే కళ్ళు పెట్టుకునివుండి, మహాపతివ్రతలా వుండడమూ, ఒక గొప్పేనని చెప్పుకుంటూ పోతున్నావు, అవునా?'

కొంప మునిగింది. లోపల వూ మధన పడుతున్నాడు—సర్దుకోవడ మెట్లాగా అని. ఈ ధర్మ సందేహాలు తన కెప్పుడూ రా లేదే?

'చెప్పూ, ఏదినిజం?'—జబ్బలు కోపంగా వూ యిస్తో అడుగుతోంది.

'ఏమిటోనబ్బ—— నాకు తెలియదు. రసికత్వమంటే సుగుణమో, దుర్గుణమో, నేను చెప్పలేను. అది నీకొక్కవాలి; నాకొక్కవాలి. ఎందుకొచ్చినగోల—— యిద్దరమూ హాయిగా—— ——అయినా, సుగుణాలుచూచి అసలు మోహించడమంటుగా.

'తప్పించుకోకు'

'వెధవమాటలు —— వొత్తి మూగమాటలు. అర్థమయి చస్తాయా వొట్టు

న్ని—జంతువులు నయం. ఈ దిక్కుమాలిన ప్రస్తావన లేకుండా—అయినా, తెలీక అడుగుతాను—అర్థా లెందుకూ? వెధవగోల! ఆ అర్థాలేమిటి అనుభవించి యూడనక—చంద్రగ్రహామో, వృషగ్రహామో, తెలిస్తేగాని వెన్నెట్లో హాయి అనుభవించలేమా?'

'అంటే, ఇందాకటినించీ, అర్థంలేని మాటలు ఏది పీలైతే అది వాగుతున్నా వన్నమాట, అంతేనా?'

నిజమంతే—మళ్లీ ఎందులోనో ఇరుక్కుంటున్నాడు! ఇందాకటినించీ ఏది నిజమా అనే ఆలోచనే పట్టలేదతనికి, ఏది జెపితే అనుకూలంగా వుంటుందా అనే ధ్యాసతప్ప.

'రాజూ'

ఇంకా కొద్దసేపు పిచ్చి. కమలంటే ఎందుకో ఈవిడ కంత దుగ్ధ—దానిమీద పట్టించిం దేమిటి? కమల చెడ్డదని రుజువు చేసేందుకు మహా తంటాలు పడుతూంది—లేకపోతే తృప్తి వుండదు గావును.

'ఇవ్వాళ కమల చాలా ఇష్టంగా ఆడిందిలే టెన్నిసు?'

'ఎవరితో'

'చెప్పేనుగా. మా ఆయనతో'

'నేను నమ్మను'

'ఏమిటినమ్మవు? మా ఆయనతో ఆడిందనా? ఇష్టంగా ఆడిందనా?'

'ఇష్టంగా ఆడిందని నీకెలా తెలుసూ?'

గాబరాగా.

'పోనీ, మా ఆయన ఇష్టంగా ఆడారు. సరేనా. ఆయనకి కమలంటే ప్రీతేగా'

'నీతో చెప్పేడా?'

'అవును. ఆసంగతి కమలతో నేను తరుచూ చెబుతో వచ్చాను—కూడా.'

'అబద్ధం. నాతోటి కమల చెప్పకుండా వుండదు — నువ్విలాంటి మాటలు దానితో చెపుతున్న సంగతి నిజమే అయితే—'

'అప్పటినించీ, నేను కనిపెడుతున్నాగా, మా ఆయనంటే కమలకి కూడా——'

'రాణీ—మనుష్యుల్ని నీ ఇష్టమొచ్చినట్టు అర్థంచేసికొంటే, నా అభిమానం గాయపడుతుంది'

తీవ్రంగా కోపమొచ్చిం దతనికి.

'ఇవాళ టెన్నిసు వుబలాటంగా ఆడిం దని కాదులే——ఇంకావుంది——

నా కెందుకూ ఈ కుమ్మరం పైగా వున్న మాటంటే——'

'చెప్పు—చెప్పాలి—చెప్పితీరాలి'

'చెప్పనీ, తొందరపడకు — సాయం కాలమేమి జరిగిందో తెలుసా ?'

'ఏమిటి ?'

ఆతని గుండె ఆగింది.

"నాట్యానికి వెళ్ళేముందు ఒక కారులో మొగాళ్ళంతా చక్కా పోయారు. ఇంజనీరు కార్లో రావూ, రావుభార్యా, శర్మా ఆతని భార్యా, ఇరుక్కున్నారు. నాకు తలకాయనొప్పిగా వున్నదని వుండిపోయాననుకో, కమలమాత్రం ఖాళీ లేదని వెనక్కి వుండిపోయింది."

"నేను చెప్పలే. అది తీసుకొని వెళ్ళలేదు. రాసుకుని తిరగటమంటే దానికి సుతలామూ గిట్టదు. అందులోనూ అంత తొడతొక్కిడిగా కార్లో మొగాళ్ళతోటి——"

'ఆకారు క్రిక్కిరిసి పోయిందని కాదు— వెనక్కి తగ్గుతా.'

'మరి ?'

'మా ఆయన కారు ఖాళీగా వున్నదని'

'ఎందులో ఎక్కింది చివరికి ?'

'మా ఆయన కార్లోనే — ఆయన పక్కనే——'

'నేను నమ్మను'

'నమ్మకు. మనకి బాధగావుండే వన్నీ కూడా నమ్మకుండా వుండగలగడం సాధ్యమైతే, నిశ్చలంగా, నిర్భయంగా— ఇప్పుడు బవుశా మా ఆయనా కమలా థియేటరులో ఒకళ్ళపక్కనొకళ్ళు కూచుని కిలకిల లాడుతూ వుంటారు లే. అన్నట్టు ఆయన సంగతి తెలియదూ నీకు ? సమయం చిక్కితే——'

'ఛ—ఏమిటి ?' అతని మొహం జేవురించింది.

'రాజూ, నీ పిచ్చిగాని, కమలానికి మాత్రం మా ఆయన్ని ఇలా ముగ్గు పెట్టుకోవాలని వుండదూ ? ఆయనా రసికుడే—నాకు తెలీదూ ?' గట్టిగా హత్తుకొని అతని పెదిమలు కసిదీరా ముద్దు పెట్టుకుంటోంది.

భగభగమంటున్న రోషాగ్నిలో వొక స్త్రీ తనంతట తానిచ్చే కౌగిలింతలో

వుండే లిపిని నిస్సాకారణంగా వాదులు కుంటున్నాడు తను.

చీకట్లో సోనారాణికి తెలియటంలేదు.

"అయినా, రాజూ ఇటుచూడు——కమలనీ మా ఆయన్ని మెల్లిగా కలిపేస్తే, మనిద్దరమూ విచ్చలవిడిగా———"

గారాలు కుడుస్తోంది.

ఛెళ్ళున లెంపకాయ కొట్టాడు.

'దుర్మార్గుడా !'

మళ్ళీ వెనక్కి తిరిగి చూడలేదు. తిన్నగా థియేటరుకి వెళ్ళాడు కార్లో. నాట్యం సగమయిందో లేదో, కమలని రమ్మనమని, చప్పున కార్లో ఎక్కించుకుని, సరాసరి ఇంటికి తీసుకుపోయాడు. మాటా లేదు. మంతీ లేదు. కారణం చెప్పడు !

మర్నాడు డాక్టరు రాజూ, కమలా, ఇద్దరూ క్లబ్బు మెంబర్షిప్‌కి రిజైనిచ్చారు. ఎందుకో ఎవళ్ళకీ బోధపడలా.

ఏకాంక నాటకాలు

శ్రీపాద గోపాలకృష్ణమూర్తి

ఆంధ్ర వాఙ్మయ వసంతోదయంలో ఖండకావ్యం, కథానికా తొలిపూవులు. ఏకాంక నాటకం మలిపూత. ఖండకావ్యంలాగు, కథానికలాగు అనువాదాలతో ప్రారంభించ లేదు 'నాటిక'. ఆంగ్లనాటికలూ, వంగనాటికలూ, ఏవిగాని వరవడికూడా కాలేదు తెలుగు నాటికకి. నాటికా కవులు ఆంగ్లనాటికలూ, వంగనాటికలూ పెక్కులు చదివుంటారు. ఆనాటికలు కలిగించిన ఉత్సాహంతో ఇవి రచించి ఉంటే రచించి ఉండవచ్చును. కాని అనుకరించడం, అనువదించడం మాత్రం లేదు— నాటికీ నేటికీకూడా. ఇది సంతోషించవలసిన సంగతి. తెలుగు నాటిక పూర్తిగా తెలుగు రచయితలు పెంచినదే.

శూద్రుల జన్మమూ, సురల జన్మమూ లాగే తెలుగు నాటిక జన్మంకూడా ఎరుగరానిదే. ఖండకావ్యం ప్రాచీన కావ్యపద్ధతుల మీాద ఉరుముతూ, 'నూత్న తెన్ను'నని గర్జిస్తూ వాఙ్మయ రంగంలో ప్రవేశిస్తే, నాటిక శరజ్జ్యోత్స్నలో చలి ప్రవేశించినట్లు నిశ్శబ్దంగా నిరాడంబరంగా ప్రవేశించింది. నాటికారచనమే సాహిత్య వ్యవసాయంగా పెట్టుకున్న కవులున్నారు ఇద్దరు ముగ్గురు. కాని వీరిలో ఏ ఒక్కరి నాటికలకీ పేరు రావడానికి ముందే చక్కని నాటికలు పుట్టి పేరు పడ్డాయి. కనక 'మొదటి నాటిక వీరిది' అని ఏ కవి పేరూ నాటికతో కలిపి చెప్పలేము. సాహితీ సమితి వారి 'సఖి'కి ముందున్న పత్రికలలో నాటికలకి బీజాలేమో అని అనుమానించ తగిన రచనలు, సంభాషణల్లాగ ఉన్నవి—కనబడతాయి. కాని నాటికకి విశిష్టరూపం 'సఖి'లోనే ఏర్పడిందంటాను. భమిడిపాటి కామేశ్వర్రావుగారి "బాగు బాగు" 'సఖికి' ముందే పుట్టి రంగస్థలంకూడా అధిష్ఠించింది. కాని, దానికి వారే ['ఏకాంక నాటిక'

అని గాని 'నాటిక' అనిగాని పేరు పెట్టక] 'ప్రదర్శనము' అని పేరుపెట్టుకున్నారు. ఒక సత్యం నిరూపించడం కాని, ఒక చిత్రమైన ఘటన ఏర్పడిన క్రమాన్ని చిత్రించడం కాని, ఒక విషమ సమస్యనివ్వడం కాని, "బాగుబాగు"లో జరగలేదు. కథ మొదట్నించి చివరవరకూ గతి మారకుండా నెమ్మదిగా జరుగుతుంది. సంభాషణలు ఆగత్యం లేకపోయినా చాలా దూరం సాగుతూంటాయి. కాబట్టి ఆ ప్రదర్శనానికి 'నాటిక' హోదా రాదేమో నంటాను. కాగా సాహితీసమితివారి 'సఖ' పత్రికే ఏకాంకనాటకానికి జన్మభూమి అవుతుంది.

నోరి నరసింహశాస్త్రిగారి 'ఖేమాభిక్షుణి' సఖ మొదటి సంచికలోనే దర్శనమిచ్చింది. ఏకాంకినాటకం విశిష్టత్వం ఆంధ్రరసికులకి బోధపరుద్దామని సాహితీసమితి వారు చాలా పాటుపడ్డారు. వారి 'గోష్ఠి'లో ఖండకావ్య పఠనంతోపాటు నరసింహశాస్త్రిగారి 'ఖేమాభిక్షుణి' పఠనం తప్పకుండా ఉండేది. ఇది చక్కని నాటిక. స్త్రీ విరోధి అన్న కారణంచేత తథాగతుణ్ణి చూడనైనా చూడనని నియమం పెట్టుకున్న ఖేమారాణిని మహారాజు బింబిసారుడు, బుద్ధభగవానుడున్నాడని చెప్పకుండా అతడున్న వేణువనంలోకి తీసుకెళ్తాడు. మహాశ్రమణుని మహిమవల్ల యౌవనం సౌందర్యం అశాశ్వతాలని గుర్తించి, మహారాణి ఆర్యాష్టాంగ గామినైన భిక్షుణి అవుతుంది.

ఈ నాటికలో ఖేమా చిత్రణం చక్కగా ఉంది. బింబిసార మహారాజు ప్రయత్నంవల్ల వెదురు పొదరింటిలో కూర్చున్న ఖేమారాణి, మామిడితోటలోని మాధవీలత మీద ఉయ్యాలలూగి, మంచి గంధపుచెట్టు నీడలో విశ్రమించి, సరోవరంలో పాదప్రక్షాళనం చేసుకుని, దేవాలయంలో భగవత్పూజ చేయడానికి పుష్పాపచయం చేసి, గృధ్రశిఖర మధిరోహించి, తన్నావహించిన అలౌకికమైన నూతనకాంతి బలంవల్ల మహాశ్రమణుని దివ్యపాదా లర్చించి, 'భిక్షుణి' కావడానికి అనుజ్ఞ కోరుతుంది. ఈ నాటికకి బింబిసారుని సంకల్పం బీజం, విదూషకుని సలహా బిందువు, ఖేమా పరి

వర్తనం పతాకాను. కాని పతాక (Climax) ఉచ్ఛదశని కవి సరిగా నిరూపించలేదు. బింబిసారుడేమో కేవలం ఖేమాదేవికున్న బుద్ధపూజావిముఖత్వం పోగొట్టడానికే సంకల్పించాడు ఈసన్నివేశాన్ని. మహారాణిలో బుద్ధసందర్శనం తెచ్చే మార్పు బింబిసారుడి ఊహాకి మించిపోయింది. ఆమె భిక్షుకీ శాసనం స్వీకరిస్తానంటుంది. అతడు 'కొంతసేపు నివ్వెరపో'తాడు. ఈ నివ్వెరపాటు తప్పితే మరేమీ సాక్ష్యం లేదు అతని అసలుద్దేశానికి. ఈ కథలో ఖేమా పరివర్తనం కంటె బింబిసారుడి నివ్వెరపాటులో అందం ఎక్కువ. ఆ అందం ద్యోతకం కాలేదు బాగా. అయినప్పటికీ, అంతవరకూ పొడగట్టిన నాటికలలో లేని ఆది మధ్యాంతాలూ, చక్కని పరివర్తనం, ఆ పరివర్తనం వైపే తిరిగి నడిచే కథాక్రమూ, ఈ నాటికకి విశిష్టత్వ మిస్తున్నాయి.

'సఖ'లోనే పడ్డాయి శ్రీనివాస శిరోమణివి 'పరివర్తనము' 'లోకభయము' అనే రెండు నాటికలు. ఖేమాభిక్షుకిని ముఖ్యంగా శ్రవ్యనాటికే. చూచి కాని అనుభవించలేని సన్నివేశాలు అందులో లేవు. "పరివర్తనము"లో నాటిక దృశ్యం కావడానికి గట్టి యత్నం చేసింది. అశోక మహారాజు మాళవరాజుని యువరాజునీ చంపి, రాజకుమారిని తన అంతఃపురములో ప్రవేశపెట్టా. ఒక యేడాది వరకూ వారిద్దరూ చూచుకోలేదు. మాళవకుమారి ఇప్పుడు కబురంపుతుంది అశోకుడికి. అశోకుడు ప్రయాణోన్ముఖుడౌతాడు. ఇక్కడ ప్రారంభిస్తుంది నాటికథ. అలంకారము పూర్తి అవుతూంటే మంత్రి రాధాగుప్తుడు వచ్చి చూచి, పోవద్దని సూచిస్తాడు. అశోకుడు వినే స్థితిలో లేడు. రాధాగుప్తుడు దృష్టి మార్చేద్దామని ఉపగుప్తాచార్యులనే బౌద్ధ సన్యాసిని ప్రవేశపెట్తాడు. ఆసన్యాసి అశోకుణ్ణి రక్తపిపాసువనీ, స్త్రీలోలుడనీ నిందిస్తాడు. దాసి వస్తుంది. కోపంవల్ల తాను తల్చుకున్న పనినుంచి దృష్టిమారిపోయిన మహారాజు రూక్షంగా 'ఏమిటి'? అంటాడు. మాళవకుమారి వర్తమానము మాట చెప్తుంది దాసి. అశోకుడు ఉపగుప్తుణ్ణి క్షమించి బయల్దేరతాడు. ఆవలో రాధాగుప్తుడు తిరిగి ఎదురై మాళవకుమారిని విసర్జించ మంటాడు. అశోకుడు

మారడు. రాధాగుప్తుడు వెళ్లిపోగానే ఒక ముసలిది యెదురై అశోకుని రాజ్య తృష్ణకి తన పెనిమిటి, ఇద్దరు కొడుకులూ బలి అయినారని దుఃఖిస్తుంది. ఆమె కేదో తక్షాంతి చేసి రాకుమారిని కలుసుకుంటాడు. ఆచి ఆచి ఉపగుప్తునిచేతా ముసలి దానిచేతా దెబ్బలు తిన్న సామ్రాజ్యతత్వానికి ఇక్కడ ఇంకో దెబ్బ తగులుతుంది. "నీ హృదయాన్ని జయించిన నాడే నీవు నన్ను చూడవచ్చు"నని చెప్పి తిరిగిపోతాడు అశోకుడు. ఆ సమయంలో ఉదయప్రార్థనలు చేస్తున్న ఉపగుప్తాచార్యులు బౌద్ధగురు వౌతాడు అశోకునికి. క్షేమాభిక్షునితో రూపం ఏర్పడ్డ నాటికకి "పరివర్తనం"లో అవయవాలు కొన్ని ఏర్పడ్డాయి నాటికపతాకలో పూర్తి అయిపోతుందని సూచించాను. నాటికా కథకూడా పతాకవైపే తిరిగి జోరుగా నడుస్తుందనికూడా సూచించాను. కథ జరుగుతూన్నంతసేపూ ప్రేక్షకులు "ముందేం జరుగుతుందనే" కౌతుకంతో ఎదురుచూడాలి పతాకవరకూను. ఈ పతాక, నాటికకథకి సహజమైన సమాప్తములాగ కనపడాలిగాని హఠాత్తుగా పురాణ నాటకాల్లోని ఈశ్వర ప్రవేశమో, ఆకాశవాణి సాక్ష్యమోలాగ కాకూడదు. పతాక హఠాత్సంఘటనం కాకపోవాలంటే నాటికా కారుడు పతాకని 'కావ్యార్థసూచన'వల్ల ముందే కొంచెం సూచించాలి. ఇలా సూచిస్తే పతాకప్రేక్షకుల మస్తిష్కంమీద ధాష్టీకి బాంబులాగ పడక, గాలికెరటంలాగ దిగుతుంది. కావ్యార్థసూచనవల్ల ప్రేక్షకుల్ని తయారుచేసుకుంటాడు నాటికా కారు. క్షేమాభిక్షునిలో విదూషకుడన్న వాక్యం— "ఆమె కన్న కల కాస్తా నిజము చేయవలెనని మీ కోరికా ఏమిటి?—"లో ఉన్న కావ్యార్థ సూచన, బింబిసారుని ప్రయత్నబలంలో మరుగుపడి పోయింది. "పరివర్తనం"లో రాధాగుప్తులవారు తొలిసారి ప్రయాణం వద్దన్నట్లు సూచించీ, రెండోసారి 'ఆ యువతిని విసర్జించమని నా ప్రార్థన' అని అభ్యంతపెట్టీ మన్ని తయారు చేస్తాడేదో విపరీతానికి. ఈ విపరీతమే అశోకుడి పరివర్తనం.

'పరివర్తనం'లో మరొక విశేషంకూడా ఉంది. కథ జోరుగా పతాకోన్ముఖమై నడవా

లన్నాను. అంటే కథ హైరోడ్డు లాగ నిటారుగ్గా నడవాలసి కాదు. జోరుగా నడిచిన స్ఫురణ మనకెప్పుడు వస్తుంది? మార్గ మధ్యంలో అడ్డంకులు వస్తే, ఆ అడ్డంకి నతిక్రమించి, ఎప్పటి వేగాన్ని అందుకున్నప్పుడే కథా వేగం ఎక్కువగా తెలుస్తుంది. పతాకోన్ముఖమైన కథ జోరు స్ఫురించాలంటే కవి కథని తిన్నగా నడపకూడదు. తరుచు వస్తుపరివర్తనం వస్తూ, కథని మళుపు తిరిగించి మళ్లీ పరిగెత్తించాలి. క్షేమాభిక్షువులో కథా వస్తు పరివర్తనం తేటగా లేదు. "ఐతే మామిడితోటలోకి వెళ్లుదామా" "(ఈ సరోవరం)లో జలక్రీడలాడుదామా" "పాదప్రక్షాళన చేసుకురా!" "పూలు కోసి బుట్టనింపినావా అంటే—" అన్న బింబిసారుడి వాక్యాలు చాలా మందంగా నడుపుతాయి కథని. 'పరివర్తనం'లో మాళవకుమారీ దర్శనోత్సుకుడై బయల్దేరిన అశోకుణ్ణి రాధాగుప్తుడు వారించి ఫలం కనబడక, ఉపగుప్తుణ్ణి ప్రవేశపెట్టాడు. ఉపగుప్తుడు నిందించి నిందించి ఊరుకునే సరికి దాసి వచ్చి మాళవకుమారి దగ్గర్నుంచి వర్తమానం తెస్తుంది. మళ్లీ బయల్దేరిన అశోకుడికి రాధాగుప్తుడు 'నగరపర్యటనం చెయ్యవలసిన రాత్రి,' అని జ్ఞాపకం చేస్తాడు. ముసలిది వస్తుంది. వీరందరి ఉపాలంభాలతో కొట్టబడుతున్న అశోకుని హృదయం మాళవకుమారి తిరస్కార వాక్యాలతో నీరవుతుంది. అలాంటి హృదయాన్ని ఉపగుప్తుడు బౌద్ధ ధర్మాలలోకి మళ్లిస్తాడు. 'పరివర్తనం' అవుతుంది. రాధాగుప్తుడు, ఉపగుప్తుడు, దాసి, ముసిలిది, వీరంతా కథా వస్తు పరివర్తనానికి సాయం చేస్తారు.

'పరివర్తనం'లో మూడో విశేషం కూడా ఉంది. కథావస్తువు— పూర్వం జరిగిపోయి, ప్రస్తుత సంభాషణకి పునాది అవుతుందే, అది— పాత్రల సంభాషణలలో క్రమంగా బయల్పడుతుంది. నాటకత్వానికిదొక ముఖ్యలక్షణం. కథ పాత్రలచేత చెప్పించే యడం తెలికకవుల లక్షణం. "తాము క్షత్రియులా?" "రాధాగుప్తుడు ఏమి చేసినాడు?" మొదలైన ప్రశ్నలు సందర్భానికనుకూలంగా పుట్టి కథావస్తువుని క్రమంగా తెరిచి చూపిస్తాయి. స్వగతాలూ, దీర్ఘోపన్యాసాలూ, ఆకాశసంభాష

ణలూ ఈ విధానానికి వేరుపురుగులు. కథని వెకిలి వెకిలిగా బయటపెట్టాయి అవి. శ్రీనివాస శిరోమణిగారు వీటి నన్నిటినీ తెలిసి తీసేశారు.

కానైతే కొంచెం అసందర్భాలు లేక పోలేదు వీరి నాటికలో ('పరివర్తనం'లో) అశోకుడు కీలు బొమ్మలా కనబడతాడు. సార్వభౌముడు కాదు కదా రాజు లాగకూడా కనబడడు. అత డందరికీ లోకువే. అశోకుణ్ణి దిగలాగడానికి కవి పాత్రలచేత అన్ని విధాలా మాట్లాడించాడు. ఈ కారణంచేత నాటికా గౌరవం కొంత హీనమౌతుంది కాని, నాటకత్వం పరిశీలించుకునే టప్పుడు మాత్రం శ్రీనివాస శిరోమణి నాటిక కీ అవయవ శోభ కలిగించాడని చెప్పక తప్పదు.

అంటే, సాహితీసమితి వారి కృషి నాటికకి రూపం ఇవ్వడమే కాకుండా అవయవ శోభకూడా కొంత చేకూర్చిందన్నమాట. కాని ఇటు తర్వాతి నాటికలు ఈ పద్ధతుల మీాద నడవనేలేదు. దీక్షితులూ, విశ్వనాథ కవిరాజు, గుడిపాటి వెంకటాచలం, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి మొదలయినవారు రచనలు ప్రారంభించి ఎన్నో ప్రచురించారు. ఒకొక్కరిది ఒకొక్కతోవ. ఏ ఇద్దరూ ఒక్కపంథా నవలంబించ లేదు. ఈ దశలో, అనగా 1930 మొదలు 1940 వరకూ పత్రికల్లో పడ్డ నాటికలు అసంఖ్యాకాలు. ఇది తెలుగు నాటికకి బాల్యదశ అంటాను. నోరి నరసింహశాస్త్రి, శిరోమణి ఏర్పర్చిన దారుల్లో నడిచి వుంటే, నాటిక చక్కని వికాసాన్ని నాడే పొంది ఉండేది. కాని రచయితల కందరికీ అంత సంస్కారం లేకపోయింది. శ్రీనివాస శిరోమణి రెండో నాటకంలోనే బిగువు సడలిపోయింది. కాబట్టి సాహితీసమితివారి ప్రయత్నం నిద్రాణమైయున్న నాటికా రచయితల శక్తిని లేవగొట్టి నడుము కట్టించిం దనే అనాలి. తరవాత బయల్దేరిన సన్నాహంలో చిన్న నాటికని ప్రత్యేకం పెంచిన కవి ఎవరూ లేరు. అందువల్లే నాటికకి ఫలానీ కవి తండ్రి అన్నమాట నిర్ధారణగా చెప్పలేక పోతున్నాం. ఈ బాల్యదశలో నూటికిపైగా వెలువడ్డాయి నాటికలు. వీటిలో, ఒక ప్రత్యేక నాటికలో కాకపోయినా మొత్తం మీాద నాటిక సర్వాం

గాలూ వృద్ధిపొందాయి. నాటికలలోని రకాలుకూడా పెరిగాయి. స్థూల దృష్టితో చూస్తే ఈ రకాలు ఐదులాగ కనపడతాయి. చదువరులకి (లేదా ప్రేక్షకులకి), ఒక సందేశం ఇచ్చే నాటికలు మొదటి రకం. వీటిని పరమార్థ నాటికలంటాను ఏదో పరమార్థం సాధిస్తాయి గనక. వినోద నాటికలు. ఒక సందేశాన్ని ధ్వనించక పోయినా, ఒక ఘటనలో ఈ ఘటన చారిత్రికం కావచ్చు, పౌరాణికం కావచ్చు లేదా సాంఘికమేనా కావచ్చు —విశేషార్థం సాధించే నాటికలు రెండో రకం. వీటిని వ్యాఖ్యాన నాటికలంటాను; విశేషవ్యాఖ్యానమే వీటి ఉద్దేశం గనక. ఏ ఉద్దేశమూ లేకుండా, పౌరాణిక, చారిత్రిక సాంఘిక ఘటనలనో, సన్నివేశాలనో సృజించుకుని వాటిచుట్టూ ఊహించిన వస్తువునే పెంచి, రచించే నాటికలు మూడో రకం; 'ఊహా చిత్ర నాటికలు' అంటాను వీటిని. వస్తువంతా ఊహించక జీవిత రంగాలనే అద్దంలో చూపించినట్టు చూపించేవి నాలుగో రకం. వీటిని 'జీవితశకలా'లంటున్నాను. ఈ నాలుగు రకాలకీ సంవిధానంలో తేడా ఉంది. కాబట్టి అన్నిటినీ ఒకే విధంగా విమర్శించలేము. దేనికి దానికే వేరే పరిశీలన కావాలి. కనక ఒకొక్క రకాన్ని తీసుకుని పరిశీలిస్తాను తరువాయి వ్యాసాల్లో.

నవ్యకవిత్వం

మల్లవరపు విశ్వేశ్వరరావు

"The historic sense, which is a sense of the timeless as well as the temporal, and of the timeless and the temporal together, is what makes a writer traditional. And it is at the same time what makes a writer most acutely conscious of his place in time, of his contemporaneity."

T. S. Eliot.

కవిత్వానికీ కవికీ ఎంత అవినాభావసంబంధం వున్నా, విమర్శ ప్రపంచంలోకి దిగదలిస్తే బహుళభావాలకి తావొసగ వలసి వుంటుంది. కవిని కవిత్వాన్ని విడమరిచి దర్శిస్తేగాని ఈ రెండు వస్తువులకీ గల సంబంధబాంధవ్యాలని ప్రదర్శించలేము. కవిని కవిత్వాన్ని వివిధంగా భావించుకుని, కాలానుక్రమమైన సమన్వయాలను ఏర్పరుచుకుంటేనే కావ్యసృష్టినీ, కవిత్వ సంప్రదాయాన్నీ అవగాహన చేసుకోగలుగుతాము. ఈ దృష్టినుంచి చూస్తే, కవిని సృష్టించేది కవిత్వమనీ, కవి సృష్టించేది కావ్యమనీ చెప్పుకోవచ్చు. ఇక, పైన చెప్పిన కాలానుక్రమమైన కావ్యప్రపంచంలో ప్రముఖమైనదాన్ని, అనగా కాలప్రవాహంలో ప్రస్తుతానికి చెందిన దాన్ని, నవ్యకవిత్వముగా వ్యవహరిస్తున్నాము.

కవిత్వానికి సజీవమైన పరిణామక్రమం వున్నప్పుడు, కవిత్వ చరిత్ర నిరంతరాయంగా సాగినంతకాలమూ, ఏ యే కాలానికి చెందిన కావ్యసంపత్తి ఆ యా కాలంలో నవ్యమే అవుతుంది. కాలం ఘనీభవించి, పరిణామవాహినికి అంతరాయం కలిగి, సజీవతకు నిదర్శనమైన వికాసం నశించినప్పుడు ప్రస్తుతకాలానికి చెందిన కావ్యసృష్టి అయినప్పటికీ అప్రస్తుతమై, నవ్యకవిత్వం అనిపించుకోదు. నవీనకాలంలో అయినా సజీవతలేని కావ్యసృష్టి నవ్యకవిత్వం కాదు. నవీనకాలానికి చెందిన సజీవత

గల సర్వకావ్య ప్రపంచమూ నవ్యకవిత్వమే. అనగా నవ్యకవిత్వంలో నవ్యత అనే గుణం ఆధారము, కవిత్వగుణం జీవము. ఆధునిక కావ్యరచన ఏదిగాని కవిత్వ మనిపించుకున్న పిదపనే నవ్యకవిత్వ మనిపించుకుంటుంది.

కవితాకన్య నవ్యప్రపంచంలో పునరుద్భవించినప్పుడు నవ్యకవిత్వస్వరూపం ఏర్పడు తుంది అనగా, తత్కాలాతీతమైన ఒక తేజస్సు కాలబంధనాన్ని అంగీకరించి, అవతరించి, నవ్యకవిత్వ మౌతోంది. నాగరుగన్న నవ్యకవిత్వంలో కవిత్వ సంప్రదా యానికి అంత్యకాలం సంప్రాప్తించిందని సనాతన సాహిత్య వాదులు అనుకున్నా, నవ్యకవిత్వంలో కవిత్వ సంప్రదాయానికి ఏకైక పరిణతి, సంపూర్ణస్వరూపం సిద్ధిం చిందని ఆధునిక సాహిత్య కుమారులు అనుకున్నా తమ మూఢత్వాన్ని వెలిబుచ్చు కుంటారు. సంప్రదాయానికీ, నవ్యతకీ అతీతమైనదిగా కవిత్వాన్ని సంభావించు కున్నప్పటికీ, సంప్రదాయ సిద్ధమైన కావ్యజాలం ద్వారానే కవిత్వస్వరూపాన్ని దర్శించగలము. సంప్రదాయం నిరంతరాయంగా, సజీవంగా పెరగవలె నంటే నిత్య నూతనతయే ఆధారం. ఎప్పటికప్పుడు కవిత్వం 'నవ్యకవిత్వం' అనిపించుకోవాలి. కవిత్వమనే చైతన్యం 'నవ్యత' లోనే ఆవిర్భవిస్తుంది; నవ్యరూపకల్పనలోనే నిరూ పిత మౌతుంది. సంప్రదాయ సిద్ధమైన కావ్యాత్మ నవ్యతని పురికొల్పు తుంది; నవ్యకవిత్వం సంప్రదాయ సిద్ధిని పెంపొందిస్తుంది.

అంకురము వృక్షమై శాఖోపశాఖలుగా పెరిగినంత కాలమే తన సజీవతను నిరూ పించు కుంటుంది. పెరుగుదల తరిగి నప్పుడు నిర్జీవమై మ్రోడై నశిస్తుంది. మహా వృక్షానికి చిటారుకొమ్మని చిగురుటాకు జనించిందంటే, మహావృక్ష జీవంలో నూతన చైతన్య ప్రసారం సూచిత మౌతుంది. చెట్టువల్ల చిగురుటాకు జనించింది. చిటారుకొమ్మని చిగురుటాకు పుట్టుకతో వృక్షజీవంలో నూతన స్పందన కలిగింది. నవ్యకవిత్వ సృష్టితోపాటు సంప్రదాయసిద్ధమైన సాహిత్య సర్వస్వమూ నూతనోన్మే షం పొందిందన్నమాట. సంప్రదాయంలోని తపనకు ప్రతిఫలం, పరిణతికి పరమార్థం

నవ్యత అన్నమాట. కాని, పెరుగుతూన్న వృక్షకాండము కాలక్రమవశాన్ని గొడ్డలి దెబ్బ పాలైన దనుకుందాం. సాహిత్య భూజము, సాహిత్య సంప్రదాయం అంత రాయము పాలై జీవప్రవాహం కొంతకాలం నిలిచిపోయిం దనుకుందాం. నీరు పల్లానికి ప్రవహించడానికి మార్గం అన్వేషించినట్లే, భూజము ఆకాశాన్ని అంటేందుకు నూతన శాఖాంకురాలని పెట్టడానికి తపన పాలైనట్లే, సాహిత్య సంప్రదాయం నూతన రూపాలను సృష్టించుకు తిరిగి ఉన్మీలనసిపించుకోడానికి సముద్యమిస్తుంది. ఈ ఉద్యమముయొక్క బహిరంగ స్వరూపానికీ, సంప్రదాయం యొక్క అంతరంగ రహస్యానికీ గల సమన్వయం స్థూలదృష్టికి అగోచరమై, సాహిత్య పాఠకలోకంలో పరస్పర వైషమ్యం, ఘర్షణ, వైరం తటస్థిస్తో వుంటాయి. ఒక వైపు పురాతన సాహిత్యపరులు, వేత్తలు, పోషకులు అంటూ కొందరు విగ్రహారాధకులు స్థిరపడతారు. నవ్య సాహిత్య పరిషత్తులు, కోలాహలం, ఆర్భాటం, విప్లవం మరొకదిక్కున ఉద్భవిస్తాయి.

సాహిత్యం నిరంతరాయంగా సంఘజీవితవాహినిలో పద్మకోరకంలా వికసిస్తో, జీవిస్తో, రాణిస్తోవుంటే ఇంత వైరుధ్యం కనిపించకపోవచ్చును. అట్టి ప్రశాంత పరిస్థితిని ప్రతిబింబించే సాహిత్యకాలాన్ని classical period, అంటే బహుశా ఉదాత్తకవిత్వయుగం, అని అనుకోడం కూడా సాహిత్య చరిత్రలలో దర్శిస్తాము. అట్టి తరుణము సంస్కృత సాహిత్యంలో ఏ కాళిదాస కాలంలోనో వున్న దేమోగాని, మన ఆంధ్ర సాహిత్య చరిత్రలో ప్రస్ఫుటంగాలేదు. శాఖోపశాఖలుగా పెరిగే లోపలనే మన సాహిత్యవృక్షము గొడ్డలిదెబ్బ తినడంవల్ల, మన సాహిత్య ప్రవాహం నాచు నిండిన కోనేరై నిలిచిపోవడం వల్ల కవిత్వ కల్హార మాలికలకు బదులుగా తుంగముస్తెలు పెచ్చుపెరిగి అభిరుచిని నీరస మొనర్చివేశాయి. సాహిత్య వృక్షకాండము తన అంతరాళంలో నూతన ప్రచలనం, తపన ప్రబలించుకుని, నూతన శాఖాంకురాలని మొలకెత్తించుకుని, నవ్యసాహిత్య రూపంలో పునరుజ్జీవనం పొందవలసిన చరిత్రా

త్మకమైన అవసరం ఏర్పడింది. అందువలన నేటి కాలంలో ఆంధ్ర సాహిత్యంలో ఏ కావ్యముగాని కవిత్వ నామధేయానికి అర్హత పొందవలెనంటే, తనలో నవ్యతని రూపొందించుకోవాలి. ఇది తప్పనిసరి. గత్యంతరము అనూహ్యము. మనకి సాహిత్యముంటే నవ్యసాహిత్యమే. కవిత్వముంటే నవ్యకవిత్వమే. నవ్యం కానిది కవిత్వమనిపించుకోదు. అసలు 'కవిత్వం' కానిది 'నవ్యకవిత్వం' కానే కాదు.

అయితే, కవిత్వంలో నవ్యత ఏది? నవ్యతకు సాధనమేమిటి? నవ్యత సాధ్యమా?, అన్నప్రశ్నలు ఆలోచనీయ మౌతాయి.— లోకంలో కవులున్నంత వరకూ కవిత్వం వుంది. ప్రస్తుత లోకంలో కవులున్నారా? నవ్యకవిత్వం వుందన్నమాటే. కవిసాధన ఫలం కవిత్వరూపం—కావ్యం. కవి సాధనక్రమం నవ్యతని దర్శించడమే, నిరూపించడమే. తన కాలంలో, తన ప్రపంచంలో, తన హృదయంలో నవ్యతను దర్శింపగలవాడే కవి.

ఇప్పుడు కవిత్వము, కవి, కావ్యము అనే మూడు విషయాలు ఏర్పరుచుకున్నాం.

కవిత్వం కవి ప్రకృతిని ఆవరించిన అవ్యక్తమైన కాంతి. కవి ఆ వెలుతురు ప్రసారానికి అనుగుణమైన వ్యక్తి హృదయము. కవి హృదయంలో రూపకల్పన పొంది వెలువడిన కాంతికేంద్రమైన కళాస్వరూపము కావ్యము. చిరంతనమైన కాంతి కవి హృదయాన్ని ఆవరించి, హృదయ ప్రవృత్తులను ప్రకాశమానం చేసి కేంద్రీకరించి, వివేచితమైన అనుభూతులకు (discriminated impulses) సార్థకరూపకల్పన చేసి, తద్వారా అభివ్యక్తమై, మూర్తీభవిస్తుంది. ఇట్టి సంయోగక్రమం ఊహించుకున్నప్పుడు, నవ్యతా సిద్ధి ఏస్థలంలో కలుగుతున్నది అని ప్రశ్నించవచ్చు. కవి హృదయ ప్రవృత్తులే నవ్యతా పరికరంగా భావించవలసి వుంటుంది. అయితే కవి హృదయ ప్రవృత్తులకు నవ్యత ఏరీతిగా సంఘటిస్తుంది అంటారు. కవి హృదయ ప్రవృత్తులకు లోకం ఆధారం; అనగా మానవ సంఘం. మానవ సంఘ జీవిత సమ

క్షణంలో కవి హృదయం నూతనరీతిని స్పందిస్తే, కవి సనాతనమైన కవిత్వ కాంతికి నూతనమైన ఆధార మౌతాడు. కవి హృదయమే సంఘజీవితానికీ, సర్వమానవానుభూతులకీ హృదయ కేంద్రమైతే సమకాలిక ప్రపంచ సంచలనమంతా కవి హృదయాన్ని కలవర పెడుతుంది. కవి కేవల మానవుడేకాక, తాను కవి కాబట్టి అస్పష్టమైన, అవ్యక్తమైన లోక సంచలన మంతనూ తన నిశితమైన హృదయావరణములో అనుభవము గావించుకుని, నిర్మలమైన కవితాలోకంలో అవగాహన చేసుకోగలుగుతాడు. అప్పుడు సమకాలిక లోకానుభవా లన్నింటికీ అంతర్యంలో గల సార్థకతను దర్శింపగలడు. కవిని ఆవరించిన లోక జీవితంలో కలిగే సంఘర్షణలు, సమస్యలు, జీవిత వాతావరణం కవి చిత్తవృత్తికి మూలకందములై, స్వచ్ఛందమైన కవిత్వ కాంతిలో ప్రకాశమానమై, సార్థకరూపము దాల్చి కావ్యకారకము లౌతాయి.

లోక ప్రకృతిలో కలిగే సంచలనము కేవల శక్తిరూపమై, స్థూలమై, వ్యక్తజ్ఞానము లేనిదై వుంటుంది. కవిహృదయం అతిసూక్ష్మమై, మానవ ప్రకృతియొక్క ప్రతి సంచలన స్పర్శకు స్పందించే ఇంద్రియ స్పృహ కలిగినదై వుంటుంది. ఇట్టి అతి నిశితమైన ఇంద్రియ స్పృహ కవియొక్క వ్యక్తి అనుభూతిని మేలుకొల్పి, తత్ హృదయాంతరంలో అసంఖ్యాకములైన భావ స్పందనలకు మూల మౌతుంది. ఈ వ్యక్తి భావస్పందనలు బహుళములై, పరస్పర విరుద్ధములై, శకల సమూహాములై ప్రవేశించి కవి హృదయాన్ని కలుషపరచి మూర్ఛిత మొనర్ప గలవు ఈ స్థితిలో కవివ్యక్తి మానవులలో కెల్ల విస్తీర్ణమైన మానవత్వానికి ఆకరమై వుంటాడు. మానవ లోకంలోని సంకులత అంతా కవి అంతర్యంలో నిండి నిబిడీకృతమై దుర్భర మౌతుంది. ఆ క్షణమే కవితాలోక ప్రసారానికి. స్వాగత ముహూర్తం; పంకిల సరోవరంలో పద్మ ప్రసూనమట్లు, మేఘమండలోపరితలాన్ని అరుణోదయం లాగున, మథిత సాగర ప్రసూతమైన చంద్రబింబమువలె కవి హృదయాన్ని ప్రకాశ

మానం చేస్తుంది. ఆ కాంతిలో, ఆ ప్రశాంతిలో, తపన ఉపశమించి, సమగ్ర సంకులత సమరస భావమై, ఇంద్రియ స్పృహా పరంపర కేంద్రీకృతమై, కవి వ్యక్తిలో విశ్వరూప సంప్రదర్శనం సంఘటిల్లుతుంది. ప్రకృతి సంచలనము ఇంద్రియ స్పందన పరంపరగా కవి వ్యక్తిని ఆక్రమించి, కవిత్వ రాసాయనిక క్రియకు లోనై, ఏకాగ్రమైన సమన్వయము చేకూర్చుకుని సత్య సార్థకమైన సుందర స్వరూపము దాల్చి, అభివ్యక్తత నాసించి ఆక్రోశించి బహిర్ముక్తమై, సాహిత్య ప్రపంచంలో సాలంకృత సమగ్ర కావ్య స్వరూపముగా ప్రాదుర్భవిస్తుంది. ప్రకృతి సంచలనాంతర్గతమైన సృష్టిరహస్యం తిరిగి కావ్యనిబంధనాంతర్లీనమై నూతన చేతనతను సమార్జిస్తుంది. కవి స్వీకరించే లోకప్రకృతి, కవివ్యక్తి సమకాలికములైనప్పుడే కవిత్వానికి నవ్యమైన పాత్రత, కవికి నూతనమైన వస్తువు, కావ్యానికి నవీనమైన అలంకార శోభ సిద్ధిస్తాయి.

ఆధునికాంధ్రసాహిత్యం ఇప్పటికి కొంత చరిత్ర ప్రసిద్ధిని గడించుకొని వున్నందున నవ్య కవిత్వ సంప్రదాయంలో క్రమ పరిణతి సిద్ధాంత మొకటి సవిమర్శకంగా ప్రదర్శించడానికి అవకాశం, అవసరం కూడా ఏర్పడుతోంది. పైన చెప్పిన నవ్యతా ప్రసాధన నవ్యకావ్యోత్పాదనంలో ఎంత వరకు మూర్తిమంత మౌతున్నది, ఎంత వరకు మూర్తిమంతము కానున్నది అన్న విషయం వితర్కించుకోవడం ద్వారా నవ్యకవిత్వ సార్థకత, సచేతనత, సాధ్యత సువ్యక్తమై, నవ్య కవిత్వాభిరుచి ప్రస్ఫుటము, స్వచ్ఛము, ప్రవర్ధమానము అయి, కవిలోకానికీ సహృదయలోకానికీ నిరంతర సామీప్యత, సావధానత ఏర్పడ గలవు. ఈపని సామర్థ్యాన్ని బట్టి మరొకసారి చేయవలెనని నా ఆశ.

గురజాడ అప్పారావు

భమిడిపాటి కామేశ్వరరావు

ఆర్య మహాశయులారా!

నవ్యసాహిత్య పరిషత్కార్య దర్శిగారు నాయందు తమకుగల దయచే, శ్రీ గురజాడ అప్పారావుగారి చిత్రపటావిష్కరణం ఈ సందర్భంలో జరపడానికి నన్ను కోరి ఉన్నందుకు వారికి అనేక వందనాలు. ఇట్టికృతి నిర్వహించడానికి నాకున్న అసమర్థత ఇతరులకంటె ఎక్కువగా నాకే తెలుసునని వినయపూర్వకంగా మనవి చేస్తున్నాను. నేను గురజాడ అప్పారావుగారి ఆంతర్యం ఎరిగిగాని, వారి పరిచయం కలిగిగాని, వారిబోధ ముఖతా వినిగాని, వారి దర్శనఫలం పొందిగాని, చివరికి వారితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపిగాని ఉండలేను. అయినా, అటువంటి పండితుడునూ రచనాబ్రహ్మయూ అటువంటి ప్రశాంతుడునూ సుహృదుడునూ అయిన మహానుభావుణ్ణి గురించి ఆర్యుల సమక్షంలో ముచ్చటించడానికిన్ని, ఒకవేళ నాకు మాటలు నిండుకుంటే ఆగిపోయి, సజీవ చిత్రపటంలో ఆయన ఇదుగో అని చూపించడానికిన్నీ, తరుణం కలగడం అనేది జన్మ సాఫల్యమే కాదు బహుశా జీవిత పరమావధిగదా అని—లుబ్ధావధాన్లు మనస్సుకి ఇంటి కొచ్చిన పెళ్లి సంబంధం తోచగలిగి ఉండినట్టు—నా అల్పత్వానికీ పామరత్వానికీ తోచడంవల్ల, ఈ ఆహ్వానాన్ని వదులుకోలేక, స్వీకరించాను. ఇప్పుడు సభవార్ని ప్రార్థించే దేమంటే, నా మమకారాన్ని ఒప్పరికించి, నా సాహసాన్ని మన్నించి, నా హృదయాన్ని గుర్తించండి, అని. నన్ను ఈ మహాసందర్భంలో ఎల్లానూ ఇక్కడికి తెచ్చారు గనక, నాకూ గురజాడ అప్పారావుగారికీ గల బాంధవ్యంసంగతి ముందు కానిచ్చేసి, వారి రచనల్లో నన్ను ఆకర్షించినది ఆ వ్యక్తి లిఖించిన యావత్తున్నూ అయినప్పటికీ వ్యవధిని బట్టి వారి రచనల గురించి లఘువుగా మాత్రమే చెప్పి, తరువాత ఆ ఆంధ్రవ్యక్తిలో

ప్రత్యేకంగా ఆవిర్భవించిన మహాత్యం అని నే ననుకున్నది స్మరించి, వారి చిత్రపటం ఆవిష్కరిస్తాను.

గొప్పవాళ్ళతో సంబంధం కలుపుగోడం అల్పుడికి అవసరం గనక ఎల్లావో తంటాలుపడి అతను బాదరాయణిస్తాడు. నేనూ అంతే చేస్తాను. 'కన్యాశుల్కం' పుట్టిన సంవత్సరమే నేనూ జనించాను. ఇటీవల అంతా అంకెలమీదా బ్రాకెట్లమీదా నడుస్తోంది గనక అంకె సంబంధం గణనీయం. (ఈ వాక్యం నేను సభలో అన్నప్పుడు అధ్యక్షపీఠంలో ఉన్న శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు తను పుట్టిన సంవత్సరమూ అదే అని చెబుతూ మాలో మాకు మరో చుట్టరికం సూచించారు!) ౧౯౧౫ లో గురజాడ అప్పారావుగారి నిర్యాణం. ౧౯౧౨–౧౩ లో నేను రాజమండ్రి కాలేజీ విద్యార్థిగా ఉండగానే నన్ను ఎల్లానో గుర్తించి, శ్రీ సత్యవోలు గున్నేశ్వరరావుగారు—రాజమండ్రి కేసరి, రాజమహేంద్రికి కిరీటం లేని రాజు, నిష్కళంక జాతీయవాది, జనప్రియుడు, దీనజన రక్షకుడుగా వెలిగిన వ్యక్తి—నాతో శ్రీ గురజాడ అప్పారావుగారిని గురించి ప్రసంగాలు చేస్తూ ఉండేవారు. వారి ప్రతిభ ప్రశంసిస్తూ, తన అభ్యాసం చొప్పున ఇంగ్లీషు భాషలో "అప్పారావు ఒక తేజస్సు, ఒక తెలుగు వెలుగు. అప్పారావు గ్రంథాలు సువర్ణాక్షరాలతో అచ్చు వెయ్యవలెను." అంటూ గంభీరంగా అని, తను మహోత్తమ వ్యక్తిని గురించిన ఆవేశం కలిగించుకుంటూ, అంతటితో ఆగి, 'మీరు కూడా అటువంటివి వ్రాయాలి' అనేవారు. నేనుకూడా ఆయన అన్నదానికి జవాబుగా, ఇంగ్లీషు భాషలోనే 'మనకి తెలుగు పడదండీ, మన సబ్జక్టు వేరు' అనేవాణ్ణి. మరికొంచెం తరవాత, ఆయన ఒకనాడు నన్ను తమ యింటికి తీసికెళ్లి 'కొండుభొట్టీయం' చిత్తు ప్రతి (బహుశా అది శ్రీ గురజాడ అప్పారావుగారి, స్వహస్తలిఖితం అయి ఉండవచ్చును!) నాకు ఇచ్చి, 'ఇది మూడంకాలే ఉంది. మీరు పూర్తిచెయ్యాలి' అని, నాయందుండే మక్కువచేత అన్నారు. నాకు భయంవేసి, 'అవును లెండి. నన్ను ముందు తెలుగు గుణింతాలూ వగైరా నేర్చు

కోనివ్వండి' అని నే నన్నాను. తరవాత చాలాసార్లు ఆయన అల్లానే అంటూండడం, నేనూ అల్లానేలెండి అంటూండడం జరిగింది. ౧౯౧౯, ౧౯౨౦ సంవత్సరాలలో కన్యాశుల్కపుస్తకం ప్రతీ వీలైనప్పుడూ, పుస్తకం విప్పగానే ఏపేజీ వస్తే ఆపేజీ ప్రారంభించి చివరవరకూ నాతో కలిసిచదివి, తమరు ఆనందించిన పట్లు సహేతుకంగా నాకు చూపించి, అవికాక నేను సూచించుతూండేవి తమరు ఆమోదిస్తూ సహాస్వాదన చేసిన మిత్రులు శ్రీ అయ్యగారి రామచంద్రరావుగారినీ, శ్రీ సూరంపూడి హనుమన్నగారినీ తలుస్తాను; మరి ఒక్క పేరు—కీ. శే. శ్రీ సముద్రాల అప్పలాచార్యులు గారు! వీరు విజయనగరంలో ఉంటూండి నప్పుడు గురజాడ అప్పారావుగారు తన స్నేహితులనిన్నీ, అటువంటి స్నేహం తనకి రాజమండ్రీలో నాతో ఉండవలెననిన్నీ, చెబుతూ తనే నన్ను విని వచ్చి నాకు స్నేహితులై, నన్ను ఎక్కువగా మన్నిస్తూ, నేనాడినమాట—ఎంత సాయిలా పాయిలామాట అయినా సరే—ప్రతీదీ తను సమర్థించి, తన్నిమిత్తం తర్కప్రకరణాలు కూడా ప్రమాణిస్తూ, వీలైన ప్రతిసందర్భంలోనూ గురజాడ అప్పారావుగారి ప్రతిభను వెల్లడించే సంగతులు నాకు వినిపిస్తూండేవారు. గురజాడ అప్పారావుగారితో నాకు బాంధవ్యం కలిగించిన వీరు, అంతా నాకు వంద్యులు.

గురజాడ అప్పారావుగారు చాలా గ్రంథాలు రాశారు. ప్రతీరచనలోనూ కథా కమామీషూ, బోలెడు గ్రంథం ఉంటుంది. ప్రస్తుత సందర్భంలో నేను కథలు మానేసి కమామీషులు మాత్రం లఘువుగా సూచించి, పిమ్మట ఆవ్యక్తిని స్మరిస్తాను. చాలామందికి తెలిసిన రచన 'కన్యాశుల్కం'. 'కన్యాశుల్కం' ప్రకృతి సాదృశ్యమూ, కదలికా, వ్యక్తిత్వమూ, పోనుపోను గాంభీర్యమూ గల ఒక ఆట. అది ఒక తాత్కాలిక దురాచార హేళన నెపంగా రచింపబడినా కథాచమత్కృతీ, భావసారస్యమూ, పాత్ర చైతన్యమూ అందులో కలకల లాడుతూండడంవల్ల జన హృదయాలకి ఎక్కి నిల్చిన అపూర్వ ఆంధ్రపదశిల్పం. దానిలో పడ్డ ఒకటి రెండు

పుంజీల స్థానికపదాలవల్ల అది ఆంధ్రలోకాన్ని ఆకర్షించకపోడం • జరిగలేదు, సరి గదా, అట్లాంటివి ఉన్నా అది ఆంధ్రులకి హృద్యమై చరితార్థం అయింది. హాస్య రసోత్పత్తికి సూత్రకారులు సూచించిన లక్షణాల కన్నింటికీ లక్ష్యాలు అందులో ఉన్నాయి. దాని సారస్యం భాషలోనూ, భావంలోనూ, పాత్రలలోనూ, సంఘట్టన లలోనూ కూడా చిమ్ముతుంది. అందులోని పాత్రలయొక్క గుణసమ్మేళనం, 'ఎవరినో చూసి ఒక్కొక్కపాత్ర చిత్రించారా అన్నంత స్వభావసిద్ధంగా అతుకుని, అటువంటి వాళ్లు మనకి నిత్యకృత్యంలో కనపడచ్చుననే విశ్వాసం కలిగిస్తుంది. ఏకత్వం సిద్ధించిన ఒక కృతిని కర్త అయినా సరే తీసుకుని పునరాలోచనలో వ్యవకలన సంకలనాలూ సూక్ష్మీకరణ విపులీకరణాలూ చేసినప్పుడు ఏర్పడే ఫలితరచనకి మళ్లీ మరో కొత్త ఏకత్వం చేకూరడం కేవల దైవాధీనం— సాధారణంగా కథ అడ్డం తిరుగుతుంది. 'కన్యాశుల్కం' రెండవ కూర్పులో ఈ అడ్డం తిరగడం జరిగిందని నేను అనుకుంటాను. అందుకని, రెండవ కూర్పులోని ప్రతి ఒక దృశ్యమూ మిక్కిలి నటనానుకూలం అయినా, ఒకే గుక్కలో అంతా ఆడేయ్యడానికి కాలం హెచ్చు కావలిసి రావడం వల్ల, ప్రదర్శించేవాళ్లు తమకు వీలైన వేళకి ఆట ప్రారంభించి, ఇష్టం వచ్చిన దృశ్యంతో ఆట చాలించడం ఎరుగుదుం. ఏమైనా, 'డామిట్, కథ అడ్డంగా తిరిగింది!' అనే రెండవ ముద్రణపు ముగింపు వాక్యం సాభిప్రాయం! కథ అడ్డంగా తిరగక నిదానంగా పోతే ఎల్లా ఉండేదో ఆ ప్రతిభాశాలి ముఖతా మనం విన లేదు, మరి విన లేంగదా! గ్రంథాభిమానం గలవాళ్ళకి ఈ సందర్భం ఎంత ఆలోచనకైనా విహారరంగం. నా అల్పబుద్ధికే ఆ వాక్యంయొక్క అర్థం అనేక విధాలగా తోస్తూంటుంది. ఒకప్పుడు ఏమనిపిస్తుందంటే: ఆ రంగంలో వచ్చే గిరీశం, సౌజన్యారావు, మధురవాణి— ఈ ముగ్గురికీ కూడా శీలపరివర్తనం అద్భుతంగా కలిగింది గదా, ఆ పరివర్తనలు సమన్వయించి కథ సాగించి పూరించాలంటే మరో కథలోకి పోయి ఎంత దూరం వెళ్ళాలో గనక అసలు కథ ఆగిపోవడంలో అడ్డం తిరిగింది—

అని. మరొకప్పుడు, గిరీశం, రామప్పంతులు, మీనాక్షీ, కరటకశాస్త్రుల్లు—వీళ్ళు చేసిన పన్లకి వీళ్ళని సంఘం ఏమీ శిక్ష చెయ్యలేదే, ఆ శిక్షలు ముందు కథలో చెప్ప దల్చాడు గావును కవి, అనిపిస్తుంది. గిరీశానికి బుచ్చమ్మనీ, రామప్పంతులకి మీనాక్షీనీ, మహేశానికి సుబ్బినీ ఇచ్చి శాస్త్రోక్తంగా పెళ్ళిళ్ళు చేసేస్తే, ఒక విధమైన అంతం కథకి వచ్చేదికదా, కవి హృదయం అదేమో, రచించి ఉన్న కథలో అవి జరుగలేదు గనక, కథ అడ్డంగా తిరిగిందన్నాడు కవి, అని తోస్తుంది. ఇల్లాగా, 'కన్యాశుల్కం' లోని ఒక్కొక్క వాక్యానికే, వ్యాఖ్యానం కాదు గ్రంథమే లేవదియ్యడానికి వీలు కనిపిస్తుంది. అదీగాక, రెండవకూర్పులో 'కన్యాశుల్కం, కన్యాశుల్కానంతరం' అనే రెండు వేర్వేరు విషయాలకి సంబంధించిన రెండు వేర్వేరు గాథలు జోడింప బడ్డట్టున్నా, అందులో 'కన్యాశుల్కానంతరం' అనే భాగానికి చెందిన కథలో రావలసిన ఒక పాత్ర అయిన గిరీశం (—అనే "గిర్రడు") అమాంతంగా కడంపాత్రల కన్నింటికీ నామంపెట్టి ప్రదర్శనం మొత్తానికి తనే అక్రమంగా మొనగాడు అయినట్టున్నా, గోచరిస్తుంది. పైగా, 'కన్యాశుల్కం' కూడా 'మృచ్ఛకటిక' లాంటి సాంఘిక ప్రదర్శనమే గనక మధురవాణి వసంతసేనని మనజ్ఞప్తికి తెస్తుంది, గిరీశం శకారుణ్ణి జ్ఞప్తికి తెస్తాడు. మధురవాణి వసంతసేనకి మల్లే హృదయం కలది అవడమే కాక, మాట మాధుర్యం కలదై ఇతరుల్ని (సౌజన్యారావు వంటివార్ని కూడా!) దిద్ది సన్మార్గాన్ని పడేటట్టు చేస్తుంది. జ్ఞానాజ్ఞానాల కలయిక, సంప్రదాయాలలో గల, శకారుడి రాక్షస హాస్యంముంగా, అటువంటి కలయికయే, భామలలోకూడా కల, గిరీశం యొక్క తుంటరి హాస్యం మార్దవం అని తోస్తుంది. ఈరీతిగా, నేను కాదు, విశేషసారస్యం తెలిసిన వాళ్లు విచక్షణతో చూస్తే ఒక శాశ్వత గ్రంథ పరంపరను జనింప చెయ్యగలగడానికి ఉండవలసిన ఉన్నత లక్షణాలుగల అపూర్వ రచనలలో 'కన్యాశుల్కం' ఒకటి సుమా, అని, పరిష్కరించగలరు. ఆంధ్రుడు 'కన్యాశుల్కం' చూడకపోతే ఎట్లా, 'కన్యాశుల్కం' చూడకపోతే ఆంధ్రుడెట్లా!

తరవాత 'కొండుభొట్టీయం.' 'కన్యాశుల్కం' అతిపూర్ణం అయితే, 'కొండుభొట్టీయం' అసంపూర్ణం. అయిదంకాలూగల సాఫు ప్రతి రైలుప్రయాణంలో పోవడం, చిత్తు ప్రతిలో మూడంకాలే ఉండడంవల్ల, ఇట్లా ఇది నిల్చిపోయింది. కథ యొక్క దృష్టి సంఘసంస్కారం. గిరీశం ఇందులో ఉంటాడు బి. య్యే ప్యూర్తిచేసి! కవికి ఆ పాత్రమీద మక్కువ మరి వదగాలా? అతడు యుగంధరరావు పంతులు కొడుకని తెలుస్తుంది. 'కన్యాశుల్కం'లో అమాయిక వితంతువూ తుంటరి బ్రహ్మచారీవస్తే, ఈ రచనల్లో అందుకు ప్రతిగా తెలిసిన వితంతువూ తెలియని బ్రహ్మచారీ వస్తారు. సాహేబుపాత్ర హిందుస్తానీ మాట్లాడతాడు. పద్యాన్ని నవ్వు తెప్పించడానికి ఉపయోగించిన చోటుందిందులో! మంజువాణి మధువాణికంటె శ్రేష్ఠ. కొండిభొట్లుపాత్ర శర్విలకుణ్ణి స్ఫురింపచేస్తుంది. వెంకన్న పాత్రవల్ల జాలిమొక్క సరిహద్దుల్ని ముట్టుగునే హాస్యం కలుగుతుంది దీని రంగాలన్నింటికీ మతసంస్కార చర్చలు వచ్చేరంగాలు మాత్రం దీర్ఘం. జరిగిపోయిన సంగతియొక్క కథనంవల్ల హాస్యం కల్పించడం ఈ గ్రంథంలో ఒకవిశేషం. రామ్మూర్తిపెళ్ళి, అక్కాబత్తుడి సాయం, గిరీశంపెళ్ళి, వెంకన్న పామరత్వం ఇవన్నీ బహుశ లిఖించని అంకాల్లో ఫలించి ఉండి ఉండాలి. ఇక ప్రదర్శనాల్లో ఆయన చివరికి యత్నించింది 'బిల్హణీయం'. వ్యావహారిక భాషలో ఉత్కృష్టభావాలు ప్రకటన చెయ్యవచ్చునని తార్కాణకోసం అది రాస్తూన్నట్టు ఆయనే ఒక స్నేహితుడికి రాశారు. ఇది రెండంకాలే అచ్చుపడింది (౧౯౧౦, ౧౯౧౧ ఆంధ్ర సంవత్సరాది సంచికలలో) గ్రంథరూపంలో ఇది నేను చూడలేదు. కథ, బిల్హణీయ ప్రబంధంలో ఉన్న పచ్చిరకం కాదు. వైయాకరుణులూ, తార్కికులూ, ఉపాధ్యాయులూ, మంత్రీ, కలిసి కవినైనవాణ్ణి, రాజు, గౌరవించకుండా చెయ్యడానికి పడేపాట్లు ఇందులో కళ్ళకి కట్టినట్లున్నాయి. ఇందులో కథంతా ఆస్థానంలో జరిగిందే అనీ, ఫలానా పాత్ర ఫలానా అనీ, అంటారు. కావచ్చు. లేక బిల్హణీయ ప్రబంధంలోని 'శబ్దాపశబ్ద' పద్యంవల్ల ఈ పన్నుగడ స్ఫురించి ఉండవచ్చు. ఆస్థానాలల్లోని గౌరవ ప్రియత్వాలూ, అక్కసులూ,

ఈర్ష్యలూ, గోతులు తవ్వడాలూ, కాళ్లు పట్టుగోడాలూ, లుకలుకలూ, ఇందులో తెలుస్తాయి. ఇందులోని విదూషకుడు 'స్వీయం' కావచ్చు కాని, షేక్స్పియరులోని 'ఫూల్' జ్ఞాపకం వచ్చితీరుతాడు. ఇక నారాయణభట్టుగారి బిల్హణానుకరణ శ్లోకం వగైరా లట్లా ఉంచి, కొన్ని భావాలు స్మరిస్తాను. "మనపవవి సదక్షిణాకంగా ధారపోస్తే ఒల్లఘుబిల్హణుడు" అనే వాక్యంలోని సారస్యమూ, "అసాధారణ ప్రతిభావంతులగు మహా పండితుల చేత ఉత్పాదితమైన వాక్పరంపర భగవదుత్పాదిత మగు సృష్టి పరంపర వలెనే అస్మదాదులకు ఆశ్చర్య జనకమై యెన్ననశక్యమై యుండును" అనే వాక్యంలోని హాకమూ, "వ్యాకరణ శాస్త్రము శబ్ద బ్రహ్మపరము, మీ తర్క శాస్త్రము అర్థ బ్రహ్మపరము. అర్థ బ్రహ్మాన్నే అందరూ ఉపాసిస్తారు. శబ్ద బ్రహ్మంతో సంతుష్టి తక్కువ. అర్థంమాట కొస్తే మంత్రి నాగా పంతులు మహా పండితులు. మీరంతా నిరర్థకులే" అనే పరిచ్ఛేదంలోని సార్థక హేళనా, "సాగింది నిజం, సాగంది దబ్బర" అనే వాక్యంలోని సొగసైన తెలుగు దెబ్బా, "పండితులకి ఉద్యోగాలు చెయ్యాలని తాపత్రయం, ఉద్యోగస్తులకు పండితు లనిపించుకోవాలని తాపత్రయమూను" అనే దాంట్లోని రెండంచుల కత్తిచురుకూ, కవి తలపెట్టిన సంకల్పం సిద్ధించి ఆయన భాషాశైలి ఆరితేరి గడ్డ కట్టింది అని సాక్ష్యం ఇస్తాయి.

సాధారణంగా కొత్తదారి తొక్కినవాడిమీద పడే అపవాద ఏమిటంటే, అతడు పాత దారిని నడవడానికి సామర్థ్యం లేక ఏదో కొత్త ఎత్తు వేశాడు — అని. ఈ మాట ఆయన్ని ముత్యాల సరాలు రాయగానే అనుంటారు. ఆ అపవాద తొలగించుకోడానికి లోగడ కవులు పుచ్చుకున్న పాత కందగీతాలూ ఆటవెలది చంపకమాలలూ పుచ్చుకుని, పాతకథ పుచ్చుకుని, ఆయనా 'సుభద్ర' రాశారనుకోవాలి. కాని, ఈయన కందాలు కర్రవీ, ఆటవెలదులు పై మెరుగు రకం కాక, జీవంతో తాండవించడం వల్లనున్నూ; పైగా ఈయన కథలో నాటకమూ, భాషలో ధ్వనీ

బయల్దేరడమున్నూ జరిగి ఈరచనా ఆకర్షణీయంగానే ఉంది. 'ముత్యాల సరాల' భాష హృదయ భాష. వాటి సందేశం సరిగా వ్యాపించడానికి ఆంధ్ర వైశాల్యం చాలదు. మత్తకోకిల పాదంలో కొంతభాగం ముత్యాల సరపు పాదం. అయినా, దీని నడకలో కొత్తదనం ఉంది. ముత్యాల సరాల కవిత్వం ఆస్వాదించడానికి అనర్హుడైన తెలుగు వాడుండడు. 'నీలగిరి పాటలు' అన్నీ కలిపి అరడజనే అయినా, వాటి తెలుగుదనం, వాటి హృద్య సందేశం, వాటి శబ్దార్థల మరాగ సమన్వయం, అద్వితీయం! 'చిత్తరువని చూడ' అనే గేయం, ఆస్వాదకుడియొక్క ప్రస్తుతిజన్మకే కాక 'కలుగు జన్మములకు' కూడా ఔషధం. 'మాటా మంతీ' లోని అంశాల యొక్క ముచ్చటింపు ఆయనయొక్క ప్రసన్నతనీ, జనప్రియత్వాన్నీ, సత్యప్రియత్వాన్నీ, నిరాడంబరత్వాన్నీ, కావ్యాభిరుచినీ తెలియపరుస్తుంది. ఇక, "అమృత నిష్యందిని యగు కలకల నగవును, కిరికంకణముల హృద్యారావమును విని నయ్యేను" అనే "దిద్దుబాటు" యొక్క చివరవాక్యం, చిన్న కథయొక్క నిర్వచనం తెలియజేస్తుంది అనడంలో అతిశయోక్తి లేదు. 'మీపేరేమిటి' అనే వచనరచన మరోటి. ఇందులో 'శతపెంకె' అయిన "రామ్మూర్తి" గురించి వస్తుంది. నందిగా మారి రంకెవేసి పరారీఅయి మళ్లీవచ్చి త్రిశూలాకారం గనక పేరు శివపేరే అని దెబ్బలాడే శరభయ్యా!; కలెక్టరు వేసిన అయిదు రూపాయల జుల్మానా సంగతి కప్పెట్టుగుని పైపెచ్చు కలెక్టరు తనకి అయిదు రూపాయిలు ప్రెజెంటిచ్చి ముష్టి చెంబు కొనిపెట్టినట్టు చెప్పుగుంటూ పృథివ్యాపస్తేజాల నీచక్రమమున్నూ తనబరువున్నూ హేతువులుగా చెప్పుగుని గుండం తొక్కడం మానుకున్న వైష్ణవకెప్తాను మనవాళ్లయ్యా; తూంపట్టు పులిహోరా వైష్ణవమూ ఏకకాలమందే గ్రహించిన రామినాయుడూ; అంతా చల్లారిం తరవాత అటకమీంచి దిగి భార్యయొక్క సాహాసానికి ఆవిడమీద అనుష్టుప్పు చెప్పిన కృష్ణమాచార్యులూ; చదువర్ని ఆకర్షించి ఆనందింప చేసారు.

ఇట్లాంటివి ఆ వ్యక్తి రచనలు. మరి ఆ వ్యక్తి!

ప్రజ్ఞా, మేధా, శాస్త్రం, కళా—అన్నింటిలోనూ నిధులైన మహారాజున్నూ సభ్యులున్నూ కూడా గల ఆస్థానంలో మహాతేజంతో ప్రకాశించిన తార—గురజాడ అప్పారావు.

ఆంధ్ర భాషా స్వరూపంలో వచ్చిన విప్లవానికి తాను శ్రీ గిడుగు వెంకటరామమూర్తి పంతులు వంటి కారకుడు కాకపోయినా, నూతన రూపోదయానికి తానొక వేగుచుక్క అని ముంజూపు గల ద్రష్ట—గురజాడ అప్పారావు.

తననాటివరకు ఉన్న పాత రచనలో యంత్రత్వం, కృతకత్వం, అశ్లీలతా, ఆడంబరత్వం మాత్రం విసర్జించి, మాహాత్మ్యం స్వీకరించి పాత కొత్తల మేలు కలయికలో ఆకర్షణ సహజరీతిని సాధించి, ముట్టినదంతా రసవంతం చేసిన సువర్ణయోగి—గురజాడ అప్పారావు.

ఎన్ని రంగాలలోని ఆంధ్ర జీవితాలూ సానుభూతితో పరిశీలించి, అనేకుల్ని రసాభివృద్ధి నిమిత్తం ఏకంచేసి, వాటి జీవత్వానికి ఋజువుగా చరితార్థం అయిపోయిన పేర్లుగల హాస్య పాత్రల్ని బహుళంగా సృష్టించిన ప్రథమాంధ్ర రచనాబ్రహ్మ—గురజాడ అప్పారావు.

ఆంధ్రాంగ్ల సంస్కృతి మహాజన జీవిత రహస్యాలూ, సారస్వత విశేషాలూ అవగాహన చేసుకొని, తన హృదయంలో పరివర్తనలు కలగగా, వాటిని తన హృదయ సౌకుమార్య భాషతో సూటిగా ఆంధ్ర హృదయాలకి చలనం కలిగేలాగు, గంభీర భావంతో కీర్తెసంత నిరాడంబరంగా—ఆకులందున అణగి మణగీ కవిత కోకిల పలుకునోయ్—అని తనే అన్నరీతిగా అనగల్గిన ఆంధ్రహృదయ కవి—గురజాడ అప్పారావు.

అభయం, దివ్యప్రేమ, పవిత్రస్నేహం, త్రికరణశుద్ధి, సకల మానవ సౌభ్రాతృత్వభావం, కార్యాచరణా, దేశమానవాదరణా, సుగుణగ్రహణం, క్షమం—వంటి మహా

[illegible] కన్యాశుల్కం నాటకం [illegible] గేయ మొదలైన సాహిత్య ప్రక్రియలన్నింటిలో మార్గదర్శనం చేసిన సర్వతోముఖుడు — గురజాడ అప్పారావు.

నీకు బుద్ధిలేదా అని తనకి ఉత్తరం రాసిన ఒకానొక ఆసామికి కూడా ఎంతో మొగమాటంతోనూ మిక్కిలి మార్దవంగానూ జవాబు వ్రాయగల్గిన శాంతము గల సమచిత్తుడు—గురజాడ అప్పారావు.

ఇక మోటుతనంగాని నిర్దయగాని అసభ్యతగాని కలిగినట్టిది కాకుండా ఉండే చమత్కారమున్నూ, ఒకే పాత్రలోనూ పాత్రల సన్నివేశక్రమంవల్లా సంగతుల పౌర్వాపర్య క్రమంవల్లా, ఒకప్పుడు ఒకే సంఘటనలో, మరొకప్పుడు రెండు సంఘటనల క్రమా వైరుద్ధ్యంవల్లా, మరి యెన్నెన్నో విధాలుగా కేవల చమత్కారంకంటె గంభీరమైన సమవర్ణ సార్వకాలికమై శాశ్వతమై హృదయంగమమైన హాస్యరసం ఆంధ్రంలో కల్పించి దాన్ని [illegible], [illegible] విషయం [illegible] ఆంధ్రహాస్యరస సమ్రాట్—గురజాడ అప్పారావు.

అస్మదాదుల శిరస్సీమన్ని పావనం చెయ్యడానికి కేవల ముత్యాల సరములు కాదు సువర్ణాక్షరమాలలు చిత్రవిధాలుగా గుచ్చి మనసారా ఇచ్చిన ఆంధ్రహృదయ సులభుడు—గురజాడ అప్పారావు.

నిజహృదయ వ్యాపారాలు సాటి ఆంధ్రుల హృదయాలకి లీలగా ప్రకటించాలనే వ్యక్తులకీ, హృదయానుభవం సూచించే మాటలు పైకి అనడమే కాకుండా లిఖితం కూడా చెయ్యడం అనేది సంస్కృతాంగ్లాది భాషలు నేర్చిన తెలుగువాళ్ల ఎదట నామర్దా అనీ, నేరం అనీ అనుకునే నాబోటి భీరువులకీ, తెలుగు వాణి విహరించగల రాజమార్గాలు నిజతేజం ప్రసరించి సూచించిన స్వయంజ్యోతి — గురజాడ అప్పారావు.

జాతి మత వర్ణ వ్యక్తి భేదాలూ చెఱుగులూ గురించి నవ్వేసి, వెకట లోకటిగ చూచినవాడే ప్రాజ్ఞుడనీ, మంచిచెడ్డ భేదాలు తప్ప ఇతర భేదాలు మానవుల్లో లేవనీ ఘోషించిన కుటుంబి— గురజాడ అప్పారావు.

తన వాక్యాల్లోని ప్రత్యక్షరం బీజాక్షర ప్రాయంగా కల్పించ గలిగి, ప్రత్యక్షరం నాలోటి పామరులకి ఒరవడిగా చేసి, నూతనాంధ్ర హృదయ కవిత్వ వ్యవసాయంలో యథేచ్ఛగా ఊతుచుగునే నిమిత్తం తన రచనని ఆకుమడిగా చేసియిచ్చిన క్షేత్రజ్ఞుడు— గురజాడ అప్పారావు.

—నామాటలు చాలవు. జీవం ఉట్టి పడుతూన్న ఆయన రూపం ఇదుగో, చూడండి!!

విజయశ్రీ

"కరుణశ్రీ"

[కురుక్షేత్ర మహాసంగ్రామంలో నిరుత్సాహంతో నిర్వీర్యుడై
నిలిబడిపోయిన ఫాల్గుణిని ప్రబోధిస్తూ శ్రీకృష్ణుడు:—]

గాండీవంబిది చేయి జారినది—మై కంపించెడిన్—బాష్పముల్
నిండెన్ కన్నులనిండ—ఏమిటిది కౌంతేయా! ద్విషత్ సైన్యముల్
బండారం బది బైట బడ్డ దని పేళాకోళముల్ చేయరే!!
రెండే రాజుకు 'స్వర్గమో' 'జయమొ' వేరే మార్గమే లేదికన్.

"అర్థింపన్ విజయమ్ము భోగముల నభ్యర్థింప రాజ్యార్థినై
ప్రార్థింపన్ సిరు"లంచు ధర్మముల ప్రారంభించినా వేమిటో!
పార్థా! నేటికి కట్టిపెట్టుము వచః ప్రాగల్భ్యముల్—చాలురా
స్వార్థత్యాగము, తల్లిపిల్పు వినరా! శంఖమ్ము పూరింపరా!!

శంకా సంకుచితాంతరంగులు వృథా సందేహ మందేహులున్
కింకర్తవ్య విమూఢ చిత్తులు కురుక్షేత్రమ్ములో నిల్వరా
దింకన్ మార్గములేదు—వింట విశిఖమ్మే లాగెదో, కానిచో
పంకా లాగెదొ రాజరాజునకు దావా! రెండు హస్తాలతో!!

ధర్మక్షేత్రము క్షాత్రపాత్రము పవిత్రమ్మౌ 'కురుక్షేత్ర' మన్
కర్మక్షోణి స్వధర్మ నిర్వహణ దీక్షం దాల్చి విద్రోహులన్
నిర్మూలించి "స్వతంత్రభారత పునర్నిర్మాణ దక్షుండ"వై
మార్మ్రోగింపుము దిగ్దిగంతముల యుష్మద్దేవదత్తధ్వనుల్!!

సస్యశ్యామల రత్నగర్భ మహిమాసంపన్న మీ తల్లి దీ
నాస్యచ్ఛాయల రొమ్ము గప్పుకొని నిద్రాహార సన్యస్తయై
దాస్యం బీడ్చుచునుండె శాత్రవ గృహద్వారమ్ములన్—చాలు, నా
లస్యం బో కురుసింహ! శృంఖలము లుల్లంఘించి లంఘింపరా!

అమ్మ పరాయిపంచబడి యశ్రు లోడ్చుచునుండ బిడ్డని
ర్భ్రష్టదిఁ జూచి యోర్వఁగలదా! బ్రతుకుం బలివెట్టి తల్లి దా
స్యమ్మును దీర్పఁ కిట్లనదవై పడియుందువె చేతకాని వ
డవు విధాన? మునుల బిడ్డల నామము హేళనముగన్

విజయశ్రీ గొనితెత్తు వీ పనుపు నువ్విస్తారా చూస్తారురా
విజయా! సోదరులెల్ల, సైనికుల సర్వీర్యులుండిప్పై కపి
ధ్వజమున్యాదియు గాండివమ్ము పరువున్ ధ్వంసంబుగా నవ్వవే
త్రిజగంబుల్, తల [illegible]

నే నుంటిన్ రథమున్ గదల్చుటకు—సంధింతున్ సమస్తంబు నే
నే—నీవుండు నిమిత్తమాత్రముగ— సందేహమ్ము బోనాడి నా
పై నర్పింపుము భారమంతయును—గెల్వంబో దధర్మంబు, మీ
దే నోయీ విజయంబు—ముద్దుల మరందీ! నమ్ము మమ్మాటికిన్

ఆత దజాతశత్రుడు—మహాత్ముడు—శాంతతపస్వి—విశ్వవి
ఖ్యాతుడు—ధర్మరా జతని యాత్మికశక్తికి లేవసాధ్యముల్ ॥
తాతల పంటివారయిన తప్పుదు లోబడి పోదురోయి! ధ
ర్మేతర శక్తులెట్లు తలయెత్తును ధర్మబలమ్ము సన్నిధిన్?

గాండీవమ్ము ధరించి వైరి బలమున్ ఖండించి యుష్మద్భుజా
పాండిత్యమ్మును జూప కీర్తియ భయభ్రాంతుండవై క్రుంగి కూ
ష్మండన్ పాశుపతంబు మైల బడిపోదో! పాండు భూభృద్యశో
డిండీరంబుల పాండిమమ్ముకు కిరీటీ! లోటు వాటిల్లదో!!!

పాంచాలీ పరిషత్ పరాభవ మహో [illegible] మేఘాంబ[illegible]గ
ర్జించెన్ నీదు విరోధి శీర్షములపై — శీఘ్రంబె లేలెమ్ము! నీ
వంచద్గాండివ నిర్విముక్త విశిఖా సారమ్ముతోపాటు వ
క్షి[illegible] నావృత [illegible] ఘాతమ్ముగన్

రధియై గాండివమూని [illegible] పోరాటంబు సాగింప — సా
రధియై పగ్గములూని [illegible] రథసారథ్యంబు గావింపగా
ప్రధనంబం దెదిరించి నిల్వగలడే పాంచాలుడైనన్? వృధా
వ్యధ నీకేలర? [illegible] కుమారా! విల్లు [illegible]!

జాతీయ రచనలు

నవ్యాంధ్రకవులు నవ్యహిందీకవులు

'కరుణశ్రీ'

"దేశాన్నుంచి జాతినీ, జాతినుంచి దేశాన్నీ మనం వేరుపరచలేం. ఒక దానినుంచి వేరొకదాన్ని విడదీసి చూడలేం కాబట్టే దేశమంటే జాతీ, జాతంటే దేశమూనూ—
అందుకనే అప్పారాయ కవీంద్రుడు

'దేశమంటే మట్టి కాదోయ్
దేశమంటే మనుషులోయ్'

అని ఉద్ఘోషించాడు. దేశమూ జాతీ ఒకటే అయినప్పుడు వాటిమీద అభిమానం కూడా ఒకటే అవుతుంది. దేశాభిమానంలో జాత్యభిమానమూ జాత్యభిమానంలో దేశాభిమానమూ అంతర్వాహినిగా ఉండనే ఉన్నవి.

'ఎరుగని జనులమధ్య నడిచి నడిచి
ఎన్నో సముద్రాలు దాటి వచ్చాను తల్లీ!
ఇంతకు పూర్వం నాకు నీమీద
ఎంతప్రేమ ఉన్నదో తెలిసింది కాదు'

అని ఒక సుప్రసిద్ధాంగ్లకవి మాతృదేశాన్ని గురించి అన్నాడు.

ఏవస్తువయినా మనచేతుల్లో ఉన్నంత వరకూ మనకు దానిగౌరవం తెలియదు. అది మనచేయిజారి పరాయి చేతిలోకి పోయినప్పుడే దాని మహత్వమూ ఆవశ్యకత్వమూ గోచరిస్తాయి. దేశాభిమానంగానీ జాత్యభిమానంగానీ స్వపర భేదాలను తెలుసుకొన్నప్పుడే పరిపూర్ణమై దేశపరమౌతుంది. అదిలేనప్పుడు వ్యక్తిగతమై నిలిచి ఉంటుంది.

అందువల్లనే ప్రాచీనులలో మన కాలమునాటి దేశీయసాహిత్యాన్ని పోలినరచనలు విరివిగా పుట్టలేదు. దీనికి కారణం జాతిలో చైతన్యం లేకపోవడం కాదు; అటువంటి అవసరం లేకపోవడమే. ప్రాచీనుల జాత్యభిమానం ఒక విశిష్టత కలది. ఆనాటి దేశౌన్నత్యమూ జాత్యభ్యుదయమూ ఒకరిద్దరు వ్యక్తులమీద ఆధారపడి ఉండేది. దేశానికి సర్వస్వమూ వారే అయ్యేవారు. ప్రజలలోని దేశాభిమానం వీరారాధనగా

ప్రకటిత మర్యాద. ఎంత స్వతంత్రుడైనా సంఘానికి అతీతుడు కాకపోవడం వల్ల ఆనాటి కవి వీరకథా కావ్యవీధి విహారభూమిగా కవితాకన్యకు అనుమతిచ్చి సంతృప్తి చెందాడు. ఇంత ఎందుకు! భారతీయ సాహిత్యసౌధానికి పునాదులైన రామాయణ మహాభారతాలే జాత్యభిమానాన్ని చాటిచెప్పే వీరకథా కావ్యాలు.

ప్రాచీన హిందీసాహిత్యంలో ప్రప్రథమ వీరకావ్యం 'ఖుమాన్ రాసో'. దీన్ని 'దళపతి జయ్' అనేకవి రచించాడు. తరువాతివి నర్‌పతినాల్హా 'వీసల్ దేవ్ రాసో' చంద్ బర్‌దాయీ 'పృథ్వీరాజ్ రాసో' జగ్‌నిక్ కవి 'ఆల్హాఖండ్' ఇత్యాదులు.

తెలుగులో వీరకావ్యాలు ఏనాడు ప్రారంభమైనాయో చెప్పలేం. ఉపలబ్ధమైన వీరకావ్యాల్లో 'పల్నాటి వీరచరిత్ర' మొదటిది. దీన్ని సుప్రసిద్ధుడైన శ్రీనాథమహాకవి ద్విపదలో వ్రాశాడు. కుమార ధూర్జటి 'కృష్ణరాయవిజయము' నారాయణకవి 'రంగరాయచరిత్ర' ఈజాతికి చెందిన పద్యకృతులు. జానపదులు ప్రతినిత్యమూ పాడుకొనే బొబ్బిలికథలూ, దేశింగురాజుకథా, కాటమరాజుకథా, బాలనాగమ్మకథా ఇత్యాదులెన్నో తెలుగుదేశంలో విశేషవ్యాప్తిలో వున్నాయి. వీటిని ఎవరు వ్రాశారో తెలియదుగాని ఆ అజ్ఞాత కవులు కవితోద్రేకపూరితులు. వీరరసం వీరిరచనల్లో ఉత్తమస్థాయి కుదుర్చుకున్నది. ఈ పాటలు పాడుతున్నప్పుడూ, వింటున్నప్పుడూ వొళ్ళు పులకరిస్తుంది. హృదయం దేశంవైపు పరుగులెత్తుతుంది.

ఆధునిక హిందీకవులూ తెలుగుకవులూ దేశాభిమానాన్ని ప్రోత్సహించే కావ్యాలు బహుళంగా వ్రాశారు. అయితే వీటిని సింహావలోకనం చేసినప్పుడు వారికీ వీరికీ కొన్ని భేదాలు కనిపిస్తున్నవి. వారి అందాలు కొన్ని వీరికిలేవు వీరి సొబగులు కొన్ని వారికిలేవు. అయినా ఉభయులకూ కొంత సామ్యం లేకపోలేదు. ఒకరు కృష్ణుడూ రాముడూ మొదలైన పౌరాణికవ్యక్తులకు నవీనరూపమిచ్చి ఆధునికయుగానికి సంబంధించిన ఆదర్శనాయకులనుగా చిత్రించి తమ జాతీయాభిమానాన్ని చాటుకుంటే, వేరొకరు జీర్ణశిథిలాలలో మగ్గుపడియున్న తమ ప్రాచీనవీరుల పౌరుషగాథలు త్రవ్వి కావ్యాలకెత్తి తమ దేశాభిమానాన్ని తెలుపుకున్నారు. కొందరు దేశభక్తిని ప్రబోధించే క్రొత్తగాథలు సృష్టించారు. కొందరు ప్రాచీన క్రవస్తుల వీరచారిత్రాలు కావ్యవస్తువుగా స్వీకరించారు—ఇదేవిధంగా వీరనారీమణులమీదా, ఉత్తమ సాధ్వీమణులమీదా, భారతిజననిమీదా, జాతీయపతాకంమీదా, స్వాతంత్ర్యదేవతమీదా, కూలీలమీదా, క్రుంగిపోతూఉన్న దరిద్ర కర్షకులమీదా, దీనభిక్షుకులమీదా, దేశభక్తులమీదా రెండు సాహిత్యాలలోనూ దేశాభ్యుదయాన్ని ఆకాంక్షిస్తూ కవులు కావ్యాలు రచించారు.

తమ కావ్యాలలో పురాణమూర్తులను దివ్యపీఠాలనుండి దింపి దేశాభ్యుదయానికి నడుముకట్టుకున్న నాయకులనుగా నవ్యహిందీకవులు చిత్రించారు. మహాకవి అయోధ్యాసింహ ఉపాధ్యాయ్ (హరిఔధ్)

ప్రియప్రవాస్ అనే కావ్యం వ్రాశాడు. అందులో నాయికానాయకులైన రాధాకృష్ణులను జాతీయోద్యమకాలంగల దేశసేవకులనుగా దిద్దితీర్చాడు. సందర్భోచితంగా కవి తన ఆశయాలనూ ఆదర్శాలనూ పాత్రలనోట పలికించగాడు. అఘ బక ఘోటక కృష్ణాసురాది అను రాక్షసులుగా కాకుండా కేవలం ప్రజలమీద పడి బాధించే ప్రాకృతిక క్రూరమృగాలుగా చిత్రించాడు. తన ప్రజలపైనబడి హింసిస్తూవున్న ఆ దుష్టజంతువులను సంహారంచేసి జన్మభూమిని సంరక్షించుకుంటాడు కృష్ణుడు. ఈ కావ్యంలో పరమాత్ముణ్ణి మహాత్ముణ్ణిగా మార్చగలిగాడు కవి. ప్రజాకంటకుడైన కాళీయుణ్ణి హతమార్చడానికి యమునలో దూకబోతూవున్న కృష్ణుడనే మాటలివి:

"అతః కరూఁగా యహ కార్య మైఁ స్వయం
స్వహస్త మేఁ ప్రాణ స్వకీయకో లియే
స్వజాతి ఔ జన్మధరా నిమిత్త మైఁ
న భీత హూఁగా విష కాల సర్పసే."

'నా ప్రాణాన్ని ఏమాత్రం లెక్కచెయ్యకుండా నాజాతినీ జన్మభూమినీ రక్షించుకుండే నిమిత్తం నేనీ కార్యరంగంలో దూకుతాను భయంకరమైన ఈ కాలసర్పానికీ దీని విషానికీ భయపడను'

దావాగ్ని ప్రజ్వరిల్లి దశదిశలూ కమ్ముకుని తన జనాన్ని ధ్వంసం చెయ్యడానికి సంసిద్ధమౌతున్న సమయంలో వారలనాయకుడైన కృష్ణుడు ఎంత ధైర్యంగా దానికి దూకుతున్నాడో చూడండి, తన అనుయాయులతో,

"స్వజాతి ఉద్ధార మహాన ధర్మహై
చలో కరేఁ పావక మేఁ ప్రవేశ ఔ
సధేను లేవేఁ నిజ జాతికో బచా."

'మనజాతిని ఉద్ధరించుకోటమే మన పరమధర్మం. పదండి! ప్రచండాగ్నిలో ప్రవేశిద్దాం గోగోప బృందాన్ని రక్షించుకొందాం'

తన సిద్ధాంతాన్ని చెబుతున్నాడు వినండి కృష్ణుడు

"విపత్తిసే రక్షణ సర్వభూత కా
సహాయ హోనా అసహాయ జీవకా
ఉబారనా సంకటసే స్వజాతికా
మనుష్యకా సర్వ ప్రధాన ధర్మహై."

'విపత్తిలోనుంచి సమస్తజీవులనూ రక్షించటమూ అసహాయులకు సహాయం చేయటమూ కష్టాలలో ఉన్న స్వజాతిని గట్టెక్కించటమూ మానవుడైన ప్రతివాడికీ ప్రధాన కర్తవ్యం'

ఇదేమాదిరిగా రాధను కూడా ఆదర్శనాయికనుగా మార్చాడు కవి. నాయికా నాయకు లిద్దర్నీ కర్మవీరులను దిద్దితీర్చి అంతటితో తృప్తిలేక

"సచ్చే స్నేహీ అవనిజనకే దేశకే శ్యామ జైసే
రాధా జైసీ సదయహృదయా విశ్వకే ప్రేమ దూబీ
హే విశ్వాత్మా! భరతభువికే అంకమేఁ ఔర ఆవేఁ."

'స్వదేశాన్నీ స్వజాతినీ గాఢంగా ప్రేమించే శ్రీకృష్ణుడివంటి ప్రజాసేవకుడూ విశ్వప్రేమంలో మునిగితేలే రాధవంటి సదయహృదయా మళ్ళీ మళ్ళీ ఓ ప్రభూ! మా భారతమాత ప్రేమాంకం మీదికి వచ్చేటట్లు చెయ్యి'

అంటూ అంజలిఘోడ్చి అర్థిస్తాడు.

ఇలాగే వేరొక విశిష్టసరణిలో భారతదేశమంతా బృందావనమనీ భారతీయులు గోపాలకులని ప్రకటిస్తూ దిక్కుచెడి దీనులైవున్నవారు తమ 'నాయకుడైన కృష్ణుడికోసం అన్వేషిస్తున్నట్లు వ్యంగ్యగర్భితంగా 'బృందావన'మనే కావ్యము రచించాడు చామర్తి రాజశేఖరరావు.

ఈ కవినిగురించి వ్రాస్తూ "ప్రథమ మహా సంగ్రామానంతరం రాజకీయాందోళనతో అట్టుడికిపోతున్న రోజుల్లో దేశోద్ధరణంకోసం సరైన నాయకుణ్ణి తన ఊహతో అన్వేషించసాగిన కవి ప్రయత్నఫలం ఈ బృందావనం. ఈ కావ్యాన్ని చదువుతున్నప్పుడు భాగవతమూ కృష్ణకర్ణామృతమూ చదువుతున్న వారి మనస్సుల్లో కలిగే మధురభావంతోపాటు నేడు భారతమాత తన్నుద్ధరించగల నాయకుడికోసం పడే ఆవేదనకూడా ద్యోతకమౌతుం"దన్నాడు నోరి నరిసింహశాస్త్రి.

(నవనీతము - పరిచయము)

నేటిదేశము దుస్థితీ విముక్తికి పడే ఆవేదనా ఈ కావ్యంలో సర్వేసర్వత్రా గోచరిస్తున్నవి. ఉదాహరణంగా ఈ క్రింది పద్యాలు చిత్తగించండి:

"గొల్లడు లేడు కాయుటకు, గోవులు చిందర వందరయ్యె, భీ
తిల్లె, మృగారవమ్ములకు దిక్కులు నాలుగు పిక్కటిల్లె, మా

యుల్లము తల్లడిల్లె, నిదిగోయని కన్నులు గట్టిపోయె మా
నల్లని సామిరాడె చిరునవ్వు మొగమ్మున తాండవింపగన్."

"కోపోద్దీపితుడై నిరాయుధులఁ జంకుంగాంచి యింద్రుండు దా
మాపై బంపె మహోగ్ర పావక శిలాపాతంబు, లేరో మముం
గాపాడంగలవారు దీనజనరక్షాదక్షు లీధాత్రి, మా
గోపాలుం డిట రాకమున్నె మరలం గోవర్ధనం బెత్తగన్."

"గొల్లలలోన గొల్లలకు కూడని పోరు దయించె, ముప్పు వా
టిల్లె, మృగాలధాటి ద్విగుణించె, ప్రమాదము సంఘటిల్లె, ప్రే
పల్లెను పెద్దగొల్ల వాకడైనను కంటికి గానరాడు, నీ
పిల్లనగ్రోవినాది శమియింపగదోయి! ప్రసన్నమూర్తివై."

హరిఔధ్ 'ప్రియప్రవాస్'లో రాధాకృష్ణులను ప్రజాసేవకులనుగా చిత్రించినట్లే 'కాటూరి-పింగళి' వారు తమ 'సౌందరనందము'లో శృంగార నాయికానాయకులైన సుందరీనందులను సంఘసేవకులనుగా సందర్శించారు—కావ్యాంతంలో. చివరకు ప్రేయసీ ప్రియతముల పరస్పర ప్రణయం ప్రజాసేవగా పరిణమిస్తుంది.

మైథిలీశరణ్ గుప్తజీ 'సాకేత్'లో హరిఔధ్ చూపిన మార్గాన్ని త్రొక్కి పురాణమూర్తులైన సీతారాములను జాతీయాభిమానమూ దేశభక్తీ కల ఆదర్శ నాయికానాయకులనుగా చిత్రించాడు. ఈ కావ్యంలో కూడా కవి అక్కడక్కడా తన దేశాభిమానాన్ని పాత్రల మరుగునుండి ఉగ్గడించాడు. అయోధ్య వదలి అరణ్యాలకు వెళ్ళుతున్న శ్రీరాముడు తన జన్మభూమిని సంబోధిస్తూ ఇల్లా సెలవడుగుతాడు:

"జన్మభూమి। లే ప్రణతి ఔర ప్రస్థాన దే
హమ కో గౌరవ గర్వ తథా నిజ మానదే।
హో జాడఃఁ మైఁ లాఖ బడా నరలోకమేఁ
శిశు హీ హూఁ తుఝు మాతృ భూమి కే ఓకమేఁ
....
రామ చంద్ర భవభూమి అయోధ్యాకా సదా
ఔర అయోధ్యా రామ చంద్రకీ సర్వదా"

"జననీ! జన్మభూమీ! ఇవిగో మా నమస్కారాలు సెలవివ్వుతల్లీ! మాకు ఆత్మాభిమానాన్నీ ఆత్మగౌరవాన్నీ ప్రసాదించు. లోకంలో నేనెంత పెద్దవాడినయినా నీ వొళ్ళోని పసిబిడ్డనే — సర్వవేళలా ఈ రాముడు జన్మభూమివైన నీవాడే ఏనాటికీ నీవు రాముడిదానవే"

దేశభక్త్యుద్బోధకాలయిన ఆధునికాంధ్ర కావ్యాలలో ఆంధ్ర ప్రశస్తి, హంపీక్షేత్రమూ ఒక ప్రత్యేకత్వం గల కావ్యాలు. వీటిలో చారిత్రాత్మకాలైన కొన్ని రసవద్ఘట్టాలు రూపం తాల్చాయి. 'ఆంధ్ర ప్రశస్తి' యావదాంధ్ర దేశానికీ సంబంధించిన ప్రాచీనగౌరవాన్ని చాటే ఖండకావ్యసంపుటి. ఇందులో విశ్వనాథ వారి ఆంధ్రాభిమానమూ జాతీయావేశమూ ప్రతిపద్యంలోనూ ప్రకటమౌతుంటాయి. ఈయన దేశభక్తి గంభీర గంగా తరంగిణివలె ప్రవహించిందీ కావ్యంలో. హంపీక్షేత్రంలో 'కొండాలి' విద్యానగర ప్రాచీనౌన్నత్యాన్ని కన్నులకు కట్టేటట్లు వర్ణించాడు. ఈ కావ్యాన్ని చదవేటప్పుడు పాఠకుని హృదయం నాటి ఉన్నతినీ నేటి అవనతినీ తలచుకొని కుంగిపోతుంది. ఇలాంటి ప్రాచీనుల చారిత్రాత్మక ఘట్టాలు రూపం దాల్చిన ఖండకావ్యసంపుటాలు ఆధునిక హిందీసాహిత్యంలో కనబడవు.

అయినా ప్రత్యేక చారిత్రాత్మకకావ్యాలు కొన్ని ఆధునిక హిందీకవులు సృష్టించారు. వాటిలో శ్యామ్ నారాయణ్ పాండేయ్ వ్రాసిన 'హల్దీఘాటి', మైథిలీశరణ్ వ్రాసిన 'రంగ్ మేఁ భంగ్', సియారాంశరణ్ వ్రాసిన 'మౌర్య్యవిజయ్' ఇత్యాదులు సుప్రసిద్ధాలు. 'హల్దీఘాటీ' కావ్యంలో రాణా ప్రతాప్ చరిత్రం వీరోచితంగా చిత్రించాడు కవి ఇది సుప్రసిద్ధులైన చిత్తూరువీరుల ఆత్మగౌరవాన్నీ, వీరావేశాన్నీ, దేశభక్తినీ ప్రదర్శించే ఉత్తమకావ్యం 'రంగ్ మేఁ భంగ్'లో కుంభహాడా వీరచరిత్రమూ జన్మభూమి కోసం అతడు చేసిన ఆత్మత్యాగమూ వర్ణింపబడ్డాయి. బూందీ దేశీయుడైన కుంభహాడా చిత్తూరు రాణా 'లాఖా' వద్ద సైనికోద్యోగంలో ఉంటాడు. బూందీప్రభువులకూ చిత్తూరు ప్రభువులకూ వైరం సంభవిస్తుంది. ఒకరోజు లాఖా బూందీదుర్గాన్ని నాశనం చెయ్యందే అన్నోదకాలు స్వీకరించనని ప్రతిజ్ఞ చేస్తాడు. కాని చిత్తూరుకు బూందీ చాలాదూరం. ఒక్కరోజులో వెళ్ళి దానిని జయించి దుర్గాన్ని భగ్నంచెయ్యడం అసంభవం. తన ప్రతిజ్ఞ వ్యర్థంకాకుండా మంత్రులిచ్చిన సలహా ప్రకారం రాణాలాఖా నకలుదుర్గాన్ని కట్టించి దాన్ని భగ్నం చెయ్యబోతుంటాడు. ఆదేసమయంలో వేటనుంచి తిరిగి వస్తూవున్న కుంభహాడా ఆవిషయాన్ని తెలుసుకుంటాడు. జన్మభూమి ప్రతిరూపాన్నిసైతం లాఖా భగ్నం చెయ్యబోవటం అతడు సహించలేకపోతాడు. తన ప్రభువైన రాణా నెదుర్కొంటాడు. వీరావేశంతో యుద్ధంచేసి జన్మభూమి స్వాతంత్ర్యరక్షణం కోసం తనప్రాణం బలియిస్తాడు.

సియారాం శరణ్ 'మౌర్య్యవిజయం' మగధసమ్రాట్టు చంద్రగుప్తుడి చరిత్ర చిత్రింపబడ్డ కావ్యం. ఇందులో గ్రీకుసైనికులకూ భారతసైనికులకూ యుద్ధమూ, చంద్రగుప్తచక్రవర్తి గ్రీకుప్రభువైన సెల్యూకస్‌ను ఖైదీగా పట్టుకోటమూ, సంధీ, సెల్యూకస్ కుమార్తె హెలీనాకూ చంద్రగుప్తుడికీ వివాహమూ

ఇత్యాది ఘట్టాలు రసవంతంగా వర్ణించాడు కవి. నవ్యాంధ్రసాహిత్యంలో రాజశేఖర శతావధాని 'రాణా ప్రతాపచరిత్ర', ఏటుకూరు వెంకటనరసయ్య 'మగువమాంచాల', జాషువా 'శివాజీ' పైజాతికి చెందిన వీరకావ్యాలు. ఇందులో 'శివాజీ' ఇంకా ప్రకటితంకాలేదు. రామనరేశ్ త్రిపాఠీ రచించిన 'పథిక్' అనే కావ్యం హిందీసాహిత్యంలో ఒక ప్రత్యేకస్థానం సంపాదించుకొన్నది. 'పథిక్'లో ఇతివృత్తమిది 'పథిక్' సౌందర్యోపాసకుడు; ఇల్లూ వాకిలీ వదలి సముద్రతీరంలో ప్రకృతి సౌందర్యంలో నిమగ్నుడై రోజులు గడుపుతుంటాడు. భార్యవచ్చి పలువిధాలుగా బతిమాలుకుంటుంది యింటికి రమ్మని. పథిక్ ససేమిరా అంటాడు. భార్య నిరాశతో వెళ్లిపోయి తన ముద్దులబిడ్డను చూచుకుంటూవుంటుంది. ఈ సంభాషణ విన్న ఒకయోగి 'పథిక్' వద్దకు వస్తాడు. ప్రకృతి సౌందర్యంకంటే ప్రజాసేవలో ఉన్న సౌందర్యాన్నీ శాంతినీ అతనికి ఉపదేశిస్తాడు. పథిక్ మనస్సుమారి వనాలువదలి దేశంలోకి వెళ్ళుతాడు. అత్యాచారాలతోనూ హాహాకారాలతోనూ నిండివున్న దేశదౌర్భాగ్యదశ చూచి అతడు చాలా విచారిస్తాడు. దేశసేవకు నడుము కట్టుకుంటాడు. ప్రజలంతా పథికుని ప్రేమిస్తారు. ఇదంతా ఆ దేశపు రాజుకు తెలుస్తుంది. పథిక్ రాజద్రోహం నేరంక్రింద బంధింపబడతాడు. చివరకు పథిక్ అతనిభార్యా కుమారుడూ దేశంకోసం ప్రాణార్పణచేస్తారు. ప్రజలు అత్యాచారాన్ని సహించలేక రాజును తొలగించి ప్రజారాజ్యాన్ని స్థాపిస్తారు. దేశమంతా స్మరించి అందరూ పథికుని దేవునిగా ఆరాధిస్తారు— ఈ కావ్యం హిందీసాహిత్యానికి అమూల్యభూషణం. ఇలాంటిది మన తెలుగులో ఇంతవరకూ రాలేదు.

జాతీయోద్యమం అప్పటికి హిందీ కవులనూ తెలుగు కవులనూ పులకింపచేసి వారిచే దేశభక్తిని ప్రబోధించే కావ్యాలు వ్రాయించింది. సంఘసేవకు పురికొల్పింది. జాతీయాభిమానంతో కృతిరచనకు పూనుకొన్న మొట్టమొదటి నవ్యాంధ్రకవి గురజాడ— హిందీలో మైథిలీశరణ్— వీరిద్దరికీ పూర్వం సన్నిహితులై తెలుగు సాహిత్యంలో వీరేశలింగంగారూ హిందీ సాహిత్యంలో బాబూ హరిశ్చంద్రజీ జాతీయకవితా జాహ్నవీ ప్రాదుర్భావానికి హిమాలయాలై నిలిచారు.

జాతి ప్రాణం సంఘం మీద ఆధారపడి వుందని గ్రహించి తన రచనల ద్వారా సంఘసంస్కరణకు పూనుకున్నాడు గురజాడ.

"దేశమును ప్రేమించుమన్నా
మంచి యన్నది పెంచుమన్నా
వట్టిమాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తల పెట్టవోయ్"

అనేది ఆయన ఆదేశం. కన్యాశుల్కానికి పీఠిక వ్రాస్తూ ఇలా అన్నాడాయన: "నేను మొదట యీ నాటకాన్ని వ్రాసినప్పుడు ప్రకటిద్దామన్న ఉద్దేశంతోను సంఘసేవ కోసమూ వ్యావహారిక భాష నాటకరంగానికి పనికి రాదన్న జనసామాన్యాభిప్రాయాన్ని పోగొట్టటం కోసమూ వ్రాశాను." ఈయన ఉద్దేశంలో స్వజాతిసేవే దేశసేవ. స్వజాత్యుద్ధరణమే స్వదేశోద్ధరణము.

మైథిలీశరణ్ చెప్పుకోదగ్గ జాతీయకవి. ఈయన ప్రతికావ్యం ఇంతో అంతో ప్రాచీన భారతీయ సంస్కృతీ దేశభక్తీ ప్రకటిస్తూనే ఉంటుంది. ఉత్తర హిందూస్థానంలో ఈ కవి 'భారత భారతీ' చేసినంత ప్రచారం ఏకవి కావ్యమూ చెయ్యలేదు. 'భారత భారతి' అనేక యువక హృదయాలలో నవచైతన్యం కలిగించి వారిని దేశంవైపుకు త్రిప్పింది. దేశంలో నలుమూలలా జాతీయావేశాన్ని పొంగులెత్తించింది. ఈ కావ్య మొక్కటే వెయ్యిమంది ఉపన్యాసకుల పని చేసిందన్నా అతిశయోక్తి కాదు. ఇందులో మూడు ఖండాలున్నాయి. మొదటిది "అతీత్ ఖండ్". దీనిలో భారత్ వర్షకీ శ్రేష్ఠతా, హమారే పూర్వజ్, హమారీ సభ్యతా, హమారా సాహిత్య, హమారీ వీరతా, కలాకౌశల్, రాజత్వ ఔర్ శాసన్, ఆదర్శ, ఆర్యస్త్రియాం మొదలయిన శీర్షికలలో భారతదేశ ప్రాచీన వైభవాన్ని కన్నులకు కట్టినట్లు వర్ణించాడు కవి. రెండవది 'వర్తమాన్ ఖండ్'. ఇందులో దారిద్ర్య, దుర్భిక్ష, కృషి ఔర్ కృషక్, మందిర్ ఔర్ మహంత్, శిక్షాకీ అవస్థ మొదలైన శీర్షికలలో భారతీయుల వర్తమాన దుర్దశను వర్ణించాడు. మూడవది 'భవిష్యత్ ఖండ్.' ఇందులో ఉద్బోధన్, ఆశా, శుభకామనా, ఇత్యాది శీర్షికలతో దేశీయులను ప్రబోధిస్తూ కావ్యాన్ని పూర్తిచేశాడు. కాని కవి ఇందులో ఏది చెప్పినా వేదికమీది కెక్కిన ఉపన్యాసకుడే కాని కవికాడు. కవి వ్యక్తిత్వంలో అనంతంగా పొంగిపోయే జాతీయావేశం చేతనేమో 'భారత భారతీ' లో కావ్యత్వం కొరవడింది.

తెలుగు సాహిత్యంలో దేశభక్తిని రేకెత్తించే జాతీయ కావ్యాలు వ్రాసిన కవులలో రాయప్రోలు మేలుబంతి. ఈయన దేశాభిమానం సాటిలేనిది. 'దేశకల్యాణానికి తోరణాలుకట్టే పూర్వగాథలు చిత్రించే ఈయన రచనలు రస తరంగాలు'. తన జన్మభూమిమీద ఈయన కెంత అభిమానమో చూడండి.

"శ్రీలు పొంగిన జీవగడ్డయి
పాలు వారిన భాగ్య సీమయి
వ్రాలినది ఈ భరతఖండము
భక్తి పాడర తమ్ముడా!
వేదశాఖలు పెరిగె నిచ్చట
ఆదికావ్యము అందె నిచ్చట

భాదరాయణ పరమ ఋషులకు
పాదు సుమ్మిది చెల్లెలా!"

'ఎక్కడున్నా నేను నీబిడ్డనే నిన్ను మరచిపోను' అన్న మైథిలీశరణ్ భావాన్ని ఈయన ఎంత ఆవేశంతో ఆదేశిస్తాడో చూడండి:

"ఏదేశమేగినా ఎందుకాలిడిన
ఏపీఠమెక్కినా ఎవ్వ రేమనిన
పొగడరా నీ తల్లిభూమి భారతిని
నిలుపరా నీజాతి నిండుగౌరవము"

తన మాతృభూమిని గురించి ఎంత గొప్పగా చెప్పుకుంటాడో చూడండి:

"లేదురా ఇటువంటి భూదేవి యెందు
లేరురా మనవంటి పౌరు లింకెందు
పొలముల రత్నాలు మొలచెరా ఇచట
వార్ధిలో ముత్యాలు పండెరా యిచట
పృథివి దివ్యౌషధుల్ పిదికెరా మనకు
కానల కస్తూరి కాచెరా మనకు
అవమాన మేలరా? అనుమానమేల?
భారతీయుడ నంచు భక్తితో పాడ."

ఈ స్వర్గఖండంలో జన్మించగలిగినందుకు ఎంతో మురిసిపోతాడు.

"ఏ పూర్వ పుణ్యమో ఏ యోగఫలమొ
జనియించినాడ వీ స్వర్గఖండమున
ఏ మంచిపూవులన్ ప్రేమించినావొ
నిను మోచె ఈతల్లి కనకగర్భమున."

ఆంధ్ర జాతీయోద్యమం ప్రారంభించి రాయప్రోలుకు నూతనోత్తేజం కలిగించి ఆయన నోట కమ్మని గీతాలు గానం చేయించింది. ఆయనకున్నంత ఆంధ్రాభిమానం మరొక కవికి లేదని చెప్పవచ్చు. తన తెనుగు సీమను రమ్యాలోకంచేసి దాని అందచందాలను తన 'తెలుగుతోట'లో దిద్దితీర్చుకున్నాడు. ఈకావ్యంలో ఆయనది 'హ్లాదరమణీయ' మైన దృక్పథం. ఆంధ్రుల ప్రాచీనౌన్నత్యమూ నేటిదుర్దశా ఆయనలో పొంగి పొరలి ఆయనచేత ప్రచారకావ్యాలు చెప్పించాయి. కాని మైథిలీశరణ్ 'భారతభారతీ' లో వలెకాక రాయప్రోలు కావ్యాలలో కావ్యత్వం ఎక్కువగా కనిపిస్తుంది. ఉద్రేకపూరితుడై ఉద్బోధించే టప్పుడు కూడా తాను కవినన్న సంగతిని మరిచిపోని కవి రాయప్రోలు. ఆంధ్రదేశ ప్రాచీనసౌభాగ్యాన్ని ఉట్టంకిస్తూ అంటాడు:

"మగధసామ్రాజ్యసీమలు నీ సితచ్ఛత్ర
ముక్తాఫలచ్ఛాయ మునుగునాడు
అలకళింగోపాంతమందు నీ కంఖాణ
ఖురధూళి నెర స్నందె గురియునాడు
కర్ణాట రాజ్యాంగములు నీ కవులను
బ్రహ్మారథంబులు పట్టునాడు
తంజాపురోద్యాన కుంజంబు లందు నీ
సంగీత మధుధార పొంగునాడు
అతిభయంకర శౌర్య ధైర్యప్రసక్తి
రసవశంకర నాగరి రాగ రక్తి
ఏకమై పాకమై ప్రవహించిట్టి
ఆ యఖండ ప్రభావ మేమాయెనాంధ్ర!"

నేటి దేశ దీనస్థితిని గురించి యిలా విలపిస్తాడు:

"...............చావలేదు
చావలే దాంధ్రజన మహోజ్జ్వల చరిత్ర
హృదయములు చీల్చి చదువుడో సదయులార!"

"పెను జడల్ విరబోసికొని తాండవంబాడు
ఈర్ష్యా పిశాచి నట్టింటిలోన
సవతిబిడ్డ విధాన నవయు తల్లి తెలుంగు
విశ్వవిద్యాలయ వీథులందు
దోషశల్యంబులే దోచు నుత్సాహ
సంపన్నవ్య సాహిత్య పాలనమున
పిన్న లూర్ధ్వముఖంబు పెద్దలధోదృష్టి
ఉభయభాగ్యోపాస్తి నుత్తచూపు
ఈ యభావ వేదాంత మేమాయ గలదు
చావు బ్రతుకులు తేలు నీ సంధియందు
నాదు జాతి నాదేశము నాదు భాష
అను అహంకార దర్పన మందునాంధ్ర!"

వర్తమానాంధ్రులను ప్రబోధిస్తూ చెప్పిన పద్యాలలో ఇదొకటి:

"కృష్ణా తరంగ పంక్తిన్ ద్రొక్కి త్రుళ్ళింత
నాంధ్ర నౌకలు నాట్యమాడునాడు
ఇంటింట దేశిసాహిత్య దీపములతో
నాంధ్ర తేజస్సు తీపారునాడు
సుకుమార శిల్పవస్తు ప్రపంచము నందు
నాంధ్ర నైపుణి పంతమాడునాడు
సమద సేనావ్యూహ జయపతాకల క్రింద
నాంధ్ర పౌరుషము చెండాడు నాడు
చూచి సంతోషమున తలలూచి గర్వ
మూచి ఆంధ్రపుత్రీ పుత్రులందగలరు

శాంతి, సందాక లేదు విశ్రాంతి మనకు
కంకణ విసర్జనల కిది కాలమగునె ?"

ఆంధ్రుల ఆచారవ్యవహారాలంటే ఆయనకు అపరిమితాదరమూ ఆసక్తీ. వాటి క్షీణదశ నుద్దేశించి వ్రాసిందే 'ఆచారక్షయ' మనేకావ్యం. దీనిలో బిచ్చగాణ్ణి ఉద్దేశించి చెప్పిన యీ క్రిందిపద్యాన్ని చూచినప్పుడు కవి ఆచారక్షయముకు ఎంతగా చింతిస్తున్నాడో ద్యోతకమాతుంది.

"వినువారి కన్నీరు వినువాకగా పొంగ
సీతమ్మ కష్టాలు సెప్పిసెప్పి
వెర్రిగొల్లడు కూడ నుర్రూత లూగంగ
వీధిభాగవతాలు వేసివేసి
ముసలి వాండ్రను మీసములు ద్రిప్పి కాకెక్క
వీరబొబ్బిలి కథల్ వినిచి వినిచి
ఆబాలగోపాల మావేశమున త్రుళ్ళ
పల్నాటి యుద్ధాలు పాడి పాడి
పల్లె పల్లెల ప్రాణము పచ్చగిల్ల
జాతిసుఖము పోషించితి సర్వకాల
మెచ్చట సురింగిపోతివో బిచ్చగాడ!
కవివి పాటకుడవు నీవు కావె సఖుడ!

ఆయన దేశాభిమానవాహినిలో వీరారాధన ఒక తరంగం. దీని కుదాహరణం "రామలింగారెడ్డి" "అప్పరాయధన్వి" "సర్ రాధాకృష్ణ" "కృష్ణరాయ నాగేశ్వరులు" "సరోజినిదేవి" "శివశంకరశాస్త్రి" మొదలయిన 'ఆంధ్రావళి' లోని శీర్షికలు.

ఆంధ్రుల చరిత్ర 'రాయప్రోలు' ను ఆకర్షించినట్లే 'విశ్వనాథ' ను కూడా ఆకర్షించింది. దేశభక్తిని వెల్లడిస్తూ ప్రచారయోగ్యమయిన పద్యాలూ కావ్యాలూ రాయప్రోలు రచించాడు. విశ్వనాథ ఆంధ్రుల చరిత్రలోని రసవద్ఘట్టాలను మనోహరంగా కావ్యరూపంలో పోత పోశాడు. ఈయన 'ఆంధ్ర ప్రశస్తి' ఒక చారిత్రాత్మక ఖండకావ్యాల సంపుటి. ఇందులోని శీర్షికలలో 'ఆంధ్రవిష్ణువు' 'ప్రోలరాజు' మొద

లైనవి ప్రాచీనాంధ్రరాజుల వైభవాన్ని ప్రకటించే వీర కావ్యాలు. 'చంద్రవంక యుద్ధములో పల్నాటి వీరుడయిన బాలచంద్రుడి ప్రతాపం ప్రకటింపబడింది. చారిత్రాత్మక శిథిలాలతో నిండియున్న వేగీక్షేత్రాన్ని చూచినప్పుడు కవికి కలిగిన మనోభావాలే ఈ ఖండకావ్య సంపుటిలో 'వేగీక్షేత్రము'గా పరిణమించాయి. ఈ కావ్యం వివిధరీతుల కవి భావనాబలాన్ని పాఠకులకు పరిచయం చేస్తున్నది ఉదాహరణకు ఈ క్రింది రెండు పద్యాలూ చదవండి.

"ఈ నాపదార్పిత క్షోణి నేరాజు
ధర్మాసనంబుండి స్మృత్యర్థమనెనో
ఈ నాదృగావృతం బైన భూములలోన
నే శౌర్యధనులు శిక్షింపబడిరో
ఈ నా శరీరమం దివతళించిన గాలి
ఎంత పౌరాతన్య మేచుకొనెనో
ఈ నా తనూపూర్ణమైన యాకాశమ్ము
నే క్రతుధ్వనులు శబ్దించినదియొ
అస్మదజ్ఞాతపూర్వ దివ్యత్వ మొప్పు
నీ పునీతావనీఖండ, మిచట నిలిచి
యస్వతంత్రత దొరలు నా యాంధ్రశక్తి
నన్ను కంపింప జేయుచున్నది భృశంబు"

"ఏరాజు కంచెనో యిచట శౌర్యపు
పాయసమ్ములు నాగులు చవితి నాళ్ళ
ఏ యెర్రసంజలో నెలమి పల్లవరాజ
రమణులు కాళ్ళ పారాణు లిడిరో
చిత్రరథస్వామి శ్రీరథోత్సవములో
తెలుగు పిల్లలు కత్తి త్రిప్పిరెపుడొ
ఏ రెండుజాముల యినుని వేడిమి వచ్చి

కనిపోయెనో త్రిలింగ ప్రభువుల
నాజగచ్ఛ్రేయసమ్ములై యలరు తొంటి
వేంగిరాజుల పాదపవిత్ర చిహ్న
గర్భితంబైన యీ భూమిఖండ మందు
నస్రుపులు జాగ్రత్ జీవచ్ఛ్వాంధ్ర జనులు."

దేశాభిమానంతో పొంగిపోయేటప్పుడు విశ్వనాథ భావగాద్గద్యాన్ని పొందుతాడు. తనకూ ఆ శిథిలాలకూ, ఏదో జన్మాంతర సంబంధమున్నట్లు ఆయనకు గోచరిస్తుంది. అందుకనే వేగీక్షేత్ర కావ్యాంతంలో ఇలా అన్నాడు.

'ఇది వినిపింతునంచు మదినెంచెద మిత్రులకున్—గళస్థగా
ద్గదికము, లోచనాంతి బహుధాస్రుతి బాష్పనదమ్ము, స్పందనా
స్పదహృదయమ్ము నాపనికి జాలక చేసెడు నన్ను నింతగా
నెద పదిలించుకొన్న దిది ఎక్కడి పూర్వపు జన్మవాసనో.'

ప్రాచీనాంధ్ర రాజుల సైన్యంలో తానుకూడా ఒక వీరసైనికుడై వుంటానని ఈయన నమ్మకం. 'ఆంధ్ర ప్రశస్తి' కృతిపతిని సంబోధిస్తూ యిలా అన్నాడు:

"ఇది నీకై యిడినట్టి నాయుపద, మున్నేనాడొ ఘూసాగ్రముల్
పదునై ఆంధ్రవిరోధి కంఠదళన ప్రారంభ సంరంభ మే
చుదినాలన్ మరియొడి సైనికులలో చూరాడు ప్రేమంబులో
నిదిలేశంబని యైన చెప్పుటకు లేవే నాటి స్వాతంత్ర్యముల్."

రహస్యవాదంతో కూడిన రాష్ట్రీయభావనలు చిత్రించడంలో 'మాఖన్‌లాల్ చతుర్వేదీ' సమర్థుడు. ఈయన 'ఏక్ భారతీయ ఆత్మా' అనేపేరుతో తన రచనలు ప్రకటించుకున్నాడు. ఈ కవి 'పుష్పకీ చాహ్' అనే కావ్యంలో మాతృభూమికోసం ఆత్మార్పణం చెయ్యడానికి తహతహలాడే భారతీయాత్మ ఎలా తొంగిచూస్తున్నదో చూడండి

"చాహ నహీఁ మైఁ సురబాలా కే గహనోఁ మేఁ గూఁధా జా ఊఁ
చాహ నహీఁ ప్రేమీ మాలా మేఁ బింధ ప్యారీ కో లలచా ఊఁ

చాహ నహీఁ సమ్రాడోఁకే శవపర హేహరి। డాలా జా ఊఁ
చాహ నహీఁ దేవోఁకే సిరపర చఢూఁ భాగ్యపర ఇఠలాఊఁ
ముఝే తోడలేనా వనమాలీ।
ఉస పథమేఁ దేనా తుమ ఫేఁక్
మాతృభూమి పర శీశ చఢానే
జిస పథ ఆవేఁ వీర అనేక్"

"నాకు అప్సరసల ఆభరణాల్లో అలంకరింపబడాలనే ఆకాంక్షా లేదు. ప్రియుడి ప్రేమమాలికలో ఒక పుష్పాన్నై ప్రియురాలిని పులకింపజెయ్యాలనే కోరికా లేదు. చక్రవర్తుల శవాలపై చల్లబడాలనే వేడుకా లేదు. దేవాలయాల్లోని దేవతల తలలెక్కి కులకాలనే ఉత్కంఠా లేదు. ఓ వనమాలీ! నన్ను త్రుంచి మాతృభూమికోసం శిరస్సు అర్పించటానికి వీరులు నడిచివచ్చే మార్గంలో పడవెయ్యి—"

ఈ ఖండకావ్యానికీ వేదుల వారి కాంక్ష అనే ఖండకావ్యానికీ పోలిక విశేషంగా కనిపిస్తుంది. కాంక్షలో కవి స్వయంగా పుష్పమై ఇలా ఆకాంక్షిస్తాడు.

"నాకు తలంపులేదు లలనాజనతా కబరీభరైక భూ,
షాకలనన్, సతీ మృదు భుజాంతర తల్ప కుచోపగూహా బి
బ్బోకమునన్, వధూ సిత కపోల గళచ్ఛ్రివణావతంస హే
వాకమునన్, విలాసినుల పాపట చెందిరకావిపూతలన్.

కానుకనై ధరాధిపుల కాళ్లకడం బొరలాడి వాడిపో
లేను, ధరాపరాగ పటలీ మలినమ్మగు ద్వారతోరణా
స్థానమునం దురింబడగ జాలను, దోసిటిపేరి ఘోర కా
రా నరకమ్మునం దుసురు రాల్పగ లేను నిమేషర క్తికై.

నీచపు దాస్యవృత్తి మననేరని శూరత మాతృదేశ సే
వాచరణమ్మునం దసువు లర్పణ చేసినవారి పార్థివ
శ్రీ చెలువారుచోట దదసృగ్రుచులన్ వికసించి వాసనల్
వీచుచు రాలిపోవగవలెన్ తదుదాత్త సమాధి మృత్తికన్."

రాయప్రోలు వారి 'పువ్వు' ఇత్యాదులు వ్యంగ్యగర్భితాలయిన మరికొన్ని జాతీయరచనలు నవ్య సాహిత్యంలో అక్కడక్కడా కనిపిస్తున్నాయి.

భారతభూమికి కర్షకుడు వెన్నెముకవంటివాడు. అతని అభ్యుదయమే భారతాభ్యుదయం. కరుణమయమైన కర్షకజీవితాన్ని కన్నులకు కట్టేట్లు చిత్రిస్తూ కావ్యాలు రెండు సాహిత్యాల్లోనూ బయలుదేరాయి మైథిలీశరణ్ 'కిసాన్' ఈ జాతికి చెందిన కావ్యాలలో ముఖ్యమైనది. దీనితో పోల్చదగినది ఆంధ్ర సాహిత్యంలో దువ్వూరి వారి 'కృషీవలుడు'. అస్వాతంత్ర్య వృత్తిలో జీవనం గడపలేక కవి స్వయంగా కృషీవలుడై ఈ కావ్యాన్ని వ్రాశాడు. ఈయన "స్వాతంత్ర్యరథము" సాహిత్య వీధుల్లో తొలి నాడే బయలుదేరింది. "జలధరమాల చీల్చుకొని" 'నభోంతిరాళము జ్వలితం' చేస్తూ వచ్చే ఆరథానికి

"లేవు దివ్యతురంగముల్ లేవు కరులు
ప్రజలె ఆ తేరు మోకులు పట్టువారు
వాయుజవమున తారకాధ్వమున నేగు
అంతరాయ శతంబులనైన దాటి

ఈ స్వాతంత్ర్య రథాన్ని తానుగూడా దర్శించే 'తుమ్మల' తోడి సోదరుల కెలాంటి ప్రబోధ మిస్తున్నాడో చూడండి:

"ఆరథనేమి ఘట్టనల కగ్గములై మన హేయకాయముల్
తీరిన తీరుగాక, చనుదెండు విచారము లేల! మాతృసే
వా. రమణీయ వృత్తమున వందురి చచ్చినవారి జాహ్నవీ
తీరమునందు భోగముల దేల్తురు వెన్నెల రేల నచ్చరల్."

తుమ్మలవారి 'రాష్ట్రగానం' ఆంధ్రభూమిలో నాలుగు దిక్కులా మారు మ్రోగింది. రాష్ట్రోద్యమానికి బహుధా ప్రచారం చేసింది. ఇందులో కవి పురాతనాంధ్ర వైభవాన్ని స్మరించుకొని "పాటలీపుత్రము కోటకొమ్మల మీద తెలుగు జెండాలు నర్తించు" నాడూ "రతనాల ముత్యాల రాసులు బోసి రాయల రాచవీటిలో అమ్ము" నాడూ పుట్టక పోతినిగదా అని ఉత్కంఠతో ఉవ్విళ్లూరతాడు. సత్వ రాంధ్రరాష్ట్ర సంపాదనకోసం తహతహలాడే కవిహృదయం కావ్యంలో కనుపిస్తుంది. ఆంధ్రనారీ మణుల ప్రాచీనౌన్నత్యాన్ని ఒక పద్యంలో ఇలా వర్ణించాడు

"కలము ఖడ్గము పట్టగల నేర్పు వడసిన
రెడ్డినాగమ్మ నీబిడ్డ యటవె
జగమగంటిమి నాంధ్ర జగతి పాలించిన
గరిత రుద్రమ్మ నీకన్నె యటవె
గండికోటను మల్కదంకుపై దూకిన
గోవింద మాంబ నీకూతురటవె
మానంబుకై నిజప్రాణంబు బలియిచ్చు
మల్లాంబ నీదు కొమార్తె యటవె
వీగి వచ్చిన హృదయేశు నెక్కిరించి
పోరికంపిన తరుణి నీ పుత్రి యటవె
ఎంత తేజస్వినివి తల్లి! ఎరుకలేక
నీ మహాత్వంబు తెలియంగ లేము గాని."

'భగవాన్ దీన్' అనే హిందీకవి జన్మభూమి కోసం సర్వస్వం ధారపోసి నవీరపత్నులనూ, వీరమాతలనూ, వీరపుత్రికలనూ, వీరస్నుషలనూ, వీరసోదరీమణులనూ ఏర్చికూర్చి 'వీరపంచరత్న' అనే కావ్యహారం కన్నతల్లి కంఠంలో అలంకరించాడు. ఆయన భారత వీరమాతలను కీర్తింపని కవి కవికాదంటాడు. కవి కలానికి వీరయశోగానమే గౌరవ మంటాడు:

'వీరోం కీ సుమాతాఓంకా యశ జో నహీం గాతా
వహ వ్యర్థ సుకవి హోనేకా అభిమాన జనాతా
సబ వీర కియా కరతే హైం సమ్మాన కలమ కా
వీరోంకా సుయశగాన హై అభిమాన కలమ కా'

ఏటుకూరి వారి 'మగువమాంచాల' పల్నాటి పౌరుష ప్రభలు ప్రజ్వలించే ఉజ్జ్వల కావ్యరత్నం. పల్నాటి వీరనారీమణుల దేశభక్తికీ ఆత్మాభిమానానికీ నిండైన నిదర్శన మిది.

రాష్ట్రీయరచనా నిర్మాణంలో 'సుభద్రాదేవీ చౌహాన్'కు ప్రత్యేకస్థాన ముంది. హిందీ సాహిత్యాకాశానికి ఆమె అరుంధతి వంటిది. ఆమెనుగురించి వ్రాస్తూ 'ఆధునిక హిందీసాహిత్యకా ఇతిహాస్'లో 'కష్ణ

శంకర్ శుక్ల ఎం. ఏ ఇలా అన్నాడు "దేవీజీ రచనలు ఈకాలానికి సంబంధించినవి. అంతులేని ఆకాశం లోకి అర్థంలేని చూపులు చూస్తూ అజ్ఞాత ప్రియుడికోసం యేడ్చియేడ్చి పక్కవారి నిద్ర పాడుచేసే కంటే జన్మభూమికోసం ఆత్మార్పణం చేసే వీర యువతీయువకుల పవిత్ర స్మృతిలో కన్నీరు కార్చడమంటే ఈమెకు అమితానందం". నవ్యహిందీసాహిత్యంలో ఈమె 'ఝాన్సీ వాలీ రాణి' చాల ప్రసిద్ధిపొందింది. ఈ కవయిత్రి జీవనసిద్ధాంత మిది:

"సునూంగీ మాతాకీ ఆవాజ్
రహూంగీ మరనేకో తైయార్
కభీ భీ ఉస వేదీ పర దేవ్
నహోనే దూంగీ అత్యాచార్
న హోనే దూంగీ అత్యాచార్
చలో మైం హో జాఊం బలిదాన్
మాతృ మందిరమే హుఈ పుకార్
చఢా దో ముఝుకో హే భగవాన"

"అమ్మ పిలుపు వింటాను. ఆత్మార్పణానికి ఆయత్తమౌతాను. ఆ వేదికమీద అత్యాచారం ఎప్పుటికీ జరగనివ్వను అలాజరగటానికి వీలులేదు. పదండి నేను బలి ఔతాను. మాతృమందిరంలో నుంచి అదుగో అమ్మ పిలుస్తున్నది. ఓ ప్రభూ వేదిక నెక్కించు నన్ను."

ఈమె 'ఝాన్సీవాలీరాణీ' ని పోలిందే తెలుగులో కొడాలి 'ఝాన్సీరాణి'. దేశాభిమానం విషయంలో కొడాలి విశ్వనాథ వారి శిష్యుడు. అదేరీతిగా తెలుగు చరిత్రకు జీవగర్రవంటి విజయనగర చరిత్రలోని ఉజ్జ్వలఘట్టాలు కొన్ని కావ్యవస్తువుగా తీసుకుని 'హంపీక్షేత్ర' మనే ఖండకావ్య సంపుటి కూర్చాడు. ఇందులో కవి,

"శిలలు ద్రవించి యేడ్చినవి జీర్ణములైనవి తుంగభద్రలో
పల గుడి గోపురమ్ములు సభాస్థలు లైనవి కొండమ్రుచ్చు గుం
పులకు చరిత్రలో మునిగిపోయిన దాంధ్రవసుంధరాధిపో
జ్జ్వల విజయప్రతాప రభసంబౌక స్వప్నకథావిశేషమై"

అని శిథిలాలమధ్యలో నుంచుని గొంతెత్తి వాపోతాడు.

"వేయికి చాలుబో తెలుగు వీరు డొకండు.........."

అని తెలుగు జోదుల ఉజ్జ్వలశౌర్య సంపత్తిని ఉగ్గడించుతూ ఉప్పొంగిపోతాడు.

"'బ్రతికియు వేయు, ప్రాణములు బాసియువేయి మదేభ' మన్నసా
మెత కనురూపమౌ చరితమే సుమి నీ యది కానిచో మహో
న్నతి నఖిల ప్రపంచ గణనంబున మాయని కన్నునేటి దు
ర్గతిగని కూడ మాయుటకు రాదు భవ త్కథ శాశ్వతంబగున్."

అని విద్యానగర పురా వైభవాన్ని ఉచ్చైఃకంఠంతో ఉద్ఘోషిస్తాడు. జాషువా కవి మొదటినుంచీ దేశ భక్తి పూరితాలయిన పద్యాలను వ్రాస్తూనే ఉన్నాడు. ఈయన ఖండకావ్యాలు ఆంధ్రదేశంలో అఖండ గౌరవాన్ని గడించుకున్నాయి. అందులో 'ఆంధ్రుడు' 'కృష్ణదేవరాయలు' 'అఖండ గౌతమి' మొదలయిన కావ్యాలు చదువు సమయంలో పాఠకులు ఆంధ్రాభిమానంతో పారవశ్యం చెందుతారు. కృష్ణరాయల నుద్దేశించి అంటాడు:

"బంగారంబువలెం గరంగినది భూపశ్రేష్ఠ! నీవిక్రమా
గ్నిం గ్రిగ్గాడి నృపాలమండలము, నీ కీర్తిద్యుతుల్ రోదసీ
రంగంబున్ గబళించి వేసినవి ఆంధ్రక్షోణి నీ బాహుసీ
మం గైసేసిన నాడు, నాటి చలిచీమల్ గూడ ధన్యంబులే."

తన సోదరీ సోదరులను వీరమూర్తులనుగా తీర్చి దిద్దమని జన్మభూమిని అర్థిస్తాడు చూడండి:

" ... ... విద్యకై
గుటకలు మ్రింగు నీ యనుగు కూతుల కిమ్ము కలమ్ము ఖడ్గమున్."

" ... ... సుతులీ బందాలలో చిక్కి దు
ర్బలు లైనారిక నూరిపోసికొనవే స్వాతంత్ర్య భావౌషధుల్."

భారత భాగ్యవిధాత బాపూజీ మీద రెండుసాహిత్యాలలో గేయాలు వ్రాశారు. 'సుమిత్రానందన్ పంత్' గేయం ఒకటి మచ్చుకు:

"నవసంస్కృతి కే దూత! దేవతాఓంకే కరనేకార్య
ఆత్మాకే ఉద్ధార కేలియే ఆయే తుమ అనివార్య
బాపూ! తుమసే సున ఆత్మాకా తేజరాసి ఆహ్వాన్
హాఁస ఉఠతేహైఁ రోమ హర్షసే పులకిత హోతేప్రాణ్"

"బాపూజీ! మా ఆత్మల్ని ఉద్ధరించే నిమిత్తం ఏదో స్వర్గీయసందేశాన్ని మోసుకుని దేవుడులాగా దివ్య లోకాల్లోనుంచి దిగివచ్చావు. అత్యుజ్జ్వలమైన నీ ఆహ్వానం విని మా అంగాలు పొంగి పోతున్నాయి. ప్రాణాలు పులకిస్తున్నాయి."

మహాత్ముడి మీద 'బసవరాజు' వ్రాసిన ఈ క్రిందిగేయం తెలుగువారి హృదయాలలో చాలారోజులునుండీ మారు మ్రోగుతూంది.

"కొల్లాయి గట్టితేనేమి మా గాంధి
కోమటై పుట్టితేనేమి
వెన్నపూసా మనసు
కన్నతల్లీ ప్రేమ
పండంటి ముఖముపై
బ్రహ్మ తేజస్సూ"

ఈయన వ్రాసిన జాతీయపతాకం గేయం ఎంత ఉజ్వలంగా ఉంటుందో చూడండి.

"పతాకోత్సవం చేయండీ!
స్వతంత్ర భారత జాతిచిహ్నమా,
పతాకోత్సవం చేయండీ!
కొత్తవన్నెలూ కొత్తచిన్నెలూ
కొత్తజీవమూ కొమరొప్పంగా
నూతన భారత జాతికి భువిలో
ఖ్యాతీ జయమూ కావాలంటూ"

'మాఖన్‌లాల్ చతుర్వేదీ' వ్రాసిన ఈ క్రిందిగేయం చదివితే మానవుడికి స్వేచ్ఛ ఎంత అవసరమో తెలుస్తుంది. స్వాతంత్ర్య మనుభవిస్తున్న కోకిలను చూచి అస్వతంత్రుడైన ఖైదీ అనేమాట లివి:

"తుఝే మిలీ హరియాలీ డాలీ
ముఝే నసీబ కోఠరీ కాలీ
తేరా నభ భరమేఁ సంచార్
మేరా దస ఫుట కా సంసార్
తేరే గీతోఁ ఉఠతీ వాహ్
రోనా భీహై ముఝే గునాహ్"

"నీవు నవనవలాడే చెట్టుకొమ్మమీద కూర్చున్నావు. ఈ చీకటికొట్టు నాపాలబడింది. నీవు హాయిగా ఆకాశమంతా తిరుగుతావు. నా ప్రపంచమంతా ఈ నాలుగు గోడలమధ్య వున్న పదడుగులనేల. నీ మధురగీతాలు విని "హాయ్‌హాయ్" అంటారు. నా విధురగీతాలు విని "నోరుముయ్" అంటారు.

'అనూప్‌శర్మ' వ్రాసిన ఈ క్రింది పద్యంలో పరాధీనుడు పడే పరితాపం వ్యక్తమౌతుంది. వలలో పడ్డ తన్ను పట్టుకుని బంధించబోతున్న వేటగాడితో లేడి అంటుంది.

" జీతేజీ స్వతంత్రతా న భీ నో హేవధిక బస్
ఏక తీర మారద్రో కలేజే సే నికల జాయ"

"నాగుండెల్ని చీల్చుకు బైట పడేట్టుగా నీ బాణం వెంటనే వెయ్యి. బ్రతికుండగానే బంధించి నా స్వాతంత్ర్యం హరించబోకు"

స్వాతంత్ర్య సంపాదన కోసం ప్రకృతంతా పరుగిడు తున్నట్టుగా 'కవికొండల' సందర్శిస్తాడు చూడండి:

"జాహ్నవి గౌతమి
కృష్ణ పినాకిని
కావేరి నర్మద
యమునా సింధులు
అహర్నిశాదులు
ఒకటే గానము

కలలో అలలో
అదే ప్రయాణము
స్వాతంత్ర్యముకై స్వాతంత్ర్యముకై
స్వాగతమనవోయ్ కని పని వినవోయ్
అనవోయ్ అనవోయ్ జయ్ జయ్ జయ్."

భగవతీ చరణ్ వర్మ "భైంసాగాడీ" అనే ఒక వ్యంగ్య కావ్యం వ్రాశాడు. ఇది ధనిక వర్గం ధాటికి తట్టుకోలేక బరువు బ్రతుకు లీడ్చే కష్టజీవుల జీవితానికి ఛాయాచిత్రం.

ఇలాంటి కష్టజీవుల నుద్దేశించే సుప్రసిద్ధ హిందీ యువకవి "దినకర్" ఈ గేయాన్ని రచించాడు

"విద్యుత కీ ఇస చకా చౌంధమేఀ
దేఖ దీపకీ లౌ రోతీహై
అరే హృదయకే థామ మహల కే
లియే ఝోంపడీ బలి హోతీహై
దేఖ కలేజా ఫాడ కృషక
దేరహే హృదయ శోణిత కీధారేఀ
ఔర ఉఠీజాతీ ఉన పరహీ
వైభవ కీ ఊంచీ దీవారేఀ"

"కన్నులు మిరుమిట్లు గొల్పే విద్యుద్దీప్తిలో దీపశిఖ దీనంగా రోదిస్తున్నది. హృదయం అదుముకుంటూ పాకగుడిసె భవనం కోసం బలిఔతున్నది. అదుగో గుండెలు చీల్చి హృదయంలో నుంచి రక్తధారలు కురిపిస్తున్నాడు కర్షకుడు. అవిగో వాటిమీద లేస్తున్నాయి భాగ్యవంతుల బంగారు గోడలు ఆకాశాన్నంటుతూ."

దీన్ని పోలిందే సుప్రసిద్ధ యువకవి మన శ్రీశ్రీ ఈ క్రిందిగేయాన్ని చూడండి:

"పొలాల నన్నీ
హలాల దున్నీ
ఇలాతలంలో హేమం పిండగ

జగాని కంతా సౌఖ్యం నిండగ
విరామ మెరుగక పరిశ్రమించే
బలం ధరిత్రికి బలి కావించే
కర్షక వీరుల కాయం నిండా
కాలువ గట్టే ఘర్మజలానికి
ఘర్మజలానికి
ధర్మజలానికి
కర్మజలానికి ఖరీదు లేదోయ్"

ఇలాంటిదే మల్లవరపువారి ఈ క్రింది గేయాన్ని చిత్తగించండి:

"అర్థమేమిటో ఈ కష్టానికి ఈ నష్టానికి ?
వ్యర్థమైన మానవుడి జీవశక్తికి
అర్థణా కూలీయిస్తే సరిపోతుందా
మూర్ధాభిషిక్తుల్లారా ! చెప్పండి జవాబు !
రోజుకూలి ఇచ్చి కొనుక్కున్న రాజరికాలు
బూజు పట్టిపోతున్నై కాలగర్భంలో
పొట్టగొట్టి పొట్టపోసుకొనే నాగరకత
వట్టి అడవిజంతుబుద్ధి కదోయ్ నరుడా!"

ఈ పైగేయాలు చదివినప్పుడు ఐశ్వర్యవంతుల అత్యాచారాల్లో నలిగిపొయ్యే నిరుపేద జీవితాలు చూచి ఎవ్వరు జాలిచెందకుండా వుంటారు. ఇదే మాదిరిగా ఉన్నవవారూ త్రిపురనేనివారూ కండగల అనేక జాతీయ గీతాలనూ హరిజనగీతాలనూ వ్రాసి తమ దేశాభిమానాన్ని ప్రదర్శించారు. యడ్లపల్లివారి 'పల్లెటూరు' 'కష్టజీవి' అనేకావ్యాలు జానపద జీవితాలను చక్కగా చిత్రించాయి. ఏటుకూరివారి 'క్షేత్రలక్ష్మి' తెలుగు తల్లి కొక అలంకారం. శేషాద్రి రమణకవులు ఓరుగంటి శిధిలాలమీద అనేకరచనలు చేశారు. అలాగే శ్రీనివాస సోదరులుకూడా 'ఓరుగంటికోట' అనే కావ్యం వ్రాశారు. రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ 'పెనుగొండపాట', 'శమీపూజ' అనే గేయాలు చదువుతుంటే యువక హృదయాల్లో ఉడుకునెత్తురు పొంగులెత్తుతుంది. ఇదే తీరుగా మాధవశర్మ తల్లికోట యుద్ధమూ, బొడ్డు బాపిరాజు దీపావళి, తెలుగు

తల్లీ, కుందుర్తి నరసింహారావు పంపా, మొదలయిన రచనలు వీరి దేశాభిమానాన్నీ ప్రాచీనాంధ్రుల పౌరుషాన్నీ ప్రకటిస్తాయి- ఉదీయమానులైన యువకవు లెందరో "రైతుగీతాలు" "హరిజనగీతాలు" వ్రాసి తమ దేశభక్తిని వెల్లడిస్తున్నారు- కొసరాజు రాఘవయ్యచౌదరి 'తెనుగుతల్లి' అనే మకుటంతో తెలుగుదేశాన్ని ప్రబోధిస్తూ కమ్మని పద్యాలు వ్రాశాడు.

దేవులపల్లివారు భారతమాత మీద వ్రాసిన

"జయజయజయప్రియ భారత - జనయిత్రీ! దివ్యధాత్రి!"

అనే గేయమూ, అడివి వారు బాపూజీ మీద వ్రాసిన

"హిమాలయోత్తుంగ శృంగం నీబ్రతుకంతా
ఉమాపతి నృత్యరంగం"

అనే గేయమూ ఆంధ్రవిద్యార్థుల కంఠాల్లో ప్రతిధ్వనించాయి. హిందీలో ఇలాంటి ఉజ్వల రచనలు అనంతంగా ఉన్నాయి. మైథిలీశరణ్ 'స్వదేశసంగీత్', సుమిత్రానందన్ పంత్ 'యుగవాణీ', నిరాలా 'ఆవాహన్' 'శివాజీకాపత్ర' 'దీనభిఖారీ', గయాప్రసాద్ 'కృషకక్రందన్' 'కరుణ భారతీ', అనూప శర్మ 'పానీపత్', ఉదయశంకర్ భట్టజీ 'తక్షశిలా' ఇత్యాదులు ముఖ్యంగా చెప్పుకోదగ్గవి.

విప్లవం వల్లనే దేశానికి విముక్తి కలుగుతుం దనే నమ్మకంతో విప్లవ గీతాలు చెబుతూవున్న కవులు తెలుగులోనూ హిందీలోనూ కూడా ఉన్నారు. తెలుగు వారిలో ప్రముఖులు శ్రీ.శ్రీ, శ్రీరంగం నారాయణ బాబూ, ఇంద్రకంటీ, రక్తిణీనాథశాస్త్రీ, దేవరాజు కృష్ణశర్మా ఇత్యాదులు, హిందీలో దినకర్, నవీన్, అంచల్, నిరాలా, భట్టజీ, భగవతీ ప్రసాద్ వాజపేయీ ముఖ్యులు. శ్రీ. శ్రీ, దినకర్, ఈ రకం రచనలకు బాగా పేరుగాంచారు. 'దినకర్' ను గురించి యిలా అన్నాడు రామానందశర్మ చయనికలో. "నవయుగం నవనిర్మాణం కోసం తన ఆత్మను సైతం పూర్ణాహుతి చెయ్యటానికి తహ తహ లాడే 'దినకర్' ఉజ్వల హిందీ కవితా శిఖరంమీద నిజంగా బాలారుణ దినకరుడులా గానే ఉదయించాడు" 'గేయరచనలు-ఆధునికులు' అనే వ్యాసంలో శ్రీ. శ్రీని గురించి వ్రాస్తూ ఇలా అన్నాడు వావిలాల సోమయాజులు.

"విశ్వశ్రేయస్సుకోరి పరిస్థితులు మారటానికి విప్లవం సాధనంగా నమ్మి దేశాన్ని ప్రబోధిస్తూ ప్రపంచంలో ఘోరహత్యలు జరిగినవీ జరుగుతున్నవీ కళ్ళకు కట్టేటట్లు ఆవేశ పూరిత హృదయంతో కవిత్వం చెప్పాడు శ్రీ. శ్రీ. 'అలజడి మా జీవితం, ఆందోళన మా ఊపిరి, జగమంతా బలివితర్ది, నరజాతికి పరిత్రరన'

అనేవి ఆయన నిశ్చయ అక్షరాలు. ఇంత ఘాటయిన కవితావేశం గల కవి తెలుగు నేల మీద ఎన్నడూ పుట్టనే లేదని చెప్పాలి."

ప్రస్తుతం దేశంలో ఉన్న ప్రాచీన పద్ధతులూ, సంఘంలోని కుళ్ళూ, హెచ్చు తగ్గులూ అంటే వీరికి అసహ్యం. ఈ ప్రాతవన్నీ నాశనమైతేనే గాని జాతికి నూతనాభ్యుదయం చేకూరదని వీరి సిద్ధాంతం. ఆ నాశనానికి ప్రోత్సహించే విప్లవగీతాలు రెండు సాహిత్యాలలోనూ బయలుదేరాయి. అవి రానురాను బీభత్స ప్రధానాలుగా పరిణమిస్తున్నాయి. స్మశానం, దయ్యాలూ, కంకాళాలూ, రుధిర స్రవంతులూ, అగ్నిజ్వాలలూ, హాహాకారాలూ వీరికి కవితావస్తువు లౌతున్నాయి. అయినా వీరిరచనలు యువకహృదయాలను ఆకర్షిస్తున్నాయి.

హిందీ సాహిత్యంలో దేశాభిమానం సన్నని జాలుగా హరిశ్చంద్రజీలో పుట్టింది. దానికి మైథిలీశరణ్ పరిపుష్టినిచ్చాడు. తర్వాత మాఖన్‌లాల్ చతుర్వేదీ సుభద్రాదేవి ఇత్యాదులు దాన్ని వాహినిగా ప్రవహించేటట్లు చేశారు. దినకర్ ప్రభృతులు పాతమార్గాన్ని తప్పించి నూతనమార్గాన్ని పట్టించాలని ప్రయత్నిస్తున్నారు.

ఇదే మాదిరిగా తెలుగు సాహిత్యంలో దేశాభిమానం వీరేశలింగంపంతులులో సన్నని జాలుగా బయలుదేరి గురజాడా రాయప్రోలూ బసవరాజూ యిచ్చిన పరిపుష్టితోగాని 'విశ్వనాథ' 'వేదుల' 'కొడాలి' 'తుమ్మల' ఇత్యాదుల్లో వాహినిగా ప్రవహించింది. శ్రీ శ్రీ, ఆయన అనుయాయులూ దాన్ని పాతమార్గాన్నుంచి నూతన పంథాకు మరల్చాలని ప్రయత్నిస్తున్నారు.

దేశాభిమానాన్ని వెల్లడించేటప్పుడు హిందీవారి దృక్పథంలో యావద్భారతమూ ఆంధ్రులకు ప్రధానంగా ఆంధ్రదేశమూ ఉన్నట్లు కనిపిస్తుంది. దీనికి కారణం ఆంధ్రరాష్ట్రం ఇతర రాష్ట్రాలలాగా ప్రత్యేక రాష్ట్రం కాకపోవడమూ, దానికోసం ఆంధ్రజాతీయోద్యమం బయలుదేరడమూ అని చెప్పాలి.

జనసామాన్యంలో జాతీయాభిమానాన్ని తమరచనల ద్వారా ప్రజ్వలింప జేసిన కవులు రెండుభాషలలో విశేషంగా కనిపిస్తునే వున్నారు. కాని కార్యరంగంలో దూకి దేశసేవ చేసిన కవులు తక్కువ. తెలుగు కవులలో శివశంకరశాస్త్రీ, కొడాలి ఆంజనేయులూ, అడివి బాపిరాజూ, రాజశేఖర శతావధానీ, హిందీ కవులలో మైథిలీశరణ్ ప్రభృతులూ మాత్రం శ్రీకృష్ణ జన్మస్థానానికి వెళ్ళివచ్చి కవులుగూడా కర్మవీరులని లోకానికి చాటారు.

రానురాను అర్థంలేని ఆడంబర గీతాలు ఎక్కువైనాయి. కేవలం నోటిమాటలు విస్తారమై కార్యశూరత్వం కనుపింపని వారిమీద దెబ్బగా కొన్ని గేయాలు రెండు సాహిత్యాలలోనూ పుట్టాయి ఉదాహరణంగా 'శ్రీ' అనే ఒక యువకవి వ్రాసిన ఈ క్రింది గేయం చదవండి

“భారత (ఛీ-కాదు) ఆంధ్రమాతకు జై!
ఆంధ్రభాషకూ జై! ఆంధ్రులకూ జై!
ఆంధ్ర...ఆంధ్ర...ఆంధ్ర... జై! జై!! జై!!!
తెలుగువాణ్ణి నేను
తెలుగు దేశం నాది
తెలుగు తల్లికి నేను
అనుగు బిడ్డణ్ణి
తెలుగు గాలులు నేను
తెగ పీల్చుకుంటాను
పరగాలి పొలిమేర
పనికి రాదంటాను.
తెలుగు సూర్యుడే నాకు
వెలుగు లిస్తుంటాడు
తెలుగు చంద్రుడే నాకు
చలువ లిస్తుంటాడు.
తెలుగుయెండై తేను
మలమలా మాడుతా
తెలుగు వెన్నెల లంటె
గిలగిలా లాడుతా.”

అందుకనే అప్పరాయకవీంద్రుడు తొలినాడే ఇలా ఆదేశించాడు.

“దేశాభిమానం నాకు కద్దని
వట్టి గొప్పలు చెప్పుకోకోయ్!
పూని యేదైనాను ఒకమేల్
కూర్చి జనులకు చూపవోయ్.”



ఎండ

మిట మిట మని
మండు టెండ,
కొరువులు
చెరిగిన కండనిప్పు !
రైలు మెట్టు
పై గట్టున
చివికిన, చితికిన
ముసలి ముద్ద
కొస ఊపిరి
చిల్లిరాగి డబ్బునకై
చించిన
కుంటి చేతి నీడలోన;
ఆడుతు
కురుపుకు మూగిన
ఈగ కన్న
హీనంగా
ధనికుని
గడప ముందు
పెరిగే,
తిరిగే,
మొరిగే....
నరాధముని
గ్రుడ్ల ఎరుపు
మండు టెండ !!!

ఏల్చూరి సుబ్రహ్మణ్యం

శాంతికి

జ్ఞాన భాను దర్శన
హీనులమై,
అంధులమై,
పాషండులమై,
కంఠ తరిగి శల్యాలై,
బెండ్ల లాగు ఊగుచు;
కాంతిలేని నీడలట్లు,
కాకులవలె
నీ గడప ముందు;
శ్మశానచర భూత ప్రేత పిశాచ రీతుల
చరియించే...,
నారాయణు నెరుగని
ఈ మా నరజాతికి,
కురుక్షేత్రమును దిగమ్రింగిన
యోధనగాధలె
కలవరింత కాగా;
నిద్రాహారమ్ముల
నిర్జించిన ఆకలితో
తల్లి రొమ్ముచీల్చి
పీల్చిన రక్తంతో
తృప్తిపడక ఆకలితో;
వెర్రెత్తించిన శాంతిని...
వెదకి వెదకి వాచిపోయి
చీకటి ఆర్పిన దీపకళిక వలె
ఖిన్నుల మైతిమి !!

జోగిరాగ మాలపించే*
యోగిరాజు ప్రాణమ్ముల
సర్పదంష్ట్రయై,
కాటేసిన
ఋషి విశ్వామిత్రుని
కఠిన కాంక్షవలె
కఠిడు కష్టైనా
నీ ధావ లహరి ?

ఎలరే పగిలి పగిలి
ఎసరే ఎగిసి రగిలి
నీకై, నీకొరకై,
చేతులు చాచిన మము వీక్షింపవే
వెన్నెల రొడుగా
శాంత మూర్తి

కాంతి దేహ !
యుద్ధాలలో చితికిన మే మిక,
కంట్లైనా తెరువలేము !
కుడి ఎడమల రేయింబవలలె
కుద్యాలై లక్షు తగులు !!

ఏల్చూరి సుబ్రహ్మణ్యం

---

*హరిశ్చంద్రుని సుతుడు లోహితాస్యుని చేత ఆలాపించబడినది.

దేవ!

మల్లాది సాంబశివ మోహన్

నిండుగా పూల తేనెల సోనలను గూర్చి
గండు తుమ్మెదలకై తిండి చూపించటమ్
ముష్టెత్త అభిమానమును కాస్త పోకార్చి
నష్టజాతకు నరుని కష్టాల ముంచటమ్.—

నిండు గార్భిణములో నీలంపు మేఘాల
కొండ శిఖరాలపై కురిపించ నెంచటమ్
ఏడాది యేడాది యెన్నెన్నొ ప్రాణాల
పాడి పంటలు మాడ్చివైచి యేడ్పించటమ్—

ససిగా కడుపుకేని సరిపడక తిననీక
పిసినిగొట్టుల యింట పసిడి నిలపుంచటమ్
గోడుగోడున యేడ్చి కూడు గుడ్డలు లేక
మాడిపోయెడి జనుల మచ్చుమాయించటమ్—

చిలికించి పూర్వ పశ్చిమ దిశాంతములందు
పొంఁపుగా కుంకుమము పూత పూయించటమ్
తరుణ విధవల ముఖోపరిభాగములయందు
కరుణా లవము లేక చెరిపివేయించటమ్—

బోసి పెదవుల మందహాస రోచిస్సులను
పోసి, పసితనములో ముదము ఁల్పించటమ్
తల తోక లేని చింతులతో నుషస్సులను
ఎలప్రాయమున సదా మలిన మొనరించటమ్—

ఇట్టి బుద్ధులు దేవ—ఎట పట్టుబడె నోయి
వట్టి పుణ్యానికే ప్రజల నేడ్పించటమ్ ;
తప్పించుకొని యెందొ దాగుకొంటివి పోయి
ఎప్పు డిక నీ తోటి చెప్పి మాన్పించటమ్ ?

తీయని పాట

బంకుపల్లి రామజోగారావు

ఈ యనంత భర మ్మిక మోయలేక
కులుకు బెళుకుల లేనవ్వు గొసరుకొనుచు
సంజ కెంపుల గని కేలు చాచినాడ
భావ జలదాల శంపలు పల్లవింప !

సంతతానంద మయ యథేచ్ఛా విహార
మధుర పరిమళ లోక సుస్నానవేళ
పచ్చి వెన్నెల నిగ్గు గప్రంపు బూత
ప్రళయ దావాగ్నియై కాల్చె పడుచు పెడద !

ఆ వినీలైక మార్గాన, యౌవనంపు
ఖగము పోలిక, జివ్వున నెగిరి పోయి —
యచట తెగ దేల్చు తీపిలో, నా యగాధ
శూన్య గర్భాన గరగి పో జూచినాను !!

శూన్య వల్లకి మధు మధు శ్రుతుల నీన
నా హృదయ పర్వతాంతరాంతర యథేచ్ఛ
తీవ్రవేగ మహా స్రవంతీ గభీర
తాండ వాలాప రవము రోదసుల నిండె !!

సొలపు దేరుచు గను విచ్చి చూచినాడ
కరగిపోయిన నిశ్శబ్ద గాన మెల్ల
కరుడు గట్టుచు బెనుమ్రోల గానబడియె !
విమల మధురమ్మె సృష్టి మర్మముగ వెలిగె !!!

దుర్భరభార *

[— నా 'జాగిణీ గీతలు' ప్రబంధంలోనుంచి —]

బెల్లంకొండ రామదాసు

అమ్మ చచ్చిన పిచ్చి పిల్లను
బ్రతకలేనోయ్ హోటల్లో !
హోటల్ హోటల్ హోటల్
లోకపు హోటల్ !

మా అమ్మ నాకై అమ్మిన
నల్ల నల్లని జుట్టుపెతె
అర్ధరాతిరి....!
అడవిమధ్య నీటికొలను
నా కన్నీరే తోడుక రమ్మని
కన్నీరే కన్నీరే తోడుక రమ్మని
పైటికి నెట్టిన
ఐదేండ్ల అనాథ బాలికను !

కన్నీటితో బరువైన
బ్రతుకు Bucket
మ్రోయలేనోయ్ మ్రోయలేనోయ్ !

ఏ దొంగ హస్తం
అందుకుంటుందీ
కంది రక్తం చిమ్మే
పసిపిల్ల చేతులో
బరువైన బరువైన Bucket !

కాసెటీ కాసెటీ కాసెటీ
కన్నీటి కాసెటీ !

---

* జగద్వ్యాపి చింతకూ మూలం జారమహేంద్ర విరహవ్యధ. కన్నీరు పెట్టుకోడానికి ప్రాకృత కారణాలు కనుపించినప్పటికీ అవి మిథ్యా కల్పనలు. కన్నీరు వింపుకోడానికి ఒక అప్రాకృత మూలకారణం ఉండితీరాలి ! అది విరహం !
కాసెటీ కన్నీరులో ఉన్న మాహాత్మ్యానికీ రాధిక కన్నీరులోని మాహాత్మ్యానికీ భేదం ఏమీ లేదు. నేను పాడిన ఈ పాటలో కాసెటీని బృందావనీయం చేశాను.

ఫ్రెంచి నావలిస్టు విక్టార్ హ్యూగో మహాశయులు కాసెటీ పాత్రలో కన్నీరు పోశాడు. వట్టి కన్నీటిపిల్ల కాసెటీ ! అమ్మ హోటల్లో ఒప్పగిస్తుంది పిచ్చి కాసెటీని.

అందమైన తన జుట్టునూ పండ్లనూ అమ్మి డబ్బు పంపిస్తుంది. 'కాసెటీ' అని కలవరిస్తూ చనిపోతుంది జీన్వాల్జీను కన్నీటి పిడత్లో ! హోటల్లో ఘోరమైన చాకిరీ చేస్తున్న కాసెటీని నిశరాత్రి పోయి నీళ్లు తెమ్మంటారు. తనకంటే పెద్ద బొక్కెన — పాపం పిచ్చిపిల్ల — ఒక్కతే పోతుంది. నీళ్లు మొయ్యలేక మొయ్యలేక వస్తుంటే జీన్వాల్జీను చల్లని చెయ్యి బొక్కెన అందుకుంటుంది.

కాసెటీలో గోదామ మహస్సు చూచి వ్రాసిన పాట ఇది.

ప్రంచభూతాల చట్టం

పేకుమళ్ల కామేశ్వరరావు

ఆ ప్రదేశం చక్కదనం వెతగ్గా వెతగ్గా ఎక్కడో మరొకచోట కనపడుతుంది గాని సాధారణంగా కనపడదు. ప్రకృతికి అందమిచ్చే కొండలు, అడవులు, వాగులు, మైదానం ఒక ప్రదేశంలోనే ఉండడం చాలా ఆశ్చర్యం! ఉత్తరాన గోడ లాగ కనబడుతూన్న కొండల వరస సంగతి అలాగ ఉండనియ్యండి. దానికి దక్షిణంగా ఉండే స్థలం అత్యద్భుతం! కిందని మరెక్కడా కూడా కొండలు వరసగా లేవు. విసిరేసినట్లు ఎంతో ఎడ ఎడంగా ఉన్నాయి. ఈ కొండల మధ్యని చక్కని మైదానం! కొండల వరస నుంచీ, విడి కొండల మీంచీ వచ్చే వాగులు మైదానంలో ప్రవహించి వెళ్లి పడమగా పది పన్నెండు మైళ్లదూరంలో ఉన్న బ్రహ్మాండమైన నదిలో పడతాయి. వాగులలో నీళ్లు వ్యర్థంగా పోనియ్యకుండా అఖాతాలలాంటి చెరువులు తవ్వేశారు. చెరువులనుంచే వ్యవసాయం. ఈ మైదానం రెండు పంటలూ పండుతుంది. పెద్ద నదికి కింద ఎక్కడో పాతిక మైళ్ల దూరాన్ని ఆనకట్ట కట్టి పండించిన డెల్టా భూములలాగ ఈ మైదానం పండుతుంది. ఈ ప్రాంత మంతటికీ "నల్లగొండమహాలు" అని పేరు. నల్లగొండ మహాలు పండితే కాటక ముండదని ప్రతీతి.

సుమారు నూటఏభై చదరపు మైళ్ల విస్తీర్ణమున్న నల్లగొండమహాలులో డెబ్బైగూడాలు ఉన్నాయి.

ఇక్కడి ప్రజంతా ఒకే జాతివారు. వారి పూర్వులు తేళ్లని కొలిచేవారు. ఎక్కడ చూసినా తేళ్ల విగ్రహాలు రాతిలోనో, లోహంలోనో, కర్రలోనో చెక్కబడి కనబడతాయి. అందులో కొన్ని చాలా చక్కగా ఉంటాయి. ఈ ఆరాధనని బట్టి వీళ్లని తేళ్లజాతివారు అన్నారు. తేళ్ల జాతివారు తేళ్లని తప్ప మిగతా అడవిజంతువుల్ని తింటారని మనం ఊహిస్తాము. కాని అటువంటిదేమీ లేదు. తేళ్ళ దేవతలు వేరు, అడివిలో తిరిగే తేళ్ళు వేరు—అని వారంటారు. కనక దొరికిన తేళ్ళు తిన్నగా గర్భాలయాల్లోకే పోతాయి.

నల్లగొండ మహాలంతటికీ ఒకరాజు ఉన్నాడు. అతని పేరు భోగరాజు. భోగరాజు నల్లసానపు రాయిలాగ ఉంటాడు. ఆట్టే ఎత్తు ఉండడు. అంతలావూ ఉండడు. అతని శరీరం లేడి శరీరం లాగ, సమకైవారంగా సోగగా ఉంటుంది. భోగరాజు మొహం చూడడానికి అందంగా ఉండదు కాని నాజూకుగా, రాజకళతో ఆకర్షకంగా ఉంటుంది. అడవి పక్షుల ఈకల కిరీటం, అడవులలో అక్కడక్కడ దొరికిన రత్నాలు మోటుగా చెక్కి వేసుకొన్న హారాలు, దంతపు అలంకారాలు, వీటితో భోగరాజు మెరిసిపోతూ ఉంటాడు. వెనకటి నుంచీ వస్తూన్న ఈ అలంకారాలు చాలక అతను కొత్త కొత్త అందాలు సంపాదిస్తూంటాడు.

భోగరాజు తన రాజ్యంలోనే గాక ఇతరచోట్ల ఎక్కడైనా మంచి వస్తువులు దొరికే యుంటే, వాటిని ఎంత ధరయినా పెట్టి కోటకి చేరుస్తాడు. అంచేత ఇతర ప్రాంతాలనుంచి వర్తకులు నల్లగొండ మహలుకి వచ్చి, సరుకులు చెల్లించుకొని పోతూంటారు.

భోగరాజుకి ముందున్న రాజులు ఏకపత్నీ వ్రతస్థులు. కాని భోగరాజుమట్టుకు అష్టమహిషుల్ని వివాహమాడాడు. వారిలో ఒకావిడ పట్టపురాణి.

భోగరాజు రాజ్యానికి వచ్చిన ప్రారంభంలో ఏ నాలుగు నాళ్ళో రాచకార్యాలు సొంతంగా చూశాడు కాని, ఆటు తర్వాత పని అంతా మంత్రి సేనానాయకుడు- ఈ రెండు పనులు ఒకే ఆయన చెయ్యడం ఇక్కడ ఆచారం- అయిన సింహరాజు మీద విడిచి పెట్టేశాడు. భోగరాజు అంతఃపురంలో భోగాలతో కాలక్షేపం చేస్తూంటాడు.

మహారాజు ఖర్చుకి పరిమితిలేదు. సొంత విషయాలకి బోలెడంత ధనం ఖర్చవుతూ ఉంటుంది. అంతే కాకుండా అతని జన్మదినం వచ్చినా లేక గద్దె ఎక్కిన రోజు వచ్చినా, లేక భార్యల పుట్టినరోజులు గాని, బిడ్డల పుట్టినరోజు గాని వచ్చినా చెప్పలేనంత అట్టహాసంతో ఉత్సవాలు, వేడుకలు జరుగుతాయి. ఇవేకాదు, పండగలు వచ్చినా, కొలువులు వచ్చినా జరిగే సంబరాలతో భూమీ ఆకాశం ఏకమయిపోతాయి.

మొదట్లో ప్రజలకి ఈ ఉత్సవాలంటే చాలా సరదాగా ఉండేది. కాని క్రమేపీ ఉత్సవాలధికమయిపోయి నిత్యకృత్యాలకి కూడా అడ్డు తగులుతున్నాయా అనిపించింది. పొలం దుక్కి చెయ్యకుండా పండదుకదా! విత్తనాలు జల్లవలసిన రోజుల్లో వేడుకలు చూస్తూంటే వ్యవసాయం ఎలా సాగుతుంది! ఈ మోస్తరుగా ప్రజకి వేడుక వేడుకగా ఉండక విపత్తుగా పరిణమించింది.

పైగా మరొక ఇబ్బంది వచ్చింది. మునపటి రాజులు పంటలలో ఆరోపాలు పన్నుగా తీసుకొని దేశం పరిపాలన చేసేవారు. ఇప్పుడు అలాగలేదు. పంటలలో మూడోవంతు పన్నుల కింద రాజు తీసుకుంటున్నాడు. ప్రజలలో అసంతృప్తి పుట్టింది. అయినా కలిగినదానితో తృప్తిపడేవారు పల్లెజాతివారు కాబట్టి అంతకంటే మరేమీ అలజడి కలగలేదు.

భోగరాజు తక్తు ఎక్కి ఆరేళ్ళు మాత్రమే అయింది. అప్పుడే పంటలలో సగపాలు పన్నులుగా వసూలు చేస్తున్నారు. ఎక్కువ పన్నుకి కాస్త అలవాటుపడ్డ ప్రజ అవడంవల్ల వేసిన పన్ను చెల్లిస్తున్నారు కాని మనుష్యులు మునపటిలాగ లేరు. మహలులో ఎక్కడ చూసినా రాజుగారిని గురించి సంభాషణలే, విమర్శలే, గుసగుసలే! ఈ సంచలనమంతా పండిన పంటల వల్ల పొట్ట నిండడంలేదని కాదు, దేశంలో తిండి పుష్కలంగా ఉండడం లేదనీ, పంటలు పండని కాలంలో మనుష్యులు ఎండవలసిఉంటుందనీ. సింహరాజు మంత్రి - సేనానాయకుడు. అతను ఎత్తైన మనిషి. చేవలు తేరి ఉన్నాడు. అతని

చూపు గంభీరమైనది. మొహంచూసి ఎవరూ జవాబు చెప్పలేరు; అతనికి కోపం వస్తుందని జవాబు చెప్పలేకపోడం కాదు, ఆమాట కొస్తే అతను ఎప్పుడూ గట్టిగా మాట్లాడి ఎరగడు—నింపాదిగా, గంభీరంగా మాట్లాడతాడు, అత నంటే ప్రజకి భయభక్తులు మెండు సింహరా జంటే ప్రజకి ప్రాణమే! ప్రజ అన్నా సింహ రాజుకి ప్రాణమే!

భోగరాజు మునపటిలాగ లేడు. పూర్వం ఎంత బలంగా ఉండేవాడో ఇప్పు డంత ఎముకల పోగు అయిపోయాడు. చూసేవాళ్ళకి అతని కళ్ళలో మాత్రం ప్రాణాలు మిగిలి ఉన్నాయని పిస్తుంది. రాజుయొక్క ఈ స్థితికి ప్రజలు ఏమి చెయ్యగలరు! ఏ సలహాచెప్పినా సింహారాజు చెప్పవలసిందే గాని మరొకళ్ళు మాట్లాడడానికి వల్లా! సింహరాజయినా సమయం కనిపెట్టి ఏమాటయినా అనవలసినవాడు కాని, ఇష్టం వచ్చినట్టు రాజుదగ్గిర మాట్లాడతాడా! సింహ రాజు అలాగే సమయంకోసం చూసిచూసి, ఒకటి రెండుసార్లు రాజుగారి ఆరోగ్యం విష యమై అన్నాడు. భోగరాజు "నాకేమీ అలాగ అనిపించడంలేదు, పైగా మునపటి దుస్తులు ఇప్పుడు సరిపోకుండా ఉన్నాయి. ఇంకా పెద్దవి తయారుచేయించు" అన్నాడు. సింహ రాజు "చిత్తం ప్రభూ" అని ఇంటికి తిరిగివచ్చి, రాచమత్తు ఇలాగ ఉంటుందికదా అని పొట్ట చెక్కలయేటట్లు నవ్వుకున్నాడు.

ఒకరోజున భోగరాజు సింహరాజుకి కబురు పంపించాడు. విశ్రాంతి లేకుండా ఉంటూన్న సింహరాజు నిమిషాలమీద హాజరయాడు. భోగ రాజు సింహరాజుని పులిచర్మంమీద కూచోమని చూపించాడు. అతను ఆసీనుడయాడు. వా ళ్లిద్దరూ సంభాషిస్తూన్నప్పుడు దగ్గిర ఎవ్వరూ లేరు, ఏభైగజాల దూరాన్ని అంగరక్షకులు, దాసీజనం నిలబడి ఉన్నారు.

భోగరాజు కొంచెంసేపు ఊరుకొని "ప్రజ అంతా క్షేమమా?" అన్నాడు.

సింహరాజుకి లోలోపల నవ్వువచ్చింది; అది అక్కడే ఇంకిపోయింది. రాజు మాయలవాడో, అమాయకుడో అతనికి బోధపడలేదు. తన పరి పాలనలో ప్రజ సుఖపడలేదనే సంగతి భోగ రాజుకి ఎప్పటికి తెలుస్తుంది! అతను నిష్కల్మషం గానే ప్రజ సుఖపడుతూందని అనుకుంటున్నాడు. ఇంతకీ ప్రజ కష్టపడాలని అతను చేసిన పని ఏదీ లేదు. తన విలాసాలకోసం అవసరమైన పనులు చేయించుకొంటున్నాడు. అంతే. దానివల్ల వారికి నష్టం కలుగుతూందని అతను ఎరగడు. తాను చేసే పనులలో మట్టుకు ప్రజ దుఃఖపడా లని చేసిన పని ఒకటీలేదు. సింహరాజు "చిత్తం మహారాజా! ఏలినవారి దయవల్ల అంతా క్షేమంగా ఉన్నారు" అన్నాడు.

భోగరాజు కొంతసేపు ఆగి "సింహారాజా! ప్రస్తుతమున్న అంతఃపురం రాణులకి చాలడం లేదు" అన్నాడు.

సింహరాజు గుండెల్లో రాయి పడింది. అయినా రాజు ముందర ఏమంటాడు గనక. "చిత్తం, మహాప్రభూ!" అన్నాడు.

"బొక్కసంలో ఎంత ఉంది" అని నెమ్మదిగా ప్రశ్నించాడు.

సింహరాజు ఒక్క క్షణం ఊరుకుని "స్వామీ! బొక్కసం మళ్లీ నింపవలసిందే!" అని మర్మం లేకుండా విన్నవించాడు.

"అంత ఖర్చు చేస్తున్నారా! నిలవ కొంత ఉంచక పోతే ప్రమాదం కాదా" అన్నాడు భోగరాజు రాజలక్షణంగా.

"చిత్తం. దేవరవారికి ఆదాయ వ్యయాలు ఎప్పటి కప్పుడు తెలియజేస్తూనే ఉన్నాను. కొత్తకొత్త పన్నులు వేస్తున్నాం. వచ్చిన దాని జమా ఖర్చుల వివరం దాఖలు చేసుకుంటున్నాను" అన్నాడు సింహరాజు.

సింహరాజు అలాగు చేస్తున్నమాట నిజమే! పైగా ఖర్చు సర్వ సాధారణంగా భోగరాజు నిమిత్తమే! కనక భోగరాజు వేరే మాట్లాడలేక "మహలు కట్టించే ఏర్పాటు జరపాలి" అని మనస్సులో బాధిస్తున్న విషయం తెలియజేశాడు.

సింహరాజు "చిత్తం, ప్రభూ" అన్నాడు.

కాని భోగరాజుకి డబ్బువచ్చే విధాన మేమిటో తేలలేదు. అతను "ప్రస్తుతం పన్ను వేసే అవకాశం ఉందా?" అన్నాడు.

"మహారాజా! ప్రజలు పంటలలో మూడు వంతులలో రెండు వంతులు దివాణానికి ఇచ్చేస్తున్నారు. వారి భోజనాలకీ, వ్యవసాయం పెట్టుబడికి, ఏమాత్రమూ సరిపోవడం లేదని గుసుస్తున్నారని చారుల వల్ల తెలుస్తూంది. పైగా ఇప్పటి తీరుగా కొంతకాలముంటే ప్రభువులే వాళ్ళకి ధనసహాయం చేసి పాడి పంటలు మళ్ళా వృద్ధిలోకి వచ్చేలాగ చేయవలసి వస్తుందేమో! అటువంటి స్థితి రాకుండా దేవరవారు రక్షించాలి" అన్నాడు సింహరాజు నిర్మొహమాటంగా.

భోగరాజుకి ఏమీ పాలుపోలేదు. అతని కళ్ళ ఎదుట కట్టవలసిన మహలు పూర్తిగా ఆకారం దాల్చి నిలబడింది. "నాగరాజుకి కబురుచెయ్యి" అని అంతఃపురంలోకి వెళ్ళిపోయాడు.

సింహరాజు కేమీ బోధపడక అక్కడే కూచుండి పోయాడు.

పల్లగొండ మహలులో నాగరాజు మంచి మోతుబరి. అతనికి కొన్నివందల ఎకరాల పల్లపు వ్యవసాయముంది. ఏమీ ఖర్చుమనిషి కాదు. కుటుంబమూ చిన్నది. అతను కొన్ని మణుగుల బంగారం నేలమాన్యాలలో నిలవ చేశాడని గుమాను. నాగరాజు మంచి ఎత్తరి మనిషి. నిలబడితే ఎంతో ఠీవిగా ఉంటాడు. బలిసిన శరీరం, ఉబ్బెత్తుగా ఉన్న పొట్ట.

రాజు తనకి కబురు పంపడమేమి టని నాగరాజు నిర్ఘాంత పోయాడు. అయినా వెంటనే బయలుదేరి కంగారుపడుతూ హజారానికి వచ్చాడు. ప్రతీహారులు నాగరాజు వచ్చినట్టుగా తెలియజేశారు. భోగరాజు నాట్యశాలలో ఉండి నాగరాజుకి కబురు పంపించిన మాటే మరిచి పోయాడు. అతను వచ్చినట్టు వార్త రాగా గభాలున లేచి కొలువు కూటానికి వెళ్ళాడు.

నాగరాజు భోగరాజుకి నమస్కరించాడు. కూచోమని మహారాజు సంజ్ఞచెయ్యగా నాగరాజు దుప్పిపిల్ల చర్మంమీద కూచున్నాడు.

కొంచెంసేపు ఉండి భోగరాజు "క్షేమంగా ఉంటున్నావా?" అన్నాడు.

భోగరాజుకి తనమీద కలిగిన వాత్సల్యం నాగరాజుకి అర్థంకాలేదు. అతను "ఏలినవారి దయవల్ల క్షేమంగా ఉంటున్నాను" అన్నాడు తడబడుతూ.

"నాగరాజూ! నువ్వు ఒక సహాయం చెయ్యవలసుంటుంది" అన్నాడు రాజు.

నాగరాజు ఆశ్చర్యపోయాడు. రాజుకి తను చెయ్యవలసిన సహాయం ఏముంటుంది! అతను "స్వామీ! ఎంతమాట! ప్రభువు నా దయతో అన్నమాటేం గాని, ఏలినవారికి నాలాంటి సామాన్యుడివల్ల జరగవలసింది ఏముంటుంది!" అని సవినయంగా అన్నాడు.

"నాగరాజూ! ప్రస్తుతం బొక్కసానికి కొంత అవసరం వచ్చింది."

తాను ప్రాణసమానంగా దాచుకొంటూన్న ధనానికి అపాయం రాబోతూందని నాగరాజు గుండెల్లో రాయిపడింది; కాని రాజుకోరినందుకు సంతోషించాడు. "చిత్తం ప్రభూ! ఏలినవారి కటాక్షం" అన్నాడు.

"రెండు మణుగుల బంగారం ప్రస్తుతం ఇస్తే తిరిగి పుచ్చుకోవచ్చు"

మహారాజు తనతో సంభాషిస్తున్నాడన్న సంతోషంతోను, అడిగినదేదో ఇచ్చేస్తే మిగిలినది క్షేమంగా ఉంటుందనే ఆలోచనతోను నాగరాజు "చిత్తం మహాప్రభూ! కలిగిన దేదో దేవరవారికి సమర్పించుకుంటాను" అన్నాడు.
భోగరాజు లేచి నగరశాలకి వెళ్లిపోయాడు. నాగరాజు అర్థంకాని అవస్థతో ఇంటికి బయలుదేరాడు.

నాగరాజు ఇచ్చిన ధనంతో మహాయజ్ఞం ప్రారంభమయింది పూర్తయింది. భోగరాజు ఎప్పటి కంటె ఎక్కువగా ఆనందిస్తున్నాడు. కాలం గడిచిపోతూంది. మహారాజు పరిపాలన ఎప్పటిలాగే ప్రజలకి సంతృప్తిగా ఉంది. సింహాసనం కాపాడుకుంటూ దేశక్షేమం కనిపెడుతున్నాడు

నాగరాజుకి రాజుతో పరిచయం ముదిరింది. క్రమేపీ ప్రాణస్నేహితులయారు. అతను తరుచు భోగరాజుని కలుసుకొంటూండేవాడు. అటు తర్వాతకూడా భోగరాజు నాగరాజు దగ్గిర ధనం అప్పు పుచ్చుకునేవాడు. క్రమేపీ నాగరాజుతో ఉన్న పరిచయం పురస్కరించుకొని కొన్ని బంజరు భూములు వశం చేసుకున్నాడు. ఈభూములకీ రాజు తనకి బాకీఉన్న ధనానికీ ఏమీ సంబంధం లేదు.

నల్లగొండ మహాలులో ఒక గొప్ప చట్టముంది— ప్రజలుగాని, రాజుగాని, నేల, నీరు, గాలి, నిప్పు, ఆకాశం అంటే పంచభూతాలు— విక్రయించకూడదని. నేలమీద పండిన పంటని గాని, నేల

లాగున్నాను" అని విచారించాడు. అతను దీర్ఘంగా ఆలోచించాడు. లోవరాజు మళ్లీ స్మరణకి వచ్చాడు. "లోవరాజు దగ్గిర కొంత డబ్బున్నమాట నిజము! ఉన్నా, ఎంత ఉంటుంది. పట్టుమని రెండు ఏనుగులు రావు."

ఇంతలో అతనికి లోవరాజు తన్ను బంజరు అడిగిన సంగతి జ్ఞాపకం వచ్చింది. లోవరాజు ధనం, తన భూమి ఒక్కమాటు జ్ఞాపకంరాగా, ఆ రెండిటికీ ముడిపెడితేనో అనే ఆలోచన మనోవీధిని పరుగెత్తింది. పుట్టెడు దుఃఖంలో ఉన్న నాగరాజు కూడా నవ్వు ఆపుకోలేక పోయాడు. "భూమికీ, డబ్బుకి ఏమి సంబంధం!" అయినా అతని మనస్సులోంచి ఆ ఆలోచన వెళ్లిపోలేదు. "డబ్బు పుచ్చుకుని భూమి ఇస్తే?......తనకి అక్కరలేని భూమి డబ్బు పుచ్చుకుని ఎవరికైనా ఇస్తారా!......ఎంచేత ఇయ్యకూడదు? ఎందుచేత ఇయ్యకూడదా? పంచభూతాల చట్టం కనబడడంలేదూ!" అని గట్టిగా అనుకున్నాడు. "ఔను! బాబోయ్! పంచభూతాల చట్టం ఉంది. నేల గాని, గాలి గాని, నీరు గాని అటువంటి వేవీ గాని అమ్మకూడదు బాబోయ్!" నాగరాజు మనస్సులో అమ్మకూడదంటే అమ్మకూడదు, అమ్మవచ్చంటే అమ్మవచ్చు అనే తిరుగుబాటు ఆలోచన రేగింది. ఆ ఆలోచనతో అతను ఒక క్షణం నిర్విణ్ణుడయిపోయాడు. "పంచభూతాల చట్టం బదులు, పంచభూతాలు అమ్మే చట్టం వచ్చిందనుకో, అప్పుడేంచేస్తావు?" అనే వెటకారం ఆలోచనపుట్టింది. మొత్తానికి ఆ ధోరణి వదలలేదు. "చట్టం ఎలాగవస్తుందిరా నాగరాజూ!" అని మనస్సులో ఎవరో వేళాకోళంచేశారు. "ఔను, నిజమే" అనుకొన్నాడు! కాని ఈ చట్టం ఎలాగ పుట్టిందో ఆ చట్టమూ అలాగే వస్తుందనే ఊహ కలిగింది. ఏమో రావచ్చుని మనస్సు సమాధానపడింది. సమాధానపడగానే నాగరాజు ఎగిరి గంతేసినట్టు సంతోషపడ్డాడు. "రాజేకదా చట్టంచేసేది. ఆ రాజే ఆ చట్టంమార్చి ఈ చట్టం చేస్తాడు. దానికేముంది ఆక్షేపణ. ఆ చట్టం ఎలాగ చేస్తారో, ఈ చట్టం అలాగే చేస్తారు. అలాగ చట్టంచేస్తేనే నా బాధలు తీరతాయి. అప్పుడు రాజు అప్పు అడిగినా ఇవ్వవచ్చు. ప్రస్తుతం నేను బంజరుని లోవరాజు మొహాన్న ఊరికే పెట్టనక్కరలేదు" అని తలపోశాడు. నాగరాజు తల ఆలోచనలతో నిండిపోయింది. అతను విచారించాలో, సంతోషించాలో, ఏడవాలో బోధపడక ఉంటున్నాడు. ఏదయినా ఈ ఆలోచన రాజుకి చెప్పి బాధలనుంచి ఇవతల పడడానికి ప్రయత్నం చెయ్యదలచుకొన్నాడు. అంతలోనే నిర్వేదం పుట్టింది. "ఇది జరిగేపనా, పిచ్చి ఊహాలు గాని!" అనుకొన్నాడు. ఏదయినా అతను రాజుకి బహు జాగ్రత్తగా చెప్పదలచుకొన్నాడు. "రాజు ఇష్టపడి చెయ్యవలసిన పని కాని నేను చేసేది కాదు" అని తలచి అప్పటికి ఊరుకున్నాడు. ఆ సాయింతమే నాగరాజు తగురీతిని ముస్తాబు చేసుకొని కోటకి వెళ్లాడు. రాజదర్శనంకోసం తాను వచ్చినట్టుగా తెలియచేశాడు. భోగరాజు రాణులతో సల్లాపాలాడుతున్నాడు. కాని నాగరాజు అప్పుడారుడు. అతని మనస్సు నొవ్వ

జెయ్యడం ఇష్టంలేక వెంటనే కొలువుకూటానికి వచ్చాడు. నాగరాజు నమస్కరించాడు. భోగరాజు కూర్చోమనగా అతను దుప్పిచర్మంమీద కూచున్నాడు. భోగరాజు "ఏమి నాగరాజా! ఇంత ఇలాగు వచ్చావు!" అన్నాడు.

"చిత్తం, ఏలినవారి కుశలం తెలుసుకొని వెళ్ళిపోవాలని వచ్చాను" అన్నాడు నాగరాజు, రాజుతో కలిగిన చనుమానం ఆధారం చేసుకొంటూ.

"నీ ఒంట్లో ఖులాసాగానే ఉంటూందా?"

"ఏలినవారి దయవల్ల మేమంతా క్షేమంగా ఉంటున్నాం."

"ప్రజల మాటో?"

"ప్రభువు వారు భగవంతుడిలాగ కాపాడుతూంటే ప్రజలకి ఏమి లోటు ఉంటుంది! జనులంతా దేవరవారు చిరకాలం రాజ్యం చెయ్యాలని పరమేశ్వరుణ్ణి ప్రార్థిస్తున్నారు."

నిజమే అని భోగరాజు సంతోషించి ఊరుకున్నాడు. తర్వాత భోగరాజు జ్ఞాపకం వచ్చి "ఏనుగులు చాలా మంచివి సుమా!" అన్నాడు.

"చిత్తం, దివాణంలో ఉండవలసిన జోడా మహాప్రభూ!"

"మాకూ అలాగే తోచింది; కాని నీకు శ్రమ ఇచ్చాము.

"శ్రమ ఏముందండి మహారాజా! ఏదో ఉన్నది ఇచ్చేశాను."

"ఔను పాపం! నీకు తిరిగి ఇంకా ఇవ్వలేదు కాదూ!"

"నాది అంటూ ఎక్కడ! మేమంతా తమ బిడ్డలం. మా ఆస్తి తమ సొంత ఆస్తితో సమానం. అలాగే చూసుకోవాలని దేవరవారిని ప్రార్థిస్తున్నాను."

"అయినా అప్పుతీర్చవలసిన విధి ఉంది కాదూ!"

"ప్రభువుల దయగాని మరేమీ కాదు" అని నాగరాజు నమ్రతతో అని "మొన్న లోవరాజు నాదగ్గరికి వచ్చాడు" అన్నాడు, ఇదే మంచి సమయమని.

"ఏమి పని?"

"వేపగూడెం దగ్గర ఉన్న నాతాలూకు పోరం బోకు తాను సాగు చేసుకుంటాడుట."

"ఏమీ నువ్వు చేసుకోలేవూ?"

"అన్నిటికీ తూగడం కష్టం మహారాజా! పన్నెండు మైళ్ళ దూరాన్ని వ్యవసాయం పెట్టుకుని తిట్టుకోడం నాతరం కాదు."

"అంచేత ఇచ్చెయ్యాలనుకుంటున్నావా? బాగానే ఉంది" అని అధికారితనంగా అన్నాడు.

"స్వామీ! తమ సలహా పుచ్చుకుని ఏపనీ చెయ్యదలచుకున్నాను" అన్నాడు నాగరాజు.

"మంచిది."

నాగరాజు నెమ్మదిగా "లోవరాజు ధనవంతుడు" అన్నాడు.

"అలాగా !"

"అటువంటప్పుడు పోరంబోకు ఉట్టినే ఇచ్చెయ్యకుండా ఏదో కొంత.........ఇచ్చేస్తేనో."

భోగరాజుకి అర్థంకాలేదు.

ఆ విషయం గ్రహించి నాగరాజు "లోవరాజు ధనవంతుడు. అతనికి భూమి కావాలి. నా అవస్థ విపరీతంగా ఉంది. నాకు ధనం కావాలి" అన్నాడు.

భోగరాజుకి కొంచెం గోచరించింది. నవ్వు వచ్చింది. "నీ భూమి అతనికి కావాలి, అతని డబ్బు నీకు కావాలి. ఏమంటావు?" అని పకాలున నవ్వాడు. "ఔను అతని డబ్బు నీకు ఎలాగ వస్తుంది" అని ఆశ్చర్యపడి అడిగాడు.

"చిత్తం, దేవరవారికి తెలియని సంగతు లేమున్నాయి నా భూమి అతను పుచ్చుకుంటూన్నప్పుడు తాను ఏమైనా ఇస్తాడేమో!"

భోగరాజుకి కొంత దోషాతికమయింది. అయినా పూర్తిగా అర్థంగాక "డబ్బు పుచ్చుకుంటావు, భూమి అతను పుచ్చుకుంటాడా?" అన్నాడు. కొంచెం ఆలోచించాడు. చప్పున కోపంవచ్చింది. "భూమి అమ్ముతానంటావా, దుర్మార్గుడా! నీ తక్కువబుద్ధి పోనిచ్చుకున్నావుకాదు" అన్నాడు. నాగరాజు గజగజలాడి పోయాడు. "చిత్తం, దేవరవారికి నా బంజరు నేను తిరిగి దాఖలు చేసుకుంటాను, ప్రభూ! దేవరవారికి వేలకొద్దీ ఎకరాల అసలు మినహాయింపుంది. అది ఊరికే తామే ఇస్తున్నారు. దానివల్ల లాభం దివాణానికి లేకుండా పోతూందని—."

భోగరాజు కొంచెం ఆలోచనలో పడ్డాడు. డబ్బువచ్చే ఉపాయమేదో నాగరాజు చూపించినట్టు అనుమానం తట్టింది.

అప్పుడు నాగరాజు "దేవరవారు ఇచ్చిన అసలు మినహా తమకే ఇచ్చివేస్తున్నాను. నా కక్కర లేదు. లోవరాజు తమన్ని కోరితే అది అతనికి ఊరికే ఇచ్చి నష్టపోవడం ధనాగారానికి మంచిది కాదు" అన్నాడు.

భోగరాజు మతి భ్రమించింది. ఎన్నో ఆలోచనలు కలిగాయి. "ధనం పుచ్చుకొని లోవరాజుకి ఇయ్యవచ్చా?" అని లోపల తలచి, పైకి, "పంచభూతాల చట్టమో!" అని అప్రయత్నంగా అన్నాడు. ఆమాట అనగానే నాగరాజు తాను అంతకుముందే ఆ విషయాలను గురించి చక్కగా ఆలోచించినవాడు కాబట్టి "వెంకటి రాజులు చేసినది పంచభూతాల చట్టం. అప్పుడది ఉపయోగంగా ఉండేది స్వామీ! కాలానుసరణగా దానిని మార్చకూడదా? ఎవరన్నారు?" అన్నాడు.

నాగరాజు మాటలు భోగరాజుకి చాల విపరీతంగా కనబడ్డాయి. కాని అతను యుక్తివాదంతోనే మాట్లాడుతున్నాడు అనుకున్నాడు. ఆలోచనలతో రాజుతల దిమ్మెత్తిపోయింది. ఆగకుండా గజిబిజి మనస్సుతో లేచి వెళ్లిపోయాడు. నాగరాజు తన దారిని తాను ఆలోచనలతో వెళ్లిపోయాడు.

నాగరాజు చెప్పి పోయిన ఆలోచన భోగరాజు తలలో గిరగిర తిరుగుతూంది. నిలుచున్నపాటున

తాను కోట్లకొలది ధనానికి అధికారి అయినట్లు తలపోస్తున్నాడు. "ఇంతధనం ఎలాగ పోగొట్టుకోను. బొక్కసం నిండిపోతుంది చిన్నఅప్పు లంటే తీరిపోతాయి" అని అతను ఒకటే ఆలోచించాడు. "పంచభూతాలచట్టానికి వ్యతిరేకమయిన చట్టం చెయ్యడం అంత సులువైన పనా?...... ఎప్పుడైనా చట్టాలు చేసేవారం మేమేకదా! ఈ కాలానికి అనవసరమైన చట్టం ఉపసంహరించి, ఉపయోగపడే చట్టం చెయ్యడం దివాణానికి, రాజ్యానికి కూడా మంచిది" అని ఆలోచించాడు. అతను త్వరలోనే ఒక నిర్ణయానికి రాదలచాడు తన ఊహలు మంత్రికి తెలియచెయ్యడం విధాయకమని తలచి సింహరాజుకి కబురుచేశాడు.

మహారాజుతో నాగరాజు మాట్లాడిన సంగతులు సింహరాజు మాచాయగా విన్నాడు. రాజు కబురు పంపగానే సింహరాజు కొలువుకూటానికి వచ్చాడు. రాజు కూర్చోమనగా అతను పులిచర్మంమీద కూచున్నాడు.

భోగరాజు సంభాషణ ప్రారంభించాడు. "సింహరాజా! మనస్సులో ఒక చక్కని ఆలోచన పుట్టింది. దానివల్ల ప్రజకీ, రాజుకీ, బొక్కసముకీ కూడా మేలు."

"సింహరాజు శ్రద్ధతో చూస్తూ, "చిత్తం, మహాప్రభూ!" అన్నాడు.

భోగరాజు "సర్కారుస్థలం బోలెడుంది— అసలు మినహాని గురించి నేను చెప్పడం. ఇది వ్యర్థమయిపోతూంది. మన స్థలమయ్యుండి, దీని వల్ల లాభం పొందకుండా నిరర్థకమయిపోవడం మంచిదికాదు" అని ఊరుకున్నాడు.

సింహరాజు నెమ్మదిగా "బంజరులు సాగుచేసుకున్నవారి దగ్గరనుంచి పన్నులు వసూలు చేస్తున్నాం. దివాణానికి లాభం కలుగుతూనే ఉంది మహారాజా" అన్నాడు.

భోగరాజు "అదికాదు నేను చెప్పడం. అసలు మినహా ఊరికే దరఖాస్తుమీద దఖలయిపోతూంది. మనస్థలం అయ్యుండగా ఆమోస్తరుగా వ్యర్థంగా ఇచ్చివెయ్యడం ఎంత నష్టమో!" అన్నాడు.

"చిత్తం మహాప్రభూ! ఏలినవారికి మనవి చేసుకుంటున్నాను. పంచభూతాల చట్టంప్రకారం భూమిని ఏవిధంగానూ విక్రయించడానికి వీలులేదు" అని సింహరాజు న్యాయశాస్త్రం తెలియజేశాడు.

"ఔను! నేనెరగని చట్టమా! ఇప్పటికి చట్టం వల్ల నష్టం గుర్తించాము. కాబట్టి అది మార్చవలసింది" అని రాజు తన నిశ్చయాన్ని తెలియజేశాడు.

సింహరాజు ఆశ్చర్యపోయాడు. అతనికి వచ్చిన కోపం మనస్సులోనే ఇంకిపోయింది. అతను సాహసంతో "ప్రభూ! పంచభూతాల అమ్మకం వల్ల కలుగుతూన్న అనర్థాలు చూసి పూర్వపు రాజులు వాటిని అమ్మకూడదని శాసించారు. ఆ శాసనానికి వ్యతిరేకంగా వెళ్ళడం వల్ల ప్రజకీ, ప్రభువుకీ అన్యాయం జరుగుతుంది" అని తన అభిప్రాయం స్పష్టంగా చెప్పాడు.

రాజు దృఢంగా "వల్లకాదు. పంచభూతాల చట్టం రద్దు పరచవలసిందే. దాని వల్ల మనం బాగు పడతాం" అని నిశ్చిత భావాన్ని వెల్లడి చేశాడు

సింహారాజు నేర్పంతా చూపించి రాజు అభిప్రాయాన్ని మార్చాలనుకొని "మహాప్రభూ! ప్రజలు డబ్బుతో ఇక ముందు సౌఖ్యం కొనుక్కోవలసి వస్తుంది. అది ఎంత మట్టుకు సౌఖ్యదాయకమో గమనించండి. దుర్మార్గాలు బయలుదేరతాయి. బీదవారు నాశన మౌతారు. ధనవంతులు చేసే దండగాలకి పరిమితి ఉండదు. ప్రజల కష్ట సుఖాలు గమనించవలసిన రాజు, ప్రజలు పడే ఇబ్బందుల్ని పోగొట్టడం తన తరం గాక, పైగా ధనవంతుల చేతుల్లో చిక్కుకొని, నిమిత్త మాత్రంగా ప్రభుత్వం చేస్తుంటాడు. లోకంలో అన్యాయానికి ఆధారమైన వాటిలో పంచభూతాల అమ్మకం ఒకటి. నే చెప్పగలిగినంత మట్టుకు పంచభూతాల అమ్మకం వల్ల వచ్చే కీడు తెలియజేశాను. ఆటుపైని దేవరవారి ఇష్టం" అని గంభీరంగా పలికాడు.

భోగరాజు రాకన్న కోట్ల కొలది ధనం పోతూ స్పష్టంగా కంగారు పడ్డాడు. అతను రెండేమాటలుగా "పంచభూతాల చట్టాన్ని ఉపసంహరించుదాం. అమ్మకపు చట్టం ఏర్పాటు చేద్దాం" అన్నాడు.

సింహారాజు మాట్లాడలేదు.

గద్దె దిగి మహారాజు గంభీరంగా వెళ్ళిపోయాడు.

విచారంతో సింహారాజు ఇంటికి బయలుదేరాడు. రాచగూడెంలో సంక్షోభం ప్రారంభించింది. నల్లగొండ మహాలంతా వ్యాపించింది. రాజభక్తి గల ఏపదిమందో "పంచభూతాల చట్టంలో తప్పకుండా మార్పు రావలసిందే. ఇదివరకే రావలసింది. రాజు ఉత్తముడు కాబట్టి ఇంతవరకు రాలేదు. కాలానుగుణం మార్పు జరగాలి" అన్నారు. మిగతా వారంతా "ఇది దురన్యాయం. పూర్వంనుంచీ వస్తూన్న ఈ న్యాయమైన చట్టాన్ని ఎవ్వరూ మార్చకూడదు. ఇటువంటి శాశ్వత చట్టాలని మార్చడానికి రాజుకు కూడా హక్కులేదు" అన్నారు.

చాలమంది జనం సింహారాజు ఇంటిదగ్గిర చేరారు. తమని కాపాడవలసిందనీ, చట్టం మార్చితే తమ కష్టకాలం తప్పదనీ మొరపెట్టుకున్నారు. సింహారాజుకి ఏమీ తోచడం లేదు. ప్రజలు అతనితో "మీరు మా క్షేమం కోరి ఏది చెప్తే అది వింటాము. చట్టాన్ని మటుకు మార్చవద్దు" అని బతిమాలుకున్నారు. సింహారాజు దిక్కు తెలియక చూస్తున్నాడు. "భోగరాజు మాకు అక్కరలేదు" అనే కేకలు జనసమూహంలో బయలుదేరాయి. "సింహారాజే మాకు రాజు" అన్నారు గుంపులోంచి నలుగురైదుగురు. అంతమీదట "సింహారాజుకీ జై" అనే ధ్వనులు మొదలెట్టి ఆకాశాన్ని బద్దలు చేశాయి. సింహారాజు తనకుండే బలం కొంత గుర్తించాడు. అతను తనలో "ఈ అమాయికపు ప్రజల్ని రక్షించడం నా విధి" అనుకొన్నాడు. అతను కార్యకరణోద్దేశంతో గాంభీర్యం దాల్చి, తన కింది ఉద్యో

గస్తు డొకడికి కబురు పంపించి "సింహరాజు మంత్రి – సేనానాయక పదవినుంచి విరమించు కున్నట్టు భోగరాజుకి తెలియజెయ్యవలసింది" అన్నాడు. "సింహరాజుకి జై" అనే ధ్వనులు మిన్నుముట్టాయి.

భోగరాజు దూరంనుంచి సింహరాజు ఇంటిదగ్గిర విశేషాలు గమనిస్తున్నాడు. అతను సింహరాజు తన పక్షాన్ని లేకపోయినందుకు కాస్త విచారిస్తు న్నాడు. ఇంతట్లో సింహరాజు పంపిన ఉద్యోగి వచ్చి సింహరాజు ఉద్యోగం నుంచి విరమించు కొన్నట్టు తెలియ జేశాడు. రాజుకి అపరిమి తాగ్రహం వచ్చింది. వార్తతెచ్చిన ఉద్యోగస్తుడి తల తీసెయ్యమని ఆజ్ఞాపించాడు. ఉద్యోగి తల ఛేదించారు

శిరచ్ఛేద వృత్తాంతం సింహరాజుకి తెలిసింది. అతని చుటూఉన్న ప్రజలు ఉద్రేకంతో పొంగులు తొక్కారు.

సింహరాజు తనస్థితి కొంత అపాయకరంగా ఉందని తలచాడు. రాచగూడానికి దూరంగా ఉండడం మంచిదని, అక్కడికి పన్నెండుమైళ్ళ దూరంలో ఉన్న సేపగూడానికి మకాం మార్చే శాడు. లోవరాజు సింహరాజు తన గ్రామానికి వచ్చినందుకు ఎంతో సంతోషించాడు కాని రాజకీయ కారణాలవల్ల ఆసంతోషం పూర్తిగా ప్రకటించలేక పోయాడు రాచగూడెం ప్రజలు కూడా సింహరాజుతోటి వచ్చేస్తా మన్నారు గాని, అతను వాళ్ళని సమదాయించి వాళ్ళ అవసరం త్వరలోనే రావచ్చనీ, అప్పుడు తన దగ్గిరే ఉండవచ్చనీ చెప్పాడు.

భోగరాజు మంత్రి – సేనానాయకుడుగా నాగ రాజుని నియమించానని దేశమంతటా చాటిం పించాడు. కొత్త ఉద్యోగానికి నాగరాజు చాలా సంతోషపడ్డాడు. తనంత గొప్పవాడు రాజ్యంలో లేడన్నసంగతి భోగరాజు ఇప్పటి కేనా గుర్తించాడని సంతోషించి రాజకీయ విధు లని నిర్వహించ దలచాడు.

భోగరాజు నాగరాజుతో ఆలోచనచేసి పంచ భూతాల చట్టాన్ని రద్దుచేసి, పంచభూతాల అమ్మకపుచట్టాన్ని అమలుపరచామని దేశంలో ప్రకటింపించాడు.

నల్లగొండ మహలులో హాహాకారాలు బయలు దేరాయి. ప్రపంచమంతా నాశనమయిందన్నారు కొందరు, పరిపాలన స్తంభిసుందన్నారు మరి కొందరు; అమలుజరిపే ఉద్యోగులెవరూ ఉండ రన్నారు ఇంకొందరు; ఇంక రాజ్యంలో ఉండ వలసిన అవసరం ఎంతమాత్రమూ లేదుకాబట్టి అడవులకి పోయి మనదారి మనం చూసుకొందాం అన్నారు కొంతమంది.

ప్రజలలో తిరుగుబాటు రావచ్చని భోగరాజు ఊహించి సైన్యాన్ని అభివృద్ధి చెయ్యదలచాడు. ఈపని ఇంతకిముందే చేసి అమ్మకపుచట్టం ప్రక టించ వలసిందని అనుకొన్నాడు కాని దేనికైనా మంచి సలహా చెప్పేవారు లేక పోయారని విచా రించాడు. నాగరాజుకి తాను చెప్పవలసిందే కాని అతనికి తెలిసిన విషయాలేమీ లేవు. సింహ రాజు శత్రువు అయాడు. అంచేత భోగరాజు తనే సొంతంగా రాజ్య వ్యవహారాలు చూసుకో దలచి సైన్యాభివృద్ధి తలపెట్టాడు. నాగరాజుకి,

కింద ఉద్యోగులకి ప్రజని సైన్యంలో చేర్చవలసిం దని ఆజ్ఞ జారీచేశాడు. ఉద్యోగస్తులు చాలా ప్రయత్నం చేస్తున్నారు. సైన్యంలో చేరమని ఎవరిని అడిగినా "మేము చేరమంటే మేము చేరం" అంటున్నారు. ఆవిషయం నెమ్మదిగా భోగరాజుకి తెలిసింది. ఉగ్రుడయిపోయాడు. "ప్రజలు తమ ఇష్టానుసారంగా సైన్యంలో చేరితే సరి, లేకపోతే బలవంతంగా చేర్పించ వలసి వస్తుంది" అని ప్రభుత్వోద్యోగులకి తెలియ జేశాడు. "ఏమి చేసినా సరే మేము చేరం" అని ప్రజలు అంటున్నారని భోగరాజుకి మళ్లీ తెలిసింది. బలవంతాన్ని జేర్పించ వలసిందని రాజు ఆజ్ఞాపించాడు. బహు బలవంతంమీద రాజ్యమంతటా ఒక వందమంది సైనికులని ప్రభుత్వ సేవకులు చేర్చగలిగారు.

అమ్మకపు చట్టం అమలులోకి వచ్చిందని విని సింహ రాజు చాలా విచారించాడు. ఆ చట్టంవల్ల జను లకి ఎంత నష్టమో అతను ఎరుగును. ఆ చట్టం రాకుండా తాను చెయ్యగలిగిన ప్రయత్నం చేశా నని సంతోషించాడు. అమలులోకి వచ్చాక ఇంక ఊరుకుని ఉండడం తన విధి కాదను కున్నాడు. "రాజు మూర్ఖుడైనప్పుడు రాజుని దండించ వలసింది ప్రజల బాధ్యత. అందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు" అనుకున్నాడు. సింహరాజు కార్యదీక్ష వహించాడు. అతని చుట్టూ చేరిన వేలకొద్దీ జనులలో జయజయ ధ్వనులు మేఘ మండలాన్ని బద్దలు చేశాయి.

తనచుట్టూ చేరిన జనంలో సింహరాజు ఒక పది మంది బుద్ధికుశలుల్ని, కార్య శూరుల్ని ఎంచి వారితో మంత్రణం చేశాడు. వారు వచ్చిన నిర్ణయం మేమనగా- పంచభూతాల అమ్మకపు చట్టం ప్రపంచానికి విరుద్ధమనీ, అది జనులకి బాధాహేతువనీ, కాబట్టి దాన్ని వెంటనే ఉప సంహరించుకోని, రద్దు చెయ్యాలన్న పంచభూ తాల చట్టాన్ని మరల అమలు జరపవలసిందనీ భోగరాజుని కోరుతూ ఒక రాయబారిని పం పాలి. రాయబారిగా ఎవరిని పంపాలి అనే సమస్య బయలు దేరింది. సింహరాజు తన ఇద్దరి కొడుకులలో పెద్దవాణ్ణి అనగా మొగిలు రాజుని రాయబారిగా పంపుతానని అన్నాడు మంత్రులు, ప్రజలు పొంగిపోయారు. సింహరాజు త్యాగం వర్ణనాతీతమన్నారు. దేశ రక్షణ కోసం ఒక గొప్పనాయకుడు తన పుత్రుని ప్రాణం తృణప్రా యంగా చూడడం ప్రపంచ చరిత్రలో ఇదే మొదటిసారి అన్నారు. ప్రజల ఉత్సాహానికి మేరలేదు.

మొత్తంమీద ఈ సంచలనమంతా స్వల్పంలో తేలే సంగతి కాదని సింహరాజు కనిపెట్టి ఒక పెద్దసైన్యం ఏర్పాటు చెయ్యాలని ఊహించాడు. మంత్రుల్ని పిలిపించాడు. వారితో కూడా ఆలో చించాడు మూడునెల సైన్యం సిద్ధపరచాలను కొన్నారు. సైన్యం ఇంతట్లో ఏవిధంగానూ బహిరంగ ప్రదర్శనాలు చెయ్యకూడదని సింహ రాజు అన్నాడు. అందు మీదట సైనికులు అడ వులలో సమస్థలం చూసుకొని అక్కడ తరిఫీదు పొందుతున్నారు.

ఒక శుభముహూర్తాన్ని మొగిలు రాజు రాయ బారంతో భోగరాజు సన్నిధికి బయలుదేరాడు.

వందల కొద్దీ ప్రజలు అతన్ని రెండు మైళ్ల వరకూ సాగనంపి వచ్చారు. ముందు ఏమిజరుగుతుందో అని జనులు ఉత్కంఠతో చూస్తున్నారు. సింహరాజు సామాన్యుడు కాడు, భోగరాజు రాజేకదా! ప్రజలు సింహరాజు పక్షాన్ని ఉండి ఎటువంటి కష్టాలనైనా ఎదుర్కొనే సిద్ధంగా ఉన్నారు. సింహరాజు మరికొంత సైన్యంకూడా తయారు కావలసి ఉంటుందని మాటవరసకి అన్నాడు. వెంటనే మరి రెండువేల మంది పోగయారు. వారుకూడా యథాశక్తిగా తర్ఫీదు పొందుతున్నారు.

భోగరాజు మండిపడిపోతున్నాడు "నాతో సింహరాజుకు అభిప్రాయభేదం రావలసినదని ఏముంది? రాజు ఆజ్ఞని ప్రజలు పాలించవలసి ఉండికూడా సింహరాజు నాతో అభిప్రాయభేదాన్ని పెట్టుకున్నాడు. ఇంతకీ నేను తెలివితక్కువ వాణ్ణీ, తాను తెలివైన వాడూనా! నేను రాజకార్య నిపుణుణ్ణి కాబట్టే పంచభూతాల చట్టం వట్టి భూతాల చట్టంకాని మరొకటి కాదని తలచి, దాన్ని రాజ్య క్షేమంకోసం మార్చాను. అందులో ఎంతమాత్రం పొరపాటుగాని, తప్పిదంగాని లేదు. అటువంటి సందర్భంలో సింహరాజు ఎవరు నా ఇష్టానికి అడ్డు రావడానికి?" అని కోపంతో అనుకున్నాడు. మరి కొంతసేపుండి భోగరాజు "తాను ఉద్యోగంనుంచి విరమించుకొన్నవాడు ఏదో చేతకాక విరమించుకున్నానని తలవక ప్రజని కూడా రెచ్చగొడుతున్నాడు. దాని పాప ఫల మనుభవించక తప్పదు. ఊరుకునేటందుకు రాజు మూర్ఖుడు కాడు" అని తర్కించుకున్నాడు. ఇంతట్లో మొగిలురాజు రాయబారం మీద వచ్చినట్టుగా ద్వారపాలకులు తెలియజేశారు. "రమ్మనండి" అని భోగరాజు అన్నాడు. రాయబారమేమై ఉంటుంది అని ఆలోచించాడు. "బహుశః సింహరాజు పశ్చాత్తాపపడి, రాజుతో తగవు పెట్టుకోను, తన్ను క్షమించవలసిందని కోరుకుంటూ కొడుకుని పంపించి ఉంటాడు నేనూ సిద్ధంగానే ఉన్నాను" అనుకున్నాడు. మొగిలురాజు కొలువుకూటానికి వచ్చాడు.

మొగిలురాజు తన తండ్రి మాటలుగా మహారాజుతో "పంచభూతాల చట్టం ప్రపంచంతో ప్రారంభించింది కాని నేటిది కాదు. పాలితుల యోగక్షేమాలు కనిపెట్టి పూర్వపురాజులు ఈ చట్టాన్ని ఏర్పరిచారు. ఇటువంటి చట్టాన్ని రద్దు చెయ్యడంవల్ల ప్రజలలో అరాజకం, సంక్షోభం బయలుదేరాయి. కాబట్టి కొత్త చట్టాన్ని రద్దుచేసి, వెనకటి చట్టాన్ని పునరుద్ధరించవలసిందని సింహరాజు తమ పాదాలపై బడి ప్రార్థిస్తున్నాడు. లేకుంటే ప్రజల తిరుగుబాటుకి రాజు సిద్ధపడవలసి ఉంటుంది" అని గంభీరంగా పలికి కూచున్నాడు.

భోగరాజు ఆగ్రహపూరితుడయాడు. అతని ఎర్రటి కళ్ళకి దృష్టి కూడా ఆనలేదు. పెద్ద స్వరంతో "మొగిలురాజుని తుదముట్టించండి" అన్నాడు. తలారులు మొగిలురాజు శిరస్సు ఖండించి భోగరాజుకి అందించారు. రాజు శాంతించాడు.

మొగిలురాజు మరణం వేపగూడెంలో తెలిసింది. సింహరాజు దుఃఖానికి హద్దులేక పోయింది. తన కుమారుడు [illegible] కళ్లయెదుటే మరణించగా తాను జీవించి ఉండటం కష్టమని, ఆత్మహత్యకి సిద్ధపడ్డాడు. మంత్రులు, ప్రజలు అతన్ని బతిమాలుకుని, బలవన్మరణం పాపహేతువనీ, మొగిలురాజు ఆత్మ అంతటితో శాంతించదనీ, భోగరాజుని సంహరించినప్పుడే మొగిలురాజు ఆత్మ సంతోషిస్తుందనీ చెప్పగా, రాజు ధైర్యం తెచ్చుకొని, కన్నీళ్లు తుడుచుకున్నాడు. అతను మంత్రుల సలహాపైన భోగరాజుమీద యుద్ధం ప్రకటించాడు.

యుద్ధవార్త విని భోగరాజు వెకిలినవ్వు నవ్వాడు. "పుత్రశోకంవల్ల సింహరాజు మెదడు చెడిపోయింది పాపం. లేకుంటే మహారాజుతో యుద్ధానికి సిద్ధపడతాడా! పెద్దపులిమీదకి లేడి యుద్ధానికి వెళుతుందా! సింహరాజు కష్టపడి ఇంతదూరం వస్తే యమపురికి వెళ్లి తన కుమారుని కలుసుకొని శాంతించవచ్చు" అని ఊరుకున్నాడు.

ఒక సుముహూర్తాన్ని సింహరాజ సైన్యం కదిలింది. సముద్రఘోషలాగ ఉంది. ఆ ఘోషని విని భోగరాజు మొదట అడవిలో పెద్ద గాలివాన చెలరేగుతూంది కామోసు అనుకున్నాడు. వేగులవారు వచ్చి సింహరాజ సేన బయలుదేరిందనీ, దాని పరిమితి తెలియడం లేదనీ, బహుశః అయిదు వేలు ఉండవచ్చునీ, చెప్పగా, భోగరాజు నోటమాట రాలేదు. అతను తెప్పరిల్లి యుద్ధానికి అలస్యం చెయ్యడానికి ఎంతమాత్రం వీలులేదని నాగరాజుని పిలిచి, "యుద్ధానికి సైన్యాన్ని ఆయత్తపరచవలసింది" అన్నాడు. "చిత్తం, మహాప్రభూ! అంటూ నాగరాజు నిష్క్రమించాడు. కొత్తగా చేరిన రెండు వందలమందితోటి కలిపి మొత్తం అయిదువందల సైనికులు మాత్రమే ఉన్నారు.

సింహరాజుసైన్యం రాచగూడానికి మైలు దూరంలో విడిసింది. అతను మంత్రుల్ని రావించి ముందు కార్యక్రమం ఆలోచించాడు. వారి సలహామీద భోగరాజు దగ్గరికి హార్కారుల్ని ఈ కింది సందేశంతో పంపాడు, "మహాప్రభూ! ప్రజల అభిప్రాయానికి వ్యతిరేకంగా పంచభూతాల చట్టాన్ని రద్దుపరచడం న్యాయంకాదు. ఇప్పటికైనా వచ్చిన నష్టమేమీలేదు. అమ్మకపు శాసనం రద్దుచేసి పంచ భూతాల చట్టాన్ని పునరుద్ధరించినట్టయితే మహారాజావారితో మాకేమీ స్పర్ధలు లేవు."

హార్కారులు భోగరాజు దర్శనంచేసి సింహరాజు సందేశం విన్నవించారు. భోగరాజు ఉగ్రుడై పోయాడు. "మహారాజుకి నీతులు చెప్పేపాటివాడయ్యాడా సింహరాజు! షెబాస్! అతని తల తుంచకుండా ఈ ఖడ్గం నేను వాల్చను" అని ఒరలోంచి ఖడ్గంతీసి ఎత్తి పట్టుకున్నాడు.

పరివారం సంతోషాన్ని ప్రకటించింది.

హార్కారులు తిరిగి సింహరాజు దగ్గరికి వచ్చి జరిగిన విషయమంతా నివేదించారు. సింహరాజు తల పంకించాడు. సైన్యాన్ని యుద్ధానికి అడుగు

వెయ్యమన్నాడు. సైనికుల సంతోషంతో ఆ శోకం బద్దలయి పోయింది. తమ భుజబలం చూపించే అవకాశం వచ్చినందుకు వారు ఎంతో ఆనందిస్తున్నారు సముద్ర తరంగాల లాగ సేన ముందుకి కదులుతూంది.

కోటకి నాలుగు ఫర్లాంగుల దూరంలో సేన ఆగింది. డప్పులు, శంఖాలు, బాకాలు చేసే ధ్వనులకి కొండలు ప్రతిధ్వనించాయి. ఉప్పెనలాగ వచ్చిన సైన్యాన్ని చూసి భోగరాజు సైనికుల ధైర్యం చలించిపోయింది. వారు తమ ప్రాణరక్షణమే అన్నిటికంటే ముఖ్యమైన పనిగా ఎంచారు. పిక్కబలిమి చూపదలచుకొన్నారు.

శత్రువులసేనని చూసి భోగరాజు భయపడిపోయాడు. అతను ఎంత పరిశీలించినా శత్రువుల సేన యొక్క హద్దు తెలియడంలేదు. అది కలో, నిజమో బోధపడటంలేదు. కాని వట్టి ఆలోచనలకిది సమయం కాదనీ, తన సైన్యం బాగా తరిఫీదయినదనీ, ఎదిరి సైన్యం వట్టి పోగరుబోతుల, దేశద్రోహుల గుంపు అనీ నిర్ణయించాడు. సింహరాజు తలపుకి వచ్చేటప్పటికి భోగరాజు ఒళ్లు భగ్గున మండిపోయింది. "ఆ దేశద్రోహిని చంపక మాన"నని పళ్ళు పటపట కొరికాడు. ఆలసించడం ప్రమాదమని అతను శత్రువులమీదికి దూకవలసిందని సైనికులకి ఆజ్ఞ ఇచ్చాడు. రాజాజ్ఞకి సైనికులు హడిలి పోయారు. సముద్రంలాగ ఉన్న శత్రు సేనతో పోరాడడం తమ తరమా! ఇంత సాహసించినా, జయం దక్కదు, నిజం. అటువంటి స్థితిలో నిష్ప్రయోజనమైన ప్రాణత్యాగం దుర్భరమని వారు ఎవరికి తోచినట్టు వారు కొండలంబడి, అడవులంబడి పారిపోయారు.

భోగరాజుకి ఈ సంగతి తెలిసింది. మతి చలించింది. వెర్రికేకలు పెట్టడం మొదలెట్టాడు. ఆత్మరక్షణ ప్రధానమని తలచి ఇది జంతువు, ఇది రాయి అని ఎరగకుండా కత్తితో సాము చేస్తున్నాడు.

భోగరాజుకి పిచ్చి ఎత్తినందుకు పరివారం విచారించింది. అతన్ని తాళ్ళ బంధించారు. ఇక చెయ్యగలిగిన దేమీ కనపడదు.

ఈ విషయమంతా నాగరాజు చూస్తున్నాడు. అతను పరివారంతో "నేను మొదటినుంచీ యుద్ధం వద్దని భోగరాజుతో చెప్తూనే ఉన్నాను. నా మాటవినక నా గొంతుక కోశాడు, తన గొంతుక కోసుకున్నాడు. ఇప్పుడు నాకు దారి కనపడదు. ఎలాగ చావను!" అన్నాడు. ఇందుమీదట పరిజనం నాగరాజుకి ఈవిధంగా సలహా చెప్పింది, "నిజంగా యుద్ధం జరగకుండానే మనం ఓడిపోయాము. గెలుపు మన వశంలోలేని పనయిపోయింది. ఇప్పటికైనా ప్రాణాలు దక్కించుకో తలుస్తే, మన మంతా భోగరాజుని, రాణులని, కుటుంబాన్ని నడిపించుకుంటూ తీసుకు వెళ్ళి, సింహరాజు పాదాలమీద పడవేద్దాం. సింహరాజు విశాల హృదయుడు. కనక మనని కనికరించవచ్చు. గత్యంతరం లేదు." నాగరాజు ఎలాగా ప్రాణానికి తెగించి ఉన్నాడు కాబట్టి అతనికి ఈ సలహా విపరీతంగా కనబడలేదు. "యుద్ధం చేస్తే మరణం తప్పదు. ఈ మోస్త

ఇంకా

రుగా ప్రవర్తిస్తే ఒకవేళ బతకవచ్చు" అని అతను ఊహించాడు.

భోగరాజు, పిచ్చికేకలు వేస్తున్నాడు. అతన్ని బలవంతంగా నడిపించుకు వెళుతున్నారు. అతని వెనకాల రాణులు, కుటుంబం దుఃఖసముద్రంలో మునిగిపోయి, నడవలేక, నడవలేక నడుస్తున్నారు. వాళ్ళ వెనక నాగరాజు ఉన్నాడు. వెంట కొంత పరివారం వస్తోంది.

సింహరాజుకి ఈ సంగతి తెలిసింది. అతను సైన్యంతో "యుద్ధం చెయ్యకుండానే మనం జయం పొందాం. యుద్ధం ముగిసింది కాబట్టి ఆపద్బోటువంటి భోగరాజు మొదలైనవారికి ఏమీ హానిచెయ్యవద్దు" అన్నాడు.

భోగరాజు, తక్కినవారు సింహరాజు దగ్గరికి వచ్చారు. నాగరాజు భోగరాజుని సింహరాజు కాళ్ళమీద పడేశాడు. సింహరాజు పిచ్చి ఎత్తిన భోగరాజుని చూసి విచారించాడు. అతను తన సేవకులకి భోగరాజుని, రాణులని, కుటుంబాన్ని నాగరాజుని బందీలుగా చెయ్యవలసిందనీ, వారిని రాజకీవితోనే ఆదరించవలసిందనీ ఆజ్ఞ ఇచ్చాడు.

రాచగూడెం కోట సింహరాజు వశమయింది.

సింహరాజు మంత్రుల్ని పిలిచి "మనం కష్టపడి రాచగూడెం రాజ్యం సంపాదించాము. కాని దేశానికి రాజు లేకుండా పోయాడు. పిచ్చెత్తి పోడంవల్ల భోగరాజు పనికిరాడు. అతని సంతానాన్ని రాజుగా చెయ్యదలచుకుంటే నా అభ్యంతర మేమీ లేదు. ఏ దయినా మన మంతా కలిసి ఆలోచించి చెయ్యవలసిన పని" అన్నాడు.

మంత్రులు ఏక కంఠ్యంగా "ఈ దేశానికి సింహరాజునే రాజుగా ఎన్నుకొన్నాము" అన్నారు. సింహరాజు తన అయిష్టతని చూపించాడు. కాని మంత్రులు, ప్రజలు బలవంతం చేశారు. అందుచేత సింహరాజు సంతోషించి "ప్రజాసేవకంటె నాకు వేరే పరిపాలన తెలియదు. మంత్రులు ఏ సలహా ఇస్తే అది అమలు జరపడమే నా పని. నిరంకుశ ప్రభుత్వానికి ఇకముందు ఈ దేశంలో తావు లేదు" అన్నాడు.

రాజసభలోనూ, సైన్యంలోనూ హర్షధ్వానాలు చెలరేగాయి.

ఒక సుముహూర్తాన్ని సింహరాజు నల్లగొండ మహాలు రాజ్యానికి పట్టాభిషిక్తుడయాడు. అతను మంత్రుల సలహా మీద అమ్మకపు చట్టాన్ని రద్దు చేసి, రద్దు చెయ్యబడ్డ పంచభూతాల చట్టాన్ని పునరుద్ధరించాడు

సింహరాజు మంత్రులతోగూడి నాలుగు కాలాల పాటు దేశాన్ని సుభిక్షంగా పరిపాలన చేశాడు.

పిలుపు

పన్యాల రంగనాధరావు

"అమ్మా!"

పరధ్యానంగా కూర్చొని ఏదో ఆలోచనలో పడిన రత్నమ్మ ఒక్కసారి ఆ పిలుపుకి ఉలిక్కిపడ్డది. తొందరగా శాంత మంచం దగ్గరకుపోయి, ఆమె ముఖవైఖరి గమనించి,

"ఏమమ్మా! ఏం కావాలి?" అన్నది.

శాంత కనురెప్ప వెయ్యకుండా క్షణం రత్నమ్మ కళ్ళల్లోకి చూసి—

"వొచ్చావా అమ్మా! రావేమో అనుకున్నాను..." అన్నది.

ఆ మాటతో రత్నమ్మ—అంత నిర్భయమైన మనిషీ—కొంచెం దిగులు పడింది. స్త్రీలలో ధైర్యవంతురాలెవరని చర్చకు వచ్చినప్పుడు రత్నమ్మనే పేర్కొనటం చాలామందికి అలవాటయిపోయింది. ఆమె ధైర్యమూ, గుండె నిబ్బరమూ చూశాకనే చాలామంది అకస్మాతుగా ధైర్యవంతులయినారన్నా ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. మనస్సుకీ హృదయానికీ ఏదైనా ఒక షాక్ తగిలితే రత్నమ్మంత సులువుగా తట్టుకోగల మనిషి మరెక్కడా అగుపించదు. అందుకు తగినట్టు ఆమె జీవితమంతా ఇటువంటి గాయాలతోనే నిండిపోయింది. ఆమె భర్త చనిపోయినాడు. కూతురూ పోయింది. కొడుకున్నూ పోయినాడు. మొదట్లో ఆమె ఎంత ఏడ్చినా, ఎవరూ సులభంగా తేరుకోలేనంత వేగంగా తేరుకుని, తిరిగి మామూలు మనిషే అయిపోయింది.

దయ్యాలలో అసలు నమ్మకం లేకపోవడం, రత్నమ్మలో ఉన్న మరో విశేషం. చచ్చిన వాళ్లు దయ్యాలవుతారంటే, ఆమె ఒక చిరునవ్వు నవ్వేసి, ఎదుటివారి వాదన దులిపి పారేస్తుంది. ఇటువంటి మనిషి కనుకనే, శాంతకు జబ్బుగా ఉన్నదంటే, ఎక్కడో పల్లెలో మారుమూలన పడిఉన్న మనిషి చీకటికీ నిర్మానుష్యానికీ లెక్కచేయక ఒక్కతే ఒకరోజు కాలినడకను వచ్చేసింది.

ఇంక ఆమెను చూచి ఆశ్చర్యపడని వారుండ రనడం దేనికి?

శాంతకు జీవితంలో కలిగే మార్పులనైనా తట్టుకోగల శక్తిలేదు. చిన్నతనంనుండీ ఎంత గారాబంగా పెరగాలో అంత గారాబంగానూ పెరిగింది. శాంతకు కొడుకు పుట్టిన ఏడాదికి ఆమె తల్లీ తండ్రీ ఇద్దరూ పోయినారు. ఈ రెండు దెబ్బలనూ శాంత ఒక్కమారుగా భరించలేకపోయింది. తండ్రి దగ్గర కన్నా తల్లి దగ్గరే ఆపిల్లకు ఎక్కువ చనువు ఉండడంచేత ఇప్పుడు ఎక్కడ పడితే అక్కడ ఆ తల్లే కనపడుతున్నట్లు అవుతుంది. నెల తిరగకుండానే శాంతకు జబ్బుచేసింది. పినతల్లి రత్నమ్మను తన దగ్గరకు తెప్పించుకున్నది.

శాంతను చూసిన మొదటి నాడే రత్నమ్మకు తన పోయిన కూతురు జ్ఞాపకం వచ్చింది. శాంత తన్ను 'పిన్నీ' అని పిలవడం రానురాను బొత్తిగా మానేసి 'అమ్మా' అనే అంటున్నది. శాంత ఆవిధంగా పిలుస్తూ ఉండడం తన కెంతో తృప్తికరంగానూ ఉంది గాని, ఆ పిలుపే తన హృదయాన్ని కెలుకుతున్నట్లుగా బాధపడసాగింది.

"నువు మా అమ్మ లాగనే ఉంటావు పిన్నీ!" అన్నది శాంత అంత జ్వరంలోనూ. చప్పున రత్నమ్మకు తన అక్క జ్ఞాపకం వచ్చింది.

తనకూ తన అక్కకూ చాలా ఎక్కువగా పోలిక లున్నవనే విషయం రత్నమ్మ చిన్నతనంనుండీ ఎరుగును. తన చిన్నతనంలో తననూ తన అక్కనూ చూసి చాలామంది కవల పిల్లలనే భ్రాంతి పడుతూ ఉండడం తన కింకా జ్ఞాపకం ఉంది. ఇవన్నీ ఇటీవలం దాకా మరచిపోయినా, ఇవాళ శాంతమాటలు తిరిగి ఆమె హృదయాన్ని కెలుకుతున్నై.

"అమ్మా"

చేతులు వెనక్కు పెట్టుకుని ముందు కిటికీలోంచి ఆకాశం వైపు చూస్తున్న రత్నమ్మ వెనక్కు తిరిగి చూసింది.

"హాబ్బ! ఎంత మా అమ్మలాగ అగుపించావు పిన్నీ! నా కేమిటో భయం వేస్తున్నది......" అన్నది శాంత.

"భయమేమిటే పిచ్చి పిల్లా! నేను

"మాత్రం మీ అమ్మను కానుటే?" అంటూ రాని నవ్వును తెచ్చుకొంటూ రత్నమ్మ శాంతను ఉపశాంతి చేసింది.

"నిన్ను పిన్నీ అని పిలవడం నాకు బాగా లేదు. అమ్మా అంటాను—పలుకుతూ ఉండేం?"

రత్నమ్మ ముఖ వర్చస్సు ఒక్కసారి దిగులుతో నిండి పోయింది. "అలాగే పిలూ తల్లీ!" అన్న దేకాని తనలో కలిగే మార్పు తలచుకుంటూ భయపడ సాగింది రత్నమ్మ.

శాంత జ్వరం ఎన్నాళ్లో లేదు. ఆమెకు బెంగతో చేసిన జబ్బు బెంగ పోవడంతోనే పోయింది. కాని ఆ జబ్బు ఆ ఇంటిని మాత్రం విడిచి వెళ్లలేదు.

శాంత లేచి కూర్చున్న రెండోనాడే రత్నమ్మకే జ్వరం తగిలింది. ఈ జ్వరం నూటనాలుగు డిగ్రీల వరకూ పోయే దాకా అది జ్వరమంటే నమ్మకమే కలగ లేదు రత్నమ్మకు.

అన్నింటికన్నా రత్నమ్మను ఎక్కువ ఆశ్చర్యపరిచింది తనకే జ్వరం రావడం! సెంటిమెంట్సును అర్థం చేసుకుని అనుభవ పూర్వకంగా రత్నమ్మ వాటిని విడవాలని ప్రయత్నిస్తే ప్రయత్నిస్తూ ఉండవచ్చును; కాని ఆ సెంటిమెంట్సు తన్ను వదిలేటట్టు లేకపోవడం చూసి తనమీద తనకే నమ్మకం పోతున్నట్టు అనిపించింది.

ఆ జ్వరతీవ్రతలోనే రత్నమ్మకు భర్తా కూతురూ కొడుకూ జ్ఞాపకం రావడం మొదలు పెట్టారు. తనకు వాళ్లు జ్ఞాపకం వస్తున్నట్టు తెలుసును. తెలిసి కూడా వాళ్లను మరవడం దుస్సాధ్యం అవుతున్నది — బహుశా తెలియడం వల్లనే ఏమో—అదీకాక, ఈ శాంతనూ, ఈమె ప్రవర్తననూ చూస్తున్నప్పటి నుండీ, తనకూతుర్ని మరచి పోవడం ఎట్లానో రత్నమ్మకు అర్థం కాలేదు. ఈ ప్రయత్నంలో తను ఓడిపోతున్నట్టే అగుపిస్తున్నది.

"అమ్మడూ! ఒకమారిలా రామ్మా!"

"అదేమిటమ్మా అలా పిలుస్తున్నావు? నేనమ్మణ్ణా?" అన్నది శాంత దిగులుగా.

"నువ్వూ మా అమ్మడులాగే కనిపించావు తల్లీ! ఎందుకో నాకు అమ్మడు జ్ఞాపకం వచ్చింది నిన్ను చూస్తే!"

"అట్లా పిలవకే అమ్మా నన్ను — నా కెందుకో భయంగా ఉంది!" అంటూ శాంత రత్నమ్మ తలమీద చేయిపెట్టింది. శాంత ఎంత అమాయకురాలు! రత్నమ్మ అదే తలచుకుంటూ ఆశ్చర్యపడ్డది.

తనకూతుర్ని పిలిచేలాగు శాంతను పిలుస్తే శాంత కెందు కంతభయం కలిగిందో, తన్ను అమ్మా అంటే తనకూ అంతభయమూ కలగవచ్చుననే విషయం శాంత గ్రహించుకోలేక పోవడంలో ఆశ్చర్యం దేనికీ? కాని, ఇంతవరకూ తన కీ ఆలోచన ఎందుకు పోవాలీ? శాంత చిన్నది. అనుభవాలాట్టేలేనిది. అమాయకురాలు. ఆపిల్లకు భయమూ దిగులూ కలగడంలో అర్థముంది కాని- తనకో!—తన జీవితంలో ఇన్ని దెబ్బలకు గురిఅయిన తనకో! — ఇప్పుడు భయం కలుగుతున్నదంటే ఏమనుకోవాలి?

ఈ భయాన్ని మరచిపోవటానికి ప్రయత్నిస్తున్నకొద్దీ రత్నమ్మకు భయం హెచ్చవుతున్నది. అంతేకాదు-ఆమెకు నిజంగా తన అక్క కూడా చాలా ప్రమాదకరంగా జ్ఞాపకంరావడం మొదలయింది. ఇంతవరకూ తను ఎంత ధైర్యవంతురాలో ఇప్పుడంత అధైర్యానికి గురికావడం దేనికో రత్నమ్మకు తట్టకుండా ఉంది. తన భర్తా కూతురూ కొడుకూ ఏనాడో పోయినారు. అందుచేత వాళ్ళతో ఆట్టే ఇబ్బంది లేకపోయింది. అదీకాక వాళ్ళు పోయిననాటి నుండీ ఇప్పటివరకూ ఆమెకు మితిలేని ఆత్మసంస్కారం అలవడింది. కాని, ఇంత ఆత్మసంస్కారమూ ఈనాడు ఈ అక్క స్మృతిలో మట్టికొట్టుకు పోయేటట్టుగా ఉండడం రత్నమ్మ భరించలేక పోయింది. తన్ను అమ్మా అని పిలవడం శాంత మానితే తనకు జ్వరం తగ్గేటందు కవకాశం ఉంటుందేమో! తను తనఅక్కను సులభంగా మరచి పోవచ్చునేమో! కాని ఈవిషయం ఆ శాంతకు తెలియజేయడమెట్లా? ఆపిల్ల కాస్తా దిగులు పడదా? ఆపిల్ల మళ్లీ మంచం పట్టిందంటే, ఇంక ఆమెభర్త జీవించగలడా?

"అమ్మా! డాక్టరుగారు వస్తున్నారు."

రత్నమ్మ మళ్లీ ఉలిక్కిపడింది. డాక్టరు

రావడం, చూడడం, ఆలోచించడం, పోవడం ఇన్నీ జరిగినా ఆమెకి నేవీ జరిగినట్టే లేదు. ఆమె ఆలోచిస్తున్న దల్లా, శాంత, అమ్మ, అక్క వీటిగురించే. శాంత ఆలోచించి ఇట్లా అన్నది—

"అమ్మా! డాక్టరు నయమవుతుందన్నాట్ట బెంగదేనికీ?"

ఈ శాంత నిజంగా పిచ్చిదే. తనకు నయమవడం—బెంగ—ఉన్నట్టు—తీరడం! కాని, ఈ శాంత తన్ను మళ్లీ పిన్నీ అంటేనే ఎంత బాగుండిపోను! ఆ ఒక్కమార్పు చాలదా తను నయమవటానికి? కాని, తన ఈ లోపలిబాధ గుర్తించేపాటివాళ్లెవరు? తన ఈ స్వల్పకోరిక అర్థంచేసుకుని తీర్చే దెవరు? ఈ శాంతే కాస్త తెలివిగల పిల్లే అయివుంటే ఎంత మెరుగు!

"అమ్మా! మందు తాగుతావా?"

రత్నమ్మకు ఎదురుగా తనఅక్క నిలుచున్నట్టు కనపడింది. నిజంగా అక్కే! ఎట్లా బతికివచ్చింది? దయ్యాలంటారు నిజమేనేమో! తనకు దయ్యాలంటే ఎందుకు నమ్మకం లేకపోవాలీ? అదీ కాక ఈమె తను ఊహించే దయ్యం లాగా లేదు. నిజంగ్గా అక్కే! శాంత తల్లే.........

"మందు తాగవమ్మా! నాలుగు డోసులు పడాలి కడుపులో......".

అక్క కాదు.... శాంత! తల్లి పోలికలు ఎంతగా ఉన్నై ఈ పిల్లలో! మా అమ్మ పోలికలు నీలో ఎన్నో ఉన్నై అని తనతో అన్న శాంతలోనే తల్లిపోలిక లెక్కువగా ఉన్నై!

ఇవాళ శాంతలో తల్లి పోలిక లగు పించినై. ఈ శాంతను ఎదురుగా ఉంచుకుని తన అక్కను ఎట్లా మరచి పోవడం?

అయినా తల్లుల దగ్గర పిల్లలకంత చను వుండడం ప్రమాదకరమే. ఈ శాంత క్షణ క్షణానికీ తన నీసారి అమ్మా అంటుందికాని అందువల్ల తన హృదయం ఎంత ఆందోళనకు గురి అవుతున్నదో ఈ శాంతకు తెలీదు.

రత్నమ్మ ఒకసారి లేచి కూర్చున్నది. ఆమె అక్క ఒకసారి వచ్చి తన పక్కనే కూర్చున్నది.

"అక్కా వచ్చావా? ఎట్లా వచ్చావు?"
"ఎట్లా రావడమేమిటే? ఇక్కడేకద ఉంటున్నాను?"
"ఇక్కడేనా? ఎంత కనపడకుండా పోయినావు! నీ కూతురు శాంత... అంత బెంగపడిపోయింది నీకోసం. నన్ను చూస్తేనేగాని ఆ పిల్లజబ్బు నయం కాలేదే! ఎట్లా విడిచేసి వెళ్ళిపోయినావు?"

శాంత దిగాలుపడిపోయి పరుగెత్తుకు వచ్చింది.

"ఏమిటమ్మా! ఏమిటట్లా పలవరిస్తున్నావు?"
"అబ్బే! చూడూ—అమ్మ అంటే ఆపిల్లకెంత ఆవేశమో! క్షణం విడవలేదుకదా! రా—నీకూతుర్ని దగ్గరకు తీసుకో. నన్ను విడిచెయ్యి. నా గ్రామానికి పోతాను. నన్ను బంధాలలో పడెయ్యకు. ఈ ప్రపంచాన్నుండే నన్ను వేరుగా ఉండనియ్యి. అక్కా—వొద్దులు—వెళతాను—వొద్దులక్కా-"

రత్నమ్మ లేచిపోవడం చూసి శాంత నిర్ఘాంతపోయింది. చప్పున శాంతకు ఏ ఆలోచనా తట్టలేదు.

"ఎక్కడికి పోతున్నావే అమ్మా!"

"అబ్బ-మళ్ళీనా? ఇదిగో మీ అమ్మ—" నేనా మీ అమ్మని. ఇదో వచ్చింది మీ అమ్మ-అక్కా! నీకూతురు పిలుస్తున్నా పలకవేం? నా అనుభవాలన్నీ నాకు జ్ఞాపకం తేవటం నీకు సరదాగా ఉందా? వొద్దు-నేనిక్కడ ఉండలేను. నన్ను పోనియ్యి."
రత్నమ్మ ద్వారంవరకూ తూలుతూ నడిచిపోవడం చూస్తున్న శాంతకు మతిపోయినట్టయింది. రత్నమ్మ మరి నడవలేక అట్లా ద్వారందగ్గరే కూలిపోయింది. శాంత ఒక్కసారి "అమ్మా" అని గట్టిగా కేకవేసి వెర్రిచూపు పెట్టేసి నిలబడిపోయింది. ఆ కేకతో, పిలుపుతో రత్నమ్మ ఏమయిందో కాని, ఆమె తెరచినకళ్లు తెరచినట్టే ఉండిపోయినె.

*

[ఇది సీతాకల్యాణము మొదలు బాలకాండాంతము వరకు గల రామాయణ కథ]

వంగియున్న తన ధనుస్సు
వలె స్వామికి కనుబొమ్మలు.
ఆకాశ వీధిలో
నమర ధనుర్ద్వయము.
తమ బలములు చాలలేదు
తల వాల్చిరి సభాసదులు
విరిగిన శివధనుస్సులాగా
విరిగిన తమ మనస్సు లొప్పగ
కబురు పోయి వియ్యంకులవారికి
కదలి వచ్చె కోసల సామ్రాజ్యము.

క్షీర వార్ధి ఛ్ఛాయ
సీతా సతికి మేన
కన్నులలో నవ్వు
గల పెండ్లి కూతురు.
సిగ్గు తెరలు చీల్చుకొన్న
వసంత కాలపు మల్లెల నవ్వులు.
నల్ల మబ్బుల స్వామికీ
తెల్ల మబ్బుల దేవికీ
కల్యాణం—జగత్తు కోసం
కావలసిన—గ్రంథం కోసం.
పాడి రాడి రమ రాంభోజాక్షులు
మూడవ ముడి ముగింపు వేళకు.
సిగ్గుచేత తల వంచిన
సీతాదేవీ సతియును
మంగళ సూత్రములో రాముడు
మరీ మరీ నవ్వుకొనిరి—

వధూ వరుల వగు
బలా బలములకు
బంగరు పళ్లెము లందున పోసిన
పసపు బియ్యములు కొలబద్దలుగా—
కల్యాణం--జగత్తు కోసం.

అయోధ్యాభిముఖ
మైన ప్రయాణం!
అవతార ద్వయ
మిథ్యా యుద్ధం.
రణ జయమ్ము రామునకా ?
జమదగ్ని పుత్రునకా ?
లీలా విజయం—లీలాపజయం.

దశరథముల చక్రమ్ములు
దాటి దాటి గహనమ్ములు—
కోసల దేశపు రాచ నగరునకు
క్రోసు దూరమున రథములు నిలచెను.
ఎదురు వచ్చి పుర జనమ్ము
లెత్తిరి కర్పూ రారతు
లా రాముని ముఖమండల
మందలి తేజో దీప్తులు!
వసంతమ్ము పూ పరిమళములు—
విసరి కొట్టు మలయానిలములు
ఊరి బయట నుద్యానమ్ములు—
నారుబయట వెన్నెల రాత్రులు.
సీతారాముల
దాంపత్యం!

నల్లత్రాచు

[ఇది 'సౌప్తికము' లోనిది. అశ్వత్థామ పాండవ శిబిరములోనికి పోయి, దృష్టద్యుమ్నుని చంపు కథాభాగము. నల్లత్రాచు గ్రాంథిక సింబల్.]

ఆతరి నల్లత్రాచు, శిబిరాంతర భాగములో వమద్విషో
పేతము చొచ్చె నొక్క దరివీర-భయంకర భోగి పూత్కృతుల్
పాతుకొనంగ నల్దిశలు ప్రాకి, క్రుధాపరిధుల్ సమస్తమై
లోతు సుషుప్తిలోకముల లోని యెదల్ కదలెన్ ప్రశాంతముల్.

ఆననమెల్ల ద్రాగరుణమై, పగ పట్టిన త్రాచుపాము, లో
పూనిన క్రోధ వార్నిధులు పొంగినవో, సుఖనిద్రలో తనూ
జ్ఞానము లేక తచ్ఛిబిర గర్భములో శయనించు, నే చమూ
జానికి తోచలేదు వరుసన్ కలలందున కాళసర్పముల్ ?

ఆ నిమసమ్ము పొంగిన మహాంబునిధానవవంతరంగ కో .
పానల కీలలన్ శిబిర మంతయు లోపల చిచ్చు పెట్టిన
ట్లైన, కసుంగొనంగ కలయై, నిజమై, పొరియైన పాండుసే
నాని హతాదమప్ష కరణమ్ము రణమ్మున కయ్యె సిద్ధుడున్.

ఆ మిను నల్లత్రాచు పడగై వికసించిన చంద్రమండలం
బేమి మనోజ్ఞతల్ సడలి యీదృశ తత్కిరణచ్ఛలాతి ధా
రామహితాంబకాళి శిబిరమ్మున పైబడవైచు నీ మిషన్
వ్యోమము గూడ నర్గినదియో పృథసూనుల వర్తనమ్మునన్.

అనల కణమ్ము లైనవి దృగంతము లంతట తోకమీద లే
చి నిలచి క్రోధ విస్తృతము చేసి ఫణమ్మును, త్రాచుపాము బ్రా
హ్మణవధ దోషమున్ గురువధాఘము రెండును మూర్తికట్టి నా
తని దెస బుస్స కొట్టినది, తచ్ఛిరమందున కాటువేయునో !

కనకన మండు నిప్పుకలు క్రక్కెడు కాయము పెంచి, శాత్రవే
యుని పెనవేసికొన్న తనలో, విసమెల్లను వాని దేహమం
దున నొలికించి క్రోధమున తో తను పంతట తోకతోడ మో
దివ దటమీదనైన కసితీరినదో మరి, త్రాచుపాముకుఞ్.

ఆ పితృహంత దేహ రుధిరాపగలో జలకమ్ములాడి, మై
తాపము తీరిపోయినది త్రాచున కాకసమందు నెల్లెడఞ్
పాపము, చూచి కన్నులు చెమర్చిన దేడ్చిన, దేవి వచ్చెనో
లోపల లోపలఞ్ తలపులో బహుధా, గత దారుణస్మృతుల్.

ఆమెయి కొంతసేపు నయనాంత వివిస్సృత. బాష్పధారయై
పాము, వినమ్రయై, సగము వంగి నమస్కృతి చేసె నింగికిఞ్

కుందుర్తి ఆంజనేయులు

మొక్కుబడి

(ఏకాంక నాటిక)

మొక్కపాటి నరసింహ శాస్త్రి

పాత్రలు

వెంకటేశ్వర్లు	....	మంగమ్మ తండ్రి
మంగమ్మ		
డాక్టరు		
సుకుమార్	....	మంగమ్మ అల్లుడు
రాజ్యలక్ష్మి	....	మంగమ్మ కూతురు
చంద్రశేఖరం	....	ఆయుర్వేదవైద్యుడు

౧

[హాలులో ముసలి అంధుడు వెంకటేశ్వర్లుగారు, ఆయన కూతురు వితంతువు మంగమ్మగారూ, ఉంటారు. పక్కగదిలోనుంచి మూలుగు వినబడుతూ ఉంటుంది.]

వెం—అమ్మాయి! అమ్మాయి!

మం—(కళ్ళు వొత్తుకుంటూ) ఏం! నాన్నా!

వెం—పిల్ల ఎలా ఉందమ్మా? ఊరికే అలా మూలుగుతున్నది అస్తమానమూను.

మం—ఎలా ఉందని చెప్పనూ! తెల్లవార్లూ, ఒకమాటూ కంటిమీద

కునుకు లేదు, ఒళ్లెరగదు! ఏదో బాధపడుతోంది బిడ్డ! మొద్దులా ఏమీ చెయ్యలేక అలా చూస్తూ ఊరుకున్నాను. ఏం దారి! ఎన్నాళ్ళకీ ఏమార్పు కనబడదాయె నా తల్లి నాకు దక్కేటట్టు లేదు. ఈ లోకంలో లేదు ఒళ్లు తెలియని బాధ తప్ప ఇంకేమీ ఎరుగదు.

వెం—అధైర్యపడకమ్మా అలాగ! నారేం భయంలేదు. ఇంతకీ వైద్యుడేమంటాడు?

మం—ఆయన నేమంటాడు. పషం, చూడ్డం, ఏవో మందులు పొయ్యడం, ఒళ్ళంతా తూట్లు పడేటట్టు ఇంజక్షన్లు ఇవ్వడం తప్ప, ఫలానా జబ్బని కాని, ఇది మంచి అని కాని, ఇది చెడు అని కాని, నోరువిప్పి మాట్లాడడు. ఇప్పుడు లోపల పరీక్ష చేస్తున్నాడు.

వెం—ఏదో మరి! ఆయన శాయశక్తులా తంటాలు పడుతున్నాడు. వైద్యుడంతకంటే ఏమి చెయ్యగలడు!

మం—ఎవ్వరూ ఏమి చెయ్యలేరు! ఏమి చేసినా ఆ యేడుకొండల వాడు చెయ్యాలి కాని—

వెం—ఆఖరుమాటంతే!

మం—అలా అని మొండితనంగా ఊరుకోలేమాయెను ఆడప్రాణం—బెంగతో మతిపోయి ఏమీ తోచదు. అలా కాదు ఇలా చెయ్యమని సలహా ఇచ్చేవారేనా లేరాయెను. పోనీ పిలను వాళ్ళింటికే [illegible]ంచాను గాను. స్వంతబిడ్డైనా ఇంత జాగ్రత్తగా చూసుకోరేమో అనుకుంటాను ముఖ్యాధ్యక్షుడు.

వెం—వెర్రిగాని ఆసుపత్రి వాళ్ళకు ఇంతకంటె ఎవ్వరూ ఏం చెయ్యగలరు? మా శక్తివంచన లేకుండా చేస్తున్నాం. ఆయుర్వేదంలోనూ, ఇంగ్లీషు వైద్యంలోనూ హేమాహేమీలనుకున్న వాళ్ళను డబ్బుకోసం చూసుకోకుండా తీసుకొచ్చి చూపిస్తుంటిమి. నువ్వన్నట్లు ఆ స్వామికటాక్షముండాలి. మనమేలోటూ మాత్రం చెయ్యడం లేదు.

మం—ఎన్ని కబుర్లు చెప్పినా ఎన్ని ఉత్త

రాలు వ్రాసినా, దాని మొగుడేనా, ఊడిరాడాయెను! నిన్న టెలిగ్రాము కూడా యిప్పించాను.

వెం—సరే అయితే ఇంక నేం—ఇంకాస్సేపటికి దిగుతాడు.

మం—అతను వస్తే బాగుంటుందనీ ఉంది; వస్తే ఎలాగని భయంగానూ ఉంది.

వెం—ఏమి?

మం—ఏమీ లేదు, అతను వట్టి వ్యతికరణంమనిషి. అతను కొంత చేస్తే, అంతే కాని ఫాలాక్షుడొచ్చి చెప్పినా వినిపించుకోడు.

వెం—ఈకాలం కుర్రవాళ్ళ పద్ధతే అంత. ఇంతకూ అతని పెంకితనం నిన్నేమి చేస్తుంది?

మం—మరేం లేదు కాని, ఒక సందేహం బాధిస్తోంది. ఎవ రేమన్నా సరే కాని ఈ ముక్కూ మూలంలేని జబ్బు వంటపుట్టింది కాదని నా నమ్మకం. ఆ వడ్డీకాసులవాడి ప్రభావ మిదంతా నని పిస్తున్నది. ఈ మాటంటే అతను వేళాకోళాలూ, వెక్కిరింతలూ ఆరంభిస్తాడు.

వెం—పోనీ, అలాగే అనుకో! నీ నమ్మకం నీది! దాని కతని వేళాకోళా లెందుకు?

మం—ఎందుకా! విను మరి! దాని పెళ్ళిముందు, మొక్కుకున్నాను, పెళ్ళి కాగానే వాళ్ళిద్దరినీ తీసుకొని కొండ ఎక్కి స్వామిదర్శనం చేయిస్తానని. నాటినుంచి నేటివరకూ, ఎన్నిసార్లు అతనిని బ్రతిమాలినా నన్ను వేళాకోళం చెయ్యడమే కాని, అతనుమట్టుకు రాలేదు. అందుచేత మేము వెళ్ళడం పడలేదు. కార్యం ముందు ఇలాగే, చచ్చినంతజబ్బు చేస్తే అప్పుడు మళ్లీ మొక్కుకున్నా నిలువుదోపు ఇస్తానని. నిమ్మళించడం, కార్యంజరగడం అయిందా? ఆ మొక్కు చెల్లిద్దామని ఎన్ని విధాల ప్రయత్నంచేసినా, అతను దానివంటిమీద వస్తువు చిన్నం బంగారమేనా కదపడానికి వల్లకాదంటాడు. మళ్లీ చేయిస్తానన్నాను. అయినా సరే ఇది కదపడానికి వల్లకాదంటాడు. కావలిస్తే నన్ను చేయించి ఇచ్చుకోమంటాడు. నా

కనేకసార్లు ఆస్వామి కలలో కనప డ్డాడు. ఈమధ్య మళ్లీ తరుచు కన పడుతున్నాడు. మొన్న కనబడి తలకూడా ఇమ్మన్నాడు.

వెం—ఆహాహా గట్టిపేచీ వచ్చిందే దాని కత నసలే వప్పుకోడు. స్వామి కూడా కాలాన్నిపట్టి కొంతమార్పు చేసుకొని ఇలాంటికోరికలు మాను కుంటే బాగుండును.

మం—నీవు కూడా అలామాట్లాడుతా వేమిటి నాన్నా!

వెం—వెర్రిదానా! తరుచుగా జాగ్ర దవస్థలో అవ్యక్తంగా ఉన్న మన ఊహాలూ సంకల్పాలే, మన స్వప్నంలో కనుపించేది. మళ్లీ మెళుకువ వచ్చిన తరువాత, ఈ స్వప్నాలు జ్ఞాపకంవచ్చి, మన సంక ల్పాలను బలపరచి, ఆచరణకు పురి కొల్పుతాయి. దేవుడుకి ఏమికావలె నమ్మా! ఆయన కేమి లోటు— నిజంగా ఆయనకు లోటే అయిన నాడు మనం తీర్చగలమా?

మం—నీ వేదాంతాని కేమిలెద్దూ—

(ఇంతలో లోపలినుంచి డాక్టరు ప్రవేశం.)

మం—(ఖంగారుగా నిలబడి) ఏం నాయనా! నా బిడ్డసంగతి ఏం చెప్పారు!

డా—(మాట్లాడడు.)

మం—ఏం నాయనా! నేను—ఏనుయోగ్యా- గోయోగ్యా చూచుకోవలసిందేనా? అయ్యో! ఇం కేముంది! (ఏని గది లోకి వెడుతుంది)

వెం—ఏమండీ డాక్టరుగారూ! పిల్ల ఎలా ఉంది? మీ అభిప్రాయ మేమిటి?

డా—(మాట్లాడడు)

వెం—మీరేమీ సందేహించక ఉన్న స్థితి ఏమిటో చెప్పాలి.

డా—సందేహా మేముంది? కాని ఏమి చెప్పాలో తెలియడం లేదు. నేను ప్రాక్టీసు ప్రారంభించినతరువాత ఇటు వంటి కేసు ఎప్పుడూ చూడ లేదు.

వెం—అయ్యో!

డా—ఎంత ప్రయత్నం చేసినా దీని ముఖ్య మూలం తెలియడం లేదు. ఇంతవరకూ ఇది ఫలానా వ్యాధి అని నిరూపించ లేకపోయినాను.

దీనికి వేరే పేరు పెట్టవలసి వచ్చేటట్టుంది. నాకు తెలియక అలా విడిచిపెట్టా ననుకుంటా రేమోనని, మాగ్గురు Specialists ను కూడా తీసుకొచ్చి పరీక్ష చేయించాను కదా. వాళ్లకుకూడా ఏమీ అంతు పట్టలేదు. ఇంక నేను చేయతగ్గది ఏమీ కనుపించదు. రత్నం లాంటిపిల్ల. అలా విడిచిపెట్టడానికే ప్రాణం ఒప్పడం లేదు.

వెం—పోనీ, మరోసాధకం ఏమైనా చేయించ మంటారా?

డా—అంటే?

వెం— ఏ· ఆయుర్వేద వైద్యమో చేయించి చూస్తేనో—

డా—మీ కేమి టావెర్రి! శాస్త్రీయమైన వైద్యం, పెద్ద పేరు పొందిన వైద్యులూ బుర్రలు బుర్రలు బద్దలు కొట్టుకుని ఏమీ చెయ్యలేక నోరు మూసు కూరుకుంటే, ఏదో గచ్చాకూ పుచ్చాకూ నలిపి ఇచ్చే వాళ్ల చేతిలో పెడతా నంటా రేమిటి సార్, కేసు—

వెం—గచ్చాకైనా పుచ్చాకైనా దానికీ ఒక శాస్త్రమూ పద్ధతీ ఉందికాదు. దానివల్లా రోగాలు కుదురుతోనూ ఉన్నాయి. అంతే కాకుండా మీ కసాధ్యం అనిపించిన వ్యాధులు అనేకం వాళ్లు కుదురుస్తూనూ ఉన్నారు కదా.

డా—That is all nonsense- నేను నమ్మను. అది వట్టి గుడ్డివాడిచేతిలో రాయిలాంటిది. ఏదో ఒకరోగం కాకతాళ న్యాయంగా కుదిరినా అంతమాత్రం చేత నదో పెద్ద శాస్త్రం ఎలా అవుతుంది.

వెం—ఏమోకాని, నాబుద్ధి కతీతమైనదీ, నాదృష్టి కగోచరమైనదీ, అసత్యమని కాని, అసలు లేదని కాని అనేటంత సాహసం నాకు లేదు సుమండీ. సరే, దానికేమి కాని, మరిప్పుడేమిటి చెయ్యతగ్గది. ఒక దణ్ణం పెట్టి ఊరుకోవలసిందేనా!

డా—మీకు కోపం వచ్చినా సరే కాని Quacks చేతులో పడి బ్రతికే కంటే, శాస్త్రం బాగా తెలిసిన

వైద్యుని చేతులో చావు మంచిదని నా నమ్మకం. క్షమించండి; ఇంత నిర్మొహమాటంగా అన్నందుకు. మీ అమ్మాయి ఏదేనా miracle వల్ల బ్రతకవలసిందే కాని మానవ మాత్రుడేమీ చెయ్యలేడు. శెలవు.

(ఈయన బయటకు వెడుతుంటే అమ్మాయి భర్త సుకుమారరావు లోపలికి వస్తాడు. గుమ్మంలో ఒకరి నొకరు చూసుకుంటారు. డాక్టరు వెళ్ళిపోతాడు ఇతను లోపలికి వస్తాడు.)

వెం—ఎవరు వారు?

సు—నేనండీ తాతగారూ సుకుమార్‌ని. ఎలా ఉందండీ మీ మనుమరాలు.

వెం—వచ్చావు నాయనా! ఇంకా రాలేదేమా అనుకుంటున్నాం. ఎలా ఉందని చెప్పను! ఇన్నాళ్లనుంచి పరీక్ష చేస్తూ మందిస్తున్న వైద్యుడు, ఈ వ్యాధేమిటో తన కంతు పట్టడం లేదని ఇప్పుడే చెప్పి వెళ్లాడు.

(ఇంతలో గదిలోనుంచి మంగమ్మ ప్రవేశం.)

మం—వచ్చావు నాయనా (అని కంట తడి పెట్టుకుంటుంది.)

(ఒక్కక్షణం నిశ్శబ్దం.)

సు—ఏదీ—ఎక్కడుంది.

(మంగమ్మ గదవైపు దారి తీస్తుంది. ముగ్గురూ నిశ్శబ్దంగా లోపలికి వెడతారు.)

౩

[గదిలో మంచంమీద అమ్మాయి ఒళ్ళు తెలియకుండా ఇటూ అటూ దొర్లుతూ మూలుగుతూ ఉంటుంది. సుకుమార్ ఒక్క అంగలో మంచం దగ్గరకు వెళ్ళి భార్యను కౌగలించుకొని ఏడుస్తాడు. మంగమ్మ కాళ్ళకాట దిక్కున నిలబడి విచారిస్తూ ఉంటుంది. ముసలాయన ఒక కుర్చీమీద కూర్చుంటాడు.]

వెం—నాయనా! సుకుమార్! ఊరుకో బాబూ. ఎమిటి అలా అధైర్యపడతావు?

సు—(నిశ్శబ్దం - ఎగుపులు మాత్రం వినపడుతుంటాయి.)

వెం—అమ్మాయి, ఏమి టది. అతనికి

కాస్త ధైర్యం చెప్పడం పోయి, ముందు నువ్వే ఇలా అయితే ఎలాగు? కంఠంలో ప్రాణమున్నంత సేపూ, మనం పరమేశ్వరుడు మీద భారం వేసి ధైర్యంగా ఉండవలసినదే—

మం—(కళ్లు తుడుచుకుంటూ) లే! నాయనా, లే! విచారించి ఏమి చెయ్యగలం, ఆ (శ్రీ) వెంకటేశ్వరుల వారే ఉన్నారు అన్నింటికీని.

వెం—రా! బాబూ; ఇలారా; కూచో ముందు సంగతేమిటి.

సు—ముందు సంగతేమిటంటే నీకు మట్టుకు ఏమి చెప్పగలను ఇప్పుడు. ఇంత ఎక్కువగా ఉన్న దనుకోలేదు. కాస్త ముందుగా తెలిస్తే, పానీ, ఏ చెన్నపట్టణమో తీసుకువెళ్లడమో, ఏదో చేసేవాణ్ణి. కొంప మీదికొచ్చేవరకూ నాకు సరిగా తెలియపరిచారు కారు.

వెం—అలాగనడం ధర్మం కాదు. ఇక్కడ వైద్యలోపం ఏమీ జరగలేదు. శాయశక్తులా తంటాలు పడుతున్నాం. వైద్యుడు చెప్పినమాటలను పుచ్చుకుని నీకూ మీవాళ్లకూ కూడా వ్రాస్తూ ఉన్నాం. 'దూరాన్ని ఉన్నావు. నీవు అధైర్య పడతావేమో'నని, మీ అత్తగారు అంటున్నా, ఉన్న స్థితి ఎప్పటికప్పుడు నీకు తెలియపర్చమని చెప్పాను. ఇంతకూ హఠాత్తుగా ఇలా ముంచుకొచ్చింది. ఏం చేస్తాం. ఇలాటివి మనతోటి చెప్పివస్తాయా——

సు—ఆ డాక్టరు వట్టి మతిలేనివాడు అయిఉండాలి. ఇన్నాళ్లు ఇలా మీరబ్బొళ్లి చేసి ఊరుకుంటాడా! తనకు అంతుపట్టకపోతే, మొదటనే చెప్పి అఘోరించవలసింది.

వెం—తొందరపడకు బాబూ.

సు—తొందరేమిటండీ. పిల్ల దగ్గరుండే తెగులే ఇది. చేతకాదని చెప్పడానికి వెధవ పౌరుషం! ప్రాణం అంటే దమ్మిడీఎత్తు లక్ష్యం లేదు.

వెం—లక్ష్యం లేకేమి నాయనా! ఉన్నది. ఉన్నది కనుకనే రాత్రనక పగలనక, ఎండనక వానక, మనం

రమ్మన్నప్పుడల్లా వచ్చి నిద్రాహారాలు మానుకుని అవస్థ పడుతుంటారు. వాళ్ళు మట్టుకు సుఖపడలేక నా! కాని మానవ విజ్ఞానం, ప్రజ్ఞ పరిమితములన్న మాట మనం మరచిపోకూడదు. వాళ్ళకు తెలిసినంత వరకూ ఏలోటూ చెయ్యరు. వాళ్ళ బుద్ధి కతీతమైనదానికేం చేస్తారు. అందుకనే, ఆయన న్యాయంగా ఇప్పుడే తన కిదంతా అయోమయంగా ఉన్నదనీ, తనవల్ల కాదనీ చెప్పాడు.

సు—ఈ స్థితికి వచ్చిన తరువాత చెప్పేం? చెప్పకేం?

వెంక—నాకు తోచినపని ఒకటి చేశాను. ఈ వూళ్ళో ఒక విచిత్రమైన వ్యక్తి ఉన్నాడు. అతను ఒక విధమైన ఆయుర్వేద వైద్యుడు. మా మూలు పద్ధతిలోవాడు కాడు. జన సామాన్యానికి అతనిమీగ విశ్వాసం తక్కువ. కాని నాకు మట్టుకు ఏదో కొంత గురి ఉండి అతనికి కబురు పంపించాను. వస్తాడనుకుంటాను. ఏమి చెపుతాడో చూద్దాం. అంతకంటె మనం చెయ్యదగ్గదేమీ కనుపించదు.

సు—కదపడానికేనా వీలులేదాయెను మనిషిని.

మం—ఎవరెన్ని చెప్పినా సరేకాని, ఇది వంటపుట్టిన జబ్బుకాదు. ఏ వైద్యుడికీ లొంగేదీ కాదు.

సు—(కొంచెం వెటకారంగా) అలాగా—పాపం ఆసంగతి తెలిసుండి, ఇంత కాలం ఎందుకు వైద్యం చేయించారు.

మం—ఊరుకోలేక. అ.. నా ఆడదాన్ని. దిక్కుమాలినదాన్ని. నామాట వినేవారెవరు? చేసేవారెవరు?

సు—ఁదేమిటి, మీ ఇంట్లో మీమాట వినని వారెవరుంటారు?

మం—అంత అదృష్టమా అని—ఎవరిదాకానో ఎందుకు నాయనా. నువ్వు విన్నావా ఏమిటి?

సు—ఓహో! నామీదనే పడ్డదా! ఏమి! నేనెప్పుడు వినలేదు మీమాట. మీ అమ్మాయిని ఎప్పుడు

పంపమంటే అప్పుడు పంపి, ఎన్నాళ్లుంచమంటే అన్నాళ్లూ ఉంచి, మీ ఇంటిచుట్టూ తిరుగుతున్నందుకా ఇది ?

మం—నీ స్వార్థంకోసం నువ్వు తిరగడం ఎవరికి ఉద్ధరింపు ? దానికేంకాని— పిల్లకి మొక్కుబడుందినాయనా. అది తీరిస్తేనేకాని దానికి సుఖంగా ఉండదని ఎన్నివిధాల మొత్తుకున్నా విన్నావా ? నామాట గడ్డిపరకకి దగ్గట్టి పారేశావు. ఇప్పుడు ముంచుకొచ్చింది.

సు—ఓహో! అదా సంగతి!

మం—ఇదను దేసంగతి. కుర్రదానికి రోగం లేదు, రొచ్చూ లేదు. ఆ ఏడుకొండలవాడు బాకీ వసూలు చేసుకోడానికొచ్చాడు. ఇది రోగం కాదు కనుకనే దాని మొహాన సుఖం ఎవ్వరికీ దొరకడం లేదు.

సు—మీకుతుట్టకు దొరికింది పాపం. అయితే దానికి తగ్గ చికిత్స ఏదో మీరే చెయ్యకపోయారూ, ఇంత డబ్బు ఖర్చుపెట్టి వైద్యం చేయించకపోతేను.

మం—నా చేతులో ఉన్న పనైతే అప్పుడే చేసేదాన్ని.

సు—మీ చేతిలో కాకపోతే ఇంకెవరి చేతులో ఉంది. రోగనిదానం తెలిసిన వారికి చికిత్స తెలియకపోతుందా

వెం—తెలియకేం—తెలుసును. అదే ఆవిడ చెపుతున్నది నువ్వు వచ్చేసరికి.

సు—అలాగా !

వెం—శ్రీ వెంకటేశ్వరస్వామి మా ఇలవేల్పు. అందుకనే నా పేరు వెంకటేశ్వర్లు అని పెట్టారు మా వాళ్లు. నీ వివాహం ముందు మిస్సుల శుభయుతంగా వివాహం కానే తిరుపతి తీసుకువెడతానని మొక్కుకున్నదట. అందుకు నివ్వు అంగీకరించవు కారణంచేతను ఆ మొక్కు చెల్లలేదు. ఆపైన నీ కార్యం ముందు పిల్లకు చాలా జబ్బుచేసిన సంగతి నీకు జ్ఞాపకముండే ఉంటుంది. అప్పుడు మళ్లీ మొక్కుకుంది, ఇదివరకు మొక్కు చెల్లించని అపరాధం కింద ఈ సారి పిల్ల వస్తువులు నిలువుదోపు ఇస్తానని.

దానికి నీవు అంగీకరించలేదట. ఈ రెండు మొక్కులూ చెల్లించని కారణంచేత స్వామి కిప్పుడు ఆగ్రహంవచ్చిం దనీ, ఆ కారణం చేత నింత జబ్బు చేసిం దనీ ఆమె నమ్మకం.

సు—I see -

వెం—అవిడ నమ్మకమే కాదు. స్వామి ఆమెకు స్వప్నంలో కనపడి చెప్పాడట. పైగా వేణిని ఇమ్మన్నాడట.

సు—ఇచ్చుకో మనండి. ఆవిడ ఏమి ఇస్తుకుంటే నట్టుకు నా అభ్యంతర మేమ ముంది ?

మం—బాగానే ఉంది. నీవేళాకోళాలూ నువ్వూను. ఈ వేళాకోళాలతోనూ వెక్కిరింపులతోనూ ఇంతవరకు తెచ్చావు. నే నిచ్చేదైతే నీ శెల వెందుకు. ఆయోగం ఈజన్మ కింక లేదు. ఏ అర్ధణా డబ్బులతోనో నా ఇబ్బంది తీరిపోతుంది.

సు—వేళాకోళ మేమిటి. మిమ్మల్ని అడిగా డంటే మీ దేమో నను కున్నాను. మీది కాకపోతే నాదా ఏమ్మిటి కొంపతీసి.

మం—నీది కాదు, నాది కాదు. పిల్లది. పాపం ఏమీ ఎరగదు.

సు—ఓహో! ఇదొకటి నిశ్చయించా రన్న మాట.

వెం—ఏమీ నిశ్చయించ లేదు. ఆవిడ విశ్వాస మది.

సు—ఇలాటి మూఢ విశ్వాసాలు పెట్టుకునే రోగం అలా ముదర పెట్టారు.

వెం—నువ్వలా అనడం న్యాయంకాదు. ముందు నూ పిల్ల, తరవాత నీ భార్యాను. అందుచేత దాని ఆరోగ్య విషయంలో నీ కున్నంత బాధ్యత మాకూ ఉంది. దానికి నలతె ప్రారంభించి నప్పటినుంచీ వైద్యం చేయిస్తూనే ఉన్నాం. ఈ మధ్యనే మీ అత్తగారికి ఈ అనుమానం కలిగింది.

మం—ఇలా . అని పోతాడనే అన్నిటికీ నోరు మూసు కూరుకున్నాను.

సు—నే నన్నానని కోపమే కాని ఈ కాలంలో ఇంకా తిరుపతి వెంకటేశ్వర్లూ మొక్కులూ ఏమి టండీ. Nonsense.

వెం—ఈకాల మేమిటి, ఆ కాల మేమిటి? దేవుడు అన్ని కాలాల వాడూను.

సు—నేను దేవుడు సంగతికాదు చెప్పేది ఆ Old humbug వెంకటేశ్వర్లు సంగతి.

(మంచం మీద రాజ్యం మూలుగు)

వెం—మనవాళ్లు కొందరు దేవుడుకే వెంకటేశ్వ ర్లని పేరు పెట్టారు.

సు—హా-హా-హ్హా - How ridiculous వెంకటేశ్వర్లు దేవుడే అయితే ఇంత absurd గా ప్రవర్తించడు.

(మళ్లీ రాజ్యం మూలుగుతుంది)

మం—మనం ఎంత తెలివైనవాళ్లమైనా దైవ నింద కూడదు. ఆ పరుష వాక్కులు చెవిని పడగానే బాధ ఎక్కువవుతోంది బిడ్డకు.

సు—Rubbish.

వెం—ఆయన ప్రవర్తనలో ఏమిటి లోటు కనిపెట్టావు.

సు—అంతా లోటే. ఈయనగారు, I mean this Tirupati fellow— తను దేవుణ్ణి అనీ, తన దర్శనం చేసుకొని ముడుపు చెల్లించుకుంటే రోగాలూ రొచ్చులూ నయం చెయ్యగల ననీ, కష్టాలూ నష్టాలూ రాకుండా చెయ్యగల ననీ, అలా తన దగ్గరకు రాకపోతే అనేక ఇబ్బందులు కల్పించగల ననీ 5th columnists చేత బోలెడంత propaganda చేయిస్తున్నాడు. Damnit. ఇంతకంటె better advertised person కాని goods కాని దేశంలో కనపడలే. మన fools అదంతా నిజం అనుకోడం, కాస్త తలనొప్పి వచ్చేసరికి తుర్రున తిరుపతి బయలుదేరడం, ఉన్న లొడ్డు లొసుకూ అక్కడ దర్పించి మరింత దరిద్రం అనుభవించడ మూను. How ridiculous!— ఇటువంటి stupid idiotic beliefs పోతేనే కాని దేశం బాగుపడదు.

మం—అవేం లేకుండా మీరు దేశాన్ని ఏమాత్రం ఉద్ధరిస్తున్నది చూస్తున్నాం కాదు.

వెం—దేవు డున్నాడనే నమ్మకం, ఆయన మీద విశ్వాసం ఉండడం మూర్ఖ తంటావా!

సు—నా ఉద్దేశం అది కాదు తాత
గారూ! దేవుడిమీద నమ్మకం ఉండ
కూడ దని కాదు. ఈ చచ్చు రాళ్లే
దేవుళ్లనవద్దని నా గోల.

వెం—నాయనా! యద్భావం తద్భవతి.
రాయి అయితేనేం రప్పయితేనేం,
ఏదైతేనేం. నమ్మకం ఉన్నవాడికి
అణువు మొదలు బ్రహ్మాండంవరకూ
సమస్తం ఈశ్వరమయమే!

సు—కావచ్చు అది వేరేసంగతి. ఆమహో
త్తరమైన భావం, సర్వసమత్వం,
మరచిపోయి కనపడ్డ ప్రతి నల్ల
రాయి, ఇటుకబొంతా దేవుళ్లని,
వాట్లకు బోలెడంత డబ్బు తగలేసి
దేవాలయాలు నిర్మించి, మొక్కుబ
ళ్లనీ, ఉత్సవాలనీ, ఊరేగింపులనీ
ఇంకా ఉన్నదిఊడ్చి, దేశం దిబ్బ
చెయ్యడం ధర్మమా! ఈ డబ్బంతా
ఉంటే ఎన్నెన్ని ఆస్పత్రులు కట్ట
వచ్చు. ఎన్నెన్ని యంత్రశాలలు
నిర్మించవచ్చు; ఎంతమంది బీదసాద
లను రక్షించవచ్చును. ఈ విగ్ర
హాలూ ఈ దేవాలయాలతో,
విశాలం, విశ్వాతీతం కావలసిన
మానవదృష్టి సంకుచితం చేసి,
సమస్త కార్యములూ వీటివల్లనేసిద్ధి
స్తవని నమ్మించి జనసామాన్యాన్ని
మూర్ఖులనూ క్రియాశూన్యులనూ
చేస్తున్నారు మన పెద్దలు.

వెం—నువ్వు చెప్పేనది నిజమే. కాదనను.
నీ సంఘసేవ కూడా ఈశ్వరా
రాధనే. ఇదో మోస్తరు విగ్రహా
రాధన. శరీరబాధ నివారించడానికి
ఆస్పత్రులు ఎంత అవసరమో భవ
బాధ నివారించడానికి దేవాల
యాలు అంత అవసరమూను.

సు—ఇలా అని ఊరికే మనం ఊహి
స్తున్నాం.

వెం—ప్రతివాళ్లూ గాలిలో ఎగరలేరు
కాదూ నేలమీద నడిచేవాళ్లకు
నేల ఆసరా లేకపోతేఎలాగా. ఏదో
ఒక ఆధారం కావలె ననుకున్నంత
మాత్రంచేత వాళ్లదృష్టి సంకుచిత
మవుతుందోకాదో నీకు చెప్పలేను.
కాని వాళ్ల జీవితం మట్టుకు కొంత
శూన్యంగా ఉంటుంది. మీయువకు
లందరికీ దేశాన్ని ఉద్ధరిద్దామనే
ఉత్సాహమేకాని, ఆకార్యం ఏరీతిగా

చెయ్యవలెనో, ఏమి అవసరమో తెలుసుకునే ఓపిక లేదు.

సు—మమ్మల్ని వృథాగా నిందించడమే కాని మా ఆశయాలేమిటో తెలుసుకునే ఉదార హృదయాలు మీకూ లేవు.

వెం—ప్రజల విగ్రహాలను బ్రద్దలుకొట్టి, వాళ్ల అర్చనలకూ ఆరాధనలకూ అవకాశం లేకుండా చెయ్యవలెననే ఉత్సాహంలోనూ ఉద్రేకంలోనూ. వాళ్ల విశ్వాసాన్ని, ఆస్తిక్య బుద్ధిని నాశనం చేస్తున్నారు. ఇప్పుడున్న ఇల్లు బాగాలేక బద్దలు కొట్టవలెనంటే, వేరే ఇల్లు చూపించి మరీ ఇది పాడుచెయ్యాలి కాని ముందిది నిర్మూలనం చేసి ఇంట్లో ఉన్న వాళ్లను నిరాధారంగా వీధుల్లోకి తోలితే ఏలాగ? ఇంతకూ మీకు చేతనయింది నిర్మూలనమే కాని, సృష్టి కాదు. మీరు నేర్పిన విద్య అంతటిదే. ఒక్క మాట నాకు తోచినది చెప్తాను విను. ఈ నిర్గుణారాధననీ, విశాలదృష్టి అనీ పెద్ద కబుర్లు చెప్పేవాళ్లు చాలా మంది, నీకు కోపం వచ్చినా సరే కాని ప్రచ్ఛన్న నాస్తికులని నా నమ్మకం. పొరపాటు- నాస్తికులు కూడా కాదు యదార్థంగా నాస్తికులైనా కొంత నయమే. ఏమీ కాకుండా దైవచింతే లేకుండా ఉన్నారు.

మం—మా బాగా ఉన్నావు. వాళ్ల పోకులేమిటో, వాళ్ల వేషాలేమిటో అంతేనేకాని, దేవుడూ అక్కర్లేదు దెయ్యమూ అక్కర్లేదు వాళ్లకి.

సు—పొరపాటు. చాలా పొరపాటు. ఒకవేళ మీరన్నదే నిజమనుకున్నా మీ మూఢభక్తికంటె తెలివైన నాస్తికతే మంచిది.

(మంచంమీద మూలుగు)

మం—ఇప్పుడీ దిక్కుమాలిన తర్కం ఏమిటి నాన్నా పిల్లసంగతి చూడక.

వెం—ఎంతటి తెలివితేట లయినా, విశ్వాసంతోటీ భక్తితోటీ సమానం కావు నాయనా! ఇప్పుడు నాకూ విగ్రహారాధనంటే ఇష్టం లేదు. మూఢభక్తి నాకూ ఇష్టం లేదు.

కాని ప్రజాసామాన్యానికి, ఏరామో రప్ప గుడ్డో కుంటూ, వాళ్ల దేవుళ్లు వాళ్ల కుండాద్దూ—చిన్న పిల్లలు చూశావు—ఎంత దరిద్రులైనా, పగిలిపోయినదో, విరిగిపోయినదో, ఆఖరుకు ఒక తాటాకు ముక్కో, పెంకుముక్కో, బొమ్మని అనుకుంటేనే కాని వాళ్లకు కాలక్షేపం కాదు. వయస్సులో ఎంత పెద్దవాళ్లయినా సృష్టి పరిణామంలో మనం అంతా చంటిపిల్లలమే కాదూ!

సు—అయితే వాళ్లకు ఎదుగు బొదుగు లుండవా? అక్కర్లేదా?

వెం—కానూ కావాలి. ఎదగనూ ఎదుగుతారు. కాని అంతవరకూ వాళ్ల బుద్ధి వికాసం పొంది, ఈశ్వరుని నిర్గుణ, నిరాకార, నిర్వికార, సర్వాంతర్యామిత్వం పూర్తిగా అవగాహన చేసుకుని, అనుభవంలోకి తెచ్చుకో కలిగేదాకా వాళ్ల విశ్వాసాలూ వాళ్ల నమ్మకాలూ వాళ్ల కుండనియ్యి. దానివల్ల వాళ్లకు కాని దేశానికి కాని వచ్చిన ముప్పేమీ లేదు. భక్తి విశ్వాసాలూ క్రియాశక్తికి పూర్వరూపాలు. పరిపూర్ణమైన భక్తి ఇచ్ఛాశక్తిని సవ్యమైన మార్గంలో నడిపించి, క్రియాశక్తిగా పరిణమింప చేస్తుంది. అందుచేత నీ భక్తివల్ల ప్రజలకు కలిగే కాస్త ఆనందంకూడా లేకుండా చేసి వాళ్లనంధకారంలో పడేస్తా ననడం ధర్మమా—

సు—అంధకారంలో ఏం పడెయ్యడం లేదు. రాళ్లే శాశ్వత మనుకుని చలనం లేకుండా ఎదుగుబొదుగులు లేకుండా కూర్చున్న వాళ్లకు కొంత పని కల్పించా నన్నమాట. వాళ్లు తెలివితేట లుపయోగించి, అసలు వస్తువును తెలుసుకోడానికి ప్రయత్నిస్తారు.

వెం—నే ననేది అంతవరకూను? వాళ్లను నిరాధారంగా విడిచిపెట్టడం చాలా ప్రమాదం.

సు—ఏమీ ప్రమాదం లేదు. మనం భ్రమపడ్డమే ప్రమాదం—

వెం—నాయనా! అనేక శతాబ్దాల నుంచి ప్రజలు కష్టంలోనూ, నిరాశ

లోనూ, నిస్పృహాలోనూ ఏమీ తోచక, ఏమీ చెయ్యలేక దైవ సన్నిధినే పరిపూర్ణ విశ్వాసంతో, భక్తితో, ఈ దేవాలయాలకువచ్చి అక్కడ స్వామిసన్నిధిని, వాళ్ళ ఆశలూ, ఆశయాలూ, ప్రార్థనలూ వెళ్ళపోసుకుని కొంత మనశ్శాంతితో వెళ్ళిపోయారు. ఆమనుష్యులు పోయినా ఆ దేవాలయాలు ఆ దేవుళ్ళూ మిగిలారు. ఆ ప్రార్థనలూ ఆ మంత్రాలూ వాయుతరంగాలలో లీనమై అక్కడ శాశ్వతంగా ఉండిపోయి, తరువాత తరాల వాళ్ళకు సహాయపడుతున్నాయి. వాళ్ళ ఈ ఆశాలత కాస్తా ఎందుకు తెంపుతా నంటావు నాయనా! వాళ్ళకు తగిన విద్యనేర్పి బుద్ధి వికాసం కలిగించవలెనేకాని కేవలం నిర్మూలనంవల్ల ఏపనీ జరగదు బాబూ.

మం—అయ్యో — ముంచుకోస్తోంది. పిల్లవాడు ఏమిటి నాన్నా.

సు—జరక్కేంచేస్తుంది మహాచక్కగా జరుగుతుంది. ఈ పాతవిశ్వాసాలూ నమ్మకాలూ పునాదులతో పెళ్ళగించి పారవేస్తేనే కాని పునర్నిర్మాణం పునస్సృష్టి చెయ్యడానికి వీలుండదు. ఈ scamp తిరుపతి fellow ఉన్నాడే ఈలాంటి Rogues అంతా పోవాలి.

మం—ఆ ఆ హారి హారి (అని చెవులు మూసుకుంటుంది.)

(బయట పెద్ద ఉరుములు చప్పుడు మంచంమీద నుంచి శారి కేక. అందరు మంచందగ్గరకు పరుగెడతారు.)

మం—అయ్యో నా తల్లో ఇ-ఇం కేముందోయి దేవుడా (అని రోదన)

సు—రాజ్యం-నారాజ్యం - My darling (అని ఏడుపు)

వెం—కొందర పడకండి, భయంలేదు, ఏమిటి హాఠాత్తుగా గదంతా ఇలా చల్లపడిపోయిందేం—

(ఆ మాటలో ఆయుర్వేద వైద్యుడొస్తాడు)

వెం—ఎవరు వారు.

వైద్యు—నేను చంద్రశేఖరాన్నండి. తమరు రమ్మన్నారంటే!

వెం—రండి బాబు - సమయానికి దేవు

డులా వచ్చారు. ముందు అమ్మా
యిని చూడండి.
చం—(అమ్మాయిని పరీక్ష చేస్తాడు)
అయ్యా మీరేమీ అనుకోకుండా
ఉంటే ఒక్క సంగతి మనవిచేస్తాను.
ఈ అమ్మాయికి శారీరకమైన రుగ్మత
ఏమీ కనుపించదు.
మం—ఆ. అలాగాండి—
సు—మరైతే ఏమంటారు.
చం—మీకు నమ్మక ముండదేమోనని
సందేహిస్తున్నాను.
మం—మాకు నమ్మకం లేకపోవడ మేమి
టండీ.
సు—అయినా చెప్పండి.
వెం—పరవాలేదు మీరేమీ సందే
హించనక్కరలేదు. చెప్పండి.
చం—ఈపిల్ల నేదో దేవతో దెయ్యమో
ఆవహించింది. అది వదలిపోతే పిల్ల
నిక్షేపంలా ఉంటుంది.
మం—అద్దుగో విన్నారా, నీ అమ్మకడుపు
చల్లగా, ఉన్నమాట చెప్పారు
తండ్రీ—
సు—Nonsence ఇది మీకు చెయ్యి
చూస్తే ఎలా తెలిసిందండి. ఇదేదో
(పైన పెద్ద ఉరుములూ మెరుపులూనూ)
చం—అయ్యా మీకు చిన్నతనం.
ఇప్పుడు తెలియదులెండి. వారు
పెద్దలు అడిగారు గనక వారియం
దుండే గౌరవముకొద్దీ నా అభి
ప్రాయం చెప్పానుకాని మరొకళ్ళు
రమ్మంటే రాను— మాట్లాడను.
వెం—మా అమ్మాయి అభిప్రాయంకూడా
అదేనండీ—శ్రీవెంకటేశ్వరస్వామి
ఆవహించాడని.
సు—Rot I don't believe it. ఇదంతా
ఆవిడ పన్నిన పన్నాగం—
చం—అయ్యా! తొందర పడకండి.
మనం మృత్యుసన్నిధిలో ఉన్నాం.
మన నమ్మకాలూ తెలివితేటలూ
ఏమీ పనిచెయ్యవు.
వెం—ఎవరు వారు
చం—క్రొత్తవారెవరూ రాలేదండి—
వెం—అయ్యో రాకపోవుట మేమి మరి
వారంతా ఎవరు. ఎవ్వరూ రాలేదు.
గదంతా జనంతో నిండిపోయిన
ట్లుంది. హఠాత్తుగా గదంతా ఇంత
చల్లపడి పోయింది. చన్ద్రశేఖరం
గారూ తరుణం సమీపించినట్లుంది.

చం—చిత్తం - వ్యవధిలేదు. నిమిషాల లోకి వచ్చింది. పిల్ల దక్కవలె నంటే, మీ మొక్కుబడు లేమైనా ఉంటే వెంటనే చెల్లించుకుంటా మని మళ్ళీ మొక్కుకోండి ఆ స్వామి అనుగ్రహముంటే ఈ బిడ్డ జీవించాలి కాని మానవమాత్రు డేమీ చెయ్యలేడు. శలవు. (అని వెళ్లిపోతాడు.)

(వెంకటేశ్వర్లుగారు తలవంచుకుని నమస్కరిస్తూ కూచుంటాడు. పైన పెద్ద ఉరుముల చప్పుడు, మంచంమీద పెద్ద కేక.)

వెం—అయ్యో పిల్లగ్రో !

మం—అయ్యో నాతల్లోయి. ఇంకేముం దోయి— నాబిడ్డ గొంతుక చేతులారా కోసుకున్నానోయి. నా తండ్రీ — వెంకటాచలపతీ. ఇంత వరకూ తెచ్చావు నాయనా—ఇంక నా గతేమిటి తండ్రీ—(అని ఏడుస్తూ గదిలోనుంచి పరుగెత్తుకొస్తుంది.)

సు-అయ్యయ్యో—రాజ్యం-నన్ను విడిచి పోతావా రాజ్యం—మాట్లాడవూ— Darling ఒక్కసారి చూడవూ, రాజ్యం—రాజ్యం—నాగతేమిటి. రాజ్యం—

(అని ఎక్కి ఎక్కి ఏడుస్తుండగా లోపల గణ గణ గంట వినబడుతుంది.)

అయ్యో పరమేశ్వరా దయా మయా, వెంకటేశ్వరస్వామీ నా అపరాధం మన్నించు తండ్రీ. నా రాజ్యాన్ని రక్షించు స్వామీ— నీ దివ్య దర్శనం చేసుకుని నీకు నిలువు దోపూ వేణి అర్పించుకుంటాం స్వామీ— అయ్యో రాజ్యం—

(అని ఏడుస్తుండగా లోపలనుంచి మంగమ్మగారు తడిబట్టలతో హారతి తీసుకొచ్చి రాజ్యం కళ్లకూ వొంటికీ అద్దుతుంది. క్షణంలో రాజ్యం పెద్ద నిట్టూర్పు విడుస్తుంది. తల్లీ మొగుడూ అమ్మాయి కేసి చూస్తారు. నెమ్మదిగా కళ్లు తెరుస్తుంది. ఇటూ అటూ చూచి దాహం అని సంజ్ఞచేస్తుంది)

మం—నా తల్లి బ్రతికింది. తండ్రి రక్షించావు నాయనా—

వెం—ఆ— అలాగా అందుకనే గది నుంచి నిర్జనమై, ఆ చల్లదనం పోయింది— వెంకటేశ్వరస్వామి అనుగ్రహం ఉంటే లోటేమిటి—

(నెమ్మదిగా కాసిని పాలు పోస్తారు. భర్త కేసి చూచి చెయ్యి చాపి వచ్చారా! అంటుంది.)

సు—రాజ్యం (అని ఆమె చెయ్యి పట్టుకుని వెక్కి వెక్కి ఏడుస్తూ చెయ్యి ముద్దు పెట్టుకుంటాడు. రాజ్యం నెమ్మదిగా అతని తల నిమురుతుంది. వెంకటేశ్వర్లుగారు వెంకటేశ్వరస్తుతి చేస్తారు.)

మహాకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి

మృదుపదాల కమ్మదనాల మేళవించి
యమృత కలశము నందిచ్చినట్టి సుకవి
బదరికాశ్రమవాసి భావనల పూల
తెలుగుతల్లి కొసంగిన దివ్యమూర్తి!

క్రొత్త దనముల నెన్నియో గుస్తరించి
మెత్తగా చల్లగా బాడుమేటి గాయ
కుండు, స్వేచ్ఛా ప్రియుండు బ్రహ్మాండమెల్ల
నావరించగ దపియించునట్టి సుకవి!

ఊర్వశీప్రేమలోమున్గియున్న స్ఫూర్తి
యుగ యుగంబుల కలలలో నున్న యార్తి
మధుర నవనీత పాకాన పదునుచేసి
దివ్య భోజ్యముగా జేసితివి గదయ్య!

మాటల ప్రభావమెల్ల నీ పాటలందు
నిత్యమైన రూపమ్ము పొందెను గదోయి!
నీదు భావనాబలము కన్నీటిధార
లందు ప్రవహించి దివ్యత్వమొందె దేవ!

వలచి వలపించి దుర్భర భర కృశాను
విప్రయోగాన మునిగి జీవితము నరసి
ఓయి రసమూర్తి! నీ హృదయోత్థ లసిత
రత్న రాసుల వెలుగు నిరంతరమ్ము!

ఏకపది

ఓ బికారీ
ఏదీ రహదారీ?
కునికే గ్రుడ్డి దీపస్తంభం
బ్రతుకు, అమవస
రాతిరీ లోకం!
ఓ బికారీ
ఏదీ సరణీ!
అరిచి, అరచి
గొంతెండి సొమ్మసిలిన
నిను కరచింది పాము.—ఆకలీ!
ఓ బికారీ
ఏదీ ఎగ్తనీ?
నీ కంఠము రుద్ధమై
నీరపమై మృతినొందే
క్షణమున నీ కన్నులు ప్రశ్నిస్తే
ఏదీ రహదారీ?
ఈ కజ్జల శార్వరి!
ఈ లోకం, సుఖం
నీకోసం కాదుగదా!
ఆకురాలినట్లు నేల
నంటి పడియున్న
ఓ బికారీ
వికారీ
ఏదీ
ఏక పదీ!

'ప్రేమరాగము' నుండి

వసంతగానము

వసంత గాయకా!
రస స్వరూపా!
నిరుపమానోజ్జ్వలా!
నీ గొంతు విప్పరా!

స్వాతంత్ర్య కాంక్ష
విశీర్ణ హృదయమ్ముతో
నీ దేశ దాస్యమ్ము
పోద్రోల పాడరా! వసంత....!

దేశాలు యుద్ధాన
దిగెను దురాశతో,
ప్రశాంత లోకాన
ప్రళయమ్మె జృంభించె! వసంత....!

కట్ట గుడ్డయు లేక
తినగ తిండియు లేక
చూడు నీ సోదరులు
మాడుతున్నారు! వసంత....!

మానవత్వము భువిని
మాడిపోయినది!
రాక్షసత్వము నేడు
ప్రబలిపోయినది! వసంత....!

అమృతమూర్తి మా గాం
ధీ మహాత్ముండు!
పారతంత్ర్యము వాప
ధర నవతరించాడు! వసంతగాయకా!

పెనుమర్తి కామేశ్వరరావు

భారతీయనాగరికత : అహింసాతత్త్వము

కృత్తివాసతీర్థులు

జగత్తులో నాగరికతలు జనించినై గతించినై. ధర్మదీప్తిలేని అంధప్రాయమైన నాగరికత కలకాలం ఉండదు. భారతీయ నాగరికత యావత్ప్రపంచానికీ లక్ష్యప్రాయం. సజీవం. మన నాగరికతకు ధర్మమే మూలం. అది అవినాశి.

కణాదమహర్షులు 'వైశేషిక సూత్రా'లలో ధర్మశబ్దాన్ని నిర్వచించారు. 'యతో భ్యుదయనిశ్శ్రేయససిద్ధిస్సధర్మః' కేవల భౌతిక సంపదతో నాగరికత సజీవంగా మనలేదు. మానవాభ్యుదయం, నిశ్శ్రేయస్సులతో నిమిత్తంలేని నాగరికత శవప్రాయం. పాశ్చాత్య నాగరికత బాహ్యశక్తి పటాటోప ప్రధానం. అంతశ్శక్తి శూన్యం. యంత్రశక్తి విజృంభించి మానవత్వాన్ని మారణహోమం చేస్తున్నది. ధర్మాన్ని రూపుమాపివేసింది. శాంతి మరుమరీచికా ప్రాయమైంది. రాజ్యతంత్రజ్ఞుల మేధాశక్తి సామ్రాజ్య సంపాదనకూ, మానవ నాశనానికీ ఉపకరిస్తున్నది.

ఎప్పటికయినా భరతఖండమే పురోగామియై, యావత్ప్రపంచానికి శాంతి సందేశం ఇస్తుంది. ప్రాగ్దిశలోనే శాంతిదేవీ చరణ లాక్షారుణాంకములు ప్రచురమవుతవి.

భరతఖండవాసుల జీవనాడుల్లో అఖండమైన సత్యం స్పందనం చేస్తున్నది. రక్తసిక్తమయిన భోగం క్షణికం. హింసామూలమైన కర్మకు శాశ్వత విజయం లేదు.

అహింస దౌర్బల్య లక్షణమని అజ్ఞుల అభిప్రాయం. సాత్త్విక గుణాలలో సత్త్వం ప్రధానం. సాత్త్వికశక్తి విజృంభణంలో అద్భుతమైన ధైర్యసాహసాలూ, తత్ఫలంగా అహింసా ప్రకృతీ అవలీలగా అంకురించక తప్పదు. అసహాయోద్యమంలో అకాలీ సిక్కులు, ఖుదయ్ ఖిదమత్ లు, సత్యాగ్రహులు చూపిన నైతికవీరం ప్రశంసాపాత్రం. క్రియలోనే కాక, మనోవాక్కులలో మాలి

న్యం క్షాళితమయితే హింసాప్రవృత్తి అంతరిస్తుంది.

అహింస మానవప్రేమకు రూపాంతరం. వ్యక్తులమధ్య హింసాప్రవృత్తి ఎలా ఏర్పడుతుందో, సంఘంలో కూడా అలాగే ఏర్పడుతుంది. ద్వేషం హింసాత్మకం. జీవనపరిణామ చరిత్రలో 'మధ్య జీవయుగం'లో ప్రాణికోటికి విపరీతమయిన హింసాప్రకృతి ఉండేదని హెచ్. జి. వెల్సుగారు వ్రాశారు. పిల్లల్ని ఆప్రాణులు కని పారేశేవి. ప్రళయానంతరం 'నవజీవయుగం' వచ్చాక 'మామలు' లనే స్తనజాతి పరిణమించింది. అది పిల్లల్ని పోషించేది. ప్రేమించేది. జీవనపరిణామ చరిత్ర పరిశీలిస్తే ఒక సత్యం గోచరమవుతుంది. కేవలం పశుబలం, హింసాప్రవృత్తిగల జంతుకోటి తత్కాలం సర్వాధికారంతో ఉన్నా, ప్రకృతి పరిణామానికి అనుగుణంగా మారలేని ఆ క్రూరజంతువులు 'దినోసార్లు' 'టైరోడాక్టిలులు' క్రమంగా నశించిపోయినై. పూర్వ వాసనాఫలంగా సంక్రమించినపశుత అనేకవేల సంవత్సరాలు మానవుల్లో ప్రబలింది. ఇప్పటికీ కూడా మానవుడిలో పశుత్వం ఉన్నది.

భారతదేశ చరిత్రలో హింసారూపమయిన ప్రథమ రక్తపాతం ఇంద్రుడికీ వృత్రుడికీ జరిగిన సురాసుర యుద్ధం. అయితే భారతీయార్యజాతికి విశాల హృదయం, సమన్వయదృష్టి అధికం. అనాది జాతులను హతమార్చే పాశ్చాత్యులవలె కాక ఆర్యులు ఆర్యేతర సంస్కృతికి కూడా అవకాశం ఇచ్చారు. హింసాప్రవృత్తి వదలివేశారు.

భారతీయ సంస్కృతికి వేదాలు మూలం. అవి నాలుగు. త్రయీ విద్యా అని అథర్వణాన్ని నిగమాల్లో చేర్చుకోలేదు. అహింసాతత్వ విరుద్ధాలయిన క్షేమకాలు అందులో ఉండడంవల్ల బ్రాహ్మణులు తోసి రాజన్నారు. పురాణకాలంలో అథర్వణవేదానికి వేద ప్రతిపత్తి కలిగింది.

ఆర్యులు దేవారాధననిమిత్తం యజ్ఞాలు ఆచరించేవారు. హింసాత్మకబుద్ధి వారికి లేదు. రాజసూయాదులు మాత్రం పూర్తిగా హింసాత్మకాలే. వేదవాఙ్మ

యంలో రాజసూయాదులకు త్యాగాలు తక్కువ.

ఉపనిషత్కాలంలో హింసాత్మకబుద్ధి లేశమైనా లేదు. రమణీయ ప్రకృతి సాన్నిధ్యంలో, అరణ్యాలలో ఆర్య ఋషులు ద్రష్టలై, జీవేశ్వరైక్యానుసంధానం, బ్రహ్మానుభవం పొంది, అహింసాతత్త్వానికి దారితీసే 'ఆరణ్యకాలు' రచించారు. సృష్టిమర్మం సరిగా అవగాహన చేసుకొన్నవాళ్లకు హింసాప్రవృత్తి ఉండదు. సర్వభూతాలు ఆత్మగతాలే. అందుకే ఈశావాస్యోపనిషత్ ఇలా అంటుంది. "యస్తు సర్వాణి భూతాని ఆత్మన్యేవానుపశ్యతి। సర్వభూతేషు చాత్మానం తతో న విజుగుప్సతే।" ఉపనిషత్తులలోని ఉజ్జ్వల భావములు అగాధములు. అహింసాసాధకములు. విశ్వప్రేమజనకములు. ప్రపంచ సాహితీ కిరీటకోటీరమణులు.

వైదిక ఋషులలో వసిష్ఠుడు, బృహదారణ్యకంలోని యాజ్ఞవల్క్యుడు మొదలయిన ఆర్యఋషులు అహింసావాదులు. అహింసాతత్త్వం అనుభూతికి తెచ్చుకోడానికి ఆశ్రమజీవితం ఉపకరిస్తుంది. ఆశ్రమ పూత వాతావరణంలో, నిర్మల ప్రకృతి సాన్నిధ్యంలో, క్రూరజంతుకోటి క్రౌర్యాన్ని విస్మరించి సాధువులుగా పరివర్తనం పొందేవట!

మహాభారత కాలంనాటికి హింస తలెత్తింది. చారిత్రక దృష్టితో భారతాన్ని చూస్తే అది హింసామూలమైన యుద్ధగాథ. మానసికంగా హింసాభావం సోదరబృందంలో ఏర్పడినప్పుడు, అంతంలో అది హింసగా పరిణమించి ఉభయ నాశకారణం అవుతుంది. భారతంవల్ల ఈవిషయం స్పష్టం.

జైన బౌద్ధమత ప్రాబల్యం వల్ల అహింసాతత్త్వం మతావలంబుల దైనందిన జీవితంలోకి వచ్చింది. వారి రక్తనాళాల్లో అహింస స్పందించేది. అసలు వారి జీవిత ధర్మమే అహింస. అదే జైన బౌద్ధ మతాలకు పునాది. బుద్ధదేవుడు శూన్యవాదంతో ఆస్తిక్యాన్ని విమర్శించక మానవుడి నైతిక జీవనమే ప్రధానంగా పెట్టుకొన్నాడు. అఖండ మయిన ఆయన విశ్వమైత్రి ఖండఖండాంతరాలను అక్కున చేర్చుకొన్నది. అశోకచక్రవర్తి కళింగ యుద్ధానంతరం బౌద్ధ

మతావలంబియై విశ్వమైత్రిని ప్రచారం చేశాడు.

బౌద్ధ ధర్మసారం త్రిపిటకాలలో ఉన్నది. వినయ పిటకంలో బౌద్ధ భిక్షువులు అహింసాపరులై యోగ్యమయిన జీవయాత్ర చేస్తూ, సంఘధర్మాలు ఎలా ఆచరణలో ఉంచవలెనో విశదీకరింపబడింది. సుత్తపిటకం భిక్షువుల నైతిక జీవన విధానం వివరిస్తుంది. అభిధమ్మ పిటకంలో బౌద్ధ దార్శనిక సిద్ధాంతాలు ఉంటవి. ఈ దార్శనిక సిద్ధాంతాల మీద బుద్ధఘోషాచార్యులు, అనేక భాష్యాలు సంస్కృతంలో రచించారు. జైనమతంలో అహింసాతత్త్వం దైనందిన జీవితంలో ఎలా అలవరచుకోవాలో చక్కగా వివరింపబడింది. వారి ప్రమాణ గ్రంథాలు 'సమయసారం' 'తత్త్వార్థ సూత్రాలు' 'పురుషార్థ సిద్ధ్యుపాయం' 'శ్రావకాచారం' 'సార సముచ్చయం' 'సాగారిక ధర్మం'. మన భగవద్గీతవలె బౌద్ధులకు 'దమ్మపదం' ప్రమాణం. దుఃఖాన్ని పోగొట్టుకోడానికి అహింసాదులను అష్ట మార్గాలలో సాధించాలని దమ్మపదం చెబుతుంది. ౧. సమ్యక్ దృష్టి ౨. సంకల్ప ౩. వాశి ౪. కర్మాంత ౫. ఆజీవిక ౬. వ్యాయామ ౭. స్మృతి ౮. సమాధి అని అష్టమార్గాలు. 'దీఘనికాయ' 'అంగుత్తరనికాయ' 'ధమ్మకసుత్త' 'మంగళసుత్త' 'జాతక కథలు' మొదలయిన బౌద్ధగ్రంథాలు అహింసా తత్త్వానికి సంబంధించినవి.

భగవద్గీతలో జ్ఞానకర్మ భక్తియోగాలు మూడున్నూ అహింసమీద ఆధారపడినట్లు, అహింసకు ప్రాముఖ్యం ఇచ్చినట్లు తెలుస్తుంది.

మహాభారతంలో ధర్మవ్యాధోపాఖ్యానం, తులాధారోపాఖ్యానం అహింసా తత్త్వాన్ని నిరూపిస్తవి. ఆరణ్య పర్వంలోని ఘోషయాత్రా చరిత్రవల్ల మానసిక హింసానుభవం ద్యోతకమవుతుంది. శిబికథ, జీమూత వాహనునికథ భూతదయ, ఆత్మబలిదానానికి తార్కాణాలు.

శ్రీకృష్ణుడు అర్జునునికి నీతి బోధించే సందర్భాన (భా అశ్వ—౪౩ అను) 'అహింసా పరమోధర్మః, హింసాచాధర్మలక్షణం' అని నుడివినాడు. స్మృతి కాలంలో మను స్మృతి 'అహింసాసత్య

మస్తేయం శౌచ మింద్రియ నిగ్రహః।
ఏతం సామాజికం ధర్మం చాతుర్వర్ణ్యే బ్రవీన్మనుః' అంటున్నది. గౌతమధర్మ సూత్రాలలో విద్య ముగిసిన తరువాత అహింసా సత్యములు ఆవశ్యకములన్నారు. యోగశాస్త్రజ్ఞులు అహింసకు 'రక్తపాతం మానడం కాకుండా ప్రాణికోటికి ఎలువంటి ద్రోహం చేయకుండా ఉండడ' మని వ్యాఖ్య చేశారు. (అహింసా ప్రతిష్ఠాయాం తత్సన్నిధౌ వైరత్యాగః) పురాణాలలో ముఖ్యంగా విష్ణు పురాణగాధలు అహింసాతత్వ ప్రతిపాదకములు. ప్రహ్లాదచరిత్ర సర్వజన విదితం.

లౌకిక సాహిత్యంలో 'మృచ్ఛకటిక' 'నాగానంద' నాటకాలు అహింసాతత్వ ద్యోతకములు.

ముసల్మానులు మనదేశం వచ్చాక, ఇస్లామ్ సంస్కృతికీ మన సంస్కృతికీ సంఘర్షణ వచ్చింది. హింసాతత్వం ప్రబలింది. భక్తులు ఎంత మందో అవతరించారు. భక్త్యావేశానికి కారణం ఇస్లామ్ సంస్కృతిలోని 'సూఫీ'తత్వం అని డాక్టర్ ఈశ్వర్ టోపా పండితుల అభిప్రాయం. అది సరిగాదు. వంగ వైష్ణవంలోనే సహజంగా భక్త్యావేశం అపారం. చైతన్య దేవుని మధురభక్తి, రూపగోస్వామి ఉజ్జ్వల మధుర రస తరంగాలలో ఎంతమందో పరవశులై వివశులై పోయారు. రామానంద, రవిదాస నరసింహ మెహతా, కబీర్, మీరాబాయి, సూర్, తులసీదాస, వల్లభాచార్యులు, నానక్, సమర్థ రామదాసు, రామదాసు, నారాయణతీర్థ, త్యాగయ్య, జయదేవ, చైతన్య, విద్యాపతులు గేయరూపంగా సాధ్యభక్తిగ్రుతచిత్తాలను కట్టించారు.

బ్రిటిష్ కంపెనీవారి పాలనం రావడం, దేశం రాజులు కోల్పోవడం, రాజకీయంగా సాంఘికంగా మార్పులు రావడం తరువాతి ఘట్టం. వర్గకలహాలతో హింసాతత్వం తల ఎత్తింది. ప్రాచీన భారతీయ సంస్కృతిని పునరుద్ధరింపవలసివచ్చింది. ప్రజానీకం ఉజ్జ్వలమైన ధర్మం వదిలివేయడంవల్ల, ఆంతరంగిక దృష్టి మరుగుపడిపోవడంవల్ల రామమోహనుడు బ్రహ్మసమాజం నెలకొల్పి చాలా పనిచేశాడు. దయానందులు

ఆర్య సమాజం స్థాపించి, వైదికవిజ్ఞానం ఆసేతు హిమాచల పర్యంతం వెదజల్లి నారు. రామకృష్ణ వివేకానందుల బోధ సుధలతో ప్రజాహృదయం తనిసిపునీత మయిపోయింది.

నవీనభారతంలో గాంధీపర్వం అహింసా తత్త్వానికి భాష్యం. మహాత్మాజీ పురుషోత్తముడు Practical idealist. జాతీయ జీవనాంధకారంలో మహాత్ముని సూర్యోదయం అయింది. సత్యశోధన, అహింసా పాలన, మానవకల్యాణం, దేశస్వాతంత్ర్యం కోసం జీవితం త్యాగం చేస్తున్నాడు. నిర్మాణ కార్యక్రమం సక్రమంగా ఫలించాలంటే అహింస పునాది వంటిదని ఆయన ఘోషించాడు. అహింస దౌర్బల్యలక్షణం ఎంత మాత్రం కాదు. సాత్త్వికశక్తి విజృంభించితే అహింసాతత్త్వం ధైర్యసాహసాలు వస్తాయి.

'భారతీయ నాగరికత, అహింసా తత్త్వము'ను గూర్చి కాకినాడ నివాసి శ్రీమాన్ కొమాండూరి శఠకోపాచార్యులవారు మంచి గ్రంథం వ్రాశారు. వీరు ఇది వరలో జాతీయ గ్రంథాలూ, జగత్కథ మొదలయిన వైజ్ఞానిక గ్రంథాలూ రచనచేసిన ప్రసిద్ధులు. వీరి 'భారతీయ నాగరికత' తప్పకుండా చదవవలసిన ఉత్తమ గ్రంథము.

ఎలిజీ (ప్రోజలో)

"ప్రసాద్"

అంకితం — 'శరత్'కి

నే నున్న ప్రదేశం ఒక మొదలూ చివరా లేని మైదానం. ఎప్పుడూ నిశ్శబ్దంతో నిండి ఉంటుంది. ఎక్కడో కొన్ని దీపాలూ ఏవో ఇళ్లూ కనిపిస్తాయి. రాత్రి ఆరుబైట నిల్చొని చూస్తూ వుంటే 'నువ్వు మమ్మల్ని ఎప్పటికీ చేరుకో లేవులే' అని వెక్కిరిస్తున్నా రేమో ననిపిస్తుంది అంత విశాలపు బయలులో కూడా ఎందుకో ఊపిరి సలపదు. ఎవరో గొంతుక బలంగా నొక్కేస్తున్నట్టవుతుంది. ఎంత ప్రయత్నిస్తే మట్టుకు ఆ యినుప చేతులనుండి తప్పించుకో గలనా!

అంత ప్రశాంతంలో, అంత ఏకాంతంలోనూ శూన్యం తోస్తుంది. శ్మశానం లాంటి ప్రదేశం. ఆ వాతావరణంలో అణగి అణగి మనస్సుకూడా ఆకాశం మల్లే శూన్యంగా తయారైంది. రాత్రీ పగలూ కళ్లు భరించలేనంత చీకటి, వెలుతురూను. కాలి కాలి వున్న అద్దం మీద ఒక్కసారిగా మంచు కురిస్తే ఏ మౌతుంది?

ఆ యింట్లో ఏదో మూల ఆపద ఒకటి నాకోసం కాచు క్కూర్చున్నట్టు తోచి భయంతో నీరయి పోతుంటాను. ఏ వేళ అది వచ్చి నన్ను మ్రింగుతుందో అని వణుకుతూంటే ఆ యిల్లు నా దనిపిస్తుందా! నన్ను నేను మోసగించుకుంటానా!

జీవితంలో ఇంత పెద్ద అగాధం ఎప్పు డేర్పడిందో ఎందుకు, ఎలా ఏర్పడిందో నాకే తెలీదు. ఎక్కడో, ఏ మూలనో ప్రారంభించి రాను రాను జీవిత మంతా అలముకుంది. హృదయంలో గుంటలు పడకుండా వుండాలి గాని పడిన తర్వాత దాన్ని సరిచేయడం ఎవరి తరం! దాన్ని సంస్కరిద్దా మనుకోవడం ఉత్త వెర్రి కాదూ?

ఎడారి పెనుగాలిలో అల్లాడే గాలిపటం ఎటువంటి స్థితిలో వుంటుందో సరిగ్గా నా స్థితీ అటువంటిదే. ఆ స్థితిలో అది ఎక్కడో వున్న మహారాజు ప్రాసాదం మీద వ్రాలుతుం దనుకోవడం కన్నా ప్రక్కనున్న ముళ్ళ పొదలకి తగులుకొని వ్రేలాడడమె సత్యం. కాని ఆ సత్యాన్ని గాలి మేడలకే అలవాటుపడ్డ ఆ ప్రాణి ఒప్పుకోదు.

ఇంకా ఆ రాజభవనంపైని వ్రాలే అవకాశం, అదృష్టం వుందిలే అంటుంది ఆత్మ. అలాగే మొండి ఆశతో కొట్టుకుంటూ ఆ మృగతృష్ణ వైపే దృష్టి నిలిపి అప్రయత్నంగా ఏ ముండ్ల పొదలకో తగులుకొని జీర్ణిస్తుంది.

అప్పటికైనా ఆ ఆశ అంతరించదు. ఇంకా ఏ గాలి విసురుకన్నా పైకి లేచి ఆ రాజభవనాన్ని చేరుకోవచ్చు నని— ఆ శుభావసరం కోసం

కాలుస్తున్నా ఆశలతో ఆ మంటల్లోనే నిలిచి భయంకరంగా నిరీక్షిస్తా — ఎన్ని గాలివానల న్నా తట్టుకుంటూ నిలుస్తుంది. ఎంత దేసమాలిన తనం!

ఆశ కన్నా తీవ్రమూ, నిరీక్షణ కన్నా బాధాకరమూ మరొకటి లేదు కదా!......

ఆ కళ్లు కురిసి కురిసి వెలిసిపోయిన ఆకాశం లాంటివి. సామాన్యపు రోడ్డుపట్లు జీవితాలకి అర్థంకాని వసాబాధ ఆ చూపుల్లో గోచరిస్తుంది. అనుభవిస్తున్న ప్రగాఢ మనోవేదనలకి అవి నెలవులు. యుగాల తరబడి మరుగుతూన్న అశ్రు ప్రవాహం ఆ సన్నని పొరల్ని ఛేదించుకొని ఎప్పుడు పైకి ప్రవహిస్తుందో అని బెదురుతూ వుంటాను. ఆ రహోవ్యసనం, ఆ మూగబాధ ప్రతీ పదునైన మనిషీ పడతాడనుకుంటాను. ఎన్ని జన్మాలు పండించుకొన్న పుణ్యమో ఆ తీయని స్నేహం. ఆ పాదాలలో ఎవరి జీవితమన్నా కాని, ఆ పదవి కోసం పోరాడ్డంలో విచ్ఛిన్నమై పోవడం కాని జరిగితే ఆశ్చర్యమేముంది?

రంగు రంగుల మబ్బుల్లో, నిగనిగలాడే నీలాకాశంలో విచ్చల విడిగా విహరిద్దామని, మిలమిల మెరసే చుక్కలలో మనమూ ఒక చుక్కగా, చుక్కగా మారిపోదామని అనుకోవడంలో అర్థం లేదు కాని ఆనందం లేదూ?

ప్రియసాన్నిధ్యంలో సుఖిస్తున్నామని వూహించుకోవడం నిత్యంలేని, స్వరూపంలేని స్వప్నం, శూన్యం. ప్రేమించేం, ప్రేమిస్తున్నాం, ప్రేమిస్తాం అని అనుకోవడం వుత్త 'వేనిటీ' (vanity) అంటారు కొందరు. కాని అది కల కాదని నన్ను నేను ఎంత నమ్మించుకున్నా లాభం లేదు. రోజూ వచ్చే కలలలో అదీ ఒక కలే కదా! అయితే మరెందుకు దానికంత ప్రాముఖ్యం? జీవితానికీ దానికీ ఎందుకంత అవినాభావ బాంధవ్యం? చివరకి ఈ కలకూడా ఒకనాడు హఠాత్తుగా కరగి ఆఖరికి నా వంతికగా నాకు మిగులుతుంది. అదంతా ఒక కల అని నేను రియలైజ్ చెయ్యడానికి బహుశా అదే కారణం కావచ్చు.

త్రోవ తెన్ను లేని ఘోర తిమిరములో బడి, వేయి సంవత్సరాల నుండి ప్రయాణిస్తూన్నంత బడలిక — గమ్యస్థానం చేరుకోడానికి యింకా కొన్ని యుగాలు పడుతుం దనుకుంటాను. దారుణంగా వుందని, అందరూ ఆ త్రోవ తప్పించుకు త్వరలో బయటపడతారు. నేను మట్టుకు ఒంటరిగా, దీనంగా శూన్యాన్ని చీల్చుకొని వినిపిస్తూ వున్న సన్నని ఆ విషాదకంఠాన్ని అనుసరించి చుక్కల వెలుగన్నా లేని శూన్యపథంలో బడి వెళ్ళిపోతున్నాను.

ఆశకి గాని, ఆనందానికి గాని చోటులేని ఈ ప్రదేశంనుండి కొనవూపిరి విడిచేటప్పుడైనా తప్పించుకోగలనా అని జిజ్ఞాసపడుతూ — మెరిసే సంధ్యల్లో వికసించే ప్రభాత కిరణాల్లో, అత్రపూరితమైన చీకటిలో — ఒకే రీతిగా ఒక గది నుండి యింకో గదికి నిర్జీవంగా తిరుగుతూ, ఆవేదన కలిగించే ఈ అస్పష్ట జీవితసమస్యను అన్వయించుకోలేక ఎంత అవస్థపడుతూ వుంటాను!

శాంతిని సౌఖ్యాన్ని యిచ్చే ప్రగతివిషయాన్ని తన పొట్టలో పెట్టుకుంటూ జీవితాన్ని మారణ హోమం చేసే మహాదురదృష్టం ఒకటి మీద పడుతున్నట్టు తోస్తుంటుంది— వేపుకు తింటుంది.

నక్షత్రాలకన్నా ఎక్కువగా వున్న వూహలకు మధ్య మనస్సు వూగులాడుతుంటుంది. పిచ్చి పిచ్చి ఆశలతో గాలి మేడలు కట్టుకుంటూ, మిథ్యానందంలో కళ్ళు మూసుకొని ఒక క్షణం నన్ను నేను మరచిపోతాను. మరుక్షణం కొట్టినట్టు నిజస్థితి జ్ఞాపకం వచ్చి వూహాసౌధాలు గాలిలోనే కరగి ఆశలన్నీ కన్నీరుగా మారి పోతాయి.

సాయంత్రం బంగారు కాంతినంతా జీర్ణించుకొని పడమట ఆ ఒక్క చుక్కా పొడుస్తే హృదయానికి ఏదో అశాంతి తోస్తుంది. వేయి చీకట్లలో కూడ దాని బ్రతుకు క్షీణించలేదు. ఎవరికీ అందని, ఎందుకూ పొందని బ్రతుకైనా, దాని కదే. (self-contained), సంతృప్తిగా వున్నట్టుంది. ఎన్నడో అనుభవించిన అనుభవాలన్నింటినీ రేపుతూ మనస్సుని బాధ పెడుతూ వుంటుంది. మారని దాని బ్రతుకూ, చెదరని దాని రూపూ, బెదరని దాని చూపూ, చూసి చూసి ఎంత కని కలతపడను! తల త్రిప్పుకొన్నా కళ్ళల్లో అదే ఆడుతుంది. నన్ను చూడమని nudge చేస్తుంది.

చీకటికీ జీవం ఉంది; సౌందర్యం వుంది. . ఆ Pulsation, ఏకాంతంగా వుండేటప్పుడు మనం ఫీలవుతాం. విశాలాకాశం క్రింద మైదానంలో నిలుచొని చూస్తే ఎంత అందమైన సృష్టి! ఎన్నో చిన్నిచిన్ని చుక్కలు సన్నని వెలుగు నిస్తూంటాయి. అరనిముసమన్నా బ్రతుకు నిలకడలేక మినుకు మినుకు మని ఆరిపోతవి. వాటితో మానవ జీవితాన్ని పోల్చి చూసుకుంటే ఏదో అసంతృప్తి తోస్తుంటుంది. అల్పమాత్రం ఆ చిన్నిచుక్క ఆకాశ మహాసాగరంలో ఒక చీకటి మూల చల్లనిసాగరంతో ప్రకాశించి, తన చిన్న అందం, తన సర్వస్వం మన వంద్దా లోకానికి ప్రదర్శించి అనక్షణిక జీవితాన్ని సార్థకపరచుకుంటుంది.

ఉదయపు కాంతిలో లోకమంతా ఒక క్రొత్త బ్రతుకులో క్రొత్త ఆశలతో కళ్ళు తెరుస్తుంటే చీకటితో సహవాససౌఖ్యం మళ్ళీ రాత్రి అయే వరకు లభించదు కదా అని నేను దిగులు పడతాను. కరగని చీకటిలో నా శుష్కజీవితం కరిగి సార్థక మెప్పు డవుతుంది? చీకటీ నాదుఃఖము లోపాలు పంచుకొని నన్నునవయిస్తుంది. చీకటినే మోహమంతా కప్పుకొని చీకట్లతో చిక్కబడి గడ్డకట్టిన శ్మశానంలాంటి హృదయాన్ని చేతుల్లో అదుముకొని ఆశలతో కలలతో నలిగి పోతుంటాను.

ఆ మధురలోకానికీ నాకూ మధ్య అభేద్యమైన రాతిగోడ కఠినంగా నిలిచి వుంది. ఎవరో కంటికి అగపడని శత్రువు నాకు కావలసినవన్నీ ఆ గోడ వెనక పెట్టి వాటిని సమీపించకుండా కనపడని త్రాళ్ళతో నన్ను కట్టివేశాడు. అక్కడ వెన్నెల

కాంతీ, తీయనిసంగీతం, సజీవమైన వుత్సాహం— అన్నీ వున్నాయి. వాటిన్ని చేరుకోవాలనే వాంఛ చంపుకోలేక గోడ కేవల ఉన్న అర్థంలేని శృంఖలాల్లో కొట్టుకుంటున్నాను.

కారుచీకటిలో చిన్న మిణుగురు వెలుగు మెరిసి పడుతుంది. ఆ నిండుచీకటిని తెలతెల్లగా చేయలేక పోయినా చూపులన్నింటిని తనవైపు లాగికొంటుంది. నేనుసైతం బ్రతుకు చీకటిలోని ఆ చిన్ని వెలుగువైపే ఆశతో ఆకలితో చూస్తున్నాను. ఆపేళలపైన వెలుగు జీవితంలో పేరుకొన్న కటికచీకటిని పున్నమి వెన్నెలగా మార్చాలనే వెర్రి ఆశ! కొంతసేపటికి ఎప్పటివలె ఆ ఆకాశగంగం ఆరిపోతుంది. ఇంకా తీరని తృష్ణతో గగనకుసుమంకోసం చేయిజాపి వెదుకుతూ—యథాప్రకారం నిరాశలో నీరవుతుంటాను.

రాత్రి పగలూ ఎడతెగని రైళ్ళమోత కఠోరంగా వినిపిస్తూవుంటుంది. ప్రతిబండీ నా గుండెల్ని చీల్చుకొని పరుగెడుతున్నట్టు అనిపిస్తుంది. ఆ మోత వింటూవింటూ గుండెలు చెదరి నిజంగానే ఏదో రైలు నన్ను పిప్పిచేసుకుంటూ పోతున్నట్టు భయంకరంగా బాధపడతాను. ఆ ప్రయాణీకులంతా ఎంతో ఉత్సాహంగా ఆనందంగా వున్నట్టు కనపడతారు. వాళ్ళ వుత్సాహాన్ని ఆనందాన్ని భరించలేక ఇంకా ఇంకా అడుక్కు కృంగి పోతుంటాను.

దిక్కులు మ్రోగిపోతున్న ప్రచండఘోషలో నాసన్నని పిలుపు ఎవరికి కావాలి? అణువణువూ దహించబడుతూ, భీతి గుండెల్లోనుండి జాలిగా వస్తున్న నాకే వినబడనిధ్వని,—పక్షి, తీరని దాహంతో నీటిమీద వ్రాలి మునిగిపోతూ అసహాయంగా అరచిన ఆకలి పిలుపులా—గాలిలో కలసిపోతూవుంటే. పూవుల్లాంటి హృదయాల్ని యినపకాళ్ళతో కఠినంగా త్రొక్కుతూపోయే రాతిగుండె లోకం ఆపిలుపు వింటుందా? విన్నా జాలి పడుతుందా—మరింత కఠినంగా త్రొక్కిపెడుతుంది కాని

వేలకొలదీ గడ్డిపూలు దారికి ఇటూ అటూ పూచి ఎంతో విన్యాసంగా సవరించుకొన్న హిమబిందువులతో చలచల్లగా మనపాదాల్ని తాకుతూంటాయి. కఠినంగా వాటిని త్రొక్కుతూ పోతాం. ఒకప్పుడు విసుక్కుంటాం—ఏమిటీ వెధవపువ్వులు దారి కడ్డంగా నని. పూల సౌకుమార్యం తెలీని గుడ్డలోకం ప్రేమాన్నతౌన్నత్యాన్ని ఏం తెలుసుకోగలదు?

ఈ ప్రవాహం యిలా అడవి దారి పట్టడానికి ఇంత కుప్పించి పాడవడానికీ కారణమేమిటో అని జిజ్ఞాసపడుతూ వుంటాను. ప్రవాహం ఎటు తిరిగినా తిరగవచ్చును కాని కుప్పించిపోతం అవడం ఎందుకో? ఎండలకి ఎండుతూ వానలకి నిండుతూ కేవలం కాలంపై ఆధారపడి వుంది. క్రూరమృగాలన్నీ తమ దుర్గంధాన్ని యిందులో కడిగి మా ప్రేమ ప్రవాహాన్ని మలినపరచడానికి చూస్తాయి. కాని వెన్నెలకీ వేడిప్రవాహాలకీ మాలిన్యం వుంటుందా?—తమ తమ మనోవికారాల్ని బట్టి వాటి కాకళంకాలని ఆరోపిస్తారు కాని.

జీవిత మంతా కారుమేఘాలతో కప్పివేయ బడింది. రానున్న ప్రళయదృష్టి కదే సూచన. ఏవో మెరుపులు తోస్తున్నాయి కాని నిశ్చలంగా నిలిచి దారి చూపలేవు. రెప్పపాటులో మాయమై పోతాయి. తోడి పాంథులు ఈ స్థితిలో ఎలా ముందుకు సాగుతున్నారో అని ఉత్కంఠతో చూస్తున్నాను. వాళ్ళని Realists అంటారు కొందరు. నా లాంటి అభాగ్యులు కారు వాళ్ళు. దారి తెలియక దిక్కు తోచక నేనే ఆసన్న ప్రళయానికి ఎదురు చూస్తూ అక్కడే పాతుకుపోయాను.

ఏదన్నా చేతా మని ఎంత గట్టిగా నిశ్చయించు కుంటానో, అంత తేలికగా ఒక్క పనీ చేయ లేను. కాళ్ళు చేతులు కదపకుండా ఎన్ని రోజులు అలా శూన్యంగా నెట్టుతుంటా! చివ రికి ఆ అందని ఆకాశకుసుమం క్రిందికి దిగి వచ్చినా, కళ్ళ ముందు సాక్షాత్కరించినా చేయి చాచి అందుకోలేనేమో ననిపిస్తుంది. ఎవరికి అర్థ మవుతుంది యీ వ్రి ఆవేదన?—

ఎవరికి కావాలి యీ విశాల ప్రపంచంలో!

ఆ మృగతృష్ణ, నీడలరూక్క నీడ, ఆ కల— అదే నిజమైతే ఇన్ని కన్నీళ్ళలో మరిన్ని కన్నీళ్ళు కలిపి ప్రయాణించవచ్చు. ఎన్ని వడ గాడ్పులలోనైనా నిర్భయంగా నిలుచోవచ్చు. కాని యిష్టసిద్ధి ఎప్పు డవుతుంది......ఏమో! ఎవరు చెప్పగలరు— నిరీక్షించాలి. కాల నిర్ణయం లేకుండా ఎంత కాలమున్నా ఓర్పుతో, సహనంతో నిరీక్షించాలి. చెంపకి చేయి ఆన్చి కొని దారి చూస్తూ నిరీక్షించాలి— మృగ తృష్ణలకోసం అర్రు జాచినందుకు ఫలితం అను భవిస్తూ.

ఈ యమయాతనకి చివరకి కనుమోడుపే కాంతి గాబోలు. పోనీ— ఆ కాంతి శుభావసరం ఎప్పటికో గదా!

అహల్యాస్తోత్రము

[శ్రీమద్రామాయణ కల్పవృక్షము నుండి]

విశ్వనాథ సత్యనారాయణ

ఒకచేత పంచ భక్ష్యకములు పరమాన్న మిరవొందుచున్న పళ్లెరము పూని
ఒకచేత గాంగవారి కమండలువు పూని యన్నపూర్ణాదేవి యనగ వచ్చి
చేతి పళ్లెరమును క్షితితలంబున నుంచి యిక నొక్క పళ్లెర మెత్తి కప్పు
రంబు వెల్గించి నీరాజనం బెత్తి యో శ్రీరామచంద్ర ! దాక్షిణ్యమూర్తి !
రామ ! రఘురామ ! దశరథరామ ! యో యయోధ్యరామ ! జానకిరామ ! యోయి తండ్రి !
అసురసంహార రామ ! పట్టాభిరామ ! యనుచు నీరాజనం బొసంగిన దహల్య.

పేదయింటికి దివ్వె పెట్టినయట్లుగా, నారచీరెలు కట్టి క్షీరజలధి
కన్యకామణి వచ్చుకైవడి, హిమగిరి కూతురు భూతేశుకొరకు వ్రతము
పూనిన కైవడి పొలుపారెడు నహల్య, నీరాజనం బెత్తి, నీరజాక్ష !
కరుణ వారాశి ! భాస్కరవంశవారాశి పొడిచిన సహార ముగ్ధరోచి !
రామ ! రఘురామ ! దశరథరామ ! యో యయోధ్యరామ ! జానకిరామ ! యోయి తండ్రి !
యసురసంహార రామ ! పట్టాభిరామ ! రామ ! రఘురామ ! రామ ! శ్రీరామ యంచు.

జలధికన్యా కుచస్థలి నీలమణితాళిబొట్టు, గట్టై, భవాంబునిధి యెడ్డి
శ్రీ వికుంఠపురీ ధురీభూతమగు పచ్చడాలు, వాలై, యఘశైల మగలి
గరుడి మూపున పదాంబురుహ ముంచిన హీరముద్దె, హద్దై, దోసములు మలంచి
ముక్తికాంతా గళమ్మున హత్తుకొను నల్లపూస, మోపై, పున్నెములు జనించి
రాసులై పేర్చు వాంఛాతరంగములును బలిసి రాకట్టు పొందిన పాపములును
సర్వలిప్తల బలిసెడు స్ఖలితములును పాసి నా గుండె నడకువల్ బలియుచుండె.

ముని గుప్తమౌ మనోమూలమై చను వేల్పుకుటము, నాపై తన కొమ్మ సాచె
పొదుగు ధారల వాక పొర్లెడు తెరగింట్ల ప్రస్థాహి, నాపైని పాలు చిలికె
చల్లని వెలుగులౌ జాబిల్లి జిగిదిండి మాందాళి, నాపైని, చెందిరించె
కలుషమ్ములను రాపిడులు బెట్టు సురతాణి శ్రీమని, నా మీద చిలకరించె
బడలికలు వాసి తిని గొమ్మ పట్టులందు పేర్మి ప్రావితి క్షీరవార్పిందులందు
చెంగలించితి రత్నంబు చిందులందు చెలగి మునుకాడితిని గంగ చినుకులందు.

సచ్చిదానందముల్ స్కంధ త్రయము గుర్తుగా నున్న యొక చెట్టుగాని చెట్టు
పంచ భూతము లను పంచ శాఖలు సాగి యైదు గుణంబుల నవఘళించి
పంచేంద్రియాఖ్య శిఫల్ దిగి, యవ్వాని మొదటల విషయముల్ మొలకలెత్తి
బుద్ధియు మనసును పొల్చు నహంకృతి, విషయేంద్రియములకు వేళ్లు పారి
యొక మహాగాధ పెంచిన, యొక్కడైన చెట్టుగాని చెట్టుతనమ్ము జిగివెలుగున,
కంజలించెద నేను నారాయణునకు, రామచంద్రునకు రఘురామునకును.

కమలా కుచోపరి కస్తూరికాగంధి శాటి నాగరకత, సాగివచ్చె
వైకుంఠ మంగళద్వార తోరణ పారిజాత వాసన లిందు, సాగుదెంచె
వనమాలికాగంధా వాసనాలుబ్ధ బంభరకోటి యిచటికి పారుదెంచె
ముక్తికాంతా హాస ముగ్ధ మందచ్ఛటా సంతాన మిచ్చోట గంతువెట్టె
ఇంత సభ్యత నా యెద నేల కలిగె; నీ పరిమళ మేల నా యెద వహించె
నింత ప్రభులోభమేల నా యెదకు గలిగె నింత యానందమేల నా యెద జనించె.

రూఢి నారద తుంబురు ప్రౌఢ సామగానాలాపములు నోట నాడినట్లు
శ్రీ ఘృతాచీ మేనకా ఘలంఘలిత మంజీర ధ్వనుల్ నోట చిలికినట్లు
లలి లయానుగ గరుచ్చలన నృత్యత్త్ష్వ చరణ రావము నోట తెరలినట్లు
పద్మాలయా హస్తపద్మానుకూల తాళామృతధ్వని నోట నలరినట్లు

శ్రీ వికుంఠపురీ సమావృత సమస్త భక్తలోకంబు నా యెద పాడినట్లు
శ్రీయుతాకారమై తోచు నా యెడంద నరుదుగా రామభజన మందిరము తోచు.

ప్రభు మేనిపైగాలి పైవచ్చి నంతనే పాషాణ మొకటికి స్పర్శ వచ్చె
ప్రభు కాలి సవ్వడి ప్రాంత మైనంతనే శిల యొక్కదానికి చెవులు కలిగె
ప్రభు మేని నెత్తావి పరిమళించిన తోన యశ్మంబు ఘ్రాణేంద్రియంబు చెందె
ప్రభు నీలరత్న తోరణ మంజులాంగంబు కనవచ్చి రాతికి కనులు కలిగె

ఆ ప్రభుండు వచ్చి యాతిథ్యమును స్వీకరించునంత నుపల హృదయవీధి
నుపనిష ద్వితాన మొలికి శ్రీరామభద్రాభిరామమూర్తి యగుచు దోచె.

పండితరాయల కావ్యలక్షణము

మాధవరామ శర్మ

పండితరాజు జగన్నాథుడు తన గ్రంథానికి కావ్యమీమాంస యని పేరుపెట్టుకొన్నాడు. మనన తరితీర్ణ విద్యార్ణవుడైన పండిత నరేంద్రుడే కావ్యమును సమర్థముగా మీమాంసించగలడు. మొదట్లో కావ్యలక్షణము వివేచితమవుతుంది. ఈ కావ్యముయొక్క స్వరూపమేమిటి? ఈ కావ్యలక్షణమును ఏయే వివేచకులు ఏయే స్వరూపంలో పరిణమింపచేస్తూ నిరూపించారు? ఈ విషయమును తెలిసి పండితరాజలక్షణ పరిష్కారమును అవగాహనము చేసుకొనడము సముచితంగా వుంటుంది.

"కవికృతి కావ్యము" అని కావ్య శబ్దానికి అర్థము. కవి ఆచరించే కార్యము కావ్యమవుతుందన్నమాట. కవి అంటే ఎవరు? అతడేమేమి చేస్తాడు: ఇదికూడా విచారణీయమే. "సంఖ్యావాన్ పండితః కవిః" అని అమరుడంటాడు. ఏదైనా ఒక విషయమును ప్రతిపాదన చేసేవాడు కవి అన్నమాట. సూక్ష్మరూపంగావున్న సర్వపదార్థములను ప్రతిపాదించే సర్వజ్ఞుడైన జగదీశ్వరుడు కవి అవుతాడని యజుస్సంహితలో ఉన్నది. వేదాలను సర్వప్రథమంగా ప్రకాశింపచేసిన బ్రహ్మ ఆదికవియట. వైదికవాక్కులను మొదటగా ప్రకాశింపచేసిన బ్రహ్మకు కవిపదవి ప్రాప్తమయింది. అట్లాగే లౌకికవాక్కులను అందరికంటె మొదటగా నిరూపించిన వాల్మీకి మహర్షికూడ ఆదికవి పదవీవిభూషితుడైనాడు. తరువాత తరువాత వారివారి రచనలలో సౌందర్యము బాగా ఉన్నా లేకపోయినా వారు కవులవుతూ వచ్చారు. రాజనీతి నిరూపకుడైన శుక్రాచార్యుడు కూడ కవియేనట. మొత్తానికి వర్ణనము చేసేవాడు కవి యని ఒక వ్యాపకమైన అర్థము కొంత కాలముదాకా ప్రచలితమయింది. ఒక సౌందర్యయుక్తమయిన విషయమును శ్రోతలు ముగ్ధులయ్యేటట్లుగా సుందరముగా వర్ణించేవాడే కవి అని కాలక్రమాన గ్రహించిన అర్థము. ఈ దృష్టిలో

వాల్మీకి వ్యాసాదులే కవులు. యాజ్ఞవల్క్యాదులు ఛందోబద్ధములుగా గ్రంథాలను రచించినప్పటికీ కవులు కారు. కావ్యలక్షణము అనేకధా పరివర్తనము పొందుతున్నప్పటికీ తరుచుగా ఈ చెప్పిన అర్థమే వ్యవహారింపబడుతున్నది. ఒక సుందర విషయమును సుందరంగా వర్ణించడము కవికృతి అని తేలుతున్నది. ఆ వర్ణనమనేది శబ్దరూపాన వస్తుంది. కాగా శబ్దము కవికార్య మన్నమాట. సామాన్యంగా ఇట్లా గోచరమవుతూఉన్న ఈ లక్షణమును అనేక ముఖాల విమర్శించారు.

"సంక్షేపాత్ వాక్యం ఇష్టార్థ వ్యవచ్ఛిన్నా పదావలీ కావ్యం"! సంక్షేపముగా ఉన్న వాక్యము కావ్యము అని తాత్పర్యము. కావ్యములోవుండే పదాలు అన్యూనానతిరిక్తములుగా ఉండాలి. మనము చెప్పదలచినదానిని కొద్దిలో సంపూర్ణంగా చెప్పవలె నన్నమాట. కావ్యాదర్శమును రచించిన దండి కూడా సామాన్యంగా ఈ లక్షణభావమునే గ్రహిస్తున్నాడు. "శరీరం తావత్ ఇష్టార్థవ్యవచ్ఛిన్నా పదావలీ" దీనిలో "సంక్షేపాత్ వాక్యం" తగ్గిందన్నమాట.

తరువాత రుద్రటాదుల అభిప్రాయంలో స్వరూపానికి కొంత పరిణామం కలిగింది. కవి శబ్దాలతో ఏదైనా పదార్థమును చెప్పుతున్నాడంటే ఆ పదార్థము వాస్తవికము కాదు. అది కేవలము కల్పనాప్రసూతమే. కవి వర్ణనీయార్థము మానసము. శబ్దము కవికృతి అయినట్లుగా అర్థముకూడ కవికావ్యమే. కావ్య మనే అనంత జగత్తులో కవి సృష్టికర్త యట, కాగా కేవలము శబ్దముకాక అర్థముకూడా కావ్యమవుతుందని రుద్రటుని భావన. అందువలననే "శబ్దార్థౌ కావ్యం" అని అంటున్నాడు. దండి రుద్రటుల మధ్యకాలంలో శబ్దార్థముల రెండిటిని కావ్యముగా భావించినట్లు ఊహా చేయవచ్చును.

సుందరవర్ణనము ఉన్నప్పుడు కావ్యమవుతుంది అనే విషయము అగ్నిపురాణకాలం నుండీ ప్రచలిత మవుతున్నప్పటికీ వామన సమయంలో కావ్యంలో సౌందర్యానికి ప్రాధాన్యము అధికమయింది. "కావ్యములో సౌందర్యము ఉంటుంది కాబట్టి కావ్య

మును గ్రహించాలి" అని వామనుడంటాడు. వామన సమయంలో కావ్యసౌందర్యము గుణాలంకారాల వలన కలుగుతుందని భావించినట్లు స్పష్టమవుతుంది. అందువలననే "కావ్యశబ్దోఽయం గుణాలంకార సంస్కృతయోః శబ్దార్థయోర్వర్తతే" అని వామనుడంటాడు. కాగా శబ్దార్థాలకు గుణాలంకారయుక్తత్వ విశేషణము ఈతని నవ్యసృష్టి. కేవల శబ్దార్థములు కావ్యమనడము ఈతనికి సమ్మతంకాదు. గుణాలంకార సహిత శబ్దార్థములు వామనదృష్టిలో కావ్యము.

ధ్వనిప్రస్థానవ్యవస్థాపకుడైన ఆనందవర్ధనాచార్యుడు స్పష్టముగా కావ్యలక్షణమును చెప్పలేదు. అయినా శబ్దార్థములు కావ్యములని ఆ యా ప్రసంగవశాన ఆతడంగీకరించినట్లు స్పష్టమవుతుంది. భోజరాజు స్పష్టంగా కావ్యలక్షణమును చెప్పకపోయినా శబ్దార్థములు రెండిటినీ కావ్యముగా తలచినట్లు ఆతని వచనాల వలన స్పష్టమవుతుంది. మమ్మటాచార్యులు వామనమతమునే సమాలోచనాత్మకదృష్టితో స్వీకరిస్తున్నారు. తరువాత కాలంలో ఆనందవర్ధనుని సిద్ధాంతాలు బాగా ప్రచారం పొందుట వలన రసము కావ్యజీవితముగా అందరూ అంగీకరించారు. "సాధుశబ్దార్థ సందర్భం గుణాలంకార భూషితం స్ఫుటరీతిరసోపేతం కావ్యం" అని వాగ్భటుడంటాడు. వామనుని శబ్దార్థములు కావ్యములని [illegible] "[illegible]" అన్నాడు. మమ్మటాచార్యుల రసమును కావ్య[illegible]. [illegible]టు [illegible] అందరిమతములనూ కలుపుకున్నారు.

జయదేవుడు "నిర్దోషా లక్షణవతీ సరీతి గుణభూషణా సాలంకార రసానేక వృత్తి వాక్కావ్యనామభాక్" అని [illegible] ఉత్కర్షాధాయకములు [illegible] శోభావిధాయకము అయిన యే యే ధర్మములు గలవో [illegible] లక్షణంలో నిరూపించుకొన్నాడు. ఆ యా విశేషాలతో కూడుకున్న వాక్యమే కావ్యమని జయదేవ నిశ్చయము.

దీర్ఘ దీర్ఘమయిన కావ్యలక్షణము విశ్వనాథుని సమయములో చిన్నదయింది. "వాక్యం రసాత్మకం కావ్యం"అని విశ్వనాథ లక్షణము. వాక్యములో ఉత్కర్షాధాయ

కములయిన అలంకారాదులు లేకపోయినా దోషములున్నా రసభావాభివ్యక్తి ఉన్నట్లయితే కావ్యము కావచ్చు అని భావము. ఈతని ఈవచనము నవీనమయినా పురాణమే. ఈ విషయమును ప్రాచీనుడయిన శౌద్ధోదని అంగీకరించినట్లు కేశవ మిశ్రుడు చెప్పుతున్నాడు. "కావ్యం రసాదిమద్వాక్యం శ్రుతం సుఖవిశేషకృత్." అనే లక్షణంలో ఆదిపదాన అలంకారమును పరిగ్రహించాలని కేశవమిశ్రుడు అభిప్రాయ పడతాడు. రసాలంకారాలలో ఏ ఒకటిఉన్నా ఆ వాక్యము కావ్యమవుతుందని ఆతని భావము. విశ్వనాథుడు అలంకారయుక్తమయిన వాక్యము కావ్యమని అంగీకరించడు. అందువలననే కాబోలు శౌద్ధోదని లక్షణంలోని ఆదిపదాన్ని విడిచి ఒక రసమునే గ్రహించాడు.

కావ్యలక్షణ విషయములో ఇన్ని వాదములు ఈవిధముగా ఉండగా మార్మిక తార్కికుడయిన పండితరాజ జగన్నాథుడు "రమణీయార్థ ప్రతిపాదకః శబ్దః కావ్యం" అని విశిష్టలక్షణమును చెప్పుతున్నాడు. ఈ లక్షణవివేచనము మా నవ రసగంగాధరములో నిరూపితమయింది.

ఏదయినా అర్థమును వర్ణించడము కావ్యమని వేదాదిసమయంలోని అభిప్రాయము. తరువాత పురాణాది సమయములో ఈ ప్రాచీనరూపానికి పరిత్యాగం లేకపోయినా సుందరార్థమును సుందరంగా వర్ణించితే కావ్యమవుతుంది అనే పరిష్కారంవచ్చింది. సుందరార్థమును వర్ణించడములో సౌందర్య సంపాదనము అపేక్షితమయింది. దానికై ప్రయత్నంకూడా కన్పించుతున్నది. ఈ భావమే దండికాలం దాకా వచ్చింది. వామనాదుల సమయానికి గుణాలంకారములు శబ్దార్థ సౌందర్య హేతువులుగా అంగీకృతములు కావడము వలన వానికికూడా కావ్యలక్షణ ప్రవేశం కలిగింది. ఆనంద వర్ధనుని కాలములో రసము ఒక్కటే సౌందర్యనిదానమని నిశ్చితమయినందున అప్పటినుంచీ అలంకారాలపై ఆదరం తగ్గింది. తరువాత మమ్మటుడు అలంకారాలను అప్రధానముచేసి గుణాలను రసధర్మములనుగా చేసి రసాభివ్యక్తికై రచనయందు ఆదరమును ప్రదర్శించాడు. రసరచనలే సౌందర్య ప్రధానకారణాలని అప్పటికి

తేలింది. ఇంతకూ సౌందర్య సహితమయిన అర్థమూ సుందరవర్ణనమూ ఉంటే కావ్యమనే అభిప్రాయము తేలింది. విశ్వనాథుడు సౌందర్యసహితమయిన అర్థము కావ్యమని అంగీకరించడు. తద్వర్ణనమునే కావ్యముగా అంగీకరిస్తాడు. రసము ఒక్కటే సౌందర్యములో ఏకమాత్ర కారణ మంటాడు. పండితరాజు కూడా సౌందర్య సహితమయిన అర్థవర్ణనమునే కావ్యముగా భావించుతాడు. రసము ఒక్కటే సౌందర్య కారణమని అనడమును అంగీకరించలేదు. ఏ అర్థవిజ్ఞానమువలన అలౌకికానందము కలిగి తన్మయీభావము కొంతగానయినా సంభవించుతుందో ఆ అర్థమే సౌందర్యహేతువు. ఇది రసముతోనే సంబంధించి ఉండాలని నియమము లేదు అని రాయలభావన.

తాజమహాలు

పువ్వాడ శేషగిరిరావు

యమునానదీతీర కమనీయ కల్లోల నీలాలు కంఠహారాలు గాగ
ఆపాత మధుర సమ్య క్కోకిలాంగనా గానాలు మంగళాంకాలు గాగ
జవమాన పవమాన చాలిత పాదప వ్రాతాలు వింజామరాలు గాగ
ఆలోక నాగంతు కానమితోత్తమాంగాలు మన్నీల శిరాలు గాగ
సామరస లాలిత కళాలయామరావతీ సభా సింహ పీఠికా భాసమాన
షాజహాను సార్వభౌమ భాస్వంత కీర్తి·రాజధాని విరాజ సమ్రాజ్ఞి తాజి.

నును లేవెన్నెల మోసులం గెలుచు చెన్నుల్ కొన్న క్రొంజిన్నె, ప్రా
క్తన పుణ్యైక ఫలమ్ముగా కొనిరి యాగ్రాకాంత కైకొన్న ది
వ్యజనే, వేయేల? అపూర్వ భారత శిలా సమ్యక్కళా నైపుణీ
ఘనసముత్సర్పద్విశావనీతల కళా బృందమ్ము సుస్మి ముహల్.
నునుపుల్ దేరెడు పాలరా నిగనిగల్, సూక్ష్మన్న నాకూరుపుం
బని తెన్నుల్, సగపీ నఘుస్కృతుల్, నవోహామృతపు గ్రొన్నెరుపుం
దనముల్, నెమ్మనముల్ ద్రవించు పలు విన్నాణంబులున్, హాపమం
దనముల్ పిల్చెడు సన్నపెనములు, వీణల్ మీటు మాధుర్యముల్.

రూపుగొని యున్న కరుణా? తీరుపులు గన్న గండరుపా? షాజహాను ప్రేమ కరగి పోసి
భద్రపరచిన రజతంపు బరణి యేమొ? మహికి దిగ్గిన యా చంద్రమండలమ్మొ?
ఇరువది మూడు వత్సరము లేడ్తెర లక్షలమంది శిల్పు లు
ర్వర దెలిరా ల్గరంచి రసవార్నిధి నేసిర దేమి? వెల్లిగా
విరసిన యోజనమ్ములు దవించిన చేపని తీరుతీయముల్
నెరపిన శిల్ప సృష్టి ధరణీ వరణీయము సూ యుగాలకున్.
ప్రవిమల కరుణా రస భర కవితా సుధ తోడ శిల్పకావ్యము గొనెనో?
స్రవ దవిరళ శిల్పసుధా కవితా కావ్యమ్ము గొనెనొ కాంతామణి తాన్.

భర్త కావ్యకర్త పత్నియె కృతిభర్త శిల్పమూర్తి కావ్యశిల్పమూర్తి
ఇలయె స్వర్గమయ్యె నింద్రలోకము డిగ్గె తాజి పొడమ నెల్ల తారుమారె.

పూవుందేనియ తేటనిగ్గు, నురువుల్ పొంగారు పాలేరు, మే
ల్లావింబండురసమ్ము ముంపు, చెరకుంబాకంబులే గాపు, పెం
గ్రోవుల్ గట్టిన గోస్తనీ రసము, నుత్కోచించి యీ తాజిలో
దేవీప్రేమము తియ్య తీపులను చిందించెగా సుమా షాజహాన్.

షాజహాన్ పత్నీవిచార భావోద్వేగ పరిణతు లీ తాజి భావమంధి
షాజహాన్ రమణీప్రసర్పిత బాష్పవార్నిధి తాజిగాగ ఘనీభవించి
షాజహాన్ హృదయ నిశ్చలిత కాంతా దివ్య రుక్సమూహము తాజి రూపుచెంది
షాజహాన్ ప్రేయసీ స్వచ్ఛ ప్రణయమార్గ తరళత్వము తాజి యొరపుగాంచి
కరుణ కరపి కట్టిన మూర్తి గాగ దోచు భావములు బాష్పములు మనః ప్రణయములును.
శాశ్వతత్వము గనియె రాజ్ఞమహలు లోన షాజహాన్ శాశ్వతమొ? భార్య శాశ్వతమ్మొ?

ప్రతి శిలాశకల దివ్య ద్ధావళధళ్యాన ప్రణయిని మెయితళ్కు గనియెనేమొ?
ప్రతి శిల్పిహస్త మార్దవరేఖలో ప్రియా కరకంజ మకరంద మరసెనేమొ?
ప్రతి మందిరాంతరోపరిభాగమున సతీహృదయ ప్రసన్నత నెరిగెనేమొ?
ప్రతి సన్నివేశ ప్రభావైదుషిని ముముతాజి రూపము తోచి తనిసెనేమొ?
ఏ మహావేశ మతని ముంచెత్తి తాజమహలుమూర్తిని నీ ధరామండలమున
కెత్తి యారతి యెత్తెనో యెరుగ నగునె? అతని మానస మొక్క హిమాలయమ్ము.

సతుల గానమొ ముముతాజి సాటి రాజ్ఞి గనమొ? భర్తలు లేరొ మొగల్ ప్రభూత్త
ములును గల్గరొ? సతులు మున్నుంద పోరొ? ఏది యేతాదృశ ప్రణయైక చిహ్న?
ఏమి యా మోహరస నిమ్నగా మహస్సు! ఏమి యా భావ రామణీయామృతమ్ము!
ఏమి యా మిధునాయిత ప్రేమ లవలి! ఎంత మధురము షహజహాన్ హృదయలహరి!

— 'తాజమహలు' నుండి.

[illegible]

ఏకాంకనాటకాలు

శ్రీపాద గోపాలకృష్ణమూర్తి

కాబట్టి* సాహితీసమితి (నోరి నరసింహశాస్త్రి, శ్రీనివాసశిరోమణి) వారి ప్రయత్నం వల్ల అంతవరకు నిద్రాణమై యున్న నాటికారచయితలశక్తి మేలుకున్నదంటున్నాను. 'సఖి' ప్రారంభానికి ముందే ఏకాంకనాటకం పత్రికల్లో పొడగట్టింది గాని, సఖి వచ్చిన తర్వాతే నాటికకి ఉనికి వచ్చిందంటాను. వానకురిసిన తర్వాత మొక్కలు బయల్దేరినట్లు, భేమాభిఖ్యాని, పరివర్తనము ప్రచురించిన తర్వాతి రోజుల్లో చాలా నాటికలు బయల్దేరాయి. పలువురు కవులు ప్రచురించిన ఈ నాటికాబాహుళ్యంలో సమిష్టిగా ఒక్కరచనలో కాకపోయినా, వేర్వేరు రచనల్లో నాటిక అవయవాలన్నీ ఒక్కొక్కటే వృద్ధిపొందాయి. ఈ బాల్యదశలో వెలువడ్డ నాటికలు పరిశీలిస్తే నాదృష్టికి ముగ్గురు రచయితలు కనపడ్డారు: శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, చింతా దీక్షితులు, భమిడిపాటి కామేశ్వర్రావుగార్లు. వీరిలో ఏ ఒక్కరి రచనలు కూడా నాటిక ఎత్తుని అందుకోలేనట్టు కనపడ్డాయి నాకు కాని ముందు మనవిచేసినట్లు నాటిక అవయవాలు చాలామట్టుకు సూచనగా ఏర్పడిపోయాయి వీరి రచనల్లో. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు తమ రచనల్ని "చిన్నకథలు" అని ప్రచురించుకున్నారు. భమిడిపాటివారు 'బాగు బాగు', 'ఎప్పుడూ ఇంతే', 'కచటతప'లకు "ప్రదర్శనత్రయం"అని పేరు పెట్టుకున్నారు కాని నాటిక లనలేదు. దీక్షితులుగారు తమ రచనలకి నామకరణం చేయనేలేదు. నేను బయల్దేరి వీటన్నిటికీ నాటికలు అని నామకరణం చేసి, హెచ్చురకం నాటికలు కావని చెప్పబూనడం సహృదయులకు వెగటుగా తోచవచ్చును. కాని నాటిక ఏదారుల్లో నడిచి తన గమ్యస్థానం చేరుకుందో పరిశీలించుకునేటప్పుడు, దాని సంపూర్ణవికాసానికి దోహదం చేసిన రచయి

* చూ. ఏకాంకనాటకములు—౧ పుట ౧౪౪ తరువాతి భాగ మిది.

తల్నీ రచనల్నీ గుర్తించుకోడం విధాయకమనుకుంటాను. వీరందరి చేయూత అందుకునే నాటిక పరిణతి పొందిందంటే, తొలిరోజుల్లో వీరు చేసిన సేవ ఎంత పవిత్రమైనదో వేరే చెప్పనక్కర లేదనుకుంటాను.

సుబ్రహ్మణ్యశాస్త్రి రచనలు

నాటిక కల్పనా సంభాషణలలోనుంచి ఆవిర్భవించిందని నా మొదటి వ్యాసంలో మనవిచేశాను. సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఈ సంభాషణలు రచించడంలో అందెవేసిన చేయి. "యావజ్జీవం హోష్యామి" "మట్కర్యుక్తా" "జాగ్రత్తపడవలసిన ఘట్టాలు" "విమానం ఎక్కబోతూంచు" మొదలైనవి చదవండి. అసంఖ్యాకాలుగా రాశారాయన ఈరకం ఊహాసంభాషణలు. వీటిలో సామాన్యంగా ఇద్దరువ్యక్తులే ఉంటారు రంగం రంగమంతటికీ. వారిద్దరిశీలంకూడా సంభాషణ ప్రారంభించకముందే ఏర్పడిపోయుంటుంది. చదివినకొద్దీ మనకి తెలిసేది కథాకాదు. వ్యక్తుల శీలంలో కలిగే మార్పూకాదు. [ఇక్కడే ఉంది ఊహాసంభాషణకీ నాటికకీ తేడా] వివిధపరిస్థితుల్లో, ఒకరకానికి చెందిన వ్యక్తియొక్క వర్తన ఎలాగుంటుంది అనే ప్రశ్నకి జవాబుమాత్రకే తెలుస్తుంది. ఊహాసంభాషణల నైజమే అంత. సంభాషణ జరిగినకొద్దీ పాత్రలశీలం చంద్రుడి కళల్లాగు ఆవిష్కరణమౌతుంది కాని విత్తనంనుంచి మొక్కలాగు వృద్ధి కాదు. కాబట్టి 'కథపర్యవసాన మేమిటౌతుంది?' అని కాని, 'ఈవ్యక్తిలో ఏమ్మార్పు వస్తుంద'ని గాని చదువరుల్లో కౌతుకముండదు. "ఈ ప్రశ్నకేం జవాబు వస్తుందో? ఈయుక్తికేమిటి సమాధానం?" అనే క్షణక్షణ కౌతుకమే ఉంటుంది టెన్నిస్ పోటీ చూచినప్పుడులాగ. శాస్త్రిగారిసంభాషణలకీగుణాలన్నీ ఉన్నాయి. చూడండిమచ్చుకి.

'అబ్బాయి నెత్తుకోవాలి'

'తెల్లవారిందీ'

'గంటయిందప్పుడే'

"ఏడిసినట్టుగా నేవ్వుంది జవాబు; తొరగా రా"

"అక్కడ కాపరం వుంటాననుకున్నారా యేమిటండీ?'

"ఆశమ్మలూ బోశమ్మలూ చేరతారుకాదూ మరీ?"

"అయితే"

"కబుర్లు మొదలెట్టకుండా బుర్ర వంచుకుని రమ్మంటున్నాను"

"నేను మొదలుపెట్టనులెండి"

"వాళ్లు మొదలుపెడితే అందుకుంటావా?"

"మీరు వద్దన్నారా మరీ?"

ఇది "యావజ్జీవం హోష్యామి"కి ప్రారంభం. గయ్యాళిభార్య, అమాయికపు మగడూన్న ఇక్కడి వ్యక్తులు. "షట్కర్మయుక్తా"లో గడుసుభార్య, మేదకుడైన భర్తా పాత్రలు. ఇలాగే వీరి రచనల్లో గయ్యాళి అత్తగారూ కత్తిలాంటి కోడలూ; మెత్తని వదినగారూ అసహానపు ఆడబడుచూ; నాలిముచ్చు నాయనమ్మా బాలవితంతువు మనమరాలూ చోట్లు మారుతూంటారు. శాస్త్రిగారు రచించే సంభాషణలు ద్వంద్వయుద్ధాల్లా గుంటాయి. పాత్రలే పలుకుతాయి స్వయంగా; 'అహం'తో వీరు పలికించినట్లుండవు. ఈగుణం ఊహా సంభాషణలకే కాదు నాటికా సంభాషణలకి కూడా ఉండాలి. శాస్త్రిగారి రచనల్లోని సంభాషణాక్రమం నాటికలో ఉండవలసిన సంభాషణాక్రమానికి చక్కని పునాదిరాయి. విరిదే 'పునాదిరాయి,' దాన్నిబట్టి 'కలంపోటు' అనే నాటికలు జ్ఞాపకం వస్తున్నాయి. ఈ రెండింటిలోనూ కూడా శాస్త్రిగారి విశిష్ట సంభాషణాపద్ధతి తేటగా గోచరిస్తుంది. ఇక్కడ ఒక్క విషయం మనవిచెయ్యాలి నేను. సంభాషణలో ద్వంద్వ యుద్ధపద్ధతి, పాత్రోన్మీలనమూ కథాపర్యవసానమూ లేని ఊహా సంభాషణలలోనే గాని ఆ రెండూ తప్పకుండా ఉండే నాటికల్లో రాణించదు—పొడుగు చేశేస్తుంది నాటికని. కథావస్తువు

ఏబలం, సంభాషణపదలం అయిపోతే నాటికకి (గాని నాటకానికి గాని) జీవమైన ఉత్కంఠత పల్చబడిపోతుంది. ఒకొక్కప్పుడు చచ్చిపోతుంది కూడాను. సుబ్రహ్మణ్యశాస్త్రిగారి నాటికలలో (నాటకంలో కూడాను) ఈ దీర్ఘసంభాషణలు ఉండి తీరుతున్నాయి. 'కలంపోటు'లో తిరుమలదేవి పరిచారిక మంగ, రాయలవారికి రాణీపై కోపం రావడాని కారణం ఏమిటో నంది తిమ్మన్నగారికి చెప్పేసరికి తొమ్మిది పుటల సంభాషణ దొర్లిపోయింది. మూడో రంగంలో తిమ్మనగారు పారిజాతాపహరణంలోని సాత్రాజితీ కోపపశమన ఘట్టం చదవబోతారు అన్యాపదేశంగా రాయలవారిని మందలించడానికి కథపట్టు అందుకోడానికి మళ్ళీ తొమ్మిదిపుటల సంభాషణ దొర్లిపోయింది. శాస్త్రిగారు నాటకత్వంలో విడిచిపెట్టేయవలసిన అల్పాంశాలు గట్టిగా పట్టుకుని చికిలిచేస్తారు. ఈ అంగశిల్పం పనివాడితనాన్ని పోషిస్తుందేమో కాని మొత్తపు సౌందర్యాన్ని పోషించదు. మన దేవాలయ గోపురాలు చూడండి. అంతస్థునుంచి మరో అంతస్థువరకూ ఎంత చికిలిపనైనా ఉంటుంది. కాని గోపురసౌందర్యాన్ని పోషించేది ఈ చికిలిపనికాదు. గోపుర బృహత్స్వరూపం, పెద్దవంపులూ, విమానస్వరూపం, ఇవి సౌందర్యానికి సహాయకారులు. అలాగే నాటికకి అందం తెచ్చేది దీర్ఘసంభాషణా రచనాచాతుర్యం కాదు. క్లుప్తంగా ఉన్న సంభాషణలో నిండి బయల్పడే కథా-, శిల్ప-, ధ్వని. సంభాషణ దీర్ఘమైనకొద్దీ ధ్వని తగ్గిపోతుంది. నండూరి బంగారయ్యగారి 'ఖడ్గతిక్కన'లో కూడా ఈలోటే కనబడుతుంది. చంపడానికీ చావడానికీ సిద్ధపడి ప్రవేశించే యుద్ధభూమిలో వాదోపవాదాలు, దుఃఖం గొంతునిండవలసిన ఘట్టాల్లో నాలుగూ నాలుగూ ఎనిమిది పాదాలు పొడుగున్న సీసపద్యాలూ ప్రవేశపెట్టి పొడిగించడం నాటికని సాగగొట్టడమే. 'పునాదిరాయి' అని సుబ్రహ్మణ్యశాస్త్రిగారు మరో నాటిక వ్రాశారు. అందులో రెండురంగాలు. ఒకదానిలో కుంతీదేవి పిలిపిస్తే నగరులోకి వచ్చిన బాలకర్ణుణ్ణిచూసి అర్జునుడు అగ్గిపోతాడు. కర్ణుడుకూడా పిడికిళ్ళు బిగిస్తాడు. సరిగా ఈవేళకి కుంతి వచ్చి అర్జునుణ్ణి చీవాట్లుపెట్టి పంపేస్తుంది. పాండ

వులకీ కర్ణుడికీ కత్తు కలపాలని రోజూ నగరుకి రమ్మంటుంది కర్ణుణ్ణి రెండోరంగంలో కర్ణుడు దుర్యోధనుడికీ దుశ్శాసనుడికీ కొబ్బరికాయలు రాళ్ళువిసిరి పడగొట్టి, దాహానికిస్తాడు. చూసిచూసి దుర్యోధను డతన్ని అభినందిస్తూనే రాజ్యం ఇప్పించ డానికి తీసుకుపోతాడు. ఈ నాటికద్వారా కర్ణుడి కౌరవకులాభిమానానికీ అర్జు నుడిమీది కసికీ 'పునాదిరాయి' పడిందని తేల్చారు కవిగారు. నా దృష్టికి రెండు రంగాలూ రెండు పునాదిరాళ్ళు. దానికీ దీనికీ సంబంధం వసుషేణు (కర్ణు)డే కాని కథ ఏదీకాదు. "దుర్యోధనాదులు చేరతీసి పోతారో యేమిటోనాయన్ని" అని కుంతీదేవి అన్నమాట కావ్యార్థసూచన చేస్తుంది కాని ఈ రంగానికీ రెండోరంగానికీ అతుకేదీ లేదు. సంభాషణకూడా తాపీగానే నడిచింది. వసుషేణుడికీ అర్జునుడికీ, కుంతికీ అర్జునుడికీ, తరవాత కుంతికీ వసుషేణుడికీ జరిగిన సంభాషణలు, చికిలిపని ఎక్కువై పోయి రంగాన్ని పల్చచేశాయి. ఇలాగే రెండో రంగంలో కొబ్బరికాయలు తాగడం ఒకపుట అంతా పట్టింది.

పునాదిరాయి, కలంపోటు అనే ఈ రెండూ పురాణకథనీ, చరిత్రనీ వస్తువుగా గ్రహించాయి. మరుగుపడిపోయిన గాథల్ని—కర్ణ దుర్యోధనుల మైత్రి, పారిజాతాప హరణావతరణం, ఇత్యాది—తీసుకుని అవి ఈరీతిగా జరిగుంటాయి అని చూపించ డమే వీటి ముఖ్యాశయం. కేవలం సంఘజీవన ఖండాలుగా బయల్దేరిన శాస్త్రిగారి ఊహాసంభావనలు, 'విమానం ఎక్కబోతూను' లో చరిత్రలోకి తొంగిచూచి, మల్లమ్మ కైజారుతో పొడుచుకోవడంతో నాటకత్వం అలవర్చుకోడం ప్రారంభించి పునాదిరాయి కలంపోటులద్వారా చరిత్ర చిత్రణానికి పూనుకుని 'నిగళబంధనం', 'రాజరాజు' లలో నాటకత్వాని కెగబాకేయి.

సుబ్రహ్మణ్యశాస్త్రిగారి రచనల్లో నాటిక సంభాషణాక్రమం అలవర్చుకుంది. వీరి సంభాషణలలోని నైశిత్యం మరొకరి కలవడలేదు. నాటిక పరిణతి పొందిన నేటి కాలంలో మొక్కపాటి నరసింహశాస్త్రి, శివశంకరశాస్త్రి, గుటిపాటి వెంకటచలం,

విశ్వనాథకవిరాజు గార్ల రచనలలో సంభాషణాక్రమం సాపుదేరిందేమోగాని ఇంత వరకూ సంభాషణా నైశిత్యానికి సుబ్రహ్మణ్యశాస్త్రిగారిదే అగ్రతాంబూలం. శాస్త్రిగారి రచనల్లో నాటిక ఆదర్శాన్ని గుర్తించుకోలేను. వారి నాటికలు చరిత్ర చిత్రించడం, తద్వారా రచయితకి కీర్తి, ధనమూ, ఇత్యాదులు సంపాదించడమేకాని వింటినుంచి విడివడ్డ బాణాల్లాగ ఒకలక్ష్యాన్ని గురిచూచినట్లు కనబడవు నాకు. "నాటికారచన ఎందుకు చేశావు?" అని అడిగితే రచయిత జవాబు చెప్పగలగా లంటాను. "సెలయేళ్లు ఎందుకు పారతాయి? కోయిలలు ఎందుకు పాడుతున్నాయి?" అందుకే నేనూ రచిస్తున్నాననడం వెకిలితనం ఆత్మవంచనాను నాటికా రచయితల కట్లు. కళ అంటే ఏది? కళాస్రష్ట భావాల్ని చదువరుల కందించే రచన. చదువరుల్లు ఎందుకు కోరతారు ఈ భావాలు అందిపుచ్చుకోడాన్ని? ఆనందంకోసం. సరే ఈ ఆనందం ఏమిటి? ఎలా కలుగుతోంది? అవి ఆలోచిద్దాం. నీరుకారే కంటిని చూస్తే మన కంటికీ నీరుకారేటట్లు, ఆనందంతో, ఉత్సాహంతో ఒకరు వెలిబుచ్చే భావాల్ని విన్నప్పుడు, మనకికూడా వారి అనుభవమే కలుగుతుంది. ఈ సహానుభూతే ఆనందం, రసానుభవం, ఆలంకారికు లేమంటే అది. కరుణ రసార్ద్రమైన దృశ్యం నాటకంలో చూచీకూడా 'బాగు'న్నదంటాము. ఈ బాగుకి అర్థం ఏమిటి? 'సహానుభూతి వచ్చింద'న్నమాటే. కాబట్టి ఆనందం సహానుభూతికే మరోపేరు. కళాస్రష్టచేతిలో ఈ సహానుభూతి కలిగించడానికి వీలైన మహాశక్తి ఉంది. ఉన్నందు కతడు చేయవలసిన పని ఏమిటి? అడ్డమైన భావాలూ చదువరుల కెక్కించడమా? ఒకనాడు 'పాడులోకంలో సుఖం లేద'నిపిస్తుంది. మరోనాడు 'లోకమే స్వర్గం, వేరే స్వర్గం లేద'నిపిస్తుంది. కళాస్రష్ట తన వ్యక్తి జీవితంలోని గాలివిసురుల కన్నిటికీ కళారూపం ఇచ్చేయడమేనా? లేక ప్రత్యేక పరిస్థితుల కూడలివల్ల ఏర్పడిన తన వ్యక్తిస్వభావానికి నచ్చే హైయ్యంగవీనమో, తంగేటిజున్నో, కండచక్కెరో, కాకరకాయకూరో కావ్యవస్తువుగా చేసి కావ్యాలల్లడమా? బృహత్తర సంఘక్షేమంకోరి ఋషివై హితోపదేశంచేసే కావ్య

మల్లడమా? ఏది చెయ్యాలి కళాస్రష్ట? తన కావ్యాలు చదివే సహస్రాధికరసజ్ఞులకి, తనపుత్రికి నచ్చే స్వర్గం సృష్టించి చూపించి అదే కోరుకోండి అని ప్రబోధించడమా? లేక 'సంఘమంటూ, దేశమంటూ, మానవజాతి అంటూ ఉన్నది; నా శ్రేయస్సు దాని శ్రేయస్సు కాదేమో; నా అహంకారం కాస్త తగ్గించుకుని, సంఘాని కేది శ్రేయమో గుర్తించుకుని నాకుగల శక్తిని సంఘశ్రేయము కోసం వినియోగిద్దామ'ని సంఘ పురోగమనాని కనుకూలించే కావ్యాలు, రచనలు చేయుడమా? ఏది లోభనీయం?

ఆదర్శములేని కళ గుడ్డిపులి, వెర్రివాడి చేతిరాయి, కోతిచేతిలోని కొరకంచు. నాటికా రచనికి ఒక ఆదర్శముండాలి. ఒకప్రకృతి సత్యం నిరూపించడమో, పౌరాణిక, చారిత్రిక, సాంఘికఘటనలు చూపించి నాటి పరమ ప్రయోజనాన్ని ధ్వనించడమో, ఏదో ఉద్దేశముండాలి అంత శ్రమపడి శ్రద్ధతో రచించడానికి. సుబ్రహ్మణ్యశాస్త్రిగారి నాటికలలో ఆదర్శము బలీయంగా కనపడదు. దీక్షితులుగారి రచనల్లో పురాణఘటనలకి వ్యాఖ్యానం కనబడుతుంది కొంచెం అవి పరిశీలిద్దాం.

దీక్షితులుగారి రచనలు

పిలకా గణపతిశాస్త్రులుగారు "దీక్షితులుగారి నాటికలు" అనే పేరుతో ఉదయినిలో ఒక చక్కని వ్యాసం వ్రాశారు. నాటిక పొందిన క్రమవికాసంలో దీక్షితులుగారి రచన లెక్కడున్నాయో పరామర్శించుకుందాం మనం. దీక్షితులుగారి నాటికల్లోని పరమార్థ మొకొక్కప్పుడు రూపణంగాను (allegory) మరొక్కప్పుడు కేవలం ధ్వని రూపంగాను ఉంటుంది. మొత్తమ్మీద వీరి రచనలలో శర్మిష్ఠ, వరూధిని, చక్రవాక మిధునం, దసరాదిబ్బ, రేణుక అనే అయిదు రూపకాలే సర్వోత్కృష్టాలన్నారు గణపతిశాస్త్రిగారు. వీటన్నిటికంటె సర్వోత్కృష్టమైనది 'శ్రీకృష్ణుడ'ంటాను. చక్రవాక మిధునం, దసరాదిబ్బ దృశ్యాలు కావు శ్రవ్యాలే. దసరాదిబ్బలో పాత్రల స్వభావపోషణం సూక్ష్మముగా ఉన్నా అందులోని సంభాషణ

వ్యక్తులది కాదు. మాళ్లాదేవి మనస్సులే. ఈరచనలోని వస్తువు కవి భావతరంగము. సంభాషణారూపాన్ని వెలిసిందంతే. 'చక్రవాక మిథునం' లో గాఢాంధకారం; కీచురాళ్లమోత; వరదలతో పరవళ్ళుతొక్కే గోదావరి హోరు; మిణుగురుల మెరుపులు; చక్రవాకి ఇటు, చక్రవాకం అటు, వాటి గాఢమైన ఆవేదన; ఇదీ వస్తువు. ఈ చక్రవాక మిథునం వెనక జీవేశ్వరు లున్నారనుకోవచ్చును. "చక్రవాక మిథునం నాటికారూపంలో నున్న ఒక ఉత్కృష్టమైన వచనఖండకావ్యం". దీని సౌందర్యంకూడా మానసికమే. ఇందులోని ఊహాల అందం వర్ణనాతీతం. పాత్రలు రెండూ చరపాత్రలు కాక స్థిరపాత్రలే యైనా ఈస్థైర్యానికి, ఈ కాగిచలారిన మనస్తత్వానికి వెనక ఎంత అనుభవం వుందో గోచరిస్తుంది. చిత్రకారుడిలాగు వర్ణనలలో రేఖ రేఖా, వంపు వంపూ, ఛాయ ఛాయా దిద్ది తీరుస్తారు దీక్షితులుగారు. 'వరూథిని'లో వరూథిని ప్రేమని తిరస్కరించడంలో ప్రవరుడు వదిలేసుకున్న బహు రత్నద్యుతి మేదురోదర దరీభాగాలే కాక అనేక దివ్యసుందర ప్రదేశాలూ, అలౌకి కానుభవాలూ చాలా ఉన్నాయనీ, వరూథినికి పెద్దనగారు వర్ణించిన సౌందర్యానికి తోడు, హృదయం, శాపానుగ్రహశక్తులూ ఉన్నాయనీ, "మానవ జీవితానికి మృత్యువుమేర : అమరుల జీవితానికి ఆనందము పరమావధి కాన దేవమానవులకు సంబంధం పొసగద"ని వ్యాఖ్యానించారు ఇందులో కూడా ప్రవర వరూథిను లిద్దరూ స్థిరపాత్రలే. ఇది నాటిక అనడంకంటె ఊహాసంభాషణ అనడమే బాగుం టుంది. కాని దీనిలో దృశ్యాలుకూడా విరివిగా ఉన్నాయి. వరూథినిని చేరబోయే మబ్బులూ, జింకపిల్లలూ, వరూథిని దీర్ఘకేశపాశమూ కనబడతాయి మనకి. పెద్దన గారి రచనలో హిమాలయం పేరే కాని మంచు కనబడదు. తుంగభద్ర కొండల్నీ ఆ కొండలమీంది అడవుల్నీ హిమాలయాలని పేరుపెట్టి వర్ణించారా అనిపిస్తుంది పెద్దనగారు. దీక్షితులుగారి హిమాలయాలు హిమ ఆలయాలే. నాటిక అంతా చక్కని వ్యావహారిక భాషలో వ్రాశారు.

'రేణుక'లో ఇరవైయొక్కమారు దండయాత్ర చేసే గమనశక్తీ, క్షాత్రమూ బ్రహ్మర్షి కుమారుడికెలా వచ్చాయి అనే ప్రశ్నకి, జమదగ్ని ఆకర్ణాంతంగా లాగి వదిలే బాణాలను తరిమిపట్టుకునే రేణుకాదేవి గమన వేగం జవాబు చెప్తుతుంది. నాటిక రేణుకాదేవి అలసిపోయి జమదగ్ని చేతుల్లో వాలడంతో పూర్తి అయ్యుండవల సింది. కాని పొడిగింది. సూర్యుడు ప్రవేశించాడు, ఏముకేముటో సంభాషణ పెరి గింది. ఇంతవరకు ధ్వనించిన స్వర్గీయ గానంలో అపశ్రుతి మోగింది. నాటిక అదో లాగ సాంతమైంది. పై రెండు నాటికలలోనూ మానసత్వమే ముఖ్యంగా కినపడితే, దీనిలో కొంత మానవత్వం కనిపిస్తుంది. ఈ నాటిక మట్టుకు పూర్తిగా దృశ్యమే. సంభాషణమాత్రం సాగిపోయింది. ఒకపుట తగ్గించేయవచ్చు. నగిషీపని శ్రద్ధగా చేయలేదు ఈ నాటికలో. తెలుగుకూడా పదహారణాల తెలుగుకాదు. "ధర్మసంస్థాప నాన్ని 'చేసే,' జీవితమున పరమావధి, బాణమును కూడా" మొదలైనవున్నాయి. శ్రద్ధ తీసుకోనట్లు లెక్కలో కూడా తెలుస్తోంది. ఏదమూడో బాణం రెండుమార్లు వెళ్లింది.

శర్మిష్ఠలో నాటకత్వం కనబడుతుంది. అది భూలోకంలో కథ. నాటిక వ్యాఖ్యాన రూపకం. పురాణాల ఇరుకుల్లో మరుగుపడ్డ వింత విషయాలకు కవి వ్యాఖ్యానం చేశారు.

పూరువు యవ్వనం గ్రహించుకున్న యయాతిలో శర్మిష్ఠకు ఎవరు కనపడతారు? పూరువేకాదూ. అందుచేతనే యయాతి తన దగ్గిరికి వస్తే శర్మిష్ఠ అంటుంది. "నీ దేహము యయాతిది. నీ మనస్సు యయాతిది. నీ మనస్సును పురికొల్పే యవ్వనం నా కొడుకుది. కనక నా కొడుకు యవ్వనాన్ని అనుభవించేటంత దుర్నీ తికి నేను ఒడంబడను" ఇదే నాటికలోని వ్యాఖ్యానం. దీనిలో పూరువు పరివేదనం, శర్మిష్ఠ ఉపాలంభనం రెండే రంగాలు. "యయాతి కృతఘ్నుడు కాడు" అనే యయాతి మాటల వెనుకనే దేవయాని నవ్వు తెరలోనుంచి వినిపించారు. నాటి

కలో దేవయాని ప్రవేశించనే లేదు. దేవయాని నవ్వినట్లు ప్రేక్షకుల కెలాగు తెలియడం? దేవయానికథ మన కప్పటికే తెలిసి ఉందనుకుని ఈ రెండురంగాలూ రచించబడ్డాయి. కనక ఈ రచనకి పరిపూర్ణత్వము లేదు. అందుకని దీనిని నాటికా ఖండమంటున్నాను. పైని చెప్పినట్లు పురాణాల్లోని ఇరుకువీథుల్లో ప్రవేశించి వింత విషయాలు బైటపెట్టే వ్యాఖ్యానాభిలాషే ఇందులో అవుపడుతుంది. ఈ రచనలో ఊహాసంభాషణా వాసన విసర్జించి నాటిక నాటకత్వాన్ని పెంచుకుంది.

'శ్రీకృష్ణుడు'లో దీక్షితులుగారి కళ పరిణతి కొచ్చింది. ఈ నాటికలో రంగాలు మూడు. ప్రవేశ నిష్క్రమణాలున్నాయి, పాత్రోన్మీలనముంది, చివరిదాకా కౌతుకం లాగుతుంది చదువరిని. నాటిక తిన్నగా జోరుగానడిచింది చివరివరకు. గోపికల ఇళ్లల్లో నానాఅల్లరీ చేశేశి కృష్ణుడు వంటినిండా జిడ్డుతో, గట్టిగా పొంగినట్లున్న బొజ్జతో పెదిమెలమీద నెత్తురు చారలతో అమ్మదగ్గిరికి వచ్చేశాడు. ఆవిడ ఇవన్నీ ఏమిటంటే కథ అల్లుతాడు. పెద్దావుపాలు తువ్వాయి తాగినట్లు తాగేననీ, ఆవు ఒళ్ళంతా నాకిందనీ......అన్నిటికీ జవాబు వచ్చేటట్లు. అమ్మ యిచ్చిన లక్కపిడత లతో అరుగుమీద కూర్చుని ఆడుకోడానికి భయమట! (గోపికలు వస్తారుమరి) ఈ సమయంలో గోపికలు తలుపు కొడతారు. ఇది రెండోరంగం. కృష్ణుడు మూల నక్కతాడు. అతణ్ణి మెల్లిగా పట్టుకుని ఎత్తుకొని మెల్లిగా తలుపుతీస్తుంది. ఒంటి జిడ్డూ, పెదవిమీది చారలూ ఏముటో అడగమంటారు. గోపికపెదవి కొరికేడనీ, పాలు తిరగబోశాడనీ చెప్తారు. కాదని బొంకులు చెప్తాడు కృష్ణుడు. వారి మాటలు నమ్మి కృష్ణుణ్ణి కట్టేయడానికి తాడు తేబోతుంది యశోద. ఇక్కణ్ణించి మూడోరంగం. యశోద వెళ్ళగానే కృష్ణుణ్ణి ఎత్తుకుని నలిపేస్తారు గోపికలు. రవికలు చిరుగుతాయి, జుట్లు రేగుతాయి, హారాలు తెగుతాయి. యశోదవచ్చి, నేరాలుమోపి శిక్షించవచ్చినవారు లాలించడం చూసి తెగనాడుతుంది. వారంతా వెళ్ళిపోతారు. యశోద వెయ్యోమారు మిరపకాయలు కృష్ణుడిచుట్టూ తిప్పుతుంది. 'శ్రీకృష్ణుడు' నాటికా ఖండంకాదు. పూర్తి నాటికే. దీనిలో చక్కని కథావస్తు

పరివర్తనముంది. దండించడానికని వచ్చినవారు, ముద్దులు పెట్టుకుపోతారు, నల్లగా జీడిగింజలా ఒళ్లూ, పెద్ద తామర రేకుల్లా కళ్లూ ఉన్న చిరిబొజ్జ కృష్ణమ్మని. ఇందులోని సంభాషణ సజీవం. బాలుర మనస్తత్వం భగవంతుడి తర్వాత దీక్షితులుగారికే ఎక్కువ తెలుసును. కృష్ణుణ్ణి రచించడంలో ఆవిజ్ఞానం పువ్వు పూచింది.

మూడు రంగాలుగా చెయ్యక ఒకే రంగంగా చేసి, సంభాషణ ఒక్క రవ్వ కుదించి, రంగానికీ రంగానికీ ఒక కాలవ తవ్వి, ఒక సెలయేరులాగ పరిగెత్తించియుంటే, నాటిక దీక్షితులుగారి చేతిలోనే పరిణతికి వచ్చిందందును. కృష్ణుడు ఇంటికి రావడం ఒక రంగం, గోపికలు నేరాలు చెప్పడం ఒక రంగం, ముద్దులు పెట్టుకోడం ఒక రంగం... చక్కని నాటిక చెడిపోయిందంటాను ఈ రంగ విభజనలో. దీక్షితులుగారికి తాపీ ఎక్కువ. అది కొంచెం కిందికి లాగింది. ఈ తాపీవల్లనే నాటిక దృశ్యగుణం పోయి శ్రవ్యగుణం వచ్చిందంటాను. ఇది రేడియో నాటికేమో అనిపించింది అప్పటికి మద్రాసు రేడియో లేకపోయినా. మధ్యమకాలంలో ఉండవలసిన నాటికని ప్రథమకాలంలోకి దించారు. అందువల్ల వేగం తగ్గింది. ఈ మందగతికి, పాత్రలగమనాభినయాలు మాటలతోనే చెప్పడం, ('ఈ మూలనక్కేవేమిరా నాయనా', పెదివి చూపవే గోపీ. 'అలా సిగ్గుపడతావేం' వంటి వాక్యాలతో) మరింత బరువైంది.

దీక్షితులుగారు వస్తు కల్పనలో పడినంత జాగ్రత్త భాషా కల్పనలో పడలేదు. నాటిక అంతా చక్కని జీవభాషలోనే రాశినా, 'ఆడుకుంటాను, ఆడు కొంటాను; తెచ్చుకొన్నావా ఏమిటి?; ఏమో అల్లరిచేశాడని అంటున్నారు ('అంటారు' అనడానికి) కాబోలు; రక్తాలొచ్చేటందుకు ('ఒచ్చేటట్లు' అనడానికి) ఎలా కొరికాడో; పిల్లవాడికి, పిల్లాడవని, పిల్లాణ్ణి; చెబతాను చెప్పుతాను'; లాంటివి వచ్చాయి. రేణుకలో 'ఇంతత్వరగా ఎలా తెచ్చావు?' అని అడగడానికి బదులు 'ఇంతత్వరగా తెచ్చేవేమి?' అని పించారు. ఇవి లేకుంటే ముక్కుపాటివారూ ('ముక్కుబడి'లో) వీరూ జీవభాషా సామ్రాట్టు లనిపించుకుందురంటాను.

ఈ రీతిగా ఊహాసంభావనలో నాటిక పదునైన సంభావన అలవర్చుకుని, చరిత్రలో ప్రవేశించి నాటికాత్వం గుర్తించుకుని, పాత్రోన్మీలనం (వ్యాఖ్యానమనే) ఆదర్శం పెంచుకుని నాటికా ఖండమై, శ్రీకృష్ణుడులో నాటిక అయింది. సుబ్రహ్మణ్య శాస్త్రి దీక్షితులుగార్లు ఇంతవరకు తెచ్చిన ఊపు పలువురు నాటికా రచయితలందుకున్నారు, నలుముఖాలా పరువులెత్తేరు. వారి పరువులు పరీక్షిద్దాం ముందుముందు.

పాడుపోయిన ఊరు

ఇది అంతా యిసుక
చరిత్రలో ఒక మసక!
ఇది నశించిన ఒక గ్రామం
నిశ్వసించే మహా శ్మశానం.

ప్రాణం గల పాడే వేణువు లీ యిసుక రేణువులు
ఈ భూమి క్రింద మేడలు మిద్దెలు కదలే విచిత్ర శబ్దం
ఈ గాలిలోన పూర్వుల శరీరాల స్పర్శల చైతల్యం
గత మంతా తోలుబొమ్మలాడుకొన్న ఒక తెర!
వర్తమానం నీ కన్నుల కప్పిన ఒక పొర!

కారిపోయే యిల్లులా జీవితం జరుగుతుంది
ఒక వెగటు ఏదో నన్ను ఆవరించుకొంది
కాలం పాడు నుయ్యిలా నా కన్నులకు కనపడింది.

'గోరువంకలు'

ఒక సంధ్యారుణ పాదపద్మ నగరిఁ ఓహో సుతారంపు తా
రక నర్తించెను; దిగ్దిశావరణ పర్యంతమ్ము లేజీకటుల్
కికురింపఁ దరహాసపుం తళతళల్ క్రీనీడలే జూపు దీ
పిక లందిచ్చు ప్రభాప్రతోళికల రావే చంద్రరేఖాసఖీ!

మణులను ఓడపై దిగిచి మైకముతో నడిపింతు నీరధిం
దౌణకుచు. దూర దూరముల దోసిలి యొగ్గిన ఆకసంపు లో
గనుమల కేగి నాకొరకు కట్టిన మెత్తని చల్వరాల య
వ్వనళ్ళు కుటీరమందు తలవాల్తును కాలపు వెన్న పాన్పుపై.

నీలాలై ప్రవహించు కాల మను మున్నీరుం దరంగాల యీ
కేళీ నిష్కుటమందు క్రొందెరలుగా కీలించి నిర్మించి నా
లీలా గీతశ్రు మల్లెపూబొదలలో లేజవ్వనీ, నిన్ను ని
వ్వాళింతుఁ నునువెచ్చ కౌగిళులలో శ్వాసించి వాసింపగా.

శ్రావణ శార్వరీ జలద జాలకముల్ కదలించి వర్షపుం
ద్రోవల, రమ్ము, నీ ప్రణయ రూషిత విద్యు దనూన వల్లరీ
భావము దోప ; నీ చికురపాళిక సంపగి తావిలోన ని
ద్రావశవర్తినై మెలగి రాజిలెదఁ మదిరామదోన్నతిఁ.

అందపు ఛిన్ని సిగ్గు తడియారని తారుణ కుంకుమ ప్రభల్
విం దొనరించు నీ మిసిమి విల్చిన చెక్కిలివోలె నాకు ఈ
సుందర సంధ్యవేళ పొడచూపును వంపుల ఆకసమ్ము, ఓ
స్పందిత చంద్రమః ప్రభ, సుధానన రమ్మిక మోహ గీతివై.

ఏల రహస్య తీరముల నీ తొలి కోర్కెల పూల దుప్పటీ
మేలి ముసుంగు టంచులను ముద్దిడు చూపుల నీ విహార లీ
లాలస మూర్ఛనల్, రమణి రమ్మిక యీ మునిమాపు త్రోవ, పై
వ్రాలిన తార తోరణపు పంక్తుల నా శశికాంత వాటికిఁ.

ప్రతిదిన మేగె బాష్పకణ భార నిరోధ దిశాంత నేత్రమై
ప్రతి వకుళమ్ము రాలె శిశిరాప్తి దళాంత గళోచ్ఛనాదమై
ప్రతి తెలివేకువం దొలగి రాలెను తారలు గాజు పూసలై
అతివ, కదల్చ కీ వయసు టద్దపు మేడ పునాది గోడలఁ.

'టులాఁ'

అది నవంబరు పన్రెండవ తేదీ!
దెబ్బ తిన్న ఫ్రెంచి దేశం విప్పిచూపిన
రక్తపు మరకల ఛాతీ!
మండి మండి దావబమై సాగే రేగే
—అవజ్ఞా జ్యోతీ!

నిశ్శబ్దపు మెత్తని పరుపుల పైన
నిదురించినది పట్టణ మంతా,
కొండ చివర ఎర్రని నక్షత్రం
రాలి పడింది సముద్రపు నీలంలో,
చీకటి కుంపటిలో అస్పృష్ట భవిష్యత్తు
రాజుకొంటూన్నది రివ్వలు రవ్వలై,
చుక్కలు చుక్కలై!

నాలుగు కొట్టింది చర్చి గంట!
నిదురించే టులాఁ పట్టణపు గుండెలో
పగిలింది జర్మఁ శతఘ్ని.
శత్రు యంత్రాల లోహ చక్రాల రాపిడిలో
మూల్గినవి ఫ్రెంచిభూములలోని
అవమానపు నెరదలు.

చలువరాల గోరీలలో
మాతృ ధాత్రి మట్టి పొరలలో
స్వతంత్ర మృత వీరుల గాలి గుండెలలో
తిరిగి స్పందించినవి వేడి రక్తపు సిరలు!
టులాఁ నౌకాశ్రయమ్ములో
స్వతంత్ర పతాకలతో
బారులు తీర్చిన ఫ్రెంచి నౌకాదళ సహస్రమ్ములలో
నిదురలేక,
శత్రు ఆగమనాగమనికతో,
నిలిచినవి కర్ణధారుల జాగ్రతా సింహాలు
విదిలిస్తూ శౌర్యపు పట్టుజూలు!
కదలిస్తూ క్రోధపు కత్తులపంజా!

పగిలినవి ఉక్కుకోటలు బాంబుల దెబ్బలకి,
పొగిలింది అసహాయమై మాతృదేశ గౌరవం,
కదిలింది క్లాంతమై ప్రజల కన్నులలో
ఎరుపుజీరల చాలు!

టులాఁ ప్రభుత్వ సౌధమ్ముపై రెపరెప లాడింది
—ఊహా స్వస్తిక.

అనిశ్చయం, ఆక్రందనం, ఆదర్శం
అంతరాంతర మనస్సులలో ఢీకొన్నవి.
నెపోలియఁ, రుసో, వాల్టెయిర్,
పీనహోర్, జోఁకన్యల -
ప్రార్థనా ముకుళిత నేత్ర నిర్ముక్త పవిత్ర జలమ్ములు
తడి సేసినవి నౌకారక్షకుల
తళుకుల మెరపు కొసలు!
జీవితపు లోతులలో
ఒక మహాశయ మణి కీర వచస్సు
విరిసినది అభయ దివ్య ఛత్రమై!.

ఆ సమయంలో,
డార్లఁ పెటెయిఁ లావెల్ నాయకులంతా

అధికారపు చీకటిలో గొంతు విరిగిన
గుడ్లగూబలు !
'నాజీ నాజీ నాజీ నరహంతకు'లను కేకలు
సముద్రపు గుండెలో తిమింగలముల వలె
తిరిగినవి !
'జై ఫ్రాన్సు జై'అను ధ్వానం దెసలలో వెలుగై
విరిసినది !

యుద్ధ నౌకాంతర్భాగములలో తుపాకిమందును
స్వహస్తాలతో అంటించారు నౌకారక్షకులు !
ఒక్కొక్కటి ఒక్కొక్కటి యుద్ధ నౌకలు
ఒరగి ఒరగి, సముద్రనిర్నిద్ర జలతరంగభుజంగ
పరీరంభమ్ములలో సురిగిపోయినవి

బలి యిచ్చిన వీరుల ప్రాణదీప్తి
జలధి గర్భాంతరిత బడబాగ్నిలో కలసి
శిఖల పరచి, నాలికల తెరచి నాట్యమాడింది !
టులాన్ భూమిమీద ప్రజల వేడి కన్నీళ్ల వాన
వాగులై పారింది.

ఓహో టులాన్ ఓహో టులాన్,
మరపురాని స్మృతివై ఒదిగి పొమ్ము
మా బ్రతుకులలో కారుచిచ్చు కలవై, అలవై !

ఈ రాత్రి

ఈ రాత్రి
బరువుగా బరువుగా
బ్రతుకు కీళ్ల సంధులలోని
చీకటి కరేల్మని కదలింది.

ఈ రాత్రి
నిలువునా నిలువునా
పరచుకొని అవని తన గుండె నెరదలలోని
వింత బాధల విప్పి చూపింది.

ఈ రాత్రి
మూగతో, సైగతో,
మేఁకొన్న నిరాశతో మాటలాడాను.

ఓ జీవితాంతరిత జ్యోతి ! సౌందర్య హేతి !
ఎపుడు ఖండిస్తావు ఈ నాగరికతానిశి
క్రుళ్లిన శిరస్సు !
ఎపుడు పండిస్తావు ఈ గడ్డలో
శాంతి దయా మహస్సు !

'ఛాయ'

కుంచుకొనిన నా జీవితపు కొసలు
కోమలతావక నీరవ స్పర్శ
విరిసినవి స్ఫటిక పద్మదళమ్ములై
మెరసినవి విద్యుదాతప ఛత్రమ్ములై।

నిదుర మునిగిన నా కనుంగవలపై
నీ అందెల రవళి రవళించు పదము
మెల్లమెల్ల మెత్తగా నడిచిందిలే।
కలల అలల వంపుల కదలించిందిలే।

ఒక తీయదనపు వెన్నెలవాగు
భృకుటి చీకటిలోయ ప్రవహించెలే।

రంగు రంగుల చెరగుల విదలించి
సంజ నవ్విందిలే।

స్మృతి నౌక వెలుగు మున్నీట
ఆడుతూ కదలిందిలే।

'బాలగంగాధర తిలక్'

"కవి" సన్మానము

౨౭—౧౨—౧౯౪౨.

అది మార్గశిర బహుళ పంచమి ఆదివారం. ఉదయం ఎనిమిది గంటలకు సభ్యులూ, ప్రేక్షకులూ సభా భవనము ప్రవేశించేసరికి రంగాలంకరణ ప్రయత్నము పూర్తికావస్తున్నది. శ్రీ విస్సా అప్పారావుపంతులు గారు వచ్చీ రావడములోనే అన్నారు—పూల పాన్పు, అగరు ధూపము, దీపావళి ఇవన్నీ ఏమిటి? ఇదివర కిక్కడ ఏదయినా శృంగార కార్యకలాపము జరిగిందా లేక జరగబోయేఉత్సవానికి రంగాలంకర ణమా? అని. వారు చూస్తూ ఉండగానే పది నిమిషాలలో అన్నీ సిద్ధ మయినాయి: వేదిక నిండేలాగున రత్న కంబళములు; కవికి తల్పు; రకరకాల పువ్వులతో, చివురుటాకులతో, పాదిగెలతో వేదిక నిండి పోయింది; పచ్చని తోరణాలు వేలాడుతున్నాయి. సుగంధ ద్రవ్యాల ఘుమఘుమలు అంతటా క్రమ్ముకొంటున్నాయి. సభాభవనము స్త్రీ పురుషులతో నిండిపోయింది. సభ్యులు నిండు వేడుకతో ఉత్సవారంభముకోసము నిరీక్షిస్తూ ఉండగా, కవికుమారులు పూలు చల్లుతూ పన్నీరు చిలికిస్తూ త్రోవ చూపి ముందు నడవగా, పూలబాటలో కవిగారు కార్యదర్శితో కలిసి సభాభవన ముఖద్వారాన ప్రవేశించి వస్తున్నారు. సభ్యులు సగౌరవంగా సకౌతుకంగా లేచి దారి యిచ్చారు. వేదికను సమీ పించేసరికి అధ్యక్షులు ఎదురు వచ్చి వేదుకవారికి తల్పుమీద అగ్రాసన మిచ్చి ఆసీనుల్ని చేశారు.

శ్రీ కురుగంటి సీతారామయ్యగారి వేదాశీర్వచనముతో కార్యక్రమ మారంభమయింది. శ్రీ త్రిపురారిభట్ల వీరరాఘవస్వామిగారు పరమశివ స్తోత్రము చేశారు. శ్రీ మాధవపెద్ది కవి సరస్వతీ స్తోత్రము చేశారు. శ్రీ ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారు ఆంధ్రకవి స్తోత్రం ఆలపించారు.

కవిగారి ముఖాన బాల పసుపు తిలక ముంచినది.

పుష్పబాల పుష్ప ఫల పత్రము లందిచ్చినది.

పరిషత్కార్యదర్శి కవిగారిని పుష్పమాలాలంకృతులనుచేసి నూతనవస్త్రము లర్పించి సన్మానపత్రము సమర్పించారు.

సన్మానపత్రము

సోదరా! వృద్ధ గౌతమి నిద్రలో కలవరించినది. మీ మనస్సు మేలుకొన్నది. మీ కోకిలగళము విప్పారినది. మధుర మధురముగా ఆలపించి గౌతమీకోకిల అని మిత్రులు పెట్టినపేరు సార్థకము చేసుకొన్నారు.

అమావాస్యకు అంధకారం: మీ హృదయానికి ఆవేదన. ఆకాశములో తారకలు మెరిసినవి; మీ "దీపావళి" కళికలు విరిసినవి. మీ జన్మ జన్మాల తపఃఫలము పండినది; మీ "ఆరాధన" ఫలించినది; "ముక్తావళి" వెలసినది.

ఆమని వేడిపొంగులు నిత్య నూతనముగా నిలిపి ఉంచుకొనే సుమజన్మము మీది. నిత్య వసంతము కల్పిస్తూ మీ కోకిలకంఠం అనవరతమూ వినిపించండి! మీ భావసౌరభాలతో తన్మయింప జేయండి.

నవ్య సాహిత్య పరిషత్తు

*

దీపావళి దీపికలల్లో
నీ పాటలు వెలిగించావోయ్!
ఆపదలు జయించే ఓపిక
తో కవితను పోషించావోయ్!
'కోకికవి!' అంటే లోకం,
నా శోకం నా దన్నావోయ్;
లోకానికి దీపావళినే
నీ కానుక నర్పించావోయ్!
ఆకాశం అంతర్యంలో
అమావాస్య చీకటి హృదిలో

ఆకలితో అరిచే కైతకు
ఆహారము నీవైనావోయ్!
హాలాహల మంతా నీదై
అమృతోక్తులవన్నీ మావై,
వగ నిట్టూరుపు లోలో దాచుకు,
నగవొలికే కవి వైనావోయ్!
గోదావరి కోకిలమా! నీ
వేదన కిది ఆమని దినమోయ్!
వేదనతో వెలిగే పాటల
మాధుర్యము చిలికి పాడవోయ్!

విశ్వేశ్వరరావు

"కవి" సనానము

సమ్మాన సందర్భ పురస్సర ప్రశస్తి

రసమూర్తీ! నీ గీతి విశ్వమంతా నిండి, తొలుకాడి భావనావధి నెరుంగక, మిన్ను ముట్టి, ముసి ముసి నవ్వు నొలుకబోసికొను పరీవాహ శోభా తరంగ గాన మాధ్వీకమై కోకిలాశతమ్ములను గొంతెత్తించినది.

గౌతమీ కోకిలా! భవదీయ మంజుల బాల పల్లవ మనోజ్ఞం బైన కుహూకుహూరవళి రస విరహుల కుద్దీపనమై తెలుగు తోట సర్వవేళా వసంతము తెచ్చుకొని పుష్పించినది.

వాగ్మీ! మీ పలుపబడి సాహిత్య సరస్వతీ కచ్ఛపీ తంత్రీస్వన స్వచ్ఛతా పరిష్వక్త బృందావన మందానిలమై, గంగా భోగవతీ తరంగిణీ రాగ సమైక్యము నందగించుచున్నది.

యశస్వీ! విద్యుల్లతావిగ్రహ త్వదీయ కవితాకుమారి హర్లీసక నృత్తవృత్తయై ప్రేమారాధన మొనర్చు సహృదయ దహరాకాశమున దీపావళీ మోహనములు వెలిగించినది.

ఆనంద నిధీ! నీ యర్చించిన భావసరస్వతి సనూపుర కింకిణీ రవళి నీలో నిందుకొన్న మనీష నొరసికొని, తద్ధ్వని కావ్య ప్రపంచమున అప్సరోంగనా గాన విన్యాసమును రేకెత్తించినది.

అట్టి మీకు మా కుసుమాంజలులు.

నవ్య కళా పరిషత్



ఈ మధూదయ వేళ
ఎవ రాలపింతురో!
ఏదొ పుంస్కోకిల
మెచటనో పాడునది!

ఓ తెల్గు సత్కవీ
ఓ దివ్య స్వాప్నికా
ఏది నీ మధుమూర్తి
ఏది నీ గానమ్ము

ఆలపింపుము
రసజ్ఞానీక మందిచ్చు
ఈ లేత పల్లవా
లివిగో రసార్ణవా!

ఆనంద భావ విద్యా
వేది వేదులా
ఈ వందనోల్లాస
మింత నీ దగునోయి!

ఆంజనేయప్రసాద్

ప్రశంసాపత్రము

ఓ మహాకవీ! మీకు నమస్కారాలయ్యా! మాది హైద్రాబాదు. అక్కడ తీయటి ఉడుకురక్తం పొంగే యువకులం కొందరం మీ మీ పెద్దల ఆశీర్వచనం పొందడానికి తాహత్తును సంపాదించుకోవలెనని ఒక చిన్న సమితిని ఏర్పాటు చేసికొని ఇప్పుడే విడివిడిన త్రపాముగ్ధ కంఠాలతో సన్నని ఎలుగుల గీతికలు పాడుకొంటున్నాము. మహోన్నతాలైన మీ కావ్యనక్షత్రములు మాకెప్పుడూ దారి చూపుతున్నవి. మా నమస్కారాలు మీకు కానుకగా అర్పిస్తూ మీ ఆశీర్వచనాల్ని ఆశిస్తున్నాము.

సాధన సమితి

సన్మానపత్రము

"గౌతమీ కోకిలా!"

రసిక రసాల కిసలయాంజలు లందుకో! ఈ పల్లవ రాగ రక్తిమలోని హృదయానురాగ కాశ్మీర రేఖతో తీర్చుకో తిలకం!

నీ విచ్చిన అమూల్య గీతామృతానికి ఈ మేమిచ్చే అమూల్య పత్రోపహారమే సరిపెట్టుకో!

ఉడుతా రాముల తలచుకో!

అమ్మ గౌతమి నీ మగ్గుపెట్టింది! నందన మకరందముతోనో! ఆనంద సౌందర్యముతోనో గాని— ఓహో వనప్రియా తేనె సోనలయ్యా నీ పాటలు! ఓహో ఓహో పాడుకో! హాయిగా పాడుకో! ఆంధ్ర శారద ప్రేమ లేఖకో!

మా హృదయపూర్వక ప్రణుతు లందుకో!

సాహిత్య మండలి

శ్రీ సామవేదం జానకిరామశర్మగారీ సన్మానపత్రముతోపాటు నూతన వస్త్రములు సమర్పించారు.

మజిలీస్-ఇ-ఒమర్ ఖయ్యాం కార్యదర్శి కవిగారికి ఆసవపాత్రి అందిచ్చారు. హుక్కా గొట్టము నోట చేర్చారు. అత్తరూ మంచి గంధమూ పూసి పన్నీరు చల్లి పుష్పహారము వేసి (వధూటి లేదు) సన్మానపత్రము సమర్పించారు.

మజిలీస్-ఇ-ఒమర్ ఖయ్యాం

శ్రీ శివశంకరశాస్త్రి
అధ్యక్షులు

శ్రీ శివరామరావు
కార్యదర్శి

శ్రీ వేదుల సత్యనారాయణ శాస్త్రిజీకి
దాఖల్ చేసే కవర్‌బంద్

శాయర్! మీరు గౌతమీ కోకిల; మీ కంఠస్వనం సాహిత్య చమన్‌కి హుషార్. మీరు కవులు; మీ దీపావళి సారస్వత మహల్‌లో నూర్‌జమా. మీరు విద్వాంసులు; మీ సుధావీచి వాఙ్మయానికి నజ్‌రానా.

హజరత్! మీరు నాటక కర్తలు; మీ 'రాణా ప్రతాప్' నాటక రంగానికి సితారా. మీరు కథకులు; మీ కల్పనలు నాటక రంగానికి బేహూష్. మీరు తత్త్వవేత్తలు! మీ 'ముక్తావళి' మా ఒమర్ ఖయ్యాంకి దిల్‌ఖుష్.

భాయి సాబ్! మీరు పండితులే కాదు; నౌ జవాన్ కూడా.

"నాకు తలంపు లేదు లలనా జనతా కబరీభరైక భూ
షాకలనన్; వధూ మృదు భుజాంతర తల్ప కుచోపగూహ వి
బ్బోకములన్, సతీ సిత కపోల గళత్ శ్రవణావతంస హే
వాకములన్, విలాసినుల పాపట చెందిరి కావి పూతలన్"

అంటారే? ఎందుకా బే ఖుషీ?

నిన్న అనేది గతించింది; రేపు అనేది ఉదయించనేలేదు. వాటి ఫికర్ మన కెందుకు? ఈ రోజే మనది. ఇప్పుడే మనకి మజా అంటుంది రుబాఈ.

మీమీద ఒమర్ ఖయ్యాంకీ దుఆ!

మజిలీస్-ఇ-ఒమర్ ఖయ్యాం
అధ్యక్షులు — సభ్యగణము.

ఆహ్వాన సంఘాధ్యక్షులు కవిగారికి శాలువ, ధోవతులు ఆశీస్సులతో అందించారు.

సంప్రదాయానుసారంగా సమ్మానించడం బాగుందని సభవారు తమ ఆమోదము మాటి మాటికీ ప్రకటించారు. కవిగారిని గూర్చి కవిపండితులు ప్రశంసావాక్యములు పలికినారు.

విశ్వనాథ సత్యనారాయణ

ఇది సుదినము. నేను నవ్యసాహిత్య పరిషత్తువారు గౌతమీకోకిల శ్రీ వేదుల సత్యనారాయణశాస్త్రి గారికి యింత వైభవముతో సన్మానము చేయటం నాకు చాలా యిష్టంగా వుంది. రాజులు, పౌరులు, సన్మానం చేసే తరహాలు వేరు. సాహిత్యపరిషత్తులు సన్మానంచేసే తరహా వేరు. గంధము, బుక్కాము, పూలు, అగరువత్తులు, తివాసీలు, అత్తరులు, హారతులు, ప్రశంసలు, వీటితో సన్మానం చేయటం, నవ్య సాహిత్యపరిషత్తు మాత్రమే చెయ్యగలదు. ఈ పరిషత్తు గడచిన ఒక వార్షికోత్సవములో మహాకవులు శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారికి రజతోత్సవం చేసింది. ఇప్పుడు వేదులవారికి సన్మానం చేస్తోంది. వేదుల విలక్షణమైన కవి. పద్యాలువ్రాసి, ఏవోభావాలు, వాటిల్లో పెట్టడం అందరు కవులూ చేసేదే. కాని, యీ చెయ్యటంలో ఒక్కొక్క కవి ఒక్కొక్కరీతిగా చేస్తాడు; ఒక్కొక్క భావం ఒక్కొక్క మోస్తరుగా ఉంటుంది. ప్రతిమాటా మధురంగా ఉండాలని ఒకకవి. మెత్తగా ఉండాలని ఒక కవి. అర్థవంతంగా ఉండాలని ఒక కవి. ఇట్లా భిన్నభిన్నంగా ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. కొందరిలో ఈ ప్రయత్నాలు సాఫల్యం పొందుతాయి. అయితే, ఇంతమంది కవులలో, నిజంగా కవిశబ్దవాచ్యుడెవరు? నా ఉద్దేశంలో మధురంగా వ్రాసేవాడు. John Stuart Blackie అని 18వ శతాబ్దంలో Scotland లో ఉన్న Greek భాషా పండితులలో పరమోత్తముడు: ఆయన అన్నాడు గదా ఒకచోట "ఒక అర్థంలో, ఆ అర్థంయొక్క సంపూర్ణ విషయంలో, టాంజీరు, పోపు కవులు. ఇంకొక అర్థంలో, దాని సంపూర్ణవిషయంలో,. Dante, Shakespear, Philosophers". 'Philosopher' అన్నమాటకి నేను తెలుగు చెప్పలేను — తెలుగు లేదు. వేదాంతి కాదు, తాత్వికుడూ కాదు. అది ఒక మాట. ఈ మాటని, అనేకమంది, అనేక భాషలలో పులుముడు అర్థాలతో వాడుతూ ఉంటారని ఎవరో ఒక గొప్ప పాశ్చాత్య గ్రంథకర్తయే వ్రాసినాడు.

ఈ పద్ధతిగా చూస్తే, నన్నయ్య, పెద్దనలు కవులైనంతగా, తిక్కన్న, మొదలైనవారు కాకపోవచ్చును. పద్యరచనలో పరమమైన సౌందర్యం తెచ్చినవాడే కవి, అని ఆ Blackie ఉద్దేశం అయినట్లు తెలుస్తుంది. దీని ప్రకారం శ్రీ వేదుల సత్యనారాయణశాస్త్రిగారు 'కవి' అన్న శబ్దానికి తగినంతగా ఎవ్వరూ తగరు. ఆయన రచనలో నిది వడబోసిన తియ్యదనం. ప్రతి శబ్దానికీ ఏదో ఒకగుణం ఉంటుంది. ఓజస్సో, మాధుర్యమో, ప్రసాదమో, ఈ మొదలైన పదిగుణాలలో ఏదో ఒకటి ఉంటుంది. మాధుర్యమే గుణంగా కల శబ్దాలను ఏరియో, లేకపోతే ఆ గుణప్రాచుర్యం కలిగేటట్లో ఒకానొక కవి

చెయ్యగలడు. ఇది పూర్వజన్మ సంస్కారంచేత కలిగే శక్తి. ఆ సంస్కారం శ్రీ వేదులకు సమృద్ధిగా ఉంది. ఈ గుణం బహుధా సంతరించే నేర్పు, శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారు, శ్రీ దువ్వూరి రామిరెడ్డిగారు, శ్రీ జాషువా కవిగారు మొదలైనవారియందు కనపిస్తున్నది. ఈ శక్తే, నేటికాలపు కవులల్లో, చాలమందియందు కనిపిస్తోంది. కాని, ప్రకటనలో చాలా తారతమ్యాలు ఉంటాయి. రచనలో గుణసాంకర్యంకూడా ఉంటుంది. కాని యీ మాధుర్యం ప్రధానంగా కనిపిస్తూంటుంది. అది శ్రీ వేదులలో కనిపించినంత మధుర మధురంగా మరియొకచోట లేదనే నా ఉద్దేశం. తిక్కన్నగారి రచన, వారి అనుయాయుల రచనే, దీనికి చాలా దూరమైన విషయాలు. నేను మాట్లాడేది అచ్చంగా శబ్దగత గుణవిషయం. అర్థగత మాధుర్యాది విషయాలు కాక. వామనవతిష్ఠిన రీతిసాదము ఇదేనేమో అని నేననుకుంటాను. ఆలంకారిక సూత్రగత శబ్దాలగట్టి ఏవో ఏవోగా ఎంతైనా చెప్పవచ్చు అపును అనవచ్చు; కాదనవచ్చు. కాని, మానసికవేద్యమై, తాత్పర్యభూతమైన విషయం యిదే అనుకుంటాను. ఈరీతిమార్గగాములైన కవుల రచనలయందే లోకం చాలా ఆదరం చూపించటం కూడా కనిపిస్తూ ఉన్నది. నిజమే! మధురమైనదానిచేత ఎవ రాకర్షింపబడరు?

భావరాజు వెంకట కృష్ణారావు

మిత్రులారా!

నా మిత్రుడు శ్రీ వేదుల సత్యనారాయణశాస్త్రికి ఇట్టి సన్మానమహోత్సవము జరుగుట నాకు మిక్కిలి సంతోషకరమైన విషయము. నా సంతోషమునకు నలుగురికీ ఉన్న కారణములు గాక ప్రత్యేకకారణములు రెండు ఉన్నవి. ఇపుడు నేను శ్రీ శాస్త్రిగారి కవితాప్రాశస్త్యమును ప్రశంసచేయుటకు పూనుకోను. ఆతని కవిత్వమును మెచ్చుకొనుటకు అందలి గుణాతిశయములను ఉగ్గడించి, మెరుగురాతిమీద గీటు గీచి ప్రకటించగల రసజ్ఞులు మిత్రులనేకమంది ఉన్నారు; శాస్త్రిగారి జీవితముతో నాకు గల పరిచయము సూచించి, ఆతని కవిత్వానికీ ఆతని జీవితానికీ గల పరస్పరానుబంధము చూపించడానికి ప్రయత్నము చేస్తాను.

ఇప్పటికి సరిగా ఇరవై పాతికేండ్లకు పైమాట. ఒకనాడు నేను కవిరాజ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారింటికి — అప్పటి కింకా ఆయన కవిసార్వభౌములు కాలేదు — ఏదో పనిమీద వెళ్ళినాను. ఆయనతో ప్రసంగిస్తూ ఒక అరగంట అక్కడ ఉండిపోయినాను. అక్కడ ఒక మూల ఏదో గొణుగుకుంటూ, చూడడానికి వికృతంగా — కాదు వింతగా కానుపించే బాలుడొకడు పుస్తకములు చేతిలో పట్టుకొని, తల వంచుకొని, ఎవరో కోపగిస్తే అలిగినట్లున్న వైఖరితో కానిపించినాడు. నా కెందుకో ఆ వ్యక్తిని

చూచేసరికి ఒక వింతభావము, ఇత డెవరా అన్న భావము, తోచి "యీ కుర్రవా డెవడండీ ?" అని శ్రీ కవిరాజుగారిని అడిగినాను. సహజమైన వాత్సల్యంతో శాస్త్రిలుగారు—"ఇతగాడా అండి—చదువుకొనడానికి వచ్చాడు. చక్కగా కవిత్వం చెప్తాడు. కాని ఇంకా అప్పుడే తొందరపడి కవిత్వం చెప్పవద్దన్నాను; ఇంకా కొంత కాలం గ్రంథాలు గురుముఖంగా చదవాలని నా అభిలాష. నా మాట లెక్కపెట్టకుండా ఉన్నాడు బుద్ధిహీనుడు" అంటూ వాత్సల్యంవల్ల అప్రయత్నంగా వచ్చే గురుగాంభీర్యముతో నాకు ఆ కుర్రవాడి పేరయినా చెప్పకుండా, పరిచయం కలిగించారు. నేను అక్కడ కూర్చున్నంతసేపూ ఆ కుర్రవానివైపే చూస్తూఉన్నాను—అతడుమాత్రం తల యెత్తి చూడలేదు. అభిమానం ఒకటి అతనికి ముసుగులో కప్పబడి ఉన్నట్లు నాకు గోచరించింది.

మరికొంత కాలానికి, మా యింటికి, నే నప్పటి కింకా ప్లీడరువృత్తిలో ప్రవేశించినానో లేదో జ్ఞాపకం రావడంలేదు, మిత్రుడు శ్రీ చింతా దీక్షితులుగారు, మరి యింకొకరు, అంతా నల్గురో ఐదుగురో, కలిసి వచ్చారు. ఆ రోజులలో ఇటువంటి మిత్రులతో సాయంకాలమునందు గోదావరిఒడ్డున కలసి కూర్చుని సాహిత్యగోష్ఠి చేస్తూఉండడం నాకు సరదాగా ఉండేది. ఆ వచ్చిన మిత్రబృందంలో నాకు అపరిచితుడైన వ్యక్తి ఒకడు కనిపించాడు. దీక్షితులు అన్నగారు నన్ను చూడడంతోనే, "మీకు వీరిని వేదుల సత్యనారాయణశాస్త్రిగారిని పరిచయం చేస్తున్నాను. బాగా కవిత్వం చెబుతారు. శతావధానం చేయగలరు. అయితే యిప్పుడు అవధానాలు చేయడం చాలించుకున్నారు"—అని స్వాభావికమైన మందహాసం చేశారు. సత్యనారాయణశాస్త్రిగారు మందహాసంతో నావైపు కనులెత్తి చూచారు—"వీరిని మేము కవిగారంటాము—" అని దీక్షితులన్నగారు మళ్లీ చెప్పారు— "మిమ్మల్ని, ఆరోజున కృష్ణమూర్తిశాస్త్రిగారింట్లో చూచినట్లు....—గాదండీ" అని కవిగారిని పలకరించినాను. "అవునండీ!" అని కవిగారు ముక్తసరిగా ప్రత్యుత్తర మిచ్చారు.

అది మొదలుగా 'కవి' గారితో పరిచయం స్నేహంగా పరిణమించింది. వారి నివాసము మా యింటికి చాలా సమీపం కావటంచేత వారు మా యింటికి రావడం, నేను వారి వసతికి వెళ్లుతూ ఉండడం నిత్యం సాగుతూ వుండేది. ఆ రోజులలోనే తమ్ముడు కృష్ణశాస్త్రితో పరిచయం, స్నేహం కూడా ఏర్పడవి. గోదావరిగట్టున కూర్చుండినపుడు కృష్ణశాస్త్రి కాశీఖండంలో పద్యాలు, భీమఖండంలో పద్యాలు చక్కని వయ్యారమయిన నడకతో చదివి అలాంటి మధురమైన కవిత్వము చెప్పాలని ఉత్సుకమయినట్లు మెరసే కండ్లతో చూస్తూ ఉండేవాడు.

కవిగారికీ నాకూ స్నేహం వృద్ధి అయినకొద్దీ ఆయన కష్టసుఖాలు నాతో చెప్పుకుంటూ ఉండేవాడు. తండ్రి, సోదరులు, అక్కచెల్లెండ్రు, ఎవరో కొందరు బంధువులున్నా, ఆప్తులయినవాళ్ళు, కడుపులో పెట్టుకొని ఆదరించేవాళ్ళు ఎవరూ లేనట్లు ఆయన ఒకవిధమైన దైన్యము, విచారము, ప్రకటిస్తూ

ఉండేవాడు—అప్పుడప్పుడు, ఏదో విచారం కలిగి కండ్లు వాచిపోయేటట్లు అశ్రుధార కట్టేటట్లు ఒంటరిగా దుఃఖిస్తూ ఉండడం నాకు తెలుసును. అనేక పర్యాయములు ఆయన దుఃఖకారణం తెలుసుకోవలెనని నేను ప్రయత్నం చేసినాను. కాని ఆయన హృదయకవాటం నాకు తెరవలేదో, తెరచినప్పటికీ అందులోకి నేను ప్రవేశించలేకపోయినానో చెప్పలేను. నాకు ఒక్క విషయంలో మాత్రం వారితో ఐక్యభావం కుదురలేదు—జీవితం ఎడారికాదు. జీవితం దుఃఖమయం చేసుకున్నా, ఆనందంతో నింపుకున్నా మన మనసే కారణం. జీవితక్షేత్రంలో పరిమళించే మంచి పూవులు పూయించి, కాయలు కాయించి, పండ్లు పండించే కర్షకునివలె నరుడు ప్రయత్నం చేయాలి. జీవితం అమృతమయం చేయాలి—అన్న సంకల్పం, ఆశయం నాది మొదటినుంచీ. జీవితమును మన సుదృష్టితో చూచి, యాత్ర సాగిస్తే, ఆరీతిగా అది పరిణామం పొందుతుంది అన్న అభిప్రాయం నాది. కవిగారిది ఇందుకు వ్యతిరేకమయిన భావము. మా యిద్దరి నడుమా యింత అగాధమైన భేదభావములున్నా, స్నేహమాత్రము అభివృద్ధి పొందుతూ వుండేది. శుభాకాంక్షతో వెలుగొందే నా ఆశయములను కవిగారున్నూ, నిస్పృహతో, నిర్వేదంతో, నిరాశలతో చిమ్మచీకట్లు కమ్మి అతని ఆశయములతో నేనున్నూ సామరస్యం కలిగించుకొనలేకపోయినాము. అందువలన ఆయనకు మొదట నాయందు హత్తుకొనిన గాఢస్నేహభావము కాలం జరుగుతూ ఉన్నకొలది సడలి, ఎండలో మంచువలె కరిగిపోవడం ప్రారంభించింది. ఆ రోజులలో వ్రాసిన పద్య మొకటి

"మ్రుక్కిన కొలంది, గాలితో ద్రొక్కివేయు
నీ కతనలోక మెల్ల బహిష్కృతమ్ము
రండు..........................
నావలెనె పాడుకొను మీరె నాకు సఖులు"

నాకు మాటిమాటికి జ్ఞప్తికి వస్తూఉంటుంది. ఆయన నన్ను సరిగా అర్థము చేసుకొనలేక పోతూఉన్నాడని మాత్రం గ్రహించగలిగాను.

"కాంక్ష", "ఒక క్షణము", "ప్రేమ", "ప్రతీకారము", "ఉత్కంఠ", "అతృప్తి" "అశాంతి" "ఏమగునో", "దీపావళినాడు", "శరదుత్సవము", "రాధ", "ఆకాగానము", "పేద బ్రతుకు" "పూవు" మొదలయిన పద్యకదంబములను కవిగారు నేను గాఢంగా మైత్రి నెఱపుకొన్న రోజులలో రచించినవే—వారు పద్యములు కూర్చిన తరువాత నేను కనబడిన తక్షణం వాటిని నాకు ఒకటి రెండు సార్లు చదివి వినిపిస్తూ ఉండేవారు. ఆ రోజుల్లో ఆయన రచించిన ప్రతి పద్యమూ నాకు చదివి వినిపించకుండా, ఇంకెవరికి వినిపించిఉండలేదని నేను గర్వోక్తిగా చెప్పగలను.

సత్యనారాయణశాస్త్రిగారికి, భాయిసాహెబ్ శివశంకరశాస్త్రిగారియందు విశేషం భక్తి, ప్రేమ గౌరవం కలవు. నిజంగా ప్రాత పంథాలోనుంచి చక్కని రాచబాటలోనికి, శాస్త్రిగారి కవిత్వరథాన్ని

మరలింపజేసి ప్రోత్సహించింది శ్రీ శివశంకరశాస్త్రిగారి సహృదయత్వము, వాత్సల్యము, ప్రేరేపణ అని నాకు తెలుసును. శివశంకరశాస్త్రి అన్నగారిలో ఒక విశేష ప్రజ్ఞ ఉన్నది. అది ఇతరులలో నేను చూడలేదు. వారిలో ఈర్ష్య లేదు. మిత్రునియందు గుణసంపద ఏమయినా ఉంటే రాళ్ళగుట్టలోనుంచి రత్నము ఏరితీసి సానబట్టి ప్రకాశవంతముగ చేయగల ప్రతిభ ఆయనకు ఒక్కడికే ఉన్నది. సాహితీ సమితిలో ఉన్న రత్నాల నన్నింటినీ ఆయన అలాగున శోధించి వెలికి తీసి, కాంతివంతములు చేయడానికి కారణము ఆయన మహానుభావత్వము. ఒకప్పుడు శివశంకరశాస్త్రిగారు తమ్ముడు వేదులని చూడడానికి వచ్చారు. ఆయన వస్తారని కవిగారు నాకు ముందుగా ఎంతో నమ్రతతో, నాకుకూడా ఆయనతో పాటు వినయభక్తి సంభ్రమములు కలిగేటట్లు చెప్పారు. శివశంకరశాస్త్రిగారు ఎటువంటివాడో తెలుసుకోవలెనని నేను చాలా కౌతుకంతో ఉన్నాను. కాని నా కౌతుకాన్ని కవిగారికి వెల్లడించలేదు. 'భాయిసాహేబ్' వచ్చారు. ఆయనగారిని చూడడానికి నేను మధ్యాహ్నం రెండు మూడు గంటలవేళ గాబోలు—వెళ్ళాను. కవిగారు గది యివతల నిశ్శబ్దంగా కూర్చున్నారు. నేను రావడం చూచి "ష్—నిద్రపోతున్నారు—చప్పుడు చేయకండి." అని నాకు హెచ్చరిక చేశారు. ఆ వ్యక్తిని చూడాలని కౌతుకం హెచ్చయిపోతూ ఉండడంచేత కవిగారు లేచి, లోపలికి, యివతలకు వస్తూ పోతూ ఉన్నప్పుడు, కవిగారి ఆజ్ఞ ఉల్లంఘించి, ఓరవాకిలిగా ఉన్న తలుపు సందులోనుంచి శివశంకరశాస్త్రిగారిని చూచాను. ఆయన ఒక మూల నిమీలితనేత్రాలతో, ఏదో ఆలోచనలో నిమగ్నులై ఉన్నట్లు కుర్చీమీద కూర్చొని ఉన్నారు. కవిగారు సాహసించి నన్నాయనకు పరిచయం చేయించలేకపోయినారు. ఆయనచిత్తం ఇపుడు వికాసవంతంగాలేదు. ఏదో మూడ్ (mood) లో ఉన్నారు. ఈ మూడ్‌లో వున్నప్పుడు ఆయనతో మాట్లాడడం నాకు భయం అన్నారు.—నేను సాహసించి గదిలోనికిపోయి చాపమీద కూర్చున్నాను. శివశంకరశాస్త్రిగారు నావంక చూడలేదు. నేను వచ్చినట్లయినా గమనించినట్లు ఖాతరుచేయలేదు. నాకు శివశంకరశాస్త్రిగారికి నిజానికి పరిచయం కలిగించింది నా ప్రియమిత్రుడు మొక్కపాటి నరసింహశాస్త్రి—ఏ సుముహూర్తాన్ని మా యిద్దరికీ పరిచయం కలిగిందోగాని, శివశంకరశాస్త్రిగారికీ నాకూ గాఢమైన మైత్రి ఏర్పడింది. పరిచయం కలిగించిన మొక్కపాటి కొంచెం దూరంగా ఉంటున్నాడు.

శివశంకరశాస్త్రిగారితో మైత్రి దినదినాభివృద్ధి నొందినకొలదీ మా యిద్దర నడుమా ఎన్నో సామాన్య విషయములు కనిపించినవి. అదిమొదలు కవిగారు కూడా కొంచెం దూరంగా ఉండిపోవడం ప్రారంభించారు. అయిన నేనుమాత్రం కవిగారిని సరిగా గ్రాహ్యం చేసుకోలేదేమో అని చాలా ప్రయత్నం చేశాను. ఆయన నిస్పృహ, నిర్వేదం ప్రకటించి దైన్యంలోపడి కొట్టుకొనిపోతూ ఉంటే ప్రతిరోజూ ఆయనను కలుసుకొని, ఆ అధైర్యము, ఆ విషాదము, ఆ దుర్బలత్వం ఆయన్ని వశపరచుకోకుండా చేయుటకు ఎన్నోప్రయత్నములు చేసినాను. అయితే నేను చేసిన ప్రయత్నాలు ఫలసిద్ధిని మాత్రం పొందలేదు. కాని నా వాక్యాలు మాత్రము దైవజ్ఞుని మాటలవలె యదార్థము లయిపోయినవి. "కవి

గారూ—ఎల్లకాలమూ ఒక్కరీతిగా ఉండదండి. ఎప్పుడూ చీకటిరాత్రులే ఉండవండి. దీపావళినాడు కూడా నక్షత్రములు వెలుగుతూ ఉంటవి. నక్షత్రములతోపాటు మనుష్యులు వెలిగించిన దీపాలు కూడా ఆశాకిరణాలు సాగిస్తూ ఉంటవండి" అంటూ ఏమేమో చెప్పేవాడిని. మీకు వివాహం అవుతుంది. సంసారం ఏర్పడుతుంది. కమనీయమైన మూర్తులు అవతరించి మీ యిల్లు సుఖానందదాయకం చేస్తారు. అని హెచ్చరిక కలిగేటట్లు భవిష్యత్తును గురించి చెప్పుతూ ఉండేవాడిని.

కవిగారికి నే నేవిధంగానూ ఉపకారిని కాలేకపోయినాను. ఒకప్పుడు ఆయన నాగురించి ఓ మాట అన్నారు—"మీరు ఓసారి అందలం ఎక్కుస్తారు— ఓ క్షణంలో నహుషుణ్ణి క్రిందకు త్రోసినట్లు ఆ వాసమునుండి పాతాళంలోనికి పడద్రోస్తారు." అని నన్ను ఎసిరకొట్టినారు. ఆ మాటలను నేను చాలాసేపు వితర్కించుకొన్నాను. కవిగారు నన్ను సరిగా అర్థంచేసుకోలేదు. "పోనీండి యేమిచేయగలను?" అని ఊరకున్నాను.

కవిగారికీ నాకు నడుమ చివరకు నిలచిపోయింది పరిచయమే. స్నేహం యింకిపోయింది, కాని నాకు మాత్రం కవిగారంటే నాడుండే తీరని అభిమానం ఒకటి గాఢంగానే నిలచిపోయింది. ఆ రోజులలో కవిగారితో స్నేహం చేయడం 'న్యూనత' అని ఎందరో భావించి నన్ను ఎగతాళిచేసినా, నాకుమాత్రం కవిగారంటే గౌరవమూ, ప్రేమ, అనుకంప ఎప్పుడూ—అప్పటికీ యిప్పటికీ కూడా ఒక్కలాగే నిలచిపోయినవి.

నేను మా వేదుల గురించి వాడు పలికిన వాక్యాలు యదార్థములయినందుకు నాకు పట్టరాని ఆనందం కలుగుతున్నది. ఆ ఆనందమే నన్నిచ్చటికి యీ వైభవం చూడడానికి రప్పించింది; ఇపుడు పూర్వపు గాథలు కొన్ని తడివించడానికి కారణమైనది. కవికి నేను వాగ్దానంచేసిన వైభవము యీ నాటికి మిత్రుల ప్రేమవల్ల లభించింది. ఈలాగున కవికి అభిషేకం జరుగుతుందని నాకు మొదటినుంచీ విశ్వాసమున్నది. ఈతని కవిత్వము విని, ఆనందించిన ఆ తొలిదినమందే ఈ దృశ్యం కండ్లకు గోచరించింది. వేదులకవి సహృదయుడు. నవనీతమువంటివాడు. వసంతశోభ కలిగిన తియ్యని కవిత్వ సంపదతో వెలుగొందు అందమైనవాడు. ఇతడుచిరకాలము ఇతోధికశోభతో వర్ధిల్లుగాక !

కళాప్రపూర్ణ టి. రాఘవాచార్యులు

ఒక కవిని సన్మానించడము చాలా గొప్ప విషయము. కవులూ, పండితులూ చాలామంది ఈ సభలో ఉన్నారు. నేను కవిని కాను. కవితారసము గానరసము వంటిది. పాడే నేర్పు లేకున్నా సంగీతాన్ని విని ఆనందించవచ్చు. "శిశుర్వేత్తి పశుర్వేత్తి" అని లోకములో ఉన్నమాట అందరూ ఎరిగిందే. గానరిసాన్ని అనుభవించినట్లే కవితారసాన్నికూడా నేను అనుభవిస్తాను. నేను పండిత పుత్రుణ్ణే. కాని తీయని కవిత్వాన్ని అనుభవించడానికి పండితుడే కానక్కరలేదు. మా పూర్వులు గొప్ప పండితులు. ఆ వంశములో పుట్టడమువల్ల రసాస్వాదనశక్తి నాకు ఉన్నది. నామాట మోటుగా ఉంటుంది. మాటలు ఎల్లా ఉన్నా నా భావాన్నే పరిగణించండి.

ఏజాతికైనా స్వాతంత్ర్యము ఉన్నపుడే కళలన్నీ వృద్ధిపొందుతవి. బానిసజాతికి కళాదృష్టికూడా తక్కువగానే ఉంటుంది. జాతికి నూతనజీవితమూ, నూతనాదర్శాలూ ఉత్తేజనమూ కలిగించేదే కవిత్వము. జాతికీ, దేశానికీ, ఉన్నతి కలిగించే బాధ్యత కవులది. కళలను గౌరవించి పోషించే బాధ్యత ప్రజలది. అధికారాన్ని ఐశ్వర్యాన్ని కాదు గౌరవించవలసింది. జాతికి శాశ్వతమైన ఔన్నత్యాన్ని చేకూర్చే శిల్పాన్ని ఆరాధించడము అలవఱచుకోవాలి.

అట్టి సత్కారము ఏలూరిలో జరుగుతున్నందుకు చాలా సంతోషము. ఈ సమయములో మహాకవిని ఆశీర్వదించవలసిందని మీరందరూ చెప్పుతున్నారు. దానికి నేను అర్హుణ్ణికాను. దేవుడొక్కడే ఆశీర్వదించడానికి శక్తుడు. అయినా కలానికి తోడుగా మనము ఈ కవికి ఖడ్గమిచ్చి గౌరవించాలి. అప్పుడీయన ఖడ్గముతో దాస్యబంధాలను ఛేదించి కలముతో మనకు నూతన జీవితము సమకూరుస్తాడు. కవులు ఖడ్గధారులైతేనే కాని స్వరాజ్యము రాదు. దానికోసమే మనమూ మనకున్న శక్తులను అన్నిటినీ వినియోగించాలి. కవులైనా, గాయకులైనా, నటులైనా ఎవరైనాసరే బానిసలు కాగూడదు. జాతీయతను బానిసగా చేయగూడదు. అందుకే మనము ఈ కవిని సన్మానిస్తున్నాము. ఈ సంతోష సమయములో నేను "అయ్యా! జాతినిముందుకు నడిపించండి. ఇదుగో ఖడ్గము: శాసించండి. స్వాతంత్ర్యము సంపాదించండి" అని కోరుతూ ఉన్నాను. భగవంతుడు ఈ కవీశ్వరునికి శక్తి సామర్థ్యమూ ప్రసాదించుగాక!

కాటూరి వెంకటేశ్వరరావు

నవ్యసాహిత్యానికి రాయప్రోలు సుబ్బారావుగారు మొదట దారితీశారు. పిమ్మట దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు తామింకో దారి త్రొక్కారు. వీరిరువురికంటే, మరెవరికంటే కూడా భిన్నమైన మరో మార్గమనుసరించారు విశ్వనాథ సత్యనారాయణగారు. ఈ ముగ్గురికంటే అతి నవీనమైనది శ్రీరంగం శ్రీనివాసరావు గారిది.

వీరందరూ సంస్కృతాంధ్రకవుల సంప్రదాయములను చక్కగా గుర్తించినవారే. అయినా ఆంగ్ల సారస్వత వాసనలచే కలిగిన వ్యుత్పత్తితో తమతమ ప్రతిభా వ్యుత్పత్తులకు తగిన బాటలలో నడిచారు.

వీరిలో చివరివారిద్దరి మార్గాలూ మనకు ప్రస్తుతంకాదు. మొదటివారిద్దరి మార్గాలను అవగతం చేసికొని, ఆ వ్యుత్పత్తిచే నవ్యసాహిత్యాన్ని అలంకరించారు వేదుల సత్యనారాయణశాస్త్రిగారు.

రాయప్రోలువారు, దేవులపల్లివారూ మహాకవులైనా, వారి కవిత్వం చదివేటప్పుడు ఏదో క్రొత్తలోకంలో సంచరిస్తున్నట్లుంటుంది. మరీ దేవులపల్లివారి కావ్యములలోని సొగసులు, భావములలో మజా గ్రహించి అనుభవించాలంటే కేవల సంస్కృతాంధ్ర పండితులకు సాధ్యంగాదు. ఆంగ్ల సారస్వతంలో వుండే అందచందాలూ, పలుకుబళ్ళూ, సంప్రదాయాలూ ఎరుగనివారు కృష్ణశాస్త్రిగారి కవిత్వానికి భావకవిత్వమంటూ పేరుపెట్టుతారు. రవీంద్రకవిచంద్రుని గ్రంథాలు మనం ఇంగ్లీషులో చదువుతున్నాము గనుక సరిపోయింది గాని, ఆయన తెలుగుభాషనే ఆశ్రయించివుంటే ఆ కవిత్వానికి గూడా భావకవిత్వమనే పేరే వచ్చేది.

వేదులవారు సంస్కృతాంధ్రములయందు మంచి పండితులు. పూర్వసంప్రదాయముల నెరిగినవారైనాను. కృష్ణశాస్త్రి ప్రభృతుల సాహచర్యమూ, వారి కావ్యములతో పరిచయమూ కలుగకపోతేనూ, కలిగినప్పటికి చక్కని భావుకత్వము కొరవడితేనూ వేదులవారికి నవ్యసాహిత్యంలో ప్రవేశము లేకపోయేది.

సత్యనారాయణశాస్త్రిగారికి ఇంగ్లీషురాదు. రవీంద్రుని కావ్యములు చదువుకోతగిన బంగాలీ ప్రవేశం కూడా వారికి లేదనుకుంటాను. అయినా రాయప్రోలువారి కావ్యములూ, దేవులపల్లివారి కావ్యములూ చదివి నవ్యసాహిత్యపు టాయువుపట్టులు పట్టుకొన్నారు. దాని మర్మములను జీర్ణంచేసికొని, ఆవ్యుత్పత్తితో సంప్రదాయసిద్ధమైన మార్గంలో కవిత్వరచన మారంభించారు. అందువల్ల వారి కవిత్వానికి భావకవిత్వమనే నిందరాలేదు. ఈ విధంగా చూస్తే శాస్త్రిగారికి ఇంగ్లీషు రాకపోవడం మంచిదే అయిందేమో. కాబట్టే వారి కవిత రాయప్రోలు, దేవులపల్లి వారల కవితకంటె అందరికీ ఎక్కువ హృదయంగమంగా

3 పే

వుంటుందనుకుంటాను. ఎంతో సహృదయత్వముంటే తప్ప దేవులపల్లివారి కావ్యముల ఔన్నత్యం బోధపడదు. వేదులవారికి ఆచిక్కులేదు. నవ్యసాహిత్యానికి సౌలభ్యమూ, సారళ్యమూ సమకూర్చి వేదులవారు గౌతమీకోకిలమని పేరుపొందారు.

వేదులవారు పద్యరచనలో సిద్ధహస్తులు. కమ్మెచ్చున తీసినట్లుగా వుంట వాపద్యాలు. చక్కగా తీర్చిదిద్దినట్లుంటుంది వారి పోహళింపు. ఆసాపు సంతనలూ, పనితనమూ తక్కినవారి కవిత్వాలలో కనిపించవు. వారి కవితారీతి అప్రతిమానము.

నేటి కవులందరూ స్త్రీని భోగ్యపదార్థంగా కాక ఆరాధ్యదేవతగా, మాతృమూర్తిగా దర్శించారంటారు. కనుకనే నేటి కావ్యములలో మొదటింకపు శృంగారమున్నదంటారు. ఇదియే ఉత్తమశృంగారమైతే నాయని సుబ్బారావుకు వేదులవారికీ ఈ విషయంలో అగ్రతాంబూలమివ్వవలసి వుంటుంది. భవభూతి "ఇయంగేహే లక్ష్మీరియ మమృతవర్తి ర్నయనయోః" అంటూ స్త్రీమూర్తిని చాలా ఉదాత్తంగా చిత్రించాడు. అంతకంటెకూడా ఉదాత్తంగా వేదులవారు చెప్పారనిపిస్తుంది.

ఆమె నవనీత హృదయ, నాయంతరంగ
శాంతిదేవత, ఆశాపథాంతరాళ
పారిజాతమ్ము, ప్రేమజీవన విభాత
కైశికీగీతి, నాతపః కల్పవల్లి,
ఆమె జగదీశ మకుటాగ్రసీమనుండి
యుర్విపై జారిన సుధామయూఖరేఖ

అన్న పద్యం చూడండి.

శ్రీ శాస్త్రిగారికి సాటికవులందరూ పరివేష్టించియున్న యీ కొలువులో, వారి ఆమోదంతో జరిగే యీ సత్కారం నవ్యసాహిత్యపరిషత్తుకు ఎంతో గౌరవం సమకూరుస్తున్నది.

శాస్త్రిగారింకా రసవద్గ్రంథములను వ్రాసి ఆంధ్రశారదను అలంకరింపగలరని ఆశిస్తున్నాను.

శ్రీపాద గోపాలకృష్ణమూర్తి

ఆంధ్రోద్యమంతో తలెత్తి, జాతీయోద్యమంతో మొగ్గతొడిగిన అభినవాంధ్ర కవితోద్యానవనంలో సత్యనారాయణశాస్త్రి "గౌతమీకోకిల". ఈయన కవిత్వంలో కోయిలకూతలోని హాయి వుంది. ఈయన రచనలు నూటికి తొంభయిపాళ్లు గౌతమీతీరంలో రచించినవి. అందుచేత ఈయనకి "గౌతమీ కోకిల" అని చెలిమిపేరుపెట్టిన రామకోటయ్యాచారిగారు మేటిశిల్పనంటాను. సత్యనారాయణశాస్త్రి గారు ఇంగ్లీషురానివారు. ప్రాచీన సంప్రదాయానుసారంగా గురుశుశ్రూషచేసి సంపాదించిన పాండితీ పటిమగలవారు. శతావధానికూడాను. పూర్వకవుల రచనలకు పునాదిప్రాయమైన పాండితీ ప్రతిభలు ఆధునికుల రచనల కాధారమైన అనుభూతికి తోడై, ఈయన "కవితావనినిత్యనమ్మున కామనిపంట" అయినవి. మా రామభద్రరావుగారు "మనవి" చేసినట్లు "ఈయన కవిసముచ్చయములను విడువలేదు."* అట్లని సంస్కృతి కావ్యశకలములతో తమ కావ్యాన్ని నిర్మించుకోనూలేదు. ఈయన కవిత్వము ప్రాచీన ఆధునిక కవితా స్రవంతులు చేరిన పూర్ణసరస్వతి. కవి రచించిన వస్తువు ఇంద్రియగోచరం కావాలి. సామాన్యుల ఇంద్రియాలకంటె కవి ఇంద్రియాలు చాలా సున్నితంగా ఉంటాయి. లలిత లవంగలతా పరిశీలన మలయసమీరం కోమలత్వాన్నీ, దారంట గడ్డినిగుచ్చుకుని చూసే గడ్డిపువ్వు చూపుల్నీ, కను చూపు దాటనీయని చాయా కోయిల గొంతులో చిక్కు వసంతగీతినీ సామాన్యుల ఇంద్రియాలు పట్టి అనుభవించలేవు. కవి ఇంద్రియాలు చక్కగా నిండుగా అనుభవించగలవు ఇందువల్ల తాను పొందిన ఆనందాన్ని మనకికూడా కలిగించే సదుద్దేశంతో కవి ఇంద్రియగోచరం అయేటట్లు కావ్యరచన చేస్తాడు. ఈ రచన పరికించినప్పుడు చదువరుల మనస్సుల్లో, కవికి కలిగిన ఆనందము కలుగుతుంది. కాబట్టి కావ్యం మన మనుభవించడానికీ, కవితో సహానుభూతి పొందడానికీ ముఖ్యంగా వీలిచ్చేది కావ్య వస్తువు ఇంద్రియ గోచరత్వము. సత్యనారాయణశాస్త్రిగారి వర్ణనలు కళ్లకి కట్టినట్టుంటాయి. ఉన్న దున్నట్లు వర్ణించి, స్వభావోక్తివల్ల సాధిస్తారు చాలామంది ఈ "కనుకట్టు" గుణాన్ని. ఈయన వర్ణ చలనమువల్ల సాధిస్తారు. ఈయన గురించి వర్ణించినంతగా వర్ణచలనాన్ని మరొక కవి గురించి వర్ణించ లేదేమో అనిపిస్తుంది నా దృష్టికి. జాషువా కవి

> "　　రెడ్డిరాణి మై
> బూసిన కుంకుమంపు పసపుంబిసలంటిన కన్నెతొండ నే
> డూసరవెల్లియై నవయుచున్నది పండువెదుళ్ళ సందునన్."

అన్నప్పుడూ, సహదేవ సూర్యప్రకాశరావు

> "నిర్మలంబైన గౌతమీ నీరమంచు

---

* నావలె కుక్కజీవనమునకు దురపిల్లడు ఈ గోదావరి. అనీ "ఓ నిరాశాపథైక పురాణపాంథ" అనీ లలితంగా శ్లేషించారు కూడాను.

తన సొగసు వెన్నెలను చూచుకొనుచు సంజె
చెరగులను సర్దుకొను నభశ్రీలతాంగి."

నగనీ సౌందర్యము గుర్తైనప్పుడూ కొంత వర్ణఖేలనము కనబడుతుంది. కాని ఈయన వర్ణనలలో వర్ణచలనము ముద్దగట్టుతుంది. "కావిముసుగల్లాడె వేకువకాంత దివసాంగణము చేరిందట. రేయివిప్పిన నీలి రంగుచీర అవనీ నభోంతరం బారగ్రమ్మినదట. పండివ్రాలిన వరిపైరుపైని ప్రాకి వస్తున్నాయట చిరుగాలి అలల వరుసలు." "పశ్చిమాకాశ నికష సువర్ణరేఖ లొకటొకటి చెరపుచు" పోతోందిట పొద్దు. తొలకరి సారెపెట్టునా ఆర్ద్రపురుగుపూవుల శాద్వలాంబరం ధరించిందట ధారుణి. ఎఱ్ఱజీరల వాల్గనులెత్తి నవ్వింపదట మంగళదేవత. తూర్పువాకిటి గూట తొలిదివ్వె వెలిగించి తొగరుపాపట సంజ తొలగిపోయిందట. కాటుకలేని సోగ తెలికన్నుల ముత్తెములట్లు జారుతున్నాయిట కన్నీటికణాలు. తెలుగు కవిత్వంలో వర్ణనలు నూటికి తొంభైతొమ్మిది పొటోగ్రాపులే అయితే రంగు సామాన్యంగా కనబడనప్పుడు వీరికది విశేషగుణమే అనాలి మరి.

కంటికి మాత్ర మేకాక ఇతరేంద్రియాలకు కూడా తృప్తి రచన చాలా ఉంది వీరి కవిత్వంలో. కడిమిపూల నెత్తావుల కసటువార, వర్షమ్ముందటి తడిగాలి విసరసాగె నన్నప్పుడు కందువా కప్పుకోడానికి మన చేతులు కదుల్తాయి. ద్విజసంతాన గళకాహళులు, వాత్సకధేను కాస్యోత్స్య సస్మిత నాహ్వాన సంభ్రమాలు, శ్రావణమాస నభోవిపంచికలు, ఝంఝూనిల విఘూర్ణిత నీలవారాంబునిధి తరంగాలు, సాట్టహాస కోలాహలాల్ని వినిపిస్తే ప్రభాతగంభీ సుగంధ శీతల సమీరాలూ, ఉషశ్రీపవమ్ము లెక్కి విహరించే పూవుల తావులూ, అగరుధూప సుగంధిలమైన కేశపాశాలూ, జగదధీశ్వరుని శిఖావతంస కుసుమవాసనలు గుప్పుతాయి. ఈరీతిగా ఉదాహరణాల్ని వాటి సందర్భంనించి తప్పించి చూపించడం, పువ్వునీ పరిమళాన్నీ వేరేవేరే చూపించడంవంటిదే కాని తప్పనిసరి. సత్యనారాయణశాస్త్రిగారి రచనలనిండా వ్యాపించి ఉంది ఈ రకం సౌందర్యం. తరుచు రెండు మూడు ఇంద్రియాల అనుభవాలు జడపాయల్లాగ అల్లుకుపోతాయి వీరి రచనల్లో. అవి చదివినప్పుడు చదువరి ఇంద్రియాలన్నీ మేలుకుంటాయి. పండువెన్నెలలు మోహినీ సాట్టహాస కోలాహలాలట. పూవు తేనె తావుల బరువోపలేదట. దివ్య తేజస్వి నెదురుచూచే 'ఉత్కంఠ' లో

'వలపు లొలికెడు పూవులు వాడిపోయె
కనకపీఠిక హారతి కునుకుచుండె' నట.

పూలవలపుల్ని ముక్కులందుకుంటే, ఆరిపోయే హారతికాంతుల్ని కళ్ళందుకుంటాయి. పాలిపోయిన కపోలాలపై వ్రాలి నీలాలకలు రహస్యాలు ఊదుతున్నాయట. తూరుపు పైడిమోసాల మ్రోల సప్తాశ్వ ప్రయాణ హేషారవము సాగిందట. ఇన్ని ఉదాహరణ లెందుకు, "శరదుత్సవము" చూడండి. సుమ

మృదుల స్పర్శ, శారదానిలపరిమళము, విజయశంఖముల శ్రవణోత్సవము, నిశారాజ్ఞి వెల్లగొడుగు కలిసి అమృతకాంతి నిస్తాయి కావ్యకన్యాకటాక్షభిక్షుకులకు.

కవిత్వం ఇంద్రియగోచరం కావాలంటే కావ్యవస్తువు పార్థివమే కావాలి. సత్యనారాయణశాస్త్రిగారి కవిత్వం వసంతంలాగ పృథ్వినే ఆశ్రయిస్తుంది. పోలికలు, అలంకారాలు, సామగ్రి, అన్నీ మన అనుభవంలోనివే. అందువల్ల వీరి కావ్యాలనుభవించడానికి కొంచెమైనా శ్రమపడనక్కర లేదు. వీరి కవితాకన్య మన మున్నచోటికేవచ్చి, మన చేయిపట్టి, తమ్మిపుప్పొళ్ళదాగుళ్ళ, కారుమబ్బుల చిమ్మచీకటుల త్రోవలలో, జగదధీశ్వరు శిఖావతంస కుసుమగంధవాహ తెంగిగాలి లఘువుగా, గగనదుర్గపు తూర్పు బంగారు తలుపులు తెరచి, ఆ మృదుచంద్రికా యవనికావృత నీలనభో నిశాంతశోభామనుసీమలలోకి, అమృతవాటులలోకి, స్వప్నపథాలలోకి తీసుకువెళ్ళుతుంది. ఈ యువకు ప్రపంచమంతా ఒక ఉత్సవమందిరం, కావిముసుగల్లాడే వేకువకాంతి ఆ మందిరాంగణము చేరుతుంది. ఈ సౌధపు దక్షిణద్వారము తెరచుకొని మృదుల పవమాన పరిమళోర్మికలు విసురుతాయి. తూర్పు వేదిమోసాల ప్రాంగణ సప్తాశ్వ ప్రయాణ హేషారవం సాగుతుంది. అంతలో మార్గశిరాంబరా మరీచ్యావళులు కమ్ముకొంటాయి. దినమంతటా ఈ మొయిలు నీడల చీకట్లే. ఎట్టకేలకు తూర్పున కటిక గూఢతమిస్ర లేదన్నా వెలిగించి తొలగదు పావడ సంజ తొలగిపోతుంది. ఆ యుదయాద్రినుండి యామినీకాంతుడు మూర్ఛిల్లిన మెత్తని గాఢలజ్జావనతయై నవోఢవలె సందడిచేయక పూర్ణిమ తొంగి చూస్తుంది. మోహినీనాట్యహేల కోలాహలాలు—పండు వెన్నెలలు—బ్రహ్మాండమంతా అల్లుకుంటాయి.

శాస్త్రిగారి పోలికలు, వర్ణనలు మన అనుభవంలోనివే నన్నాను. ఆయన ఊహలు భావాలుమట్టుకుకావు. భావనాబలంవల్ల వారు గుర్తించిన విషయాలు చాలా విలక్షణంగా ఉంటాయి; ఉండాలికూడాను. మన మెరిగిన ప్రపంచంలోని దృశ్యాలే కవి భావనవల్ల తళుక్కుమని మెరిస్తే లందం. అవి మన మెరగుండడంవల్ల నచ్చుతాయి. కవిభావన రంగుపూయడంవల్ల అద్భుతమౌతాయి. వ్యక్తియొక్క భావనా, సార్వజనీనతా, కలిసిన భావాలు నచ్చకపోవడం అన్నది ఉండదు. చూడండి అధిరాజద్రుపుల కష్టమత్తులకు భోగదాసిగనున్నదట భూదేవి. నీల్గము వంగిందట నింగి నెలతి. శ్రావణలక్ష్మి వెలుగునీడ మధ్య నిలవలేకపోతుందిట. పెంపుడు నెమలి ప్రకృతి కోడత్రాచుల నెరిగించుకొన గలిగిన ప్రకృతట. అలరునను జన్మనున కొక్కటే వికాసమట. విరిగి పమయూటే ఘనాఘని యోగికూడ దుర్నయ బాధుచును కొవుచున్నదట కరటము. దూరమామునుండి తోయధి పిలుపు చెవిసోకి పరుగెత్తుతుందట సెలయేఱు. శాస్త్రిగారి రచనలలో వ్యక్తిగుణమూ సర్వజనీనతా రెండూ మెరిపెట్టుకుంటాయి అన్నాను. ఈ విశేషము వారి ఖండకావ్యాలు పరిశీలిస్తే తెలుస్తుంది. చూడండి.

మేదుర వినీలమేఘాల మేలిముసుగు
తేసికొని వచ్చె శ్రావణమాసలక్ష్మి

ధారుణి ధరించె దొలకరి సారెయిడిన
యార్ద్రిపురుగు పూవుల శాద్వలాంబరమ్ము.
కడిమిపూల నెత్తావుల కసటువార
వృష్టిముందటి తడిగాలి వీవసాగె
ఏల యింతటి చక్కదనాలవేళ
నెగురులాడ రెక్కలు రావు హృదయమునకు.

చివరి రెండుపాదాలతో కవివ్యక్తి గోచరిస్తుంది మనకి. అంతవరకూ శ్రావణమాసలక్ష్మీ వర్ణనే. చివరికి వచ్చేసరికి రెక్కలు రాని హృదయంతో కవి బాధ రూపొందుతుంది. ఇట్లే "పూర్ణిమ" లోని కుటీరపథము, విముక్తగవాక్షము, తృణకీర్ణశయ్య, పేదరికము నుపన్యసించి బాధానిశితమైన కవి పువుటెదను చూపిస్తాయి. సత్యనారాయణశాస్త్రిగారి జీవితము కంటకమార్గాలలో నడిచింది. ఆయన హృదయానికి కూడా ముళ్ళు లోతుగా గుచ్చుకున్నాయి. ఈయన జీవితం సుఖస్వప్నదరిద్రం. నరక లోకపు చీకటి తెరలవంటి నిశలు, పరస్పర ప్రతిద్వంద్వులైన దినాలూ ఈయనమీదనుంచి ఇనుపపాదా లతో నడిచిపోయాయి. కడుపుగాల్చెడు మండుటాకటను రేగి కోర్కెలొండొంటిని గ్రసించు కున్నాయి. దారుణపు జీవితపు టెడారిలోన తీరని పిపాసనే దారి తెన్నూలేక ఏ విసుగువేసటలులేక తన దుఃఖ బాష్పశోణితపు ఝురులను త్రావినాడీయన. శైశవమ్మాది ప్రేమ శ్మశానమైన జీవితములో రహో దుఃఖవీధులందు సఖుల యడుగులజాడలుకూడ యెరుగడీయన.

లోకలోకాల శాంతి పెల్లువలువాను
వెల్లజీరల వాల్గనుఁదెత్తి నవ్వి
చారు హేమంత సంధ్యాతుషారసార
శీతల కృపామృతాసారసేచనములు
దీప్తహృదయమ్మునకు జల్లదనమొసంగ

దయచేయుమని మరణదేవత నాహ్వానం చేస్తాడీయన ఒకొక్కప్పుడు. కాని, గొంతువిప్పక లోలోన గుమిలి కుమిలి, యెంత యేడ్చిన బిగిలిపోదు ఎడంద. ఆకొనిన యాశ లెప్పటికప్పుడెవిరియు స్వప్న సాగర తటాల కలియతిప్పుతాయి. ఈ విషయము గుర్తించి 'దీపావళి' పరికిస్తే, తొలిమబ్బునీడలు, శైలహృదయాంతరాళ నిర్ఝరాలు, మరణవాద్యమ్ములిట్లు కొట్టుకునే గుండెచప్పుళ్ళూ, చిరవిరహావాస నలు, పరస్పరాహారములౌ కోర్కెలు ఒకమారు, రెండుమార్లు, ముమ్మారు గోచరించడానికి కారణం బోధ పడుతుంది.

శాస్త్రిగారి కవనంలో కేవలం నిరాశమట్టుకు కనబడదు. జీవి కెంత నిరాశలోనైనా ఆశ స్ఫురిస్తుంది. లేకుంటే ఆజీవి బ్రతుకు సరి. నిరాశమాత్రమే చిత్రించి ఊరుకుంటే, కవి అలవర్చుకున్న సమాధి

పూర్తిగా కావ్యంలో ప్రవేశించలేదన్నమాటే. నిరాశ వెనకనే ఉన్న ఆశకూడా కనబడితేనే ఖండ కావ్యం పూర్తిఅవుతుంది. లేకపోయిన రచన కావ్యఖండమే. సత్యనారాయణశాస్త్రిగారి ఖండ కావ్యాలన్నీ ఈవిషయంలో సంపూర్ణాలు.

వలపుతీపి యెరుంగని వట్టిరాతి
గుండె లోకము నిప్పులు కురుస్తున్నా

హృదయమున్నంతవరకు, ప్రేమకాంక్ష బ్రతికియున్నంతవరకు ఏ వెలుగు దారిచూపునో అనే ఆశతో ఏడ్చి బ్రతకమంటా రాయన. రాగమధురమ్ముగ వీణ నందింపజాల నంటూనే, "ఏవిధినైన బాధుమనియే వచి యింతువరేని, నా విశుష్కితగళమ్మును మధురింపుము నే శ్రుతికల్పి పాడెదక" అంటారు. శాస్త్రి గారి ఖండకావ్యాలకు మొదలు, మధ్యము, తుది ఉన్నాయి. ఒక్క పద్యమే ఖండకావ్యంగా ప్రచు రించినా దానికీ సంపూర్ణత్వమేగాని ఖండదోష ముండదు చూడండి.

"నవ్వుచును పొంగిపోవుచు నాట్యమాడు
తరగలను వెల్గు చుక్కల తళ్కు గాని
అబ్ధి గర్భోజ్జ్వలద్బడబాగ్నిశిఖల
హృదయమున దూరి ఎవరు చూచెదరు సఖుడ".

ఈ సంపూర్ణత్వ మీయన రచనలకొక విశిష్టగుణము. ఏ భావోద్వేగాన్నిగాని తునకలుగానూ రేకు రేకులుగానూ రచించి పారవేయక బొటనవ్రేలితో మలచి చక్కగా నిర్మించి పూర్తిచేస్తారీయన. వెన్నె లను శాస్త్రిగారు అనుభవించి వర్ణించినంత మరొక ఆధునిక కవి—పూర్వకవైనాను—వర్ణించలేడేమో నంటాను. నండూరివారి రవల వెలుగులగంగ, ఎలుతుగంతా సుపి నెమరువేసే యేరు, (విరహిణి) యెంకి కులికిపాటు తెప్పించే సల్లన్ని యెన్నెలా. విప్రలంభ సంభోగ శృంగారాలలో ప్రవేశించి నిష్క్ర మించే దృశ్యాలు. ప్రధానత విప్రలంభానిదే కాని వెన్నెలదికాదు. యెంకి జ్యోత్స్నానుభవానికి కావ్యత్వసిద్ధి కాలేదు. విరహానికే అయినది. సత్యనారాయణశాస్త్రి శరదుత్సవానికి, పూర్ణిమకి, సుధా కరునికి కావ్యత్వసిద్ధి కలదు. అందుకనే అన్నాను వెన్నెలను ఈయన వర్ణించిన ట్లింకొకరు వర్ణించ లేదని.

మబ్బునీడలు ఈయనకి చాలా యిష్టం. దీపావళిలో "మావితోపులపై దొలిమబ్బునీడలు," శ్రావణ మాసలక్ష్మి వేసికొను మేదురవినీల మేఘాల మేలిముసుగులు, మొయిలునీడల చీకట్లు, ముసరి మూగిన కారుమొయిలుకోనలు, రేమొయిలు గుంపులు, త్రోపుడులాడు కార్మొయిలుదొంతరలు, నీలిమొయిళ్ల నీడలు, మార్గశిరాంబ రాంబుదచ్ఛాయలు, ప్రావృడంబర శ్రీ చికురాయమాణ జలభృత్పటలి, కారు మబ్బుల చిమ్మచీకటులు, కిక్కిరిసి ఉన్నవి. ఆంధ్రకవులు కనిపెట్టిన సౌందర్యసామగ్రి కీయన చేర్చిన క్రొత్తవస్తువు మొయిలు నీడలు. నే నెరిగినంతవరకు మరొకరు మొయిలు నీడలను కాన్పించలేదు.

నన్నయగారి ప్రార్థనలలాగా, పెద్దనగారి "వికచాంబకాల్లాగా" ఈయన సంబోధనలు చాలా అందంగా ఉంటాయి. ఎక్కడలేని పదాలూ గుమిగూడి వాటి పరిమళాన్ని అందిస్తాయి నీరి సంబోధనలకి. "అస్తగిరి వాసినీ, జీవితావసాన శైశిరతమోభిసారికా" అంటారు మరణదేవతని. ఆవిడ "ధిక్కృతి ప్రేమ చరమాతిథియట! మహాబ్ధిపార దూరప్రవాసినీ యట. ప్రాణశాంతిగాయిని యట! సూర్యుడికి చూడండి "ఓ విషాదప్రపంచ యాత్రావిరాగి! ఓ నిరాశాపథైక పురాణపాంథ! ఓ ప్రవాస దుఃఖాశ్రుపరోదమూర్తి!" అని విచిత్ర సంబోధనలు! వీటిలో కూడా ఈయన దుఃఖపుంగసటు కనిపిస్తున్నది. వెన్నెలకి చూడండి సంబోధనలు "ఓ సఖీ! ఓ సుహాసినీ! ఓ శరద్విభావరీ నర్తకీ! కవిభావగాన విలాసినీ! నిత్య సైరంధ్రీ! ఓ సమస్తలోకమోహిని! ఓస్వప్నలోకరాజ్ఞీ!" సైరంధ్రి దేహసౌందర్యము కీచకుడు కనిపెట్టితే సైరంధ్రీ రచనాసౌందర్యం శాస్త్రిగారు మెచ్చుకుంటున్నారు.

పదాలను ఏరడంలో శాస్త్రిగారి జాగ్రత్త ఈ సంభోధనలలోనేకాక ఆయన వృత్త నిర్మాణాన్నిబట్టి కూడా తెలుస్తుంది కాంత్య అనే ఖండకావ్యం చూడండి. దీనికి హిందీ మూలమున్నది. అయినా ఇది భాషాంతరీకరణమన్నమాట తెలియదు. మచ్చుకి ఒక పద్యం :

నాకు దలంపులేదు లలనాజనతా కబరీభరైక భూ
షా కలనన్, సతీమృదు భుజాంతర తల్పకుచోపగూహబి
బ్బోకమునన్, వధూసిత కపోల గళచ్ఛ్రవణావతంస హే
వాకమునన్, విలాసినుల పాపు చెంగ కావిపూతలన్."

ఆహ్వానం చూడండి. అంతా ఉన్నికే. జ్ఞాపకం తెచ్చుకున్న భావావేశాన్ని శక్తిమంతమైన పదాలతో దండగుచ్చినట్లు పోగాళిస్తారు. ఈయన కవిత్వంలో రచనాభాగం సమృద్ధిగా ఉంటుంది. ఉబికిన భావాన్ని అలాగే "నా కుగాదులు లేవు నా కుషస్సులు లేవు" అని ఇచ్చేయరు. "దినములు పరస్పర ప్రతిధ్వనులుగాగ నిరువదైదేండ్ల నా బ్రదుకెట్టు గడిచె" నంటారు. ఈ పాదాలు చూడండి.

"వైసవిరేల వేణువన వీథులయందల సంప్రచారముల్
చేసిన కమ్మతెమ్మెరల చిందులలో స్ఫురియించు గానవి
న్యాసము వోలె." అని చదివినప్పుడు,

"హిమవదుపాంతంపుటా పాడుపుటేళ్ళ సితాంబువులన్ గదలుచు హంసముల" అన్న అబ్బూరివారి రచనాధోరణి, తోపుడులాడు కాగ్మోయిలు దొంతరగ్రమ్మి తమాలపాదప వ్యాపితమైన గోకుల వనాంతర మంతయు శ్యామికాంజన స్థాపితమయ్యె." అని చదివినప్పుడు

"చదలు పయోదనాళికల శ్యామలమయ్యె తమాలపంక్తులన్
కౌదమ వనమ్ము చీకటులకున్ నెలవయ్యె"

అన్న రాయప్రోలువారి రచనాధోరణీ,

"ఆ యుదయాద్రి నుండి యరుణారుణమౌ మొగమెత్తి గాఢలజ్జాయుతయౌ నవోఢవలె సందడిసేయక తొంగితొంగి, లోలాయతదృక్కులన్ దశదిగంతరముల్ పరికించి" అని చదవగానే "ఈ యెలమావి నీవ వసియింపక వేసవి మండుటెండకున్ చేయొక టడ్డుచేసికొని, చెమ్మట లోడగ ముండ్లబాటలన్ బోయెడు బాటసారి" ననుసరించిన కాటూరివారి ధోరణీ, జ్ఞాపకము వస్తాయి. వృత్తాన్ని నడిపించడములో సిద్ధహస్తుడీయన. పదాలకూర్పులోని వైలక్షణ్యత భావానికికూడా లోతు నలవరించి, కవిత్వానికి గంభీరత ప్రసాదిస్తోంది. పద్యాలు చదువుతూన్నంతసేపూ రసికుల హృదయానుభవం, వృత్తంతోపాటు దౌహృదిలాగ నడుస్తుంది. భావగుంఫనం ఒకటి ఈయన కవిత్వానికి ముఖ్యలక్షణం. పద్యాలు నాలుగు పాదాలతోటీ గజగమనం చేస్తాయి మన హృదయాలమీద. పద్యాల అడుగుజాడలు నిలుస్తాయి హృదయాలమీద. చూడండి!

పేదల రక్తమాంసముల పెంపువహించి, దయాసుధారసా
స్వాదదరిద్రులైన ధనవంతుల పెద్దరికమ్ముకై మతో
న్మాదము పెంచు దేవునికి మారుగ నిల్చిన రాతిబొమ్మలం
దూదరపోవు పాడు బ్రతుకు."

అని చదువుతూంటే పేదల రక్తమాంసాలవల్ల పెంపువహిస్తారా ధనవంతులు? దేవుడు మతోన్మాదం పెంచుతాడా? విగ్రహం దేవుడికిమారుగా నిల్చిన రాతిబొమ్మమాత్రమేనా? అనే ప్రశ్నలు పుటతాయి. ఒక్కొక్కప్పుడు [illegible]వంతంగా ఉన్న భావాలు చూచి, "అవును" అని ఆ అలాగా అని స్మృతి నారంభిస్తాం. ఒప్పుకుంటాం. లేదా "అధికారదృప్తుల కర్థమత్తులకు, భోగదాసిగనున్న భూదేవి" మరణదేవత "అమృతశాంతి! జీవితావసాన శైశిరతమోభిసారిక! సుధామధుర విధుర జీవశాంతి! యిహదుఃఖతిమిరనియతి!" అవును కాదామరి? ఈ పృథివి "మానవుల యాశలతో విధికిన్ నిరంతరానీకము సాగు కటికినేల."

శాస్త్రిగారి కవనము చూస్తూంటే ఇతర కవుల రచనలు జ్ఞప్తికి వస్తాయి అన్నాను. నిజమే. కన్నీటిపాటలు చూస్తే "ఏకాంతసేవ"; "కాగడా" చూస్తే బాపిరాజు బ్యాలలో ప్రచురించిన "కాగడా"; సంధ్యాన్వేషణము చూస్తే రాయప్రోలువారి "రాధపిలుపు" ఇంకాఇంకా రాగూరు, హిందీకవులు జ్ఞాపకానికి వస్తారు. కాని భావాలుమట్టుకు శాస్త్రిగారివి వేరు. స్వాతిచినుకులకు ముత్యపుచిప్పవలె ఏవో ఒకటి రెండు భావాలను హృదయగుప్తం చేసుకుని వాటిని ముత్యాలుగా తయారుచేయడము కూడదనను నేను. కవిరచన లన్నీ తన యనుభవములోనివే కావాలి అనే జాతివాణ్ణికాను నేను. అనుభూతి కేవలం స్వానుభవమే కానక్కరలేదు. తోటి కవి యనుభూతిని అతని కవనము పఠించి తన అనుభవా

నికి తెచ్చుకోడం కూడా అనుభూతే అంటాను. అందువల్ల బయల్దేరిన రచనలో ఈ కవిహృదయమూ, వ్యక్తి దీపిస్తే ఆ రచన ఉత్తమమైనదే అంటాను. హుమాయూన్ గోరీని సౌందర్యం మించి తాజమహాల్ అయినది. తాజమహలు చూచినవారు హుమయూన్ గోరీని తిరిగి చూడరు. సత్యనారాయణ శాస్త్రి గారికి మెయిలునీడలు చాల ప్రీతి అన్నాను. మరికొన్ని ఇవిగో. ఇవి ఏ రచనలోనైనా సహజంగా ఇమిడిపోతే, ఆ రచన ఆయన హృదయసౌందర్యమే. "పులుగుగొంతుక", "తొడిమవీడిన పూవు", "శైల హృదయములోని నిర్ఝరము", "యెదచలించిన మోళిలు", "జ[illegible]జన్మాల (క[illegible]లు)", "చిరవిరహం (గానలు)" "పరిస్వరాహారములో శోరికలు" "రెక్కలురాని (ఆశలు)"

ఇక శాస్త్రిగారి అనుభూతికి, కవి హృదయానికీ ప్రబలసాక్షులు చూడండి "ప్రణయమూర్తి", "యాత్ర", "ఆవృత్తి", "అశాంతి", "దీపావళి", "ఆహ్వానము", "పూర్ణిమ", "ఆషాఢమేఘము". "శరదుత్సవము", "సుధాకరా", "సంధ్యాన్వేషణము", "ఆకాశగానము", "ప్రభూ", "పూవు", "ముక్తావళి", "పూజాప్రసూనములు" కావ్యకుసుమావళి సేకరించే వారికి మరో కవిని ఇన్ని ఖండకావ్యాలు జాబితాలోనికి రావేమో ?

శివ శంకర శాస్త్రి

౧

[illegible] ప్రాయులైన [illegible] శాస్త్రిగారు ఈనాడు పరిషత్సమావేశంలో [illegible] సన్మానము [illegible] ఒకపర్యాయము (శ్రీ) [illegible] తెలికచర్ల వేంకట[illegible] "[illegible]" [illegible] చారు. నేటిసన్మాను[illegible] మహా[illegible]యు.

[illegible] శాస్త్రిగారి [illegible] చారు. నేను [illegible] ముగించి, [illegible], [illegible] యుగా సూచిస్తాను.

[illegible] (శ్రీ) [illegible] శాస్త్రిగారివల్ల [illegible] డిలో [illegible] తర్వాత [illegible] గాఢమైత్రిగా పరిణమించింది. ఆరోజుల్లో గోదావరి [illegible] ఆయనను 'కవిగారు' అనేవారు. కవిగారు నాకు ఏవో చాటువులు స్వప్రబంధ భాగములూ వినిపించినట్లు జ్ఞాపకము. అప్పటికి ఈయన ఆశుకవిత్వ శతావధానాలలో ఆరితేరినారు. అవధాన - ఆశువు లంటే నాకు ప్రసన్నత లేదు. అవి [illegible]కానికి మాత్రము సరిపోతవనీ,

తాటాకుమంటవలె తాత్కాలికదీప్తికల వని, ఉత్తమకావ్యరచనవు అత్తగారివంటి వని, మా పూర్వులమతము. అని మానుకోవడము మంచిదని చెప్పినాను. సంసార సందర్భాలు మా వాదముచేతనో, మావంటివాళ్ల మాటల వల్లనో కవిగారు ఆవిధానము విడిచిపెట్టినారు.

తర్వాత కొన్నాళ్లకు శాస్త్రిగారు రాజమహేంద్రవరనివాసము ప్రారంభించారు. కవిగారిని సాహితీ సమితిలో చేర్చుకొన్నాము. నేను గుంటూరునుంచి తరచుగా గోదావరీతీరానికి వెళుతూ ఉండేవాణ్ణి. శ్రీ చింతా దీక్షితులు గారూ, శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారూ మాకు ప్రాణమిత్రులు. మేమంతా [illegible] గోదావరిఒడ్డున గాని, కవిగారిగదిలో గాని సాహిత్యగోష్ఠి చేస్తూ ఉండేవాళ్ళము. కవిగారిగది సాహిత్యక్షేత్రము. ఆరోజుల్లో శ్రీ [illegible] కామేశ్వర రావు గారు, [illegible] గారు, [illegible] వంటి కామేశ్వర రావు గారు, భండారు కృష్ణా రావు గారు మొదలయిన [illegible], యువకులూ అక్కడికి వస్తూ ఉండేవారు. మిత్రులు శ్రీ [illegible] గారు [illegible] “[illegible] కోకిల” అనేవారు. హాస్యప్రియులు అయిన మిత్రులు “[illegible]” అని [illegible]. ఈ గోదావరీ కోకిల, దేవులపల్లి కృష్ణశాస్త్రి గారూ [illegible]. [illegible] తమాషాలు చేసే జట్టీలు [illegible]. [illegible] వైచిత్ర్యముచేత [illegible] — శాస్త్రిగారి “[illegible]” అని అడిగితే “శ్రీ [illegible]” [illegible] ! [illegible] ఈ [illegible] పట్టుకొని [illegible], [illegible]. [illegible] నుంచి ఎడ్లో [illegible] ఈయన [illegible] మేము [illegible] మాచాము — అక్కడే గోదావరి [illegible] ఉన్నది!

ఆరోజుల్లో [illegible] శాస్త్రి గారు గుంటూరులో ఉన్నారు. [illegible] సభలకు [illegible], [illegible] వెళ్ళేవాళ్ళము. [illegible] శాస్త్రి, [illegible], [illegible] రావు, మునిమాణిక్యం నరసింహా రావు, [illegible], [illegible] నారాయణ [illegible], [illegible] పతి రావు, [illegible] మొదలయిన మిత్రబృందముతో శాస్త్రిగారు విశేషకాలక్షేపము చేసేవారు. [illegible] ఈయన ప్రేమపాత్రము అయినారు.

శాస్త్రిగారిది [illegible]. మైత్రి [illegible]ముగా ఎంచుతారు ఈయన. [illegible] సంవత్సరాలు కలిసిఉన్నాము: ఈయనకు కోపము రాగా నేను ఎన్నడూ చూడలేదు! లవలేశ సుఖము లేనప్పుడుకూడా చిరునవ్వుతో [illegible], చమత్కారంగా మాటలాడడమూ, ఎవరినైనా ఎంతో సన్మానించి [illegible] పెట్టడమూ ఈయనకు సహజము. చాటుకారుడయిన ఈయనవాక్యాలు వింటే ఎంత ప్రభువయినా సరే, తన ఆస్థానములో సుస్థిరముగా నిలుపుకొంటాడు ఈ కోకిలను.

శాస్త్రిగారు బహిరంగసభలలో ఉపన్యసిస్తూ ఉంటే చాలా హృదయంగమముగా ఉంటుంది. పొడి మాటలతో కాక, చక్కని శయ్యలో ప్రసంగము చేస్తూ ఉంటే శ్రోతల హృదయాలు ద్రవీభూత మవు తవి. [illegible] కలగి [illegible] ఈయన [illegible] చక్కిలిగింతలు పెట్టుతాడు—ప్రియభాషణములతో. సంగీతము [illegible] కొంచెమైనప్పటికీ ఎటువంటి పద్య మయినా ఈయననోట వింటే అరటిపండు ఒలిచి నోటిలో పెట్టినట్లు ఉంటుంది. [illegible] ఈయనవలె [illegible] కవులు అరుదు.

ఈయన స్వాతంత్ర్యప్రియుడూ, [illegible] కలవాడూ, [illegible]. [illegible]తో తృప్తిపడక, తన [illegible] అనుక్షణమూ [illegible] మార్చిన ధైర్యశాలుడు. అన్నిటికన్న ఆనంద కర మైనవి: అనేకమంది కవులవలె ఈయన అహంకారి కాడు! పెద్దలయెడ గౌరవమూ, ఉన్నత విషయములయెడల మన్నన, కలిగిన వినయశీలి.

౨

సత్యనారాయణ శాస్త్రిగారిపూర్వులు [illegible] సంవత్సరాలు పైగా [illegible]ద్రాచలప్రాంతాన నివాసులు. [illegible] వారిలో ఒకరు నెత్తిమీద [illegible] పెట్టుకొని, దానికి [illegible] కత్తి చెక్కి, [illegible] కొన్ని వేదపనసలు చెప్పినారట! శాస్త్రిగారితాత సుబ్బయ్యగారు చండశాసనులు. కత్తి, [illegible] పట్టి, [illegible] సన్నులు పట్టుపల [illegible]. ఈయనకు శ్రీ కృష్ణయ్యగారు [illegible]త్రముగా [illegible] వివా హము చేసుకొన్నారు. ఈమెకు నలుగురు ఆడపిల్లలు, ముగ్గురు మగపిల్లలూ కలిగినారు. అయిదవ సంతాన [illegible] సత్యనారాయణ శాస్త్రిగారు [illegible] ఫాల్గున బహుళ [illegible] (——3—1900) తల్లి ఈయన [illegible].

శాస్త్రిగారు [illegible] పిడిచిపెట్టినారు. గొప్ప [illegible] బ్రహ్మశ్రీ [illegible] శాస్త్రిగారి[illegible] శ్రీమాన్ [illegible] శ్రీ [illegible] సాహిత్యవిశారదులు; [illegible] వేదులనాటు [illegible]. శాస్త్రిగారు ఆవాసన [illegible] బ్రహ్మశ్రీ [illegible] గారిని [illegible] చెప్పుకొన్నారు.

ఈయన [illegible], [illegible], [illegible] [illegible] ఉండి, [illegible] అటూ ఇటూ తిరిగినారు.

ఆరోజుల్లో, అంటే పధ్నాలుగోయేట, ఒకనాడు అప్రయత్నముగా ఆటవెలది పద్యము నోట వెలు వడ్డది. [illegible] తెలియకపోయినా కావ్యాలలో పద్యాలు బాగా వలగడముచేత ఈయన

సహజకవి అయినాడు. ఆ సన్యాసము విడిచి బంధువులూ మిత్రులూ ఎవరూ లేని ప్రదేశాలలో తిరిగినందు వల్ల నిర్వేదము కలిగి. ఆపద్యములలో కరుణ ప్రతీత మయింది.

పిమ్మట శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారి ప్రసిద్ధి విని, ఆకవి వారి శుశ్రూష చేయుటకై 1915లో రాజమహేంద్రవరము వెళ్ళినాడు. వారికి గల ఉద్యానవాలములలో ప్రతిదినము కొంతకాలము ఉంటూ, వారు తెలిగించి అచ్చువేయుచున్న మహాభారతము ప్రూఫులు చదువుతూ, ఆంధ్ర కవిత్వము గ్రంథములు గ్రహిస్తూ ఉండేవాడు. ఈయన వైదగ్ధ్యమునకు తెలిసి పదిమంది పొంగించి సభలలో సన్మానించేవారట. కృష్ణమూర్తి శాస్త్రిగారు దగ్గర్యాలకు వెళ్ళి ఉన్నప్పుడు ఈయనకూడా అనుసరించి, అక్కడ బ్రహ్మశ్రీ మృత్యుంజయ శాస్త్రులవారికడ అలంకార శాస్త్రము అభ్యసించినాడు.

1919లో తుని వెళ్ళి, రాజా వత్సవాయి వారి ఆదరము పొంది అక్కడ సంస్కృతపాఠశాలలో బ్రహ్మశ్రీ చిలుకూరి సోమనాథ శాస్త్రులవారికడ వ్యాకరణము చదివినాడు. ఈ సమయమందే ఆశుకవిత్వముచేత అనేకులను ఆనందపెట్టినాడు. సంవత్సరమున్నర అక్కడ ఉండి కాకినాడ చేరినాడు.

మక్లారన్ హైస్కూలులో ఆంధ్రోపాధ్యాయపదవి లభించినది. ఈయన విద్యార్థులకు ప్రియుడై, పట్టణములో పలువురను కవితాగోష్ఠితో ప్రమోదింప చేస్తూ 18 నెలలు అక్కడ ఉండి, 1922లో మళ్ళీ రాజమహేంద్రిలో నివాసము ప్రారంభించినాడు.

అనురాగములలోనూ, ఆర్థిక విషయములలోనూ ఏవో బాధలు కలిగడముచేత ఆప్పటి కావ్యములలో ఆవేదన కనిపిస్తుంది. సాహిత్య సమితిలో చేరిన తర్వాత ఈయన పేరు ఆంధ్రదేశమునిండా వ్యాపించింది. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారికి ఈయనయెడల వాత్సల్యము. వారు ఒకనాడు నాతో, "సత్యనారాయణ శాస్త్రి పూర్వమువలె వచ్చి నావద్ద ఉండకూడదా? అతని నేను మహాకవిని చేసేవాడిని. మునుపు మంచికవిత్వము చెప్పేవాడు, ఇప్పుడు పాడయిపోయినాడు! వచ్చి ఉండమని మీరైనా చెప్పండి" అన్నారు. "సరే, కాని ఆయన కవిత్వము ఇప్పుడు మంచిపాకాన పడ్డది" అని మందహాసముతో బదులు చెప్పినాను.

"గౌతమీకోకిల" 1924లో "రాణాప్రతాప" నాటకము వ్రాసి, సాహిత్యసమితికి అంకితము చేసినాడు. తెనాలికి చెందిన వేంకటరత్నంగారు 1926లో గుంటూరులో ఈ నాటక ప్రదర్శనము చేయించారు. రాజమహేంద్రిలో శాస్త్రిగారూ మొక్కపాటి నరసింహ శాస్త్రిగారూ కలిసి 1926లో సమితి ద్వితీయ సమావేశము వైభవముగా చేయించారు.

1927లో గుంటూరు క్రిస్టియను కళాశాలలో సత్యనారాయణ శాస్త్రిగారికి ఆంధ్రోపాధ్యాయపదవి లభించింది. "ఉభయభాషాప్రవీణ" పరీక్ష సాధించినారు. సంస్కృతభాష అభ్యసించి కొంతగా శ్రీ వీరాసు

స్వామిగారి తోడ్పాటుతో "ధర్మశాల", "అపరాధిని", "రంగమహల్" మొదలయినవి తెనిగించినారు. మొదటిరెండు నవలలు ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాలలో వచ్చినవి.

1928లో వీరికి వివాహమయింది. ప్రసిద్ధపండితులు, ధర్మవేత్తలు బ్రహ్మశ్రీ బంకుపల్లె మల్లయ్యశాస్త్రిగారు తమ వితంతు పుత్రికను ఈయనకిచ్చి సశాస్త్రీయముగా, న్యాయముగా వివాహము చేయించి మార్గదర్శకులయినారు! కవిజీవితము శాంతముగా సుఖముగా ప్రవహిస్తున్నది. ఇప్పుడీయనకు ఒక కుమారుడూ నలుగురు కుమార్తెలూ.

1929లో "ఆవేదన" అనే నా ఖండకావ్యసముచ్చయాన్ని ఈయనకు అంకితము చేశాను. శాస్త్రిగారు గుంటూరులో ఉన్నరోజులలో కథానికలు మొదలుపెట్టినారు. "హాస్యోదకము" "అనితమ్మ" "ఆర్తపియు" "మామాటలు" మొదలయినవి మనోహర కథానికలు. "హాస్యము" అనే వ్యాసము చాలా భావపూర్ణము.

1935లో శాస్త్రిగారు పెద్దాపురములో మిషన్ హైస్కూలులో ప్రధానాంధ్రోపాధ్యాయులుగా ప్రవేశించి స్వగృహనిర్మాణము చేయించి నేటికనీ అక్కడే పనిచేస్తున్నారు. ఎక్కడ ఉన్నా, ఈయనకు శిష్యవర్గము లావు. చాలామందిని కవితామార్గములో పెట్టుతూ ఉంటాడు.

"[illegible]" అనే సాంఘికకథనూ, 1937లో 'రాజరత్నము' అనే సాంఘికకథనూ శాస్త్రిగారు Talkiesకు వ్రాసినారు.

శ్రీ చింతా దీక్షితులు గారితోనూ, శ్రీ తెలికచెర్ల వెంకటరత్నం గారితోనూ కలిసి, విద్యార్థులకు ఉపకరించే "గీతామంజరి" వాచకాలూ, "నవ్యసాహిత్య" వాచకాలూ రచించారు.

ఈ కవి పద్యకృతులూ గద్యకృతులూ బహుపత్రికలలోనూ ప్రత్యేకసంచికలలోనూ ప్రకటితమయి ఆంధ్రదేశాన వ్యాప్తిలోకి వచ్చినవి.

1937లో శ్రీ రామభద్రరావు గారు శాస్త్రిగారి ఖండకావ్యములను "దీపావళి" అనే పేరుతో ప్రకటించారు. 1940లో నవ్య సాహిత్య పరిషత్తు "దీపావళి" ద్వితీయముద్రణము ప్రకటించింది. శాస్త్రిగారు పరిషత్తులో ప్రధానసభ్యులలో అన్యతములు. శ్రీ వెంకటరత్నంగారికి పూర్వము కొద్దికాలము కార్యదర్శిగా ఉండేవారు. వీరికి జమీందారీ సన్మానములు ఉన్నవి. అన్నవరపు సత్యనారాయణస్వామివారి కళ్యాణోత్సవ సమయములో ముగ్గురికి మాత్రము 116ల సత్కారము జరుగుతుంది: చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి గారికి, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి గారికి, వేదుల సత్యనారాయణశాస్త్రి గారికి.

3

ఈ కవిమార్గము రమణీయ మయినది. ఇందులో నిఘంటుశోధనము లైనపదాలు గాని, చాలామంది కవులలో ఉన్న అసాధారణ సమాసదోషాలు గాని, పునఃపునరుక్తిప్రయోగాలు గాని, ఆడంబరము గాని అవుపించవు. ఈయన శయ్య మెత్తనిది, పాకము మధురము, పరిణామము రసవంతము. శాస్త్రిగారు పద్యము చెప్పినా, పాట పలికినా, వచనము అన్నా ఆహ్లాదకరమే.

శ్రీ రాయప్రోలు సుబ్బారాయ కవీంద్రులు ఈ కవికృతి "ఆషాఢమేఘము" విని కాళిదాసకవితను జ్ఞప్తికి తెస్తున్న దన్నారు. వీరి "ఆరాధన" అనే అనురాగగీతాసముచ్చయము నేను సభలో చదువుతూ భావోద్రేకమువల్ల గాద్గద్యము కలిగి ఆపివేసినాను! డాక్టరు గోపాలకృష్ణమూర్తి గారు మొదలగు సహృదయుల తాత్పర్యము విదితమే.

ఇప్పటికి శాస్త్రిగారు "దీపావళి", "ఆరాధన", "ముక్తావళి" అనే కృతులు మాత్రము ముద్రించారు. "వేణుగానము" వ్రాయబోతున్నారు. ఈయన కన్యకలను గూర్చి కన్నారు. వ్రాతప్రతులు కలవు అచ్చే కాలేదు! చెప్పినకృతులు చదువగా చెన్నుగా, వారి అన్నగారులు తృప్తి చెందరు. వీరు వ్రాయాలని సంకల్పించుకొన్న నవలలు బ్రహ్మచారి, పల్లెటూరు.

ఒక పత్రిక నెలకొల్పుదా మనుకొన్నారు. అది "ధర్మయాత్ర" — యువకుల కెందరు అలంకరించవలసిన వారి మిత్రోత్సాహముగా ఉండేది. అందులో విశేషాలన్ని రచించారు! అది సాగకపోవడం మన అదృష్టం!!

మహాకవి కాళిదాసుని వ్యక్తి విశేషానుభూతితో సంబంధము చేయండి. ఆంధ్రసాహిత్యరాత్రక్రమే వచ్చే వస్తువు కలదై సమగ్రములూ నాట్యము గల సుదీర్ఘ కావ్యము ఈయన రచించవలెనని నాకోరిక. ఈయన కట్టి అటువంటి కావ్యము చేయగలశక్తిసామర్థ్యాలు ఉన్న వని నావిశ్వాసము. శారదాగ్రహము వల్ల శీఘ్ర కాలములో కావ్యప్రారంభము కావాలి!

నాకు ఆన్నదమ్ములు లేరు. ఆలోపము తీర్చి ఆప్యాయముగా "అన్నగారూ" అని అనురాగముతో పిలిచే ఈ సోదరునికి "శుభం భూయాత్!" అని నా ఆశీర్వచనము.

ఇతి శివమ్!

దేవులపల్లి కృష్ణశాస్త్రి

౧౯౧౭లో వేదులతో నాకు ప్రేమానుబంధము కలిగింది. వేదనాబాధం మా యిద్దరికీ సమానము. నేను కవి వంటుంబములో వాణ్ణి కావడంవల్ల వేదులను అభిమానించాను. కవిత్వం ఎక్కడ ఉన్నా కవి ఎక్కడ ఉన్నా నా హృదయం అక్కడికి అప్రయత్నంగా వాలుతుంది. వేదుల నావాడు. మేమిద్దరం కవలవలె ఉండే వాళ్లము, కొన్ని సంవత్సరాలు ఒకరినొకరు అంటిపెట్టుకొని.

మా కంఠరికీ ఆంగ్ల పరిచయం కొద్దో గొప్పో ఉంది. వేదుల కదిలేదు. అది లేకపోవడమే వేదులవున్న సుగుణము.

కవి పరమశివుడు. కాలకూటంలోపల దాచిపెట్టుకొని వెన్నెల ప్రసాదిస్తాడు శివుడు. కవి దుఃఖాన్ని హృదయములో దాచుకొని ఆనందం పంచిపెట్టుతాడు. వేదుల కవిత్వములో వేదనతోపాటు తీయదనం ఉన్నది. ఈ తీయని వేదనే మన్ని ఆకర్షిస్తుంది.

వేదులఇంట మొదట దీపములేదు. ఇప్పుడింగులో చంద్రబింబము ఉన్నది. ఆరు చిన్నచిన్న దీపాలు వెలుగుతున్నాయి. ఆయినను దీపావళి ఉంది.

మహాకవికి ఉండవలసిన లక్షణాలు వేదులలో ఉన్నాయి. ఈ ప్రతిభాశాలి ఒక మహాకావ్యం వ్రాయాలి.

[రచన ఒక విలేఖరిది.]

ప్రశంసావాక్యములు పలికి సన్మానము చేసిన కవి మిత్రులను ఒక్కొక్కరినే పుష్పమాలాలంకృతులను చేశారు కవిగారు. వెంకటరత్నంగారి మెడలో పూలమాలవేసి ప్రతివచనము చెప్పడానికి కవిగారు లేచేసరికి సభ్యులూ, వేదికమీద పరివేష్టించిఉన్న కవులూ, పండితులూ గౌరవాదర సూచకముగా కరతాళధ్వనులు చేశారు.

ప్ర తి వ చ న ము

వేదుల సత్యనారాయణశాస్త్రి

అధ్యక్షా! మహాజనులారా!

నా జీవితములో ఎన్నటికీ మరచిపోలేనిరోజు నేడు. ఈనాడు ఒక సుఖస్వప్నము సత్యముగా పరిణమించింది. ఆంధ్రదేశములో నలుమూలలా ఉన్న మహాకవులూ, పండితులూ, రసజ్ఞులూ సమావేశమై సన్మానము చేయడముకంటె మరొక కాంక్ష ఏకవికీ ఉంటుందని నేననుకోను. ఇంతటి గౌరవాన్ని నాకు కలిగిం

చిన ఏలూరిపౌర మహాశయులకూ, నవ్యసాహిత్య పరిషత్తువారికీ నా కృతజ్ఞతానందాలను వినయపూర్వకముగా విన్నవించుకొంటున్నాను.

నా జీవితానికి గాని, రచనలకు గాని హేలాపురితో ఎట్టి సంపర్కమూ లేదు. కవిమిత్రులు కొందరుండడమే ఈ పట్టణానికీ నాకూ ఉన్న సంబంధము. ఏ కారణమువల్ల నన్ను గౌరవించడమునకు ఇంతటి సమావేశము జరిగిందో నేను ఊహించలేకుండా ఉన్నాను. పత్రికలలో ప్రకటితమైన తరువాతనే ఈ వార్త నాకు తెలిసింది. అందుచేతనే అనుకోలేని మరపురాని విశేషము ఈ సన్మానములో ఉన్నదని నేను విశ్వసించాను. ఇంత సన్మానానికి నేను తగనని చెప్పడము రసజ్ఞులైన ఏలూరివాసుల ఔచిత్యతను శంకించినట్లవుతుంది. అయినా ఈ సన్మానానికి అర్హతకంటె ఆదరాభిమానాలు ఎక్కువ ఉన్నవని నేనెరుగుదును. అందుచేత కవిమిత్రుల శుభాశీః ప్రశంసలు నాయెడల నిరంతర ప్రోత్సాహానికే గాని గర్వానికి కారణాలు మాత్రము కావని మనవిచేస్తున్నాను.

స్వతంత్రులైన స్వదేశప్రభువులు పరిపాలిస్తున్నప్పుడు ఆ దేశములో కవులకు రాజపోషణమూ, రాజగౌరవమూ ఉండేది. ఆ స్వాతంత్ర్యముగాని, ఆ రాజులుగాని లేని ఈ కాలములో కవులనూ పండితులనూ పోషించడమూ గౌరవించడమూ ప్రజలకు కర్తవ్యములు అయినవి. ఏ మహారాజైనా ఒక కవికి కనకాభిషేకము చెయ్యవచ్చు. బిరుదు లియ్యవచ్చు. జాగీరో ఈనామో అగ్రహారమో ఇప్పించవచ్చు. కాని అంతకంటె ఈనాటి సన్మానములో గొప్పవిశేష మున్నది. అది ప్రజాసన్మానము. అభిమానించి కవి ఆశించదగ్గ గౌరవసత్కారములు మరి లేవని నా నమ్మకము. అందుచేతనే పరిషత్కార్యదర్శిగారు మొదట ఈ సన్మానానికి నా సమ్మతి కోరినప్పుడు భయపడ్డా, ఇప్పుడు మహానందము పొందుతున్నాను.

మిత్రులు నన్ను 'గౌతమీ కోకిల' అంటున్నారు. అది బిరుదు కాదు. నా మిత్రుడు నూతక్కి రామశేషయ్య అనురాగముతో నన్ను పిలిచే పేరు. మా మైత్రికి గుర్తుగా 'దీపావళి' అనే గ్రంథాన్ని ఆయనకు కృతి ఇస్తూ "ఈ గౌతమీ కోకిలపాట నీ యెడదనుం బులకింపుల కౌక్కు లీయదే" అని అన్నాను. అదిమొదలు అది నాకు పేరైపోయింది. గోదావరీజిల్లాలో కవిగా నేగాని మొదట నా పేరు చాలామందికి తెలియదు. మిత్రులు కొంతమంది ఇప్పటికీ నన్ను ఆ పేరుతోనే పిలుస్తుంటారు. సిగ్గుగానే ఉండేది కాని ఎవరిని వద్దనగలను? అయినా ఎన్నో కారణాలవల్ల 'గౌతమీ కోకిల' అనే పేరుమీదనే నాకు అభిమానము. నేను గౌతమీ తీరాన జన్మించాను. నాకూ ఆ నదికీ ఆబాల్యమైత్రి ఉన్నది. మైనాకుడు సాగరప్రవాసి. గంగాస్రవంతి సముద్రము చేరినప్పుడు జన్మభూమి పవిత్రస్మృతి కలిగి అతనికి ఆనందము కల్గదా మరి? అలాగే నా జన్మభూమిని ఒరసి ప్రవహిస్తూ వస్తున్న ఆ నది ఈ ప్రవాసికి ఊహాకందని ఆనందాన్ని కలిగిస్తుంది. అందుచేతనే నా రచనలకూ, నా జీవితానికీ ఏదో అంతః సంబంధము ఉన్న గౌతమిమీది అభిమానముచేత నేను 'గౌతమీ కోకిల' అనేవారిని కాదనలేకుండా ఉన్నాను. అది బిరుదుమాత్రము కాదనుకుంటే నాకు చాలు. గౌతమికి చెందిన ఒక కవిని,

గౌతమికి చెందిన ఏలూరు సన్మానించడము ఒకవిధముగా ఇంట గెలవడము వంటిదే. ఆంధ్రదేశము నలుమూలలనుంచి ఎందరో పెద్దలు ఈ సమావేశానికి రావడమువల్ల ఇది రచ్చకెక్కినట్లు కూడా అయినది. అందుచేతనే నేను ఈ సన్మానాన్ని సత్యముగా ఒడగట్టిన ఒక స్వప్నమనుకొన్నాను. "ప్రస్ఫుట గౌరవాయుతోదాత్త భాగ్యమయుదేవత సన్నిధసేత" అనే తిక్కన మాటలు నాకు జ్ఞప్తికి వస్తున్నవి ఈ మహోత్సవ సమయాన.

నలభై ఏళ్ళకు జీవితములో మార్పు వస్తుందని పెద్దలంటారు. నా మిత్రుడైన గొప్ప జ్యోతిష్కుడు ఒకాయన నా జాతకము చూసి నలభైయేళ్ళు గడిస్తేనేకాని నీకు యోగము ఏమీ ఉండదని చాలా కాలము క్రితము చెప్పాడు. నాకిప్పుడు నలభై సంవత్సరాలు గడిచిపోయినవి. కాని నాకు కవి జీవితములో గొప్పదైన ప్రథమ వసంతము ఈ ఏలూరులో ప్రారంభమయినది. దానికి ఈ సన్మానమే తార్కాణము. ఇక ఈ గౌతమీకోకిల గొంతువిప్పి తెలుగుతోట పులకించిపోయేటట్లు ఎలా పాడుతుందో వినాలని చూస్తాను. కవిసామ్రాట్టు శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారే నాకు కవితాగురువులు. ఆయన నన్ను శిష్యునిగానే కాకుండా పుత్రునిగ కూడా ఆదరించారు. ఈ సన్మానానికి నాకు వచ్చినప్పుడే ఈ శిష్యప్రమాణ వృష్టి కలిసిన గౌరవానికి ఎంతో ఆనందించి ఆశీర్వదించి ఉండేవారు. "ఆనాటికే తెలుగు గొప్ప మహాకవిగా నిలిచి యొక్కడే తిక్కన సమస్త భారత సమీకరణానికి చిట్టి శ్రీపాద కవీంద్రు శిష్యుడను" అని సభలలో గొప్పగా చెప్పుకొనేవాణ్ణి. వారి శుశ్రూషవల్లనే నాకు కవిగా సన్మానము లభించినది.

ఈ సన్మానము శ్రీకృష్ణశాస్త్రిగారి అధ్యక్షతతో జరగడము మరొకటిలో విశేషము చెప్పక తప్పదు. శ్రీశాస్త్రిగారూ నేనూ చిరకాలమిత్రులము. అవధానాలతో, ఆశుకవిత్వాలతో పైగులెత్తుతున్నప్పుడే నాకు వారితో స్నేహము లభించినది. మేము ఇద్దరమూ నీవు నీవు అనుకొనే మైత్రసన్నిహితులము. రాజమహేంద్రవరము వీధులలో మేమిద్దరమూ పోతూవుంటే "అదిగో కవులకవలలు" అని అందరూ మమ్మల్ని వేలెత్తి చూపించేవారు. సాహిత్యములో కూడా మేమిద్దరమూ 'ఏకాభిప్రాయ కవులము' అయినాము. పిట్టలలోను, దీపాలలోను, విమర్శకులూ మమ్మల్ని ఇద్దరినీ విడదీయ సాహసించలేదు. చాలా కాలము ఇద్దరమూ ఆకలిని, ఆనందాన్ని సమానముగా అనుభవించాము. శ్రీ శంకరగిరి శాస్త్రిగారు ఎప్పుడూ మా ఉభయులకూ అన్నగారే. తెలికిచెర్ల వెంకటరత్నముగారు బాబాయిగారే. నా ప్రక్కన కూర్చొని ఈనాటి సన్మానాన్ని వారూ అనుభవించి ఆనందించడముకన్నా మరొక భాగ్యమేమిటినాకు? సాంఘికజీవనములోగాని, సారస్వతమార్గములోగాని నాలో ఏదైనా విశిష్టత ఉన్నదంటే అందుకు వీరి సాంగత్యమే కారణమని నిజము చెప్తున్నాను. ఆ గురుతర ఈ సన్మానములో వారుకూడా భాగస్వాములే. నా జీవితము చాలా విచిత్రమయినది. నేను ఆబాల్యప్రవాసిని, ప్రేమపిపాసిని. చిన్ననాడే మాతృప్రేమను కోల్పోయిన గుండెబరువు తెలుసుకున్నాణ్ణి. గుజ్జనగూళ్ళను ఎక్కడ పెట్టేవాడను, కన్నీళ్ళను కూడా కలిపేస్తేనేగాని స్వేచ్ఛ నాకు సంతృప్తి కలిగేది కాదు. ఆ సమయాననే ప్రేమగీతాలు, స్నేహగీతాలు రచించాను, పాడాను.